గాయత్రీ మహావిజ్ఞానము

వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ఠ, నిష్కళంక ప్రజ్ఞావతార
పండిత శ్రీరామశర్మఆచార్య

వేదమాత గాయత్రీ ఉత్పత్తి

జ్ఞానమును వేదమని అందురు. జ్ఞానము నాలుగురకములు. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదము. కళ్యాణప్రదము, ప్రభుప్రాప్తి, ఈశ్వరదర్శనము, ఆత్మశక్తి, బ్రహ్మనిర్వాణము, ధర్మభావన, కర్తవ్యపాలన, ప్రేమ, తపస్సు, దయ, ఉపకారము, ఉదారత, సేవ మొదలైనవి ఋక్కులు. పరాక్రమము, పురుషార్థములు(ధర్మార్థకామమోక్షములు), సాహసము, వీరత్వము, రక్షణ, ఆక్రమణము, నేతృత్వము, యశస్సు, విజయము, పదవి, ప్రతిష్ఠ యజుర్వేదాంతర్గతములు. క్రీడలు, వినోదము, మనోరంజనము, సంగీతకళ, సాహిత్యము, స్పర్శేంద్రియపు స్థూలభోగములు, ఈ భోగములనుగూర్చిన చింతన, ప్రియమైన విషయాసక్తి, గతిశీలత, రుచి, తృప్తి మొదలైనవి సామవేదాంతర్గతములు. ధనము, వైభవము, వస్తుసంగ్రహణము, శాస్త్రము, ఓషధులు, అన్నము, వస్తువులు, ధాతువులు, గృహములు, వాహనములు మొదలైన సుఖసాధనములు, తత్సామగ్రి అథర్వణ వేదాంతర్గతములు.

జీవించివున్న యే ప్రాణిని పరిశీలించినప్పటికి ఆ ప్రాణి స్థూల, సూక్ష్మ, అంతర్గత, బహిర్గత కల్పనలను గంభీరభావములను వైజ్ఞానికశక్తిని విశ్లేషించిన యెడల, పైన వుదహరింపబడిన నాల్గుక్షేత్రములలో, ఆ ప్రాణి సమస్త చేతనత్వము పరిభ్రమిస్తువుంటుంది. 1) ఋక్ - కళ్యాణప్రదము, 2) యజు - పౌరుషము, 3) సామ - క్రీడ, 4) అథర్వ - అర్థము. ఈ నాలుగుమినహా ప్రాణుల జ్ఞానధార మరే దిశలోను ప్రవహించదు.

ఋక్ అనగా ధర్మమనియు; యజుర్ అనగా మోక్షమనియు; సామమునకు కామమనియు; అథర్వమును అర్థమని చెప్పుదురు. ఇవియే బ్రహ్మదేవుని చతుర్ముఖములు.

ఏకముఖంతో నాలుగువిధముల జ్ఞానధారలను ప్రకటించినందున బ్రహ్మదేవునకు చతుర్ముఖుడని పేరు వచ్చింది. 'వేదము' అను పదమునకు జ్ఞానము అని అర్థము. ఈవిధంగా బ్రహ్మతత్త్వము ఒక్కటైనప్పటికి ప్రాణుల అంతఃకరణములలో నాల్గువిధములుగా ద్యోతకమౌతుంది. అందువల్ల వేదము(జ్ఞానము)ను సులభంగా తెలిసికొనుటకు నాల్గుగా విభజింపబడినది. విష్ణుభగవానుని నాలుగు చేతులన్న యివియే. ఈ నాలుగు విభాగములకు ప్రత్యేక స్వేచ్ఛ కల్పించుటకై నాలుగు ఆశ్రమములు, నాలుగు వర్ణములు వ్యవస్థీకరింపబడినవి. బాల్యము - క్రీడావస్థలోను; తరుణవయస్సు - అర్థావస్థలోను; వానప్రస్థము - పౌరుషావస్థలోను; సన్యాసాశ్రమంలో - కళ్యాణావస్థ వుంటాయి. బ్రాహ్మణులు - ఋక్; క్షత్రియులు - యజుర్వేదము; వైశ్యులు - అథర్వణవేదము; శూద్రులు - సామవేదములకు ప్రతీకలు. ఈవిధంగా చతుర్విధ విభజన జరిగినది. సృష్ట్యారంభంలో బ్రహ్మదేవుడు స్ఫురణమాత్రంగా యే చైతన్యశక్తిని వుత్పన్నము చేశాడో అదియే జ్ఞానము. లేక వేదము. దీనిని శాస్త్రజ్ఞులు గాయత్రి అనే నామంతో వ్యవహరిస్తారు.

ఈవిధంగా నాలుగు వేదములకు మాత 'గాయత్రి'. అందువల్లనే గాయత్రిని వేదమాత అని వ్యవహరిస్తారు. మనము జలతత్త్వమును మంచు, వర్షము, మేఘము, ఆక్సిజన్ కదలికల ద్వారా కనుగొంటాము. ఆవిధంగా 'జ్ఞానగాయత్రి' నాలుగువేదములు నాలుగు రూపాలుగా దర్శనమొసగుతుంది. గాయత్రి మాత కాగా; నాలుగు వేదములు ఆమె నలుగురు పుత్రులు. ఇది సూక్ష్మగాయత్రి. సూక్ష్మవేదమాత స్వరూపము.

ఇప్పుడు గాయత్రి స్థూలస్వరూపమునుగూర్చి ఆలోచిద్దాము. బ్రహ్మ నాలుగు వేదములను రచించకముందు 24 అక్షరములతో కూడిన గాయత్రీ మంత్రమును రచించాడు. ఈ మంత్రంలోని ఒక్కొక్క అక్షరము సూక్ష్మతత్త్వంపై ఆధారపడియున్నది. పల్లవించుటవలన వేదముల శాఖప్రశాఖలు, ఆకులు, ఫలములు యేర్పడ్డాయి. అప్పుడా వృక్షము బీజముకన్నా అనేక కోట్లరెట్లు అధిక పరిమాణంలో వుంటుంది. గాయత్రీలోని 24 అక్షరములు అటువంటి బీజమే! మహోన్నతంగా విస్తరించి వేదస్వరూపంగా వెలసినది.

వ్యాకరణశాస్త్రంలోని పదునాలుగు సూత్రములు మహేశ్వరుని ఢమరుక నుండి వుద్భవించాయి. ఒకసారి మహాదేవుడు ఆనందంతో తన ఢమరుకను మ్రోగించాడు. ఆ ఢమరుకనుండి 14 ధ్వనులు వెలువడ్డాయి. అవి 'అ, ఇ, ఉణ్, ఋ, లుక్, ఏ, ఓంగ్, ఐ, ఓచ్, హ య, వ, రట్ మొదలైనవి. 14 సూత్రములాధారంగా పాణిని మహావ్యాకరణ రచన చేశాడు. ఆ వ్యాకరణమునకు అనేక వ్యాఖ్యలు అవతరించాయి. అవన్నీ ఒకచోట సేకరించబడినట్లయితే ఒక పెద్ద సంగ్రహాలయం అవుతుంది. అటులనే గాయత్రీమంత్రంలోని 24 అక్షరాలు వైదిక సాహిత్యమునకు అంగప్రత్యంగంగా రూపొందినాయి. గాయత్రీ వైదిక ఋక్కులకు విస్తృతమైన వ్యాఖ్య.

బ్రహ్మదేవుని స్ఫురణ మాత్రంచే గాయత్రి ప్రాదుర్భావము

అనాదిలో పరమాత్మతత్త్వము యీ సకల చరాచరసృష్టిని బ్రహ్మదేవునిద్వారా వుత్పన్నము చేసింది. సృష్టికార్యపు సంకల్పము కలిగినంతనే బ్రహ్మదేవునికి స్ఫురణ కలిగినది. దాని నామము 'శక్తి.' శక్తిద్వారా రెండు రకముల సృష్టి జరిగినది. ఒకటి జడము, రెండవది చైతన్యము. జడసృష్టిని నడిపించునది ప్రకృతి. చైతన్యసృష్టిని వుత్పన్నము చేసే శక్తి సావిత్రి.

పురాణాలలో సృష్ట్యాదినుండి భగవంతుని నాభినుండి కమలము వుద్భవించినదని వర్ణింపబడినది. కమలము నుండి బ్రహ్మ వుద్భవించాడు. బ్రహ్మవలన సావిత్రి, బ్రహ్మ సావిత్రి సంయోగమువలన వేదములు ఆవిర్భవించాయి. వేదములనుండి అన్నిరకముల జ్ఞానము వెలువడినది. తరువాత బ్రహ్మ యీ పాంచభౌతికసృష్టిని ఒనరించాడు. ఈ ఆలంకారిక కథా రహస్యమేమంటే నిర్లిప్త, నిర్వికార, నిర్వికల్పతత్త్వ మనే నాభినుండి అనగా కేంద్రమునుండి అంతః కరణము నుండి కమలము వుత్పన్నమై, పుష్పము వలె వికసించినది. అవి శృతి ప్రకారము సృష్ట్యాదిన పరమాత్మ కోర్కెననుసరించి ఏకోహం బహుశ్యామ్ -ఒకటి అనేకమైనది. ఈ సృష్టి ఆ పరమాత్మ ఇచ్ఛ, స్ఫురణ నాభి దేశమునుండి ప్రావిర్భవించినది. అనగా కమలముయొక్క లతిక ద్వారా చిన్న మొగ్గ పుష్పించినది.

ఇపుడు బ్రహ్మ సృష్టి ప్రారంభమైనది. బ్రహ్మ సృష్టి రెండు రకములు. ఒకటి చైతన్యము. రెండవది జడము. చైతన్యసృష్టి అనగా సకలజీవుల సృష్టి. ఇందులో ఇచ్ఛ, అనుభూతి, అహంభావము వుంటాయి. చైతన్యము స్వతంత్రసృష్టి. ఈ విశ్వమునకు చైతన్యసృష్టి -ప్రాణమయకోశము, సకల విశ్వానికి చైతన్య తత్త్వము -ప్రాణము అనే పేరుతో పిలువబడుతోంది. ఆలోచన, సంకల్పము, భావము, ప్రాణతత్త్వములోని మూడుభాగాలు. సత్త్వ, రజ, తమము అనే మూడు గుణాలుకూడా ప్రాణతత్త్వము లోనివే. ఈ తత్త్వముల ఆధారంగా ఆత్మకు సూక్ష్మ, కారణ, లింగదేహములు ప్రాప్తిస్తాయి. అన్ని ప్రాణులకు ఈ ప్రాణతత్త్వము చైతన్యాన్ని, జీవనశక్తిని యిస్తుంది.

జడసృష్టికోసము బ్రహ్మ పంచభూతములను నిర్మించాడు. పృథ్వి, జలము, వాయు, అగ్ని, ఆకాశములద్వారా సృష్టిలోని పరమాణుమయ పదార్థము నిర్మించబడినది. పరమాణు ప్రకృతి ఘన, ద్రవ, వాయు రూపాలలో తన గతివిధానాన్ని పరిపాలిస్తుంది. నదులు, పర్వతాలు, భూమి మొదలైనవి పాంచభౌతికపు క్రీడలు, ప్రాణుల స్థూల శరీరాలు యీ ప్రకృతియొక్క పంచభూతములచే తయారైనవే.

జడ, చైతన్య సృష్టి రెండింటిలోను క్రియ వున్నది. ప్రాణమయ చైతన్యసృష్టియొక్క అహంభావము సంకల్పము, ప్రేరణ పోకడలు అనేక రూపములలో కనిపిస్తాయి. జడమయసృష్టిలో శక్తి, బలము, స్వభావముల ఆధారంగా పరమాణు పదార్థము అనేక విధాలుగా రూపములో, వర్ణములో, ఆకారములో మార్పులు చెందుతూవుంటుంది. జడమయసృష్టికి ఆధారము పరమాణువు. చైతన్యసృష్టికి ఆధారము సంకల్పము. ఈ రెండింటికి ఆధారము అత్యంతసూక్ష్మము, అత్యంత బలమైనది. దానికి నాశనము లేదు, కానీ రూపాంతరమున్నది. జడచేతనసృష్టి నిర్మాణంలో బ్రహ్మయొక్క రెండు శక్తులు పనిచేస్తాయి. 1. సంకల్పశక్తి, 2. పరమాణుశక్తి. ఈ రెండింటిలో ప్రథమంగా సంకల్పశక్తి అవసరమైనది. ఏలనన సంకల్పము లేనిదే చైతన్యము కలుగదు, చైతన్యము లేనిదే పరమాణువు వుపయోగింపబడలేదు. చైతన్యరహిత సృష్టి చైతన్యహీనమై జ్ఞానములేక నిష్ప్రయోజన మౌతుంది. చైతన్యము బహిర్గతమగుటకు కావల్సిన సాధన సామాగ్రిరూపంలో బ్రహ్మచైతన్యాన్ని సృజించి, జ్ఞాన సంకల్పమును ఆవిష్కరించాడు. పౌరాణికభాషలో సర్వప్రథమంగా వేదాలు చెప్పబడ్డాయి.

పురాణాలలో బ్రహ్మయొక్క శరీరమునుండి ఒక సర్వాంగసుందరి వుద్భవించినది. ఆయన అంగమునుండి వుద్భవించినది. కనుక ఆమె ఆయనకు పుత్రిక ఔతుంది. ఈ తరుణి సహాయముతో తన సృష్టికార్యమును ప్రారంభించాడు. తరువాత రూపవతియైన తరుణిని జూచి మోహించి, మనోవికారమును పొందినవాడై ఆమెను భార్యగా స్వీకరించి రమించాడు. ఈ మైథునమువలన పాంచభౌతికసృష్టి జరిగినది. ఆలంకారిక కథ యిది. ఈ కథయొక్క రహస్యాన్ని తెలిసికొనక ప్రాచీనత్వాన్ని అవహేళనతో, అవినీతికరంగా భావించి, అశ్రద్ధతోను, అవిశ్వాసంతోను భావిస్తారు. బ్రహ్మ మానవుడు కాదని ఆయనచే సృష్టించబడిన శక్తి స్త్రీ గాదనీ, వారు స్త్రీ-పురుషుల వలె సంగమించి బీజోత్పత్తి చేయలేదని గ్రహించాలి. సృష్టికార్య స్వరూపము గూఢంగా కవితాకళా కౌశల్యాన్ని వుపయోగించి కథగా చెప్పబడినదని తెలియవలెను.

బ్రహ్మ నిర్వికార పరమాత్మశక్తి. ఇదియే సృష్టి నొనరించునది. ఈ కార్యాన్ని నిర్వహించటానికిగాను పరమాత్మశక్తికి రెండు భుజములున్నాయి. అవి 1 సంకల్పశక్తి, 2. పరమాణుశక్తి. సంకల్పశక్తి చైతన్య సత్ సంభవముగనుక బ్రహ్మకు భార్యయైనది. ఈవిధంగా గాయత్రి లేక సావిత్రి బ్రహ్మకు పుత్రిక లేదా భార్యగా ప్రసిద్ధిచెందినది.

గాయత్రి సూక్ష్మశక్తుల శ్రోత

మనకిప్పుడు అవ్యయమై, నిర్వికారము, అజరము, అమరమునైన పరమాత్మ ఒక్కటే అనేకంగా రూపొందటానికి సంకల్పశక్తిగానైనది అని తెలిసినది. ఈ ఇచ్ఛా, సంకల్పము, స్ఫురణశక్తినే బ్రహ్మపత్ని అంటారు. ఈవిధంగా బ్రహ్మ ఒకటినుండి రెండైనాడు. ఇపుడు దానినే మనము లక్ష్మీనారాయణ, సీతారాములు, రాధాకృష్ణులు, ఉమాశంకరులు, శక్తిశివులు, మాయాబ్రహ్మ, ప్రకృతిపరమేశ్వర అనే పేర్లతో సంబోధిస్తున్నాము.

ఈ శక్తిద్వారా అనేక పదార్థముల నిర్మాణము కావలెను. అందువలన తను స్వయంగా మూడు భాగాలుగా విభజింపబడవలసివచ్చింది. తద్వారా బహుసమ్మిశ్రితములు తయారవటానికి ఆస్కారముంటుంది. దానితో వివిధ, గుణ, కర్మ, స్వభావములు గల జడచేతన పదార్థములు తయారవగలిగాయి. ఆ బ్రహ్మ శక్తియొక్క మూడుముక్కలు సత్, రజ, తమ అనే పేర్లతో వ్యవహరింపబడుతున్నాయి. సత్ అనగా ఈశ్వరుని దివ్యతత్త్వము, తమ అనగా నిర్జీవపదార్థములోని పరమాణువుల అస్థిత్వము, రజ అనగా రజస్సు అనగా జడపదార్థ, ఈశ్వరీయతత్త్వముల మిశ్రమముచే వుత్పన్నమయిన ఆనందదాయక చైతన్యము. ఈ మూడు స్థూలసృష్టికి మూల కారణములు. తదనంతరము స్థూలరూపంలో పృథ్వి, జలము, అగ్ని, వాయు, ఆకాశము అను పంచతత్త్వములు ఆవిర్భవించాయి. ఈ పంచతత్త్వముల పరమాణువులు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు సృష్టికార్యమును కొనసాగిస్తున్నాయి. వీటినే పంచతన్మాత్రలు అని అంటారు.

ప్రకృతి రెండు భాగములు. ఒకటి సూక్ష్మప్రకృతి. ఈ ప్రకృతిశక్తి ప్రవాహరూపంలో ప్రాణుల సంచారకార్యరూపాన్ని నిర్వహిస్తుంది. సత్యము, రజము, తమముల మయమైన స్థూల ప్రకృతి వలన దృశ్య పదార్థముల నిర్మాణము వుపయోగము జరుగుతుంది. ఇది పరమాణుమయశక్తి. పృథ్వి, జలము, అగ్ని, వాయురాకాశములద్వారా తన చలనశక్తిని ఆజ్ఞాపిస్తుంది. పైన చెప్పబడిన దానివలన పాఠకులకు యీవిధంగా అర్థమౌతుంది. ప్రథమంగా బ్రహ్మ. ఆయన స్ఫురణవల్ల ఆదిశక్తి వుద్భవించినది. ఈ ఆదిశక్తి పేరు గాయత్రి. బ్రహ్మ తన గాయత్రీని మూడు భాగాలుగా చేశాడు. సత్-దీనిని హ్రీం లేక సరస్వతి అంటారు. రజస్సు - దీనిని శ్రీం లేక లక్ష్మి అనే పేరుతో గుర్తిస్తారు. తమ -దీనికే క్లీం లేక కాళి అని పేరు. ప్రథమంలో వస్తుతః రెండు భాగములే. అవి సత్, తమము. ఈ రెంటి సంయోగమువలననే వుత్పన్నమైన ధారనుండి రజస్సు ప్రావిర్భవించినది. గంగా, యమునా నదుల సంగమముల వలన ఏర్పడిన మిశ్రమధారను మనమెలా సరస్వతిగా భావిస్తామో, అటులనే రజస్సు ఉద్భవించి త్రిపద ప్రకృతి యైనది.

అద్వైతవాదము, ద్వైతవాదము, త్రైతవాదముల మధ్య స్వరవ్యతిరేకత కనిపిస్తుంది. ఈ భేదము అజ్ఞతవలన వచ్చినది. బ్రహ్మ, జీవుడు, ప్రకృతి ఈ మూడు అస్థిత్వము కలిగివున్నాయి. ప్రథమంగా ఒక బ్రహ్మ వున్నాడు. ఇది నిజమే. అందువలన అద్వైతవాదముకూడ నిజమే. తరువాత బ్రహ్మ మఱియు శక్తి లేక ప్రకృతి రెండూ యేర్పడ్డాయి. కావున ద్వైతవాదముగూడ సరియైనదే. ప్రకృతి పరమేశ్వర సంపర్కమువలన ఉద్భవించిన రసానుభూతి మఱియు చైతన్యమిశ్రిత వుత్పన్న రజస్సే జీవుడుగా సంబోధింపబడినది. ఈవిధంగా త్రైతవాదముగూడ సరియైనదే. ముక్తి

చేకూరినంతనే జీవశక్తి నశిస్తుంది. కావున జీవుని వర్తమానశక్తి, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములపై ఆధారపడి వుంటుందనీ, అదియొక మిశ్రమసూత్ర మనీ స్పష్టమౌతున్నది.

తత్త్వదర్శనపు గంభీర విషయంలో ప్రవేశించి ఆత్మయొక్క సూక్ష్మ విషయాన్ని దృష్టిసారించుట యిచట అవసరము. ఈ పంక్తులలో ప్రకృతిలోని స్థూల, సూక్ష్మ భేదములను తెలియజేయవలె. విజ్ఞానముయొక్క రెండు భాగములు యిచటనుండియే యేర్పడుతున్నవి. పంచతత్త్వములద్వారా పనిచేస్తున్న స్థూలప్రకృతిని అన్వేషించిన మనిషిని భౌతిక విజ్ఞాని అంటారు. ఈ భౌతికవిజ్ఞానులే తమ బుద్ధిబలముద్వారా పంచతత్త్వముల భేద-ఉపభేదములను గ్రహించి, అనేక ప్రయోజనములను, సాధనములను పొందారు. రసాయన, కృషి, విద్యుత్తు, భాష్ప, శిల్పము, సంగీతము, భాష, సాహిత్యము, వాహనములు, గృహనిర్మాణము, చికిత్స, శాసనము, ఖగోళవిజ్ఞానము, శాస్త్రము, అస్త్రములు, వేదాంతము, పరిశోధనము మొదలైన అనేక విధాలుగా సుఖసాధనములను శోధించి కనుగొన్నారు. రైలు, మోటారు, తంతి, తపాలా, రేడియో, దూరదర్శిని, ఫోటో మొదలైన వివిధ వస్తువులను నిర్మించడానికి భారీ యంత్రములను తయారుచేశారు. ధనము, సుఖము, హాయి, విశ్రాంతి పొందుటకు సాధనములు సులభతరమైనాయి. ఈ మార్గముద్వారా పొందుచున్న లాభములను, శాస్త్రపరిభాషలో శ్రేయస్సు లేక భోగము అని అంటారు. ఈ విజ్ఞానము భౌతికవిజ్ఞానముగా చెప్పబడుతుంది. ఇది స్థూల ప్రకృతిని వుపయోగించుకునే విద్య.

ఆదిశక్తి గాయత్రిచే వుత్పన్నమొంది, సరస్వతి, లక్ష్మి, దుర్గ రూపములో ప్రచ్ఛన్నమైనదియే సూక్ష్మప్రకృతి. నదీ జలాలపైనున్న అలలపై గాలి తాకిడికి యేర్పడిన కలకలముతో కలసి ఒకానొక ప్రత్యేక ధ్వని వుత్పన్నమౌతుంది. అలాగే సూక్ష్మప్రకృతి శక్తిధారల వలన త్రివిధములైన ధ్వనులు వుద్భవించుతాయి. సత్త్వప్రవాహములో హ్రీం, రజోప్రవాహములో శ్రీం, తమో ప్రవాహములో క్లీం అను ధ్వనులు కలిసి రూపొందుతాయి. వీటికన్నా సూక్ష్మమైనది బ్రహ్మయొక్క ఓంకార ధ్వని ప్రవాహము. నాదయోగసాధకులు ధ్యానమగ్నులై యీ ధ్వనులను పట్టుకుంటారు. ధ్వనుల సహాయంతో సూక్ష్మప్రకృతిని అధిగమించి, బ్రహ్మసాయుజ్యాన్ని చేరుకుంటారు.

ప్రాచీనకాలంలో పూజనీయులైన మన పూర్వజులు, ఋషులు తమ తీక్షణదృష్టితో, విజ్ఞానంతో యీ సూక్ష్మతత్త్వాన్ని గ్రహించారు. దీనిని శోధించుటకు, సఫలత నొందుటకు తమతమ శక్తులను కేంద్రీకరించారు. తత్ఫలితంగా వర్తమానకాలంలో భౌతికవిజ్ఞానికన్నా, అనేకరెట్లు లాభదాయకమైనదిగా సూక్ష్మతత్త్వాన్ని సాధించారు. వారు ఆదిశక్తియొక్క సూక్ష్మశక్తి అధికారాన్ని సంపాదించి, దానిని తమ ఆధీనంలో వుంచుకొనగలిగారు. మనుష్య శరీరమునుండి అనేక శక్తులు వుద్భవించగలవనునది సత్యము. మన ప్రాచీన ఋషులు యోగసాధన ద్వారా శరీరంలోని అనేక భాగాలలో అంతర్గతంగా, నిక్షిప్తంగా వున్న శక్తికేంద్రములను, చక్రములద్వారా, గ్రంథులను, మాత్రుకలను, జ్యోతులను, భ్రమరములను మేల్కొలిపి ఆ జాగృత ప్రవాహశక్తిని ఏయేవాటికి అవసరమో గుర్తించి సంధించెదరు. రేడియో ట్రాన్సుమీటరు స్టేషనుకు సంధించినపుడు విద్యుత్తు సమశ్రేణిలో ప్రవహించుటవలన ఆ స్టేషనుకు సంబంధము కలిగి అచటి ప్రసారములు యెటుల వినిపించుతాయో, అటులనే సాధన ద్వారా శరీరంలోని అంతర్భాగాలలో నిగూఢంగా నుండి, నిద్రావస్థలోనున్న కేంద్రములను మేల్కొలిపి సూక్ష్మప్రకృతిశక్తితో సంబంధము కల్పించుకొనవచ్చు. ఈ సంబంధమువలన ఆద్యశక్తిలో నిమిడివున్న రహస్యములను తెలుసుకోవచ్చు. వాటిని మన కవసరమైన రీతులలో

నుపయోగించి ప్రయోజనము పొందవచ్చు. ఏలనన సంసారము ఆదిశక్తి లోనిది. ప్రపంచములోని అన్ని పదార్థములతోను, అన్నింటితోను, అటువంటి వ్యక్తి సంబంధాలను పెంపొందించుకొనుటకు శక్తుడవుతాడు.

ప్రస్తుతము వర్తమానకాలంలో వైజ్ఞానికులు, పరిమిత స్థూలప్రకృతికి పంచతత్త్వాలకు సంబంధము కల్పించటానికి, పెద్దపెద్ద యంత్రాలను, విద్యుత్తును, వాయువు, జలము, పెట్రోలు మొదలైనవాటిని ప్రయోగించి తక్కువ ప్రయోజనాన్ని పొందుచున్నారు. ఈ పద్ధతి శ్రమసాధ్యము, కష్టసాధ్యము, ధనమువలన సాధ్యము. ఎంతో సమయాన్ని తీసుకుంటుంది. ఈ యంత్రములను నిర్మించుటకు, స్థాపించుటకు యెంతో కాలము పడుతుంది. వీటి రక్షణ కూడ కష్టముతో కూడిన పని. ఈ యంత్రములను పనిచేయించుటకు నిపుణులు కావలెను. పనివారు రోజంతా పనిచేయవలెను. వీటిని మార్పు చేయవలెనన్న సమయము, ధనము ఖర్చవుతుంది. ఈ ఝంఝాట మంతా భారతీయ యోగవిజ్ఞానవేత్తలకు అవసరము లేదు. వారు యెటువంటి యంత్ర సహాయము లేకుండా విద్యుత్తు, పెట్రోలు, సంచాలకుడు లేకుండా తమ శరీరములోని కేంద్రములను జాగృతపఱచి, సూక్ష్మ ప్రకృతితో సంబంధము కల్పించి, నేటి విజ్ఞానశాస్త్రవేత్తలు ఊహించనటువంటి ఆశ్చర్యజనిత కార్యములను చేయగలిగారు.

మహాభారతయుద్ధంలోను, రామాయణ సంగ్రామంలోను ప్రయోగింపబడిన అస్త్రశస్త్రములలో నేడు కొన్నిమాత్రమే ఆయుధముల రూపములో కనిపిస్తున్నాయి. రాడార్లు, గ్యాస్‌బాంబులు, కీటకబాంబులు, రసాయనికబాంబులు, ఆటంబాంబులు, లేసర్‌కిరణములు ప్రస్తుతము తయారవుతున్నాయి. ప్రాచీనకాలంలో సమ్మోహనాస్త్రము, బ్రహ్మపాశము, నాగపాశము, వారుణాస్త్రము, ఆగ్నేయాస్త్రము మొదలైనవి శత్రువులను నిర్జించి తిరిగివచ్చేవి. ఉపయోగంలో వుండేవి. శబ్దభేదికూడ ప్రయోగించేవారు. అలాంటి అస్త్రశస్త్రములు ఖరీదైన యంత్రాలద్వారాకాక, మంత్రబలంతో ప్రయోగింపబడేవి. మంత్రబలంతో శక్తులను ఘాతినీలను ప్రయోగించేవారు. లంకలోనున్న రావణుడు, అమెరికాలోనున్న అహిరావణుడు తమలోతాము యిష్టాగోష్టి వార్తలను చెప్పుకొనేవారు. వారికి రేడియో అవసరముగాని, ట్రాన్సిమీటరు అవసరంగాని లేదు. పెట్రోలు లేకుండా కేవలము మనశ్శక్తితో విమానము నడిచేది.

అష్టసిద్ధులనుగూర్చి, నవనిధులుగూర్చి శాస్త్రములలో అనేకచోట్ల వర్ణింపబడివున్నది. అగ్నిప్రవేశము చేయడము, నీటిపై నడవడము, వాయువేగంతో ప్రయాణము చేయడము, అదృశ్యము కావడము, మనుష్యుడు జంతు, పక్షి రూపాన్ని ధరించడము, శరీరాన్ని చిన్నదిగా చేయడము, శరీరాన్ని తేలికగాను, బరువుగాను చేయడము, శాపంద్వారా అరిష్టాన్ని కలుగజేయడము, వరాలను ప్రసాదించడము వలన మంచిని ఒనగూర్చడము, మృత్యువును నిరోధించుట, పుత్రకామేష్టియజ్ఞము, భవిష్యజ్ఞానము, ఇతఋల ఆంతర్యమును గ్రహించుట, క్షణంలో కావల్సినంత ధనాన్ని పొందుట, జంతువులను, నగరములను, జీవజంతువులను, ధాతువులను మొదలైనవాటిని సృష్టించుట, సమస్త బ్రహ్మాండముయొక్క పోకడను గుర్తించుట, వస్తువుల స్వరూపాన్ని మార్చుట, ఆకలి, దాహము, నిద్ర, శీతలము, వేడిని జయించుట, ఆకాశయానము మొదలైన అనేక ఆశ్చర్యకరమైన పనులను కేవలము మంత్రబలంతోను, యోగశక్తితోను, ఆధ్యాత్మిక జ్ఞానంతోను జరిగేవి. ఈ వైజ్ఞానిక ప్రయోజనాలకోసము యేవిధమైన యంత్రాలుగాని, పెట్రోలుగాని, విద్యుత్తుగాని అవసరము లేదు. ప్రకృతియొక్క సూక్ష్మ ప్రవాహంతో సంబంధము యేర్పరచుకొనినందువలన సులభంగా జరిగేవి. ఇదియే భారతీయ విజ్ఞానము, దీనికి ఆధారము -సాధన!

సాధనద్వారా పైన చెప్పబడిన చమత్కారములు జరుగుటయేగాక, ఆనందంగూడా పొందవచ్చు. భౌతిక చమత్కారములు తమస్సు తత్త్వమునకు సంబంధించినవి. ఆనందము రజస్సు తత్త్వమునకు సంబంధించినది. ఆపదలు, వ్యాధులు, అపజయము, విరోధము, గాయములు తగులుట మొదలయిన విపత్కర పరిస్థితులయందు తగుల్కొని, సాధారణ మనోభూమిగల మనుష్యులు మృత్యుతుల్య మానసిక కష్టములను పొందుచున్నారు. కానీ ఆత్మశక్తి నుపయోగించి విద్య తెలిసిన వ్యక్తులు వివేకము, జ్ఞానము, వైరాగ్యము, ఆశ, పరమేశ్వరునిపై అచంచల విశ్వాసమాధారంగా కష్టాలను నవ్వుతూ సులభంగా భరిస్తారు. చెడ్డపరిస్థితులలోను, తమ ఆనందాన్ని పెంచుకోవటానికి మార్గాలను అన్వేషిస్తారు. వారు తమ జీవితాలను, వుత్సాహంతోను, మహదానందంతోను, మనోరంజకంగాను గడుపుతారు. అటువంటి జీవితము కోటీశ్వరుని లలాటరేఖ గూడ సమకూర్చలేదు. ఏ వ్యక్తియొక్క శారీరక, మానసిక ఆరోగ్యము ఆత్మబలం సరిగావుంటుందో, ఆ వ్యక్తికి భాగ్యవంతునికన్నా ఆనందమయ జీవితాన్ని గడిపే సౌభాగ్యము సునాయాసంగా లభిస్తుంది. రజోశక్తి నుపయోగించినందువలన భౌతికవిజ్ఞానంద్వారా లభించిన లాభంకన్నా అనేకరెట్లు శక్తి లభిస్తుంది.

సత్త్వతత్త్వపు లాభాలను వర్ణించటానికి లేఖినికిగాని, వాణికిగాని శక్తి లేదు. ఆత్మయందు ఈశ్వరతత్త్వము వృద్ధిపొందుచున్నప్పుడు దయ, కరుణ, ప్రేమ, మైత్రి, త్యాగము, సంతోషము, శాంతి, సేవాభావము, ఆత్మీయత, సత్యనిష్ఠ, నిజాయితీ, నిగ్రహము, నమ్రతాభావము, పవిత్రత, శ్రమశీలత, ధర్మపరాయణత మొదలయిన సద్గుణములు ప్రతిదినము మహావేగంతో వృద్ధిపొందుతాయి. అట్టివారికి ఫలస్వరూపంగా ప్రశంసలు, కృతజ్ఞత, ప్రత్యుపకారమువలన సంతృప్తి కలుగుతుంది. ఇదిగాక సద్గుణాలు యెంత మధురమైనవంటే ఏ హృదయంలో వీటికి స్థానముంటుందో అచట ఆత్మసంతోష శీతల ప్రవాహము సదా ప్రవహిస్తుంటుంది. అట్టివారు జీవనము గడుపుతున్నా, మృత్యుస్థానంలోనున్నా, జీవన్ముక్తి, స్వర్గము, పరమానందము, బ్రహ్మానందము, ఆత్మదర్శనము, భగవత్ప్రాప్తి, బ్రహ్మనిర్వాణము, తురీయావస్థ, నిర్వికల్పసమాధుల సుఖప్రాప్తి కలుగుతుంది. ఇదియే జీవన లక్ష్యము. ఈ స్థితి పొందినపుడు ఆత్మ తృప్తితో ఆనందసాగరంలో లీనమౌతుంది.

సుఖము మూడు రకములు. ఆత్మసుఖము, మానసికసుఖము, మఱియు సాంసారికసుఖము. ఈ మూడు సుఖములు గాయత్రీ సత్త్వ, రజ, తమోమయ ధారలను చేరుటతో సాధకుడు సుగమంగా పొందుతాడు. సరస్వతి, లక్ష్మి, కాళికాదేవి సిద్ధులు వేఱ్వేరుగా ప్రాప్తిస్తాయి.

పాశ్చాత్యదేశాలలోని భౌతికవిజ్ఞానులు క్లీం తత్త్వపు కాళీశక్తిని ఆరాధించడంలో, అన్వేషించడంలో నిమగ్నమై యున్నారు. బుద్ధివాదులు, ధర్మప్రచారకులు, ఉద్ధరణవాదులు, గాంధీవాదులు, సమాజసేవకులు, వ్యాపారులు, శ్రామికులు, ఉద్యోగస్థులు, సమాజవాదులు, కమ్యూనిష్టులు, శ్రీం శక్తియొక్క సువ్యవస్థ లక్ష్మీ సంపాదనకొఱకు అహరహము ప్రయత్నిస్తున్నారు.

యోగులు, బ్రహ్మవేత్తలు, ఆధ్యాత్మవాదులు, తత్త్వదర్శకులు, భక్తులు, వేదాంతులు, పరమార్థాన్ని కాంక్షించే వ్యక్తులు హ్రీం తత్త్వపు సరస్వతీశక్తిని ఆరాధిస్తున్నారు. ఈ మూడు వర్గములు గాయత్రీ ఆద్యశక్తియొక్క ఒక్కొక్క పాదమును ఉపాసన చేయుచున్నారు. గాయత్రిని త్రిపద అని అంటారు. ఆమెకు మూడు చరణములున్నాయి. ఈ త్రివేణి పైనుదహరింపబడిన మూడు ప్రయోజనములను సంప్రాప్తింపజేస్తుంది. మాతృదేవి కుమారుని సర్వపనులు

చేస్తుంది. అవసరాన్నిబట్టి దాసిగా, వంటమనిషిగా, గుజ్జింగా, దాతగా, చాకలిగా, కాపలాదారుగా, పాకీగా, దుబాసీగా, దర్జీగా పనులు చేస్తుంది. అటులనే మానవులు ఆత్మశక్తిని ఆద్యశక్తితో సంధించుటనే విద్య నేర్చినపుడు తాము ఆ తల్లికి సుసంతతిగా పరిఢవిల్లుతారు. వారు సర్వశక్తిమయ గాయత్రిమాత చల్లని దీవెనతో యిష్టమైన ప్రయోజనములను పొందుతారు.

ప్రపంచములో దుఃఖానికి కారణములు మూడు. అజ్ఞానము, శక్తిహీనత, అభావము. ఈ మూడు దుఃఖములను గాయత్రి సూక్ష్మప్రకృతియొక్క మూడు ధారలను సద్వినియోగము చేయడంద్వారా నివారింపవచ్చును. హ్రీం- అజ్ఞానాన్ని; క్లీం-అశక్తిని పోగొడతాయి. భారతీయ సూక్ష్మవిద్యా విశేషజ్ఞులు సూక్ష్మప్రకృతిపై అధికారాన్ని పొంది, తమ అభీష్టానందాన్ని పొందటానికి, ఏ విజ్ఞానాన్ని ఆవిష్కరించారో ఆ విజ్ఞానానికి అది అన్ని దృక్కోణములనుండి గూడా అసాధారణము, అపూర్వము. ఈ ఆవిష్కారమునకు మఱోపేరు సాధన. సాధనవలన సిద్ధి కలుగుతుంది. గాయత్రి సాధనచే అనేక సిద్ధుల జ్ఞానము కలుగుతుంది.

గాయత్రీ సాధనవలన శక్తికోశములు ఉద్భవించుట

ఇంతకుముందు గాయత్రి, దేవి-దేవతాకాదని, భూతప్రేతముగాదని, బ్రహ్మ స్ఫురణవలన జన్మించిన ఆద్యశక్తి యని, అది యీ ప్రాపంచిక పదార్థానికి మూలకారణము ఆ శక్తివలననే జడచేతన సృష్టికి గమనము, శక్తి, ప్రగతి, ప్రేరణ, పరిణితి కలిగాయని వ్రాయడమైనది. రేడియో సంబంధమైన విశ్వవ్యాపిత ఈథర్ తరంగాలద్వారా మన ఇంట్లో కూర్చుని దేశవిదేశాలలోని ప్రత్యేక ప్రసారాలను సులభంగా ఎలా వినగలమో అదేవిధమున ఆత్మశక్తివలన విశ్వవ్యాప్తమైన గాయత్రితో సంబంధము యేర్పరచుకొని సూక్ష్మప్రకృతిచే జరుగుచున్న అన్ని సంగతులను తెలిసికొనగలము. సూక్ష్మశక్తి ఇచ్ఛానుసారము వుపయోగించుకొనే కళను తెలుసుకొన్నప్పుడు సాంసారిక, మానసిక ఆత్మికక్షేత్రాలలో ప్రాప్తించగల సకల సంపదలను పొందటానికి గల యేకైక మార్గము - సాధన.

మనకు ఈశ్వరప్రాప్తి, ఆత్మదర్శనము, జీవన్ముక్తి కావలెగాని, గాయత్రియొక్క సూక్ష్మప్రకృతి ఆకర్షణలో పడినందువలన ప్రయోజనమేమని అనేకులు ఆలోచిస్తారు. మనకు ఈశ్వరారాధనమే కావలె. బ్రహ్మ సర్వదా నిర్వికార, నిర్లిప్త, నిరంజన, నిరాకార గుణాతీతుడు. ఆయనకు ప్రత్యేకించి యెవఱిపైనా ద్వేషము లేదు. ప్రేమా లేదు. ద్రష్టమాత్రమే. కారణరూపుడుమాత్రమే. అంతవఱకు సరాసరి మనమెటువంటి ఆటంకమూ లేకుండా వెళ్ళలేము. ఏలనన జీవబ్రహ్మల మధ్య సూక్ష్మప్రకృతి శక్తియొక్క నీలాచ్ఛాదన వున్నది. ఆ ఆచ్ఛాదన నతిక్రమించటానికి ప్రకృతి సాధనాలుద్వారానే వీలవుతుంది. మనుస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, కల్పన, ధ్యానము, సూక్ష్మశరీరము, షట్చక్రాలు, ఇష్టదేవతా ధ్యానప్రతిమ, భక్తిభావన, ఉపాసన, వ్రతము, అనుష్ఠానము, సాధన - ఇవన్నీకూడ మాయానిర్మితాలు. ఇవన్నీ వదలి బ్రహ్మప్రాప్తి యెలా సంభవిస్తుంది? పై ఆకాశాన్ని చేరటానికి వాయుమానమెంత అవసరమో, బ్రహ్మప్రాప్తికొఱకు ప్రతిమా మూలకమైన ఆరాధనను ఆశ్రయించుట యటులనే అవసరమవుతుంది. గాయత్రి ఆచరణలో వుంటూనే ఆవలికి

చేరినంతనే బ్రహ్మసాక్షాత్కారము జరుగుతుంది. ఈ స్థితిని అతిక్రమించినపుడు సూక్ష్మేంద్రియాలతోపాటు వాటి అనుభవశక్తికూడా లుప్తమౌతుంది. అందుచేత ముక్తిని, ఈశ్వరప్రాప్తిని కాంక్షించేవారు గాయత్రి మిశ్రిత బ్రహ్మను, రాధేశ్యామ్‌ను, సీతారాముని, లక్ష్మీనారాయణుని ఉపాసన చేస్తారు. బ్రహ్మ యెపుడు అనేకము నుండి ఏకమవటానికి యిష్టపడతాడో, ఆత్మలన్నిటిని సమ్మేళనపఱచుకొని తనయందు యిమిడ్చుకొంటాడో, అపుడు నిర్వికారబ్రహ్మ సాయుజ్యము పొందుతాడు. అంతకుపూర్వము సవికారబ్రహ్మలోనే అన్ని ఆత్మలు సారూప్య, సాయుజ్య, సామీప్య మవుతాయి. ఈవిధంగా గాయత్రి మిశ్రిత సవికారబ్రహ్మమే మన ఉపాస్యమౌతుంది. దానిని పొందటానికి ఏవిధమైన సాధన చేసినప్పటికి, అవన్నీ సూక్ష్మప్రకృతి గాయత్రి ద్వారానే జరుగుతాయి. అందుచేత బ్రహ్మప్రాప్తికి గాయత్రి అవసరమని తలంపరాదు. గాయత్రి అనివార్యము. గాయత్రి నామాన్ని యెవతైనా అంగీకరించనియెడల అది వారి యిష్టము. కాని గాయత్రి తత్త్వమునుండి తప్పించుకొని యితఱ మార్గము అనుసరించుట అసంభవము.

అనేకమంది తాము నిష్కామ సాధన చేస్తామంటారు. ఫలాపేక్ష లేదు కాబట్టి సూక్ష్మప్రకృతినేల ఆశ్రయించవలె? అని ప్రశ్నిస్తారు. అలాంటివారు నిష్కామ సాధనకు అర్థమేమో తెలిసికోవాలి. అనగ భౌతికప్రయోజనాన్ని కోరకుండా ఆత్మిక సాధన గావించాలి. పరిణామాన్ని గణించకుండా దీనిని ఆశ్రయిస్తే యే కార్యముతోనైనా ప్రవృత్తి కూడ కలుగనేరదు. ఒకవేళ కొంచెమేదైనా ప్రాప్తించినా దానివల్ల సమయము, శక్తి వృధా అవడముతప్ప మఱే యితఱ పరిణామము సంభవించదు. నిష్కామకర్మకు తాత్పర్యము దైవీ, సత్త్వగుణము, ఆత్మిక కోర్కెలకొఱకే. ఇలాంటి కోర్కెలు గాయత్రి ప్రథమ పాదమైన హ్రీం తత్త్వములో సరస్వతీ భాగము క్రిందకు వస్తుంది. కావున నిష్కామ భావనా ఉపాసనకూడ గాయత్రి క్షేత్రమునకు వేఱుగా లేదు.

మంత్రవిద్య తెలిసిన వైజ్ఞానికులు నాలుకనుండియే శబ్దము వెలువడినా దాని ఉచ్చారణ కంఠము, దౌడలు, అంగిట, పెదవులు, దంతములు, జిహ్వామూలము మొదలగు విభిన్న ముఖాంగాలద్వారా జరుగుతుందని భావిస్తారు. ఈ ఉచ్చారణకాలంలో ముఖమునందలి యే భాగమునుండి ధ్వని వెలువడుతుందో ఆ అంగాల నాడీతంతువులు శరీరపు విభిన్న భాగాలకు వ్యాపిస్తాయి. అక్కడ అనేక గ్రంథులుంటాయి. ఈ గ్రంథులపై ఉచ్చారణయొక్క వత్తిడి పడుతుంది. కొంతమందికి కొన్ని సూక్ష్మగ్రంథులు పాడైపోవడంగాని, రోగగ్రస్తమవడంగాని జరుగుతుంది. వారి ముఖమునుండి కొన్ని ముఖ్యమైన శబ్దాలు అస్పష్టంగా ఆగిఆగి వెలువడతాయి. దీనినే నంగిమాటలని అంటాము. శరీరంలో అనేకమైన చిన్న, పెద్ద గ్రంథులుంటాయి. ఇవి కొన్ని దృశ్యంగాను, కొన్ని అదృశ్యంగాను వుంటాయి. ఆ కోశాలలో యేదో ఒక శక్తిభండారము నిక్షిప్తమై వుంటుందని యోగులకు తెలుసు. సుషుమ్నతో కూడిన షట్చక్రాలు ప్రసిద్ధమైనవి. అట్టి గ్రంథులు శరీరంలో లెక్కలేనన్ని వున్నాయి. వివిధ శబ్దోచ్చారణ వివిధ గ్రంథులపై తన ప్రభావాన్ని ప్రసరింపజేస్తుంది. ఆ ప్రభావం వలన అపుడు ఆయా గ్రంథులలో నిక్షిప్తంగా వున్న శక్తిభాండారము జాగృతమౌతుంది. మంత్రశక్తి దీనిపై ఆధారపడివుంటుంది.

గాయత్రీమంత్రములో 24 అక్షరాలున్నాయి. శరీరంలో వున్న 24 గ్రంథులకు గాయత్రీ మంత్రానికి సంబంధమున్నది. గాయత్రీ మంత్రోచ్చారణవలన శరీరమనే సితార్ 24 స్థానాలలో ఝుంకారమును పొందుతుంది.

ఇంకా దీనివలన ఒక ప్రత్యేకమైన స్వరలహరి వుద్భవిస్తుంది. దీని ప్రభావము అదృశ్య ప్రపంచపు మహత్వపూర్ణమైన తత్త్వాలపైన పడుతుంది. ఈ ప్రభావంకూడా గాయత్రీ సాధన ఫలస్వరూప ప్రభావానికి కారణము.

శబ్దాల ధ్వని ప్రభావము అల్పమైనదేమి కాదు. శబ్దవిద్య తెలిసిన ఆచార్యులకు శబ్ద మెంత శక్తివంతమైనదో తెలుసు. ఆ శక్తియొక్క అజ్ఞాన గమనము ద్వారా యెట్టి పరిణామము సంభవిస్తుందో వారికి స్పష్టముగా గోచరిస్తుంది. శబ్దాన్ని బ్రహ్మ అని చెబుతారు. బ్రహ్మ స్ఫురణము ప్రకంపాలను సృష్టిస్తుంది. ఆ ప్రకంపనాలు బ్రహ్మను స్పృశించి ఓం అనే ధ్వనితో ఏడుసార్లు ధ్వనిస్తాయి. అలాగే ఓంకార ధ్వనికూడ సృష్టిని నడిపించే గమనాన్ని సృష్టిస్తుంది. కొంతదూరము ఆ ప్రవాహము సాగి హ్రీం, శ్రీం, క్లీం అను మూడూ సత్త్వ, రజ, తమములైన మూడు పాయలుగా పారుతుంది. తరువాత అవి అనేక ప్రవాహములుగా మారి బీజమంత్రాలు అనే పేరుతో పిలువబడతాయి. ధ్వనులు తమతమ క్షేత్రాలలో సృష్టికార్యాన్ని నడిపిస్తాయి. కావున యీ సృష్టి నిర్వహణము శబ్దతత్త్వముద్వారానే జరుగుతుంది. అటువంటి శక్తిని అల్పమైనదిగా భావించరాదు.

గాయత్రీమంత్రము విశిష్ట అక్షరక్రమములో దర్శింపబడినది. ఆ శబ్దాలలో క్రమము, విశేషత వున్నందువలన తనదైన శైలిలో అద్భుత ప్రవాహాన్ని సృష్టిస్తుంది.

దీపక్ రాగమాలపిస్తే ఆరిపోయే దీపము ప్రజ్వలిస్తుంది. మేఘమల్హార్ రాగంవలన వర్షమొస్తుంది. వేణునాదమువలన సర్పము పడగవిప్పి నాట్యము చేస్తుంది. లేళ్ళు తమను తాము మరచిపోతాయి. ఆవులు అధికంగా పాలిస్తాయి. కోయిల కూజితము కామ భావాన్ని మేల్కొల్పుతుంది. సైనికుల పదవిన్యాసపు కలయికవలన యేర్పడిన శబ్దముచే లోహనిర్మితమైన వంతెనకూడా కూలిపోగలదు. అందువల్లే దాటేటప్పుడు సైనికులు క్రమపద్ధతిలో అడుగులు వేయరాదని ఆజ్ఞలిస్తారు. అమెరికాలోని డాక్టరు హచిసన్ వివిధ సంగీత ధ్వనులచే అనేక కష్టమైన వ్యాధులను కుదిర్చి రోగులను కాపాడారు. ఎంతో ఖ్యాతి గడించారు.

భారతదేశంలోని తాంత్రికులు కడవలపై పళ్ళెములనుంచి అనేకరీతులలో మ్రోగిస్తారు. ఆ మ్రోతలతో సర్పదంష్ట్రులను, తేలుకుట్టినవారిని, విషవేలము, భూతోన్మాదము మొదలైనవారిని బాగుపఱచి పంపుతారు. కారణమేమంటే శబ్దముల వలన జనించిన ప్రకంపనాలు సూక్ష్మప్రకృతిచే తమ జాతికి సంబంధించిన అన్యపరమాణువులతో కలసి ఈథర్‌లో పరిభ్రమించి తమ వుద్గమకేంద్రానికి కొన్ని క్షణాలలోనే తిరిగివస్తాయి. అటుల వస్తూనే ఆ ధ్వనులలో తనదైన విద్యుఛ్ఛక్తిని నింపుటవలన పరిస్థితి కనుగుణ్యంగా అవసరమైన క్షేత్రాలలో ఆ శక్తియొక్క విశిష్ట ప్రభావము పడుతుంది. మంత్రముద్వారా విలక్షణ కార్యములు జరుగుటకిదియే కారణము. గాయత్రీమంత్రము ద్వారాకూడ యీవిధమైన శక్తి ఆవిర్భవిస్తుంది.

మంత్రోచ్చారణలో ముఖంలోని యే అంగాలు క్రియాశీలమౌతాయో ఆ భాగాలలోని నాడీతంత్రులలో కొన్ని విశేషమైన గ్రంథులలో స్పందన జరుగుతుంది. వాటిలో స్ఫురణ జాగృతి చెందినందువలన వైదిక ఛందస్సుయొక్క క్రమబద్ధమైన యోగసంగీత ప్రభావము ఈథర్ తత్త్వములో వ్యాపించి, కొన్ని క్షణాలలోనే విశ్వము నుండి తన స్వజాతీయ తత్త్వ సేనాసమూహంతో తిరిగొస్తుంది. ఇది అభీష్టసిద్ధి ప్రాప్తించుటకు సహాయపడుతుంది.

శబ్ద సంగీతపు శక్తివంతమైన కంపనాల పాంచభౌతిక ప్రవాహము మఱియు ఆత్మశక్తియొక్క సూక్ష్మప్రకృతి భావన, సాధన, ఆరాధనలపై ఆధారపడి వుత్పన్నమైన సంబంధము, ఈ రెండు కారణాలవలన గాయత్రీ శక్తి మహాశక్తివంతమై సాధకులకు దేవియొక్క వరదానాలు సిద్ధిస్తాయి.

గాయత్రీమంత్రము యింకా అధిక సూక్ష్మ మవటానికి కారణము సాధకుని శ్రద్ధామయ విశ్వాసము. మనోవిజ్ఞానవేత్తలందఱికీ విశ్వాసముయొక్క శక్తి విదితమే. మేము మా పుస్తకాలలో, వ్యాసములలో సిద్ధి, విశ్వాసము వలననే యెవరికైనా ప్రాప్తిస్తుందని, ప్రజలు భయభీతులైనప్పుడు కేవలము విశ్వాసమాధారంగా మృతప్రాయులకు నవజీవనము లభ్యమౌతుందనీ అనేక వుదాహరణలిచ్చాము. రామాయణంలో తులసీదాసులువారు భవానీ శంకరం వన్దే శ్రద్ధా విశ్వాసరూపిణే అని కీర్తిస్తూ శ్రద్ధ, విశ్వాసానికి భవానీ శంకరుల ఉపమానమిచ్చారు. గాలికి భూతస్వరూపమును -రజ్జువునకు సర్పభ్రాంతిని, విగ్రహానికి దైవత్వాన్ని యివ్వగలిగిన ఓర్పు విశ్వాసంలోనే వున్నది. మనుష్యులు తమ విశ్వాసములను పరిరక్షించుకోవటానికి తమ ధనాన్ని, విశ్రాంతిని, ప్రాణములను సైతము నవ్వుతూ వదిలివేస్తారు. ఏకలవ్యుడు, కబీరు మొదలుగాగల అనేక వుదాహరణలు, గురువుద్వారా గాక తమ శ్రద్ధద్వారా, గురువుచేత నీయబడిన శిక్షణ కంటే యెక్కువ విజ్ఞతను పొందవచ్చునని ప్రకటిస్తున్నాయి. రోగికి తన వచనములపై విశ్వాసాన్ని కలిగించి తన కోర్కెలకనుగుణంగా హిప్నోటిజమ్ ఆధారంగా పనులు చేయించగలముకదా!

తాంత్రికులు మంత్రసిద్ధి కొఱకై కఠోరసాధనలద్వారా తమ మనస్సులలో అపారశ్రద్ధను

సంపాదిస్తారు. సాధారణంగా మనస్సులో తాము జపించే మంత్రముపట్ల యెంత ప్రగాఢ విశ్వాసముంటుందో ఆ తాంత్రికునకు అంత శక్తివంతంగా ఆ మంత్రము పనిచేస్తుంది. శ్రద్ధాళువైన తాంత్రికుడు యే మంత్రంచే చమత్కార కార్యాన్ని చేసి చూపెడతాడో అశ్రద్ధాళువులకు ఆ మంత్రం వలన శత సంవత్సరములు ప్రయత్నించినప్పటికి ప్రయోజనము వుండదు. గాయత్రీమంత్ర విషయంలో గూడ యీ తథ్యము చాలావఱకు పనిచేస్తుంది. సాధకుడు శ్రద్ధ మఱియు విశ్వాసపూర్వక ఆరాధన యెప్పుడు చేస్తాడో అప్పుడు శబ్దవిజ్ఞానము, ఆత్మజ్ఞానము యొక్క సంయుక్తశక్తిచే గాయత్రీ ప్రభావము యింకా యెక్కువై అద్వితీయమైన శక్తి సంప్రాప్తిస్తుంది.

ప్రక్కనున్న పుటలోని చిత్రములో గాయత్రియొక్క ప్రత్యేక అక్షరమునకు ఏయే స్థానములతో సంబంధమున్నదో చూపబడినది. ఆ స్థలములపై ఏయే యోగగ్రంథి చక్రములున్నవో అవి యీ క్రింద తెలియజేయబడినవి.

అక్షరము గ్రంథిపేరు అందులో నిబిడీకృతమైవున్న శక్తి

1. తత్ - తాపిని - పరాక్రమము

2. స - సఫలత - సఫలత

3. వి - విశ్వా - రక్షణ, పోషణ, నిర్వహణ

4. తుర్ - తుష్టి - కల్యాణము

5. వ - వరదా - యోగము

6. రే - రేవతి - ప్రేమ

7. ణి - సూక్ష్మ - ధనము

8. య - జ్ఞానము - తేజస్సు

9. భర్ - భర్గా - రక్ష

10. గో - గోమతి - బుద్ధి

11. దే - దేవిక - ఆత్మనిగ్రహము, ఇంద్రియ నిగ్రహము

12. వ - వరాహి - నిష్ఠ

13. స్య - సింహిని - ధారణాశక్తి

14. ధీ - ధ్యానము - ప్రాణము

15. మ - మర్యాదా - సంయమనము

16. హి - స్ఫుటా - తపస్సు, వేడి

17. ధి - మేధా - దూరదర్శనము

18. యో - యోగమాయ - జాగృతి

19. యో - యోగిని - ఉత్పాదనశక్తి

20. నః - ధారిణి - శోభ, రసయుక్తమగుట

21. ప్ర- ప్రభవా - ఆదర్శము

22. చో - ఉష్మా - సాహసము

23. ద - దృశ్యా - వివేకము

24. యాత్ - నిరంజన్ - సేవా

పైన చెప్పబడిన 24 శక్తులను గాయత్రీ సాధకుని యందు జాగృత మొనర్చుతుంది. ఈ శక్తులను జాగృత మొనర్చడంతోపాటు అనేక విధములైన ప్రయోజనములు, సిద్ధులు, సంపదలు ప్రాప్తించుట ఆరంభమౌతుంది. ఇది గాయత్రీ మహత్వపూర్ణ గుణము.

ఈ ప్రయోజనము యితఱ దేవతల నారాధించినప్పటికి లభ్యమౌతుందని అనేకమంది భావిస్తారు. కారణమేమనగా వీరు తమ లోపల జరిగే సూక్ష్మతత్త్వముల ప్రగతిని పరిణితిని గుర్తించి తెలుసుకోలేకపోతున్నారు. తమ సాధనవలన ఏయే సూక్ష్మ ప్రక్రియలు జరుగుతున్నాయో తెలుసుకోగలిగితే, అప్పుడు తమకు లభ్యమయ్యే సర్వశక్తులు అనాయాసంగా యెచటనుండో దానంగా రాలేదని, ఆత్మవిద్యయొక్క సువ్యవస్థిత వైజ్ఞానిక ప్రక్రియద్వారా యిట్టి పరిణామము జరుగుతుందని గుర్తించుటకు ఆలశ్యము వుండదు. గాయత్రీ సాధన అంధవిశ్వాసము గాదు, సుదృఢమైన వైజ్ఞానిక కృత్యము. ప్రయోజనము సునిశ్చితము.

గాయత్రీయే కామధేనువు

సురలోకంలో దేవతలవద్ద కామధేనువు అనే గోవు వున్నదని పురాణాలలో వుల్లేఖించబడినది. ఆ గోవు అమృతోపమ క్షీరములనిస్తుందని, దేవతలు ఆ పాలను త్రాగి ఎల్లప్పుడు సంతుష్టితో ప్రసన్నులై, సుసంపన్నులై వుంటారని వ్రాయబడినది. ఎవరైనా తమ కోర్కెలు తీరుటకొఱకై కామధేనువు నాశ్రయిస్తే వారి కోర్కెలను సత్వరమే ఆ గోవు తీరుస్తుంది. ఇది ఆ గోవుయొక్క విశేషము. కల్పవృక్షములాగే కామధేనువుకూడ తనవద్దకు వచ్చినవారి మనోకామనలను పూర్తిచేస్తుంది.

గాయత్రి కూడ కామధేనువే. ఈ మహాశక్తిని, దేవతలుగాని, దివ్యస్వభావముగల మనుష్యులుగాని ఉపాసన చేస్తే వారు మాతృస్తనములనుండి మాదిరిగ ఆధ్యాత్మిక దుగ్ధధారలను త్రాగుతారు. వారికి యేవిధమైన కష్టము కలుగనేరదు. రాదు. ఆత్మ స్వతహాగా ఆనందస్వరూపమై యున్నది. ఆనందమగ్నమగుట ఆత్మయొక్క విశిష్టగుణము. దుఃఖములను తొలగించుకొని, అవి నాశనమైనంతనే ఆత్మ మూలస్వరూపాన్ని చేరుకుంటుంది. దేవతలు స్వర్గంలో యెల్లప్పుడూ ఆనందంతో వుంటారు. మానవులుగూడా తమ కష్టనివారణము జరిగినట్లయితే భూలోకంలో దేవత మాదిరిగా ఆనందంగా నుండగలరు. గాయత్రీ కామధేనువు మనుష్యుల కష్టములన్నింటిని నివారించుతుంది.

త్రివిధ దుఃఖముల నివారణ

సమస్త దుఃఖములకు కారణములు మూడు. 1. అజ్ఞానము, 2. అభావము, 3. అశక్తత. ఈ మూడు కారణములకు యెవరైనా కొంతదూరంలో సంచరించకలుగుతారో వారికి అంత సుఖము ప్రాప్తిస్తుంది.

అజ్ఞానమువలన మనుష్యుని దృష్టికోణము కళంకితమౌతుంది. అతనికి తత్త్వజ్ఞానముతో పరిచయము లేనందువలన అస్తవ్యస్థంగా ఆలోచిస్తాడు. అలాగే వ్యతిరేకంగా పనిచేస్తాడు. తదనుసారంగా సమస్యలు, చిక్కులు అధికమవుతాయి. దుఃఖములు సంక్రమించి దుఃఖిస్తాడు. స్వార్థము, భోగము, లోభము, అహంకారము, కాఠిన్యము, క్రోధ భావనలు మనుష్యుని కర్తవ్యచ్యుతుని చేస్తాయి. అతడు దూరదృష్టిని వదిలివేసి క్షణికము, క్షుద్రము, హీనమైన వాటినాలోచించి, వాటినే ఆచరిస్తాడు. తత్ఫలితంగా అతని ఆలోచనలు, కార్యములు, పాపభూయిష్టమౌతాయి. పాపములకు, నిశ్చయమైన పరిణామము దుఃఖముకాగా, అజ్ఞానవశంతో యితఁడుల సాంసారిక పోకడల మూలకారణము తెలుసుకోలేకపోతున్నాడు. ఫలితంగా అసంభవమైన ఆశలతోను, తృష్ణలతోను, కల్పనలతోను సతమతమవుతున్నాడు. ఈవిధమైన అపసవ్యదృష్టి వలన సాధారణమైనవిగూడా అతనికి దుఃఖకారక మవుతున్నాయి. అందువలననే అతడు రోదిస్తూ, దూషిస్తూ జీవిస్తాడు. ఆత్మీయుల మృతి, సాటివారి విలక్షణ స్వభావము, పరిస్థితులలో ఎగుడుదిగుడులు స్వాభావికము. అజ్ఞాని అటుల తలంపక, తాను కోరినవిధంగా సర్వమూ జరగాలని తలుస్తాడు. ప్రతికూలతనెప్పుడూ దరికి రాగూడదని కోరతాడు. ఇలాంటిది అసంభవము, ఆశకు వ్యతిరేకంగా జరిగినపుడు అతడు శోకిస్తాడు, కేకలువేస్తాడు.

మూడవదైన అజ్ఞానము కారణంగా అనేక పొరపాట్లు జరుగుతాయి. అవకాశములు సమీపంలో నున్నప్పటికీ వంచింపబడతాడు. ఇదికూడ దుఃఖహేతువే. ఈవిధంగా అజ్ఞానంవలన మనుష్యునకు అనేక దుఃఖములు సంప్రాప్తిస్తాయి.

అశక్తి అనగా నిర్బలత్వమని అర్థము. శారీరక, మానసిక, సామాజిక, బౌద్ధిక, ఆత్మిక నిర్బలత్వమువలన మనుష్యుడు తన స్వభావానికి అనుగుణ్యంగా, జన్మసిద్ధమైన అధికారభావాన్ని తన భుజస్కందములపై మోయడానికి అసమర్థుడవుతాడు. ఫలితంగా దానివలన వంచింపబడవలసి వుంటుంది. ఆరోగ్యము చెడిపోయినపుడు, వ్యాధి శరీరాన్ని పూర్తిగా ఆక్రమించినపుడు, స్వాధిష్టభోజనము, రూపవతి యైన తరుణి, మధురమైన గీతావాద్యము, సుందరదృశ్యములు నిరర్థకములు. ధనము, ఐశ్వర్యమువలన పొందగలిగిన సుఖములు నిష్ప్రయోజనములు.

బౌద్ధిక నిర్బలత్వమున్నప్పుడు సాహిత్య, కావ్య, వేదాంత మనన చింతనల రసస్ఫూర్తి కలుగదు. ఆత్మిక నిర్బలత్వమువలన సత్సంగము, ప్రేమ, భక్తివలన కలుగు ఆత్మానందము దుర్లభమవుతుంది. ఇదేకాదు ఉత్తముల రక్షణ అనేక ప్రకృతి సిద్ధాంతముల బలహీనతలను రూపుమాపే పనిచేస్తుంది. బలహీనులను బాధించటానికి, తొలగించటానికి అనేకమంది ముందుకొస్తారు.

నిర్దోషిత్వము, మంచిదనము, నిష్కాపట్యముగూడ నిర్బలునకు అనుకూలించవు. చలి బలవంతుని బలమును పెంచుతుంది, రసికులకు రసస్ఫూర్తినిస్తుంది. బలహీనులను నిమోనియా వ్యాధిగ్రస్తులను చేస్తుంది. ఏతత్త్వమైతే నిర్బలులకు ప్రాణఘాతకమౌతుందో, అదే తత్త్వము బలవంతులకు సహాయము చేస్తుంది. నిస్సహాయ నిర్బల మేషము అడవి జంతువులకు ఆహారంగా కావాలి. సింహాన్ని వన్యపశువులు తేరిపార చూడలేవు. గొప్పగొప్ప రాజులుకూడ తమ రాజ్య చిహ్నంగా నుంచుకొంటారు. శక్తిహీనుడు దుఃఖము పొందుతాడు. అతనికి మంచికూడా కోరినది సిద్ధించుటకు సహాయపడదు.

అభావజన్య దుఃఖమనగా పదార్థముల కొఱత. అన్నము, వస్త్రము, నీరు, గృహము, పశువులు, భూమి, సహాయకులు,స్నేహితులు, ధనము, ఔషధము, పుస్తకము, శాస్త్రములు, గురువు మొదలైనవి లభించకపోవడంవలన బాధలను, కష్టములను అనుభవించవలసివుంటుంది. ఆవశ్యకతలను విస్మరించవలసివస్తుంది. జీవితంలో అమూల్యక్షణాలు మట్టిలో కలసి నష్టపోవలసివుంటుంది.

యోగ్యుడు, సమర్థుడైన వ్యక్తిగూడ పరికరముల కొఱతవలన సిగ్గుపడవలసిన అనుభవము కలుగుతుంది. దానివలన దుఃఖము సంభవిస్తుంది.

గాయత్రి కామధేనువు. ఎవరైతే ఆ గాయత్రిని పూజిస్తారో, ఉపాసిస్తారో, ఆరాధిస్తారో, అభిభావన చేస్తారో వారు ఆ తల్లి అమృతోపమైన దుగ్ధములను గ్రోలి, ఆనందానుభూతిని పొందుతారు. సమస్త అజ్ఞానముల అశక్తుల అభావముల కారణంగా వచ్చిన కష్టములను విడచి మనోవాంఛాఫలములను పొందుతారు.

గాయత్రీ, బ్రహ్మల ఏకత్వము

గాయత్రీ స్వతంత్రమైన దేవిగాని, దేవతగాని కాదు. గాయత్రీ పరబ్రహ్మ పరమాత్మయొక్క క్రియాభాగము. బ్రహ్మ నిర్వికారుడు, అచింత్యుడు. బుద్ధికన్నా వేఱైనవాడు. సాక్షిరూపుడు. కాని తనకు క్రియాశీలచైతన్యశక్తి రూపమున్నందువలన ఉపాసనీయుడైనాడు. ఆ ఉపాసనవలన అభీష్టసిద్ధి ప్రాప్తిస్తుంది. ఈశ్వరభక్తి, ఈశ్వరోపాసన, బ్రహ్మసాధన, ఆత్మసాక్షాత్కారము, బ్రహ్మదర్శనము, ప్రభుపరాయణత మొదలైన పురుషవాచక శబ్దముల కే తాత్పర్యము, పుద్దేశ్యమున్నదో అదే గాయత్రీ ఉపాసన మొదలైన స్త్రీవాచక శబ్దములకూ వున్నది.

వస్తుతః గాయత్రీ ఉపాసన, ఈశ్వరోపాసనకు అత్యుత్తమమైన, సరళమైన శీఘ్రఫలప్రాప్తి నిచ్చు యేకైక మార్గము. ఈ మార్గమున పయనించు వ్యక్తి సురమ్యమైన జీవనోద్యానముగుండా ప్రయాణించి అంతిమ లక్ష్యమైన ఈశ్వరప్రాప్తిని పొందుతాడు. బ్రహ్మ-గాయత్రీల మధ్య శబ్దభేదమేగాని ఆ రెండూ ఒకటే. ఈ ఏకత్వానికి ప్రమాణము క్రింద యీయబడినది.

గాయత్రీ ఛన్దసామహమ్ - శ్రీమద్భగవద్గీత -10అ. శ్లో.35

అర్థము : వైదిక ఛందస్సులలో నేను గాయత్రీ ఛందస్సును.

భూర్భువః స్వరితి చైవ చతుర్వింశాక్షరార తథా ।

గాయత్రీ చతురోవేదా ఓంకారః సర్వమే వ తుః ॥ వృ-యో-యాజ్ఞ-2/66

భావము : భూర్భువః స్వః ఈ మూడింటిచే మహత్తరంగా వ్యాపించిన 24 అక్షరముల గాయత్రీ. నిస్సందేహంగా ఓంకార (బ్రహ్మ) స్వరూపమే.

దేవస్య సవితుర్యశ్య ధియో యోనః ప్రచోదయాత్ ।

భర్గో వరేణ్యం తద్బ్రహ్మ ధీమహీత్యథ ఉచ్యతే ॥

భావము : దివ్యతేజోబ్రహ్మను మనము ధ్యానిస్తున్నాము. దానివలన మన బుద్ధి సన్మార్గమువైపు ప్రేరేపింపబడుతుంది.

అథావదామి గాయత్రీం తత్త్వరూపాంతయీమయీమ్ ।

యయా ప్రకాశ్యతే బ్రహ్మ సచ్చిదానన్దలక్షణమ్ ॥ గాయ్కత్రీ తత్త్వము, శ్లో॥ 1

భావము : త్రివేదమయి, తత్త్వరూపిణి యగు గాయత్రీ వలననే సచ్చిదానంద లక్షణములతో బ్రహ్మ ప్రకాశిస్తున్నాడు. అనగా తెలియబడుచున్నాడు.

గాయత్రీ వా ఇదం సర్వమ్ ॥ నృసింహపూర్వతాపనీయోపనిషత్తు -412

భావము : సమస్తము గాయత్రీయే.

గాయత్రీ పరమాత్మా ॥ గాయత్రీ తంత్రము

భావము : గాయత్రీయే పరమాత్మ.

బ్రహ్మ గాయత్రీతి - బ్రహ్మ వై గాయత్రీ ॥ శతపథబ్రాహ్మణము 12/3/7, ఐతరేయబ్రాహ్మణము అ.27.ఖం.5

భావము : బ్రహ్మయే గాయత్రి, గాయత్రియే బ్రహ్మ.

సప్రభం సత్యమానందం హృదయే మణ్డలేఽపిచ ।

ధ్యాయజ్జపేత్తదిత్యేత న్నిష్కామో ముచ్యతేఽచిరాత్ ॥ విశ్వామిత్ర

భావము : ప్రకాశిత సచ్చిదానంద స్వరూప బ్రహ్మను హృదయమునందు మఱియు సూర్యమండలాంతర్గతునిగాను ధ్యానిస్తూ, నిష్కామంతో గాయత్రీమంత్రాన్ని జపించినయెడల శీఘ్రముగా సంసారపు జనన-మరణముల నుండి ముక్తుడౌతాడు.

ఓంకారస్తత్పరం బ్రహ్మ సావిత్రీ స్యాత్తదక్షరమ్ ॥ కూర్మపురాణం, ఉ.విభాగం. అ14/57

భావము : ఓంకారము పరబ్రహ్మ స్వరూపము. గాయత్రీకూడ అవినాశియగు బ్రహ్మయే.

గాయత్రీ తు పరం తత్త్వమ్ గాయత్రీ పరమాగతిః ॥ బృహత్పరాశరః సం.అ.35

భావము : గాయత్రియే పరమతత్త్వము. గాయత్రియే పరమాగతి.

సర్వాత్మా హి సా దేవీ సర్వభూతేషు సంస్థితా ।

గాయత్రీ మోక్షహేతుశ్చ మోక్షస్థానమ సంవయమ్ ॥ ఋష్యశృంగుడు

భావము : గాయత్రీదేవి సమస్త ప్రాణులలో ఆత్మరూపముగా వున్నది. గాయత్రీ మోక్షమునకు మూలకారణమైన సారూప్యముక్తికి స్థానము.

గాయత్రేవ పరో విష్ణుర్గాయత్రేవ పరః శివః ।

గాయత్రేవ పరో బ్రహ్మ గాయత్రేవ త్రయీతతః ॥ బృహత్సంధ్యాభాష్యము

భావము : గాయత్రీ ద్వితీయ విష్ణువు, శంకరుడు రెండవ గాయత్రీ, బ్రహ్మకూడ గాయత్రీ పరాయణుడే. ఏలనన గాయత్రీ త్రిమూర్తుల స్వరూపము.

గాయత్రీ పరదేవతేతి గదితా బ్రహ్మైవ చిద్రూపిణి ॥ గాయత్రీ పురశ్చరణ

భావము : గాయత్రీ పరమశ్రేష్ఠమైన దేవత, చిద్రూపిబ్రహ్మ యని చెప్పబడుతుంది.

గాయత్రి వా ఇదం సర్వభూతం యదిదం కిఞ్చ ॥ ఛాందోగ్యోపనిషత్తు

భావము : ఈ విశ్వ మంతయు యేదైయున్నదో ఆ సమస్తము గాయత్రీమయమే.

నభిన్నాం ప్రతిపద్యేత గాయత్రీం బ్రహ్మణా సహ ।

సోఽహమస్మీత్యుపాసీత విధినా యేన కేనచిత్ ॥

భావము : గాయత్రీ బ్రహ్మలకు భిన్నము లేదు. ఎవరైనా బ్రహ్మస్వరూపమైన గాయత్రీని యే రూపముతో ఉపాసించినప్పటికీ ఒకటే.

గాయత్రీ ప్రత్యగ్బ్రహ్మైక్యభోధికా ॥ శంకరభాష్యము

భావము : గాయత్రి అద్వైతబ్రహ్మను తెలుపు గురువు.

పరబ్రహ్మస్వరూపా చ నిర్వాణపదదాయినీ ।

బ్రహ్మతేజోమయీ శక్తిస్తదధిష్ఠాతు దేవతా ॥ దేవీభాగవతం స్కం. 6. అ. 1/42

భావము : గాయత్రీ మోక్షమిచ్చే పరమాత్మ స్వరూపము. బ్రహ్మతేజస్సహితశక్తి మంత్రాధిష్ఠాన దేవత.

గాయత్రాఖ్యం బ్రహ్మ గాయత్రనుగతం గాయత్రీ ముఖేనోక్తమ్ ॥ ఛాందోగ్య, శంకరభాష్యమ్ ప్రజ ఖం.12 మ.5

భావము : గాయత్రి స్వరూపమై, గాయత్రిచే ప్రకాశించు బ్రహ్మ, గాయత్రీ పేరుచే వర్ణింపబడుచున్నది.

ప్రణవవ్యాహృతిభ్యాఞ్చ గాయత్రా త్రితయేన చ ।

ఉపాస్యం పరమం బ్రహ్మ ఆత్మా యజ్ఞే ప్రతిష్ఠతః ॥ తారానాథ్ కృ.గా.వ్యా.పు. 25

భావము : ప్రణవ, వ్యాహృతి, గాయత్రీ యీ మూడిటితో పరంబ్రహ్మ నుపాసించవలె. ఆ బ్రహ్మలో ఆత్మ స్థిరంగానున్నది.

తే వా ఏతే పఞ్చ బ్రహ్మపురుషాః స్వర్గస్యలోకస్య ద్వారపాః స్పఏతానేవం పఞ్చ బ్రహ్మపురుషాన్ ॥

స్వర్గస్య లోకస్య ద్వారపాలన్వేద్యాస్య కులే వీరో జాయతే ప్రతిపద్యతే స్వర్గలోకమ్ ॥ ఛం 13/13/6

భావము : హృదయ చైతన్యజ్యోతి గాయత్రీరూప బ్రహ్మకు ప్రాణ, వ్యాన, అపాన, సమాన, ఉదానములనియెడి ఐదు ద్వారపాలకులు. వీరిని వశపఱచుకొంటే గాయత్రీ స్వరూపబ్రహ్మ ప్రాప్తిస్తుంది. ఉపాసించేవారికి స్వర్గలోకము సంప్రాప్తిస్తుంది. అట్టివారి వంశంలో వీరపుత్రుడుగాని, మహానుభావుడైన శిష్యుడుగాని జన్మిస్తారు.

భూమిరన్తరిక్షమ్ ద్యౌరిత్యష్టావక్షరాణ్యష్టాక్షరం హ వా ఏకం గాయత్రై పదమేతదు హైవాస్యా ఏతత్స యావదేషు త్రిషులోకేషుతావద్ధ జయతి యో2స్యా ఏతదేవం పదం వేద ॥

భావము : భూమి, అంతరిక్షము, ఉభయులు - ఈ మూడు గాయత్రీ ప్రథమ పాదములోని ఎనిమిది అక్షరములకు సమానము. ఒకవేళ గాయత్రీ ప్రథమపాదముమాత్రమే తెలిసికొంటే అతడు త్రిలోక విజయుడౌతాడు.

న వై నైవ రేమే తస్మాదేకాకి న రమతే సద్వితీయమైచ్ఛత్ సహైతావానాస ! యథా స్త్రీపున్మాసౌ సంపరిక్త్వౌ స । ఇమమేవాత్మాన ద్వేధా పాతయత్తతః పతిశ్చ పత్నీ చాభవతామ్ ॥ శక్తి ఉపనిషత్తు

భావము : అనగా బ్రహ్మ రమించలేకపోయినాడు. ఒంటరిగా యెవ్వఱూ రమించలేరు. ఆయన స్వరూపము స్త్రీ, పురుష సంయుక్త స్వరూపము. రెండవవారికొఱకు యిష్టపడ్డారు. తన సంయుక్త స్వరూపాన్ని రెండుగా చేశారా బ్రహ్మ. ఆ రెండు రూపములే పతి, పత్నీగా రూపొందినాయి.

నిర్గుణః పరమాత్మా తు త్వదాశ్రయతా స్థితః ॥

తస్య భట్టారికాసి త్వం భువనేశ్వరి! భోగదా ॥ శక్తి దర్శనము

భావము : పరమాత్మ నిర్గుణుడు. కానీ నీ ఆశ్రయముతో విశ్రమించి యున్నాడు. నీవే ఆయన సామ్రాజ్ఞివి. సుఖానుభవము నిచ్చుదానివి.

శక్తిశ్చ శక్తిమద్రూపాత్ దే వ్యతిరేకం న వాఞ్ఛతి ।

తాదాత్మ్యమనయో ర్నిత్యం వహ్నిదాహికయోరివ ॥

భావము : శక్తి, శక్తిమంతులకు భేదము లేదు. వహ్ని దాహకత్వములకు వలె (నిప్పుకు-కాల్చేశక్తికి ఐక్యమున్నటుల) శక్తి, శక్తిమంతులకు యెల్లప్పుడును ఐక్యమే వుండును.

సదైకత్వం న భేదోఽస్తి సర్వద్వై వ మమాస్య చ ।

యోఽసౌ సాహమహం యో సౌ భేదోఽస్తి మతిభ్రమాత్ ॥ దేవీ భాగవతము

భావము : నా శక్తికి, ఆ శక్తిమంతుడైన పురుషుడునకు ఎల్లప్పుడూ సంబంధమున్నది. తేడా యెప్పుడూ లేదు. ఆ పురుషుడేదో నేనూ అదే. నేనేదో ఆ పురుషుడుగూడ అదే. ఏదైనా వున్నట్లయిన అది బుద్ధి భ్రమయే.

జగన్మాతా చ ప్రకృతిః పురుషశ్చ జగత్పితా !

గరీయసీ జగతాం మాతా మాతా శతగుణిం పితుః ॥ బ్ర.వై.పు. కృ. 50

భావము : ఈ ప్రపంచానికి జన్మ నిచ్చింది ప్రకృతి. జగత్తును పాలించి పోషించునది పరుషుడు. వీరిద్దరు తల్లిదండ్రులు. ప్రపంచములో తల్లి, తండ్రి కంటె నూఱు రెట్లు గొప్ప శ్రేష్ఠమైనది.

పైన చెప్పబడిన ప్రమాణములవలన గాయత్రీయే బ్రహ్మ మనియు, ఆ దేవి ఉపాసన బ్రహ్మప్రాప్తికి సర్వోత్తమమైనదని స్పష్టమగుచున్నది.

గాయత్రీ ద్వారా సత్త్వగుణాభివృద్ధి యనే దివ్యమైన లాభము

గాయత్రీ సద్బుద్ధిదాయకమైన మంత్రము. సాధకుని మనస్సును, అంతఃకరణమును, మస్తిష్కమును, ఆలోచనలను సన్మార్గమువైపు ప్రేరేపిస్తుంది. సత్ తత్త్వమును వృద్ధిపొందించుట దాని ప్రధాన కార్యము. సాధకుడు గాయత్రీమంత్రార్థాన్ని తెలిసికోవటానికి ప్రారంభించినపుడు ప్రపంచములో సర్వోత్కృష్టమైన అభివృద్ధి, జీవితంలో ఉత్తమమైన ఫలితము, సద్బుద్ధి ప్రాప్తించినపుడే నని తెలుసుకుంటాడు. మంత్రాన్నిగురించి పూజ్య స్వభావము దృఢమైనపుడు సాధకుడు ఇచ్ఛాశక్తితో యిదే తత్త్వమును పొందటానికి వువ్విళ్ళూరుతాడు. ఈ కోరిక మనోలోకంలో ఒకవిధమైన స్పర్శను సృష్టించుతుంది. ఈ తీయని స్పర్శయొక్క ఆకర్షణశక్తిచే అఖిల ఆకాశతత్త్వములోని ఈథర్‌లో తిరుగుతున్న సత్త్వగుణపూరిత భావములన్నీ, ఆలోచనా ప్రక్రియలన్నీ, ప్రేరణలన్నీ మహత్తరంగా ఆకర్షింపబడటము ప్రారంభిస్తాయి. గహనమైన ఆలోచనాశక్తియొక్క విజ్ఞానము అందఱికి తెలిసినదే. ఒకే జాతికి సంబంధించిన ఆలోచనావిధానము ఆకాశమునుండి సజాతీయ ఆలోచనావిధానాన్ని తనవద్దకు ఆకర్షిస్తుంది. తత్ఫలితంగా మృతిచెందినా, జీవించియున్నా సత్పురుషులచే వ్యాపింపచేయబడిన శాశ్వత సత్సంకల్పాలు శూన్యంలో వృత్తాకారంలో తిరుగుతూవున్నవి. గాయత్రీ సాధకునివద్దకు దైవదత్తంగా అనాయాసంగా వచ్చిచేరుతాయి. అచట సంచిత మూలధనంవలె ఆ సత్సంకల్పాల భండారము తయారవుతుంది.

సత్త్వగుణ పరిమాణము శరీరములోను, మనస్సులోను అధికమౌతున్నప్పుడు వొనగూడే ఫలితాలు ఆశ్చర్యకరంగా వుంటాయి. స్థూలదృష్టితో చూసినపుడు ఫలితము తెలియబడదు. అనుభవానికి రాదు, దానియొక్క శక్తిని గుర్తించలేము. సూక్ష్మశరీర సంబంధ పరిజ్ఞానము కలవారికి మాత్రము తమస్సు, రజస్సుల సంఘటనలు, వాటిపై సత్త్వగుణపు ఆధిక్యత తెలుస్తుంది. శరీరంలో రోగము, మలము, విషము, విజాతీయ పదార్థాలుంటే యెట్టి దుష్పరిణామాలు వాటిల్లుతాయో అదే స్థానంలో శుద్ధమైన, సజీవమైన, పరిపుష్టమైన రక్తమునుండి వీర్యస్థానము అభివృద్ధిచెందితే యెంత సౌఖ్యంగా వుంటుందో, అంతే తేడా సత్త్వగుణమువలన చేకూరుతుంది.

ఈ పరిణామము తెరచిన కనులకు ప్రాయశః కనిపించకపోవచ్చు. కానీ సత్త్వగుణము ప్రసాదించే ఆరోగ్యము వున్నతంగా వుండుటలో యెలాంటి సందేహము లేదు. సత్త్వగుణ చమత్కార ప్రభావము ఆరోగ్యముపై వుంటుంది. ఈ ప్రయోజనము ఈశ్వరదత్తము అన్నంతమాత్రాన యే కష్టమూ కలుగదు. శరీరానికి కాయకల్పచికిత్స చేయడము వైజ్ఞానిక ప్రక్రియ. దానికి కారణము నిశ్చయమైన ప్రయోజనము లభించుటయే. ఈ ప్రయోజనము దైవికమా లేక మానవీయమా యని భేదాభిప్రాయములు కలుగవచ్చు. దానికంత గొప్పదనము లేదు.

గాయత్రీద్వారా సత్త్వగుణము అభివృద్ధి చెందుతుంది. నిమ్న భావనలు, తత్త్వములు నివారింపబడతాయి. తత్ఫలితంగా సాధకునకు సూక్ష్మమైన కాయకల్పచికిత్స జరుగుతుంది. ఈ ప్రక్రియద్వారా జరిగే ప్రయోజనములు వైజ్ఞానికమా లేక దైవదత్తమా? ఈ ప్రశ్నపై కలహించుట నిష్ప్రయోజనము. రెండూ ఒకటే. ఏ కార్యమైనాసరే ఏవిధంగా జరిగినప్పటికి ఈశ్వరశక్తి కంటే వేఱుగా కాదు. అందువలన యీ ప్రపంచములోనన్ని కార్యాలు ఈశ్వరేచ్ఛ వలననే జరుగుతాయంటారు. గాయత్రీవలన సమకూరే లాభాలు వైజ్ఞానికాధారంపై ప్రాప్తించాయనవచ్చు. ఈశ్వరకృపవలననిగూడ అనవచ్చు. దోషమేమియు లేదు.

శరీరంలో సత్త్వగుణాభివృద్ధి జరుగుచున్నప్పుడు శరీర చర్య గమనంలో తీవ్రసంచలనము జరుగుతుంది. ఇంద్రియముల భోగలాలసత మందగిస్తుంది. అన్నపాన పారాయణత్వము, వివిధ స్వాధు పదార్థములను ఆరగించవలెననే ఆకాంక్ష, వెంటవెంటనే తినాలనే కోరిక, ఎక్కువ పరిమాణంలో తినడము, భక్ష్యము, అభక్ష్యము అనే వివక్షత లేకపోవడము, సాత్త్విక పదార్థములయందు రుచిలేకపోవుట, తిండిపోతుతనము, తీపి వస్తువులయందు, కఠినపు, కారపు వస్తువులయందు ప్రీతి క్రమక్రమంగా తగ్గుతుంది.

తేలికగానుండి సుపాచ్యమై, సరసమైన సాత్త్వికభోజనము వలన అతనికి తృప్తి కలుగుతుంది. మఱియు రాజస, తామస పదార్థముల యందు విముఖత యేర్పడుతుంది. ఈవిధంగా విచారమువలన కామేంద్రియముల వుత్తేజము సంయమనము చెందుతుంది. ఈ మార్గములో వ్యభిచారానికి అలవాటుపడిన వాసనామనస్సు నెమ్మదిస్తుంది. బ్రహ్మచర్యమునందు శ్రద్ధ యినుమడిస్తుంది. ఫలస్వరూపంగా వీర్యరక్షణకు మార్గము ప్రాముఖ్యత నొందుతుంది. కామేంద్రియము, స్వాదేంద్రియములు ప్రధానమైన ఇంద్రియాలు. ఆ ఇంద్రియాల నియమము శరీరరక్షణకు, ఆరోగ్యరక్షణకు ప్రధాన హేతువులు. వీటి నిగ్రహంతోపాటు పరిశ్రమ, స్నానము, నిద్ర, పరుండుట, మేల్కొనుట, శుభ్రత, సాధారణ జీవితము మరియు దినచర్యలో సత్త్వగుణ మున్నది. ఈ కారణము వలన ఆరోగ్యము, దీర్ఘాయువు, బలవృద్ధి లభిస్తాయి.

మానసికక్షేత్రంలో సత్త్వగుణాభివృద్ధివలన కామ,మోహ, లోభ,మద, మాత్సర్యములు, స్వార్థము, వ్యసనములు, వ్యభిచారము, కపటము, అబద్ధము,విచారము, భయము, శోకము, నికృష్టమైన కసవుకు సమానమైన దోషములు ఉపశమించుతాయి. వీటి వుద్భవము తగ్గినందువలన సంయమనము, నియమము, త్యాగము, నిరాలస్యము, శౌర్యము, వివేకము, సాహసము, ధైర్యము, దయ, ప్రేమ, సేవ, ఉదారత, కర్తవ్యపరాయణత, ఆస్తికత మొదలైన సద్గుణములు అభివృద్ధి చెందడము ప్రారంభిస్తాయి. ఈ మానసిక కాయల్పచికిత్స పరిణామంగా నిత్యమూ సంభవించే అనేక దుఃఖములు సహజంగా తగ్గుతాయి. ఇంద్రియనిగ్రహము లేనందున మఱియు దినచర్య కారణంగా శరీర రోగాలు తగ్గవు. వివేకము జాగృతమైనవెంటనే అజ్ఞానజన్యచింత, శోకము, భయము, కుశంక, మమత, హాని మొదలైన దుః ఖములనుండి విముక్తి లభిస్తుంది. పరమేశ్వరునిపై విశ్వాసమువలన మనస్సు స్థిరత్వము నొందుతుంది. భావిజీవనము గురించి నిశ్చింత కలుగుతుంది. ధర్మప్రవృత్తివలన పాపము, అన్యాయము కలుగనేరవు. ఫలస్వరూపంగా రాజదండన, సమాజదండన, ఆత్మదండన మఱియు దైవదండనలచే తగిలిన గాయములవలన పీడన బాధ వుండవు. సేవ, నమ్రత, ఉదారత, దానము, నిజాయితీ, లోకహితము మొదలైన గుణములచే యితఋలకు లాభము కలుగుతుంది.

చెరుపు కలుగుతుందనే శంక వుండదు. అందువలన బహుశః అందఱు కృతజ్ఞులవుతారు. ప్రశంసిస్తారు. సహాయకులు, భక్తులై సహాయపడతారు. పారస్పరిక సద్భావనల పరివర్తనమువలన ఆత్మతృప్తి కారకమగు ప్రేమ, సంతోషములు దినదినాభివృద్ధినొంది జీవితాన్ని ఆనందమయము చేస్తాయి. ఈ ప్రకారంగా శారీరక, మానసిక క్షేత్రములయందు సత్త్వగుణాభివృద్ధి జరిగినందువలన ఇరువైపుల ఆనందప్రవాహము పొంగిపొరలుతుంది. గాయత్రీ సాధకు డందులో నిమగ్నుడై ఆత్మసంతోషపు పరమానంద రసాస్వాదన చేస్తాడు.

ఆత్మ ఈశ్వరాంశయైనందువలన, ఈశ్వరశక్తులు బీజరూపంలో అంతర్గతంగా దాగివుంటాయి. ఈ శక్తులు నిద్రావస్థలో వుంటాయి. మానసికతాపమువలన, విషయవికారములవలన, దోషనిర్గుణ ఛాయవలన అణగివుండి, అజ్ఞానరూపంలో పడివుంటాయి. మానవులు తాము దీనులమని, అశక్తులమని, హీనులమని భావిస్తారు. కానీ సాధకుడు మనోవికారములనే ఆచ్ఛాదనను తొలగించి, నిర్మలమైన ఆత్మజ్యోతిని దర్శించుటకు సమర్థుడైనపుడు, సర్వశక్తివంతమైన ఈశ్వరీయజ్యోతి తన ఆత్మయందే వున్నదని గ్రహించి, తాను పరమాత్మకు నిజమైన ఉత్తరాధికారినని తెలుసుకుంటాడు. అగ్నిని ఆవరించిన నివురును తొలగించిన వెంటనే తుచ్ఛ మనుష్యుడు మహాత్మగా అవుతాడు. ఎందుకనగా ఆత్మయందు అనేక జ్ఞానవిజ్ఞాన సాధారణ, అసాధారణ, అద్భుతమైన, ఆశ్చర్యకరమైన శక్తిభాండారము నిక్షిప్తమై యున్నది. అది బహిర్గతమైన వెంటనే అతడు సిద్ధియోగిరూపంలో గోచరించుతాడు. సిద్ధులు సిద్ధించటానికి బయటనుండి యేదో కొంచెము తీసుకురానక్కఱ్లేదు. దేవదానవుల కృప అవసరము లేదు. కేవలము అంతఃకరణముపైనున్న ఆవరణలను తొలగించవలసి వుంటుంది. గాయత్రీ సత్త్వగుణ సాధనాసూర్యుడు, తామస అంధకారాన్ని తొలగించుతాడు. ఆత్మయొక్క సహజ ఈశ్వరీయ రూపము ప్రకటింపబడుతుంది. ఆత్మయొక్క ఈ నిర్మల స్వరూపము అన్ని వృద్ధి, సిద్ధులతో పరిపూర్ణమై వుంటుంది. గాయత్రీద్వారా కలిగిన సద్గుణాభివృద్ధి అనేకమైన ఆధ్యాత్మిక, సాంసారిక సమృద్ధికి మాతృదేవి. శారీరక, మానసిక నిర్మలత్వము సాంసారిక జీవనమును అనేకరీతుల సుఖశాంతిమయము చేస్తుంది. ఆత్మయందు వివేకము, ఆత్మబలాభివృద్ధి అధికమైనపుడు యితఱులకు సర్వసదృశంగా గోచరించే కష్టములు చాల స్వల్పముగా, తేలికగా వుంటాయి. ఆ వ్యక్తియొక్క యే కార్యమైనా ఆగదు. లేక అతని యిచ్ఛానుసారము పరిస్థితులు మారుతాయి లేక పరిస్థితుల కనుగుణ్యంగా అతని యిచ్ఛ పరివర్తన చెందుతుంది. క్లేశ కారణము ఇచ్ఛ, పరిస్థితుల మధ్య ప్రతికూలత, వివేకవంతుడు ఈ రెంటిలో ఒకదాన్ని తనదిగా జేసికొని సంఘర్షణను అధిగమిస్తాడు. అతనికి ఈ పృథ్వియందే స్వర్గీయానందము మధురంగా ప్రవహిస్తుంది. సుఖవంతమైన జీవనము అనుభవిస్తాడు.

వాస్తవంగా సుఖము, ఆనందముల ఆధారము వేఱే బయటనుండి వచ్చే సాధనా సామగ్రి కాదు. మానవ మనః స్థితిపై ఆధారపడి వుంటాయి. మనోసాధనచే, ఒకానొక సమయంలో రాజసభోజనంతోను, మెత్తటి సిల్కుతో కప్పబడిన శయ్యతోగూడ సంతృప్తి చెందని వ్యక్తి, మహాత్ముడైన సన్యాసిచే ఉపదేశింపబడి, త్యాగాన్ని, సన్యాసవ్రతాన్ని స్వీకరించి అరణ్యములోని భూమినే అన్నింటికంటే ఉత్తమమైన శయ్యగాను, వనములలో దొరికే కందమూలములే సర్వోత్తమమైన ఆహారంగా గ్రహిస్తాడు. ఇదంతా అంతర్గతమైన మనోభావములు, ఆలోచనావిధానంలోను మార్పువచ్చినందువలననే సంభవిస్తుంది. గాయత్రీ బుద్ధికి అధిష్ఠాత్రియైన దేవి. ఆమెనుండి మనము సద్బుద్ధిని యాచిస్తాము. అందువలన

గాయత్రీ ఉపాసనా ఫలితంగా, మన ఆలోచనాపంథా వున్నతంగా పరిఢవిల్లితే మానవ జీవితపు వాస్తవికతను గుర్తించి, మనము వర్తమానస్థితియందే ఆనందానుభవము పొందినయెడల అది అసంభవము కాదు.

చాలాకాలంగా మేము గాయత్రీ ఉపాసన ప్రచారము చేయుచున్నాము. అందువలన అనేకమంది సాధకులతో మాకు పరిచయమున్నది. వేలమంది వ్యక్తులు మానుండి యీ దిశలో మార్గము తెలిసికొని ప్రోత్సహింపబడినారు. ఇందులో దృఢమైన సాధనామార్గము అవలంబించినవారిలో అనేకులు ఆశ్చర్యజనక ప్రయోజనములను పొందారు. ఈ ప్రయోజనములను వారు గాయత్రీదేవి వరప్రసాదంగా భావించారు. వారు గాయత్రీ సూక్ష్మ వివేచనను గ్రహించాలను కోర్కె లేకుండానే, కొన్ని వైజ్ఞానిక నియమములతో సాధన శ్రమచే మామూలు సాధారణమైన ఫలితాలను పొందారు. ఈ వివేచన వారికి ప్రాయశః అరుచిగా నుండవచ్చును. భగవతి గాయత్రి కృపకు ప్రతిగా కృతజ్ఞతయే మాయొక్క భక్తిభావనలను పెంపొందింపజేస్తుందని వారు వక్కాణిస్తారు. అందులో మాకు అధిక ప్రయోజనము వుందంటారు. వారి అభిప్రాయము చాలా పరిమితంగా నిజమే. శ్రద్ధాభక్తులు యినుమడించటానికి యిష్టదేవతా సాధనా స్వరూపమునందు అచంచలమైన ప్రేమ, కృతజ్ఞత, భక్తి, తన్మయత్వము వుండుట అవసరము. గాయత్రీ సాధనద్వారా విజ్ఞాన సమ్మతమైన పద్ధతివలన ప్రయోజనము సంభవిస్తుంది. దీనిని గుర్తించి, దీని మహాతత్త్వమువలన ఆత్మసంబంధమైన దృఢత్వము పొందుటకు, గాయత్రీ యందు కృతజ్ఞత, భక్తిభావనాపాత్రను అధికాధికంగా కలిగియుండుట అవసరము.

గాయత్రీ ఉపాసన ద్వారా అనేకులకు అనేకవిధాలుగా మేలు చేకూరినది. వారు చెప్పిన జ్ఞాపకాలు నా మనోఫలకంపై యింకా వున్నాయి. వాటిలో కొన్నింటిని వచ్చే పుటలలో యివ్వదలంచాను. ఈ పంక్తులద్వారా పాఠకులు అదే మార్గము ననుసరించి లాభాన్వితులవుతారని ప్రయత్నము చేయబడినది.

మహాపురుషుల ద్వారా గాయత్రీ కీర్తింపబడుట

హిందూధర్మంలో అనేకమైన గౌరవింపదగినవి ప్రాచుర్యంలో నున్నవి. అనేక విషయాలలో పరస్పర సిద్ధాంత సంబంధమైన భేదములున్నవి. కాని గాయత్రీ మంత్ర మహిమకు సంబంధించినంతవఱకు అందఱూ అన్ని సాంప్రదాయాలవారూ, ఋషు లందఱూ ఒకే తత్త్వముతో ఒకే అభిప్రాయమును కలిగియున్నారు.

అథర్వణవేదము 16.1.17లో గాయత్రీ స్తోత్రమున్నది. అందులో గాయత్రీ ఆయుష్షు, ప్రాణము, శక్తి, కీర్తి, ధనము మఱియు బ్రహ్మతేజస్సును సాధించునదిగా చెప్పబడినది.

విశ్వామిత్ర మహర్షి 'గాయత్రిమంత్రానికి సమానమైన మంత్రము నాలుగు వేదములలో లేదు. చతుర్వేదములన్నీ యజ్ఞ, దాన, తపస్సులు గాయత్రీ మంత్రపు ఒక కళకు కూడ సమానము కాదు' అని వ్రాకృచ్చారు.

భగవాన్ మనువు ఈవిధంగా వచించారు :

బ్రహ్మదేవుడు మూడు వేదముల సారాన్ని, గాయత్రీ మంత్రములోని మూడు పాదములుగా పొందుపరఱచాడు. మనుష్యుని పవిత్రము చేయటానికి గాయత్రీమంత్రముకన్న వేఱేది లేదు. ఏ వ్యక్తి అయినా మూడు సంవత్సరములు నియమంగా గాయత్రీ జపించినయెడల ఈశ్వరప్రాప్తి కలుగుతుంది. ద్విజులు ద్విసంధ్యలయందు గాయత్రీ జపిస్తే, వేదపఠన ఫలప్రాప్తిని పొందుతారు. ఇతఱ సాధనలు చేసినా, చేయకపోయినా కేవలము గాయత్రీ జపమువలనను సిద్ధి పొందగలరు. నిత్యమూ సహస్రగాయత్రీ చేయు వ్యక్తి పాపములనుండి, పాము కుబుసమునుండి విడివడినట్లు విముక్తుడౌతాడు. గాయత్రీ జపించని ద్విజడు నిందాపాత్రుడు.

యోగరాజు యాజ్ఞవల్క్యుడు యీవిధంగా భావించాడు :

గాయత్రీ మఱియు సమస్త మంత్రములు ఒక త్రాసులో తూయబడినవి. ఒకవైపు షడంగసహిత వేదములు, రెండవవైపు గాయత్రీ వుంచబడినపుడు, గాయత్రీ వైపు పళ్ళెము బరువుగా వున్నది. వేదముల సారము ఉపనిషత్తులు, ఉపనిషత్సారము, గాయత్రీ యొక్క గౌరవము. గాయత్రీ సర్వలోక జనని, పాపవినాశని. ఈ మంత్రముకన్నా అధికంగా పవిత్రమొనర్చే మంత్రము స్వర్గ, మర్త్యలోకములలో లేదు. గాయత్రీ మంత్రార్థము తెలిసిన వ్యక్తికి సమస్తవిద్యలూ కరతలామలకంగా తెలుస్తాయి. శుభప్రదమైన శ్రోత్రియుడౌతాడు. ద్విజుడు గాయత్రీ పారాయణుడు కానపుడు వేదవేదాంగాపారంగతుడైనప్పటికి శూద్ర సమానుడే. అతడు చేసే యితఱ శ్రమలన్నీ వ్యర్థమే. గాయత్రిని తెలియని వ్యక్తి బ్రాహ్మణత్వమునుండి చ్యుతుడై, పాపయుక్తుడౌతాడు.

పరాశరమహర్షి ఈవిధంగా నుడివారు :

సమస్త జప శ్లోకాలలోను, వేదమంత్రాలలోను, గాయత్రీమంత్రము పరమశ్రేష్ఠము. వేదము, గాయత్రీ రెండు త్రాసులో నుంచితే గాయత్రీ పళ్ళెము బరువుగా నున్నది. భక్తిపూర్వకంగా గాయత్రీమంత్రాన్ని జపించే వ్యక్తి ముక్తుడై పవిత్రుడౌతాడు. వేద, శాస్త్ర, పురాణేతిహాసాలు చదివినప్పటికి గాయత్రీ హీనుడయినపుడు బ్రాహ్మణుడుగా గుర్తించరాదు.

శంఖఋషి ప్రకారము :

నరకరూప సముద్రంలోపడి మునిగిపోతున్న వ్యక్తికి, చేతిని ఆసరాగానిచ్చి రక్షించునది గాయత్రీయే. గాయత్రీమంత్రముకన్నా వుత్తమమైన వస్తువు స్వర్గంలోగాని, పృథ్విలోగాని లేదు. గాయత్రీని తెలుసుకున్న వ్యక్తి నిస్సందేహంగా స్వర్గమును పొందుతాడు.

శౌనకఋషి అభిప్రాయము :

ఇతఱ ఉపాసనలు చేసినా, చేయకపోయినా కేవలము గాయత్రీజపముచే ద్విజుడు జీవన్ముక్తుడౌతాడు. సాంసారిక పారలౌకిక సమస్త సుఖములను అనుభవిస్తాడు. సంకటసమయములలో పదివేలు గాయత్రీ జపించినచో విపత్తులు నివారింపబడతాయి.

అత్రిముని కథనము ప్రకారము :

గాయత్రీ ఆత్మను మిక్కిలి శోధించే మంత్రము. ఈ మంత్ర ప్రభావమువలన కఠినమైన దోషములు, దుర్గుణాలు పరిమార్జింపబడతాయి. గాయత్రీ తత్వాన్ని పూర్తిగా గ్రహించిన వ్యక్తికి ప్రపంచములో అనుభవించవలసిన సుఖశేషమేదియు నుండదు. అనగా అన్ని సుఖములు అనుభవించుతాడు.

వ్యాసమహర్షి ఈవిధంగా ప్రవచించారు :

ఏ ప్రకారంగా పుష్పసారము తేనె, క్షీరసారము ఘృతమో; అదే ప్రకారము సమస్త వేదముల సారము గాయత్రీ. సిద్ధిపొందబడిన గాయత్రీ కామధేనువునకు సమానము. గాయత్రీ నియమంగా జపిస్తే కొంతకాలమున కా మంత్రము సిద్ధిస్తుంది. అటుల సిద్ధి పొందబడిన గాయత్రి. గంగ శరీరమునకు ప్రాప్తించు పాపములను పోగొట్టునటుల నిర్మలము చేస్తుంది. గాయత్రీ రూపమైన బ్రహ్మ గంగవలన ఆత్మ పవిత్రమౌతుంది. గాయత్రిని వదలి యితఱ ఉపాసన లెవరైతే చేస్తారో, వారు పక్వసిద్ధాన్నమును వదలి భిక్షమెత్తువానికి సమానము. కార్య సఫలత, తపోవృద్ధికొఱకు గాయత్రికన్నా శ్రేష్ఠమైనది లేదు.

భారద్వాజఋషి ఇలా వక్కాణించారు :

బ్రహ్మాదిదేవతలు గాయత్రిని జపిస్తారు. అది బ్రహ్మసాక్షాత్కారము గావిస్తుంది. అనుచిత కార్యము లొనరించేవారి దుర్గుణములు గాయత్రి కారణమువలన నివారింపబడతాయి. గాయత్రి రహితమైన వ్యక్తి శూద్రునికన్నా అపవిత్రుడు.

చరకఋషి యిటుల వుటంకించారు :

బ్రహ్మచర్యము నవలంబిస్తూ గాయత్రి నెవఱు ఉపాసన చేస్తారో మఱియు తాజాఫలములను సేవిస్తారో వారు దీర్ఘాయువులౌతారు.

నారదమహర్షి యిటుల వుటంకించారు :

గాయత్రి భక్తియొక్క స్వరూపము. ఎచట భక్తిరూపమైన గాయత్రీ వున్నదో అచట శ్రీమన్నారాయణుడు నివశిస్తాడు. ఇందులో ఏమాత్రము సందేహము లేదు.

వశిష్ఠమహర్షి యిలా వ్రాక్కుచ్చారు :

మందమతి, కుమార్గగామి, అస్థిరమతి గూడ గాయత్రీ ప్రభావంచే వున్నతమైన పదవిని పొందుతాడు. మరల సద్గతిని పొందుతాడు. ఇది నిశ్చయము. ఎవరైతే పవిత్రతతో, స్థిరత్వంతో గాయత్రిని ఉపాసిస్తారో వారు ఆత్మలాభమును పొందుతారు.

పైన చెప్పబడిన అభిప్రాయములను క్రోడీకరిస్తే, బహుశః అందఱు ఋషులు ఒకటే అభిప్రాయమును కలిగివున్నారు. దీనివలన స్పష్టమౌతున్న దేమనగా ఏ ఋషి అయినా యితఱ విషయములలో భిన్న భావములు, భిన్న సాంప్రదాయములు కలిగివుండవచ్చు. కానీ గాయత్రీ విషయములో మాత్రము అందఱూ సమానమైన శ్రద్ధ కలిగి తమ తమ ఉపాసనలలో గాయత్రీ మంత్రానికి ప్రథమ స్థానమిచ్చారు. శాస్త్రములలో ధర్మగ్రంథములలో, స్మృతులలో, పురాణాలలో గాయత్రీ మహిమను గురించి, అలాగే సాధన విషయములో కాంతి విరజిల్లే వేలకొలది శ్లోకములు నిండివున్నాయి.

వర్తమానకాలంలో ఆధ్యాత్మికులు, వేదాంతులు కూడ గాయత్రీ మంత్రాన్ని ప్రాచీనకాలంలో తత్త్వదర్శకులైన ఋషులు స్వీకరించినట్లే అంగీకరించినారు. ప్రస్తుత యుగము బుద్ధి, తర్క ప్రత్యక్షయుగము. ఈ శతాబ్దంలోని ప్రభావశాలురైన గణతికెక్కిన వ్యక్తుల ఆలోచనావిధానంలో ధర్మగ్రంథములపైగాని, పరంపరపైగాని ఆధారపడరు. వారు బుద్ధివాదానికి, తర్కానికి, ప్రత్యక్షవాదానికి తమ అన్ని కార్యములలో ప్రధాన స్థానాన్నిచ్చారు. అట్టి మహాపురుషులు గూడ గాయత్రీ తత్త్వాన్ని అన్ని దృష్టికోణములనుండి శోధించి, పరిశీలించి స్వచ్ఛమైన సువర్ణముగా భావించారు. క్రింద వాటిలో నుండి కొన్ని అభిప్రాయము లీయబడినవి.

మహాత్మాగాంధీగారు యిలా అన్నారు :

గాయత్రీమంత్రపు నిరంతరజపము రోగుల రోగనివారణకు మఱియు ఆత్మోన్నతికి వుపయోగకారి. స్థిర హృదయంతోను, శాంతితోను చేయబడిన గాయత్రీజపము ఆపదకాలంలో కష్టములనుండి గట్టెక్కడానికి ప్రభావము కలిగియున్నది.

లోకమాన్య తిలక్‌గారు యిలా నుడివారు :

భారతీయ ప్రజల బహుముఖదాస్యశృంఖలాలనుండి విముక్తి పొందాలంటే కేవలము రాజనైతిక సంఘర్షణ చేసినంతమాత్రాన సరిపోదు. దానికొఱకు అంతరాత్మలో ప్రకాశముత్పన్నమవ్వాలి. సత్, అసత్తుల వివేకము కావాలి. కుమార్గాన్ని వదలి శ్రేష్ఠమార్గాన్ననుసరించేందుకు ప్రేరణ ప్రాప్తించాలి. గాయత్రీమంత్రంలో యీ భావన సిద్ధంగా నున్నది.

మహామనీషి మదనమోహన మాలవ్యా ఈవిధంగా వుటంకించారు :

ఋషులు మన కిచ్చిన అమూల్యరత్నములలో గాయత్రీ ఒక అనుపమ రత్నము. గాయత్రీవలన బుద్ధి పవిత్ర మౌతుంది. ఈశ్వరప్రకాశము ఆత్మయందు మూర్తీభవిస్తుంది. ఈ ప్రకాశమువలన అసంఖ్యాకమైన వ్యక్తులకు త్రాణ

లభించింది. గాయత్రీలో ఈశ్వరపరాయణతా భావాన్ని వుత్పన్నము చేసే శక్తి గలదు. దీనితోపాటు భౌతిక అభావములను పోగొడుతుంది. గాయత్రీ ఉపాసన బ్రాహ్మణుల కత్యంతావశ్యకము. గాయత్రీ జపమొనరించని బ్రాహ్మణుడు తన కర్తవ్యాన్ని విడనాడిన అపరాధి అవుతాడు.

కవీంద్రుడైన రవీంద్రులు యిటుల పలికారు :

భారతవర్షాన్ని మేల్కొల్పగల మంత్రమెంత సరళమైనదనగా, ఒకే ఒక శ్వాసలో దాని నుచ్చరించవచ్చు. అదియే గాయత్రీమంత్రము. ఈ గాయత్రీ మంత్రాన్ని అభ్యసించినందున తార్కిక అపోహలు, అభిప్రాయభేదములు, ఎటువంటి కలహములకు, చిక్కులకు ఆపదలకు అవకాశము వుండదు.

అరవిందయోగులు ఇలా అన్నారు :

ఆయన అనేకచోట్ల గాయత్రీ జపము చేయవలెనని నిర్దేశించారు. మహత్వపూర్ణమైన కార్యములను చేయగలశక్తి గాయత్రీమంత్రములో నున్నదన్నారు. అనేకమందికి వారు సాధనాపద్ధతిలో గాయత్రీ జపాన్ని వుపదేశించారు.

స్వామి శ్రీరామకృష్ణపరమహంస ఉపదేశ ప్రకారము :

' నేను ప్రజలకు చెప్పున దేమనగా దీర్ఘసాధనల అవసరము లేదు. చిన్నదైన గాయత్రీ సాధన చేసి చూడు. గాయత్రీజపమువలన పెద్దపెద్ద సిద్ధులు చేకూరుతాయి. మంత్రము చిన్నదే కానీ దీని శక్తి అమోఘము. '

స్వామి వివేకానంద కథనము ప్రకారము :

రాజునుండి యేదైనా వస్తువు కోరేటప్పుడు తన గౌరవానికి అనుకూలమైనదై వుండాలి. పరమాత్మనుండి కోరదగిన యోగ్యమైనది సద్బుద్ధియే. పరమాత్మ యెవతియందు ప్రసన్నుడౌతాడో వానికి సద్బుద్ధిని ప్రసాదిస్తాడు. సద్బుద్ధివలన సత్యమైన మార్గములో ప్రగతి చేకూరుతుంది. సత్కర్మవలన అన్నివిధముల సౌఖ్యము ఒనగూడుతుంది. సత్యమార్గములో పయనించి ముందుకు సాగేవారి కెలాంటి సుఖములకు కొదువ వుండదు. గాయత్రీ సద్బుద్ధి మంత్రము. అందువలన గాయత్రీమంత్రము అన్ని మంత్రములలోకెల్ల మకుటమణిగా పేర్కొనబడినది.

జగద్గురు శంకరాచార్యుల కథనము ప్రకారము :

గాయత్రీ మహిమను వర్ణించుట మానవ సామర్థ్యానికి అతీతము. సద్బుద్ధిని కలిగివుండటము యెంత బృహత్కార్యమనగా దానికి సమానమైనదీ ప్రపంచములో దేనివలనగూడ సంభవము కాజాలదు. ఆత్మ ప్రాప్తి లభించుటకు కావలసిన దివ్యదృష్టి యే బుద్ధితో సంప్రాప్తిస్తుందో, దానికి ప్రేరణ గాయత్రీవలన జరుగుతుంది. గాయత్రీ ఆదిమంత్రము. దాని అవసరము పాపములను నివారించుటకు, పుణ్యములను అభివృద్ధి పఱచుటకైయున్నది.

స్వామి రామతీర్థ యిలా అన్నారు :

రాముని పొందుట సర్వోత్కృష్టమైన కార్యము. గాయత్రీ వుద్దేశ్యము కామరుచిని విడనాడి రామరుచి యందు లగ్నమగుట. ఎవరి బుద్ధి పవిత్రమో వారే రాముని పొందగలరు. బుద్ధి యెంత పవిత్రంగా వుండాలని గాయత్రీ నిర్దేశిస్తుందంటే అతడు రాముని, కామముకంటే శ్రేష్ఠమని గ్రహించాలి.

రమణమహర్షి యిలా వుపదేశించారు :

యోగవిద్యకు అంతర్గతమైన మంత్రవిద్య ప్రచండమైనది. మంత్రముల శక్తిచే అద్భుతమైన ఫలితాలు లభించుతాయి. గాయత్రీ మంత్రమెలాంటిదంటే దానివలన ఆధ్యాత్మిక, భౌతిక లాభాలు రెండూ ఒనగూడుతాయి.

స్వామి శివానంద ఇటుల వచించారు :

బ్రహ్మముహూర్తంలో గాయత్రీ జపిస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. హృదయము నిర్మలమౌతుంది. శరీరము రోగరహితమౌతుంది. నమ్రతా స్వభావము బలపడుతుంది. బుద్ధి సూక్ష్మత కలుతుగుతంది. అందువలన దూరదృష్టి అధికమవుతుంది. స్మరణశక్తి వికసిస్తుంది. కఠిన సమయాలలో గాయత్రీద్వారా దైవీ సహాయము లభిస్తుంది. గాయత్రీ ద్వారా ఆత్మదర్శనము కలుగుతుంది.

బాబా విశుద్ధానందజీ ఈవిధంగా చెప్పారు :

ప్రథమంగా గాయత్రీ యందు రుచి కలుగదు. ఈశ్వర కృపవలన రుచి యేర్పడి నట్లయితే అతడు కుమార్గగామి గాడు. గాయత్రీని హృదయమునందుంచుకున్న వ్యక్తి మనస్సు భగవంతునివైపు మరలుతుంది. విషయ వికారముల వ్యర్థత అతనికి స్పష్టంగా అనుభవమౌతుంది. అనేకమంది మహాత్ములు గాయత్రీజపం చేసి పరమసిద్ధులైనారు. పరమాత్మ శక్తియే గాయత్రి. దాన్ని సమీపించినవారు సిద్ధులౌతారు. ఆత్మకళ్యాణమునకు మనోశుద్ధి అవసరము. మనఃశుద్ధి కొఱకు గాయత్రీ మంత్రము అద్భుతంగా పనిచేస్తుంది. ఈశ్వరప్రాప్తి కొఱకు గాయత్రీ జపము ప్రథమ సోపానమని గ్రహించవలె.

దక్షిణభారతమునకు చెందిన ప్రసిద్ధ ఆత్మజ్ఞాని టి. సుబ్బారావు ఈవిధంగా పలికారు :

' సవితా నారాయణుని దైవీప్రకృతియే గాయత్రీ అని చెబుతారు. ఆదిశక్తి యైనందువలన గాయత్రి అంటారు. గీతలో గాయత్రీ వర్ణన చెప్పబడినది. గాయత్రీ ఉపాసనయోగానికి అన్నింటికంటే ప్రథమ అంగము.'

శ్రీ స్వామి కరపాత్రజీ కథనము ప్రకారము :

గాయత్రీకి అధికారి యైన వ్యక్తి నిత్యమూ నియమిత రూపంలో జపించవలె. ద్విజులకు గాయత్రీ జపము అత్యంత ఆవశ్యకమై యున్నది. '

గీతాదర్శన వ్యాఖ్యాత శ్రీవిద్యానంద ఈవిధంగా నుడివారు :

గాయత్రీ బుద్ధిని పవిత్రము చేస్తుంది. పవిత్రమైన బుద్ధికన్నా అతీతమైనది జీవితంలో యేదీ లేదు. అందువలన గాయత్రీ మహత్తరశక్తి గలిగిన జనయిత్రి.

సర్ రాధాకృష్ణన్ యిలా వుటంకించారు :

మనము సార్వభౌమిక గాయత్రీ ప్రార్థనపై ఆలోచించినయెడల ఈ మంత్రము యెంత మహత్తరంగా లాభిస్తుందో తెలుస్తుంది. మనలో తిరిగి జన్మించుటకు వుత్పత్తి ప్రవాహమైన మూలస్థానమును ప్రార్థించుటయే గాయత్రీమంత్రము.

ప్రసిద్ధ ఆర్య సమాజి మహాత్మా సర్వానందజీ యిలా అన్నారు :

గాయత్రీ మంత్రముద్వారా పరమేశ్వరుని పూజించుట సదా ఆర్యుల సంప్రదాయము. ఋషి దయానందుల వారుగూడ యీ పద్ధతినే అనుకరించుటద్వారా సంధ్యవార్చుపద్ధతిని, వేదముల స్వాధ్యాయమునకు ప్రయత్నించుట

వుపదేశించారు. అటులొనరించినందున అంతఃకణరశుద్ధి, బుద్ధి నిర్మలమూనై, మనుష్య జీవితము తనకొఱకు, యితఱులకు హితమొనగూర్చుతుంది. ఈ శుభకర్మపై శ్రద్ధ, విశ్వాసము అధికమైనకొలది ఇతోధికంగా అవిద్య మొదలైన క్లేశములు క్షీణిస్తాయి. జిజ్ఞాసువు గాయత్రీ మంత్రాన్ని ప్రేమపూర్వకంగా వుచ్చరించినయెడల, వారికి సంసారజలధినుండి తరించడానికి నావయై ఆత్మప్రాప్తికి మార్గము దొరుకుతుంది.

ఆర్యసమాజానికి జన్మదాత అయిన స్వామి దయానందులవారు గాయత్రీ నుపాసించే శ్రద్ధాళువు. భాగవత సప్తాహముకన్నా గాయత్రీ పునశ్చరణ అధికంగా శ్రేష్ఠమైనదని స్వామీజీ గ్వాలియరు రాజా సాహెబుగారికి చెప్పారు. జయపూరులోని సచ్చిదానంద్, మీరాలాల్, రావల్, ఘోజ్జలసింగు మొదలైనవారికి గాయత్రీ జపము నేర్పారు. ముల్తాననో వుపదేశ సమయములో గాయత్రీమంత్రాన్ని వుచ్చరించి, ఈ మంత్రము అన్నింటికంటే శ్రేష్ఠమన్నారు. నాలుగు వేదముల కీ మంత్రమే మూలమంత్రము. ఆదికాలంలో ఋషులందఱూ యీ మంత్రాన్ని జపించేవారు.

స్వామీజీ అనేక స్థానములలో గాయత్రీ అనుష్ఠానములను యేర్పాటు చేశారు. అందులో 40 వేలమంది బ్రాహ్మణులు పాల్గొన్నారు. ఈ జపము 15 దినములు కొనసాగినది.

థియోసాఫికల్ సొసైటిలోని ఒక ప్రముఖ సభ్యుడు ఆర్. శ్రీనివాస్ కథనము ప్రకారము ః

హిందూ ధార్మిక ఆలోచనావిధానంలో గాయత్రీని సర్వశ్రేష్ఠశక్తియైన మంత్రంగా పరిగణిస్తారు. ఆ మంత్రార్థము దీర్ఘమైనది, గూఢమైనది. ఈ మంత్రానికి అనేక అర్థములున్నవి. భిన్నభిన్న చిత్తప్రవృత్తులుగల వ్యక్తులపై యీ మంత్రప్రభావము భిన్నంగా వుంటుంది. ఈ మంత్రంతో దృశ్యాదృశ్యములను, ఉచ్చ-నీచ మానవులనూ, దేవతలను అన్నింటిని యేదో ఒక రహస్యమయతంతుద్వారా సమీకరించగల శక్తి పొందవచ్చు. గాయత్రీ మంత్రపు అర్థాన్ని, రహస్యాన్ని, మనస్సు హృదయాన్ని యేకాగ్రము చేసి, శుద్ధమైన వుచ్చారణ గావించుతాడు. అపుడు దానికి సంబంధించిన దృశ్యము సూర్యునిలో అంతర్నిహితంగానున్న మహత్తర చైతన్యశక్తిచే గోచరించుతుంది. అలాంటి వ్యక్తి యెక్కడ మంత్రోచ్చారణ చేసినా, అతనిపైనా, చుట్టుప్రక్కలున్న వాతావరణంలో విరాట్ ఆధ్యాత్మిక ప్రభావము సృష్టించబడుతుంది. ఈ ప్రభావము మహత్తరమైన ఆధ్యాత్మిక ఆశీర్వాదము. ఈ కారణమువలన మన పూర్వులు గాయత్రీమంత్రపు అనుపమశక్తి కొఱకు గాయత్రీని స్తుతించారు.

ఈవిధంగా వర్తమాన శతాబ్దపు అనేక గణుతికెక్కిన బుద్ధివాద మహాపురుషుల అభిప్రాయములు మావద్ద గ్రహించబడినవి. వీటిని కూలంకషంగా చర్చించినయెడల గాయత్రీ ఉపాసన యేదో ఒక మూఢ విశ్వాసము, అంధ పరంపర గాదని, దీనివెనుక ఆత్మోన్నతిని కలిగించే దృఢమైన తత్త్వముల బలమున్నదని, నిష్కర్షగా చెప్పవచ్చు. ఆ మహాశక్తి నుపాసించుటకెవఱు ప్రయత్నించినప్పటికీ మేలు చేకూరుతుంది. గాయత్రీ సాధన నిష్ఫలము కాదు.

గాయత్రీ సాధనచే సత్త్వగుణము సిద్ధిస్తుంది

పూర్వయుగాలలో ఋషులు, మహర్షులు గాయత్రీ ఆధారంగా యోగసాధన చేస్తూ తపశ్చర్య కొనసాగించేవారని మన ప్రాచీన ఇతిహాసాలద్వారా పురాణములవలన తెలుస్తుంది. వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు, అత్రి, విశ్వామిత్రుడు, వ్యాసుడు, శుకదేవుడు, దధీచి, వాల్మీకి, చ్యవనుడు, శంఖఋషి, లోమశుడు, మైత్రేయుడు, జాబాలి, ఉద్ధాలకుడు, వైశంపాయనుడు, దుర్వాసుడు, పరశురాముడు, పులస్త్యుడు, దత్తాత్రేయుడు, అగస్త్యుడు, సనత్కుమారుడు, కణ్వుడు, శౌనకుడు మొదలైన ఋషు లందఱి జీవన వృత్తాంతములను వారి మహోత్కృష్టతకు మూలము గాయత్రీయే నని స్పష్టమగుచున్నది.

కొంతకాలంక్రితము అనేకులు గాయత్రీని ఆశ్రయించి తమ ఆత్మబలము తద్వారా బ్రహ్మతేజాన్ని ప్రకాశింపజేసి మహాత్ములయ్యారు. వారి వారి యిష్టదేవతల ఆదర్శములు, సిద్ధాంతములు బేధించినప్పటికి వేదమాత గాయత్రీ యందు మాత్రము అనన్య శ్రద్ధ కలిగివున్నారు. వారు ప్రారంభంలో ఈ మహాశక్తి స్తన్యపానమే చేశారు. కావుననే వారంతా ప్రతిభాశాలురైనారు. శంకరాచార్యులు, సమర్థగురురామదాస్, నర్సీమోహతా, దాదుదయాల్, సంత్ జ్ఞానేశ్వర్, స్వామీ రామానంద్, గోరఖనాథ్, మచ్ఛీంద్రనాథ్, హరిదాసు, తులసీదాసు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, రామకృష్ణపరమహంస, స్వామీ వివేకానంద, రామతీర్థ, యోగి అరవిందులు, రమణమహర్షి, గౌరాంగ్‌మహాప్రభు, స్వామి దయానంద, మహాత్మ ఏకరసానంద మొదలైన మహాత్ముల వికాసము గాయత్రీ మహాశక్తియొక్క రక్షాకవచములోనే జరిగినది. ఆయుర్వేదానికి సుప్రసిద్ధ గ్రంథము 'మాధవ నిదానము.'దానిని రచించినవారు శ్రీమాధవాచార్యులవారు ప్రారంభంలో 13 సంవత్సరములు బృందావనంలో వుండి గాయత్రీ అనుష్ఠాన మొనరించారు. దానివలన వారికి లేశమైనా ప్రయోజనము చేకూరలేదు. నిరాశతో కాశీ వెళ్ళారు. అచట నొక అవధూత సలహాపై భైరవ తాంత్రికోపాసన చేశారు. కొన్నిరోజులకు భైరవుడు ప్రసన్నమైనాడు. మాధవాచార్యులు కూర్చున్న పీఠమునకు వెనుకనుండి 'వరము కోరుకో' అన్నాడు. మాధవాచార్యులు ఇలా అన్నారు. తాము ఎదురుగా వచ్చి దర్శనమీయండి. ఈ మాట విన్నంతనే భైరవుడు మాధవాచార్యకు జావాబు చెప్పాడు. నేను గాయత్రీ ఉపాసకుని సమ్ముఖమునకు రాజాలను. ఈ మాట విన్నంతనే మాధవాచార్యులకు ఆశ్చర్యమేసింది. ఆయన యిలా అన్నారు. గాయత్రీ సమ్ముఖమునకు రాలేనపుడు నాకెలా వరమీయగలరు? దయచేసి నాకింతవఱకు గాయత్రీ ఉపాసన చేసినప్పటికి ఫలించని కారణ మేమో చెప్పి అనుగ్రహించండి. భైరవుడిలా అన్నాడు. నీవు పూర్వజన్మలలో చేసిన పాపము నాశనమవడానికి, ఇంతవఱకు చేసిన గాయత్రీ జపము పనికొచ్చింది. ఇపుడు నీ ఆత్మ నిష్పాపమైనది. ఇకముందు చేసే జపము సిద్ధిస్తుంది. ఇది విని మాధవాచార్య మఱల బృందావనమునకెళ్ళి పునః గాయత్రీ ఉపాసన ప్రారంభించారు. చివరకు మాత దర్శనమిచ్చింది. ఆయన పూర్ణసిద్ధుడైనాడు.

శ్రీమహాత్మా దేవగిరివారి గురువులు హిమాలయములలో నొక గుహలో గాయత్రీ జపమాచరిస్తారు. వారి వయస్సు 400 సంవత్సరములకన్నా హెచ్చు. తమ ఆసనమునుండి లేచి స్నాన, భోజన, పాన, శయనములాచరింపరు. మలమూత్ర విసర్జన లేదు. వారికీ అవసరముగూడ లేదు. నగరాయవద్ద రామటేకరీ ఘనారణ్యంలో ఒక హరిహర నామధేయుడైన

మహాత్ములు గాయత్రీ జపముచేసి సిద్ధుడైనారు. ఈ మహాత్ముని కుటీరము చేరుటకు 7 కోసుల దట్టమైన అరణ్యమున్నది. అందులో వందలకొద్ది సింహములు, వ్యాఘ్రములు వున్నాయి. ఎవరైనా మహాత్ముని దర్శనార్థము వెళితే కనీసము రెండో, నాలుగో వ్యాఘ్రములు తప్పకుండా మార్గములో అడ్డు నిలుస్తాయి. హరిహరబాబా దర్శనానికి వెళుతున్నాను అన్న వెంటనే ఆ భయంకర హింసామృగములు దారి తొలగివెళ్తాయి.

లక్ష్మణ్‌ఘడ్‌లో విశ్వనాథగోస్వామి అనే ప్రసిద్ధ గాయత్రీ ఉపాసకులున్నారు. వారి జీవితంలో అధికాంశము గాయత్రీ ఉపాసనకు వినియోగింపబడుతుంది. వారి ఆశీర్వచనమువలన సర్వము గోల్పోయిన ఒక కుటుంబము పేదరికమునుండి విముక్తి పొంది, సమృద్ధివంతమైన సంపన్నకుటుంబముగా రూపొందినది. ఈ కుటుంబ సభ్యులిప్పటికి వారి సమాధివద్ద తమ బిడ్డల శిరోముండనకర్మ చేయిస్తారు.

జయపూరు రాజ్యంలో జౌన్ అనే గ్రామంలో పండిత హరరాయ నాముడైన నైష్ఠికుడు గాయత్రీ జప మొనరించేవారు. వారికి తమ మృత్యు సమాచారము ముందుగనే బోధపడినది. వారు తమ పరిజనులందఱినీ సమావేశపఱచి ధార్మికోపదేశ మిచ్చారు. మాట్లాడుతూ, బోధిస్తూ గాయత్రీ మంత్రోచ్చారణ చేస్తూ ప్రాణత్యాగము గావించారు.

జునాగడ్ కు చెందిన ఒక విద్వాన్ పండిత మణిశంకరభట్టు ప్రథమంగా యజమానికొఱకు గాయత్రి అనుష్ఠానము దక్షిణ గ్రహించి చేసేవారు. అనేకమంది తత్ఫలితంగా లాభించుట గ్రహించి తన మిగిలిన జీవితమంతా గాయత్రీ ఉపాసనతో గడిపారు. ఇతఋలకై అనుష్ఠానాన్ని ఆపివేశారు. ఆయన శేషజీవితము బహుశాంతంగా గడిచినది.

జయపూరు ప్రాంతంలో పురాతనమైన దేవల్ గ్రామంలో విష్ణుదాసు జన్మించారు. వారు ఆజీవన బ్రహ్మచారులు. వారు పుష్కరంలో కుటీర మేర్పరచుకొని గాయత్రీ జపముతో ఘోర తపస్సు ఆరంభించారు. ఫలస్వరూపంగా వారికి అనేక సిద్ధులు లభించాయి. పెద్దపెద్ద రాజలు ఆ కుటీరపు ధూళి తమ మస్తకములపై నుంచుకొన్నారు. జయపూరు జోధపూరు రాజులు అనేక పర్యాయములా కుటీరమున కొచ్చారు. ఉదయపూరు మహారాజు అత్యంతాదరముతో వారిని తమ రాజధానికి తోడ్కొనిపోయి వారి గాయత్రీ పురశ్చరణకు అనువైన వసతి కల్పించి పూర్ణాహుతికి అన్ని యేర్పాట్లు చేశారు. వారినిగురించి అనేక చమత్కార కథలు ప్రసిద్ధమైనాయి.

ఖతౌలీకి 8 మైళ్ళ దూరంలో ధౌకలేశ్వర్ లో మగనానంద పేరుతో గాయత్రీ సిద్ధ పురుషుడుండేవారు.ఆయన ఆశీర్వాద మహిమవలన ఖతౌలీలో నివసించే వ్యక్తికి తనవద్దనుండి బలాత్కారముగా తీసుకొనబడిన జాగీరును రాజకీయ ఏజెంటు తిరిగిచ్చాడు.

రత్నగఢ్‌లో పండిత భూమర్‌మల్ నామధేయుడు, విద్వాంసుడైన బ్రాహ్మణుడు. వారు అనన్య గాయత్రీ ఉపాసకులు. వారు 1966 సంవత్సరములో కాశీవచ్చి అంత్యమువఱకు అచటనే వున్నారు. వారికి తమ మృత్యువుగురించి ముందుగనే తెలిసినందువలన విశాలమైన ధార్మిక సామగ్రిని పొంది సాధన గావిస్తూ ఆషాఢశుద్ధ పంచమీతిథినాడు శరీరమును త్యజించారు. వారి ఆశీర్వాదము పొందిన చాల సామాన్యవ్యక్తిగూడ లక్షాధిపతి అయ్యాడు.

అలిఘర్ రాజ్యంలో అంతర్గతంగా నున్న ఒక కుగ్రామంలో సామాన్య కుటుంబంలో జన్మించిన వ్యక్తికి సజ్జనుడు తండ్రి. ఏదో కారణమువలన ఆ వ్యక్తి వైరాగ్యమలవడినది. వారు మథుర చేరి చిన్నదిబ్బపై వుంటూ సాధన చేసేవారు.

ఒక కోటి గాయత్రీ జపము చేశారు. కోటి గాయత్రీ చేసిన వెంటనే గాయత్రీ సాక్షాత్కారమైనది. వారు సిద్ధిని పొందారు. ఆ చిన్నదిబ్బ గాయత్రి టీలేగా ప్రసిద్ధి చెందినది. అచట నొక మందిరమున్నది. ఆ దేవాలయములో సౌందర్యవంతమైన గాయత్రి ప్రతిమ ప్రతిష్ఠించబడినది. వారి పేరు బూటీ సిద్ధ. ఎల్లపుడు మౌనంగా వుంటారు. వారి ఆశీర్వాదమువలన అనేకులకు శుభము కలిగినది. ధౌలీపూర్ రాజు వారియెడల శ్రద్ధగా నుండేవారు.

ఆర్యసమాజ సంస్థాపకుడైన శ్రీస్వామి దయానందులవారి గురువైన ప్రజ్ఞాచక్షుస్వామి విరజానంద సరస్వతి గంగా తీరమునందుండి మూడు సంవత్సరములు తీవ్ర తపశ్చర్యతో జపము చేశారు. ఈ అంధ సన్యాసి తన తపోశక్తిచే అగాధవిద్యనూ, అలౌకిక బ్రహ్మతేజస్సును పొందారు.

మాంధాతా ఓంకారేశ్వర్ మందిరము వెనుక నున్న గుహలో ఒక మహాత్ముడు గాయత్రీ జపము చేసేవారు. మృత్యుసమయములో వారి కుటుంబసభ్యులు దగ్గరున్నారు. కుటుంబములోని ఒక బాలుడు ఆ మహాత్మునిట్లు ప్రార్థించాడు. ‘ చాలా మందబుద్ధిని, నాకు విద్య అలవడటంలేదు. నా దోషములు దూరమయ్యేటట్లు నన్ను దీవించండి.’ ఆ బాలుని తనవద్దకు పిలిచా డా మహాత్ముడు. కమండలపు నీటిని కొంచెము ఆ బాలుని నాలుకపై నుంచారు. ఆశీర్వదించారు. ఫలితంగా ఆ బాలుడు పూర్ణవిద్వాంసుడయ్యాడు. అసాధారణ ప్రతిభాశాలియై ఇండోరులో ఓంకార జోషీ పేరుతో ప్రఖ్యాతి గాంచాడు. ఇండోరు రాజు తన ప్రభాత వ్యాహ్యాళికి ఓంకార్ జోషీ ఇంటికి వచ్చి తోడు తీసుకెళ్ళేవారు. అనగా ఆ రాజు అంత ప్రభావితుడయినాడన్నమాట.

చందోలు క్షేత్రంలో నివశించుచున్న గుప్తయోగీశ్వరుడు శ్రీ ఉద్ధండజోషి సిద్ధపురుషుడు. గాయత్రీ ఉపాసనా ఫలితంగా వారి కుండలినీశక్తి జాగృతమైనది. వారు పరమసిద్ధులయ్యారు. వారి కృపచే అనేకుల ప్రాణములు రక్షింపబడినవి. అనేకులకు ధనము ప్రాప్తించినది. అనేకమంది ఆపదలనుండి విముక్తి పొందారు. వారి భవిష్యవాణి సదా సత్యమయ్యేది. ఒక వ్యక్తి వారిని అపహాస్యము చేయాలనే దుస్సాహసాని కొడిగట్టాడు. అంగవైకల్యము పొందాడు. కుంచించుకుపోయాడు.

బడౌదీలో మజుసార్ నివాసి శ్రీముకుటరామ్ మహారాజ్ గాయత్రీ ఉపాసనలో పరమసిద్ధి ప్రాప్తిపొందారు. బహుశః వారు నిత్యము 8 గంటలు జపము చేసేవారు. అందువలన అనేక సిద్ధులు ప్రాప్తించాయి. దూరదేశముల వార్తలు కన్నులతో చూసినట్లు కచ్చితంగా చెప్పేవారు. ఆ వార్తల సత్యతను పరీక్షించినపుడు పూర్తిగా నిజమయ్యేవి. వారు గుజరాత్ భాషలో ఒకటిరెండు తరగతులుమాత్రమే చదివారు. అయినప్పటికి ప్రపంచములోని అన్ని భాషలలో చక్కగా మాట్లాడేవారు, అర్థము చేసుకొనేవారు. విదేశీయులు వారివద్దకు వచ్చి వారి భాషలలో గంటలకొద్ది సంభాషణ కొనసాగించేవారు. యోగము, జ్యోతిష్యము, వైద్యము, తంత్రశాస్త్రము, ధర్మశాస్త్రములలో వారికి పూర్తి ప్రవేశమున్నది. పెద్దపెద్ద పండితులు వారి సందేహములు తీర్చుకొనుటకు వచ్చేవారు. వారు చూపిన మహత్కార్యములనేకం చూసి ప్రజలు వారిపై అచంచల శ్రద్ధతో నుండేవారు.

బర్సోడాలో నొక ఋషిరాజు 7 సంవత్సరములు నిరాహారదీక్షతో గాయత్రీ పురశ్చరణ గావించారు. వారి వాక్కు సిద్ధిపొందినది. వారేది వచించితే అదే జరిగేది.

కళ్యాణ్‌కు చెందిన ఒక సాధువు వద్ద హరేరామ్ నామముగల బ్రహ్మచారి ప్రస్తావన వచ్చినది. ఆ బ్రహ్మచారి గంగానది మధ్యలో నిలబడివున్న ఒక కఱ్ఱపై కూర్చొని వుండేవారు. అప్పుడు గంగారాధన గావించేవారు. వారి బ్రహ్మతేజము అవర్ణనీయము. వారి శరీరమంతా తేజోభరితమై విరాజిల్లుతుండేది.వారు తమ సిద్ధులచే అనేకమంది దుఃఖములను దూరము చేసేవారు.

దేవ ప్రయాగలోని విష్ణుదత్తుడనే వానప్రస్థి చాంద్రాయణ వ్రతంతోబాటు 1,25,000 గాయత్రీ జపము గావించారు. ప్రతిఫలంగా వారి ఆత్మబలము వృద్ధి పొందినది. వారికి అనేక సిద్ధులు ప్రాప్తించాయి. ప్రజలకు తమ తమ కార్యములు నెరవేరుతాయనే విశ్వాసము గలిగినవెంటనే దూరప్రదేశములనుండి గూడా వచ్చేవారు. వానప్రస్థి యీ క్రీడలో చిక్కుకుపోయారు. రోజురోజుకు వారి శక్తి భాండారము క్షీణించసాగినది. తరువాత వారికి పశ్చాత్తాపము గలిగి మృత్యుకాలమువఱకు ఏకాంత సాధన కావించారు.

రుద్రప్రయాగ స్వామీ నిర్మలానంద సన్యాసికి గాయత్రీ సాధనవలన భగవతీదేవి దివ్యదర్శనము కలిగినది. ఈశ్వర సాక్షాత్కారము ప్రాప్తించినది. దీనివలన వారికి అపరిమితమైన తృప్తి కలిగినది.

బిఠూర్‌వద్ద ఖాండేరావు పేరుగల వయోవృద్ధ తపస్వి ఒక వటవృక్షము క్రింద గాయత్రీ సాధన గావించేవారు. ఒకసారి వారు విరాట్ గాయత్రీ యజ్ఞమాచరించి బ్రహ్మభోజనము యేర్పాటుచేశారు. దినమంతా వేలకొలది భోజన పంక్తులు లేస్తున్నాయి. రాత్రి 9 గంటలకు భోజనమంతా అయిపోయినది. ఇంకా కొన్నివేలమంది భోజనము కావలె. ఖాండేరావుగారికి తెలియపర్చారు. వారు గంగానదినుండి నాలుగు పీపాల జలము తీసుకొనివచ్చి దానిలో పూరీలు తడపండి అని ఆజ్ఞాపించారు. అలాగే చేశారు. పూరీ నెయ్యితో తడిపిన రుచి పొందినది. బ్రహ్మభోజనము పూర్తి అయిన మరుసటిరోజు నాలుగుపీపాలు నెయ్యితెచ్చి గంగలో కలిపారు.

కాశీలో భారతమాతా మందిరము బాబు శివప్రసాద్‌గుప్తాద్వారా ప్రారంభించినపుడు దాని శిలారోహణము బాబు భగవాన్‌దాస్ ద్వారా గావించబడినది. ఆ సమయములో 20 రోజులు ఒక మహా యజ్ఞము చేయబడినది. విద్వాంసులద్వారా 20 లక్షల గాయత్రీ జపము చేయబడినది. యజ్ఞ పూర్ణాహుతిరోజున దగ్గఱలోనున్న ఎండిపోయినచెట్లు పచ్చని ఆకులను తొడిగినవి. ఒక చెట్టుకు తరుణంగాని సమయములో ఫలాలు వచ్చినవి. ఈ సమయములో అచట పండిత మదనమోహనమాలవ్యా, రాజా మోతీచంద్ర, హైకోర్టు న్యాయాధీశుడు కన్హైయ్‌లాల్, ఇంకా యితఱ గణనీయమైన వ్యక్తులున్నారు. జరిగిన సంఘటనను తమ కండ్లతో దర్శించారు. గాయత్రీ మహిమను స్వయంగా అనుభవించారు.

గఢ్వాల్‌లోని గోవిందానందనే మహాత్ముడు అత్యంత విషపూరిత సర్పదంష్ట్రుల ప్రాణములను రక్షించేవారు. తాము గాయత్రీ జపమువలననే సర్పదంష్ట్రులను రక్షించగలుగుతున్నానని నుడివేవారు. ఇదేవిధంగా సమస్తీపూరులో నొక సంపన్నవ్యక్తి శోభనసాహు గాయత్రీ మంత్రమువలన అత్యంత విషపూరిత తేలు దంష్ట్రులను, పిచ్చికుక్క కాటుకు గురియైనవారిని రక్షించేవారు.

అనేకమంది సాత్త్విక సాధకులు కేవలము గాయత్రీమంత్రముచే అభిమంత్రిత బలముద్వారా భయంకర రోగములను కుదిర్చారు.

స్వర్గీయ పండిత మోతీలాల్‌నెహ్రూ జీవనము అప్పటి వాతావరణం కారణంగా విభిన్నమైన క్షేత్రములలో వ్యతీతమైనది. కానీ అవసానదశలో గాయత్రీ జ్ఞాపకమునకు వచ్చినది. గాయత్రీ జపము చేస్తూ జీవనలీలను సమాప్తము చేశారు. దానివలన, గాయత్రీ సంస్కారము శీఘ్రముగా సమాప్తముగాదని, రాబోయే తరమునకు, వంశానికి తన ప్రభావమును ప్రసరిస్తుందని విశదమౌతుంది. పండిత్‌జీ పూర్వులు గాయత్రీ ఉపాసకులు. దాని ప్రభావమువలన అవసానదశలో మృత్యుసమయములో మోతీలాల్ నెహ్రూకు గాయత్రీమంత్ర ధ్యానభావన కలిగినది.

అహ్మదాబాదుకు చెందిన శ్రీ డాహ్యాభాయి రామచంద్రమెహతా గాయత్రీ శ్రద్ధాళువు, ఉపాసకుడు, గాయత్రీ ప్రచారకుడు. వారి వయస్సు 90 సంవత్సరములు. శరీర, మానసికసత్త్వగుణాధిక్యతవలన వారిలో అన్ని గుణములు పరిలక్ష్యముగా నున్నవి. ఇట్టి సర్వగుణ సమృద్ధి మహాత్ములే పొందగలరు.

దీనవాలో నుండే స్వామి మనోహరదాసజీ అధికగాయత్రీ జపము చేశారు. వారిలా అన్నారు. ఈ మహాసాధన నాకెంతో అధికలాభాన్ని చేకూర్చింది. దానిని ప్రకటించుటకు నా కిష్టము లేదు. ఎలాగైతే లోభి తన వద్దనున్న ధనాన్ని ప్రకటించుటకు సంకోచిస్తాడో అలాగే!

హలాలోని శ్రీరమేశచంద్రదుబే గాయత్రీ సాధన చేసినందువలన అనేకసార్లు గొప్ప అనుభవాలు కలిగాయి. అందువలన వారి నిష్ఠ యితోధికంగా అభివృద్ధి చెందినది.

పాటన్‌లోని శ్రీజటాశంకర్ నందీ వయస్సు 77 సంవత్సరాలకన్నా అధికము. వారు గత 50 సంవత్సరములనుండి గాయత్రీ ఉపాసన చేస్తున్నారు. కువిచారములు, కుసంస్కారములనుండి ముక్తి, అధిక దైవీతత్త్వమనే ప్రయోజనము లభించాయి. వీటినే వారు తాము పొందిన ప్రధాన ప్రయోజనమని భావించారు.

బృందావనంలోని కాఠియాబాబా, ఉడియాబాబా, ప్రజ్ఞాచక్షు, స్వామి గంగేశ్వరానందజీ గాయత్రీ ఉపాసన చేయనారంభించి, తమ సాధనలలో పురోగమించడానికి సమర్థులైనారు. వైష్ణవ సాంప్రదాయానికి చెందిన ఆచార్యు లందఱూ గాయత్రీ ఉపాసనపై విశేష శ్రద్ధ పాటించేవారు.

నచాచ్‌గంజ్ పండిత బలభద్రజీ బ్రహ్మచారి, సహరన్‌పూర్‌జిల్లా శ్రీదేవదర్శన్‌జీ, బులంద్‌శహార్ ప్రాంతపు పరివ్రాజక మహాత్మ యోగనందజీ, బ్రహ్మనిష్ఠ శ్రీ స్వామి బ్రహ్మర్షిదాస్‌జీ ఉదాసన, బీహార్ ప్రాంతపు మహాత్మా అనాసక్తిజీ, యజ్ఞాచార్య పండిత జగన్నాథ్ శాస్త్రి, రాజ్‌గడ్ మహాత్మా, హరి ఓం, తత్ సత్ మొదలైన సాధువులు, సన్యాసులు గాయత్రీ ఉపాసనలో పూర్ణ మనోయోగంతో సంలగ్నమైనారు. వారి గృహస్థ్యముకూడ తపోజీవనముగా నుండి మహాసాధనా ప్రవృత్తిగా నున్నది. ఈ మార్గములో పయనిస్తూ వారు మహత్వపూర్ణ ఆధ్యాత్మిక సఫలతను పొందారు.

మేము స్వయంగా జీవితారంభమునుండి గాయత్రీ ఉపాసనచేశాము. అదే మాకు జీవనాధారమైనది. దోషములు, విచారములు, కషాయకల్మషాలు, కువిచారములు, కుసంస్కారములను తొలగించుటలో కించిత్ సఫలత ప్రాప్తించి నట్లయితే యిది ఆమెదే. బ్రాహ్మణత్వపు బ్రహ్మీభావనలకు, ధర్మపరాయణులకు, సేవ, సంయమములకు, స్వాధ్యాయము, తపశ్చర్యకు వున్న కించిత్ ప్రవృత్తికి ఆ మాత కృపయే కారణము. అనేకసార్లు విపత్తుల నుండి రక్షించినది. అంధకారములో మార్గము చూపినది.

స్వానుభవములోని సంఘటనలు విస్తారమైనవి. దానివలన మాత యందు శ్రద్ధ దినదినాభివృద్ధి చెందినది. వాటిని వర్ణించుటకు యీ పంక్తులలో స్థానము లేదు. ప్రయత్నంతో, ప్రోత్సాహంతొ గాయత్రీ ఉపాసన చేసిన సజ్జనులు, ఆ వేదమాత వలన వారిలో ఆత్మశుద్ధి, పాపకర్మలయందు విముఖత, సన్మార్గాసక్తి, సత్త్వగుణ ప్రధానవృత్తి, సంయమనము, పవిత్రత, ఆస్థికత, జాగరూకత, అటులనే ధర్మపరాయణత లాంటి ప్రవృత్తులు పెంపొందినాయి, లభించాయి. ఇతఱ ఐహిక ప్రయోజనములు లభించినా, లేకున్నా, ఆత్మికలాభము ప్రతివారికి నిశ్చితరూపంలో తప్పక చేకూరుతుంది. వివేకంతో విచారించినయెడల ఆత్మికలాభముకొఱకు ధనసంపత్తులు, అల్పమైన ఫలితమును త్యాగము చేయడము ఎక్కువ మహత్వపూరక ప్రయోజనము.

అందువలన మేము మా పాఠకులను ప్రార్థించేదేమనగా గాయత్రీని ఉపాసన చేయండి. దానివలన పొందే చమత్కారములను చూడండి. ఎవరైతే వేదమాత గాయత్రీ శరణుగోరుతారో వారికి అంతఃకరణమునందు సత్త్వగుణము, వివేకము, సద్విచారము, సత్కర్మాచరణ కలిగి వారి అసాధారణ ప్రవృత్తి జాగృతమవుతుంది. ఇది ఆత్మజాగరణ, లౌకిక, పారలౌకిక, సాంస్కారిక, ఆత్మిక సఫలతలన్నీ యిచ్చే దాత!

గాయత్రీ సాధన వలన శ్రీ, సమృద్ధి మరియు సఫలత

గాయత్రీ త్రిగుణాత్మకము. గాయత్రీ ఉపాసనవలన యెచ్చట సత్త్వగుణాభివృద్ధి పెంపొందుతున్నదో అచట కళ్యాణకారకము, వుపయోగ్యమైన రజోగుణముకూడా అభివృద్ధి పొందుతుంది.

రజోగుణపు ఆత్మబలము పెంపొందినందువలన గుప్తశక్తులు జాగృతమవుతాయి. ఈ శక్తులు సాంసారిక జీవనపు సంఘర్షణలలో అనుకూలమైన ప్రతిక్రియను వుత్పన్నము చేస్తాయి. ఉత్సాహము, సాహసము, స్ఫూర్తి, నిరాలస్యత, ఆశ, దూరదర్శితము, తీవ్రబుద్ధి, అవసరాలను గుర్తించుట, మధురమైన వాక్కు, ఆకర్షణీయమైన వ్యక్తిత్వము, కలివిడి స్వభావము లాంటి నవ్యరూపకల్పన జరుగుతుంది. ఆ వ్యక్తిలో యెలాంటి పరివర్తన వస్తుందనగా మామూలు సాధారణ వ్యక్తిగూడా ధనధాన్య సమృద్ధితో తులతూగుతాడు.

గాయత్రీ ఉపాసకులలో మానవుని దుఃఖపూరితునిచేసే పొరపాట్లు జరగనందువలన, విశేషతలు వుత్పన్న మైనందున, మనుష్యుడు క్రమంగా సమృద్ధి, సంపన్నత, అభ్యుదయము వైపు పురోగమిస్తాడు. గాయత్రీ తన సాధకుల జోలెలలో సువర్ణనాణెముల ధనపాత్రను వేయదు. కానీ సాధకులలో విశేషతలను, విశిష్ఠతలను వుత్పన్నము చేసి ఆకారణమున వారిని అభావగ్రస్తులను,దీనులను, హీనులను జేయదన్నదనిమాత్రము వాస్తవము. ఉదాహరణకు మావద్ద అనేక సాక్ష్యములు వున్నవి. అందులోనుండి కొన్ని క్రింద నీయబడినవి.

హరదోయజిల్లా బంధవాడా నుండి భూరేలాల్‌జీ ఇలా వ్రాసుకున్నారు. దినసరి రాబడి క్రమంగా అభివృద్ధి చెందుతున్నందున ధనధాన్యములతో పరిపూర్ణంగా నున్నాను. చేపట్టిన ప్రతికార్యము విజయవంతమవుతున్నది. వివిధ సంకటములు తమంత తాము దూరమవుతున్నాయి. ఇదంతా గాయత్రీ మంత్ర జపము వలననే.

ఝాన్సీలోని పండిత లక్ష్మీకాంత ఝా వ్యాకరణ సాహిత్యాచార్య యిలా వ్రాశారు. శైశవమునుండి నాకు గాయత్రీపై శ్రద్ధ యేర్పడినది. అప్పటినుండి రోజు సహస్ర గాయత్రీ చేయుచున్నాను. ఈ మంత్ర ప్రతాపము వలననే నేను సాహిత్యాచార్య, వ్యాకరణాచార్య, సాహిత్యరత్న, వేదశాస్త్రీ మున్నగు పరీక్షలయందు వుత్తీర్ణుడనై ఝాన్సీలోని సంస్కృతకళాశాల ప్రిన్సిపాలు నయ్యాను. నేను ఒక 16 సంవత్సరముల మరణాసన్న, ధనికుని కుమారుని ప్రాణము గాయత్రీ జపము వలన రక్షించగలిగాను. అందువలన ఆ మంత్రమందు నా శ్రద్ధ అధికమైనది.

బృందావనములోని పండిత తులసీరామశర్మ ఇట్లు వ్రాశారు. దాదాపు పది సంవత్సరములయినది. శ్రీ ఉడియాబాబా ప్రేరణవలన హీథీరస్‌కు చెందిన లాలాగణేశీలాల్ గంగాతీరమున కర్ణవాస్ వద్ద 24 లక్షల గాయత్రీ అనుష్ఠానము చేయించాడు. అప్పటినుండి లాలా గణేశీలాల్‌జీ ఆర్థిక పరిస్థితి దినదినాభివృద్ధి చెంది, అతని కీర్తి-ప్రతిష్టలు, సంపద నాలుగురెట్లు అధికమయినవి.

ప్రతాపఘడ్‌కు చెందిన పండిత నారాయణశర్మ వ్రాశారు - నా దగ్గఱి సంబంధీకు డొకడు కాశీలో నొక మహాత్ముని ధనప్రాప్తికొఱకు ఉపాయమడిగాడు. మహాత్ముడిలా వుపదేశించారు. ప్రాతఃకాలమున నాలుగుగంటలకు మేల్కొని శౌచాదులు నిర్వర్తించి, స్నానసంధ్యల తదుపరి నిల్చుని నిత్యమూ సహస్రగాయత్రీ జపము చేయుము. ఆయన అలా చేసి తన ఆర్థిక సంకల్పమునుండి విముక్తుడయ్యాడు.

ప్రయాగ్ జిల్లా ఛితౌనీ గ్రామ నివాసి పండిత దేవనారాయణజీ దేవభాష యందు అసాధారణ విద్వాంసులు. అనన్య గాయత్రీ ఉపాసకులు. 30 సంవత్సరములవఱకు విద్యాభ్యాసము గావించి తదుపరి గృహస్థాశ్రమము స్వీకరించారు. సుశీల పతిభక్తి కలిగిన భార్య. వివాహానంతరము అనేక సంవత్సరములవఱకు సంతానము లేనందున ఆమె దుఃఖించగా వారు ఆమె మరోరథమును గుర్తించి 125 వేల గాయత్రీ అనుష్ఠానము చేశారు. కొన్నిరోజులకు వారికి ప్రతిభాశాలి, మేధావియైన పుత్రుడు జన్మించాడు. ప్రస్తుతము సర్వోత్కృష్టమైన ఉపాధిని దేవభాషయందు పొందుటకు అర్హత సంపాదిస్తున్నాడు.

ప్రయాగవద్ద జమునిపూర్ గ్రామంలో రామనిధిశాస్త్రి పేరుగల బ్రాహ్మణుడు వుండేవాడు. అతడత్యంత నిర్ధనుడు. కానీ గాయత్రీ సాధనలో గాఢతత్పరత గలవాడు. ఒకసారి తొమ్మిదిరోజులు వుపవసించి నవాహ్న గాయత్రీ పురశ్చరణ చేశాడు. పురశ్చరణ అంతిమదినమున భగవతిగాయత్రీ మహత్తరమైన దివ్యతేజస్సుతో దర్శనమొసంగినది. మీ గృహంలో ఫలానా స్థానంలో స్వర్ణముద్రికాభరితమైన పాత్ర ఉంచబడినది. దానిని వెలికితీసి నీ దారిద్ర్యాన్ని పోగొట్టుకో! అని నుడివినది. ఆ పాత్రను వెలికితీసి నిర్ధనుడల్లా ధనపతి అయ్యాడు.

ఇండోరుకు చెందిన పండిత రక్షపాల్‌జీ ఇలా చెప్పాడు. ఒక వ్యక్తి తన భార్యతో సదా కలహించేవాడు. కొన్నిరోజులు గాయత్రీమంత్రంచే అభిమంత్రింపబడిన జలము త్రాగినందున అతని స్వభావము మారి వారిద్దరిమధ్య అన్యోన్యత క్రమంగా వృద్ధి పొందినది.

బడౌలిలోని వకీలు రామచంద్ర కాళీశంకర్ పాఠక్ ఆరంభంలో 10 రూ॥ వేతనంతో వుద్యోగము చేసేవాడు. అతడు గాయత్రీ పురశ్చరణ చేశాడు. అందువలన క్రమంగా విద్యాభిరుచి కలిగి క్రమంగా పెద్ద వకీలయ్యాడు. అతని మాసపు రాబడి 500 రూ॥ పెరిగినది.

మహువాలోని రణఛోడ్‌లాల్‌భాయి కథనము ప్రకారము ఒక వ్యక్తి కుమారుడు మెట్రిక్ పరీక్షలో విఫలుడయ్యాడు. చివరకు దుఃఖమగ్నుడై గాయత్రీ జపము చేయించాడు. ఆ సంవత్సరము మంచి తరగతిలో వుత్తీర్ణుడయ్యాడు.

గుజరాత్‌లోని మధుసూధన్ స్వామి పేరు సన్యాసి స్వీకారానికి పూర్వము మాయాశంకర్ దయాశంకర్‌పాండ్య. వారు సిద్ధపూరులో వుండేవారు. ప్రారంభంలో వారి నెలసరి జీతము 25 రూ॥. వారు ప్రతిరోజు సహస్రగాయత్రీ చేస్తూ క్రమంగా నాలుగువేల గాయత్రీవఱకు చేసేవారు. ఫలస్వరూపంగా వారి సంపదలో అభివృద్ధి వచ్చినది. వారు బడౌదీ రాజ్యంలో రైల్వే అసిస్టెంట్, ట్రాఫిక్ సూపరింటెండెంటు వఱకు చేరి 300 రూ॥ల వేతనమువఱకు చేరారు. తరువాత వారు సన్యాసం స్వీకరించారు.

మాండూక్య ఉపనిషత్తుపై కారికలను వ్రాసిన విద్వాన్ గౌడపాదులవారి జన్మ, వారి తండ్రి వుపవాసముతో సప్తదినములు గాయత్రీ జపము చేసిన ఫలస్వరూపంగా కలిగినది.

ప్రసిద్ధ సాహిత్యకారుడు ద్వారకాప్రసాద్ చతుర్వేద ప్రథమంలో అలహాబాద్‌లోని సివిల్‌సర్జన్‌వద్ద హెడ్‌క్లర్క్. వారు వారన్ హేస్టింగ్స్ జీవనచరిత్ర వ్రాసినందున రాజద్రోహిగా పరిగణించబడి వుద్యోగము కోల్పోయారు. వారిది పెద్ద కుటంబము. జీవితసాధనము వేఱే లేదు. ఈ దుఃఖసమయములో గాయత్రీ ఉపాసన చేశారు. దీని ఫలితంగా పుస్తక లేఖనమనే స్వతంత్ర ఉపాధి ఏర్పడినది. అప్పటినుండి సాహిత్యసేవ చేస్తూ సంపన్నులయ్యారు. వారు ప్రతి సంవత్సరము గాయత్రీ అనుష్ఠాన మొనర్చుటకు నియమమేర్పరచుకొని నిత్యమూ గాయత్రీ జపము చేసేవారు.

స్వర్గీయ మలకృష్ణభట్టు హిందీలో ప్రఖ్యాత సాహిత్యకారులు. వారు నిత్యము 500 గాయత్రీ జపము చేసేవారు. గాయత్రీ జపము చేసేవారికి దేనికీ లోటువుండదు అనేవారు ఆయన. వారెల్లప్పుడు విద్య, ధనము, సన్నిహితులతో సమృద్ధిగా నుండేవారు.

ప్రయాగ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ క్షేత్ర చంద్ర చటోపాధ్యాయ మేనల్లుడు వారివద్దవుంటూ విద్య నభ్యసించేవాడు. ఇంటర్ పరీక్షలో లాజిక్ పరీక్షరోజు చాలా విచారంతో వున్నాడు. ఆ విషయములో అతనికి అంత ప్రవేశము లేదు. ప్రొఫెసర్ ప్రోత్సహించి అతనిని పరీక్షకు పంపి, తాను ఆసన మేసుకుని గాయత్రీ జపించడము ప్రారంభించాడు. తన మేనల్లుడు తిరిగి వచ్చేవఱకు వెంటవెంటనే గాయత్రీ జపించారు. ఆ బాలుడు తిరిగొచ్చి పరీక్షలు బాగా వ్రాశాననీ, వ్రాసేటప్పుడు తన కలము నెవరో పట్టుకుని వ్రాసినట్లయినదని చెప్పాడు. మంచి మార్కులతో పరీక్షలో విజయము పొందాడు.

అలహాబాద్‌కు చెందిన పండిత ప్రతాపనారాయణ చతుర్వేది వుద్యోగము పోయినది. ఎంత ప్రయత్నించినను వేఱొక వుద్యోగములో ఖాళీ దొరకలేదు. తన తండ్రి ఆదేశానుసారము ఒక లక్ష ఇరవై ఐదువేల గాయత్రీ జపము చేశాడు. జపము పూర్తికాగానే పాయనీర్ ప్రెస్ లో ప్రత్యేక వుద్యోగము రెండున్నరరెట్ల వేతనంతో దొరికినది. అచట అంతకుముందు అనేకసార్లు ప్రయత్నించినప్పటికి ఫలితములేకపోయినది.

కలకత్తాకు చెందిన గౌ॥ మోడకమ్ కేజడీవాల్ ఆరంభంలో జోధ్‌పూర్ రాజ్యంలో నొక గ్రామంలో 12రూ॥ జీతంతోనున్న అధ్యాపకుడు. ఒక పుస్తకంతో ఆకర్షింపబడి గాయత్రీ జపము చేయడము మొదలెట్టాడు. జపము చేస్తూచేస్తూ తాను కలకత్తా వెళ్ళవలెననే స్ఫురణ కలిగినది. అచటనే తన ఆర్థికోన్నతి కలదనే భావము కలిగినది. నిదానంగా కలకత్తా వెళ్ళాడు. అచట వ్యాపారక్షేత్రంలో వుద్యోగము చేస్తూ గాయత్రిని సాధన చేసేవాడు. పగడాల వ్యాపారంలో అతనికి అధిక లాభము చేకూరి, కొద్దికాలంలోనే లక్షాధికారి అయ్యాడు.

బుల్‌ఢానాలోని శ్రీప్రదీప్ ప్రసాద్ వర్మ హీనమైన ఆర్థికస్థితిలో వుండేవారు. 50 రూ॥ల నెలజీతంతో తన 8 మంది కుటుంబసభ్యులు పోషింపబడాలి. వివాహ యోగ్యమైనపుత్రిక వున్నది. మంచి కుటుంబముతో వియ్యమందటానికి వేలకొద్ది ధనము కావలెను. దుఃఖముతో గాయత్రీమాత చరణములపై కన్నీరు కార్చేవాడు. అకస్మాత్తుగా ఒక డిప్యూటి కలెక్టరుగారి కుమారుని వివాహము, కన్యాదాతతో జగడమైనందున ఆగిపోయి, తిరిగి వెళ్ళుచున్నారు. డిప్యూటి కలెక్టరు వర్మగారు తెలుసు. మార్గమధ్యంలో వర్మగారి గ్రామమున్నది. కలెక్టరు వర్మగారివద్దకు ఆయన కుమార్తెతో నేడు వివాహము జరిపించవలసినదని కబురుపంపాడు. వర్మగారు తన అంగీకారమును తెలిపారు. యం.ఎ. లో ఉత్తీర్ణుడైన వరుడు 600 రూ॥ మాసపు వేతనము పెండ్లికుమారునితో వివాహము జరిగినది.

డెహరాడూన్‌లోని వసంతకుమార్ అనే విద్యార్థి మెట్రిక్ రెండుసార్లు తప్పి, ఆశ వదులుకున్నాడు. అతడు గాయత్రీ ఉపాసన గావించి మంచి మార్కులతో మెట్రిక్‌లో వుత్తీర్ణుడయినాడు.

సంబత్‌పూర్‌కు చెందిన బాబు కౌశల్ కిశోర్ మహేశ్వరి సవర్ణులుకానీ మాతాపితలకు జన్మించినందున జాతి బహిష్కరణ గావింపబడినాడు. వివాహము కానందున అతడు బహుదుఃఖితుడయినాడు. గాయత్రీమాతకు తన దుఃఖమును విన్నవించుకొని తన హృదయాన్ని తేలికపఱచుకొనేవారు. 26 సంవత్సరముల ప్రాయమపుడు అతని వివాహమొక వున్నతకుటుంబ కన్యతో అయినది. మహేశ్వరీ తమ్ములకు, చెల్లెళ్ళకు వివాహములుకూడ ఉన్నత కుటుంబాలతో జరిగినవి. జాతి బహిష్కృతావమానమునుండి వారు సంపూర్తిగా విముక్తులయినారు.

హృదయనంగరుజిల్లామండలములోని శంభుప్రసాద్‌మిత్రా గాయత్రీదేవి అనన్య భక్తుడు. తనయొక్క అనేక సద్గుణసంపత్తితో విరోధిని జయించి డిస్ట్రిక్టుబోర్డు ఛైర్మన్ అయినాడు.

బహాల్‌పూరు రాధావల్లభతివారీ వివాహమై 16 సంవత్సరములు గడిచినప్పటికి సంతానము కలుగలేదు. ఆయన గాయత్రీ నాశ్రయించాడు. ఫలస్వరూపంగా ఆయనకొక పుత్రిక, పుత్రుడు కలిగారు.

ప్రాచీనకాలంలో దశరథునకు గాయత్రీద్వారా పుత్రకామేష్ఠియజ్ఞము చేసిన తరువాత, దిలీపమహారాజు గురువు వశిష్ఠుని ఆశ్రమంలో గాయత్రీ ఉపాసన చేస్తూ గోదుగ్ధముల కల్పము గ్రోలినందున మంగసంతతి ప్రాప్తించినది. అశ్వపతిరాజు గాయత్రీ యజ్ఞము ద్వారా సంతతి బడసినాడు. పురుష సంపర్కము లేకుండా కుంతీదేవి గాయత్రీమంత్రముద్వారా సూర్యుని ఆకర్షించి కర్ణునకు జన్మనిచ్చినది.

ఢిల్లీలో నయీసడ్ మీద శ్రీబుద్ధారామ్‌భట్ పేరుగల దుకాణదారుడున్నాడు. ఆయనకు 45 సంవత్సరముల వఱకు సంతానము లేదు. గాయత్రీ ఉపాన వలన ఆయనకు జీవిత సంధ్యాసమయములో పుత్రోదయం కలిగినది. కుమారుడు సుందరుడై చలాకీగా వున్నాడు.

గురుకుల బృందావనములోని కార్యకర్తలు సుదామామిశ్రకు 14 సంవత్సరములవఱకు పురుషసంతానము కలుగలేదు. గాయత్రీ పురశ్చరణ గావించినందున ఒక పుత్రుడు జన్మించాడు. వంశము నిలిచినది. దర్వాజా తెఱచివుంచే బాధ తప్పిపోయినది.

సర్‌సయా లోని జీవనలాల్ 3 సంవత్సరములు చలాకీ, తెలివిగల కుమారుడు స్వర్గస్థుడైనాడు. అతడు పుత్ర వియోగంతో కృంగిపోయాడు. అతడు గాయత్రీ విశేష ఉపాసన గావించాడు. రెండవనెలలో అతని భార్యకు స్వప్నంలో కుమారుని ఎత్తుకున్నది. అంతలోనే ఆ బాలుని హృదయము పైకి తీసికొనదలచినది. కానీ ఆ బాలుడు ఆమె గర్భంలోకి దూరిపోయాడు. ఈ స్వప్నము తరువాత 9 నెలలకు ఆమెకు పుత్రుడు జన్మించాడు. ఆ బాలుడు అన్నివిధముల చనిపోయిన కుమారుని వలె వున్నాడు. ఆ కుమారుని గని వారు శోకము వీడి శాంతిని పొందారు.

వైద్యనాథ్ ఛాయరాజీ ఛాయభులారే విద్వాంసులద్వారా అనేక పర్యాయములు గాయత్రీ అనుష్ఠానంలో అద్భుత ఫలితముల నిచ్చాయి. ఆఱుగురు పుత్రికల తర్వాత అతనికి పుత్రుడు జన్మించాడు. 17 సంవత్సరములనుండి వున్న మూలవ్యాధి నయమైనది. అతని వ్యాపారంలో యిదివరకటికన్నా అధిక లాభములు పొందినాడు.

డోరిబజార్ పూజామిశ్రా యీవిధంగా వచించాడు. మా తండ్రి దేవప్రసాద్‌గారు ఒక గాయత్రీ ఉపాసకుడైన మహాత్ముని శిష్యుడు. మా తండ్రి పరిస్థితి హీనమైనది. మా తండ్రి దుఃఖాన్ని చూసి మహాత్ముడు గాయత్రీ ఉపాసన బోధించాడు. ఫలితంగా పొలంలొ యెక్కువ లాభాలు రావడము ప్రారంభయినాయి. చిన్న కమతంలో యెక్కువ లాభము వలన మా తండ్రి ఆర్థికపరిస్థితి బాగా పుంజుకొని మిగిలిన 20 వేలు బ్యాంకులో వేశాము.

గుజరాత్‌లోని ఈడర్ రాజ్యపు నివాసి పండిత గౌరీశంకర్‌దేవాశంకర్ యాజ్ఞిక్ 15 సంవత్సరముల వయస్సునుండి గాయత్రీ ఉపాసన ప్రారంభించాడు. చిన్న వయస్సులో 20 లక్షలు చొప్పున మూడుసార్లు గాయత్రీ పురశ్చరణ గావించాడు. దీని ఫలితంగా జ్ఞానము, అన్య శుభసంస్కారములు యెక్కువగా వృద్ధిచెందినాయి. అందువలన వారెచ్చటకు వెళ్ళినా ఆదరము, సన్మానము ప్రాప్తించాయి. వీరి పూర్వులు పూనాలో ఒక పాఠశాలను స్థాపించారు. అందులో విద్యార్థులకు వున్నతస్థాయికి చెందిన ధార్మిక శిక్షణ నొసంగేవారు. గౌరిశంకర్‌గారు యీ పాఠశాలను తన యింటిముందే యేర్పరచారు. విద్యార్థులకు గాయత్రీ ఉపాసన నేర్పడమువలన యెవరయినా అసహాయవిద్యార్థి తన భోజనమునకు స్వయంగా భరించలేనియెడల ఆ విద్యార్థి ప్రతిదినము సహస్రగాయత్రీ జపించితే, భోజనము ప్రాప్తించే నియమాన్ని వారు యేర్పరచారు. దీని పరిణామంగా పూనాలో వీరిని అచటి బ్రాహ్మణులు ఘురానాగురుగృహమని ప్రసిద్ధ నామ మొసంగినారు.

జబల్‌పూరులోని రాధేశ్యామ్ గృహంలోని వ్యక్తులను రోగములు పీడిస్తూవుండేవి. అతని రాబడిలో ఎక్కువ భాగము వైద్యానికి, వైద్యులకే వినియోగించవలసివచ్చేది. అతడు గాయత్రీ జపము ప్రారంభించినప్పటినుండి ఆ గృహము రోగవిముక్తి పొందినది.

గాయత్రీ సాధన వలన విపత్తుల నివారణ

విపరీతపరిస్థితుల ప్రవాహము చాల ప్రబలంగా వుంటుంది. ఆ ప్రవాహవలయంలో చిక్కిన వ్యక్తి విపత్కర పరంపరలవైపు పురోగమిస్తాడు. వ్యాధి, ధనహీనత, కోర్టువ్యవహారము, శతృత్వము, బికారీదనము, గృహకలహములు, వివాదములు, పన్నులు మొదలయిన శృంఖలపరంపరలు రగుల్కొంటాయి. వాటితో మానవుడు హైరానాపడతాడు. సామెత వుండనే వున్నది. కష్టములు ఒంటరిగా రావు. తన పిల్లాజెల్లా సహితంగా వచ్చిచేరుతాయి. ఒక కష్టము వచ్చినవెంటనే దానితోపాటు ఇంకా అనేకమైన విపత్కరపరిస్థితులు అదే సమయములో వాటిల్లుతాయి. నాల్గుదిశలు క్రమ్ముకొన్నందున మనుష్యుడు తాను చక్రవ్యూహంలో చిక్కుకున్న అనుభవాన్ని పొందుతాడు. అట్టి ఆపత్సమయములో నిరాశ, చింత, భయము, నిరుత్సాహము, అస్థిరత, కింకర్తవ్యవిమూఢతల నుండి కాళ్ళుచేతులు కదిలించలేక శోకతప్తులై అధికసమయము వఱకు అత్యధికంగా కష్టములను అనుభవిస్తాడు.

ఆపదలు, విపరీతపరిస్థితుల సతతధారాప్రవాహమునుండి రక్షణ పొందుటకు, ధైర్య, సాహస, వివేక ప్రయత్నముల ఆవశ్యకత వున్నది. ఈ నాలుగు కోణముల నావ నధిరోహించి సంకట ప్రవాహమును తరించుట సుగమము. గాయత్రీ సాధన ఆపత్సమయములో యీ నాలుగు తత్త్వములను మనుష్యుని అంతఃకరణములో విశేషంగా ప్రోత్సహించుతుంది. దీనివలన సవ్యమైన మార్గము నన్వేషించుటకు కృతకృత్యుడై ఆపదల నధిగమించుతాడు.

ఆపదలలో చిక్కిన అనేకమంది వ్యక్తులు గాయత్రీ యొక్క కృపవలన ఏప్రకారముగా ఆ కష్టములను దాటారో కొన్ని వుదాహరణలు మా దృష్టిలో కొచ్చినవి యీవిధంగా వున్నాయి.

ఘాట్‌కోసర్ బోంగాయిలోని శ్రీ ఆర్.బి. వేద్ గాయత్రీదేవి కృపవలన మతకల్లోలములలో ముస్లింబస్తీలోనుండి నిర్భయంగా సంచరించేవాడు. ఆయన పుత్రిక కొకసారి భూతమావేశించినది. ఇదికూడ యీ దేవిఅనుగ్రహమున శాంతించినది. ఒక ప్రముఖమైన కోర్టు కేసులో తాను హాజరుకానప్పటికి అనుకూలమైన తీర్పు వచ్చినది.

ఇండోరు, కాంగడాకు చెందిన చౌ సేమర్‌సింహ జలము, వాయువు నిర్మలంగా లేనిచోట వ్యాధిగ్రస్తుడైనాడు. అచట వైద్యుడు లభ్యం కాదు. గాయత్రీ ప్రార్థనతో భయంకరవ్యాధినుండి విముక్తుడయినాడు.

బొంబాయిలోని రామశరణ్‌శర్మ గాయత్ర అనుష్ఠానము ఆరంభించినప్పటినుండి వ్యాధి పీడితులయిన ఆయన తల్లిదండ్రులు వ్యాధి తగ్గి, ఆరోగ్యవంతులయినారు.

సీకర్‌కు చెందిన భగవాన్ సోమాన్ ఉష్ణంతో భయంకర రోగపీడితుడైనాడు. అతని బావమఱిది శివరతన్ గారు గాయత్రీ చేయవలసినదిగా సలహానిచ్చినారు. ఏలననగా గాయత్రివలన తాను కుటుంబకలహమునుండి, తన భార్య

అస్వస్థతనుండి విముక్తుడయినాడు. సోమాన్‌వ్యాధి భయంకరమైనది. భిల్‌మోరియా లాంటి ప్రముఖ సర్జన్లుకూడ ఎముకలు తీసినపుడే వ్యాధి నెమ్మదిస్తుందనీ, లేనియెడల పక్షమురోజులలో వ్యాధి చేజారిపోతుందని అన్నారు. అట్టి భయంకర పరిస్థితులలో సోమాన్ గాయత్రీ చరణముల నాశ్రయించి స్వస్థత పొందినాడు. ఇపుడాతడు రోహినీపూర్‌లో గాయత్రీమంత్రముతో సర్పదంష్ట్రుల విషవిముక్తి చేయుచున్నాడు.

రోహైడా నివాసి శ్రీనేనూరామ్ 20 సంవత్సరములనుండి వ్యాధితో నున్నారు. వైద్యములవలన ప్రయోజనమే లేకపోయినది. వ్యాధి నిరోధింపబడలేదు. గాయత్రీ ఉపాసనవలన వారికి పూర్తి స్వస్థత చేకూరినది.

ఈవిధంగా అగణిత ఉదాహరణలు దొరకగలవు. వీటిలో గాయతీ ఉపాసనద్వారా రాజసిక వైభవంతో సాధకులు లబ్ధి పొందారు.

ఇటౌ ఆధురాకు చెందిన వైద్యుడు రామనారాయణగారియొక్క మరణించిన పత్ని, అతని స్వప్నంలో కనబడి గాయత్రీ జపము చేసే విధానాన్ని నేర్పినది. అప్పటినుండి యాతడు గాయత్రీ సాధన చేసేవాడు. అతని వృత్తిలో అపారమైన యశము గడించాడు. మొండివ్యాధులను తిరుగులేకుండా కుదిర్చేవాడు.

కన్‌కువా అమీర్‌పురులోని లక్ష్మీనారాయణ శ్రీవాత్సవ, బి.ఎ., ఎల్.ఎల్.బి. వారి ధర్మపత్ని ప్రసవకాలములో అత్యంత కష్టపడేది. గాయత్రీ ఉపాసనద్వారా ఆమె ప్రసవవేదన చాల తక్కువగా వుండేది. ఒకసారి వారి కుమారుడు ఆటలమ్మ పోసి చాల బాధపడ్డాడు. వకీలుగారి గాయత్రీ ప్రార్థనతో ఆ బాలకునకు గాఢనిద్రపట్టి క్రమేణా స్వస్థుడయినాడు.

జపర్‌పూర్‌లోని ఠా. రామకరణసింహజీ వైద్యగారి ధర్మపత్ని రెండు సంవత్సరముల నుండి అతిసారవ్యాధితో నుండెను. అనేక చికిత్స లాచరించినప్పటికి ప్రయోజనము శూన్యమైనది. ఒక లక్షా ఇరవై ఐదువేల జపానుష్ఠానము చేసి ఫలితంగా ఆమె సంపూర్ణంగా స్వస్థురాలయినది. తరువాత ఒక పుత్రికకు జన్మనిచ్చినది.

కసరాబాద్, నిమాడ్‌కు చెందిన శంకర్‌లాల్ వ్యాస్ కుమారుడు వ్యాధిగ్రస్తుడైనాడు. వ్యాధి తీవ్రతనుగాంచి వైద్యులు నిరాశ చెందారు. పదివేల గాయత్రీ చేసినందువలన స్వస్థత చేకూరినది. ఒకసారి వ్యాస్‌జీ రాత్రి సమయమందు త్రోవమఱచి పర్వతములతో కూడిన దట్టమైన అరణ్యంలో ప్రవేశించారు. ఆ ప్రదేశము భయంకర క్రూరమృగములకు నిలయము. ఆ సంకట సమయములో వారు గాయత్రీని ధ్యానించారు. ప్రాణము రక్షింపబడినది.

విహియా, శహబాద్‌కు చెందిన శ్రీగురుచరణ ఆర్య ఒకానొక అభియోగంలో కారాగారమునకు వెళ్ళెను. విడుదలకొఱకు గాయత్రీ జపమాచరించాడు. అకస్మాత్తుగా విడుదలైనాడు. అతని నిర్దోషిత్వము బయల్పడినది.

ముంద్రావజాకు చెందిన శ్రీ ప్రకాశ నారాయణమిశ్రా పదవ తరగతిలో కుటుంబపరిస్థితులవలన విద్యపై ధ్యానముంచలేదు. పరీక్షలు 25 రోజులున్నవి. ఒకవైపు చదవడము, గాయత్రీ జపించడము ప్రారంభించాడు. ఉత్తీర్ణుడయ్యేందుకు ఆశ లేదు. కానీ విజయము పొందాడు. మిశ్రా తండ్రి శత్రువుల చక్రవ్యూహములో చిక్కుకుని కారాగారమునకు వెళ్ళాడు. గాయత్రీ అనుష్ఠానమువలన రక్షింపబడ్డాడు.

కాశీలోని పండిత ధరతీదత్తశాస్త్రి కథనము ప్రకారము వారి తాతగారు పండిత కన్హైయిలాల్ గాయత్రీ ఉపాసకులు. చిన్నతనంలో శాస్త్రిగారు వారి తాతగారితోపాటు రాత్రి పాలు తేవడానికి వెళ్ళారు. అచట భయంకర ప్రేతాత్మను చూశారు.

అది గేదెగాను సూకరంగాను మారుతూ వారిని ఆక్రమించటానికి ప్రయత్నించినది. అది ముఖంతోను, శిరస్సుతోను, భయంకరపు అగ్నిగి విడుస్తూ, మానవ, జంతు స్వరూపాలతో గంట గంటన్నరవఱకు భయోత్పాదన కలిగించినది. నేను భయపడటము గమనించి తాతగారు నాన్నా! మనము గాయత్రీ ఉపాసకులము. ఈ ప్రేతము మనకేమి హాని కలగించదు. చివఱకు వారు క్షేమంగా యింటికి చేరినారు. ఆ ప్రేతముయొక్క క్రోధము నిరుపయోగమైనది.

సనాథయ్-జీవన్ ఇటావా సంపాదకుడు పండిత ప్రభుదయాళ్‌శర్మ కథనముప్రకారము వారి కోడలు, మనుమరాలు ప్రేతాత్మ పీడితులైరి. పాదము, హస్తములు, శిరస్సు బాధచే పీడింపబడినవి. స్పృహలేకపోవడంకూడా కద్దు, రోగవిముక్తి కొఱకు అన్ని ప్రయ్నతములు నిష్ఫలంకాగా, గాయత్రీ నాశ్రయించిబాధలనుండి విముక్తిపొందారు. ఇదేవిధంగా శర్మాజీ సోదరుని కుమారుడు మృత్యుముఖంలోనుండగా, ఆ బాలుని ఒడిలో నుంచుకొని గాయత్రీ చేయగా బాలుని ఆర్యోగము కుదిరినది.

శర్మాజీ పెదనాన్నగారు దానాపూర్ వెళ్ళారు. వారు అచట స్నానము తరువాత గాయత్రీ జపమాచరించుచుండగా మధ్యలో అకస్మాత్తుగా వారి చెవిలో శబ్దమైనది. శీఘ్రమే లేచి పారిపో, ఈ గృహము ఇప్పుడే కూలిపోవనున్నది అని. కిటికీలోనుండి బయటకు దూకి పాఱిపోవటానికి ప్రయత్నించారు. కష్టముతో కిటికి నుండి 5 లేక 6 అడుగులు వెళ్ళారోలేదో ఆ గృహము శిథిలమైపడినది. వారు సురక్షితంగా వున్నారు.

శేఖపురాకు చెందిన అమోలక్ చంద్రగుప్తా శైశవంలో తండ్రిని కోల్పోయాడు. కిశోరావస్థలో తల్లి మరణించినందున, దుస్సాంగత్యమువలన అనేక దులవాట్లకు లోనయినాడు. స్నేహిత బృందము రోజంతా వుండేవారు. పేక, చదరంగము, గానాబజానా, వేశ్యానృత్యము, సిగరెట్, త్రాగుడు, పందెములు, వ్యభిచారము, నాట్యము, తమాషా, షికారు, ఆట, భోజనము, పార్టీలు మొదలైనవి జరిగేవి. ఈ కుచక్రములో తగుల్కొన్నందున 5 సంవత్సరములలో నగదు, ఆభరణాలు, ఇల్లు, 20 వేల రూపాయల ఆస్తులు అయిపోయినవి. అన్నీ హరించినతర్వాత ఆతడు జూదవ్యాపారము, వ్యభిచారము, చోరత్వము, జేబుకత్తిరింపు, దోపిడి, దగా చెయ్యడము మొదలైన క్రొత్తక్రొత్త పద్ధతుల ననుసరిస్తూ ఒక చిన్న జట్టుతో తాను కాలము గడుపుతుండేవాడు. ఈ సమయములో అతని మనస్సు ఎక్కువ అశాంతికి లోనయ్యేది. ఒకరోజాతనికొక మహాత్ముడు గాయత్రీ మంత్రము నుపదేశించాడు. అతని శ్రద్ధ వృద్ధి చెందినది. క్రమక్రమంగా ఉత్తమ విచారములు వృద్ధిచెందాయి. పశ్చాత్తాప, ప్రాయశ్చిత్త భావన అతనిలో ఆవిర్భవించినది. ఆతడు అనేక చాంద్రాయణ వ్రతములు, తీర్థయాత్రలు, అనుష్ఠానములు, ప్రాయశ్చిత్తములు గావించుకొన్నాడు. ఇపుడాతడొక దుకాణము పెట్టుకొని కాలము వెళ్ళబుచ్చుతున్నాడు. తన దురలవాట్లనుండి ముక్తుడైనాడు.

రాణీపూర్‌లోని అంగజీత్ రాథోర్ దోపిడీ కేసులో చిక్కుకున్నాడు. కారాగారములో ఆయన గాయత్రీ జపము చేసేవాడు. కేసులో అతనిని నిర్దోషి యని వదలినారు.

అంబాలా లోని మోతీలాల్ మహేశ్వరి కుమారుడు కుసాంగత్యమువలన భయంకర దురలవాట్లకులోనై తన కుటుంబకళంకానికి కారకుడయినాడు. మహేశ్వరి దుఃఖితుడై గాయత్రీ శరణుజొచ్చాడు. ఆ తపశ్చర్య ప్రభావంగా ఆతని కుమారుని మనస్సు మారి అశాంతిపూరక కుటుంబములో శాంతి నెలకొల్పబడినది.

టోంకు కు చెందిన శివనారాయణ శ్రీవాత్సవగారి తండ్రిగారి మరణానంతరము వారి జమిందారీకి సాలుకు 2000 ఆదాయముతో ఆ కుటుంబములో 16 గురు వ్యక్తులు బ్రతుకవలసి వచ్చినది. పరిశ్రమ చేసేవారులేరు. కానీ ఖర్చుమాత్రము పెరుగుతూవున్నది. మొత్తము జమిందారీ ద్వారానే భరించవలసివచ్చేది. క్రమంగా ఆ గృహము గృహమంతా కలహ వ్యాయామశాలగా మారినది. కొట్లాటలు, కోర్టుల ఆశ్రయము ప్రవేశించినది. శ్రీవాత్సవ కిదంతా దుఃఖకారణమయినది. ఏలనన అతడే ఆతని తండ్రితరువాత ఉత్తరాధికారీ, గృహపతి. దుఃఖితుడై ఒక మహాత్ముని ఆదేశానుసారంగా గాయత్రీ జపమారంభించాడు. పరిస్థితులు మారినవి. ఆలోచనలలో సంస్కారముకలిగినది. సంపాదించగలిగినవారు ఉద్యోగమో, వ్యాపారమో చేయుట మొదలిడినారు. కలహము శాంతించినది. వణుకుచున్న గృహము విచ్ఛిన్నతనుండి రక్షింపబడినది.

అమరావతీలోని సోహన్‌లాల్ మెహరోత్రా భార్య భూత బాధతో నుండెడిది. చాల కష్టమైనది. వేల రూపాయలు ఖర్చయినవి. ఆమె రోజురోజుకు కృశించినది. ఒకరోజు మెహరోత్రాజీ స్వప్నంలో వారి తండ్రి యిలా చెప్పారు. 'కుమారా! గాయత్రీ జపము చేయి. అన్ని విపత్తులు తొలగుతాయి.' మరుసటిరోజునుండి అలాగే చేశాడు. ఫలితంగా ఉపద్రవము శాంతించినది. ఆమె వ్యాధి కుదిరినది. ఆమె చెల్లెలు ఆడబిడ్డకూడ యిదే ఉపాయంతో భూత బాధనుండి విముక్తి చెందినది.

గాయత్రీ జీవిత కాయకల్ప చికిత్స

గాయత్రీమంత్రము ఆత్మిక కాయకల్పమవుతుంది. ఈ మహామంత్ర ఉపాసన ఆరంభించినంతనే సాధకుని ఆంతర్యంలో ప్రత్యేక భావము ప్రజ్వరిల్లుతుంది. ‘ నా ఆంతరంగికక్షేత్రంలో నవ్యస్పందనై, తుచ్ఛత పరివర్తనము చెందడము ప్రారంభించినది అని తలపోస్తాడు. సత్త్వగుణాభివృద్ధి జరగడంవలన, దుర్గుణములు, దుఃఖభావము, దుర్భావములు తగ్గుట ఆరంభమౌతుంది. సంయమనము, నమ్రత, పవిత్రత, ఉత్సాహము, స్ఫూర్తి, శ్రమశీలత, మధురత, నిజాయతీ, సత్యనిష్ఠ, ఉదారత, ప్రేమ, సంతోషము, శాంతి, సేవాభావము, ఆత్మీయత మొదలైన సద్గుణముల పరిమాణము దినదినానికి వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఫలస్వరూపంగా ప్రజ లాతని స్వభావాచరణముల వలన సంతుష్టిచెందుతారు. దానికి ప్రతిగా ఆతనియందు ప్రశంసాపూర్వక, కృతజ్ఞత, శ్రద్ధ, అభిమానము నెలకొనివుంటాయి. ఆతని అవసర సమయములందు సహాయపడతారు. అదనంగా సద్గుణములు స్వయంగా మధురమైనవి. ఏ హృదయంలో సద్గుణములు నివసిస్తాయో, అచట ఆత్మసంతోషమువలన పరమశాంతిదాయక శీతలనిర్ఝరిణి సదా ప్రవహిస్తూవుంటుంది.

గాయత్రీ సాధనచే, సాధకుని మనోక్షేత్రమందు అసాధారణ పరివర్తన జరుగుతుంది. వివేకము, తత్త్వజ్ఞానము, ఋతుంభరాబుద్ధి అభివృద్ధి చెందినందున అనేక అజ్ఞానజనిత దుఃఖముల నివారణ జరుగుతుంది. ప్రారబ్ధవశమున అనివార్య కర్మఫలకారణ కష్టసాధ్య పరిస్థితులు ప్రతివ్యక్తి జీవితంలో సంభవించుతాయి. హాని, శోకము, వియోగము, ఆపదలు, వ్యాధులు, దాస్యత, విరోధము, అఘాతము మొదలైన విభిన్న పరిస్థితులలో సాధారణ మనుష్యులు మృత్యు కష్టమును అనుభవిస్తారు. కానీ అదే పరిస్థితిలో గాయత్రీ సాధకుడు తన వివేకంతో జ్ఞాన, వైరాగ్య, సాహస, ఆశ, ధైర్య, సంతోష, సంయమ, ఈశ్వర విశ్వాసాధారంపై కష్టములను నవ్వుతు సులభంగా దాటుతాడు. దౌర్భాగ్య పరిస్థితులలోగాని, సాధారణ పరిస్థితులలోగాని, తన దైన ఆనంద మార్గాన్నన్వేషించుకొంటాడు. పరిపూర్ణ ప్రసన్నతా జీవనము గడుపుతాడు.

ప్రపంచములోనున్న అధిక ప్రయోజనకారి ఆత్మబలము. ఇది గాయత్రీ సాధకునకు ప్రాప్తించుతుంది. దీనితోపాటు అనేక ప్రాపంచిక సుఖాలుకూడ అనుభవించుతాడు. వ్యాధి, బలహీనత, వృధాగా కాలము గడపడము, కపటము, గృహకలహములు, మనోమాలిన్యము, కోర్టుకేసులు, శత్రువుల దాడి, దాంపత్యసుఖము నందు కొఱత, మస్తకబలహీనత, అస్థిరచిత్తము, సంతానదుఃఖము, కుమార్తె వివాహములు లాంటి కష్టములు, చెడ్డ భవిష్యత్తును గూర్చి శంక, పరీక్షయందు అపజయము కలుగునను భయము, చెడు అలవాట్లు కలిగిన అగణిత వ్యక్తులు ఆరాధించి తమ దుఃఖములను నివారించుకున్నారు.

కారణమేమనగా ప్రతి కష్టమునకు వెనుక మూలకారణము నిశ్చయంగా కొంచెములో కొంచెమైనా తన పొరపాట్లు, అయోగ్యతలు, దోషములు వుంటాయి. సద్గుణాభివృద్ధితోపాటు మన ఆహారవిహారములలోను, దినచర్యలోను దృష్టికోణములోను స్వభావంలోను పరివర్తన తప్పక జరుగుతుంది. ఈ పరివర్తనము ఆపదల నివారణార్థము, సుఖశాంతులు పొందుటకొఱకు రాజమార్గమౌతుంది. అనేక పర్యాయములు మన యిష్టానిష్టములు, తృష్ణలు, లాలలసులు, కామనలు, మన యోగ్యతలకు పరిస్థితులకు అనుకూలంగా వుండవు. మస్తిష్కము శుద్ధియైనంతనే, బుద్ధిమంతుడైన వ్యక్తి మృగతృష్ణలను త్యజించి, భ్రమచే జాజ్వల్యమానమగు అకారణ దుఃఖమునుండి విముక్తుడౌతాడు. అవశ్యము సంభవించేది, తొలగించుటకు వీలులేని ప్రారబ్ధాన్ననుభవించవలసివచ్చినపుడు సాధారణవ్యక్తి అసహ్యంగా దుఃఖించి శోకిస్తాడు. కానీ గాయత్రీ సాధనకున్న ఆత్మబలంచే సంభవించిన సాహసంతో ప్రారబ్ధాన్ని నవ్వుతూ భరిస్తాడు.

ఏదైనా విశేష ఆపదను నివారించుకొనుటకు ప్రత్యేక ఆవశ్యకత కలిగినపుడు గాయత్రీ సాధన చేయవచ్చు. బహుధా దీని పరిణామము ఆశ్చర్యజనకముగా వుంటుంది. నలుదిక్కులా నిరాశ, అసఫలత, అనుమానము, భయములనే అంధకారము వ్యాపించినపుడు అచట వేదమాత కృపవలన నొక దైవీప్రకాశము వుత్పన్నమై నిరాశ, ఆశారూపమును పొంది గొప్ప కష్టసాధ్య కార్యము స్వల్పమై సుగమమగుట సాదృశ్యంగా జరిగినది. ఇటులనే అనేక పర్యాయములు మా కండ్లతో జూచినందువలన గాయత్రీ యందు అచంచల విశ్వాసము గలిగినది. గాయత్రీ సాధన ఎప్పుడూ, ఎవ్వటికీ నిష్ఫలము కాదు.

గాయత్రీ సాధన ఆత్మబలము పెంపొందుటకు అమోఘమైన ఆధ్యాత్మిక వ్యాయామము. ఇతఱులను కుస్తీలో చిత్తుచేయుటకు, కుస్తీ పందెములు గెలిచి బహుమతులను పొందుటకు పహిల్వానులు వ్యాయామము నభ్యసిస్తారు. అభ్యసించిన వస్తాదు ఎపుడైనా కుస్తీలో అపజయము పొందినంతమాత్రాన అతని ప్రయత్నము నిష్ఫలమని తలవరాదు. ఈ నెపంతోనే అతని శరీరము అనేక ఫలితములను పొందుతుంది. నిరోగిత, సౌందర్యము, దీర్ఘజీవనము, కఠోరపరిశ్రమకు తగిన ఓర్పు, దాంపత్యసుఖము, సుసంతతి, శత్రువులంటే నిర్భయత్వము మొదలైనవి కుస్తీ గెలవడంకన్నా తక్కువ వేమీ కావు. గాయత్రీ సాధన వలన అనేకరెట్లు లాభము చేకూరుట యేదోవిధంగా ననేది నిశ్చయము.

ఆత్మ స్వయంగా అనేక వృద్ధిసిద్ధులకు కేంద్రము. పరమాత్మలో ఏయే శక్తులున్నాయో, ఆ శక్తులన్నీ ఆయనకు అమర యువరాజైన ఆత్మలో నున్నవి. సమస్త వృద్ధి-సిద్ధులకు కేంద్రము ఆత్మలో నున్నది. ఏలననగా నివురుచే కప్పబడిన అగ్ని మందముగా మారుతుంది. అట్లే ఆంతరిక మలినములవలన ఆత్మతేజము కుంఠితమౌతుంది. గాయత్రీ సాధనవలన మాలిన్యపు తెర తొలగుతుంది. అగ్నిపైనున్న బూడిద తొలగినవెంటనే అగ్ని తన ప్రజ్వలిత రూపంతో దర్శనమిస్తుంది. అదేవిధంగా సాధకుని ఆత్మగూడా తన వృద్ధి సిద్ధి సమన్విత బ్రహ్మతేజముతో వ్యక్తమౌతుంది. దీర్ఘకాలము కష్టసాధ్యమైన తపస్సొనరించిన యోగు లే లబ్ధి పొందుతారో, అదే గాయత్రీ సాధకులకు స్వల్ప ప్రయాసతో ప్రాప్తిస్తుంది.

ఈ గాయత్రీ ఉపాసనా ప్రభావము యీ సమయమందుగూడ అనేక సమయాలలో సాదృశ్యంగా నున్నది. గత 50 సంవత్సరాలలో వందలకొద్ది వ్యక్తులు గాయత్రీ ఉపాసనా ఫలితాన్ని పొందినారు. వారు తమ జీవితములను ఉత్తమమైన, సార్వజనికదృష్టితో కళ్యాణకరము, పరోపకారముగా మలచుకొన్నారు. దీనివలన యితఱ వేలమంది ప్రజలకు

ప్రేరణ ప్రాప్తించినది. గాయత్రీ సాధనవలన ఆత్మోత్కర్షగుణాభివృద్ధి యెంత పొందగలరనగా, దానివలన జీవిత కళ్యాణము, సంస్కారముతప్ప యేవిధమైన అరిష్టములు కలుగవు.

ప్రాచీనకాలంలో మహర్షులు ఘోరతపస్సాచరించి యోగసాధనలచే అణిమ, మహిమ మొదలైన సిద్ధులను పొందినారు. వారియొక్క దివ్యశక్తులయొక్క వర్ణనలతో పురాణేతిహాసములు నిండివున్నాయి. ఆ తపస్సు, యోగసాధన, గాయత్రీ ఆధారంతో గావించారు. ఇపుడుగూడ అనేకమంది మహాత్ములవద్ద దైవీశక్తుల, సిద్ధుల భండారమున్నది. వారందరూ గాయత్రీకన్నా యోగమార్గములలో సుగమ్యమైన ఫలితాన్ని ప్రసాదించే మార్గము వేఱొకటిలేదు అని వక్కాణించారు. సిద్ధపురుషులేగాక, అదనంగా సూర్యవంశపు చంద్రవంశపు చక్రవర్తులందఱూ గాయత్రీ ఉపాసకులే. బ్రాహ్మణులు గాయత్రీ బ్రహ్మశక్తిచే జగద్గురువులైనారు. ఈ సనాతన సత్యము నేడుకూడ అటులనే వున్నది. గాయత్రీమాత చేలాంచలమును శ్రద్ధాపూర్వకంగా గ్రహించిన మానవుడు నిరాశను పొందడు.

స్త్రీలకు గాయత్రీ సాధన

ప్రాచీనకాలంలో గార్గీ, మైత్రేయి, మదాలస, అనసూయ, అరుంధతి, దేవయాని, అహల్య, కుంతి, శతరూప, బృంద, మండోదరి, తారా, ద్రౌపది, గౌతమి, అపాలా, సులభా, శావతీ, ఉశిజా, సావిత్రి, లోపాముద్రి, ప్రతిశేయ, వైశాలనీ, బైందులా, సునీత, శకుంతల, పింగళా, జరుత్కార, రోహిణీ, భద్రా, విదులా, గాంధారి, అంజనీ, సీత, దేవహూతి, పార్వతి, అదితి, శచి, సత్యవతి, సుకన్య, శైవ్య మొదలైన సతు లందఱూ వేదజ్ఞులు మఱియు గాయత్రీ ఉపాసకులు. వారు గాయత్రీ శక్తి నుపాసించడంద్వారా తమ ఆత్మలను సమున్నతము గావించుకొనుటయేగాక, యోగసిద్ధులను పొందారు. వారు పునీతులై గృహస్థులై, సధవులై సావిత్రిని ఆరాధించుటలో సఫల మనోరథులైనారు. ఈ మహా స్త్రీల విస్తృత వృత్తాంతాన్ని వారి సాధనలను సిద్ధులను వర్ణించుటకు యీ చిన్న పుస్తకములో సంభవము కాదు. భారతీయ ఇతిహాస, పురాణములను పఠించినవారికి పైన వుదహరించిన దేవతాస్త్రీమూర్తుల విద్వత్తు, సాహసము, శక్తి, శౌర్యము, దూరదృష్టి, నీతి, ధర్మము, సాధన, ఆత్మోన్నతి మొదలైన పరాక్రమాలు తమ పద్ధతిలో అమూల్యమైన జాజ్జ్వల్యమాన తారకలు. వారు వివిధ సమయములలో గావించిన చమత్కారములను గమనించిన మనము ఆశ్చర్యచకితులమౌతాము.

అనసూయ తపస్సు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శిశువులనుగా మార్చినది. శాండిలీ తన తపోబలంచే సూర్యరథ గమనాన్ని నిలిపివేసినది. సుకన్య తపఃశక్తిచే జీర్ణ, శీర్ణ శరీరుడైన చ్యవనుని తరుణుని గావించినది. స్త్రీలయొక్క అపూర్వ ఇతిహాసము, పురుషులకంటే తక్కువేమి కాదు. స్త్రీ, పురుషులిద్దరికి ప్రముఖమార్గము 'గాయత్రీ' యే నని స్పష్టమైనది.

వర్తమానకాలంలోకూడ అనేకమంది స్త్రీలు గాయత్రీ సాధన చేసినవారు మాకు పరిచితులు. గాయత్రీద్వారా వారు అధిక ఆత్మికశక్తిని సాంసారికశాంతిని పొందినట్లుగా తెలియపఱచినారు.

ఒక సుప్రసిద్ధ ఇంజనీరు ధర్మపత్ని శ్రీమతి ప్రేమప్యారిదేవికి అనేక ప్రకారములుగా కుటుంబ కఠిన సమస్యలు ఎదురైనాయి. అనేక కష్టసమయాలలో ఆమె గాయత్రీని ఆశ్రయించి విషమపరిస్థితులనుండి విముక్తి పొందినది.

ఢిల్లీలో అత్యంత వున్నతకుటుంబానికి చెంది, సుశిక్షితురాలైన శ్రీమతి చంద్రకళాదేవి బి.ఎ. గాయత్రీదేవి అనన్యసాధిక. ఈ సాధనద్వారా ఆమె రోగగ్రస్థులకు స్వస్థత చేకూర్చడంలో ఫలితమును పొందినది. నొప్పితో బాధపడేవారు యీమె హస్త స్పర్శతో బాధానిర్మూలనము పొందేవారు. ఈమె గాయత్రీ తపమాచరించుటలో తన్మయత్వము పొందేది. నిద్రలోకూడా తనంతతానే జపించుతుంది.

నగీనాకు చెందిన ప్రతిష్ఠావంతుడైన శిక్షాశాస్త్రిగారు ధర్మపత్నిశ్రీమతి మేధావతీదేవి బాల్యంనుండి గాయత్రీ జప సాధన చేయుటకు తన తండ్రినుండి ప్రోత్సాహము పొందినది. ఇప్పటివఱకు గాయత్రీని ప్రేమతో జపిస్తున్నది. అనేక చింతాజనక సమయాలలో గాయత్రీ కృపచే ఆమె మనోకామనలు సిద్ధించాయి.

శింలోగ్‌లో నొక సతీసాధ్వియైన మహిళ శ్రీమతి గుణవతీదేవి పతిదేవుని మృతి 20 సంవత్సరముల వయస్సులో జరిగినది. ఒడిలో 2 సంవత్సరముల కుమారుడున్నాడు. ఆమెకు, ఆమె మామగారికి మృత్యువు బలీయమైన ఆఘాతమై తగిలినది. శోకసందర్భమానసులై వారిద్దరు అస్థిపంజరములుగా తయారయినారు. ఒకరోజొక జ్ఞాని ఆమె మామగారికి గాయత్రీ ఉపదేశించారు. శోకనివారణార్థము ఆ జపమాచరించాడు. కొన్ని దినముల తదుపరి గుణవతీదేవి స్వప్నంలో నొక తపస్విని దర్శనమిచ్చి యిలా అన్నది. 'ఏవిధమైన చింతపడవద్దు. నేను నిన్ను రక్షిస్తాను. నా పేరు గాయత్రి, అవసరమొచ్చినపుడు నన్ను స్మరించు'. స్వప్నము కరిగినవెంటనే మరుసటి దినమునుండి ఆమె గాయత్రీ జపసాధన ప్రారంభించినది. గడచిన 13 సంవత్సరములలో ఆమెకు ఆపదలు సంభవించినపుడు అన్నియు విడిపోయినవి. ఇపుడామె కుమారునికి 16 సంవత్సరములు. బి.ఎ. చదువుతున్నాడు. అతనికి నెలకు 40 రూపాయలు స్కాలర్‌షిప్ లభ్యమౌతోంది. అతడు నెలకు 75 రూపాయలు ట్యూషన్ బోధించుచున్నాడు. కుటుంబము సవ్యముగా సాగుతున్నది. ఆ బాలునికి గాయత్రీపై అనన్యశ్రద్ధ వున్నది.

హైదరాబాద్‌లోని శ్రీమతి విమలాదేవి అత్తగారు మహాకర్కశ స్వభావురాలు. పతిదేవుడు త్రాగుబోతు. వేశ్యాగమనాది దురలవాట్లన్నీ వున్నాయి. విమలాదేవి అత్తగారివలన, భర్తగారివలన తిట్లు, దుర్భాషలు, తాడ-పీడనములు అనుభవించవలసి వచ్చినది. దానివలన ఆమె దుఃఖితయై అప్పుడప్పుడూ ఆత్మహత్య నొనరించుకొనవలెననికూడ ఆలోచించేది. విమలాదేవి మేనత్త ఆమె విపత్తి నివారణార్థముగా గాయత్రీమాత ఉపాసనా విధానాన్ని నేర్పినది. ఆమె చేయడము ప్రారంభించినది. ఫలితము ఆశాతీతంగా జరిగినది. కొన్నిరోజులలోనే అత్త, భర్తలయొక్క స్వభావములో ఆశ్చర్యజనకమైన మార్పొచ్చినది. ఒకరోజు భర్తకు భయంకర స్వప్నము వచ్చినది. కొంతమంది దేవదూత లాతని కుకర్మలకు ప్రాయశ్చిత్తముగా అనేక బాధ లాతనికి కలిగించారు. అవి మృత్యుతుల్యమైన బాధలు. స్వప్నము విడి మేల్కొనినంతనే అతని భ్రమపూర్వక మృత్యుతుల్య శిక్ష కొన్ని నెలలవఱకు వున్నది. ఆరోజునుండి భర్త స్వభావము చక్కబడినది. ఇపుడా పరివారము పరిపూర్ణమై, సంతుష్టిగా నున్నది. తన కుటుంబమును చక్కదిద్దినది గాయత్రీ యేనని విమలయొక్క దృఢనమ్మకము. ఆమె జపమాచరింపక భుజింపదు. అనేక సంవత్సరములనుండి ఆమె నియమమిది.

వారీసాల్‌లో నొక పెద్ద ఆఫీసరు ధర్మపత్ని శ్రీమతి హేమలతాచటర్జీకి 33 సంవత్సరములవఱకు సంతానము కలుగలేదు. ఆమె భర్త ఇతఱ కుటుంబసభ్యులకిది బాధాకరంగా నుండెను. అప్పుడప్పుడు ఆమె భర్తకు ద్వితీయవివాహ చర్చగూడ రావడము కద్దు. హేమలతకిది మానసిక వ్యధగా నైనది. ఆమెకు మూర్ఛరోగమొచ్చినది. ఒక సాధకుడు ఆమెకు గాయత్రీ సాధనావిధిని బోధించాడు. ఆమె శ్రద్ధాపూర్వకంగా ఉపాసించడము ప్రారంభించినది. ఈశ్వరకృపచే సంవత్సరము తరువాత కన్యక జనించినది. ఆమెకు గాయత్రీ యని పేరు. తరువాత రెండు రెండు సంవత్సరాల వ్యవధిలో ఇద్దరు పుత్రులు జన్మించారు. ఆ ముగ్గురు ఆరోగ్యంగా నున్నారు. ఈ కుటుంబమునకు గాయత్రీయందు ప్రగాఢ విశ్వాసము, అభిమానము వున్నది.

జైసల్‌మేర్‌లోని శ్రీమతి గోగన్‌బాయ్‌కి 16 సంవత్సరముల వయస్సునుండి హిస్టీరియా వ్యాధి వచ్చేది. ఎనిమిది సంవత్సరములనుండి ఆమె చాలా బాధపడుతున్నది. ఆమెకు ఉపవాసంతో కూడిన గాయత్రీ ఉపాసన బోధింపబడినది.

ఆమె అన్నమును త్యజించి పాలు, పండ్లతో జీవిస్తూ భక్తిపూర్వకంగా గాయత్రీ ఆరాధన గావించినది. నాలుగు మాసములలో 8 సంవత్సరముల వ్యాధి నివారింపబడినది.

గుజరన్‌వాలాకు చెందిన సుందరీబాయికి ప్రథమంగా కంఠమాలవ్యాధి వున్నది. అది కొంచెము నెమ్మదించిన వెంటనే ఆమెకు ప్రదరరోగము(శరీరమంతా పగులుట) భయంకరముగా వచ్చినది. ప్రతిగంటా ఎఱ్ఱటి ద్రవము బయటకు వస్తుంది. అనేక సంవత్సరాలు ఈ వ్యాధితో పడివున్నది. అందువలన ఆమె శరీరము అస్థిపంజరముగా తయారయినది. చర్మానికి, ఎముకలకు మధ్య మాంసము నామమాత్రంగా గూడ లేదు. కళ్ళు గుంటలుపడి లోనికి పోయాయి. గృహంలోని వారంతా ఆమె మృత్యువుకొఱకు ప్రతీక్షించుచున్నారు. ఆ స్థితిలో పొరుగున బ్రాహ్మణి గాయత్రీ తరణతారిణి యని పలికినది. ఆ దేవిని శరణుగోరమనినది. సుందరీబాయి మనస్సులో ఆ మాట నాటుకున్నది. ఆమె మంచముపైనుండియే జపము ప్రారంభించినది. ఈశ్వరకృపవలన నెమ్మదినెమ్మదిగా స్వస్థత చేకూరడము జరిగినది. పూర్తిగా కోలుకొనినది. రెండు సంవత్సరముల తరువాత ఆమెకు పుత్రుడు జన్మించాడు. అతడు ఆరోగ్యంగా, చురుకుగా వున్నాడు.

గోదావరిజిల్లాలో వసంతీదేవి భూతోన్మాదంతో బాధపడుతున్నది. భూతప్రేతాలు ఆమె శిరస్సుపై నున్నవి. 12 సంవత్సరముల వయస్సులోనే ఆమె వృద్ధురాలిగా మారినది. తన కుమార్తె పీడ వదలటానికి ఆమె తండ్రి చాల ధనము ఖర్చుచేశాడు. అతని వ్యాకులత పెరిగినది. ప్రయోజనము కనిపించలేదు. చివఱకు గాయత్రీ పురశ్చరణగావింపచేశాడు. కుమార్తె వ్యాధి కుదిరినది.

భార్దాకి చెందిన వైద్యుడు రాజరామశర్మగారి కుమార్తె సావిత్రిదేవి గాయత్రీ యందు శ్రద్ధ గలిగిన ఉపాసకురాలు. ఆమె గ్రామప్రాంతంలో నుండి ఆయుర్వేదాన్ని బాగా అధ్యయనము చేసినది. పరీక్షదినములలో రోగగ్రస్థురాలైనప్పటికి ఆయుర్వేదాచార్య పరీక్షలో ప్రథమశ్రేణిలో వుత్తీర్ణురాలైనది.

కాన్పూరుకు చెందిన అయోధ్యాప్రసాద్ ధర్మపత్ని శాంతిదేవి మిడిల్‌క్లాస్‌మాత్రమే వుత్తీర్ణురాలైనది. 12 సంవత్సరములు చదువు మానివేసి కుటుంబజంఝాటములో పడివున్నది. ఒక సంవత్సరము అకస్మాత్తుగా మెట్రిక్‌ఫారం పూర్తిచేసినది. గాయత్రీ ఉపాసనాబలంతో కొద్ది ప్రయత్నంతో ఉత్తీర్ణురాలైనది.

వాలపూర్ సావిత్రీదేవి దుబే పేరుగల మహిళ భర్త మృతి 18 సంవత్సరములపుడు జరిగినది. ఆమె అధిక రోగగ్రస్థురాలైనది. ఎండిపోయిన పుల్లలా తయారయినది. ఒకరోజామెకు భర్త స్వప్నంలో ‘ నీవు గాయత్రీ ఉపాసన చేయి. నా ఆత్మకు దానివలన సద్గతి కలుగుతుంది. నీ వైధవ్యము పరశాంతిప్రదంగా వుంటుంది ’ అని చెప్పాడు. ఆమె పతి ఆజ్ఞానుసారము అటులనే గావించినది. ఆమె కుటుంబములో వుంటూనే ఉచ్ఛస్థితి మహాత్ములస్థితిని పొందినది. ఆమె జిహ్వనుండి వెలువడిన మాట తథ్యమయ్యేది.

కటక్‌జిల్లా రామపూర్ గ్రామంలో నొక కమ్మరి కన్య సోనాబాయికి నిత్యమూ స్వప్నంలో, జాగ్రదావస్థలో అప్పుడప్పుడు గాయత్రీదేవి దర్శనమయ్యేది. ఆమె భవిష్యద్వాణి యెల్లప్పుడూ సత్యమయ్యేది.

మురీద్‌పూర్‌కు చెందిన సంతోషకుమారి శైశవంలో బహుమందబుద్ధి. ఆమెను చదివించడానికి ఆమె తండ్రి యెంతో ప్రయత్నించేవాడు. ఫలితము లేకపోయినది. ఆమె భాగ్యదోషమని భావించి అందఱూ వూరుకున్నారు. వివాహమైనది. వివాహానంతరము నాలుగు సంవత్సరములకు ఆమెకు వైధవ్యము ప్రాప్తించినది. వైధవ్యము గడుపుటకు

ఆమె గాయత్రీని ఆరాధించడము ఆరంభించినది. ఒకరాత్రి ఆమెకు గాయత్రీదేవి దర్శనమిచ్చినది. నేను నీ బుద్ధిని తీక్షణమొనరించినాను. విద్యనభ్యసించు. నీ జీవనము సఫలమౌతుంది అని నుడివినది. మరుసటి దినము ఆమెకు విద్యయందు ఉత్సాహము గలిగినది. బుద్ధితీవ్రముగా సునిశితమయినది. కొలది సంవత్సరములలోనే మెట్రిక్ పాసయినది. ఆమె స్త్రీవిద్యా ప్రచారమందు తత్పరతను పెంపొందించుకొని దానిలో లగ్నమయినది.

రంగపూర్ బెంగాల్‌లోని శ్రీమతి సరళాచౌదరీ పెక్కు సంతానము మృత్యువాతపడిరి. ఒక కుమారుడుగూడ జీవించనందువలన ఆమె కడు దుఃఖితయైనది. ఆమెకు గాయత్రీ సాధన నేర్పబడినది. ఆమె మంత్రాన్ని తనదిగాజేసుకుని ముగ్గురు కుమారుల మాతగా సుఖము పొందినది.

టిహారీలో ఒక అధ్యాపిక గులాబ్‌దేవికి ప్రసవకాలమందు మృత్యుతుల్య కష్టము సంప్రాప్తించేది. ఒకసారి గాయత్రీ ప్రశంస విని దానిని తానుగా సాధన చేసినది. అప్పటినుండి ఆమెకు నాలుగు కాన్పులు సుఖవంతంగా జరిగినాయి.

ముల్తాన్‌సుందరీబాయి స్వయంగా బలహీనురాలు. ఆమె కుమారులుగూడ బలహీనులే. అందులో యెవరోవొకరు వ్యాధిగ్రస్థులయ్యేవారు. తన బలహీనత, తన పిల్లల అనారోగ్యమువలన నామె విపరీతంగా బాధపడేది. ఈ కష్టమును గాయత్రీదేవి పోగొట్టినది. ఆమె సపరివారంగా స్వస్థత పొందినది.

ఉదయపూర్‌కు చెందిన మార్వాడీ మహిళ జ్ఞానవతి రూపము, రంగుతో అధిక సుందరి కానందున ఆమె భర్త ప్రసన్నుడుకాలేదు. పతి ప్రవర్తన, వ్యవహారము యెపుడూ హీనంగా,కర్కశంగా, ఉపేక్షణాపూర్వకంగా వుండేది. గృహంలో వున్నప్పటికి పరిచయములేని పరదేశీలుగా యిద్దఱిలో వేఱ్పాటు భావ నుండేది. జ్ఞానవతి పినతల్లి గాయత్రీ పూజ, రవివార వ్రతము చేయవలసిన విధిని తెల్పినది. ఆమె తపశ్చర్య నిరర్థకము కాలేదు. సాధికకు పతి ప్రేమ ప్రాప్తించినది. ఆమె దాంపత్యజీవనము సుఖమయమైనది.

భల్‌వాడా ప్రాంతంలో నొక సరమణీ నామము గలిగిన స్త్రీ బహు క్రూర తాంత్రికురాలు. అచట ప్రజలామెను ఢాకిని యని తలచెదరు. ఒక వయోవృద్ధ సన్యాసి ఆమెకు గాయత్రీ దీక్ష నిచ్చాడు. అప్పటినుండి ఆమె అన్నీ త్యజించి భగవద్భక్తిలో మనస్సు లగ్నము చేసి సాధు జీవనము నెరపుతూ వున్నది.

బహూరామ్‌పుర్ సమీపంలో నొక కుమారీ కన్య గుహను యేర్పరచుకొని పది సంవత్సరములనుండి తపస్సు చేయుచున్నది. 40 సంవత్సరముల వయస్సులోగూడ ఆమె ముఖంలోని తేజస్సు కళ్ళకు మిఱుమిట్లు గొల్పుతుంది. ఆమె దర్శనార్థము దూరదూరములనుండి ప్రజలు వచ్చేవారు. ఈ దేవియొక్క ఇష్టదైవము గాయత్రి. ఆమె యెల్లప్పుడూ గాయత్రీ జపము చేస్తుండేది.

మీరాబాయి, సహజోబాయి, రంతివతి, లీలావతి, దయాబాయి, అహల్యాబాయి, సుక్కుబాయి, ముక్తాబాయి, ప్రభుతి మొదలయినవారు ఈశ్వరభక్తితో వైరాగినులయ్యారు. వారి జీవనము విరక్తి భావంతోను, పరమార్థకతతోను నిండివుండేది. ఇందులో యెక్కువమంది గాయత్రీ ఉపాసన గావించి తమ భక్తిభావాన్ని వైరాగ్యాన్ని పెంపొందించుకున్నారు.

ఈవిధంగా అనేకమంది నారీమణుల శ్రేష్ఠ సాధనవలన వారికి ఆధ్యాత్మికోన్నతి కలిగినది. మఱియు సాంసారిక సుఖ సమృద్ధి విపత్తుల పరంపర నధిగమించుటలో ప్రసన్నతాపూర్వక అనుభవమును పొందినారు.

వైధవ్యాన్ని పొందిన సోదరీమణులకు గాయత్రీ సాధన సర్వశ్రేష్ఠ తపస్సు. దీనివలన వారి మనోభావనలు శాంతి పొందుతాయి. ఇంద్రియ సంయమనము కలుగుతుంది. వియోగశోకము నిర్మూలింపబడుతుంది. బుద్ధియందు సాత్త్వికత నెలకొంటుంది. మనస్సు, చిత్తము ఈశ్వరాయత్తమౌతాయి. నమ్రత, సేవ, శీలము, సదాచారము, నిరాలస్యత, సాధుజీవనము, ధర్మరుచి, స్వాధ్యాయప్రియత, ఆస్థికత లాంటి పరమార్థపరాయణతా తత్త్వములు పెంపొందుతాయి.

గాయత్రీ సాధన తపశ్చర్య నాశ్రయించి అనేక బాల విధవలు తమ జీవితాలను సతీసాధ్వీల మాదిరిగా సుఖంగా గడిపారు. వీరి చిన్న వయస్సును గాంచి అనేక శంకలు కలుగుతాయి. ఆ సోదరీమణులు గాయత్రీ తన్మయతను అనుభవించినపుడు వారి వైధవ్య దుఃఖమును విస్మరించుతారు. తాము తపస్విని యనియు, సాధ్వి యనియు, బ్రహ్మవాది ననియు, ఉజ్జ్వల చరిత్ర, పవిత్ర ఆత్మ ననే భావనానుభవాన్ని పొందుతారు. బ్రహ్మచర్యము వారి జీవన సహచరుడుగా వుంటుంది.

స్త్రీ, పురుషులు, నర, నారీమణులిద్దఱు వేదమాత గాయత్రీయొక్క పుత్రికా పుత్రులు. ఇద్దఱూ గాయత్రీ నేత్రజ్యోతులు. ఆమె ఎవఱినీ భేదభావంతో గమనించదు. తల్లికి పుత్రుని కంటే పుత్రికపై వాత్సల్యము మెండు. వేదమాత గాయత్రీ సాధన పురుషులకంటే స్త్రీలకు అధిక సులభము. అధిక శీఘ్రఫలదాయిని.

స్త్రీలకు గాయత్రీ ఉపాసనకు అధికారము :- భారతదేశంలో స్త్రీలకు సదా సముచితమైన గౌరవమున్నది. స్త్రీలు, పురుషుల కంటే అధిక పవిత్రులనే భావించబడుతుంది. స్త్రీలను బహుధా దేవి సంబోధనతో సంబోధిస్తారు. నామము చివర పుట్టినప్పటినుండి దేవీ యని జోడిస్తారు. శాంతిదేవి, గంగాదేవి, దయాదేవి మొదలైన దేవీ శబ్దములతో కన్యల నామకరణము చేస్తారు. పురుషులు కొన్ని పరీక్షలు ఉత్తీర్ణులైన తరువాత వారి పేరుచివర బి.ఎ. శాస్త్రి, సాహిత్యరత్న మొదలైనవి వ్రాయునట్లుగా, స్త్రీలు తమ జన్మదత్తమైన ఈశ్వరప్రసాదమైన దేవీగుణములు, దేవీ విచారములు దివ్య విశేషతల కారణంగా అలంకృతులౌతారు.

దేవతలు, మహర్షులతోపాటు వారి అర్ధాంగినుల పేర్లు గూడ కలుపుతారు. సీతారామ్, రాధేశ్యామ్, గౌరీశంకర్, లక్ష్మీనారాయణ, ఉమామహేశ్వర, మాయాబ్రహ్మ, సావిత్రిసత్యవంతుడు మొదలయిన నామములలో నారీ ప్రథమంగాను, నరుడు ద్వితీయ స్థానంలో నుంటారు. పాతివ్రత్యములోను, దయ, కరుణ, సేవ, సహానుభూతి, స్నేహము, వాత్సల్యము, ఉదారత, భక్తి భావనాది గుణములలో పురుషునికంటే స్త్రీ చాల మిన్నగా వుంటుందని మేధావులందఱూ అంగీకరించారు.

కావున ధార్మిక, ఆధ్యాత్మిక ఈశ్వరప్రాప్తికి సంబంధించిన యన్ని కార్యములలో స్త్రీలకు సర్వత్రా స్వాగత ముంటుంది. అచట వారికి విశిష్ట స్థానమిచ్చి ప్రతిష్ఠాకరమైన గౌరవమివ్వబడినది. వేదములను పరిశీలించగా వేద మంత్రద్రష్ట లే విధంగా ఋషిపుంగవులో, అటులనే అనేక 'ఋషిక' లు గూడ మంత్రద్రష్టలని స్పష్టమౌతుంది. ఈశ్వరీయ జ్ఞానము వేదమహాత్ములకు విదితమైనది. వారు ఆ మంత్రములను ప్రకటించారు. ఈవిధంగా యెవఱిద్వారా వేదము వెలువడినదో ఆ మంత్రద్రష్టలను ఋషు లన్నారు. ఋషులు కేవలము పురుషులే కాదు, స్త్రీలుకూడ నున్నారు. పరమేశ్వరుడు స్త్రీల అంతఃకరణములలోగూడ అదేవిధంగా వేదజ్ఞానమును ప్రకాశింపజేశాడు. ప్రభువు దృష్టిలో యిద్దరూ సమాన సంతానము. మహాదయాళువు, న్యాయమూర్తి, నిష్పక్షప్రభువు తన సంతానములో నరుడని నారియని అనుచితంగా భేదభావము యెటుల యేర్పరచగలడు?

ఋగ్వేదపు 10/85 సంపూర్ణ మంత్రుల ఋషిక సూర్యా సావిత్రీయై యున్నది. ఋషి అనే పదమున కర్థము నిరుక్తములో ఈవిధంగా చెప్పబడినది.

ఋషి ధర్శనాత్ । స్తోమాన్ దదర్శేతి । ఋషయో మంత్రద్రష్టారః ॥

అర్థము : మంత్రద్రష్ట. ఈ మంత్ర రహస్యములను తెలుసుకొని ప్రచారము చేయు వ్యక్తి ఋషి యగును.

ఋగ్వేదంలోని ఋషికల యొక్క సూచీ బృహద్దేవతా 24 వ అభ్యాసంలో ఈవిధంగా నున్నది.

ఘోషా గోధా విశ్వవారా అపాలోపనిషన్నిషత్ ।

బ్రహ్మజాయా జహుర్నామ అగస్తస్య స్వసాదితిః ।

ఇన్ద్రాణీ చేన్ద్రమాతా చ సరమా రోమశోర్వశీ ।

లోపాముద్రా చ నద్యశ్చ యమీ నారీ చ శశ్వతీ ।

శ్రీర్లాక్షా సార్పరాజ్ఞీ వాక్శ్రద్ధా మేధా చ దక్షిణా ।

రాత్రి సూర్యా చ సావిత్రి బ్రహ్మవాదిన్య ఈఃరితాః ॥

అర్థమేమనగా - ఘోషా, గోధా, విశ్వవారా, అపాలా, ఉపనిషత్తులు, జహు, అదితి, ఇంద్రాణి, సరమా, రోమశా, ఊర్వశి, లోపాముద్ర, యమీ, శాశ్వతీ, సూర్యా, సావిత్రీ మొదలైనవారందఱు బ్రహ్మవాదినులు.

ఋగ్వేదంలో 10/134, 10/36, 10/40, 10/65, 10/107, 10/109, 10/154, 10/159, 5/29, 8/91 మొదలైన సూక్తములందు మంత్రద్రష్ట లీ ఋషికలు.

పురుషుల మాదిరే స్త్రీలుగూడ యజ్ఞములు చేస్తారు, చేయిస్తారనడానికి యీవిధంగా అనేక ప్రమాణములున్నాయి. వారు యజ్ఞవిద్య, బ్రహ్మవిద్యలలో పారంగతులు. అనేకమంది నారీమణులు యిందులో తమ తండ్రికి, భర్తకు మార్గదర్శనము గావించారు.

తైత్తరీయబ్రాహ్మణంలో సోమ ద్వారా సీతాసావిత్రి ఋషికలు మూడు వేదములు ప్రసాదించే వర్ణన విస్తార పూర్వకంగా వస్తుంది.

తన్త్రయో వేదా అన్వసృజ్యన్త । అథ హ సీతా సావిత్రీ ।

సోమంరాజానే చకమే తస్యా ఉ హ త్రీన్ వేదాన్ ప్రదదౌ ॥ తైత్తరీయబ్రాహ్మణము

ఏవిధంగా సోమ సీతా సావిత్రిలకు మూడు వేదములొసగినాడో యీ మంత్రములో చెప్పబడినది. మను పుత్రిక ఇడాను వర్ణిస్తూ తైత్తరీయంలో 21.14లో ఆమెను యజ్ఞాన్‌కాశిని యని వచించారు. యజ్ఞాన్ పదమున కర్థము సాయణాచార్యులవారు యజ్ఞతత్త్వాన్ని ప్రకాశింపజేయుటకు సమర్థురాలని చేశారు. ఇడా తన తండ్రికి యజ్ఞసంబంధమైన సలహానిస్తూ ఈ క్రిందివిధంగా చెప్పినది.

సాఉబ్రవీదిడా మనుమ్ తథా వా అహం తవాగ్నిమాధాస్యామి। యథా ప్ర ప్రజయా పశుభిర్మిథునైర్జనిష్యసే ।

ప్రత్యస్మింలోకే స్థాప్యసి । లమిసువర్గలోకమ్‌జేష్యసీతి ॥ తైత్తరీయ బ్రా 1/4

అర్థము : ఇడా మనువుతో చెప్పెను. నీ అగ్నిని నేనేటుల అవధానము జేసెద ననగా, దానితో మీకు పశువులు, భోగములు, ప్రతిష్ఠ, స్వర్గము ప్రాప్తించును.

ప్రాచీనకాలంలో స్త్రీలు గృహస్థాశ్రమమును నడిపేవారు. మఱియు బ్రహ్మపరాయణులుగూడా. ఈ రెండూ తమతమ కార్యక్షేత్రములలో నిర్వహించేవారు. గృహస్థాశ్రమములను నడిపేవారిని సద్యోవధు -వులుగా చెప్పేవారు. వేదాధ్యయనము, బ్రహ్మోపాసన మొదలైన పారమార్థిక కార్యములందు ప్రవృత్తిగల స్త్రీలను బ్రహ్మవాదినులుగా పేర్కొన్నారు. బ్రహ్మవాదిని, సద్యోవధువుల కార్యక్రమములు వేఱుగా నుండేవి. కానీ వాటి మౌలిక ధర్మాధికారములలో నేమాత్రము అంతరము లేదు. గనించండి.

ద్వివిధాః స్త్రియః బ్రహ్మవాదిన్యః సద్యోవధ్వశ్చ । తత్ర బ్రహ్మవాదినీనాముపనయనామ్ । అగ్నీన్ధనం వేదాధ్యయనం స్వగృహే భిక్షాచర్యేతి । సద్యోవధూనాం తూపస్థితే వివాహే కథాఞ్చిదుపనయనమాత్రం కృత్వా వివాహః కార్యః ॥ హరీత ధ॥ము 12/20/24

అర్థము : బ్రహ్మవాదిని మఱియు సద్యోవధూ లిద్దఱూ స్త్రీలే. వీరిలో బ్రహ్మవాదిని యజ్ఞోపవీతము ధరించి, అగ్నిహోత్రము వేదాధ్యయనముతోపాటు స్వగృహంలో భిక్ష చేయును. సద్యోవధువులకు అప్పుడప్పుడు యజ్ఞోపవీతము అవసరమైయున్నది. ఆమె వివాహకాలమందున్నపుడు చేయింపబడుతుంది.

శతపథబ్రాహ్మణంలో యాజ్ఞవల్క్య ధర్మపత్ని మైత్రేయి బ్రహ్మవాదినిగా చెప్పబడినది.

తయోర్హ మైత్రేయీ బ్రహ్మవాదినీ భభూవ ॥

అర్థము - మైత్రేయి బ్రహ్మవాదినియై యుండెను.

బృహదారణ్యకోపనిషత్తును భాష్యమొనరించుచూ బ్రహ్మవాదిని కర్థము శ్రీశంకరాచార్యులవారు బ్రహ్మవాదనాశీల యని వ్రాశారు. బ్రహ్మకు అర్థము వేదము. బ్రహ్మవాదినికి అర్థము వేదప్రవచనము చేయు స్త్రీ.

ఒకవేళ బ్రహ్మకు అర్థము ఈశ్వరునిగా భావించినప్పటికి వేదజ్ఞానము లేకుండ బ్రహ్మప్రాప్తి కలుగదు. అందువలన వేదము చదివిన వ్యక్తియే బ్రహ్మను తెలుసుకొనగలడని గమనింపుడు.

న వేదవిన్మనుతే తం బృహన్తమ్ ।

ఏతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసానాశకేన । బృహదార్యణక 4/4/22

అర్థము : ఏవిధంగా పురుషులు బ్రహ్మచారులుగానుండి తపము, స్వాధ్యాయము, యోగముద్వారా బ్రహ్మప్రాప్తి నొందెదరో అదేవిధంగా అనేకమంది స్త్రీలు బ్రహ్మచారిణులుగా నుండి ఆత్మనిర్మాణముతోపాటు పరమార్థాన్ని సంప్రాప్తించుకొన్నారు.

పూర్వకాలంలో అనేక సుప్రసిద్ధ బ్రహ్మచారిణులున్నారు. వారి ప్రతిభ, విద్వత్తు, కీర్తి నలుదిక్కుల వ్యాపించినది. మహాభారతంలో నిటువంటి అనేకమంది బ్రహ్మచారిణుల వర్ణన నీయబడినది.

భారద్వాజస్య దుహితా రూపేణాప్రతిమా భువి ।

శృతావతీ నామ విభో కుమారీ బ్రహ్మచారిణీ ॥ మహాభారతము శల్యపర్వము.

అర్థము : భరద్వాజునకు శృతావతీయను కుమార్తె కలదు. ఆమె బ్రహ్మచారిణి. కుమారి యను శబ్దముతోపాటు బ్రహ్మచారిణి యను శబ్దము జోడించుటకు అర్థము ఆమె అవివాహిత యనియూ, వేదాధ్యయనము జేయునది యని.

అత్రైవ బ్రాహ్మణీ సిద్ధా కౌమార-బ్రహ్మచారిణీ ।

యోగయుక్తా దివం యాతా తపః సిద్ధా తపస్విని ॥ మహాభారతం శల్యపర్వము.

అర్థము : యోగసిద్ధిని పొంది కుమారిగా నున్నప్పుడే వేదాధ్యయనము గావించే తపస్విని సిద్ధా యను పేరుగల బ్రాహ్మణికి ముక్తి ప్రాప్తించినది.

భభూవ శ్రీమతీ రాజన్ శాణ్డిల్యస్య మహాత్మనః ।

సుతా ధృతవ్రతా సాధ్వీ నియతా బ్రహ్మచారిణీ ॥

సా తు తప్త్వా తపో ఘోరం దుశ్చరం స్త్రీజనేన హ ।

గతా స్వర్గం మహాభాగా దేవబ్రాహ్మణపూజితా ॥ మహాభారతం -శల్యపర్వం 54/8

అర్థము : మహాత్మా శాండిల్యుని పుత్రి శ్రీమతియై యుండెను. ఆమె వ్రతధారిణి. వేదాధ్యయనమందు నిరంతరము ప్రవృత్తి గలిగినది. అత్యంత కఠిన తపస్సాచరించి ఆమె దేవబ్రాహ్మణ పూజితయైనది. స్వర్గప్రాప్తి పొందినది.

అత్రసిద్ధా శివానాయ బ్రాహ్మణీ వేదపారగా ।

అధీత్య సకలాన్వేదాన్ లేభేసద్ దేహమక్షయమ్ ॥ మహాభారతం-ఉద్యోగపర్వం 180/18

అర్థము : శివా యను పేరుగల బ్రాహ్మణి దేవపారంగతురాలు. ఆమె అన్ని వేదముల నభ్యసించి మోక్షపదాన్ని పొందినది.

మహాభారతంలోని శాంతిపర్వమునందు 310 వ అధ్యాయములో సులభా పేరుగల బ్రహ్మవాదిని, సన్యాసిని యొక్క వర్ణన కలదు. ఆమె జనకమహారాజుతో శాస్త్రార్థము గావించినది. ఈ అధ్యాయంలో 82 వ శ్లోకములో సులభా తన పరిచయము గావించుకొంటూ యిటుల వచించినది.

ప్రధానో నామ రాజర్షివ్యక్తం తే శ్రోత్రమాగతః । కులే తస్య సముత్పన్నాం సులభాం నామ విద్ధి మామ్ ।। సాఽహం తస్మిన్ కులే జాతా భర్తర్యసతి మద్విధే । వినీతా మోక్షధర్మేషు చరామ్యేకామునివ్రతమ్ ॥ మహాభారతం - శాంతిపర్వం -20

అర్థము : నేను సుప్రసిద్ధ క్షత్రియకులములో నుద్భవించిన సులభాను. నాకు తగిన భర్త దొరకనందున నేను గురువులనుండి శాస్త్రాధ్యయనమును అభ్యసించాను. సన్యాసమును స్వీకరించాను.

పాండవపత్ని ద్రౌపది విద్వత్తును వర్ణిస్తూ శ్రీఆచార్య ఆనందతీర్థులవారు మహాభారత నిర్ణయములో నిట్లు వుల్లేఖించారు.

వేదాశ్చాప్యుత్తమస్త్రీభిః కృష్ణాద్యాభిరివాఖిలాః ।

అర్థము : ఉత్తమస్త్రీలు కృష్ణ(ద్రౌపది) వలె వేదముల నభ్యసించవలె.

తేభ్యో దధార కన్యే ద్వే వయునాం ధారిణీం స్వధా ।

ఉభే తే బ్రహ్మవాదిన్యౌ జ్ఞాన-విజ్ఞాన-పారగే ॥ భాగవతం 4/6/64

అర్థము : స్వధాకు యిరువురు పుత్రికలు కలిగినారు. వారి నామములు వయునా మఱియు ధారిణీ. వారిద్దఱూ విజ్ఞానపారంగతులు. అటులనే బ్రహ్మవాదినులుగూడ.

విష్ణుపురాణంలో 1/10 మఱియు 18/19, ఈవిధంగానే మార్కండేపురాణం అ.52లో గూడా బ్రహ్మవాదినులు, మహిళల వర్ణన వున్నది.

సతతం మూర్తిమన్తశ్చ వేదాశ్చత్వార ఏవ చ।

సన్తి యశ్యాశ్చ జిహ్వాగ్రే సా చ వేదవతీ స్మృతా॥ బ్రహ్మ వై. ప్రకృతఖండము 14/95

అర్థము : వారికి చతుర్వేదములు కంఠాగ్రములో నున్నవి. అందువలననే వారిని వేదవతీ యనియెదరు.

ఈ ప్రకారముగా నైష్ఠికబ్రహ్మచారిణులు, బ్రహ్మవాదినులు, నారీమణులలో అగణితంగా యుండిరి. ఇందుకు భిన్నంగా అదనంగా గృహస్థాశ్రమములో ప్రవేశించు కన్యలు దీర్ఘకాలము బ్రహ్మచారిణులుగా నుండి వేదశాస్త్రపరిజ్ఞానము ప్రాప్తించిన తదుపరి వివాహము గావించుకొనువారు. అపుడే వారి సంతానము ప్రపంచములో ఉజ్జ్వల నక్షత్రముల మాదిరి యశస్సు, పురుషార్థములు సంతరించుకొనేవారు. కన్యలు బ్రహ్మచారిణులుగా నున్న తదుపరియే వివాహమాడవలెనని ధర్మగ్రంథముల స్పష్టమైన ఆదేశము.

బ్రహ్మచర్యేణ కన్యా యువాన్ విన్దతే పతిమ్॥ అథర్వణవేదము 11/6/12

అర్థము : కన్య బ్రహ్మచర్యానుష్ఠానము గావించుతూ దానిద్వారా అర్హమైన పతిని పొందును.

బ్రహ్మచర్యము కేవలము అవివాహితులుగా నుండేటందుకు మాత్రమే చెప్పలేదు. సంయమపూర్వకంగా వేదప్రాప్తిని పొందుటలో యెవడు నిమగ్నుడౌతాడో అతడే బ్రహ్మచారి. గమనించండి.

స్వీకరోతి యదా వేద చరేద్ వేదవ్రతాని చ।

బ్రహ్మచారీ భవేత్తావద్ ఊర్ధ్వం స్నాతో గృహీ భవేత్॥ దక్షస్మృతి

అర్థము : వేదమును అర్థసహితంగా చదివినపుడు మఱియు వేదములకొఱకు వ్రతమొనరించినపుడు బ్రహ్మచారి యని చెప్పబడును. దాని తదుపరి విద్వాంసుడై గృహస్థాశ్రమమునందు ప్రవేశించునని అర్థము.

అథర్వణవేదము నందు 21/7/17 ను వ్యాఖ్యానించుతూ సాయణాచార్యులవారు ఈవిధంగా వ్రాశారు.

బ్రహ్మచర్యేణ- బ్రహ్మ వేదః తదధ్యయనార్థమాచర్యమ్॥

అర్థము : బ్రహ్మ వేద అర్థము ఆ వేదమును అధ్యయనము చేయుటకొర కెవఱు ప్రయత్నించుదురో వారు బ్రహ్మచారులు. ఈ సూక్తములోని ప్రథమమంత్రానికి తన వ్యాఖ్యలో సాయణాచార్యులవారిలా వ్రాశారు.

బ్రహ్మణి వేదాత్మకె అధ్యేతవ్యే వా చరితుం శీలమస్య స తథోక్తః॥

అర్థము : ఎవఱు వేదాధ్యయనమందు విశేషంగా సంలగ్నమానసులౌతారో వారే బ్రహ్మచారి యని యర్థము.

మహర్షి గార్గాయణాచార్యులవారు ప్రణవవాదములో నిటుల నుడివినారు.

బ్రహ్మచారిణాం చ బ్రహ్మచారిణీభిః సహ వివాహః ప్రశస్యో భవతి॥

అర్థము :బ్రహ్మచారుల వివాహము బ్రహ్మచారిణులతో జరుగుట వుచితము. ఏలనన జ్ఞానము మఱియు విద్య మొదలైనవాటి దృష్టికోణము నుండి సమాను లయినందున వారు సుఖులు, సంతుష్టులుగ నుండెదరు.

మహాభారతంలోగూడ యీ భావము బలపఱచబడినది.

యయోరేవ సమం విత్తం యయోరేవ సమం శృతమ్ ।

తయోర్మైత్రీ వివాహశ్చ న తు పుష్ట-విపుష్టయోః ॥ మహాభారతం 1/131/10

అర్థము : ఎవరి ధనము, జ్ఞానము సమానంగా నుంటుందో వారితో మిత్రత్వము వివాహము వుచితము. న్యూనాధికము లుండవు.

ఋగ్వేదం 1/1/15 ను భాష్యము జేస్తే మహర్షి దయానందుల వారిలా వ్రాశారు.

యాః కన్యా యావచ్చతుర్వింశతివర్షమాయుస్తావద్ బ్రహ్మచర్యేణ జితేన్ద్రియాః తథా సాఙ్గోపాఙ్గవేదవిద్యా అధీయతే తాః మనుష్య-జాతి-భూషికా భవన్తి ॥

అర్థ మేమనగా : ఏ కన్య అయినా 24 సంవత్సరముల వయస్సువఱకు బ్రహ్మచారిణిగా నుండి వేదవిద్యను సాంగోపాంగముగా అభ్యసించినయెడల ఆ కన్య మనుష్యజాతిని శోభింపజేస్తుంది.

ఋగ్వేదం 5/6/2/11 భాష్యంలో మహర్షి ఇలా వ్రాశారు.

బ్రహ్మచారిణీ ప్రసిద్ధ-కీర్తిం సత్పురుషం సుశీలం శుభ-గుణ-రూప-సమన్వితం ప్రీతిమన్తం పతిం గ్రహీతు మిచ్ఛేత్ తథైవ బ్రహ్మచర్యాపి స్వ సదృశీమేవ బ్రహ్మచారిణీం స్త్రియం గృహణీయాత్ ॥

అర్థము : బ్రహ్మచారిణి అయిన స్త్రీ కీర్తిమంతుడు, సుశీలుడు, సత్పురుషుడు, గుణవంతుడు, ప్రేమ స్వభావం గల పతిని కోరుకొనును. అలాగే బ్రహ్మచారికూడా తనకు సమానమైన బ్రహ్మచారిణి అయిన స్త్రీని గ్రహిస్తాడు.

స్త్రీలపై యీ ఆంక్షలు, లాంఛనము లెందుకు?

గాయత్రీ ఉపాసనకు అర్థము ఈశ్వరుని మాతృదేవిగా భావించి, ఆమె ఒడియందు స్థానము పొందుట. సంసారములో యెన్ని సంబంధము లున్నప్పటికీ, వాటన్నింటిలో మాతృసంబంధము అధిక ప్రేమపూర్ణము. అధిక ఘనిష్టమైనది. ప్రభువును మనమెట్టి దృష్టితో నవలోకించెదమో, మన భావన కనుగుణ్యముగా మనకు ప్రత్యుత్తరము లభిస్తుంది. ఈశ్వరుని ఒడిలో జీవుడు మాతృభావనతో ప్రవేశించినపుడు నిశ్చయముగా నచట వాత్సల్యపూరిత సమాధానము లభిస్తుంది.

స్నేహము, వాత్సల్యము, కరుణ, దయ, మమత, ఉదారత, కోమలత మొదలైన తత్త్వములు స్త్రీలలో పురుషులకంటే అధిక మోతాదులో వుంటాయి. బ్రహ్మకర్థము వామాంగ, బ్రహ్మీతత్త్వము, అధిక కోమలత్వము, ఆకర్షకమై శీఘ్రముగా ద్రవీభూతము గాంచునది. అందువలననే అనాదికాలమందు ఋషులు ఈశ్వరుని మాతృభావనతో ఉపాసన గావించేవారు. భారతీయ ధర్మావలంబులకు ప్రత్యేకంగా సులభసాధ్యము, సరళము, శీఘ్రఫలకారియైన సాధనా ప్రణాళికను తమ స్వంతము గావించుకొనవలెనని ఆదేశించారు. గాయత్రీ ఉపాసన ప్రత్యేకంగా భారతీయ ధార్మిక నిత్యకర్మగా నున్నది. సంధ్యావందన మే పద్ధతిలోనైనా చేయి, అందులో గాయత్రీ తప్పకనుండుట ఆవశ్యకము. విశేషమైన లౌకిక, పారలౌకిక ప్రయోజనార్థము గాయత్రీ ఉపాసన విశిష్ఠరూపములో జేయబడుతుంది. కాని నిత్యకర్మను సాధించుటకు దైవిక కర్తవ్యము గూడ నంతియే. అటుల చేయనియెడల ధార్మిక కర్తవ్యములను ఉపేక్షించిన దోషము సంక్రమించును.

కుమారి మఱియు కుమారుడు మాతృమూర్తికి ప్రాణప్రదమైన యిద్దఱు సంతానము. ఈశ్వరునకు నరనారీ లిద్దఱు ముద్దుబిడ్డలు. నిష్పక్షిక, న్యాయశీల మాతాపితలెవ్వరైనా తమ సంతానమందలి బాలబాలికలయందు భేదభావాన్ని కలిగియుండరు. ఈశ్వరుడు ధార్మిక కర్తవ్యమాచరించుటకూ, ఆత్మకల్యాణముకొఱకూ వున్న సాధనములను స్త్రీ పురుష లిద్దఱికి అవకాశాన్ని, సౌలభ్యాన్ని, సౌకర్యమును కలిగించాడు. ఈ సమానత్వము న్యాయ నిష్పక్షికదృష్టిలో వుచితము మఱియు ప్రమాణసిద్ధము, ఈ నిష్కపట వాస్తవానికి విఘ్నములు కలిగించుట అసంగతమౌతుంది.

మనుష్యుని ఆలోచన, తెలివి చాల విచిత్రమైనది. అందులో నప్పుడప్పుడు సర్వదా అనుచితము, అనవసరమైన భావములు వచ్చిచేరుతాయి. ప్రాచీనకాలంలో స్త్రీలకు సముచిత స్థాన మీయబడినది, గౌరవమున్నది. కానీ ఆ స్త్రీనే నేడు హేయమైన దని, పతితయని, త్యాజ్యగా, పాతకిగా, అనధికారిగా, ఘృణితగా నొకప్పుడు జాతి సామూహికంగా నిర్ణయించినది.

ఆ ఆలోచనావిధానము స్త్రీల మానవోచిత అధికారములపై దురాక్రమణ సలిపినది. పురుష శ్రేష్ఠత్వము, సౌకర్యాన్ని పోషించుటకొఱకు అనేక ప్రతిబంధకములను కలిగించి, శక్తిహీనను, సాహసహీనను, విద్యావిహీనను జేసి ఆమెను లజ్జపడునట్లు గావించినది. తత్ఫలితంగా సమాజమునకు వుపయోగికారి కాకుండా పైపెచ్చు తన రక్షణకొఱకు యితఱుల దయాదాక్షిణ్యములపై బ్రతుకవలసివచ్చినది.

ఈరోజున భారతనారి, పశుపక్షుల మాదిరి పెంపకపుస్థితిని జేరినది. కారణము ఆలోచనావిధానములోని వక్రత, మధ్యకాలంలో సామంతరాజుల అహంకారముతోపాటు వుత్పన్నమైనది. ప్రాచీనకాలంలో భారతీయనారి అన్ని రంగములలో పురుషులతోపాటు సమకక్ష్యలో నుండేది. రథచక్రములు రెండు సరిగా నున్నపుడే సమాజశకటము వుత్తమంగా నడిచేది. కానీ యిపుడొక చక్రము క్షతమై విక్షతమైనందున రెండవ చక్రమునకు తొట్రుపాటు గలిగినది. అయోగ్యనారి సమాజభారము, నరుడు మోయవలసివచ్చినది. ఈ ఆవశ్యకత మన దేశమును, జాతిని పతనోన్ముఖము గావించినది. ఈ పతనము వూహాతీతము.

మధ్యకాలపు అంధకారపుయుగముయొక్క దుష్పరిణామములను నివారించుటకు, వివేకశీలురు, దూరదర్శుజ్ఞులైన మహాపురుషు లనేక ప్రయత్నముల నొనరించినారు. ఇది సంతోషదాయకము. విజ్ఞులైన పురుషులు అనుభవపూర్వకంగా తెలుసుకొన్నదేమనగా మధ్యకాలపు తుచ్ఛమైన లోహశృంఖలాలు స్త్రీలకు తీయనట్లయితే దేశమునకు ప్రాచీన గౌరవము లభింపదు. పూర్వకాలంలో నున్న స్త్రీల పరిస్థితిని పునరుద్ధరించినట్లయితే మనయొక్క అర్ధాంగము వికసించుతుంది. అపుడే మన సర్వాంగీణ వికాసము కలుగుతుంది. ఈ శుభప్రయత్నములో మధ్యకాలంలో నేర్పడిన కుసంస్కారాచారములను అంధానుకరణ జేయుట ధర్మమని మూర్ఖించువారల ఆలోచనావిధానము యిపుడు గూడా విఘ్నమొనరించి నిరోధించుటలో విజయవంతమౌతుంది.

ఈశ్వరభక్తి, గాయత్రీ ఉపాసనలను గురించినంతవఱకు స్త్రీలకు అధికారము లేదని వక్కాణింపబడుతుంది. దీనికొఱకు అనేక శ్లోకములు వుదహరింపబడుతున్నవి. దీనివలన మంత్రములను చదువరాదు, వినరాదు. ఏలనన గాయత్రీ వేదమంత్రము. కావున స్త్రీలీ మంత్రమును స్వంతము చేసుకోరాదు. ఈ ప్రమాణములలో మాకు విరోధము లేదు. ఎందువలననగా మన భారతవర్షములో నొకానొక సమయమందు స్త్రీలను నికృష్టులుగా పరిగణించడము జరిగినది. యూరోపుదేశంలోకూడా అదేకాలంలో స్త్రీలకు గడ్డి మొదలైన జడపదార్థములకు వలె ఆత్మ లేదని తలంచారు. ఇచటగూడా అదే ఆలోచన స్థూలంగానో, సూక్ష్మంగానో ప్రబలి మాన్యతను పొందినది. ఇటుల చెప్పబడినది.

నిరిన్ద్రియా హ్యమన్త్రశ్చ స్త్రియోఽనృతమితి స్థితిః ॥

అర్థము ః స్త్రీలకు ఇంద్రియములుండవు. వారు మంత్రరహితలు. అసత్య స్వరూపిణులు, ఘృణితలు.

స్త్రీలను ఢోలులా, మూర్ఖురాలిగా, పశువుగా, శూద్రసమానురాలిగా దండయోగ్యమని చాటిచెప్పే ఆలోచన విధానమీవిధంగా చెబుతుంది.

పౌంశ్చల్యాచ్చలచిత్తాచ్చ నైస్నేహాచ్చ స్వభావతః ।

రక్షితా యత్నతోఽపీహ భర్తృష్వేతా వికుర్వతే ॥

అర్థము :- స్త్రీలు స్వభావతః వ్యభిచారిణులు, చంచలచిత్తులు, ప్రేమశూన్యులై వుంటారు. వారిని అప్రమత్తతతో కనిపెట్టి వుండవలె.

విశ్వాసపాత్రం న కిమస్తి నారీ। ద్వారం కిమేకం నరకస్య నారీ।

విద్వాన్మహావిజ్ఞతమో2స్తి కో వా। నార్యా పిశాచ్యా న చ వంచితో యః ॥

ప్రశ్న : విశ్వసించుటకు యోగ్యము కానిదెవఱు? జవాబు : నారి

ప్రశ్న : నరకమునకేకైన మార్గమేది? జవాబు : నారి

ప్రశ్న : బుద్ధిమంతుడెవఱు? జవాబు : నారీ రూప పిశాచినిచే ఆకర్షింపబడి వ్యామోహితుడు కానివాడు.

స్త్రీలకు సంబంధించినంతవఱకు పైనుదహరింపబడిన భావములు వ్యాప్తిలో నున్నప్పుడు స్త్రీలను వేదశాస్త్రముల నుండి, ధర్మకర్తవ్యములనుండి, జ్ఞానోపార్జననుండి వంచితులనుజేసి అనేక ప్రతిబంధకములను గల్పించారన్నప్పుడు ఆశ్చర్యపడ నవసరము లేదు. ఇట్టి ప్రతిబంధ సూచకములుగా అనేక శ్లోకములు లభించుచున్నవి.

స్త్రీశూద్రద్విజబన్ధూనాం త్రయీ న శృతిగోచరా ॥ భాగవతము

అర్థము : స్త్రీలు, శూద్రులు, నీచబ్రాహ్మణులు వేదములు వినుటకు అధికారము లేనివారు.

అమన్త్రికా తు కార్యేయం స్త్రీణామావృదశేషతః।

సంస్కారార్థ శరీరస్య యథా కాలం యథాక్రమమ్ ॥ మను1/99

అర్థము : స్త్రీలకు జాతకర్మాది సంస్కారములు, వేదమంత్రులు లేకుండా చేయవలెను.

నన్వేవం సతి స్త్రీశూద్రసహితాః సర్వవేదాధికారిణః ॥ సాయణుడు.

అర్థము : స్త్రీలకు, శూద్రులకు వేదాధికారము లేదు.

వేదేఽనాధికారాత్ ॥ శంకరాచార్యులు

అర్థము : స్త్రీలకు వేదాధికారము లేదు.

అధ్యయన రహితయా స్త్రియా తదనుష్ఠానమశక్య-

త్వాత్ తస్మాత్ పుంస ఎవోపస్థానాదికమ్ ॥ మధ్వాచార్య

అర్థము : స్త్రీలు అధ్యయన రహితులైనందున వారు మంత్రోచ్చారణ చేయలేరు. అందువలన కేవలము పురుషులు మంత్రములను చదువవలె.

స్త్రీశూద్రౌ నాధీయాతామ్ ॥

అర్థము : స్త్రీలు, శూద్రులు వేదము చదవకుందురుగాక!

న వై కన్యా న యువతిః।

అర్థము : కన్యగాని లేక స్త్రీగాని చదవకూడదు.

ఈవిధంగా స్త్రీలను ధర్మ, జ్ఞాన, ఈశ్వరోపాసన, ఆత్మకల్యాణ ప్రయత్నముల నుండి మరల్చుట కేర్పరచబడిన ప్రతిబంధకములను అనేకమంది సాత్త్వికులు సనాతన ధర్మమని తలపోస్తారు. సమర్థిస్తారు. ప్రాచీన సాహిత్యంలో యీవిధమైన ప్రతిబంధకములు లేవని వారు గ్రహించవలెను. మీదుమిక్కిలి అందులో సర్వత్ర నారీ గొప్పదనాన్ని శ్లాఘించారు. వారికిగూడా పురుషులకున్న ధార్మిక అధికారములు ప్రాప్తించినాయి. ఈ ప్రతిబంధకములు కొంతకాలమువఱకు కొంతమంది వ్యక్తులకు ప్రత్యేక వ్యామోహజనిత ప్రమాణములైనాయి. అట్టి వ్యక్తులు ధర్మగ్రంథములలో అచట నచట అనర్గళ శ్లోకములను జొన్పి తమ పిచ్చి భ్రమలను ఋషిప్రణీతసిద్ధములు గావించుటకు ప్రయత్నించారు.

భగవాన్ మనువు నారీజాతియొక్క మహోన్నతిని ముక్తకంఠంతో స్వీకరిస్తూ యిట్లు వ్రాశారు.

ప్రజనార్థ మహాభాగాః పూజార్హా గృహదీప్తయః।

స్త్రియః శ్రియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన ॥ మను 9/19

అపత్యం ధర్మకార్యాణి షుశ్రూషా రతిరుత్తమా।

దారధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ ॥ మను 9/28

యత్ర నార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః।

యత్రైతాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్రాఫలాః క్రియాః ॥ మను 13/59

అర్థము : స్త్రీలు పూజార్హులు, గౌరవనీయులు. గృహదీపికలు, కల్యాణకారిణులు. ధర్మకార్యముల యందు సహాయకులు. స్త్రీల ఆధీనములో స్వర్గమున్నది. ఎచట స్త్రీలు పూజింపబడెదరో అచట దేవతలు నివసిస్తారు. ఎచట వారు తిరస్కరింపబడెదరో అచట సర్వకార్యములు నిష్ఫలములౌతాయి.

స్త్రీ జాతిని గురించి మను భావన ఈవిధమైన ఉచ్చశ్రేణిలో నున్నది. అదే గ్రంథములో నచట నచట స్త్రీలను పూర్తిగా దూషించుట, వారి ధార్మిక సౌకర్య నిషేధమున్నది. మనువు లాంటి మహాపురుషులు పరస్పర విరుద్ధములు వ్రాయరు. నిశ్చయంగా తరువాత వ్యక్తు లా గ్రంథములో వాటిని జోడించారు. దీనికి ప్రమాణమున్నది. పరికించండి.

మాన్యా కాపి మనుస్మృతిస్తదుచితా వ్యాఖ్యాపి మేధాతిథేః।

సా లుప్తైవ విధేర్వశాత్క్వచిదపి ప్రాప్యం న తత్పుస్తకమ్ ॥

క్షోణీన్ద్రో మదనః సహారణసుతో దేశాన్తరాదాహృతైః।

జీర్ణోద్ధారమచీకరత్ తత్ ఇతస్తత్పుస్తకైర్లిఖ్యతేః ॥ మేధాతిథిరచిత మనుభాష్య సహిత మనుస్మృతేరుపోద్ఘాతః ॥

అర్థము : పూర్వకాలములో ప్రామాణిక మనుస్మృతి వున్నది. దానికి మేధాతిథి సరియైన భాష్యము గావించారు. దౌర్భాగ్యవశమున నా పుస్తకములు లుప్తమైనవి. రాజామదిన్ అక్కడ యిక్కడ నున్న పుస్తకములనుండి జీర్ణోద్ధారణ గావించినాడు.

కేవలము మనుస్మృతికే యీ గడబిడ పరిమితము కాలేదు. పైగా అన్యగ్రంథములలో గూడ నిట్టి జోడింపులు జరిగినాయి. తమ భావములు శాస్త్రవిరుద్ధములైనప్పటికి గూడా శాస్త్ర వచనసిద్ధి పొందే ప్రయత్నములు గావింపబడినవి.

దైత్యాః సర్వే విప్రకులేషు భూత్వా, కృతయుగే భారతే షట్సహస్రయామ్ ।

నిష్కాస్య కాంశ్చిన్నవనిర్మితానాం వివేశనం తత్ర కుర్వన్తి నిత్యమ్ ॥ గరుడపురాణము

అర్థము : రాక్షసులు కలియుగములో బ్రాహ్మణకులములో జన్మించి, మహాభారతంలోని ఆరువేల శ్లోకాలనుండి అనేక శ్లోకములు తీసివేసిరి. ఆ స్థానంలో కృత్రిమ శ్లోకములు ప్రక్షేపము గావించినారు.

ఈ విషయమునే మాధవాచార్యులవారీవిధంగా వచించారు.

క్వచిద్ గ్రన్థాన్ ప్రక్షిపన్తిక్వచిదన్తరితానపి ।

కుర్యుః క్వచిచ్చ వ్యత్యాసం ప్రమాదాత్ క్వచిదన్తథా ॥

అనుత్పన్నాః అపి గ్రన్థా వ్యాకులా ఇతి సర్వశః ॥

అర్థము : స్వార్థపరులు గ్రంథములలో నచట నచట మాటలను ప్రక్షిప్తపరిచారు. కొన్నిచోట్ల గ్రంథములనుండి తీసివేశారు. కొన్ని సమయములలో ప్రయత్నపూర్వకంగా మరికొన్నిసార్లు ప్రమాదవశాత్తు మార్పులు జరిగాయి. ప్రాచీన గ్రంథములు అస్తవ్యస్తమైనాయి.

ఆవిధంగా లేనటువంటివాటిని జోడించేరోజులలోకూడ విద్వాంసులైన మేధావులు దీనిని వ్యతిరేకించారు. మహర్షి హారీత ఈవిధమైన స్త్రీ ద్వేషాన్ని ప్రేరేపించే అసంబద్ధమైన వుచ్చాటనలను ఘోరంగా వ్యతిరేకిస్తూ ఈవిధంగా ఉటంకించారు.

న శూద్రసమాః స్త్రియః । నహి శూద్ర యోనౌ బ్రాహ్మణక్షత్రియ-వైశ్యా జాయన్తే తస్మాచ్ఛన్దసా స్త్రియః సంస్కార్యాః ॥ హారీత

అర్థము : స్త్రీలు శూద్రసమానులు కాజాలరు. శూద్రయోనులనుండి ఆహా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యజాతుల వుత్పత్తి యెట్లు జరుగుతుంది? స్త్రీలను వేదములద్వారానే సంస్కరించవలె.

నర నారీ లిద్దఱు రథముయొక్క రెండు చక్రములు. ఒకే శరీరములో నున్న రెండు భుజములు. రెండు చేతులు. ఒకే ముఖంలోని రెండు కళ్ళు. ఇందులో ఒకటి లుప్తమైనపుడు రెండవది అసంపూర్ణము. రెండు అర్థాంగములు కలసి ఒక పూర్ణాంగ మేర్పడుతుంది. మానవ ప్రాణులలోని అవిచ్ఛిన్న ద్విభాగములలో ఈవిధమైన అసమానత రెండు రకములు. ఉచ్ఛనీచములను సృష్టించుట భారతీయ పరంపరకు వ్యతిరేకము. భారతీయ ధర్మంలో నరనారులను అవిచ్ఛిన్నాంగములుగా భావిస్తారు.

యథైవాత్మా తథా పుత్రః దుహితా సమా ।

అర్థము : సంతానము ఆత్మసమానము. పుత్రుని వలె పుత్రిక కూడ సమానమే. ఇద్దఱూ సమానులే!

ఏతావానేవ పురుషో యజ్జాయాత్మా ప్రజేతి హ ।

విప్రాః ప్రాహుస్తథా చైతద్యో భర్తా సా స్మృతాంగనా ॥ మను 10/45

అర్థము : పురుషుడు ఒంటరి కాడు. ఏలనన పత్ని, సంతానము కలసి స్వయంపురుషుడౌతాడు.

అథో అర్ధం వా ఏష ఆత్మనః యత్ పత్నీ ।

అర్థము : పత్ని పురుషునకు అర్ధాంగము.

ఈ పరిస్థితులలో పరమేశ్వరుని వాణి యగు జ్ఞానమును స్త్రీలు పొందుటకు వీలులేకుండుట వుచితము గాదు. ఇతఱ మంత్రముల వలె గాయత్రీ మంత్రమునకు కూడా వారికి పూర్తి అధికారమున్నది. ఈశ్వరుని మనము నారీ రూపములో గాయత్రీ రూపంలో ఉపాసన జేస్తాము. మఱల నారీజాతిని ఘృణితగా, పతితగా అస్పృశ్యురాలిగా అనధికారిణిగా పరిగణించుట యెంతవఱకు ఉచితము? దీన్నిగురించి మనము స్వయంగా ఆలోచించుకొనవలెను.

స్త్రీలకు వేదాధికారము లేకుండా జేసినందున స్వభావసిద్ధంగా వారిలో హీనభావన వుద్భవిస్తుంది. ఇది తదుపరి దీర్ఘకాలంలో దుష్పరిణామములను కలుగజేస్తుంది. తత్ఫలితం మన సమాజముపై, దేశవికాసముపై నుంటుంది. అంతవరకెందుకు వర్తమానకాలంలో అధికాంశము పురుషులకుగూడా వేదపరిచయము లేదు. మీదుమిక్కిలి వేదమునుగురించి అసంబద్ధమైన వంకరటింకర భావాలు వెలిబుచ్చుతారు. దేనినిగురించైనా సిద్ధాంతరూపములో అనధికార ప్రతిపాదనలను జేస్తారు. దాని పరిణామము హానికరంగా వుంటుంది. కావున వితండవాదములను పాటింపక స్త్రీలను గురించి జేసే వివాదములను గూడా నిరాకరించవలెను.

వేదజ్ఞానములో స్త్రీపురుషు లిద్దఱికీగూడా పరమేశ్వరుడు తన సంతానమున కిచ్చే సందేశమును వినుటకు ప్రతిబంధనములను గల్పించుట ఈశ్వరద్రోహము. వేదభగవానుడు స్వయంగా యిటుల వచించాడు.

సమానోమన్త్రః సమితిసమానీ సమానంమనః సహచిత్తమేషామ్ ।

సమానమస్త్ర మభిమన్త్రయేవః సమానేవనోహవిషా జుహోమి ॥ ఋగ్వేదం 10/16

అర్థము ః ఓ సమస్త నారీ నరులారా! మీకొరకే మంత్రములు సమానరూపంలో నీయబడినవి. మీ పరస్పర ఆలోచనలుగూడా అట్లే సమానంగా నుండుగాక! ఈ సభలిద్దఱికీ సమానమే. అందు యిరువురకు సమానాధికారమున్నది. మీ మనస్సులు, చిత్తములు సమానంగా కలసి వున్నవి. నేను మీ యిద్దఱికీ సమానంగా మంత్రోపదేశము జేయుచున్నాను. సమానరూపంలో గ్రహణయోగ్య పదార్థము నొసంగుచున్నాను.

పండిత మదనమోహనమాలవ్యా నిర్ణయము ః-

స్త్రీలకు వేదమంత్రములు చదివే అధికార మున్నదా? లేదా? ఈ ప్రశ్నపై కాశీలోని పండితప్రకాండుల మధ్య వివాద మేర్పడినది. కాశీలోని హిందూవిశ్వవిద్యాలయ మండలి వేదవిభాగమునందు కళ్యాణి అను పేరుగల విద్యార్థిని ప్రవేశమునకు దరఖాస్తు పెట్టుకొన్నది. అప్పుడచట ప్రచారములోనున్న సాంప్రదాయము ప్రకారము విశ్వవిద్యాలయము ఆమె దరఖాస్తును తిరస్కరించి ఆమెకు ప్రవేశార్హత లేదని నిర్ణయించినది. అధికారుల కథనముప్రకారము స్త్రీలకు వేదమంత్రముల నభ్యసించుటకు అర్హత లేదు కనుక.

ఈ విషయము ప్రస్తావిస్తూ అనేక పత్రికలలో చాలా దినములవఱకు వివాదము చెలరేగినది. వేదాధికారాన్ని సమర్థిస్తూ సర్వదేశిక యను పత్రిక అనేక లేఖలను ప్రచురించినది. తద్విరోధంగా సిద్ధాంత యను పత్రికలో అనేక లేఖలు వెలువడినవి. ఆర్యసమాజము తరుపున ఒక డెప్యుటేషన్ విశ్వవిద్యాలయము అధికారులను కలిసినది. దేశమంతటా యీ సమస్యపై చర్చ జరిగినది.

చివఱకు విశ్వవిద్యాలయపు మహామనీషి మదనమోహనమాలవ్యా అధ్యక్షతన యీ ప్రశ్నను పరిశీలించుటకు ఒక కమిటీ నియమింపబడినది. ఈ కమిటీలో అనేకమంది ప్రసిద్ధిజెందిన ధార్మిక విద్వాంసులున్నారు. ఆ కమిటీ యీ విషయాన్ని వివేకంతో స్త్రీలకు పురుషులకు వలె వేదాధికారమున్నది యని నిష్కర్షగా నుడివినది. ఈ నిర్ణయ ఘోష 1946, ఆగష్టు 11 వ తేదీన సనాతన ధర్మాన్ని ప్రాణప్రదంగా భావించే శ్రీమదనమోహనమాలవ్యా గావించారు. తదనుసారంగా కళ్యాణీదేవి హిందూవిశ్వవిద్యాలయంలో వేదవిభాగంలో జేర్చుకొనబడినది. మఱియు శాస్త్రీయ ఆధారంపై విశ్వవిద్యాలయంలో స్త్రీలు వేదాధ్యయనము గావించుట కెటువంటి ప్రతిబంధకము లేర్పరచరాదు. స్త్రీలుగూడా పురుషులవలెనే వేదాధ్యయనము జేయగలరు అని నిర్ణయింపబడినది.

మహామనస్వి మాలవ్యాజీ, వారి సహాధ్యాయులు, తదితర విద్వాంసులు సనాతన విరోధులని సందేహించగూడదు. సనాతనధర్మంలో వారి వునికి ప్రసిద్ధమైనది. అట్టి మహావ్యక్తులచే యీ ప్రశ్నకు సమాధానము లభించినప్పటికి సామూహిక యుద్ధమొనర్చుటకు కొందఱు సిద్ధపడి, స్త్రీలకు గాయత్రీ అధికారము లేదంటున్నారు. వారి బుద్ధిని మన మేమనవలె? తెలియడంలేదు.

పండిత మదనమోహన మాలవ్యా సనాతనధర్మానికి ప్రాణము. వారి శాస్త్రజ్ఞత, విద్వత్తు, దూరదర్శిత, ధార్మిక దృఢత్వమునుగురించి యెట్టి సందేహము లేదు. మహాపండితులు, ఇతఱ అనేక ప్రామాణిక విద్వాంసులు పరామర్శించి నిర్ణయము వెలిబుచ్చు వారి మూర్ఖధర్మాన్ని తొలగించుట కా బ్రహ్మకైననూ కష్టమే.

విచారకరమైన విషయమేమనగా, అటువంటి వ్యక్తులు కాలపు పోకడను గుర్తించరు. హిందూ సమాజపు పతనావస్థపై ధ్యానముంచరు. కేవలము పది లేక ఇరువది కల్పిత శ్లోకములు ఆధారంగా దేశమునకు, సమాజమునకు హితవుగానివిధంగా ప్రవర్తిస్తున్నారు. ప్రాచీనకాలంలో అనేకమంది విదుషీ నామములు యిపుడుగూడా ప్రసిద్ధముగా నున్నవి. వేదములలో శతాధిక స్త్రీ ఋషులచే వుల్లేఖించబడిన మంత్రములు రచయిత్రుల రూపంలో మనకు గోచరిస్తారు. ఈ సంగతిని గుర్తించక మధ్యకాలంలో ఋషుల పేరుతో స్వార్థపరులద్వారా పుస్తకములలో ప్రక్షేపించబడినవాటి ఆధారంగా సమాజోద్ధరణా పవిత్ర కార్యాన్ని వ్యర్థంగా కలుషితము చేస్తున్నారు. ఇట్టి వ్యక్తులను వుపేక్షించి, మాలవ్యాజీ సమ్మతిప్రకారము అనుసరించుట సమాజ సేవకుల కర్తవ్యము.

స్త్రీలు అనధికారిణులు కారు

జరిగిన పుటలలో శాస్త్రము లాధారముగా ప్రమాణములు చూపబడినవి. పాఠకులొకసారి వాటిగురించి ఆలోచించవలెను. వేదశాస్త్రములలో ప్రతిబంధములు లేవని, ధార్మిక కార్యములకొఱకు, సత్‌జ్ఞానమును సముపార్జించుటకు, వేదశాస్త్రములను వినుటకు, మననముజేయుటకు ఆటంకములుండగూడదని ప్రతి ఆలోచనాపరుడు సహజంగా అంగీకరిస్తాడు. హిందూధర్మము, విశ్వధర్మము. అందులో యీవిధమైన ఆలోచనలకు తావులేదు. స్త్రీలను ధర్మము, ఈశ్వరుడు వేదవిద్యాభ్యాసము మొదలైన ఉత్తమమార్గములనుండి మళ్ళించి వారిని

అవనత అవస్థలోనుండి వివశులను చేయవలెనా! ప్రాణికోటిపై అనంత దయ, కరుణ కలిగిన ఋషులు, మునులు అట్టి కఠినులు కాజాలరు. వారు వేదములవలన ఈశ్వరీయజ్ఞానమును స్త్రీలు పొందకుండ వంచితులను గావించి, ఆత్మకళ్యాణమార్గమును మూసివేయుదురా! హిందూధర్మము అత్యధిక ఉదారమైనది. విశేషముగా స్త్రీల యెడల హిందూధర్మంలో మిక్కిలి ఆదరణ, శ్రద్ధ, ఉచ్చస్థాన మున్నది. అట్టి దశలో గాయత్రీ ఉపాసన లాంటి ఉత్తమ కార్యమునకు స్త్రీలు అయోగ్యులనుట యెటుల సంభవము?

ఎక్కడో ఐదు, పది శ్లోకములు స్త్రీలను వేదశాస్త్రాధ్యయనమునుండి నిషేధించినవి. పండితులు వీటిపై ధ్యానముంచవలె. ప్రారంభములో చాలాకాలం స్త్రీలు వేదము లభ్యసించగూడదని సమాజము నిషేధము గావించినది. అన్వేషణ అధికంగా కావలసివచ్చినది. క్రమక్రమంగా ఈ ప్రతిబంధన శ్లోకములు మధ్యకాలంలో సామంతరాజుల ఆచారములకు ప్రాతినిధ్యమని తెలిసినది. ఆ సమయములోనే యిటువంటి శ్లోకములు గ్రంథములలో కలుపబడినవి. సత్యసనాతన వేదోక్త భారతీయ ధర్మపు వాస్తవికాలోచన స్త్రీలపై యేవిధమైన ప్రతిబంధనము లేర్పరచలేదు. అందులో స్త్రీలకుకూడ ఈశ్వరోపాసన వేదశాస్త్రముల నాశ్రయించుట నుండి ఆత్మలాభమును పొందుటకు పరిపూర్ణమైన అవకాశ మీయబడినది.

ప్రఖ్యాతిచెందిన గణనీయులైన విద్వాంసుల అభిప్రాయముగూడా నిదియే. సాధన, యోగముయొక్క ప్రాచీన పరంపరను తెలుసుకొనిన మహాత్ములు, స్త్రీలు యెల్లపుడు గాయత్రీ ఉపాసన జేయుటకు అధికారిణు లని వ్రాక్కుచ్చారు. స్వర్గీయ మాలవ్యాజీ సనాతన ధర్మమునకు ప్రాణము. ప్రప్రథమంలో వారు స్త్రీలు వేదములు పఠించుట నిషేధించారు. కానీ విశేషరూపంలో పండిత మండలి సహకారముతో దీనినిగూర్చి పరిశోధించి స్వయముగా నిష్కర్షగా శాస్త్రములు స్త్రీలకు ప్రతిబంధములు గావనే నిర్ణయమునకు వచ్చారు. విరోధంగా వాదించువారిని కించిత్‌గూడ లెక్కచేయకుండా హిందూవిశ్వవిద్యాలయములో స్త్రీలకు ప్రవేశార్హత గలిగించారు.

ఇపుడుగూడా అనేకమంది మహానుభావులు స్త్రీలకు గాయత్రీ అధికారము లేదు అంటున్నారు. అటువంటివారి కళ్ళు తెఱపించుటకు అసంఖ్య ప్రమాణాలలో కొన్ని ప్రమాణాలనుమాత్రమే వ్యక్తపఱచాము. అజ్ఞానమువలన కొన్నిటిని మనము నిరోధించుట సంభవము. మొండిపట్టుదలతోకూడిన వివాదానికి అంతుండదు. తన మాటలను నెగ్గించుకోవాలనే మూర్ఖపు పట్టుదల వ్యక్తులకు శోభ నియ్యదు. వివేకవంతుల సిద్ధాంతము సత్యమేదో అది మనది యని. అవివేకులు మనము వచించినదే సత్యము అని సిద్ధాంతీకరించుటకు వితండవాదమును వీడరు.

మేధతో ఆలోచించు వ్యక్తులు తమంతట తాము ఏకాంతము నేర్పరచుకొని కూర్చొని యీ ప్రశ్నలను వేసికొనవలెను.

1) స్త్రీలు గాయత్రీ ఉపాసనకుగాని, వేదమంత్రము లభ్యసించుటకుగాని అనర్హులైతే ప్రాచీనకాలంలోని స్త్రీలు వేదమంత్రద్రష్టలు, ఋషికలు యెలాగైనారు?

2) స్త్రీలు వేదాధికారులు కానట్లయితే యజ్ఞములు మొదలైన ధార్మిక కృత్యములలో, షోడశసంస్కారములలో వారినెందుకు భాగస్వాములుగా సమ్మిళిత మొనరించినారు.

3) వివాహాది సమయములలో స్త్రీల ముఖమునుండి వేదమంత్రోచ్చారణ యెందుకు చేయిస్తారు?

4) వేదమంత్రములు లేకుండ నిత్యసంధ్య, హవనములను స్త్రీ లెట్లు నిర్వర్తిస్తారు?

5) స్త్రీలు అనధికారిణులైతే అనసూయ, అహల్య, అరుంధతీ, మైత్రేయి, మదాలస మొదలైన అగణిత స్త్రీలు వేదశాస్త్రపారంగతు లెటులైనారు?

6) జ్ఞానము, ధర్మము, ఉపాసన మొదలైన అధికారములనుండి తెలివిగలవారిని వంచించుట, అన్యాయము పక్షపాతము కాదా?

7) స్త్రీలను ఆధ్యాత్మికదృష్టికోణమునుండి మరల్చినవారికి జన్మించే సంతానము ధార్మికులగుదురా!

8) స్త్రీ పురుషుని అర్ధాంగి యైనపుడు, సగము అంగము అధికారము గలిగి,సగము అనధికారము యెట్లు అగును?

పై ప్రశ్నలపై ఆలోచించినయెడల నిష్పాక్షికమైన ప్రతివ్యక్తికికూడ స్త్రీలపై ధార్మిక ఆంక్షలు విధించుట న్యాయసంగతము గాదని అంతరాత్మ జవాబిస్తుంది. వారికిగూడ పురుషులకువలె గాయత్రీ మొదలైన మంత్రములకు అధికారము కావలెను. మేముకూడ యీ నిర్ణయమునకు వచ్చినాము. మాకు వందలకొద్ది స్త్రీ మాతలతో పరిచయమున్నది, వారు శ్రద్ధతో వేదమాత గాయత్రీని ఉపాసించారు. వారుగూడ పురుషుల వలె సంతోషజనకమైన ఫలితములను పొందారు. అనేకసార్లు పురుషులకన్నా అధికంగాను, శీఘ్రంగాను ఫలితములొచ్చాయి. కన్యలకు ఉత్తమ గృహములనుండి వరులు లభించారు. విధవలు సంయమనముతో ధనోపార్జన గావించి ఆశాజనక ప్రయోజనములను అనుభవించారు.

ఆత్మ స్త్రీ గాదు, పురుషుడు గాదు. ఆత్మ విశుద్ధ బ్రహ్మజ్యోతియొక్క ప్రకాశించు అవ్వ. ఆత్మిక ప్రకాశాన్ని పొందుటకు పురుషులకు గురువెంత అవసరమో, స్త్రీలకు గూడా నంతే. తాత్పర్యమేమనగా సాధనాక్షేత్రంలో స్త్రీ పరుషులకు భేదము లేదు. సాధక్ ఆత్మ అవుతుంది. స్త్రీ పురుషులన్న ఆత్మ యని తెలియవలె. సాధనాక్షేత్రమందు ఆత్మ లన్నియు సమానము. లింగభేదాన్ని అనుసరించి అయోగ్యతను ఆరోపించి చెంపదెబ్బ వేయగూడదు.

పురుషుని కంటే స్త్రీలలో ధార్మికతత్త్వము యెక్కువ మోతాదులో వుంటుంది. పురుషులపై చెడు వాతావరణ ప్రభావము, వ్యావహారపు ఛాయ అధికముగా నుంటుంది. అందులో అధికంగా చెడు వుంటుంది. ఆర్థిక సంఘర్షణలకు లోబడి, చోరత్వము, నిజాయితీలోపము మొదలైన అవసరములను యెదుర్కొనవలెను. కానీ స్త్రీల కార్యక్షేత్రము బహుసరళము, సుగమము, సాత్త్వికము. గృహములందే కార్యములు జరిగినప్పటికి అందు సేవజేయుట అనునది అధికంగా వుంటుంది. వారు ఆత్మనిగ్రహము కలిగివుంటారు. కష్టములను సహించెదరు. కానీ బిడ్డలపై, భర్తపై, అత్తమామలయందు, బావమఱుదులయందు, తమ వ్యవహారము సౌమ్యంగాను, సహృదయతతో సేవాపూర్ణంగాను, ఉదారంగాను, శిష్టసహిష్ణుతతో నుంటుంది. వారి దినచర్య సత్త్వగుణ ప్రధానంగా వుంటుంది. చౌర్యము, హత్య, మోసగించుట, ధూర్తత్వము, స్వార్థపరత్వము, నిష్ఠూరము, వ్యసనము, అహంకారము, సంయమనము లేకుండుట, అసత్యము పురుషులే ప్రధానంగా అలవాటుగావించుకొంటారు. ఈ పాపములు స్త్రీలలో తక్కువగా వుంటాయి. కానీ ప్రస్తుతము ఫ్యాషనులయందు మోజు, నిలకడలేనిదనము, కర్కశత్వము, పనిచేసి మనస్సును ఆకర్షించుట మొదలైన

చిన్నచిన్న చెడులు స్త్రీలలో అభివృద్ధి చెందుతున్నాయి. కానీ పురుషులతో పోలిస్తే స్త్రీలు నిస్సందేహంగా శతాధిక సద్గుణులు. వారి దుర్గుణములు చాల తక్కువ పరిమితి గలవి.

అట్టి స్థితియందు పురుషులకంటే స్త్రీలలో ధార్మిక ప్రవృత్తి వుండడము స్వాభావికము. వారి మనోభూమిలో ధార్మిక బీజాంకురము శీఘ్రంగా నాటుకుంటుంది. పుష్పిస్తుంది. ఫలిస్తుంది. అవకాశము వున్న కారణముచే గృహంలో పూజ, ఆరాధన నియమపూర్వకంగా జేయగలుగుతుంది. తన బిడ్డలపై ధార్మిక సంస్కార ప్రభావము శ్రేష్ఠంగా ప్రసరింపజేయగలదు. ఈ సద్విషయాలన్నింటిని గమనిస్తే మహిళలు ధార్మిక సాధనకొఱకు వుత్సాహంగా పనిచేయవలసిన ఆవశ్యకత వున్నది.దీనికి వ్యతిరేకంగా వారిని నీచులుగాను, అనధికారిణులుగాను పరిగణించడము యేవిధంగా వుచితమో అర్థముగావడంలేదు.

స్త్రీలు వేదశాస్త్రములను స్వంతము చేసుకొనుటకు గాయత్రీ సాధన చేయుటకు అసంఖ్య ప్రమాణములు గ్రంథములనిండా వున్నవి. గమనించకుండా కళ్ళుమూసుకుని నాలుగైదు శ్లోకాలను పట్టుకొనికూర్చొని వాటి ఆధారంపై స్త్రీలను అనధికారిణులుగా నిర్ణయించుట బుద్ధిమంతుల లక్షణము గాదు. ధర్మము వైపు యెవఱికి అలాంటి ప్రవృత్తి లేదు. కానీ ప్రత్యేకంగా స్త్రీలకు వుత్సాహము, సౌకర్యము వున్నపుడు వారిని అనధికారిణులుగా ఘోషించుట, జ్ఞానము, ఉపాసనా మార్గములను మూసివేయుట వివేకము గాదు.

మేము చాలా యెక్కువగా ఆలోచించాము. మననము, అన్వేషణ గావించినందున స్త్రీలు పురుషుల వలె గాయత్ర్యోపాసనకు అర్హులని విశ్వాసము కలిగినది. వారుకూడ గాయత్రీమాత ఒడిలో నుండుటకు, ప్రవేశించుటకు ఆ మాతృదేవి చేలాంచలమును పట్టుకొనుటకు ఆమె స్తన్యపానమొనరించుటకు సంపూర్ణమైన అధికారులు. వారన్ని సంకోచములను విడచి ప్రసన్నతాపూర్వకంగా గాయత్ర్యోపాసన జేయవలె. దీనివలన వారి భవబంధనములు వీడిపోతాయి. జన్మమరణములను ఉరిత్రాటినుండి ముక్తులౌతారు. జీవన్ముక్తులై స్వర్గీయశాంతిని పొందుటకు అధికారులౌతారు. దీనితోపాటు తమ పుణ్యశక్తివలన తమ కుటుంబసభ్యులకు ఆరోగ్యము, సౌభాగ్యము, వైభవము, సుఖశాంతులు దినదినాభివృద్ధిజెందుటకు తోడ్పడతారు. నిజమైన అర్థంలో గాయత్రీని స్వంతము జేసుకొనే స్త్రీలు దేవీ స్వరూపిణులౌతారు. వారి దివ్యగుణములు ప్రకాశించుతాయి. తదనుసారంగా వారికి సర్వత్రా ఆదరణ ప్రాప్తిస్తుంది. అదియే వారికి ఈశ్వరప్రదత్తమైన జన్మజాత అధికారమై యున్నది.

గాయత్రీ శాపవిమోచనము మఱియు ఉత్కీలన రహస్యము

గాయత్రీ మంత్రపు మహిమను కీర్తిస్తూ శాస్త్రములు, మహర్షులు అలసిపోలేదు. ఆ మంత్రపు ప్రశంస, మహిమకు సంబంధించి యెంత చెప్పబడినదో బహుశా అంతగా దేనికీ చెప్పబడలేదు. ప్రాచీనకాలంలో గొప్పగొప్ప తపస్సు జేసినవారు ప్రధానంగా గాయత్రీ తపశ్చర్యచేతనే అభీష్టసిద్ధిని పొందారు. శపించుటకుగాని, వరము లిచ్చుటకుగాని వివిధ విధులచే గాయత్రీని ప్రయోగించేవారు.

ప్రాచీనకాలంలో గాయత్రీ గురుమంత్రము. నేడు గాయత్రీ మంత్రము ప్రసిద్ధము. మనుష్యులలో అధికాంశమున కా మంత్రము తెలియును. అనేకమంది యేదోవిధంగా ఆ మంత్రాన్ని జపించుతున్నారు లేక యేదైన అవసరము వచ్చినపుడు స్మరిస్తున్నారు. అయినప్పటికి దానివలన విశేషమైన ఫలము కలుగుటలేదు. దీని ఆధారంగా గాయత్రీ మంత్రాన్ని ప్రశంసించుటలోను, మహిమను వర్ణించుటలోను యేదైనా అత్యుక్తి వున్నదా? అనే శంక కలగడము కద్దు. ఆరంభంలో వుత్సాహంగా ప్రారంభించి కొద్దిరోజులలోనే వదిలివేస్తారు. అనేకమంది ఇలా అనుకొంటారు. ఇన్నిరోజులనుండి గాయత్రీ ఉపాసన చేస్తున్నాము. కానీ ప్రయోజనము శూన్యము. అందువలన దీనికొఱకు కాలమును ఎందుకు వ్యర్థంగా వృథా చేయవలెను?

కారణమేమనగా ప్రత్యేక కార్యాన్ని వుపలక్షించినపుడు నియమిత పద్ధతిలో పూర్తిగావించవలె. ఇష్టమైన పనికొఱకు, ఇష్టమైన పద్ధతిలో ఇష్టమైనవిధంగా ఆరంభించినయెడల అభీష్టసిద్ధి కలుగదు. యంత్రములతో చాలా కష్టమైన పనులు చేయవచ్చు. కానీ వాటిని ఉచితరీతిలో నడిపించినపుడే అది సాధ్యము. యంత్రములను నడుపుట తెలియని జ్ఞానిచే అవి పనిచేసినయెడల లేక గ్రుడ్డివారు వాటిని నడుపుటకు ప్రయత్నిస్తే ప్రయోజనము లేకపోగా, కార్ఖానాకుగాని, నడిపే వ్యక్తికిగాని సంకటములు వుత్పన్నమౌతాయి. మోటారుకార్ చాలా వేగంగా ప్రయాణించే వాహనము. దానితో రోజుకు వందలకొద్ది మైళ్ళు సుఖంగా ప్రయాణించవచ్చు. కానీ డ్రైవింగ్ సరిగా తెలియని అజ్ఞాని నడిపితే క్లచ్, బ్రేకులు సరియైన సమయములో వాడటం తెలియదు. యాత్ర జరగకుండుటేగాక, ప్రయాణీకులకు అరిష్టములు గలుగవచ్చు. యాత్ర నిష్ఫలము కావచ్చు. ఆ పరిస్థితులలో మోటారును తిట్టుట, దాని శక్తిపై అవిశ్వాసము వెల్లడించుట వుచితము కాదు. అజ్ఞానులైన సాధకులు చేసే ఉపాసన నిష్ఫలమైనట్లయితే ఆశ్చర్యపడనవసరము లేదు.

ఏదైనా వస్తువు యెంత గొప్పదౌతుందో, విశిష్టమౌతుందో దానిని పొందుట అంతే కఠినమవుతుంది. ముత్యపుచిప్పలు సులభంగా దొరుకుతాయి. వాటిని ఎవరైనా ఏరుకొనవచ్చు. కానీ ముత్యము కలసినట్లయితే సముద్రంలో దిగవలె. అపాయకరమైన ఆ పనిని యితరులనుండి నేర్చుకొనవలెను. అజ్ఞానియైన మనుష్యుడెవరైనా బావిలోనున్న వస్తువులను

పైకి తెచ్చే బాలుర ఆటవలె వూహించి సముద్రంలో దూకి మునిగినట్లయితే తన అజ్ఞానము వలన ఫలితము లేనట్లయితే ఆశ్చర్యపడకూడదు.

నియమము, పద్ధతి లేకుండా గాయత్రీ సాధన చేసినందువలన హానిమాత్రము కలుగదు. ఇతఋ మంత్రములకన్నా ఈ మంత్రములో విశేషమిదియే. గాయత్రీ సాధనా పరిశ్రమ నిష్ఫలము గాదు. కొంతలో కొంతైనా ప్రయోజనము చేకూరుతుంది. కానీ నియమవిధి ప్రకారమాచరించినందున వచ్చే ఫలితము మాత్రము రాదు. గాయత్రీ తాంత్రిక ఉపాసనలో విధి ననుసరింపనియెడల హానిగూడా జరుగుతుంది. కానీ సాధారణ సాధనలో యేమి అపాయము లేదు. కానీ పరిశ్రమకు పూర్తి ఫలితము లేకపోడంగూడా ఒకవిధంగా నష్టమే. అందువలన బుద్ధిమంతులైన మనుష్యులు తొందరకు, అహంకారమునకు, ధర్మవిరుద్ధమైన కోరికకు బానిసలు గారు. సాధనా మార్గములో ఏనుగు నదిని దాటునపుడు థాహా థాహా అంటూ నెమ్మదిగా పురోగమించినట్లు ఆలోచనలతో జ్ఞానంతో ముందుకు వెళతారు.

కొన్ని ఔషధములు నియమిత పరిమాణంలో తీసుకుని శాస్త్ర పద్ధతిలో తయారుచేసి రసాయనము గావించి, నియమిత మోతాదులో రోగి సేవించినట్లయితే ఆశ్చర్యకరమైన ఫలితాలు వుంటాయి. కానీ ఔషధములను యిష్టమైన మోతాదులో యిష్టమైన అనుపానముతో సేవించితే నిశ్చయంగా ఫలితము చెడుగా వుంటుంది. ఆ ఔషధము విధిపూర్వకంగా ప్రయోగింపబడినపుడు అమృతోపమైన లాభము జరుగుతుంది. అవిధిపూర్వకంగా స్వీకరించినపుడు నిరర్ధకమౌతుంది. అపుడా ఔషధానికి దోషమారోపించడము న్యాయమని చెప్పలేము. గాయత్రీ సాధనను నియమము లేకుండా చేసినయెడల నియమంతో చేసినంత ప్రయోజనము కనుపించదు.

పాత్రుడు, కుపాత్రుడు గాయత్రీ శక్తిని యథేచ్ఛగా ప్రయోగింపలేరు. ఎందువలననగా మంత్రము కలియుగమునకు పూర్వమే బంధింపబడినది. ఆ బంధమును విడదీయగలిగిన వ్యక్తియే లాభించగలడు. తుపాకీ లైసెన్సు ప్రభుత్వము యోగ్యునికే యిస్తుంది. పరమాణుబాంబు రహస్యము కొంతమంది వ్యక్తులకే పరిమితమౌతుంది. ఏలనన ఎవరైనా దానిని దురుపయోగము చేయవచ్చు. అమూల్యమైన వస్తువులను అనధికారులు తెరువకుండా దానిని ఇనుపపెట్టెలలో నుంచి తాళములను వేసి బంధిస్తారు. ఈ కారణమువలననే గాయత్రీమంత్రము బంధింపబడినది, దానిని యెవ్వఋూ దురుపయోగము గావించకుండా.

పురాణములలో వశిష్ఠులవారు, విశ్వామిత్రులవారు గాయత్రీ సాధన నిష్ఫలమగుగాక! యని శపించారని వుల్లేఖించబడినది. ఇంత మహత్తర శక్తి నిష్ఫలమైనందువలన హాహాకారములు చెలరేగాయి. అపుడు దేవత లందఋూ శాపవిమోచనము ననుగ్రహించమని ప్రార్థించారు. అంతలో శాపమిమోచన మార్గ మేర్పడినది. ఎవరైతే శాపవిమోచన విధిని పూర్తిచేసి గాయత్రీ సాధన చేయుదురో వారి ప్రయత్నము ఫలిస్తుంది. మిగతావారి శ్రమ నిరర్థకమౌతుంది. ఈ పౌరాణిక ఉపాఖ్యానములో నొక గుహ్యమైన రహస్య మిమిడియున్నది. దీనిని గ్రహించలేనివారు కేవలము శాపవిముక్తోభవ మంత్రములను పునరుచ్చరించి సాధన శాపవిముక్తి పొందినదని భావిస్తారు.

వశిష్ఠ పదమున కర్థము విశేష రూపమువలన శ్రేష్ఠమైనది అని. గాయత్రీ జపము ఎవరైతే ఒకటింబావు కోటి చేయుదురో, వారికి వశిష్ట పదవీయబడుతుంది. రఘువంశ కులగురువు ఎల్లప్పుడు వశిష్ఠ పదవి గ్రహించిన వ్యక్తియై వుండేవాడు.రఘు, అజ, దిలీప, రామ, లవకుశుల వారి పూర్వుల గురువు ఒక్కడేగాడు. వేవ్వేరు. కానీ వుపాసనాధారంగా

అందఱూ వశిష్ట పదవిని పొందినారు. ఈవిధమైన వశిష్ట పదవిని పొందినవారి నుండి గాయత్రీ వుపదేశము పొందవలెనని అది వశిష్ఠ శాపవిముక్తి పొందుట యని తాత్పర్యము. వారిని తన మార్గము చూపుటకు యెన్నుకొనవలెను. కారణమేమనగా, అనుభవము గల వ్యక్తియే మార్గమందుగల సాధబాధకములను తెలిసినవాడు. వాని నివారణోపాయముల నెరిగినవాడు. ఈత నేర్చుకొనదలచిన వ్యక్తి ఈతలో నిపుణుడైన వ్యక్తిని దగ్గఱుంచుకుంటాడు. ఈతలో ప్రమాదము సంభవించి ఈత నేర్చుకొనే వ్యక్తి మునిగిపోతూవుంటే నిపుణుడైన దగ్గఉన్న ఈతగాడు చేయూతనిచ్చి రక్షించి సురక్షితంగా దాటించగలడు. ఈతలో మరచిపోయిన పద్ధతిని గుర్తుచేయగలడుకూడా. ఒకవేళ ఈతగాడుగాని, శిక్షకుడుగాని లేనపుడు ఈత నేర్చుకొనేందుకు బాలురు నీటిలో తిరుగుతువుంటే వయసుమళ్ళిన వృద్ధులు గమనించి బాలురకు తెలియగలందులకు 'నాయనలారా! చెఱువులలో దిగవద్దు. ఇందులో ఈతగాని శాపమున్నది. శాపవిముక్తి గానిదే ఈత నేర్పిన నిష్ఫలమగును.' ఈ శబ్దములలో అహంకారమున్నమాట నిజమే. శాబ్దిక అత్యుక్తి యనిగూడా అనవచ్చు. కానీ వాస్తవంగా అంతా సత్యమే. గురుని పర్యవేక్షణ లేకుండా ఈత నేర్వడము దుస్సాహసమే అవుతుంది.

ఒకటింబావుకోటి గాయత్రీ సాధన చేసి ఉపాసక వశిష్ఠ సంరక్షకత్వము పొందుటకే వశిష్ఠ శాపవిమోచనము పొందుట. ఇందువలన సాధకుడు నిర్భయంగా నదురుబెదురు లేకుండా తన మార్గంలో వేగంగా పయనించగలడు. అందువలన నూతన సాధకునకు అనేక కష్టములు దూరమవుతాయి. కోరిన లక్ష్యమును త్వరగా చేరగలడు.

గాయత్రీమంత్రమునకు కేవలము వశిష్ఠ శాప మొకటే గాదు. ద్వితీయ శాపము కూడా నున్నది. అది విశ్వామిత్రునినుండి. ఈ రత్నకోశమునకు రెండవ తాళముగూడా నున్నది. ఏలనన అధికారమున్నవారే దానిని తెరచుటకు వీలవుతుంది. తొందరపాటుగల వ్యక్తి, శ్రద్ధ లేనివాడు, సోమరిపోతు పప్పులుడకవు. విశ్వామిత్ర అను పదమునకు అర్థము ప్రపంచమునకు మేలు చేయువాడని, పరమార్థమును కాంక్షించు వ్యక్తి, ఉదారుడు, సాధుపురుషుడు కర్తవ్యనిష్ఠాపరుడు. గాయత్రీ శిక్షకుడు కేవలము వశిష్ఠ గుణములు గలగియున్న వ్యక్తియైనంతమాత్రాన సరిపోదు. అధికంగా విశ్వామిత్రుడుగూడాయై వుండవలెను. కఠోర సాధన తపశ్చర్యలచే దుర్మార్గ స్వభావము గలిగిన వ్యక్తులుగూడా సిద్ధిని పొందగలరు. రావణుడు వేదపారంగతుడు. ఆయన కఠోరమైన తపస్సు చేశాడు. మహా ఆశ్చర్యజనకమైన సిద్ధులు పొందాడు. ఈవిధంగా రావణుని వశిష్ఠునిగా మన్నించవచ్చు. కానీ విశ్వామిత్రుడు మాత్రము గానేరడు. ఏలనన ప్రపంచమునకు మేలు చేయుట, ధర్మాచార్యగుణము, పరమార్థ లక్షణములు పూజ్యము. స్వార్థము, లాలసత్వము, సంకీర్ణమనోప్రవృత్తి గలిగినవారెంత సిద్ధపురుషులైనా గాయత్రీ వుపదేశమివ్వడానికి అర్హులుగారు. ఇదియే ద్వితీయ శాపవిమోచనము, వశిష్ఠ, విశ్వామిత్ర గుణములు గలిగిన మార్గదర్శకుడు గురువుగా లభించినపుడు ఈ రెండు శాపములు వదలినట్లే. అపుడా గాయత్రీ సాధకునికి లభించే ఫలము శాస్త్రములలో వర్ణింపబడిన ప్రకారముంటుంది.

ఈ కార్యము కష్టసాధ్యము. ఏలనన వశిష్ఠ విశ్వామిత్ర గుణములచే సంపన్నుడైన వ్యక్తి గురువుగా లభించుట దుర్లభము. ఒకవేళ లభించినప్పటికి అతడు ప్రతివాని బాధ్యత తనపైనుంచుకొనుటకు అంగీకరించడు. ఎందువలననగా అతని శక్తిసామర్థ్యములు పరిమితమై వుంటాయి. కావున యే కొద్దిమందికో ఆతడు సేవ చేయగలుగుతాడు. అతడు ఇదివఱకే తన పరిమితమేఱకు బాధ్యత తీసికొనివున్నట్లయితే, అదనంగా సేవచేయటానికి కష్టము. పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు 30 మంది విద్యార్థుల వఱకు బోధించగలడు. కానీ ఆ సంఖ్య 60 అయినపుడు ఉపాధ్యాయుడు

బోధించగలడా? బాలురు చదువుకొనగలరా? కావున పైన చెప్పబడిన సుయోగ్యుడైన గురువు లభించడు. లోభులు, స్వార్థపరులు, మోసకారులైన గురువులకు తక్కువలేదు. రెండు రూపాయలు గురుదక్షిణ సమర్పించగానే ఎవతికైనాసరే కంఠమాల వేసేవారు కోకొల్లలు. అట్టివారిని గురువుగా నియమించుట మోసము, హాస్యపూరితము.

గాయత్రీ దీక్ష గురుముఖంగా స్వీకరించవలెను. అపుడే ఫలదాయకమవుతుంది. తుపాకీమందు నేలమీదగాని, మరెచ్చటనైనాగాని పఱచి అగ్గిపుల్లతో మండించితే అది మామూలుగా మండిపోతుంది. కానీ దానినే తుపాకీలో దట్టించి విధిపూర్వకంగా ప్రయోగించితే భయంకర శబ్దముతో ఒక ప్రాణఘాతకమైన శక్తి వుద్భవిస్తుంది. కాగితములపై ముద్రింపబడిన గాయత్రీ మంత్రములు నేర్చుకొనుటగూడా నేలపై బఱచిన తుపాకీమందును నిప్పుతో వెలిగించుట, గురుముఖతః నేర్చుకొన్న గాయత్రీ తుపాకీలొ దట్టించి ప్రయోగించిన తుపాకీమందు.

గాయత్రీ మంత్రాన్ని విధిపూర్వకంగా సాధన చేయడముమాత్రమే తన పరిశ్రమలో సఫలీకృతమవడానికి సరియైన మార్గము. ఈ మార్గానికి ప్రథమ ఆధారము వశిష్ఠ విశ్వామిత్ర గుణములను గలిగిన మార్గదర్శకుని వెదకడము. అతడు తన శిష్యుని శాపవిమోచనము గావించగలగాలి. అటువంటి సుయోగ్య సంరక్షకుడు ప్రథమంగా సాధకుని మనోభూమిని అభిరుచిని సామర్థ్యాన్ని గమనిస్తాడు. తరువాత సాధకుని సాధనాకార్యక్రమాన్ని యెంపికజేస్తాడు. విద్యార్థి తనంతట తానుగా తాను యేక్రమములో పాఠముల నభ్యశించవలెనో నిశ్చయించుకొనగలడా?

ఇది అధ్యాపకుడు నిర్ణయించవలసిన విషయము. విద్యార్థి ఏ తరగతికి చెందినవాడో తెలుసుకొని నిర్ణయించవలెనుగదా? ఏవిధంగా భిన్నభిన్న ప్రకృతులు గల ఒకే రోగమున్న రోగులకుకూడా ఔషధము వేత్వేరు మాత్రలలో యివ్వబడుతుందో, అటులనే సాధకుని అంతరంగికస్థితిని బట్టి మార్పు వుంటుంది. నిర్ణయము సాధకుడు స్వయంగా తీసుకొనలేడు. సుయోగ్యుడు, అనుభవశాలి, సూక్ష్మదర్శకుడైన మార్గదర్శకుడుమాత్రమే ఈ కార్యాన్ని చేయగలడు.

ఆధ్యాత్మికమార్గంలో పురోగమించటానికి శ్రద్ధ, విశ్వాసములు రెండు ప్రధాన శరణ్యములు. ఈ రెంటియొక్క అభ్యాసము ప్రారంభంలో గురువును సాధనంగా చేసికొని నిర్వర్తించవలెను. ఈశ్వరోపాసన చేసెటప్పుడు ప్రారంభదశలో నొక మూర్తినిగాని, చిత్రపటాన్నిగాని, జ్యోతినిగాని యేవిధంగా యేర్పరచుకొంటామో అటులనే శ్రద్ధ విశ్వాసము, ఉన్నతి, గురువు అనే పేరుగల వ్యక్తిపై దృఢంగా వుండటంవలన లభిస్తాయి. ప్రేమ, స్త్రీపైగాని సోదరునిపైగాని, స్నేహితుడు మొదలైన వారిపై నుంటుంది. కానీ యిది శ్రద్ధాయుక్తమైన గురువువల్లనే లభ్యమౌతుంది. మాతాపితలుగనుక వశిష్ఠ, విశ్వామిత్ర గుణములు గలవారైనచో అందఱికంటె ఉత్తమమైన గురువులు కాగలరు.

గురువు పరమహితము గోరువాడు. శిష్యుని మనోభూమితోను పరిచయము గలవాడు. శిష్యుని బలహీనతలు తెలిసినవాడు. అందువలన శిష్యుని దోషములను తెలిసికొని నెమ్మదినెమ్మదిగా వాటిని తొలగించే ఉపాయాన్ని వుపయోగిస్తాడు. కానీ శిష్యుని దోషములవలన అతనిని ఏవగించుకొనడు, త్యజించడు. శిష్యుని అవమానితునిగా, తిరస్కృతినిగా, దుష్టునిగా చేయడు. పోగా శిష్యుని దోషములను బాల్యచాపల్యముగా భావించి, క్రమేణా నిదానంగా అతని అభిరుచిని వేఱొకదారిని మళ్ళించుటకు ప్రయత్నిస్తాడు. దానివలన అతనిలోని లోపాలు, బలహీనతలు తమంతట తామే అంతరిస్తాయి. కన్నతల్లి తన వంటకములను ఆరగించి, ఆ ఆహారాన్ని తన స్తన్యముద్వారా బిడ్డకు శక్తిని ఏవిధంగా కలిగించుతుందో అదేవిధంగా యోగ్యుడైన గురువు తన సాధనద్వారా ఏకత్రితమైన ఆత్మశక్తిని నెమ్మదిగా శిష్యుని

అంతఃకరణములోనికి ప్రవేశపెడతాడు. గురువుయొక్క ఆత్మతేజాన్ని గ్రోలి శిష్యుని ఆత్మబలము వృద్ధిపొందుతుంది. ఈ మార్పిడిని పరిభాషలో 'శక్తిపాతము' అని అంటారు. ఈవిధంగా గురువుని పొందడంలోగల పూర్వజన్మ సంచితశుభసంస్కార ఫలితములను లేక పరమేశ్వరుని మహత్తర కృపాచిహ్నములను గుర్తించవలెను.

మేము ప్రత్యేక సమయములో ఒక వ్యక్తిని గురువుగా యేర్పరచుకొన్నాము. ఇపుడు వేఱొక వ్యక్తిని మార్గదర్శకుడైన గురువుగా ఎన్నుకోవడానికి అధికారము లేదని అనేకులు భావిస్తారు. ఈవిధమైన ఆలోచనాసరళి యెలా వుంటుందంటే ఒక విద్యార్థి ఇలా అనడము 'అక్షరాభ్యాసము చేసేటపుడు యే ఉపాధ్యాయుని గురువుగా నెంచుకున్నానో జీవితాంతము వారినితప్ప యితఱులనుండి బోధనను స్వీకరింపను. మఱియు యెవఱిని గురువుగా అంగీకరించను'.

ఒకే గురువునుండి ప్రపంచమందలి అన్ని విషయములు పొందు అవకాశము లేదు. ఒకవేళ ఆ గురువు మరణించినచో వేఱొక ప్రదేశానికి వెళ్ళిపోయినట్లయితే వారినుండి విద్య నభ్యసింపలెననే అభిలాష ఉచితమని యే స్థాయిలోనైనా చెప్పగలమా? ఒక్కొక్కసారి శిష్యుడు ప్రథమగురువు కంటె యెక్కువ జ్ఞానవంతుడైనట్లయితే అతని జిజ్ఞాస యెక్కువ విస్తృతమైనయెడల ఆ దశలో అతని జిజ్ఞాసలకు సమాధానమూ ప్రాథమిక గురువునుండే పొందవలెనని ఆశించినయెడల నది సంభవమా?

ప్రాచీన ఇతిహాసములపై దృష్టి సారించినయెడల నీ కలహ కారణమునకు సమాధానము లభిస్తుంది. మహర్షి దత్తాత్రేయులవారు 24 మంది గురువుల నాశ్రయించారు. రామలక్ష్మణు లిద్దఱూ తమ కులగురువు వశిష్ఠుని నుండి శిక్ష స్వీకరించుటయేగాక వారు విశ్వామిత్రునివద్దనుండిగూడా అధికంగా విద్యను పొందారు. వారిద్దరుకూడ రామలక్ష్మణులకు గురువులే. శ్రీకృష్ణ పరమాత్మ సాందీపనివారివద్దగూడా విద్య నభ్యసించారు. మఱల మహర్షి దుర్వాసులవారుగూడ వారి గురువు. అర్జునుని గురువు ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు కూడ. ఇంద్రుని గురువు బృహస్పతి మఱియు నారదులవారుగూడా. ఈవిధంగా అనేక వుదాహరణలు మనకు లభ్యమౌతాయి. దీనివలన ఆవశ్యకతనుబట్టి ఒకే గురువు శిష్యులకు బోధ జేయవచ్చు. అటులనే ఒకే శిష్యుడు అనేకమంది గురువులను సేవించి జ్ఞానప్రాప్తిని పొందవచ్చు. దీనికెట్టి పరిమితి లేదు. అందువలన ఒకరితరువాత వేఱొకరినుండి జ్ఞానమును పొందుట కెట్టి ప్రతిబంధకములు లేవు. అటులనే ఒక వ్యక్తికి అనేకమంది పురోహితులుండవచ్చు. గ్రామపురోహితుడు, కులపురోహితుడు, రాష్ట్రపురోహితుడు, దీక్షపురోహితుడు మొదలైనవారు. గాయత్రీ సాధనకు మార్గదర్శకముగా నెన్నుకోబడిన వ్యక్తి సాధన పురోహితుడు లేక బ్రహ్మపురోహితుడు. ఈ పురోహితులందఱూ తమ క్షేత్రములలో అవసరాన్నిబట్టి కార్యములలో సంప్రదించుటకు యోగ్యులు. ఒకరికొకరికి వ్యత్యాసము లేదు. వారు కార్యమును పూర్తిగావించెడువారే.

ఇరువది నాలుగక్షరముల గాయత్రీమంత్రము ప్రసిద్ధము. విద్యావంతులందఱికి ఈ మంత్రము విదితమే. కానీ వుపాసన గావించాలంటే సాధనాజన్య లాభములను పొందవలెనంటే, గురుముఖంగా గాయత్రీదీక్ష తీసుకొనవలెను. వశిష్ఠ విశ్వామిత్రుల శాపవిమోచనము గావించుకొని కీలిత గాయత్రిని ఉత్కీలన గావించి సాధన జేయవలెను. గురుముఖంగా గాయత్రీని స్వీకరించుటకొక సంస్కారము అందులో ఈరోజు గురు శిష్యు లిద్దఱూ ఉపవసించవలెను. శిష్యుడు గురువును చందన, అక్షత, ధూప, దీప, నైవేద్య, అన్న, వస్త్ర, పాత్ర దక్షిణలతో పూజించవలెను. గురువు

శిష్యునకు మంత్రము నీయవలెను. మార్గదర్శకునిగా నుండే భారమును తనపై వేసికొనవలెను. శిష్యుడు శ్రద్ధాపూర్వకంగా పురోగమించుతాడు. భగవతీ గాయత్రీ కృపాపాత్రుడై అభీష్టసిద్ధిని పొందుతాడు.

గాయత్రీ దీక్ష తీసుకొన్నప్పటినుండి పూర్ణసిద్ధి లభ్యమయ్యేంతవఱకు శిష్యుడు తన సాధనా గురువును సమీపమునందుంచుకొనవలెను. ఎల్లపుడూ గురువును ప్రత్యక్షంగా దగ్గఱుంచుకోవడము కుదరదు. గురువుయొక్క చిత్రపటమును గాజుపలకయందు బిగించి పూజామందిరమునందుంచవలెను. గాయత్రీ సంధ్యావందనము, జపము అనుష్ఠానము లేక ఇతఱ సాధనలు ఆరంభించటానికి ముందు ఆ పటమును ధూప, అక్షత, నైవేద్య పుష్ప, చందనము మొదలైనవాటితో పూజించవలెను.

గురువుయొక్క చిత్రపటము దొరకనపుడు అచటనొక కొబ్బరికాయను గురువుకు ప్రతిరూపముగా స్థాపించవలెను. భిల్లుడైన ఏకలవ్యుని కథ ప్రసిద్ధము. ద్రోణాచార్యుని మట్టిబొమ్మని స్థాపించి వారిని గురువుగా భావించి ఆ మూర్తిని సంభావించి సంభాషించి బాణవిద్యను నేర్చుకొన్నాడు. ఆయనటులే గొప్ప ధనుర్ధారిగా రూపొందాడు. ఏకలవ్యుని బాణవిద్యా కౌశలమునుగాంచి పాండవులుగూడా ఆశ్చర్యచకితులైరి. అంతటి సఫలతను విలువిద్యలో అతడు సాధించాడు. చిత్రమునుగాని లేక కొబ్బరికాయనుగాని గురుమూర్తిగా భావించుకొని పూజగావించి, గాయత్రీ సాధన ఆరంభించవలెను. అపుడాతడు శాపముక్తుడై ఉత్కీలన పొందుతాడు.

గాయత్రీ సాకార ప్రతిమ - యజ్ఞోపవీతము

యజ్ఞోపవీతము 'బ్రహ్మసూత్రము' అనిగూడా చెప్పబడుతుంది. దారమునుగూడా సూత్రమని అంటారు. కానీ ఆ సంక్షిప్త శబ్దాని కర్థము చాలా విస్తృతమైనది. వ్యాకరణ, దార్శనిక, ధర్మకాండ మొదలైన అనేక శాస్త్రములందు గ్రంథకర్తలు తమ మనోభావములను చాలా సంక్షిప్తంగా సంస్కృత వాక్యములలో పొందుపఱచారు. ఆ సూత్రములపై సుదీర్ఘవిషయములు, టిప్పణులు, విమర్శతోగూడిన భావార్థములు జేయబడినాయి. వీనివలన సూత్రములలోని గూఢంగానున్న అర్థము విపులీకరింపబడుతుంది. బ్రహ్మసూత్రములో అక్షరము లేనప్పటికీ సంకేతముద్వారా చాలా చెప్పబడినది. మూర్తులు, చిహ్నములు, చిత్రములు, అవశేషములు మొదలైనవాటి ఆధారంగా విస్తృతమైన మహత్వపూర్ణమైన విజ్ఞానము ప్రాప్తిస్తుంది. ఇందులో అక్షరములు లేనప్పటికీ అవి చాలా విషయములను ప్రకటిస్తాయి. ఒకఱు వేఱొకరికి సైగతో తమ మనోభావములను ప్రకటించుకొనవచ్చు. కానీ ఆ సైగలో శబ్దముగాని, లిపిగాని ప్రయోగింపబడదు. యజ్ఞపవీతము బ్రహ్మసూత్రమైనప్పటికి, మాటగాని, అక్షర లిపిగాని లేదు. కానీ అందులో నొక విపుల వ్యాఖ్యానము యొక్క అభిభావన నిండియున్నది.

గాయత్రీమంత్రము గురుమంత్రమని వచింపబడుతుంది. యజ్ఞోపవీత ధారణ సమయమున వేదాధ్యయన మారంభము జేసేటపుడు గాయత్రీమంత్రముతో జేయబడుతుంది. ప్రత్యేకంగా ద్విజులకు యజ్ఞోపవీతము ధరించుటెంత అవసరమో, గాయత్రీమంత్రాన్ని తెలుసుకొనుట గూడా అంతే అవసరము. అనివార్యము. ఈ గాయత్రీ యజ్ఞోపవీతముల జత లక్ష్మీనారాయణులు, సీతారాములు, రాధామాధవులు, ప్రకృతి-బ్రహ్మ, గౌరీశంకరులు, నరనారీల జంటల లాంటిది. రెంటి సమ్మిశ్రణముతోనే యొక పూర్ణప్రమాణ మేర్పడుతుంది. స్త్రీ-పురుష సమ్మేళనమును గార్హస్థ్యమని యెటుల వ్యాఖ్యానిస్తామో గాయత్రీ-ఉపవీతముల కలయిక అటులనే. ద్విజత్వము ఉపవీతసూత్రమైతే, గాయత్రీ దాని వ్యాఖ్యానము. రెండిటి ఆత్మలు నొకదానితో నొకటి పెనవేసుకొని వున్నాయి.

యజ్ఞోపవీతములో మూడు దారములున్నాయి. గాయత్రీలో మూడు చరణములున్నాయి. తత్సవితుర్వరేణ్యం - ప్రథమ చరణము. భర్గోదేవస్యధీమహి - ద్వితీయ చరణము. ధియో యో నః ప్రచోదయాత్ -తృతీయ చరణము. మూడు తంత్రులకు తాత్పర్యమేమి? దీనిలోనే అనుమానము తొలగింపబడినది. ఈ విషయమును తెలిసికొనవలయును.

ఉపవీతములో మూడు ముడులు ప్రథమంగా నుంటాయి. మఱియొక్క బ్రహ్మగ్రంథి వుంటుంది. గాయత్రీలో మూడు వ్యాహృతులు -భూర్భువః స్వః- మఱియు నొక ప్రణవము -ఓం- వుంటుంది. గాయత్రీ ప్రారంభంలో నున్న ఓంకారము. మఱియు భూః భువః స్వః లకే తాత్పర్యమున్నదో అదే యజ్ఞోపవీతమునకున్న మూడు గ్రంథులయొక్క సంకేతము. దీనిని గ్రహించిన వ్యక్తికి యీ నాలుగు ముడు లేయే సందేశము లిస్తాయో తెలిసికొనగలడు.

ఈ మహావిజ్ఞానమును సరళ మొనరించుటకు దీనిని నాలుగు భాగములుగా విభజించవచ్చు.

1. ప్రణవము అటులనే ఆ మూడు వ్యాహృతులు అనగా యజ్ఞోపవీతము యొక్క నాలుగు తంత్రులు.

2. గాయత్రీయొక్క ప్రథమ చరణము అనగా యజ్ఞోపవీతపు ప్రథమ పేట దారము - తత్సవితుర్వరేణ్యం.

3. రెండవ చరణము అనగా రెండవపేట దారము - భర్గోదేవస్య ధీమహి.

4. మూడవ చరణము అనగా మూడవపేట దారము - ధియో యో న ః ప్రచోదయాత్.

యజ్ఞోపవీతమునకు మూడుపేట లుంటాయి. వీనిని గురించి విచారించుదుము.

1. ప్రణవమునకు సంకేత మిది ః పరమాత్మ సర్వత్రా, సమస్త ప్రాణుల యందున్నాడు. అందువలన లోకసేవకై నిష్కామభావనతో కర్మ చేయవలెను. మనస్సును స్థిరంగాను, శాంతముగాను వుంచుకొనవలెను.

2. భూః కు తత్త్వజ్ఞాన మిది ః శరీరము యెముకలతో తయారుకాబడిన పనిముట్టు మాత్రమే. కావున దానిపై అత్యధిక ఆసక్తిలేకుండా, ఆత్మబలము పెంపొందుటకు శ్రేష్ఠమార్గమైన సత్కర్మల నాశ్రయించవలెను.

3. భువః కు తాత్పర్యము ః పాపకార్యములందు విముఖుడైన వ్యక్తి దైవత్వాన్ని పొందగలడు. పవిత్రాదర్శములను, సాధనలను తనవిగా చేసుకొన్న వ్యక్తి బుద్ధిమంతుడు.

4. స్వః కు ప్రతిధ్వని ః వివేకముతో, నిర్మలమైనబుద్ధితో సత్యపదార్థమును తెలిసికొనుటకు, సంయమనము, త్యాగరీతులను ఆచరించుటకు స్వయంగా ఆచరించి యితఱులను ప్రేరేపించవలెను.

ఈ చతుర్ముఖనీతిని యజ్ఞోపవీతధారి పాటించవలెను. దీని సారాంశమేమనగా ఉచితమార్గంలో పయనించి నీ శక్తిని పెంపొందించుకో! అంతఃకరణమును ఉదారబుద్ధితో వశము గావించుకొని నీ శక్తులలో అధికభాగమును ప్రజాహితముకొఱకు వినియోగించు. ఈ కళ్యాణకరమైన నీతిని అవలంబించినందువలన మనుజుడు వ్యష్టిరూపంగాను, సమస్త ప్రపంచములో సమిష్టిరూపంలో సుఖశాంతులను పొందగలడు. యజ్ఞోపవీతము గాయత్రీయొక్క ప్రతిమా స్వరూపం. వ్యక్తిగత, సామాజిక సుఖశాంతులు స్థిరంగావుండాలంటే యీ సందేశంతప్ప మనుష్యజాతికి వేఱొకటి లేదు.

దేవలోకములో నొక కల్పవృక్షమున్నది. దేవలోకపు కల్పవృక్షము వలె సమస్త వాంఛలు అందులో నిగూఢంగా నున్నాయి. దాని పేరు గాయత్రీ. గాయత్రీమంత్రమును స్థూలదృష్టితో జూచిన యెడల నది 24 అక్షరములు మఱియు తొమ్మిది శబ్దశృంఖలముమాత్రమె. కానీ గంభీరంగా సూక్ష్మదృష్టితో పరిశీలించినట్లయితే దానిలోని ప్రతిశబ్దానికి, ప్రతి అక్షరమునకున్న తత్త్వములు, కల్పవృక్షము వద్ద నున్న అన్ని వాంఛలవలె అన్నీ నిబిడీకృతమైయున్నవి.

గాయత్రీ కల్పవృక్ష చిత్రములోని ' ఓం ' ఈశ్వరుడు. అది భారతీయధర్మమునకు మూల మని చెప్పబడినది. దీనినుండి ముందుకుసాగితే మూడు భాగము లున్నవి. అవి భూః, భువః, స్వః. భూః - అనుదాని కర్థము ఆత్మజ్ఞానము. భువః - అను పదమున కర్థము కర్మయోగము. స్వః - అను పదమున కర్థము -స్థిరత్వము, సమాధి. ఈ మూడు శాఖలలోనుండి ప్రత్యేకంగా మూడు శాఖలు వెలువడినాయి. వానికి ప్రత్యేకంగా తమతమ అర్థ మున్నది. తత్ - జీవనవిజ్ఞానము. సవితుః అనగా శక్తిసంచయము. వరేణ్యం -శ్రేష్ఠత్వము. భర్గో - నిర్మలత్వము. దేవస్య - అనగా దివ్యదృష్టి. ధీమహి - సద్గుణములు. ధియో - వివేకము. యోనః - సంయమము. ప్రచోదయాత్ - సేవ. మన

మనోభూమిలో గాయత్రీ వీటిని నాటుతుంది. ఫలితంగా యే క్షేత్రములో అది అంకురిస్తుందో అప్పుడది కల్పవృక్షము కన్నా యేవిధంగాను తక్కువ గాదు.

కల్పవృక్షపు ఆకులు రత్నస్థగితమైనవని వుల్లేఖింపబడినది. అవి రత్నముల వలె సుశోభితమై బహుమూల్యవంత మైనవి. గాయత్రీ కల్పవృక్షము మొక్కపైన పేర్కొనబడిన తొమ్మిది పత్రములు నిస్సందేహంగా నవరత్నములకు సమానంగా విలువగలిగి మహత్వపూర్ణమైనవి. ఒక్కొక్క పత్రము ఒక్కొక్క గుణము, రత్నము కన్నా తక్కువగాదు. నగలలో నవరత్నహారము ప్రసిద్ధమైనది. తొమ్మిది లక్షల రూపాయలు వెచ్చించి తయారుజేయబడిన హారమును ధరించినవారు తాము గొప్ప భాగ్యవంతులమని తలపోస్తారు. ఏకంగా తాత్త్వికదృష్టితో, గంభీరంగా, దూరదృష్టితో పరికించితే యజ్ఞోపవీతముగూడా నవరత్నజనిత నవలక్షహారమున కేమీ తీసిపోదు.

గాయత్రీగీత ప్రకారము యజ్ఞోపవీతపు తొమ్మిది దారములు 9 గుణములను ధారణ జేయవలెనని ఆదేశిస్తుంది. నవరత్నములకన్న తొమ్మిది దారములు అధికశక్తి గల వని సందేశమిస్తున్నది.

1) జీవన విజ్ఞానము తెలిసినపుడు మనుష్య మఱియు జన్మ-మరణముల రహస్యము బోధపడుతుంది. అతనికి మృత్యువంటే భయము వుండదు. ఎల్లప్పుడూ నిర్భయంగా వుంటాడు. అతనికి సాంసారిక వస్తువులపై లోభమోహము లుండవు. తత్ఫలితంగా సాగరములో మునిగి హానివృద్ధులకొఱకై దుఃఖ మనుభవిస్తూ మఱియు సుఖసంతోషముల మదముతో పొంగిపోకుండా రక్షింపబడతాడు.

2) శక్తిసంచయమును తనదిగా జేసుకొనే వ్యక్తి రోజురోజుకు స్వస్థతపొంది విద్వాంసుడై, బుద్ధిమంతుడై, సహయోగసంపన్నుడై, కీర్తిప్రతిష్ఠలను పొందుతాడు. నిర్బలులపై ప్రకృతి, అటులనే బలవంతులపై దౌర్భాగ్యము ఆక్రమణ చేస్తాయి. వీటినుండి రక్షింపబడుటయేగాక శక్తిసంపన్నుడైనందున జీవితములోని నానావిధములైన ఆనందముల ననుభవిస్తాడు. తన శక్తిద్వారా దుర్బలులకు సహాయము చేసిన పుణ్యములో భాగస్వామి అవుతాడు. శక్తిచాలినంత లేనపుడు మాత్రమే అవినీతి అచ్చట ప్రజ్వరిల్లుతుంది. శక్తి సమీకరణ స్వాభిమానముయొక్క పరిణామము-అవినీతి అంతరించుట సర్వులకూ కళ్యాణకారకము.

శ్రేష్ఠత్వమునకు, అస్థిత్వము పరిస్థితులలో లేదు. ఆలోచనలలో నున్నది. సాధనాసంపన్నుడై పురోగమించిన వ్యక్తియై యున్నప్పటికీ లక్ష్యము, సిద్ధాంతము, ఆదర్శము, అంతఃకరణ దృష్టిలో పతితుడైతే అతనిని నికృష్టుడని నుడువవచ్చు. అట్టి నికృష్టుడు తన ఆత్మదృష్టిలో, పరమాత్మ దృష్టిలో, వివేకవంతులైన వ్యక్తుల గంభీరదృష్టిలో, నీచశ్రేణికి జెందినవాడుగా పరిగణింపబడతాడు. తమ నీచత్వమునకు శిక్షగా ఆత్మదండన, ఈశ్వరీయదండన పొంది బుద్ధిభ్రమించినందున మానసిక అశాంతిలో మునుగుతాడు. దీనికి వ్యతిరేకంగా బీదవాడైనప్పటికీ, అతని ఆదర్శము, సిద్ధాంతము, ఉద్దేశ్యము, అంతఃకరణము వున్నతంగా, ఉదారంగా నున్నట్లయితే అతనిని శ్రేష్ఠుడని చెప్పవచ్చు. ఈశ్రేష్ఠత్వము అతనికి అంతులేని ఆనందా న్నిస్తుంది. సాంసారిక సంపద యెంత యెక్కువ ఉన్నప్పటికీ ఆ ఆనందాన్ని పొందుట దుర్లభము.

4) నిర్మలత్వమునకు అర్థము సౌందర్యము. సౌందర్యమును కేవలము మనుష్యులే కాదు, పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలుగూడా గాఢంగా వాంఛిస్తాయి. కురూపత్వమునకు కారణము మురికి యన్నది నిర్వివాదము.

మలినత్వమున్నచోట అసహ్యరూప ముంటుంది. అచటనుండి దూరంగా నుండుట కందఱూ యిష్టపడతారు. శరీరంలో లోపల మలము నిండియున్నట్లయిన వ్యక్తి బలహీనుడై రోగగ్రస్తుడౌతాడు. అందువలన వస్త్రములు, భోజనము, చర్మము, వెంట్రుకలు మొదలైన ప్రయోజనీయ పదార్థములు మలినమైనచో అతడు అస్వస్థుడై, నికృష్టుడై, నిందనీయుడై ఏవగించుకోబడతాడు. మనస్సులో, బుద్ధిలో అంతఃకరణ మందు మలినమున్న చెప్పుటకేమున్నది. ఈ వికృతశక్తులనుండి విముక్తి పొందటానికి యేకైక మార్గము సర్వతోముఖ నిర్మలత. అంతఃకరణ నిర్మలత బాహ్యనైర్మల్యమున్నవారి సంపాద, ఆలోచనవిధానము దేహము, వాక్కు, పోషణ, కుటీరము, అవసరమైన సామగ్రి నిర్మలంగా, స్వచ్ఛంగా, శుద్ధంగా, సర్వసుందరంగా, ప్రసన్నంగా, ప్రఫుల్లంగా, మృదువుగా నుండి సంతుష్టి గోచరిస్తుంది.

5) దివ్యదృష్టితో చూడడమనగా అర్థము -ప్రాపంచిక దివ్యతత్త్వములలో తాను సంబంధము కల్పించుకొనుట. ప్రతి వస్తువు తన స్వజాతీయ పదార్థమును తనవైపు ఆకర్షించుకొంటుంది. ఆ పదార్థము వైపుగూడా ఆకర్షింపబడుతుంది. ఒక వ్యక్తి దృక్పథము ప్రపంచములోని మంచి విషయములను గమనించి తెలిసికొని తనవిగా చేసుకొనేందుకైనపుడు అతడు అన్ని దిశలయందు మంచి వ్యక్తులనే జూస్తాడు. ప్రజోపయోగముకొఱకు పెద్దమనిషిగా, సేవాభావంతో, సహకారము, సత్కార్యములపై మనస్సు లగ్నము జేసినపుడు ప్రజలలో చెడుకంటే మంచి వున్నదని గోచరిస్తుంది. ప్రపంచమునకు అపకారముకన్నా ఉపకారమే అధికంగా జేస్తుందని భావము కలుగుతుంది. కండ్లకు ధరించిన కండ్లజోడు రంగే ప్రతివస్తువుపై ప్రసరించి అన్నీ ఆ రంగే అనే భావన కలుగుతుంది. ఎవరి దృష్టి దోషభూయిష్టమో వారికి అందఱూ, అంతా చెడుగా వుంటాయి. ఎవఱు దివ్యమైన దృష్టితో పరిశీలించెదరో వారు పరమేశ్వరునియొక్క యీ పరమపునీత ఉద్యానవం సర్వతోముఖ ఆనందమే ఆనందము వర్షించడము దర్శిస్తారు.

6) సద్గుణములు : తనలో మంచి అలవాట్లను కలిగివుండటము, ఉత్తమమైన అర్హత ఉదాత్తమైన ఆధిక్యతలు కలిగివుండటాన్ని సద్గుణములని అంటారు. వినయము, నమ్రత, శిష్టాచారము, మధురభాషణము, ఉదారంగా ప్రవర్తించడము,సేవాసహాయభావము, నిజాయితీ, పరిశ్రమ, శీలత్వము, సమయ క్రమశిక్షణ, మితముగా వ్యయముజేయుట, కర్తవ్యపరాయణత్వము, ప్రసన్నముఖముద్ర, ధైర్యము, సాహసము, పరాక్రమము, పురుషార్థములు, సంగీతము, సాహిత్యము, కళ, శిల్పము, వ్యాపారము, వక్తృత్వము, వ్యవసాయము, ఉద్యోగము, శిక్షణ మొదలైన యోగ్యతలు కలిగివుండటము గూడా సద్గుణాలే. ఈ సద్గుణములు గలిగిన వ్యక్తి ఆనందమయ జీవితమును గడుపుతాడు. అతని కల్పనలన్నీ సహజంగా జరుగుతాయి.

7) వివేకము : ప్రత్యేకమైన ఆత్మిక ప్రకాశము. వివేకమువలన సత్యాసత్యములు, ఉచితానుచితములు, అవశ్య అనావశ్యకములు, హానిలాభములు పరీక్షింపబడతాయి. ప్రపంచములో అసంఖ్యాకమైన పరస్పర విరుద్ధయోగ్యతలు, అలవాట్లు, ఆలోచనావిధానములు ప్రచారంలో నున్నాయి. ఇందులో ప్రతివాని వెనుక కొంత ఆధారము కొన్ని వుదాహరణలు వున్నాయి. అటులనే కొన్ని గ్రంథములలో మహాపురుషుల నామములుగూడా తప్పక జోడింపబడి వుంటాయి. అటువంటి సమయాల్లో విరోధమైన విషయములలో గ్రహింప దగిన దేది? విసర్జింప దగిన దేది? యని నిర్ణయించుకొనుట కఠినము. కష్టము. అదీగాక దేశకాల పరిస్థితులు, ఉపయోగము, ప్రజాహితము మొదలైనవి గుర్తించి సద్బుద్ధిచే నిర్ణయము గావింపబడవలెను. అదియే సర్వులకు గ్రాహ్యము. ప్రమాణము. సరియైన నిర్ణయ

మెవఱు చేయగల్గుదురో వారు సులభంగా సుఖశాంతుల లక్ష్యమును చేరుకుంటారు. ప్రపంచములో అధికాంశము కలహ, క్లేశ, పాప, దుఃఖములకు కారణము దుర్బుద్ధి, భ్రమ, అజ్ఞానములై వున్నవి. వివేకవంతు డీ చిక్కులన్నీ సునాయాసంగా అధిగమించుతాడు.

8) సంయమనము : జీవనశక్తిని, ఆలోచనాపరిధిని, భోగేచ్ఛను, శ్రమను సరిగా నియమించుటయే సంయమనము. వీటిని నిరోధించగూడదు, నష్టపఱచకుండా నిరుపయోగము గాకుండా, అనుచిత మార్గములో వ్యయము గాకుండా వుండటమే సంయమనమునకు తాత్పర్యము. మానవ శరీరము ఆశ్చర్యజనక శక్తులకు కేంద్రస్థానము. ఆ శక్తులను వృధాగాకుండా సవ్యమైన వుపయోగదిశలో మళ్లించినయెడల ఆశ్చర్యకరమైన ఫలితాలొస్తాయి. జీవితాని కొక ప్రత్యేకమార్గంలో అభివృద్ధి కలుగుతుంది.

9) సేవ : సహాయము, సహకారము, ప్రేరణ, అభివృద్ధి పైపు ముందుకు సాగుట మొదలైనవన్నీ అన్నింటికన్నా మించిన సేవలు. మన శరీరము మన మస్తిష్కము అన్నిటికన్నా యెక్కువ సేవాపాత్రమై వున్నవి. ఏలనన అవి మనకు చాలా సమీపాన వున్నవిగూడా. దానమివ్వడము సమయదానము జేయడము, ప్రతిఫలమాశించక తన శారీరక, మానసిక శక్తుల నెవరికైనా వుపయోగించడాన్ని సేవ అంటారు. ఈ త్యాగమువలన యితఱులలో ఏ క్రియాశక్తి, ఆత్మనిగ్రహము, స్ఫూర్తి, ప్రేరణ, జాగృతి కలిగాయా లేదా అనే కోరిక లేదు. కొన్నరకాలైన సేవలు యితఱులలో సోమరితనము, పరావలంబనత్వము, ధనకాంక్షను కల్గించుట వలన అవి హానికరమైన సేవలు. కావున మన సేవలు యితఱులలో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, క్రియాశాలతనూ ప్రేరేపించి వుత్తేజితుల నొనరించుటకు దోహదకారులు గావలెను. సేవకు ఫలము - ఉన్నతి. సేవద్వారా తనకు, ఇతఱులకు సమున్నతి కలుగుట, ప్రపంచము అధిక సుందరము ఆనందమయమగుట మహాపుణ్యకార్యము. ఈవిధమైన సేవాభావముగల పుణ్యాత్ముడు, ఆత్మదృష్టిలో సదాసుఖుడై సంతుష్టుడైవుంటాడు.

ఈ తొమ్మిది గుణములు నిస్సందేహంగా తొమ్మిది రత్నాలు. మరకత, మాణిక్య, వజ్ర, వైఢూర్య, ముత్య, గోమేధిక, పుష్యరాగ, నీల, ప్రదౌళశములను నవరత్నా లంటారు. ఈ నవరత్నా లెవఱివద్ద వుంటాయో వారు సర్వసుఖులై వుంటారని నానుడి. కానీ భారతీయ ఆధ్యాత్మికశాస్త్ర ప్రవచనము ఎవఱివద్ద యజ్ఞోపవీతము మఱియు గాయత్రీ మిశ్రిత నవరత్నా లుంటాయో అతడు సిరిసంపదలు, భూమి, ఆస్థులు లేనప్పటికి వర్తమానకాలపు కుబేరుడు. ఈ నవరత్న మండిత కల్పవృక్ష మెవరి వద్దనున్నదో, ఆ వివేకయుక్త యజ్ఞోపధారి సదా సురలోక సంపద ననుభవిస్తాడు. అతనికీ భూలోకమే స్వర్గలోకము, ఆ కల్పవృక్షము నాలుగు ఫలములను ప్రసాదించుతుంది. ధర్మ, అర్థ, కామ, మోక్షములను నాల్గు సంపదలతో మనలను పరిపూర్ణులను జేస్తుంది.

గాయత్రీ సాధకులకు యజ్ఞోపవీతము అవసరము, ముఖ్యము

అనేకమంది యజ్ఞోపవీతమును ధరించుట తమకు సాధ్యముగాదని, నిర్వహించలేమని తలపోస్తారు. సంయమములను పాటించలేమని భావిస్తారు. ఇది 'నా మనస్సులో ఈశ్వరభక్తి లేదు. కావున పూజ చేయను' అని అన్నట్లుగా వున్నది. పూజ చేయటము భక్తి కలుగుటకు, భక్తి వున్నట్లయితే పూజ చేయటము అనవసరము. ఇది యజ్ఞోపవీతపు విషయంలోగూడా వర్తిస్తుంది. ధార్మిక నియమములను పాటించడము తమంతటతామే కలిగినట్లయిన యజ్ఞోపవీతము ధరించే ఆవశ్యకత ఎందుకు? నియమములు సమయానుకూలంగా నిర్వహించలేనివారు యజ్ఞోపవీతము వున్నందున ఆ నియమములను పాటిస్తారు. నియమములు నిర్వహించలేనివారికి జంధ్యము తప్పక అవసరము. దాన్ని ధరించవలెను. వ్యాధిగ్రస్తునకు ఔషధము అవసరము. వ్యాధి లేనపుడు ఔషధపు ఆవశ్యకత లేదు.

నియమముల నెందుకు అలవాటు గావించుకోవలెను? దీనినిగురించి ప్రజలకు చిత్రమైన ఆలోచనలున్నాయి. భోజన సమయములందు నియమములకు మాత్రమే జంధ్య మవసరమని పలువురు భావిస్తారు. స్నానము చేయకుండా ప్రయాణము చేసిన ఆహారము రాత్రి మిగిలిన ఆహారము తమవారుగాక యితరులచే వండబడిన ఆహారమును భుజించకుండుటకూడా యజ్ఞోపవీత నియమ మని గూడా పెక్కుమంది అభిప్రాయము. ఇది చాలా అసమంజసము. భ్రమతోగూడిన ఆలోచన. యజ్ఞోపవీత ఉద్దేశ్యము మానవ జీవితమునకు సర్వాంగపూర్ణ ఉన్నతిని కలుగజేయుట. ఈ విశిష్టతలలో సంపూర్ణ ఆరోగ్యముకూడ ఒకటై వున్నది. దానికోసము యితర నియమములను పాటించడంతోపాటు భోజనానికి సంబంధించిన నియమములను సావధానంగా అవలంబించుటగూడా వుచితము. ఈ దృష్టితో జంధ్యము ధరించిన వ్యక్తి భోజన సంబంధమైన నియమములను పాటించుట మంచిది. కానీ కొందరు ద్విజులు తమ జీవనంలో సర్వాంగీకారమైన వున్నత నియమములను పాటించుట లేదు. కానీ భుజముపై జంధ్యాన్ని ధరించిమాత్రము వుంటారు. ఒకవేళ భోజనానికి సంబంధించిన విషయాలలో లోట్లు జరిగినంతమాత్రాన, జంధ్యాన్ని ధరించుటకు ఆ పొరపాట్ల కారణమువలన అధికారము కోల్పోయామని తలంపరాదు. అసత్యమాడినందువలన, దురాచారదృష్టి గలిగినందున, నిజాయితీ లేనందున, సోమరియైనందున, వ్యసనగ్రస్థుడైనప్పటికి జంధ్యాన్ని విసర్జించనవసరము లేనపుడు కేవలము భోజన నియమములలో అప్పుడప్పుడు కొంచెము నియమోల్లంఘన జరుగుతుంది గావున యీ ఆలోచన సరియైనదని భావించలేము.

మలమూత్రములు విసర్జించునపుడు జంధ్యము చెవులపై నుంచుకొనుట మరచినపుడు భయము కలుగుతుంది. ఈ భయంవలన అనేకులు జంధ్యము ధరించరు. లేక ధరించుట మానివేస్తారు. ఈ అలవాటు కఠోర నియమముగా పాటించవలెననేది నిజము. కానీ ప్రథమంలో అలవాటుపడేంతవరకు ఈ తొమ్మిది శిఖలకు కొంత సౌకర్యము

కలుగవలెను. అందువలన ఒక్కొక్కరోజు మూడుసార్లు జంధ్యములను మార్చవలసిన అవసరము కలుగుతుంది. అందువలన జంధ్యాన్ని కంఠానికి చుట్టుకొనవలెను. అందువలన అది పైకి వస్తుంది. చెవులకు చుట్టుకొన్నందువలన మలమూత్రముల అశుద్ధ స్పర్శ దానికి కాదు. కంఠానికి చుట్టుకొన్నందున జంధ్యము నడుమునుండి పైకి వెళుతుంది. అందువలన ఒకవేళ చెవులకు చుట్టుకోవడము మరచినప్పటికి అశుద్ధసాంగత్యము కలుగదు. కొన్నిరోజులు అలవాటయ్యేటప్పటికి కంఠానికి చుట్టుకోవలసిన అగత్యముగూడా వుండదు.

చిన్న వయస్సుగల బాలురకోసము, మతిమరుపుగల వ్యక్తులకోసము మూడు పోగుల యజ్ఞోపవీతమును వ్యవస్థీకరించవచ్చు. అందుకనే మూడు మూడు పోగుల పేటలు. కావున ఆచార్యులు ఉపవీతమును కంఠీ శబ్దముతో సంబోధిస్తారు. బాలురకు వుపనయనము జరిగేటప్పుడు, వారికి దీక్షతోపాటు కంఠీ ధరింపజేస్తారు. ఈరోజుకూడా గురువు నామాన్ని ధరించి పండితులు మెడకు కంఠీ ధరించి చెవిలో మంత్రము చెప్పి గురుదీక్ష నిస్తారు.

మనోపరిపక్వము చెందని వ్యక్తి యజ్ఞోపవీతమును నిత్యమూ శుభ్రపరచడము గురించి పూర్తిగా ధ్యానముంచడము బహుశా మరచుట కద్దు. కావున శరీరానికున్న మలినము జంధ్యాని కంటుకుంటుంది. ఫలితంగా దుర్వాసన, మలినము, రోగక్రిములు అందులో చేరుతాయి. ఆ స్థితిలో కంఠీ - కంఠమును, శరీరాన్ని తక్కువ స్పృశించేటట్లు ఉపాయములు వెదుకవలసివస్తుంది. దీని నిమిత్తము తులసిపూసలు, రుద్రాక్షలు లేక యితఱ వస్తువుల గింజలు కంఠీ దారానికి చుట్టబడతాయి. ఫలితంగా రెండూ శరీరాన్ని స్పృశించుతాయి. స్వేదము అంటకుండా శుద్ధి, ప్రమాదమునుండి రక్షణ దొరుకుతుంది. అందువలననే పూసలున్న కంఠమాల ధరించవలెను. ఏలనన ఉపవీతము గాయత్రీయొక్క మూర్తివంతమైన ప్రతీక. దానిని ధరించకుండ భగవతియొక్క సాధనమునకు ధార్మికాధికారము కలుగదు. నేడు క్రొత్త ఫ్యాషనులలో ఆభరణములను ధరించడము తగ్గినది. కానీ కంఠానికి మాత్రము కంఠమాలలు యే రూపములో నైనా ధరించడము స్త్రీ పురుషుల కలవాటున్నది. పేదస్త్రీలు కంచుకంటెలు ధరిస్తారు. ఈ భూషణములను హారము, నెక్లెస్, మాల, కంటె మొదలైన పేర్లతో వ్యవహరిస్తారు. కానీ వాస్తవంగా ఇవి కంఠీలుమాత్రమే. స్త్రీలవద్ద యితఱ ఆభూషణము లున్నా లేకున్నా పేద స్త్రీలు కూడా యేదోరూపంలో కంఠమాలను ధరించడము మాత్రము నిశ్చయము. దీనివలన భారతదేశపు స్త్రీలు తమ సహజధార్మిక ప్రేమను యేదో ఒక రూపంలో జీవించివుండే విధంగా ఉపవీతమును యేదో ఒక రూపంలో ధరిస్తారు.

ఉపవీత ధారణకు అధికారులుగానివారు యేవిధమైన దీక్షను గ్రహించనివారుగూడా మూడుపోగులు లేక తొమ్మిది పోగులు ఉపవీతములను నాలుగు ముడులు వేసి ధరిస్తారు. ఈవిధంగా చిహ్నపూజ జరుగుతుంది. పూర్తి యజ్ఞోపవీతంలోని పొడవుగానున్న ముడిని కంఠానికి తగిలించుకోవడంగూడా అక్కడక్కడా రివాజుగా వున్నది.

గాయత్రీ సాధన ఉద్దేశ్యము

నవీన భావనలచే ప్రాచీన భావనలు మార్పుజెందుతాయి. ఎవరైనా వ్యక్తి యేదైనా విషయాన్ని పొరపాటుగా గ్రహించినపుడు, తర్క, ప్రమాణ, ఉదాహరణల ఆధారంగా సరియైన విషయాన్ని తెలియజేసి నొప్పించవచ్చు. అయితే ఆ వ్యక్తి అత్యంత దురాచారుడు, మూఢుడు, ఉత్తేజితుడు, మదాంధుడు కాకుండావుంటే బహుశా సరియైన విషయాన్ని గ్రహించడములో కష్టము వుండదు. నిజమైనదానిని తెలిసికొన్నపుడు దురాచారము, దుస్సాంప్రదాయము మారుతుంది. స్వార్థముకోసము, మానసంరక్షణార్థము ఎవరైనా తన పూర్వపు సాంప్రదాయముల తరుపున వకాల్తా పుర్చుకొన్న అది వేఱే విషయము. అయినప్పటికి ఆ అలవాట్లు, సాంప్రదాయములు, విశ్వాసములను గురించి అతని అభిప్రాయము తప్పక మారుతుంది. జ్ఞానము ద్వారా అజ్ఞానమును తొలగించుటంత విశేషమైన కష్టము కాదు.

కానీ స్వభావము, అభిరుచి, ఇచ్ఛ, భావనల, ప్రకృతుల విషయంలో మాత్రము పైన చెప్పబడినది చెల్లదు. ఇవి సాధారణ పద్ధతులలో మారవు. ఏ స్థానంలో అవి ప్రేరేపింపబడినవో ఆ స్థానమునుండి సులభంగా తొలగిపోవు. ఏలనన మనుష్యుడు 84 లక్షల క్రిమి, కీటక, పక్షి, జీవజంతువుల క్షుద్రయోనులలో భ్రమణముజేసి నరదేహాన్ని పొందుతాడు. అందువలన స్వభావతః అతని గడచిన జన్మజన్మాంతరపు పాశానికి, నీచ సంస్కారములు చాలా దృఢంగా తన జడ మనోభూమిలో నిక్షిప్తమైవుంటాయి. మస్తిష్కంలో నానావిధములైన ఆలోచనలు వస్తు పోతూ వుంటాయి. వాటిలో పరివర్తన కలుగుతుంటుంది. కానీ ఆ పరివర్తన ప్రభావము అతని మనోభూమిపై విశేష ప్రభావాన్ని కలిగించదు. సదుపదేశమును ఆలకించి సద్గ్రంథ పఠన మాచరించి, గహనంగా, గంభీరంగా స్వయంగా ఆత్మచింతన చేయు మనుష్యుడు మంచిచెడ్డల యొక్క అంతరమును స్పష్టంగా గ్రహించగలడు. తన తప్పులను, దోషములను బలహీనతలను గురించిన జ్ఞానము నిర్దుష్టంగా అతనికుంటుంది. వాటినిగురించి మానసికంగా తలపోస్తాడు. తనలోని చెడు తొలగిపోవాలని వాంఛిస్తాడు. అనేకసార్లు తన్నుతాను నిందించుకొంటాడు. ఐనప్పటికి తన చిరసంచిత కుప్రవృత్తులనుండి దురలవాట్లనుండి తాను విడిగా భిన్నంగా ప్రత్యేకంగా వుండలేడు.

త్రాగుడు, దొంగతనము, దుర్మార్గము, దురాచారముల ప్రకృతిని గూర్చి మనుష్యునకు బాగుగా తెలుసు. తాను అపమార్గమున ప్రయాణించడాన్ని ఎన్నుకున్నానని తెలుసు. ఈ అలవాట్లనుండి బహుశా విముక్తి లభిస్తుందని వారి మనోభావన. కానీ అది వారి నిస్సహాయ, నిర్బల కల్పన మాత్రమే. వారి మనోరథము నిష్ఫలమౌతుంది. దురలవాట్లు వదలవు. అవసరమొచ్చినపుడు, ప్రలోభానికి లోనైనపుడు, మనోభూమిలో అణిగివున్న కుప్రవృత్తులు, చీకటిలో తుఫాను మాదిరి విజృంభిస్తాయి. ఆ వ్యక్తి అలవాట్ల వలన బలహీనుడై, దుష్కార్యములను మఱల ఆచరిస్తాడు.

వికార - సంస్కారముల తులదూస్తే సంస్కారపు శక్తి అత్యధికము. ప్రబలము. భావన యొక పసిశిశువు, సంస్కారము - పరిపుష్ఠప్రౌఢ. వీరిద్దఱి సంగ్రామంలో పరిణామము బహుశా విజయము ప్రౌఢకి లభించి, శిశివు ఓడిపోవడము సహజంగా గమనించవచ్చు. అయినప్పటికి మనస్వియైన వ్యక్తి శ్రీకృష్ణునిచే పూతనవధను, శ్రీరామునిచే తాటకి వధను ఉదాహరణగా తీసుకొని తన ఆలోచనల బలంతో కుసంస్కారములపై విజయము సాధిస్తాడు. కానీ అధిక సంఖ్యాకులు కుసంస్కారము ఛాయలోను-వలలోను చిక్కి, పక్షులమాదిరి గిలగిల లాడటము గమనించవచ్చు. అనేకమంది ధర్మోపదేశకులు జ్ఞానులైన విద్వాంసులు, నాయకులు, సమదర్శులైన మహాపురుషులని తెలియబడే వ్యక్తుల చరిత్రలకు మార్గమైనపుడు, వారి ప్రౌఢబుద్ధి తమ నిజ కుసంస్కారముపై విజయము సాధించలేకపోయినది అని చెప్పవలసివస్తుంది. పలుసార్లు మంచి మంచి నిజాయితీపరులుగూడా ఏదైనా ప్రలోభానికి లోబడి అవసరము కోసము దానిలో చిక్కుకుపోతారు. తరువాత పశ్చాత్తాపము పడవలసివస్తుంది. చిరసంచిత పాశవికప్రవృత్తులయొక్క భూకంపము వచ్చినపుడు సదాశయ ఆధారముపైన చిరప్రయత్నమువలన యేర్పడిన సుచరిత్రయొక్క గోడలు బీటలువారుతాయి.

ఉపయుక్త పంక్తులయొక్క అర్థము మేధాశక్తి. ఆలోచన నిరర్థకమనీ, దానివలన కుసంస్కారములపై విజయానికి సహాయము లభించదని కాదు. ఈ వాక్యములలో సాధారణ మనోబలము సదాశయముల మనోభూమిని ఆక్రమించుటలో అధిక సమయము మందగమనముతో నెమ్మదినెమ్మదిగా పురోగమిస్తుందని అనేక పర్యాయములు వారు నిరాశ, అసఫలతను రుచి చూడవలసి వస్తుందని చెప్పబడినది. అయినప్పటికీ సద్విచార క్రమమున్నట్లయితే కాలాంతరంలో కుసంస్కారములపై విజయము ప్రాప్తించకతప్పదు. ఆధ్యాత్మ విద్యాచార్యులు చాలా ఆవశ్యకమైన కార్యాన్ని సాధించడానికి కాలవిలంబనమును అంగీకరించరు. అందువలన వారు దీనికి సంబంధించినంతవఱకు అత్యధిక గంభీరంగా, సూక్ష్మదృష్టితో, మనోయోగపూర్వకంగా ఆలోచించి మానవ అంతఃకరణములో నుండే పాశవిక సంస్కారములను స్వచ్ఛమైనప్పటికి విశ్లేషణ గావించారు. తత్పరిణామంగా మనోక్షేత్రములో యే స్థాయిలో ఆలోచనల ప్రకంపనలు క్రియాశీలమౌతాయో అంతకన్న అధిక బలీయమైన స్థాయిలో సంస్కారములు చైతన్యరహితమౌతా యనే నిర్ణయానికొచ్చారు.

బావి త్రవ్వేటపుడు భూమిలోని భిన్నజాతుల మట్టిపొర లెట్లు బయల్పడుతాయో, అట్లే మనోభూమియొక్క విభిన్న పొరలెన్ని వున్నాయో వాటి పని, గుణము, క్షేత్రము భిన్నభిన్నంగా వుంటుంది. మనోభూమిలోని పైపొరయొక్క పని ఆలోచించడము, మార్గమును వెదకడము, నిర్ణయాలు తీసికోవడము. ఈ రెండు పొరలు మనుష్యునికి అందుబాటులో నున్న సంస్కారములు. ఈ రెంటింటిని స్థూలమనోక్షేత్రమని అంటారు. పరిస్థితులలో మార్పువలన విచక్షణ, జ్ఞానము కలిగినపుడు స్థూలమనోక్షేత్రంలో తారుమార్లు మార్పులు జరుగుతాయి.

ఈ స్థూలక్షేత్రంగాక లోతైన పొరను సూక్ష్మమనోక్షేత్ర మంటారు. దీనిలోని ప్రముఖ భాగములు 1. చిత్తము, 2. అహంకారము. చిత్తములో సంస్కారము, అలవాటు, అభిరుచి, స్వభావముల కలయిక వుంటుంది. అహంకారమును తనకు సంబంధించిన ప్రకర్షగా చెబుతారు. తాను ధనికుడననీ, దరిద్రుడననీ, బ్రాహ్మణుడననీ, శూద్రుడననీ, పాపిననీ, పుణ్యాత్ముడననీ, అభాగ్యుడననీ, సౌభాగ్యుడననీ, స్త్రీననీ, పురుషుడననీ, మూర్ఖుడననీ, బుద్ధిమంతుడననీ, తుచ్ఛుడననీ, మహానుభావుడననీ, జీవుడననీ, బ్రహ్మననీ, బద్ధుడననీ, ముక్తుడననీ మొదలైన విధములుగా తలపోస్తాడు. అట్టివారు

అహంకారులుగా పరిగణించబడతారు. ఆత్మయొక్క అహం సంబంధపు తలపోతయొక్క అహంకారము. ఈ మనస్సు, బుద్ధి, చిత్త, అహంకారములకు అనేక భేద అభేదము లున్నాయి. వాటి గుణకర్మలు వేర్వేరుగా వున్నాయి. వాటి వర్ణ యీ పంక్తులలో నీయలేము. వాటి సంక్షిప్త పరిచయము మాత్రమే యిచట అవసరము. కుసంస్కారముల నివారణ విషయంలో కొన్ని సంగతులు యెక్కువగా తెలుసుకొన్నందున సాధకులకు సౌకర్యంగా వుంటుంది.

మనస్సు - బుద్ధుల జంట ఎలాంటిదో చిత్తము - అహంకారముల జంటగూడ అలాంటిదే. మనస్సులో నానాప్రకారముల యిష్టములు, కామనలు వుంటాయి. బుద్ధి వాటి నిర్ణయము జేస్తుంది. ఏయే కోరికలు బహిర్గతము గావించుటకు యోగ్యమైనవి. వేటిని అణిచి వుంచవలెను. వీటినిగురించి బుద్ధికి తెలుసు. సభ్యత, లోకాచారము, సామాజిక నియమము, ధర్మము, కర్తవ్యము, అసంభవము మొదలైనవాటిని పరిగణించి అనుపయోగమైన యిష్టాలను లోలోపలే అణచి వుంచుతుంది. కార్యరూపము నొందటానికి యోగ్యమైనవాటికొఱకు తన ప్రయత్నాన్ని జేస్తుంది. ఈవిధంగా మనస్సు, బుద్ధి రెండూ కలసి మస్తిష్కంలో తమ పడుగుపేకలను యేర్పరచుకొంటాయి.

అంతఃకరణ క్షేత్రంలో చిత్తము, అహంకారముల జంట తమ పనిని తాము జేస్తూవుంటాయి. జీవాత్మ తాను ఏ శ్రేణికి, ఏ స్థాయిలో అనుభవము కలిగివుంటుందో చిత్తములో అదే శ్రేణిలో, అదే స్థాయిలో పూర్వసంస్కారముల క్రియారూపము పొంది బలంగా వుంటుంది. తనను త్రాగుబోతుగా, పాపిగా, అస్పృశ్యునిగా, సమాజంలోని నిమ్నవర్గమువానిగా తలపోస్తే ఆ వ్యక్తికి ఆ అహంకారము అతని చిత్తంలోని తన జాతి సంస్కారములు జడమనోభూమిలో స్థిరంగా వుండటానికి సిద్ధంగా వుంటాయి. గుణ, కర్మ, స్వభావము లే శ్రేణిలో మనుష్యులలో వుంటాయో, అవన్నీ వారి చిత్తములలో సంస్కారరూపములలో జడంగా సమ్మిళితమై బైతాయించుతాయి. అతని అహంకారము తన అపరాధములను త్రాగుడును పరిత్యజించి లోకసేవకుడై మహాత్ముడై సచ్చరిత్రుడై ఉన్నతుడవటానికి తాను స్థిరమనస్కుడైనపుడు అతి శీఘ్రంగా అతని పూర్వపు టలవాట్లు, ఆకాంక్షలు, కోరికలు, అభిలాషలు పరివర్తన జెందుతాయి. తన్ను తానెలా మలచుకోవలెనని విశ్వసిస్తాడో యటులనే తయారవుతాడు.

త్రాగుట చెడు కార్య మని తెలుసుకొన్నంతనే అతనికి త్రాగుట కష్టము. ఏలనన మంచేదో చెడేదో ప్రతివ్యక్తికి తెలుసు. వారికి ఆ ఆలోచన ప్రథమంలోనే అనేకమార్లు వస్తుంది. తన అహంకారమును ప్రతిష్ఠించుకొని నాగరికుడుగా మారినపు డా బంధము త్రెగుతుంది. తన గౌరవానికి, వ్యవహారానికి త్రాగుడు పనికిరాదని అపుడు అనుభవము కలుగుతుంది. అంతఃకరణపు ప్రథమపిలుపుకే, ప్రథమ హుంకారమునకే, చీత్కారమునకే చిత్తములో సామూహికంగా నున్న కుసంస్కారములు పెల్లగింపబడి క్రిందికొకవైపు పడిపోతాయి. ఆ స్థానంలో నవీన, ఉపయుక్తమైన, ఆవశ్యకమైన, తగిన సంస్కారములు కొద్ది సమయములో వొనగూడుతాయి. మనోబుద్ధులకు కష్టసాధ్యమైన పనియని భావించబడినది, అహంకార పరివర్తన జరిగిన క్షణంలో సర్దుకుంటుంది. అహంకారమువఱకు నేరుగా జేరటానికి సాధనతప్ప యే యితఱ మార్గము లేదు. మనస్సు, బుద్ధిలను శాంతపఱచి, సమ్మోహనము గావించి వాటిని అతీంద్రియావస్థలో వదలిపెట్టి అహంకారము వఱకు ప్రవేశమును పొందుటయే సాధనయొక్క వుద్దేశ్యము. గాయత్రీ సాధన పద్ధతిగూడ యీ మాదిరే వుటుంది. దానియొక్క ప్రభావము సరిగా అహంకారముపై పడుతుంది. 'నేను బ్రాహ్మీశక్తికి ఆధారమైయున్నాను. ఈశ్వరీయ స్ఫురణ గాయత్రీ నా రోమరోమములలో నిండియున్నది, నేను దానిని అధికాధికంగా నా లోపల

ధారణజేసుకుని బ్రహ్మీభూతమగుచున్నాను'. ఈ భావన మానవీయ అహంకారమును పాశవికస్థాయినుండి చాలా ఉన్నతస్థాయికి పెంచుతుంది. దానిని దేవతాభావావస్థలో నుంచుతుంది. భగవద్గీతలో యీవిధంగా చెప్పబడియున్నది. **శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః ॥** అనగా ఎంతవరకెవరెటువంటి శ్రద్ధను కలిగివున్నారో గౌరవమును కలిగివున్నారో వస్తుతః అటులనే జరుగుతుంది. గాయత్రీ సాధన తన సాధనలలో దైవీ ఆత్మవిశ్వాసము, ఈశ్వరీయ అహంకారము ప్రసాదిస్తుంది. కొలది సమయములో అతడు వస్తుతః అటులనే ఔతాడు. అతని ఆత్మ యేస్థాయీ మర్యాదను కలిగివుంటుందో అదే స్థాయిలో చిత్త ప్రవృత్తులుంటాయి. ఆ అలవాట్లే, వాంఛలే, రుచులే, ప్రవృత్తులే, క్రియలే అతనిలో గోచరిస్తాయి. దివ్యభావములు నిండియున్న వ్యక్తికి, నిశ్చయంగా అతని వాంఛలు, అలవాట్లు, క్రియలు అలాగే వుంటాయి. ఈ సాధన ప్రక్రియ మానవ అంతఃకరణమును కాయకల్పము గావించుతుంది. ఉపదేశములను వినినప్పటికి పుస్తకపఠన గావించినప్పటికి ఆత్మోద్ధరణ నిష్ఫలమని తెలినపుడు సాధనద్వారా మాత్రమే సునాయాసంగా ఆత్మోద్ధరణ జరుగుతుంది. ఇదే సాధన రహస్యము.

ఊర్ధ్వ మనోక్షేత్రము మాత్రమే ఈశ్వరీయ దివ్యశక్తుల అవతరణకు సరియైన స్థానము. విమానాశ్రయమున్నచోటనే విమానము ఎగురగల్గుతుంది. ఈశ్వరీయ దివ్యశక్తి యీ ఊర్ధ్వమనోక్షేత్రంలో ఉద్భవిస్తుంది. ఈ ఊర్ధ్వ మనోక్షేత్రము నిర్మలంగా లేనపుడు, అతి సూక్ష్మదివ్యశక్తులు తనలో నుద్భవించవు. సాధన, సాధక మనోక్షేత్రాన్ని ఉపయుక్త విమానాశ్రయంగా తయారుజ్జేస్తుందిది. అచట దివ్యశక్తులు మేల్కొనగలుగుతాయి. ఆత్మకళ్యాణము, ఆత్మోద్ధరణకొఱకు అనేకవిధములైన సాధనల నాశ్రయించవలెను. దేశ, కాల, పాత్ర భేదకారణములనుగూడా సాధనా మార్గమును నిర్ణయించుటలో యెక్కువ పరిగణనలో నుంచుకొని మార్పులను గావించుకొనవలసివస్తుంది. స్వాధ్యాయములో చిత్తాన్ని లగ్నంజేయడంవలన సన్మార్గము వైపు రుచి కల్గుతుంది. సత్సంగము వలన స్వభావము సంస్కారము శుద్ధిపొందుతాయి. కీర్తనము వలన ఏకాగ్రత, తన్మయత వృద్ధిపొందుతాయి. దానిపుణ్యంవలన త్యాగము, అపరిగ్రహ, ఉపాసనల వలన అస్థిక్యభావన, ఈశ్వరునిపై విశ్వాసము కలుగుతాయి. ఈవిధంగా భిన్నభిన్న వుద్దేశ్యములను, పరిస్థితులను దృష్టిలో నుంచుకొని ఋషులు అనేక ప్రకారములుగా సాధనలను వుపదేశించారు. కానీ వాటిలో సర్వోపరిస్థానము తపస్సుగా ఋషులు అనేక ప్రకారములుగా సాధనలను వుపదేశించారు. కానీ వీటిలో సర్వోపరిస్థానము తపస్సాధనయే. తపోగ్నివలన ఆత్మయొక్క మలవిక్షేపము, పాపతాపము అతిశీఘ్రంగా భస్మమౌతాయి. ఆత్మలో ఫలస్వరూపంగా సాధకునకు దైవీశక్తి ప్రాప్తిస్తుంది. దానివలన నిజమైన ఆత్మానందము ప్రాప్తించి ఉన్నతోన్నత భౌతిక, ఆధ్యాత్మిక లక్ష్యమును అతడు పొందగలుగుతాడు.

ఇది అపరాప్రకృతిని పరాప్రకృతిగా రూపాంతరము చేయుటకు తగిన మనుష్యుని పాశవిక వ్యక్తి స్థానంలో ఈశ్వరీయశక్తిని ప్రతిష్ఠించుటయే. ఆధ్యాత్మవిజ్ఞానపు పని తుచ్ఛులను మహాత్ములుగా, అల్పమును అనల్పముగా, పరిమితిని అపరిమితముగా, అణువును ఆకాశముగా, బద్ధులను ముక్తులుగా, పశువులను దేవతలుగా నొనరించుటయే సాధన వుద్దేశ్యము. ఈ పరివర్తనతోపాటు మనుష్యునకు సామర్థ్యంగూడా కలుగుతుంది. ఇది సతీశక్తికి సన్నిహితమైనది. దీనిని వృద్ధి సిద్ధులను పేర్లతో పిలుస్తారు. సాధన ఆధ్యాత్మిక కాయకల్పమున కొక వైజ్ఞానిక ప్రణాళిక. నిశ్చయంగా అన్య సాధనా విధులలో గాయత్రీసాధన స్థానము సర్వశ్రేష్ఠమై యున్నది.

నిష్కామ సాధనయొక్క తత్త్వజ్ఞానము

గాయత్రీ ఉపాసన కావలసినపుడు నిష్కామభావనతోగానీ, సకామభావనతోగాని జేసినయెడల ఫలితము తప్పక ప్రాప్తిస్తుంది. భోజనము సకామముతో భుజించినా నిష్కామంతో భుజించినా దానివలన ఆకలి వుపశమిస్తుంది. రక్తంగా మారడంతప్పక జరుగుతుంది. భగవద్గీత మొదలైన గ్రంథాలలో నిష్కామకర్మ పై అధిక ప్రాముఖ్యత చెప్పబడినది. కారణమేమనగా వుచితరీతిలో నిష్కామకర్మ గావించినప్పటికి ఆశించిన ఫలితము సమకూరుతుందనీ నిశ్చయంగా జరుగుతుందనీ లేదు. అనేకసార్లు పరిపూర్ణమైన కామభావంతోను తత్పరతతోను జేసినప్పటికీ, దేనిని కోరి అంతా చేశామో ఆ పని పూర్తిగాదు. ఆశించిన ఫలితాన్ని పొందలేనట్టే, ఆ సమయంలో సాధకుడు శీఘ్రంగా నిరాశజెంది శ్రద్ధను కోల్పోతాడు. శ్రేష్ఠమైన సాధనామార్గమును ఉదాసీనభావముతో గమనించరాదు. అందువలననే శాస్త్రకారులు నిష్కామకర్మకన్నా నిష్కామసాధన అధికశ్రేష్ఠంగా భావించారు. దానినే ఎక్కువనొక్కి వక్కాణించారు.

దీని అర్థము సాధనాశ్రమ నిష్ఫలమౌతుందనిగాదు లేక ప్రణాళిక సందిగ్ధమని గాదు. సాధనా ప్రామాణికత విశ్వాసములను అణుమాత్రము సందేహించనవసరం లేదు. ఈ దిశలో గావించిన ప్రయత్న మొక క్షణమైనా నిరర్థకము గాదు. ఇంతవఱ కీ దిశలో పయనించి అడుగువేసినవారందరికీ తమ శ్రమకు పరిపూర్ణ ప్రతిఫలము నిశ్చయంగా లభించినది. కానీ అన్నివేళలా అభీష్టమనోరథము పరిపూర్ణమైనదా లేదా యనునదే సునిశ్చయంగా లేదు.

కారణము ప్రారబ్ధకర్మములు పరిపక్వముచెంది ప్రారబ్ధంగా మారినపుడు ఆ కర్మరేఖలను ఖండించుట కష్టమౌతుంది. అనేకమార్లీ రేఖలు సాధారణంగా వుంటాయి. ప్రయత్నంవలన వాటిలో మార్పులు జరుగుతాయి. అనేకసార్లు ప్రారబ్ధము ప్రబలంగా వున్నందున దానిని తొలగించుట సంభవము గాదనేది నిశ్చయము, అలాంటి కఠిన ప్రారబ్ధముల బంధనములతో అధికాధికమైన బంధనములను వాటి యాతనలను అనుభవించవలసి వస్తుంది.

శ్రీరామ వనగమనము, సీతాపరిత్యాగము, శ్రీకృష్ణపరమాత్మ వ్యాధుని బాణమునకు గురియై స్వర్గమున కేగుట, హరిశ్చంద్రుడు భార్యను, పుత్రుని అమ్మడము, నలమహారాజు దమయంతిని పరిత్యజించడము, పాండవులు హిమాలయాలలో కృంగిపోవడము, 'శబ్దభేది' పృథ్వీరాజ్ మ్లేచ్ఛుల చేతిలో బందీయై మరణించడము మొదలైన అసంఖ్య ఘటనలు ఇతిహాసంలో మనకు గోచరిస్తాయి. అంతటి మహాత్ముల కా విపత్తు లే కారణమువలన సంభవించాయి? వీటివలన మనము ఆశ్చర్యచకితులమౌతాము. దీనికి వ్యతిరేకంగా తుచ్ఛులు, సాధనాహీనులు, విపన్న పరిస్థితులకు లోనైనవారు పెద్దపెద్ద ఉన్నత పదవులను పొంది ఐశ్వర్యవంతులైనపుడు వారిని గాంచి యేదైనా సహాయ మా తుచ్ఛులను శ్రమలేకుండ వున్నతులను గావించినదని ఆశ్చర్యము కలుగుతుంది. అటువంటి సంఘటనలకు సమాధానము- నశించిన ప్రారబ్ధపు మంచి చెడుల ననుభవించడముపై ఆధారపడివుంటుంది. తెలివిగల వారెప్పటికి తెలివిగా ప్రవర్తించినప్పటికీ ప్రారబ్ధమును తొలగించుట సంభవము గాదు.

ఇచట నొక సందేహ ముత్పన్నమౌతుంది. ప్రారబ్ధమే ప్రబలమైతే ప్రయత్నంవలన ప్రయోజనమేమి? మన జీవితంలోని అన్ని పనులు కార్యములు ప్రారబ్ధము పైననే ఆధారపడి వుండవని సందేహించినవారు తెలుసుకొనవలెను. ఏవో కొన్ని ప్రారబ్ధములు మాత్రమే తొలగించడానికి వీలుపడవు. జీవితంలో అధికాంశభాగమున తాత్కాలిక కర్మఫలము ప్రాప్తించడము, క్రియా పరిణామము యెక్కువగా వెంటవెంటనే జరగడము జరుగుతుంది. కానీ అపుడపుడు దీనికి వ్యతిరేకంగా జరుగుతుంది. మంచి జేస్తే చెడు జరగడము, చెడు చేస్తే మంచి జరడగము. కఠోరపరిశ్రమ జేయు వ్యక్తి, మేధావి నష్టము పొందుతాడు, మూర్ఖుడు, సోమరి అనాయాసంగా లాభము పొందడము గమనించుతాము. ఇటువంటి వ్యతిరేక పరిస్థితులు అన్నివేళలా రావు. అపుడపుడూ వ్యక్తమౌతాయి. అట్లుగాక సాధారణ ఘటనలు కూడా క్లిష్టంగా ప్రతిదినమూ వుంటే ప్రపంచపు పూర్తి వ్యవస్థ అస్తవ్యస్థమౌతుంది. కర్తవ్యమార్గము నష్టమౌతుంది. కర్మను ఫలితంగా బంధించే శక్తి లేనపుడు మానవులు కర్తవ్యనిష్ఠను వదలి తమకు లభించే ప్రయోజనాలపై తమ అదృష్టముపై భరోసాతో మౌనంగా ఖాళీగావుండి లోకాన్ని ప్రజావ్యవస్థను అస్తవ్యస్థము గావించుతారు. అట్టి తల్లక్రిందు పరిస్థితి సంభవించదు. అప్పుడప్పుడుమాత్రము ప్రయత్నము నిష్ఫలమై విపరీతపరిణామములు సంభవించవచ్చు. ఆ పరిస్థితులకు కారణము దృఢమైన ప్రారబ్ధపు ప్రబలతగా తెలిసికోవలెను.

అభీష్టఫలము ప్రాప్తించినప్పటికి గూడా గాయత్రీ సాధనాశ్రమ వృధా గాదు. దానివల్ల వేఱేదైనా లాభము చేకూరుతుంది. ఒక నవయువకుడు మఱొక నవయువకుని కుస్తీలో యెదుర్కొనుటకు వ్యాయామము, పౌష్టిక భోజనము ద్వారా ఆరోగ్యవంతముగా తయారవుతాడు. పూర్తిగా తయారైనతరువాత కుస్తీలో ఆ యువకుడు విజయము సాధించడంలో సఫలీకృతుడు గానట్లయితే అతని తయారీ నిరర్ధకమని భావించరాదు. తయారీతన ప్రయోజనాన్ని చూపుతుంది. శరీరపరిశుద్ధత, ముఖంలోని తేజస్సు, అంగముల కదలికా సౌలభ్యము, బలకరమై శ్వాసకోశములు, బలవీర్యాధిక్యత, నిరోగిత, దీర్ఘజీవనము, కార్యక్షమత, బలకరమైన సంతానము మొదలైన అనేక లాభములు అతనికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. కుస్తీ గెలుచుటలో అతడు వంచితుడు గావచ్చు. కానీ బలాన్ని పెంపొందించుకొనుటద్వారా లభించిన అన్యప్రయోజనాలు పొందుడంలో విఫలుడు గాలేదు. గాయత్రీ సాధన తన కామ్యప్రయోజనాలను పొందుటలో సఫలత పొందకపోయినప్పటికీగూడా ఆతనికి అనేక యితఱ మార్గములలో లాభము చేకూరుస్తుంది. అంతటి ప్రయోజనాలు సాధన లేకుండా ఆశించలేము, పొందలేము.

మనుష్యుడు తనకు హితకరమైనదానినే అవసరమైనదానినే వాంఛిస్తాడు. కానీ పరమేశ్వరుని దృష్టిలో ఆ కోరిక అతనికి అనవసరము, హానికరమైతే ప్రభు వా కోరికను నెరవేర్చడు. బాలకు డనేక వస్తువులు కావలెనంటాడు. కానీ తల్లికి బిడ్డకి ఏది అవసరమో తెలుసు. బిడ్డ అరచిగీపెట్టినా తల్లి సరకుచేయదు. బిడ్డకు వుపయోగము కానటువంటి వస్తువు లభించదు. ఏలనన ఆ వస్తువులన బిడ్డకు లాభము లేదు. రోగుల ఆసక్తికూడా యిటువంటిదే. కుపథ్యమునకు రోగి కావలసిన అన్ని మార్గముల ననుసరిస్తాడు. కానీ ఆ రోగులకు సేవచేయువారు వాటిని సాగనివ్వరు. రోగి ఆరోగ్యమునకు అపాయమున్నందునే కుపథ్యానికి అవకాశమియ్యరు. రోగులు, బాలురు తమ మార్గములు ఉచితమైనవేనని భావిస్తారు. అందులో దోషము లేదని భావిస్తారు. అయినప్పటికీ వారి దృష్టికోణము సరిగాదు. గాయత్రీ సాధకులలో పెక్కుమందికి బాలుర స్వభావము, రోగుల స్వభావము వలె నుంటుంది. తమ దృష్టిలో వారి కోరికలు

సవ్యము, ఉచితమైనవి. కానీ భగవంతునికే తెలుసు యే వ్యక్తికి యేది వుపయోగమో. ఆ దేవి తన పుత్రుల యోగ్యత, స్థితి, అవసరాలకు అనుకూలంగానే వుంటుంది. అసఫలత గాయత్రీ సాధకులకు సంభవించుట వారు బాలబుద్ధితో యోచించుట వలననే. తల్లి తన బిడ్డలలో నొకనికి ఆటవస్తువులిచ్చి, మిఠాయిపెట్టి ప్రేమిస్తుంది, లాలిస్తుంది. వేఱొక బిడ్డను అనారోగ్య కారణంగా వైద్యాలయమునకు తీసికెళ్ళి శస్త్రచికిత్స చేయిస్తుంది. చేదుమందులు త్రాగిస్తుంది. దీనివల్ల తల్లికి పక్షపాతమున్నదని, అన్యాయంగా, నిర్దయగా నున్నదని యిష్టమొచ్చినట్లు నిందిస్తే, తల్లి హృదయాన్ని తెరచి చూస్తే ఆమె అంతఃకరణములో బిడ్డలిద్దరిపై సమాన ప్రేమ వున్నదని తెలుస్తుంది. బాలుడు తన కేది అన్యాయమని, న్యాయవిరోధమని భావిస్తాడో, మాతృదృష్టిలో అదే అవసరము, సర్వశ్రేష్ఠ ప్రమాణము. మన ఓటమి, మనకు జరిగిన హానీ, మన కష్టాలు ఎక్కువగా మన లాభంకొఱకు జరుగుతాయి. మనకు జరగవలసిన అపరిమిత బాధలను మాత చాల తక్కువ మోతాదులో జరిగేటట్లుజేసి మనలను వుద్ధరిస్తుంది. ఆమె దృష్టి విశాలమైనది. ఆమె హృదయము ప్రేమమయము. మన హితమే ఆమె కోరేది. దుఃఖము, దరిద్రము, రోగము, హాని, క్లేశము, అవమానము, శోకము, వియోగము మొదలైనవి మనకు కల్పించి మనపై తన అపారకరుణ ప్రదర్శిస్తుంది. ఈ చేదు ఔషధమువలన మనలో అంతర్గతంగా వున్న భయంకర వ్యాధులను పోగొట్టి భవిష్యత్తులో మనలను పూర్ణ ఆరోగ్యవంతులుగా జేస్తుంది. ఒకవేళ అవసరమొస్తే గాయత్రీ సాధకులు తమ ధైర్యమును కోల్పోగూడదు. నిరాశపడవద్దు. మాత ఒడిలో బాధ్యతల నొదిలి నిశ్చింతగా వున్నయెడల ఆమె ప్రమాదంలో మనలను పడనీయదు.

నిష్కామభావనతో సాధన చేయువారికికూడా సకామసాధకులకు లభించే లాభములు ప్రాప్తిస్తాయి. తక్కువ వుండదు. తల్లికి యే పుత్రున కేది అవసరమో బాగా తెలుసు. ఆమె దృష్టిలో యే వస్తువు వుచితమో దానిని బాలునికిచ్చుటలో లోపము చేయదు.

మనము నిష్కామముతో సాధన జేసి మౌనంగా, మన జీవనసరళిలో అనుక్షణమూ ఆద్యశక్తి ఏవిధంగా సహాయపడుతుందో గమనించుట మంచిది. శ్రద్ధ, విశ్వాసములతో మాత నెవ్వరాశ్రయిస్తారో, వారు తమ శిరస్సుపై దేవి ఛత్రపు ఛాయ ఉనికిని ప్రత్యక్షంగా అనుభవిస్తారు. తమకు అవసరమైనవాటిని పొందుటలో ఏమాత్రము వంచితులుగారు. ఎవరికైనా, ఎప్పుడైనా గాయత్రీ సాధన నిష్ఫలము గాదని అంగీకరించుట తథ్యము.

ఈ సాధనలలో అభీష్టసిద్ధి నిశ్చయము

మంత్రసాధన కొక విశేష విధివ్యవస్థ వున్నది. నిత్యసాధనకు నిర్వహించవల్సిన కర్మకాండకు అనుగుణ్యంగా మంత్రముల అనుష్ఠాన సాధన, పురశ్చరణ చేయాలి. మామూలుగా విధిపూర్వకంగా చేయని యనుష్ఠానము సాధకునకు హానికారకమౌతుంది. లాభంబదులు అరిష్టము సంభవిస్తుంది.

ఎవఱో మంత్రము జపించారనీ, దేవతను పూజించారనీ లేక యేదో యోగాభ్యాసము చేశారనీ, తాంత్రిక అనుష్ఠానము గావించారని అనేక ఉదాహరణలు వున్నాయి. సాధనయొక్క నీతిరీతులలో పొరపాటు జరిగినందున,

అనుష్ఠాన భంగమైనందున, సాధకునకు భారీవిపత్తు కలుగుతుంది. అనేకమంది పిచ్చివాళ్ళవడంకూడా కద్దు. అనేకులకు వ్యాధులు, మరణము, ధననాశనము మొదలైన అరిష్టాలు సంభవిస్తాయి. ఈవిధమైన ప్రమాదాలు మనకు ఇతిహాసపురాణాలలో గూడా నున్నాయి. వృత్రాసురుని, ఇంద్రుని కథ లీవిధంగా వున్నాయి. వేదమంత్రములను వుచ్చరించడంలో దోషములున్నందున, వారు ఘోరసంకటము ననుభవింపవలసివచ్చినది.

ఇతఱ వేదమంత్రముల వలె గాయత్రీమంత్రాన్నికూడా శుద్ధస్వరముతో ఉచ్చరించాలి. విధిపూర్వకంగా సాధన చేయవలెను. విధిపూర్వకంగా చేసిన సాధనలవలన శీఘ్రముగా సిద్ధి లభిస్తుంది. ఉత్తమ పరిణామ మొనగూడుతుంది. అయినప్పటికీ వేదమాత గాయత్రీలో ఒక ప్రత్యేక విశేషమున్నది. లోపమేదైనా జరిగితే హానిమాత్రము కలుగదు. దయాశీలయై, ఉదారమైన బుద్ధిమంతురాలయిన తల్లి తమ బిడ్డల హితచింతన యేవిధంగా జేస్తుందో, అదేవిధంగా గాయత్రీ శక్తి ద్వారా సాధకునకు మంచియే జరుగుతుంది. బాలురు పొరపాట్లు చేస్తారు. ఆమెను గౌరవించడంలో లోటు చేస్తారు. అనేకసార్లు వ్యతిరేకంగా ప్రవర్తిస్తారు. ఐనప్పటికీ తల్లికి వారియందెటువంటి దుర్భావము వుండదు. హాని చేయదు. సాధారణ తల్లియే యింతటి దయాళువైనపుడు జగజ్జనని, వేదమాత, సత్త్వగుణ సంపన్నురాలయిన దివ్య సురనది గాయత్రీనుండి అధికంగా ఆశించవచ్చు. ఆమె తన బిడ్డలకు తన యందుగల శ్రద్ధనుగాంచి ప్రభావితురాలై, బాలుర భక్తిభావనలను తిలకించినందున ఆమె హృదయముప్పొంగుతుంది. ఆమె వాత్సల్యము అమృతనిర్ఝరిణియై ప్రవహిస్తుంది. సాధనలో జరిగిన అజ్ఞానజనిత హ్రస్వలోపాలు, ఆ దివ్యప్రవాహంలో సామాన్యమై అంతరించిపోతాయి.

సత్త్వగుణ ప్రధాన సాధనకు వ్యతిరేక ఫలము జరుగునేమోననే భయానికి భగవద్గీతలో కృష్ణపరమాత్మ వచించారు.

నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।

స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥

అర్థము : ఈ మార్గమున యెంతవఱకు కృషిచేసిన అంతవఱకు ఫలితము లభించును. నడుమ విరమించినను విపరీత ఫలితములు కలుగబోవు. కొద్దిగా అనుష్ఠించినను సంసార మహాభయమునుండి రక్షించును.

గాయత్రీ సాధనకూడా సాత్త్విక సత్కర్మ. దీని నొకసారి ప్రారంభిస్తే మనోప్రవృత్తు లా దిశలో ఆకర్షింపబడతాయి. మధ్యలో అవాంతరములు కలిగినప్పటికీ మాటిమాటికీ, ఎల్లవేళలా సాధకునకు, పునః ఆరంభించుటకు కోరిక కలుగుతూవుంటుంది. రుచికరమైన పదార్థపు రుచినొకసారి యాస్వాదించిన తదుపరి, దానిని మరలా రుచి చూడవలెననే కోరిక ఉద్భవిస్తుంది. అట్టి అమృతోపమ, స్వాదిష్ట ఆధ్యాత్మికాహారము గాయత్రీ సాధన. దానిని పొందుటకు ఆత్మ పదే పదే మారాము చేస్తుంది. పదేపదే కేకవేసి పిలుస్తుంది. సాధనలో పొరపాటు జరిగినప్పటికీ వ్యతిరేక ఫలితము గలుగదు. విపత్తులు, సంకటములు, అరిష్టములు జరుగవు. పొరపాటువలన తక్కువ ఫలము సంప్రాప్తించవచ్చుగాని, ఫలము లేకుండా వుండదు. ఈ సాధన స్వల్పరూపంలో ప్రారంభించినప్పటికీ యది ఉత్తమ ఫలము చేకూరుస్తుంది. ఆ ఫలముల వలన భయకారణము తొలగుతుంది. ఆ భయకారణము యే యితఱ ఉపాయములచే తొలగనప్పటికీ గాయత్రీ సాధనచే తొలగుతుంది.

ఈ విషయం స్పష్టంగా, వివరంగా, అధికంగా తెలియడానికి భాగవతంలో పన్నెండవ స్కంధంలో నారదులవారు శ్రీమన్నారాయణుని దీనినిగురించే ప్రశ్నించారు. మాత ప్రసన్నురాలై కళ్యాణప్రదాయని యగుటకు, అల్పశక్తి గల మనుజులు

సహజంగా ఆచరించడానికి వీలైన ఉపాయమేదైనా తెలియజేయండి ప్రభూ! ఏలనన అన్ని దేవతల సాధనలో ప్రాయశః ఆచార విచారములలోనూ, విధివిధానాలలోనూ, త్యాగతపస్సులలోను కఠిన నియమములు చెప్పబడినాయి. వాటిని సామాన్యశ్రేణికి చెంది, అల్పవిద్యాబుద్ధులు గల వ్యక్తులు నిర్వర్తించలేరు.

పై ప్రశ్నకు సమాధానంగా శ్రీమన్నారాయణు డీవిధంగా ప్రవచించాడు. హే నారదా! మనుష్యు డే యితఅ అనుష్ఠానము నాచరించినా, ఆచరించకపోయినా ఒక్క గాయత్రీపై దృఢనిష్ఠు డైతే అతడు తన జీవితాన్ని ధన్యంగావించుకొంటాడు. హే మహామునీ! ఎవరయితే సంధ్యాసమయములో అర్ఘ్యమిచ్చి ప్రతిదినము మూడువేల గాయత్రీ జపిస్తారో, వారు దేవతలచే గూడా పూజింప యోగ్యులవుతారు. జపము చేసేముందు న్యాసము చేయవలసి వుంటుంది. శాస్త్రములలో శాస్త్రకారులు దేవో భూత్వా దేవో భూత్వా దేవం యజేత్ అని వ్రాక్కుచ్చారు. అనగా దేవుని వలె తయారై దేవతాయజ్ఞము చేయవలెను. కానీ యేదైనా అవాంతరమువలన లేక ప్రమాదమువలన న్యాసము చేయలేకపోతే, నిష్కాపటభావంతో సచ్చిదానంద గాయత్రీదేవిని ధ్యానించి, కేవలము ఆమె జపము గావించినాగూడ సం సంపూర్ణమైనట్లే.

గాయత్రీయొక్క అక్షమేకమాత్రము సిద్ధిపొందిన ఉత్తమబ్రాహ్మణుడు సూర్య చంద్ర అగ్ని దేవులతో గూడ సమానంగా పూజింపబడతాడు. నియమానుసారంగా గాయత్రీ ఉపాసన చేసే సాధకుడు, అన్ని ప్రకారములయిన సిద్ధులను పొందుతాడు. దీనిలో సందేహమేమాత్రము లేదు.

ఈ కథనమువలన యీ యుగంలో గాయత్రీయొక్క సాత్త్విక, నిష్కామ సాధనము సర్వశ్రేష్ఠమని విదితమౌతుంది. దానివలన నిశ్చయంగా ఆత్మకళ్యాణము జరుగుతుంది.

ఈ విషయాలన్నింటినీ భావనజేసి సాధకుడు నిర్భయ మనస్సుతో సమస్త శంకలను, సంకోచములను వదలి గాయత్రీ సాధన చేయవలెను. ఇది సాధారణమైన అస్త్రముగాదు. నియమ భూమిక లేకుండా పని జరుగదు. మానవుడు స్వేచ్ఛగా విహరించే వనచరజీవాన్ని బంధించడానికి చతురతతో గూడిన ఉపాయమును తప్పక అనుసరించవలెను. కానీ ఆవుదూడ తన తల్లిని పట్టుకొనుటకు మాతృభావంతో అమ్మా యనినమాత్రమే చాలును, గోమాత నిలబడిపోతుంది. వాత్సల్యంతో దూడను నాకుట మొదలెడుతుంది. తన పయోధారలచే పానము చేయిస్తుంది. రండి మనముకూడ వేదమాతను స్వచ్ఛమైన అంతఃకరణముచే భక్తిభావనతో ఆహ్వానిద్దాము. ఆమె అంతరాళమునుండి ప్రవహించే అమృత రసాన్ని గ్రోలుదాము.

మనము శాస్త్రీయ సాధనా పద్ధతిలో గాయత్రీ సాధన చేయడానికి శక్తికొద్ది ప్రయత్నము చేయవలెను. అకారణంగా లోపముజేయుటవలన ప్రయోజన మేమి? మన మాత అనుచిత వ్యవహారమును కూడ క్షమిస్తుంది. అంటే దాని తాత్పర్యము ఆమె యందు శ్రద్ధ భక్తి కొంచెము తగ్గినా పఱవాలేదని కాదు. ఎంతవఱకు వీలవుతుందో అంతవఱకు పూర్తిగా సావధానంతో సాధన చేయాలి. కానీ కించిత్‌మాత్రము లోపము జరిగితే హాని కలుగుతుంది, చెడు జరుగుతుంది అనే శంక మాత్రము మనస్సులోనుండి పెరికివేయాలి. ఈ భయంవలన గాయత్రీ సాధన మానడము అనవసరము. వేదమాత తన భక్తుల భక్తిభావనకు ప్రాధాన్యత నిస్తుంది. అజ్ఞానవశాన జరిగిన చిన్నచిన్న పొరపాట్లను క్షమిస్తుంది.

సాధకుల కోసము కొన్ని ఆవశ్యక నియమములుః-

గాయత్రీ సాధన చేయువారు అవశ్యము తెలుసుకోవలసినవి ః

1) శరీరాన్ని శుభ్రపఱచుకొని కూర్చొనవలెను. సాధారణంగా శరీరము స్నానంతో శుభ్రమౌతుంది. తప్పనిసరి పరిస్థితులలో ఋతు ప్రతికూలతా సమయములో చేతులు, కాళ్ళు శుభ్రపఱచుకుంటే తడిబట్టలతో శరీరాన్ని తుడుచుకుంటే పని జరిగిపోతుంది.

2) సాధన సమయములో శరీరముపై కొంచెమైనా వస్త్రముంచుకోవలెను. చలి అధికంగా వున్నప్పుడు పల్చటి వస్త్రముకన్నా కంబళి మున్నగువాటిని కప్పుకొని శీతల నిరోధము గావించుకొనుట ఉత్తమము.

3) సాధనకు ఏకాంతము, మంచి గాలి వచ్చే స్థల మెన్నుకొనవలెను. అచట వాతావరణము శాంతిమయముగా నుండవలెను. పొలము, తోట, జలాశయపు ఒడ్డు, దేవమందిరము సాధనకు ఉపయుక్తమైనవి. కానీ అట్టి స్థానములు లభ్యము కానపుడు ఇంటిలోని స్వచ్ఛమైన శాంతిమయ భాగాన్నెన్నుకొనవలెను.

4) ఉతికినబట్టను ధరించి సాధన జేయుట ఉత్తమము.

5) సుఖాసనము వేసుకొని నిటారుగా కూర్చుండవలెను. శరీరానికి కష్టసాధ్యమైన ఆసనములో కూర్చొనరాదు. అందువలన శరీరానికి కష్టము కలుగుతుంది. మనస్సు పదేపదే నిలకడను కోల్పోతుంది. చాలాసేపటివఱకు కూర్చోవటానికి వీలుగానుండెడి, సుఖంగానుండే ఆసనము నెన్నుకోవలెను.

6) వెన్నుముక నిట్టనిలువుగా నుంచుకోవలెను. నడుము వంచి కూర్చుంటే మేరుదండము వంగుతుంది. దానివలన సుషుమ్నానాడిద్వారా ప్రాణముయొక్క గమనాగమనమునకు అవరోధము కలిగి సులువుగా నుండదు.

7) మెత్తటి ఆసనము నేలపై వేయకుండ కూర్చొనరాదు. అటుల కూర్చొనిన సాధన కాలమందు శరీర విద్యుత్తు భూమిపై ప్రసరిస్తుంది. తృణముతోగాని, ఆకులతోగాని తయారుగాబడిన ఆసనమై యుండవలెను. కుశాసనముగాని, చాపగాని శ్రేష్ఠము. వీటి తరువాత కుట్టిన ఆసనము, ఉన్నిచర్మపు ఆసనములు తాంత్రిక కర్మల యందుపయోగింపబడతాయి.

8) తులసి లేక చందనపు మాలను స్వీకరించాలి. రుద్రాక్ష, ఎఱ్ఱచందనము, శంఖముతో చేయబడినవి గాయత్రీయొక్క తాంత్రిక ప్రయోగములలో నుపయోగిస్తారు.

9) ప్రాతఃకాలము 2 గంటలపుడు వేకువ సమయాన జపమును ప్రారంభింపవలయును. సూర్యాస్తమయమునకు గంట తరువాత వఱకు జపము చేయవచ్చు. సాయంకాలమొకగంట, ప్రాతఃకాలము రెండుగంటలు మొత్తము మూడుగంటలు వదలి రాత్రియొక్క యితఱ భాగములలో గాయత్రీ యొక్క దక్షిణమార్గ సాధన చేయరాదు. తాంత్రిక సాధనములు అర్ధరాత్రికి దగ్గఱదగ్గఱగా చేయబడతాయి.

10) సాధనలో నాలుగు విషయములు విశేషంగా గుర్తుంచుకొనవలెను.

అ) చిత్తమును ఏకాగ్రతతో నుంచుకొనవలయును. మనస్సు ఇక్కడ అక్కడ తిరుగరాదు. మనస్సు నిశ్చలతను తప్పి వేగంగా పరుగెత్తుచున్నప్పుడు మాతయొక్క సుందర శరీరపు తేజోధ్యానమందు లగ్నము గావించుము.

ఆ) మాత యందు అచంచల శ్రద్ధ, విశ్వాసము వుంచవలెను. అవిశ్వాసి శంకాశంకితము గలిగినవారు పూర్తిగా లాభాన్ని పొందలేరు.

ఇ) దృఢచిత్తముతో సాధనపై మొండిపట్టుదలగావలెను. ఉత్సాహరహితము, మనోవైకల్యము, నీరసము గలుగుట, శీఘ్రముగా ఫలము లభించకుండుట, అస్వస్థత, ఇతఱ అనేక సాంసారిక విపత్తులు మార్గమున గలిగినా, సాధనకుడు విఘ్నముల నెదుర్కొంటూ తమ మార్గమున దృఢమనస్సుతో పురోగమించవలెను.

ఈ) నిరంతర సాధన ఆవశ్యక నియమము. అత్యంతవసరమైన పని జేయవలసినపుడు విషమ పరిస్థితులలో ఏవిధంగానైనా తిరుగుతూ, పనిచేస్తూ వున్నప్పటికీ మాతయొక్క ఉపాసన నొనరించవలెను. ఒకరోజుగూడ మరువగూడదు. సెలవు పెట్టరాదు. ప్రతిదినము సాధనా సమయాన్ని మార్చగూడదు. ఒకసారి ఉదయము, మఱొకసారి మధ్యాహ్నము, వేఱొకసారి 3 గంటలకు, అపుడపుడు 10 గంటలకు అనియమిత మంచిదికాదు. ఈ నాలుగు నియమములతో సాధన ప్రభావశాలిగా రూపొందుతుంది.

11) కనీస మొక మాల అనగా 108 మంత్రములు ప్రతిదినము జపించవలెను. ఈ సంఖ్య పైన యెంత చేయగలిగితే అంత వుత్తమము.

12) అనుభవజ్ఞుడైన సదాచారవంతుడైన వ్యక్తిని గురువుగా నేర్పరచుకొని సాధన చేయవలెను. తన కెలాంటి సాధన గావలెనో గురువు నిర్ణయిస్తాడు. రోగి తన రోగమును స్వయంగా తెలుసుకొనుటకు మందును నిర్ణయించుటకు సమర్థుడు గాడు. అతడు వైద్యుని సహాయము పొందవలెను. అటులనే తన మనోభూమికి అనుకూలమైన సాధనను నిర్ణయించువారు, సాధనలోని కష్టములకు సమాధానము తెల్పువాడు సాధనా గురువగుట అత్యావశ్యకము.

13) ప్రాతఃకాలము సాధనకు తూర్పువైపుకు తిరిగి సాయంత్రము పశ్చిమదిక్కువైపునకు తిరిగి జపించవలెను. ప్రకాశమునకు, సూర్యునకు అభిముఖముగా నుండవలెను. లేదా గాయత్రీమాత చిత్రపటము యెటువైపు వున్నా అటు తిరిగి కూర్చోవచ్చును.

14) పూజకు పూలు లభించనపుడు అక్షింతలుగాని, కొబ్బరిముక్కలతోగాని, కొబ్బరిగుజ్జుతో తయారుచేసిన చిన్న ఆకుల నుపయోగించవలెను. వాటికి కుంకుమపువ్వురంగు, పసుపు, గోరింటాకు రంగుల నుపయోగించవచ్చు. అశుద్ధమైన విదేశీవస్తువులతో తయారైన రంగులను వుపయోగించకూడదు.

15) చాలసేపు ఒకే ఆసనముపై కూర్చొనుట కష్టము. అందువలన కూర్చొని కాళ్ళు నొప్పులెత్తి అలసిపోతాయి. అపుడు కాళ్ళను మార్చవలసివస్తుంది. అటుల మార్చుటవలన దోషము లేదు.

16) మల, మూత్ర విసర్జనకొఱకుగాని, అనివార్య కారణంచేగాని సాధన మధ్యలో లేవవలసినపుడు శుద్ధజలముతో కాళ్ళుచేతులను శుభ్రపఱచుకొని మఱల కూర్చుండవలెను. విక్షేపకారణమువలన ఒక మాలను ప్రాయశ్చిత్తముగా జపము చేయవలెను.

17) అనివార్య కారణమువలన సాధన ఆగినచో మరుసటిదినము నొక మాలను అధికంగా జపించలెను. దీనిని ప్రాయశ్చిత్తముగా భావించవలెను.

18) జన్మవలనగాని, మృత్యువువలనగాని అశౌచము పొందినపుడు శుద్ధివఱకు మాల మొదలైవాటితో నొనరించే విధి జపము ఆపవలెను. కేవలము మానసిక జపము చేయవచ్చును. ఒకటింపావు లక్ష జపానుష్ఠానము ఆపివేయవలెను. ఆ విక్షేపకాలము శుద్ధికొఱకు చేయు జపము అధికంగా చేయవలెను.

19) దీర్ఘకాలపు ప్రయాణములో, స్వయంగా వ్యాధిపీడితుడైన, సేవాకార్యములలో సంలగ్నమైనపుడు స్నానాది పవిత్రతకు అవకాశము వుండదు. ఆ పరిస్థితులలో మానసిక జపము మంచంపైనుండి మార్గములో ప్రయాణిస్తూ ఏదైనా అపవిత్ర పరిస్థితులున్నా చేయవచ్చు.

20) సాధకుని ఆహారవిహారములు సాత్త్వికంగా నుండవలెను. ఆహారము సాదాగాను, సుపాచ్యంగాను, తాజాగా, శుభ్రమైన హస్తములచే తయారుచేయబడిన పదార్థమై యుండవలెను. అధిక మిర్చి, మసాలాలు, పాచి భోజనము, నిషాగలిగించునది, అభక్ష్యము, వేడిగానున్నది, దప్పికను పెంపొందించునది, మాంసము, అన్యాయార్జితమైనది, మలినమైన మనుష్యులచే తయారుచేయబడినది, అయిష్టంగా నీయబడిన భోజనము మొదలైనవాటినుండి వీలైనంతవఱకు దూరంగా నుండుట శ్రేయస్కరము.

21) వ్యవహారమెంత ప్రాకృతికమైనప్పటికి ధర్మసంకటమైనను సాత్త్వికమూ, సరళమూ నుండుట ముత్తమము. ఫ్యాషన్లకోసము రాత్రి అధికంగా మేల్కొనుట, పగలు నిద్రించుట, సినిమా, నృత్యములు అధికంగా చూచుట, పరనింద, లోపాన్వేషణ, కలహము, దురాచారము, ఈర్ష్య, నిష్ఠూరము, అలసత్వము, అపాయకరమైన మదమాత్సర్యముల నుండి దూరంగా నుండుటకు వీలైనంత ప్రయత్నము చేయవలెను.

22) బ్రహ్మచర్యము సదా అనుసరణీయము. గాయత్రీ అనుష్ఠానమునకు 40 రోజులు విశేష ఆవశ్యకత.

23) అనుష్ఠానకాలంలో కొన్ని ప్రత్యేక అధిక నియమములను పాటించవలసి వుంటుంది.

అ) గడ్డముతప్ప శిరస్సున వెంట్రుకలు కత్తిరించరాదు. గడ్డము స్వయముగా చేసుకొనవలెను.

ఆ) మంచంపై నిద్రించరాదు. బల్లపైగాని, నేలపైగాని పవళించవలెను.

ఇ) ఆరోజులలో వట్టికాళ్ళతో ఎక్కువ దూరము నడువరాదు. చర్మపుచెప్పులు ధరించి వెళ్ళరానిచోటుకు, పావుకోళ్ళు ధరించి వెళ్ళవలెను.

ఈ) ఈరోజులలో ఒకసారి ఆహారము, ఒకసారి ఫలాహారము చేయవలయును.

ఉ) తన శరీరమును, దుస్తులను యితఱులు స్పృశించుట చాలా తక్కువగా నుండవలెను.

24) ఏకాంతంలో జపము చేసేటపుడు మాలను శూన్యంలో నుంచి జపించవలెను. అనేకమంది దృష్టి మాలపై ప్రసరించే అవకాశమున్నపుడు వస్త్రముతో మాలను కప్పవలెను. గోముఖిపై హస్తముంచవలెను.

25) సాధనానంతరము పూజ చేయగా మిగిలిన అక్షతలు ధూపదీపములు నైవేద్యము, పూలు, జలము, దీపపు వత్తి, హవనభస్మము మొదలైనవాటిని విచ్చలవిడిగా పారవేయరాదు. మనుజులు తొక్కనిచోట వేయవలెను. వాటిని తీర్థములోగాని, నదిలోగాని, జలాశయములోగాని, దేవమందిరమందుగాని, ప్రత్తిచేను, వరిచేనులోగాని వేయవలెను. నైవేద్యమును బాలురకు పంచవలెను. నీటిని సూర్యున కర్ఘ్యము నీయవలెను.

26) వేదోక్తరీతిలో యోగమునకు దక్షిణమార్గక్రియలతోను, తంత్రోక్త వామమార్గ పద్ధతులలోను భేదమున్నది. యోగమార్గ సరళ విధులే యిచ్చట చెప్పబడినవి. వీనిలో విశేష కర్మకాండేదీ అవసరము లేదు. శాపవిమోచనము, కవచము, ప్రతిబంధము, ముద్ర, అంగన్యాసము గావించువారలకు వాటి యావశ్యకత లేదు.

27) గాయత్రీ అధికారము బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు యీ ముగ్గురు ద్విజులకుమాత్రమే. వర్ణము జన్మవలన సంభవిస్తుంది. మఱియు గుణ, కర్మ స్వభావమువలనగూడ సంభవిస్తుంది. అనేక ఉచ్చవర్ణములు కాలములోని మార్పులవలన నీచవర్ణములుగా పరిగణింపబడుతున్నాయి. కొన్ని నీచవర్ణములు ఉన్నతమైనవిగా గణింపబడుతున్నాయి. అధికారానికి సంబంధించినంతవఱకు అనుమానము, గడబిడ జరిగినపుడు తన స్థితిని గుర్తించుట అఖండజ్యోతి కార్యాలయంచే నిర్ణయింపబడుతుంది.

28) వేదమంత్రములు సస్వరంగా ఉచ్చరింపబడుట ఉచితము. కానీ సర్వులూ యథావిధిగా గాయత్రీ మంత్రాన్ని సస్వరంగా పలుకలేరు. కంఠమునుండి ధ్వని సమీపంలో కూర్చునివున్న మనుష్యుడుమాత్రమే మంత్రమును వినేటట్లు జపము చేయవలెను. ఈవిధంగా చేయబడిన జపము స్వరబంధనమునుండి ముక్తమౌతుంది.

29) సాధనకు అనేక విధులున్నాయి. అనేకమంది వివిధరీతులలో సాధన చేస్తారు. తన సాధనావిధిని యితఱులకు తెలియపరచినపుడు కొంచెములో కొంచెమైనా మీనమేషములు బయల్పడుతాయి. భ్రమ కలుగుతుంది. కావున తన సాధనామార్గము నితఱులకు తెలుపరాదు. ఇతఱులతో విభేదము గల్గినపుడు తన సాధనా గురువుయొక్క ఆదేశమే సర్వోత్తమమైనదిగా గ్రహించవలెను. ఏదైనా దోషము, పాపమునకు ఉత్తరదాయిత్వము సాధనా గురువుపై పడుతుంది. సాధకుడు నిర్దోషి, శ్రద్ధాళువు యైనందున సరైన సాధనాఫలము లభిస్తుంది. వాల్మీకి రామ నామమును తలక్రిందులుగా జపించి సిద్ధిపొందాడు.

30) గాయత్రీ సాధన మాతృచరణ వందనములతో సమానము. ఇది నిష్ఫల మెన్నడుగాదు. వ్యతిరేక ఫలితము జరుగదు. పొరపాటువలన అరిష్టము జరుగదు. దీనినెవ్వఱు శంకించరాదు. కావున నిర్భయంగా, ప్రసన్న మనస్సుతో ఉపాసన చేయవలెను. ఇతఱ మంత్రములు నియమము లేకుండా జపించితే అరిష్టములు గలుగుతాయి. కానీ గాయత్రీ మంత్రమున కట్టిదేమి లేదు. గాయత్రీ మంత్రము సర్వసులభము. అత్యంతసుగమము, అన్నివిధములా సుసాధ్యము. తాంత్రికపద్ధతిలో జేయు ఉపాసనను పరిపూర్ణ విధివిధానముతో చేయవలెను. పొరపాటు హానికరము.

31) ఒంటరిగా యితఱులకు తెలియకుండా మిఠాయి తినడము యితఱుల నూరించడము మంచిది కాదు. అటులనే గాయత్రీ స్వయంగా ఉపాసించటంకూడా. మన అన్య ప్రియజనులను, కుటుంబీకులను గాయత్రీ మంత్రోపాసనకు ప్రోత్సహించకుండా వుండటము మంచిది కాదు. తప్పుగూడా. ఈ పొరపాటు నుండి రక్షింపబడుటకు చేతనైనంత అధికసంఖ్యలో వ్యక్తులను గాయత్రీ వైపు ప్రోత్సహించుటయే.

32) సందేహము కల్గినపుడు మథురలోని అఖండజ్యోతికి రిప్లై జాబు పంపి సమాధానము పొందవచ్చు.

33) మాలను జపించేటపుడు సుమేరను ఉల్లంఘించగూడదు. ఒక మాల పూర్తియైన వెంటనే దానిని శిరముపైగాని, నేత్రములపైగాని వుంచి మఱల యథాప్రకారంగా మాలను త్రిప్పవలయును. ప్రతిసారి మాల పూర్తియైన పిదప యిట్లు చేయవలయును. తమ పూజాసామగ్రిని అన్యులు పదేపదే స్పృశించకుండా నుండేటటువంటి చోట నుంచవలయును.

సాధన ఏకాగ్రతతో మఱియు స్థిరచిత్తముతో చేయవలయును

సాధనకు ఆరోగ్యకరమైన మఱియు శాంతచిత్త మవసరము. చిత్తమును ఏకాగ్రమొనరించి, మనస్సును యితఱ వైపులనుండి మళ్ళించి తన్మయత్వంతో శ్రద్ధాభక్తులతో చేసిన సాధన సఫలమౌతుంది. ఈ లక్షణములు సాధకునిలో లేనపుడు అతని ప్రయత్నము ఫలదాయకము గాదు. ఉద్విగ్నతతోకూడి, అశాంతిగల్గి, దుఃఖముతోనున్న ఉత్తేజితమైన, భయము, కుశంకగ్రస్థమైన మనస్సునకు ఏకాగ్రత కుదరదు. మనస్సు క్షణక్షణము పరిభ్రమిస్తువుంటుంది. కాసేపు భయము, తరువాత దుర్ధశ్యతను పొందుతుంది. దానిని దాటుటకు ఉపాయ మాలోచిస్తుంది. అట్టి స్థితిలో సాధన సాగుటయెట్లు? ఏకాగ్రత లేనందున గాయత్రీ జప మందు మనస్సు లగ్నము కాదు. ధ్యానంగూడా కుదరదు. చేతిలో మాల తిరుగుతుంది. నోరు మంత్రమును ఉచ్చరించుతూ వుంటుంది, చిత్తము అచటకూ ఇచటకూ పరిగెడుతుంది. ఈ స్థితి సాధకునకు వుపయుక్తంగాదు. మనస్సు యితఱములనుండి మళ్ళించనంతవఱకు అన్ని విషయాలు మరువనంత వఱకు ఏకాగ్రత, తన్మయత్వముతో భక్తిభావనతో మాతయొక్క పాదములపై నిలువనంతవఱకు అంతఃకరణములో యోగభావన రావడమెలా సంభవిస్తుంది? గాయత్రీని తనవైపు ఆకర్షించి, అభీష్టసిద్ధిని ఆమె సహాయంతో పొందవలెను.

రెండవ కష్టము - శ్రద్ధ లోపించుట. ఎక్కువమంది మనోభూమి శుష్కము, శ్రద్ధారహితమై వుంటుంది. వారు ఆధ్యాత్మిక సాధనలను సవ్యమైన మనస్సుతో విశ్వసించరు. ఇతఱుల ప్రశంసలను విని, పరీక్షించుటకై మనస్సులో కుతూహలము కలిగి నిజమెంతో తెలుసుకోవాలనుకుంటారు. ఈ సత్యాన్ని తెలుసుకోవటానికి కష్టసాధ్యమైన కార్యాన్ని పూర్తిగా గీటుఱాయిగా చేయగూడదు. ఆ కార్యాన్ని పూర్తిగా నిర్వర్తించడానికి అంత శ్రమ నిచ్చి పరీక్షించగూడదు.

పది, ఇరవై మాలలు మంత్రజపం చేసిన వెంటనే వారి కష్టసాధ్య కార్యము సునాయాసంగా, తృటిలో జరిగిపోవాలని వారు వాంఛిస్తారు. కొంతమంది సజ్జనులు మా ఫలానా పని ప్రథమంగా పూర్తియైన వెంటనే సాధన ఇంతమాత్రమే చేస్తాము అని మ్రొక్కుకుంటారు. అదెలా వుంటుందంటే 'ముందు భూమిలో నుండి నీటిని తీసి మా పొలాన్ని తడిపితే తరువాత జలదేవతను ప్రసన్నము చేసుకోవటానికి బావిని త్రవ్వనిస్తాము' అని ఎవరైనా అన్నట్లుంటుంది. వారి వుద్దేశ్యము, బహుశా అదృశ్యశక్తులు మన ఉపాసన లేకపోతే ఆకలితో వుంటాయని. వారు లేకపోతే పని జరగదని, అందువలననే వారు ఉపాసన వాయిదావేసి 'ముందు కూలీ చెయ్యి, తరువాత భోజనము పెడతాము లేక నీ ఆగిపోయిన పనిలో సహాయం చేస్తా' మంటారు. అట్టి స్వభావము హాస్యాస్పదము. వారి అవిశ్వాసాన్ని ఆక్షేపణము తెలియ పరుస్తుంది.

అవిశ్వాసి, అశ్రద్ధాళువు, అస్థిరచిత్తుడుకూడా గాయత్రీ సాధనను నియమముగా చేస్తున్నప్పుడు కొంతకాలము తరువాత యీ త్రిదోషములు తొలగి, శ్రద్ధ, విశ్వాసము, ఏకాగ్రత ఉత్పన్నము అగుటలో సఫలత ప్రాప్తించి వేగంగా పురోగమిస్తాడు. కావున మనోభూమిలో సంశయము, అస్థిరత వున్నప్పటికీ సాధనలో లగ్నమవ్వాలి. ఒకానొకరోజు అవి తృటిలో దూరమౌతాయి, మాత కృప లభిస్తుంది.

శ్రద్ధ, విశ్వాసముల శక్తి చాలా ప్రబలమైనది. వీటిద్వారా మనుష్యుడు అసంభవకార్యమును గూడా సాధించగలుగుతాడు. భగీరథుడు శ్రద్ధాబలంతోనే హిమాలయపర్వతంలో మార్గము చేసి గంగను పృథ్విపై అవతరించేటట్లు

చేశాడు. శ్రద్ధ, విశ్వాసముల వలననే ధ్రువుడు, నామదేవుడు లాంటి చిన్నబాలురు భగవంతుని సాక్షాత్కరింపజేసుకొన్నారు. వీటి ఆధారంపైనే తులసీదాసు, సూరదాసు మొదలైన వాసనాగ్రస్థులు, సాధుశిరోమణు లైనారు. కావున మనమా మహాశక్తిని ఆశ్రయించిన మన చిత్తచాంచల్యము, అస్థిరత్వము క్రమంగా తమంతట తామే దూరంగా తొలగిపోతాయి. మనము నియమపాలన గావించుటొక్కటే ఆవశ్యకత. దీన్ని గుర్తుంచుకొంటే సంకల్పము చేసినవాటిపై దృఢత్వ మేర్పడుతుంది. దీని ఫలితంగా మన మానసిక దుర్బలత శారీరక అశక్తత స్వయంగా వదలి మన సాధన చివఱలో తప్పక ఫలిస్తుంది.

శాస్త్రము యిలా చెబుతుంది. 'సందిగ్ధోహిహత మంత్రం, వ్యగ్రచిత్తోహతో జపం'. సందిగ్ధతవలన మంత్రము వ్యర్థమౌతుంది. వ్యగ్రచిత్తముతో గావించిన జపము నిష్ఫలమౌతుంది. సందిగ్ధత, వ్యగ్రము, అశ్రద్ధ, అస్థిరతవలన విశేషప్రయోజనా ఫలితము లభించదు. ఈ కష్టములను మనస్సులో నుంచుకొని ఆధ్యాత్మిక విద్యాచార్యులు ఇతఱులద్వారా సాధన చేయించుటనే ఉపాయాన్ని తెలిపారు. అర్హత గలిగిన వ్యక్తి తన స్థానంలో నుండి యితఱులకొఱకు సాధన చేయవలెను. పూర్తయ్యేంతవఱకు తనకుబదులు ఇతఱులు సాధన చేయడంలో దోషము లేదు. రైతు ధాన్యం పండిస్తాడు. సాలె వస్త్రాన్ని తయారుజేస్తాడు. అవసరమైతే తారుమారుగావచ్చు. వకీలు, వైద్యుడు, అథ్యాపకుడు, గుమస్తాల సమయమునుబట్టి మూల్యమిచ్చి యేవిధంగా ఖరీదు చేస్తామో ఆ కొన్న సమయాన్ని యథేచ్ఛగా నుపయోగిస్తామో మన ప్రయోజనముకొఱకు అటులనే ఎవఱైనా బ్రహ్మపరాయణ సత్పురుషుని గాయత్రీ ఉపాసనకు నియుక్తుని గావించవచ్చు. సందేహగ్రస్థుడు, అస్థిరచిత్తుడైనందున మార్గమందున్న కష్టములను దాటడానికి సులభమౌతుంది.

కార్యములు జరగటానికి శ్రీ సంపన్నులవడానికి ధార్మిక మనోవృత్తి కల్గడానికి, బహుధా శాంత, సురక్ష ఉన్నతికొఱకు గోపాల సహస్రనామము, విష్ణుసహస్రనామము, మహామృత్యుంజయము, శివమహిమ, గంగాలహరీ మొదలైనవాటిని నియమిత రూపంలో పఠిస్తారు. వారొక బ్రాహ్మణునకు మాసిక దక్షిణ నిచ్చి నియమిత సమయములో వాటిని పఠించేటట్లు వొప్పందము కుదుర్చుకుంటారు. ఆ బ్రాహ్మణుడెంత సమయాన్ని వినియోగిస్తారో దానికనుగుణంగా మూల్యాన్ని చెల్లిస్తారు. ఈవిధంగా సంవత్సరాల తరబడి జరుగుతుంది. ఏవైనా ప్రత్యేక పరిస్థితులలో విశేష ప్రయోజన మాసించినపుడు, ఇతోధికంగా అనుష్ఠానాన్ని గావిస్తారు. దుర్గానవరాత్రులపుడు నవదుర్గలకు దుర్గాస్తోత్రము గావిస్తారు. శివరాత్రికి శివమహిమను గానము చేస్తారు. గంగా దశహరా సమయములో గంగాదశహరీ పఠిస్తారు. దీపావళి దినమున శ్రీసూక్తమును అనేక పండితులు కూర్చొని అధికంగా తన సామర్థ్యానుసారము వల్లిస్తారు. మందిరంలో పూజకొఱకు పూజారి నియమింపబడతారు. మందిరాన్ని నడిపే వ్యక్తికొఱకు పూజ చేస్తారు. మందిరంలో చేసే అనేకమైన శ్రమలకు మందిర సంచాలకుడు మూల్యాన్ని చెల్లించనవసరము లేదు.

ఇదేవిధంగా గాయత్రీ సాధనతోగూడ జరుగవచ్చు. తన శరీర ఆరోగ్యముకొఱకు, మనోనిశ్చలతకు, కుటుంబ శ్రేయస్సుకు, తన కార్యముల సురక్షితకొఱకు, ఉన్నతికోసము వెయ్యి రెండువేల సంఖ్య గాయత్రీ జపింపజేయుట, శ్రీసంపన్నులు సులభంగా చేయగలరు. ఈవిధంగా యేదో లాభము పొందినపుడు గాయత్రీదేవి ప్రసన్నతకోసము శుభాన్ని కాంక్షించినపుడు విపత్తి నివారణార్థము ఒకటింపావులక్ష జపాన్ని సత్పాత్రుడైన బ్రాహ్మణునిద్వారా గావించవచ్చు. ఆ సమయములో సాధన చేయు బ్రాహ్మణునకు అన్న వస్త్రములు, పాత్రలు, దక్షిణరూపంలో ఉదారతాపూర్వకంగా ఉచితంగా

నొసంగవలెను. సంతుష్ట సాధకుని సత్యమైన ఆశీర్వాదము, ప్రయోజనా ఫలితాన్ని యితోధికంగా పొందేటట్లు చేస్తుంది. అటువంటి సాధకుడుకూడా సంతృప్తి చెందవలెను. అధిక నిత్యావసర వస్తువులు పొందినందున సంతుష్టిజెంది ఆశీర్వాదభావనను మనస్సులో నుంచుకొంటాడు. అసంతుష్టత్వము వలన దుర్భావనా ప్రేరితుడైనందున యిద్దఱి శ్రమ, సమయము నిష్ఫలమౌతాయి.

ప్రతి సాధకుడు తన సాధనను స్వయంగా ఆచరించుట మంచిది. కానీ బలహీనత, అస్తవ్యస్థత, అస్వస్థత, అస్థిరచిత్తము, చింతాజనకస్థితి మొదలైనవాటివలన సాధన చేయలేనియెడల ఇచ్చిపుచ్చుకొనే పద్ధతిలో అధికారము గలిగిన యితఋలచే పనిని జరిపించవచ్చు. ఈ పద్ధతిగూడా ప్రభావపూర్ణము, లాభదాయకము. అట్టి సత్పాత్రుడు, అధికారి, అనుష్ఠానకర్తను కనుగొనుటలో అఖండజ్యోతి సంస్థానము సహాయము తీసుకొనవచ్చును.

గాయత్రీతో సంధ్యావందనము

కొన్ని పనులు నిత్యమాచరించుట మనుజుని అవశ్య కర్తవ్యము. అటువంటి కర్మలను నిత్యకర్మలు అంటారు. నిత్యకర్మల వుద్దేశ్యము -

1. ఆవశ్యక తత్త్వములను సమీకరించుట

2. అనావశ్యక తత్త్వములను త్యజించుట

ప్రాయశః శరీరానికి ప్రతిదినము యేదో అవసరము వుంటుంది. చైతన్యము గలిగిన వస్తువు తన చైతన్యాన్ని గమనాన్ని స్థిరంగా వుంచుకోవటానికి యెచ్చటినుండైనా నూతనశక్తిని సంతరించుకొంటుంది. అట్టి శక్తి లభ్యంగానపుడు ఆ వస్తువు నశించిపోతుంది. రైలుకు బొగ్గు-నీరు, మోటారుకు- పెట్రోలు, కాంతికి -బ్యాటరీ, ఇంజనుకు -తైలము, సినిమాకు -విద్యుత్తు అవసరము. మొక్కల జీవితము మంచినీటిపై ఆధారపడివుంటుంది. పశుపక్ష్యాదులు కీటక భృంగములు, మానవులు మొదలుగాగల అన్ని ప్రాణులకు ఆకలి, దప్పిక లుంటాయి. తమ తమ ప్రకృతుల కనుగుణ్యంగా అన్నము, జలము, వాయువుని భక్షించి జీవనధారణ చేస్తాయి. ఆహారము లభించనిచో శరీరయాత్ర అసంభవము. గతిశీలత కల్గిన వస్తువేదైనప్పటికీ సజీవమైనా, నిర్జీవమైనా తన గతిశీలతను కొనసాగించటానికి ఆహారము అవశ్యము కావలెను.

ఈవిధంగా అన్ని గతిశీల పదార్థములు ప్రతిక్షణము మలినము సంతరించుకొంటాయి. ఆ మాలిన్యము తొలగించుకొనవలసిన అవసరము వుంటుంది. రైలులో బొగ్గుమసి, యంత్రములలో తైలపుజిడ్డు పుడతాయి. శరీరంలో ప్రతిక్షణము మలము తయారవుతుంది. అది గుదము, శిశ్నము, నాసిక, ముఖము, చెవి, నేత్రములయొక్క రంధ్రములనుండి బయల్పడుతుంది. మలవిమోచనము జరగనపుడు దేహములో విషము ఏకత్రితమౌతుంది. రెండు మూడు రోజులలోనే జీవము సంకటపరిస్థితులకులోనై దుర్భరమౌతుంది. గృహమునందు చీపురు వుపయోగించనపుడు, బట్టలు శుభ్రపఱచనపుడు, పాత్రలు తోమనపుడు, స్నానము చేయనప్పటి శరీరముతో రెండు మూడు దినములు గడుపవచ్చు. తరువాత వాసన వికారము అసహ్యము అసహజ స్వరూపము వుత్పన్నమౌతాయి.

ఆత్మ అన్నింటికంటే అధిక గతిశీలత, చైతన్యము గలిగినది. దానికిగూడా ఆహారము, మలవిసర్జన కావలెను. స్వాధ్యాయము, సత్సంగము, ఆత్మచింతన, ఉపాసన, సాధన మొదలైన సాధనల ద్వారా ఆత్మకు ఆహారము లభిస్తుంది. అపుడా యాత్మ శక్తివంతము, చైతన్యము, క్రియాశీలిగా తయారవుతుంది. తమ అంతఃకరణకు యీ ఆహారము నివ్వని వ్యక్తి, సంసారమందెల్లపుడు జంఝాటములో కూరుకుపోయిన వ్యక్తి శారీరకంగా బలవంతుడైనప్పటికీ, స్థూలకాయు

డైనప్పటికీ, ధనము, సంపద కూడబెట్టినప్పటికీ ఆత్మమాత్రము చైతన్యరహితమై పొరపాటుకు లోనవుతుంది. ఈ తప్పిదంవలన నిస్తేజము, నిర్బలము, నిష్క్రియమునై అర్ధమూర్ఛితావస్థలో నుంటుంది, కావున శాస్త్రజ్ఞులు ఆత్మసాధనను నిత్యకర్మతో మేళవించి మానవునకది ఆవశ్యకమైన కర్తవ్యముగా నొనరించారు.

ఆత్మసాధనలో ఆహారప్రాప్తి మఱియు మలవిసర్జన అనే రెండు మహత్వపూర్ణ కార్యములు సమానరూపంలో జరుగుతాయి. ఆత్మికభావన, ఆలోచనాస్రవంతిని శక్తివంతంగా, చైతన్యంగా క్రియాశీలంగా రూపొందించే పద్ధతిని సాధనంగా పరిగణిస్తారు. సాంసారిక విషయవాసనలు, సంకటములవలన చిత్తముపై సదాప్రోగుపడే దుష్టభావముల వలన సంభవించే వికారములు, మలినములుగూడ యీ సాధనవలన విసర్జింపబడతాయి. శరీరమునకు రెండుసార్లు స్నానము, రెండుసార్లు శౌచము ఆవశ్యకముగా భావిస్తారు. ఆత్మకు గూడ యివి ఆవశ్యకము. దీనినే సంధ్యావందన మని ప్రవచించారు. శరీరంకన్నా ఆత్మయొక్క మహత్తు అధికమైనందున త్రికాలసంధ్య శాస్త్రములలో వర్ణింపబడి నిర్దేశింపబడినది. మూడుసార్లు కుదరనియెడల ప్రాతః, సాయం సమయములందు రెండుసార్లు సంధ్యావందనము నెరవేర్చవలెను. సంధ్యావందన మందు రుచిలేనివారైనప్పటికి కనీసము ఒక్కసారైనా తమ విద్యుక్త ధర్మంగా భావించి చేయవలెను. సంధ్యావందన మొనర్చనందున పాపముల వికారములు క్రమ్ముకొంటాయి. స్పృహలేని ఆత్మ నిర్బలమౌతుంది. ఈ మాటలు పాపకర్మములలో దురదృష్టకరమైనవి. కావున పాతకముల భారము నుండి రక్షణకై గూడా సంధ్యావందనము మనకు ఆవశ్యకమైన నిత్యకర్మ స్నానముతో గూడ కలిపారు.

సంధ్యావందనమునకు అనేకవిధులు హిందూధర్మంలో ప్రాచుర్యంలో వున్నాయి. అన్నింటికన్నా సరళము, సుగమము, సౌమ్యము, అత్యధిక ప్రభావశాలి ఉపాసన గాయత్రీమంత్రమువలన జరిగే బ్రహ్మసంధ్య. దీనిలో ఒక గాయత్రీమంత్రమును మాత్రమే స్మరించవలెను. అనేక మంత్రములను స్మరించి అనేక విధివిధానముల ననుసరించే ఆవశ్యకత లేదు.

సూర్యోదయమును లేక సూర్యాస్తమయమును సంధ్యలుగా పరిగణిస్తారు. ఈ సమయము సంధ్యావందన సమయము, సౌకర్యాన్ననుసరించి యీ సమయములకు కొంచెము ముందుగాని, వెనుకగాని సంధ్యావందన మాచరించవచ్చు. త్రికాలసంధ్య చేయువారికి మూడవ సమయము మధ్యాహ్నకాలము. నిత్యకర్మలను పూర్తిగావించిన తదుపరి శరీరమును శుభ్రపఱచుకొని సంధ్యావందనమునకు కూర్చొనవలెను. ఆ సమయములో దేహముపై కొంచెమైనా వస్త్రము వుండవలెను. శుభ్రమైన గాలితోగూడిన ఏకాంతస్థలము దొరకిన మిక్కలి శ్రేష్ఠము. లేనియెడల గృహములో శుచి, శుభ్రంగా వున్న స్థానము నెన్నుకొనవలెను. కుశాసనము లేక ముతకగుడ్డ లేక గోనెపట్టా లేక కిత్తనారగుడ్డ లేక నాలుగుకాళ్ళపీటపై వెన్నుముకను నిటారుగా నుంచి కాళ్ళు మెలికవేసికొని కూర్చోవలెను. ప్రాతఃకాల సంధ్యకు తూర్పువైపు ముఖము, సాయంసంధ్యయందు పశ్చిమమువైపు ముఖమునుంచి కూర్చొనవలెను. దగ్గరగా నీటితో నిండిన పాత్ర నుంచుకోవలెను. సంధ్యావందనమునకు 'ఐదు' పనులున్నవి. అవి క్రింద వర్ణింపబడినవి.

1. ఆచమనము

జలముతో నిండిన పాత్ర నుండి కుడిఅరచేతిలోనికి జలము తీసికొని మూడుసార్లు ఆచమనము చేయవలెను. ఎడమచేతితో పాత్రనెత్తి కుడిచేతిని కొంచెము నీళ్ళతో నింపి గాయత్రీమంత్రాన్ని పఠించవలెను. మంత్రపఠనము పూర్తియైన

తరువాత ఆ నీటిని త్రాగవలెను. మూడుసార్లు ఆచమనము చేసిన తదుపరి చేతిని నీటితో శుభ్రపఱచుకొనవలెను. పైనున్న ఉత్తరీయంతో ముఖమును, చేతులను తుడుచుకొని మీసములపై నున్న నీటిని తడిని తుడుచుకొనవలెను.

ఆచమనము త్రిగుణమయి మాతయొక్క వివిధ శక్తులను తమంతట తాము ధారణ చేయుటకై చేయవలెను. ప్రథమాచమనముతోపాటు సత్త్వగుణి విశ్వవ్యాపి, సూక్ష్మశక్తి యైన హ్రీం ధ్యానింపబడుతుంది. భావింపబడుతుంది. దానివలన విద్యుత్తుతో సమానమైన నీలకిరణములు తన మంత్రోచ్చారణతోపాటు అన్ని దిశలనుండి జలములోకి ప్రవేశిస్తాయి. ఆ జలమునందా శక్తి పడుగుపేకలవలె వుంటుంది. ఆచమన మొనరించువేళ దానితో సమ్మిళిత సర్వశక్తులు తన శరీరాంతర్గతములో ప్రవేశించునట్లు భావించుకొనవలెను. ' నాలో సత్త్వగుణము ప్రవేశించినది' అని భావించవలెను. ఈవిధంగా రెండవసారి ఆచమనముతోపాటు రజోగుణి శ్రీం శక్తి పీతవర్ణ కిరణములను జలమునందు ఆకర్షించి ఆచమనముతోపాటు శరీరమునందు ప్రవేశించినట్లు భావించవలెను. మూడవసారి ఆచమనము తమోగుణి క్లీం భావన చేసి రక్తవర్ణశక్తిని తనలో ధారణ గావించుకొన్నట్లు భావజాగృతిని పొందవలెను.

బాలుడేవిధంగా మాతృస్తన్యము గ్రోలి, ఆమె గుణములను, శక్తులను తనలో ధారణ గావించుకొనునో పరిపుష్టుడౌనో ఆవిధంగానే సాధకుడు మంత్రబలముచే ఆచమన జలమును గాయత్రీ మాత స్తన్య సమానంగా భావించి త్రాగిన ఆత్మబలము అధికమౌతుంది. ఈ ఆచమనము వలన త్రివిధములైన హ్రీం, శ్రీం, క్లీం శక్తులవలన యుక్తమైన ఆత్మబలము ప్రాప్తిస్తుంది. తదనుసారంగా ఆతని ఆత్మిక పవిత్రత, సాంసారిక సమృద్ధి, సుదృఢమైన శక్తి ప్రాప్తమౌతాయి.

2. శిఖాబంధనము

ఆచమనము తరువాత 'శిఖ' ను జలముతో తడిపి శిరస్సునుండి క్రిందకు వ్రేలాడునట్లుగా ముడివేయవలెను. దీనినే అర్ధముడి అంటారు. వేసేటపుడు గాయత్రీ మంత్రము నుచ్చరించుతూ వుండవలెను. శిఖ మస్తిష్కపు కేంద్రస్థానముపై నుంటుంది. రేడియో ప్రసారకేంద్రములలో ఎత్తైన స్థంభముల నుంచుతారు. వాటినుండి బ్రాడ్‌కాస్టింగ్ తరంగాలు నలుదిక్కులకు ప్రసారము చేయబడతాయి. అటులనే మన మస్తిష్కపు విద్యుత్ భండారము శిఖాస్థానము. అచటినుండి మన ఆలోచనలు, సంకల్పములు, శక్తి పరమాణువుల రూపంలో వెలుపలకువచ్చి పెరిగి ఆకాశములో శీఘ్రగతిని పయనిస్తూ వుంటాయి. ఈ ప్రవాహము అనవసరంగా వృథాగా నిరుపయోగము అవుతుంది. శక్తికోశము బలహీనమౌతుంది. దీనిని నిరోధించుటకు శిఖకు ముడివేయవలెను. సదా బంధింపబడి వున్నందున మన మానసికశక్తులు రక్షింపబడతాయి.

సంధ్యావందన మాచరించునపుడు విశేషరూపంలో ముడివేయడము, రాత్రి నిద్రపోయేటపుడు ముడివిడిపోయి విసృతమయ్యే అవకాశమున్నందున మఱల స్నానమాచరించేటపుడు కేశశుద్ధికొఱకు శిఖను విప్పవలసివుంటుంది. సంధ్య యొనర్చునపుడు అనేక సూక్ష్మతత్త్వములు ఆకర్షింపబడి మనలో స్థానమొనర్చుకొంటాయి. అవి మస్తిష్కకేంద్రము నుండి వెల్వడి వెలుపలకు దూకుతాయి. సంధ్యావందన ప్రయోజనానికి ఆటంకము. అందువలన శిఖను ముడివేయవలెను. ఫుట్‌బాల్ లోపలనున్న రబ్బరుసంచికి గాలి కొట్టడాని కొక గొట్ట ముంటుంది. దానికి ముడివేసినందున లోపలనున్న గాలి వెలుపలకు రాదు. సైకిలు చక్రానికున్న ట్యూబ్‌నుండి గాలిపోకుండా వాల్వు వుంటుంది. దానిద్వారా గాలి లోపలకు ప్రవేశిస్తుందిగాని బయటకు రాదు. ముడివేయబడిన శిఖకుకూడా యీ ప్రయోజనమే గలదు. అది

వెలుపలనున్న ఆలోచనలను, శక్తి సమూహములను గ్రహిస్తుంది. కానీ అంతర్ తత్త్వములను వృథాగా వ్యయము గానీయదు.

ఆచమనమునకు పూర్వము శిఖాబంధనము చేయరు. ఏలనన ఆచమనమపుడు ఆకర్షించే త్రివిధ శక్తులు జలమువలన సంప్రాప్తిస్తాయి. ఈ ఆకర్షణ మస్తిష్కపు కేంద్రము ద్వారా జరుగుతుంది. శిఖను విడిగానుంచినందున ద్వితీయ ప్రయోజన మీవిధంగా సంభవిస్తుంది.

3. ప్రాణాయామము

సంధ్యావందన మూడవ భాగము ప్రాణాయామము లేదా ప్రాణాకర్షణ. గాయత్రీ ఉత్పత్తిని గురించి వర్ణిస్తూ సృష్టి రెండు విధములని వచింపబడినది. అవి 1. జడము అనగా పరమాణుమయము, 2. చైతన్య అనగా ప్రాణమయము.

నిఖిలవిశ్వంలో పరమాణు వియోగ సంయోగములచే వివిధరీతులలో దృశ్యములు గోచరించునట్లుగా చైతన్యప్రాణశక్తి చలనము వలన చైతన్య జగత్తులో వివిధ సంఘటనలు సంభవిస్తాయి. వాయువు తన క్షేత్రంలో సర్వత్రా నిండియుంటుంది. అదేవిధంగా వాయువువలనగూడ అసంఖ్యాకమైన సూక్ష్మచైతన్య ప్రాణతత్త్వము సర్వత్రా వ్యాపించియున్నది. ఈ తత్త్వపు అల్పాధిక్యత వలన మన మానసక్షేత్రము శక్తివంతము గావచ్చు, బలహీనము గావచ్చు. ఆ ప్రాణతత్త్వాన్నెంత మనశ్శక్తితో ఆకర్షించెదరో ధారణ గావించెదరో వారి ఆంతరికస్థితి అదే మోతాదులో శక్తివంతమౌతుంది. ఆత్మతేజము, శూరత్వము, దృఢత్వము, పురుషార్థములు, విశాలత్వము, మహానుభావత్వము, సహనశీలత, ధైర్యము, సమానత్వగుణము ప్రాణశక్తిని పరిచయము చేయునట్టివి.

ప్రాణశక్తి తక్కువగా నున్నవారు స్థూలశరీరులైనప్పటికి పిఱికివారుగా, బానిసభావములు గలవారుగా, లజ్జపడువారుగా, పారుబోతులుగా, అస్థిరమతులుగా, అనుదారులుగా, స్వార్థపరులుగా, అపరాధ మనోవృత్తి గల్గి గాభరాపడువారుగా, అధీరులుగా, తుచ్ఛులుగా, నీచభావములు గలవారుగా, చంచలస్వభావులుగా నుంటారు. ఈ దుర్గుణములు గల వ్యక్తి యే పరిస్థితులలోను మహాత్ముడు గానేరడు. అందువలన సాధకునకు ప్రాణశక్తిని తనలో అధికంగా ధారణ చేయవలసిన అవసరమున్నది. విశ్వమయ ప్రాణతత్త్వము నుండి ఆకర్షించి అత్యధిక మోతాదులో ప్రాణశక్తిని మనము మనలోపల ధారణ చేయు ప్రక్రియను ప్రాణాయామ మంటారు.

ప్రాణాయామము చేయు సమయములో వెన్నుముకను సరిగా, నిటారుగా నుంచవలెను. కారణము వెన్నుముకలోనున్న ఇడా, పింగళా మఱియు సుషుమ్నా నాడులద్వారా ప్రాణశక్తి యొక్క గమనాగమనములు జరుగుతాయి. వెన్నుముక వంగినట్లయిన వంకరగానున్నయెడల ప్రాణశక్తి ధార మూలాధారములోనున్న కుండలినీవఱకు ఆటంకము లేకుండా, నిర్విరామంగా ప్రవహించదు. అందువలన ప్రాణాయామమువలన ప్రయోజనము చేకూరదు.

ప్రాణాయామములో నాలుగు భాగములున్నవి. 1. పూరకము, 2. అంతర్-కుంభకము, 3. రేచకము, 4. బాహ్యకుంభకము. వాయువును లోపలకు పీల్చుకొనుట పూరకము. పీల్చిన గాలిని లోపల బంధించుట అంతర్కుంభకము. వాయువును బయటకు వదలుట రేచకము. శ్వాస పీల్చకుండా వాయువును బయట ఆపుటను బాహ్యకుంభకము అనియెదరు. ఈ నాలుగు గాయత్రీమంత్రముయొక్క నాలుగు భాగములుగా నియమింపబడినవి.

పూరకముతోబాటు - ఓంభూర్భువఃస్వ, అంతర్కుంభకముతోబాటు - తత్సవితుర్వరేణ్యం, రేచకముతో - భర్గోదేవస్య ధీమహి, బాహ్యకుంభకమునకు ధియోయోనః ప్రచోదయాత్ జపించవలెను.

అ) స్వస్థచిత్తముతో కూర్చొనవలెను. ముఖమును అనగా వాక్కును బంధించవలెను. నేత్రములను మూసుకొనవలెను. లేక అర్ధనిమీలితనేత్రములై వుండవలెను. ఇపుడు శ్వాసను నెమ్మదిగా నాసికద్వారా లోపలకు పీల్చుట మొదలుపెట్టవలెను. ఓం భూర్భువఃస్వ మంత్ర భావనను మనస్సులో నుచ్చరించుతూ విశ్వావ్యాపి, దుఃఖనాశకి, సుఖస్వరూపి, బ్రహ్మయొక్క చైతన్య ప్రాణశక్తిని నాసికద్వారా ఆకర్షిస్తున్నా ననుకొనవలయును. ఈ భానవతో, ఈ మంత్రముతోను ఉచ్చరించుతు నెమ్మదినెమ్మదిగా శ్వాస పీల్చండి. సాధ్యమైనంత గాలిని లోపల నింపండి.

ఆ) అపుడు లోపల గాలిని బంధించి తత్సవితుర్వరేణ్యం భాగమును జపించవలెను. జపిస్తూ నాసికద్వారా పీల్చబడిన ప్రాణశక్తి శ్రేష్ఠమని భావించవలెను. సూర్య సమతేజస్వియైన తేజస్సు నా అంగప్రత్యంగములలో రోమరోమములలో నిండియున్నది యని భావించవలెను. ఇటుల భావిస్తూ పూరించిన సమయములో సగము కాలము గాలిని లోపల నుంచవలెను.

ఇ) తరువాత నాసికద్వారా వాయువును నెమ్మదినెమ్మదిగా వెలుపలకు వదలుట మొదలెట్టండి. భర్గోదేవస్య ధీమహి మంత్రభాగమును పఠిస్తూ, 'ఈ దివ్యప్రాణశక్తి నా పాపములను నశింపజేసి వీడ్కోలు తీసుకుంటున్నది' అని భావించవలెను. వాయువును లోపలకు ఆకర్షించినంత సమయము తీసికొనవలెను.

ఈ) లోపలనున్న గాలి వెలుపలకొచ్చినపుడు గాలిని లోపల యెంతసేపు నిలిపివుంచామో అంతసేపు వెలుపల ఆపవలెను. అనగా శ్వాస పీల్చకుండా 'ధియో యోనః ప్రచోదయాత్' మంత్రభాగమును జపిస్తూ భగవతీ, వేదమాత, ఆద్యశక్తి గాయత్రీ సద్బుద్ధి జాగృతము చేయుచున్నదని భావించవలెను.

4. అఘమర్షణ

అఘమర్షణ యన 'పాపమును నాశనము చేయు ప్రక్రియ. గాయత్రీని పుణ్యభావనచే ప్రవేశింపజేసిన పాపనాశము జరుగుతుంది. ప్రకాశము ప్రవేశించినపుడు అంధకారము పటాపంచలవుతుంది. పుణ్యసంకల్ప ప్రభావము పాపముల సంహరణ గావిస్తుంది. బలము, బుద్ధులతోపాటు బలహీనత, నిర్వీర్యత అంతమొందుతుంది. బ్రహ్మసంధ్యయొక్క బ్రహ్మీభావన మన పాపముల పరిమార్చును. అనగా మన అఘములను, మర్షణ చేయును.

అఘమర్షణకొఱకు కుడిచేతిలో జలము తీసికొని దానిని కుడిముక్కురంధ్రముయొక్క సమీపమునకు తీసుకురావలెను. సమీపమనగా ఆఱంగుళముల దూరము. ఎడమచేతిలో ఎడమముక్కురంధ్రమును మూయవలెను. కుడిముక్కురంధ్రమునుండి నెమ్మదినెమ్మదిగా శ్వాసను పీల్చుకొనుట ఆరంభించవలెను. శ్వాస పీల్చునపుడు గాయత్రీ మాతయొక్క పుణ్యప్రతీక అయిన యీ జలము తన దివ్యశక్తులతో పాపములను సంహరించుటకై శ్వాసతోపాటు నా అంతరంగములో ప్రవేశించుచున్నది యని భావించవలెను. లోపల ప్రవేశించి పాపములను, వికారములను సంహారము చేయుచున్నట్లుగా భావించవలెను.

పూర్తిశ్వాసను పీల్చినతరువాత ఎడమముక్కురంధ్రమును తెరువవలెను. కుడిముక్కురంధ్రమును బొటనవ్రేలితో మూసి, శ్వాసను వెలుపలకు వదలుట ప్రారంభించవలెను. కుడిముక్కు దగ్గరున్న నీటిని ఎడమముక్కురంధ్రము వద్దకు తీసుకురావలెను. నశించిన పాపములు మృత్యువాతబడి శవములై సమూహముగా ఎడమముక్కువద్ద నుంచబడిన జలములో ప్రవేశించినట్లుగా భావించవలెను. శ్వాస పూర్తియైన తరువాత ఆ జలమువైపు దృష్టిసారించక అసహ్యాభావంతో కుడివైపు పారబోయవలెను.

అఘమర్షణ జలమును చేతిలో నింపునపుడు ఓం భూర్భువఃస్వః కుడివైపుముక్కురంధ్రముతో గాలి పీల్చునపుడు తత్సవితుర్వరేణ్యం వఱకు జపించవలెను. ఎడమముక్కురంధ్రమునుండి శ్వాస వదలునపుడు భర్గోదేవస్య ధీమహి జలము పారబోసేటపుడు ధియో యోనః ప్రచోదయాత్ మంత్రభాగము నుచ్చరించవలెను.

ఈ క్రియను మూడు పర్యాయములు చేయవలెను. దానివలన కాయము, ప్రాణము, మనస్సుతో చేసిన త్రివిధ పాపములు సంహరింపబడతాయి.

5. న్యాసము

న్యాస మనగా ధారణ గావించుట. అంగప్రత్యంగములలో గాయత్రీమాత సత్త్వగుణశక్తిని ధారణ చేయుట, స్థాపనచేయుట, నింపుట, మిశ్రితమగుటకు న్యాసము గావింపబడుతుంది. గాయత్రీమంత్రములోని ప్రతిశబ్దమునకూ మహత్వపూర్ణమైన స్థలాలకు ఘనిష్ట సంబంధమున్నది. సితారుకున్న తంత్రులలో ప్రత్యేక భాగములను స్పృశించినపుడు ఆ భాగములను వ్రేళ్ళతో వత్తిడి కల్గించినపుడు విభిన్న స్వరము లుత్పన్నమౌతాయి. అటులనే శరీర వీణగూడా వ్రేళ్ళ సహాయముతో దివ్యభాగములను జాగృతపఱుస్తుంది.

అపవిత్రమైన శరీరమువలన దేవీసాన్నిధ్యము పవిత్రముగా నుండదని స్వభావసిద్ధింగా అంగీకరిస్తారు. కావున ఆ ప్రముఖ స్థానములలో దైవీపవిత్రతను స్థాపించుట కొఱకై తగుమోతాదులో దైవీతత్త్వములను స్థాపించినచో సాధకుడు దైవీసాధనకు అర్హుడౌతాడు.

న్యాసముకొఱకు భిన్నభిన్న ఉపాసనవిధులలో వివిధ విధివిధానములున్నాయి. ఆప్రకారంగా వ్రేళ్ళకు పని కల్పించెదరు. గాయత్రీ బ్రహ్మసంధ్యలో అంగుష్ఠము, అనామిక ప్రయోగము, ప్రయోజనీయముగా చేయబడినది. 'ఈ అంగములు గాయత్రీశక్తితో పవిత్రము, శక్తివంతములైనవి' అని భావిస్తూ అంగుష్ఠము అనామికలు కలపి విభిన్న అంగములను స్పర్శించవలెను. అంగస్పర్శ చేయుచున్నపుడు నిమ్నప్రకారము మంత్రోచ్చారణ చేయవలెను.

ఓం భూర్భువః స్వః - మూర్ధాయై; తత్సవితుః - నేత్రాభ్యాం; వరేణ్యం - కర్ణాభ్యాం; భర్గో - ముఖాయ;

దేవస్య - కంఠాయ; ధీమహి - హృదయాయ; ధియో యోనః - నాభ్యో; ప్రచోదయాత్ - హస్తపాదాభ్యాం.

ఈ సప్తాంగములు శరీరము బ్రహ్మాండముయొక్క సప్తలోకములు లేక ఆత్మస్వరూపుడైన సవితయొక్క సప్తాశ్వములుగా తెలుసుకోండి. శరీరము సప్తాహముయొక్క సప్తదినములు. ఏలనన సాధారణంగా దశేంద్రియములని అంగీకరిస్తారు. కానీ గాయత్రీ యోగాంతర్గమనములో సప్త ఇంద్రియములని అంగీకరించడమైనది.

1. మూర్ధము(మస్తిష్కము, మనస్సు) 2. నేత్రములు 3. కర్ణములు 4. వాక్కు, నాలుక 5. హృదయము, అంతఃకరణము 6. నాభి 7. జనేంద్రియములు 8. హస్తపాదములు.

ఈ సప్తములు అపవిత్రంగా వుండకూడదు. వీటిద్వారా కుమార్గమును అవలంబించగూడదు. అవివేకపూర్ణ ఆచరణను అనుసరింపరాదు. కావున న్యాసమొనరింపవలెను. ఈ సప్తాంగములలో భగవతియొక్క సప్తశక్తులు నివసించియుంటాయి. వాటిని పైన చెప్పబడిన న్యాసము ద్వారా జాగృతపఱచవలెను. జాగృతము గావించబడిన మాతృకలు తమతమ స్థానములను రక్షిస్తాయి. అవాంఛనీయ తత్త్వములను న్యాసము నిర్మూలిస్తుంది. ఈవిధంగా సాధకుని లోపలనున్న బ్రాహ్మీశక్తి సుదృఢమై దుర్గముగా తయారవుతుంది.

గాయత్రీమాత మన హృదయసింహాసనముపై నధివసించి, తన శక్తిపూర్ణ కిరణములను నలుదిక్కుల వెదజల్లుచున్నట్టూ ఆ ప్రకాశ స్పర్శవలన మన శరీరాంతర్గతములో అలౌకిక భావనానుభవమును పొందుచున్నట్లు భావించి వేదమాత గాయత్రిని ధ్యానించి జపించవలెను. ఆ సమయములో నేత్రములను మూసికొనవచ్చు లేక అర్ధనిమీలితములు గావించుకొనవచ్చు. మన హృదయాకాశమును బ్రహ్మాకాశ సమాన విస్తృతలెక జ్ఞానతేజస్వీజ్యోతిని కల్పించుకోవలెను. ఈ జ్యోతి ప్రకాశవంతమైన గాయత్రీమాత జ్ఞానజ్యోతియే అవుతుంది. కొంత సమయములోనే సాధకునకు గాయత్రీమాత జ్ఞానజ్యోతియే అవుతుంది. కొంత సమయంలోనే సాధకునకు యీ అనుభవము స్పష్టమౌతుంది.

ఈవిధమైన సాధనకు ఫలస్వరూపము, శ్వేతరంగుగల జ్యోతిలో వివిధ రంగులు గోచరిస్తాయి. సాధన నీవిధంగా క్రమక్రమంగా కొనసాగించిన ఆత్మోన్నతి పొందుట నిశ్చయము. ఆధ్యాత్మయొక్క ఉన్నతసోపానముల నధిరోహించవచ్చు.

గాయత్రీయొక్క సర్వశ్రేష్ఠ మరియు సర్వసులభ ధ్యానము

మానవ మస్తిష్కము ఆశ్యర్యజనకమైనదియు, శక్తిశాలి, చుంబక గుణమునందున దాని గమనవిధి, సామర్థ్యము, క్రియాశీలత వీక్షించి గొప్పగొప్ప విజ్ఞానశీలురు ఆశ్చర్యము పొందెదరు. ఈ అణువులను విశేషమార్గంలో నియోగించినపుడు, ఆ మార్గములో నిగనిగలాడే అగ్నిజిహ్వ అగ్రగామి యౌతుంది. ఏ మార్గములో మానవుని కోర్కె, లాలస, ఆకాంక్ష వుంటాయో అదే దిశలో అదే రంగంలో ఆ కోరిక కొఱకు శరీరపు శక్తులు నియోగింపబడుతాయి.

ప్రథమంగా భావనలు మనస్సులో వుద్భవిస్తాయి. ఆ భావనలపై చిత్తమేకాగ్రత నొందినపుడు ఒక లగ్నశక్తి ఆకర్షణీయరూపంలో ప్రకటమవుతుంది. అపుడది తన అభీష్టతత్త్వములను అఖిలాకాశమునుండి ఆకర్షిస్తుంది. ధ్యానంయొక్క విజ్ఞానమిదియే. ఈ విజ్ఞానముపై ఆధారపడి ప్రకృత్యాంతరాళములో నివసించే సూక్ష్మఆద్యశక్తి బ్రహ్మ స్ఫురణ గాయత్రీదేవిని తనవైపు ఆకర్షించుటకు వీలవుతుంది. ఆమెయొక్క శక్తిభాండారపు ఆధిక్యత తనలో ధారణ గావింపబడుతుంది.

జప సమయములోగాని లేక అన్య సౌకర్య సమయములోగాని నిత్యమూ గాయత్రీ ధ్యానము చేయవలెను. ఏకాంతము, కోలాహలరహితము, శాంతవాతావరణ ప్రదేశంలో స్థిరచిత్తంతో ధ్యానమునకు కూర్చొనవలెను. దుస్తులు వదులుగా నుండవలెను. జప సమయములో ధ్యానము చేయవలసినపుడు కాళ్ళు ముడుచుకొని మేరుదండమును నిటారుగా నుంచుకొని ధ్యానము చేయవలెను. ఇతఱ సమయములలో చేయవలసివస్తే చేతులున్న కుర్చీపై పండుకొనిగాని, పెద్దదిండు లేక బాలీసుపైగాని, చెట్టును ఆధారం చేసుకొనిగాని సాధన చేయవలెను.

శరీరమును పూర్తిగా వదులుగా చేయవలెను. నిర్జీవమైపోయేటంతగా శరీరమును వదులుగానుంచవలెను. ఈ స్థితిలో నేత్రములను మూసివుంచి రెండు చేతులను తొడలపైనుంచుకొని ధ్యానము చేయవలెను. 'ఈ ప్రపంచమంతటా సర్వత్ర కేవలము నీలాకాశమున్నది. దీనిలో యెచ్చటా యే వస్తువూ లేదు' అని భావించవలెను. ప్రళయకాలములో ఆకాశముతప్ప యితఱ మేది వుండదు. అటువంటి స్థితిని మనఃఫలకముపై కల్పనాచిత్రమును వూహించి పూర్తిగా అంకితము గావలెను. ఈవిధంగా కల్పనాచిత్రమును బాగుగా నేర్పరచుకొన్న తరువాత సుదూరాకాశంలో ఒక సూక్ష్మజ్యోతిపిండమును, సూక్ష్మనేత్రములద్వారా చూడవలెను. సూర్యునితో సమానమైన ప్రకాశమును కలిగిన యొక చిన్న నక్షత్ర రూపంలో గాయత్రీని ధ్యానించవలెను. ఈ జ్యోతిపిండమును అధికంగా ధ్యానించినందున ఆ జ్యోతి సమీపమునకు వస్తుంది, పెద్దదై అధిక తేజస్సును విరజిల్లుతుంది.

చంద్రునిగాని, సూర్యునిగాని ధ్యానపూర్వకంగా పరిశీలించి చూచిన వారి బింబములలో నల్లనల్లటి మచ్చలు కనిపిస్తాయి. ఈవిధంగానే గాయత్రీ తేజఃపుంజమును ధ్యానపూర్వకంగా గమనిస్తే ఆరంభంలో గాయత్రీదేవియొక్క అస్పష్టమైన ప్రతిమ దృష్టిగోచరమౌతుంది. నెమ్మదినెమ్మదిగా ధ్యానము గావించువారికి యీ మూర్తి అధికమైన స్పష్టతతో అధిక స్వచ్ఛముగా, అధిక చైతన్యముగా నవ్వుతూ, మాట్లాడుతూ, సైగలు చేస్తూ, సంకేతముల నిస్తూ, భావప్రకటనలు గావించుతూ దర్శనమిస్తుంది.

గాయత్రీ చిత్రాన్ని ధ్యానించుటను ప్రారంభించకముందు అనేకసార్లు ప్రేమతో, గాఢంగా నిశ్చలచిత్తముతో ఆ దేవి అంగప్రత్యంగములను తీక్షణముగా వీక్షించి, ఆ మూర్తిని మనోక్షేత్రముపై జ్యోతిపిండము నందట్టి ప్రతిమనే ప్రతిష్ఠించుకొనవలెను. అట్టి మూర్తినే దర్శించి ధ్యానించవలెను. కొలది దినములలోనే ఆ తేజోమండలముచే ఆవరింపబడిన భగవతీగాయత్రీదేవి మెఱుపు అత్యంత హృదయగ్రాహ్యమైన రూపంలో ధ్యానావస్థలో దృష్టిగోచరమవుట ప్రారంభమవుతుంది.

సూర్యుని కిరణరశ్మిలో కూర్చొనిన మనుష్యునిపై కిరణప్రసారము పడునట్లు ఆ కిరణముల వేడి ప్రత్యక్షముగా ననుభవించునటుల, ఈ జ్యోతిపిండము సమీపమునకు వచ్చినపుడు యేదోవిధమైన దివ్యప్రకాశము తమ మస్తిష్కములో, అంతఃకరణములో, శరీరములోని రోమరోమములో ప్రవేశించి తన అధికారమును కూడగట్టుకొన్నట్లు అనుభవమవుతుంది. ఉదాహరణకు అగ్నిలోపడిన లోహము క్రమక్రమంగా వేడిని సంతరించుకొని ఎఱుపురంగులో అగ్నివర్ణంగా మారునట్లుగా, గాయత్రీదేవి తేజస్సును ధ్యానావస్థలో సాధకుడు తనలో ధారణగావించినపుడు అదే సచ్చిదానంద స్వరూపము ఋషికల్పమై బ్రహ్మతేజస్సుతో అలలుగా వుప్పొంగుతుంది. ఆ తేజస్సు తన సంపూర్ణ శరీరములో తపస్వర్ణిమ మాదిరి రక్తవర్ణముగా నున్నట్లు అనుభవమౌతుంది. ఈ తేజోసంస్థానములో ఆత్మపై కూడగట్టుకొనివున్న తన కలుషకషాయజలము భస్మమైపోతుంది. సాధకుడు తననుతాను బ్రహ్మస్వరూపునిగా, నిర్మలునిగా, నిష్పాపునిగా, నిరాసక్తునిగా అనుభవాన్ని పొందుతాడు. ఈ తేజో ధారణ ధ్యానంలో అనేకసార్లు ప్రకాశము కనిపిస్తుంది. అనేకసార్లు విచిత్రరంగులలో చిన్నవి, పెద్దవి నక్షత్రములు గోచరమవుతాయి. తళతళలాడుతూ, అదృశ్యమవుతూ వుంటాయి. అవి ఒక దిశనుండి మఱొకదిశకు వెళుతూ, మఱల తిరిగివస్తూ, వంకరగా తిరుగుతూ వస్తాయి. అనేకసార్లు చక్రాకారంలో బాణంవలె వేగంగా ఒకే దిశవైపు పయనించుతూ కొద్దిగానో గొప్పగానో ప్రకాశఖండములు దర్శనమిస్తాయి. ఇవన్నీ సఫలతనిచ్చే చిహ్నములు. అంతరంగంలో గాయత్రీ శక్తి వృద్ధియైనకొలది సూక్ష్మశక్తులలో అనేక సద్గుణములు వికసిస్తాయి. అవిగూడా చిన్నచిన్న విచిత్ర రంగులలో పరిరక్షింపబడతాయి.

సాధన అధికంగా ప్రగాఢమైనపుడు స్పష్టము పరిపక్వమైనపుడు మస్తిష్కపు మధ్యభాగములోగాని, హృదయ స్థానములోగాని ఆ గాయత్రీ తేజము స్థిరంగా వుంటుంది. ఇదియే సిద్ధావస్థ. ఆ తేజము బ్రహ్మాకాశమునుండి ఆకర్షింపబడి తనలో స్థిరంగా నెలకొనినపుడు తన శరీరము గాయత్రీ ప్రాణమొకే స్థానములో సమ్మిళితమయ్యే స్థితి చేకూరుతుంది.

భూతప్రేతములు శరీరముపై ఆవేశించినపుడు మనుష్యుడు- ప్రేతాత్మ యిచ్ఛానుసారము ప్రవర్తిస్తాడు. అటులనే గాయత్రీ శక్తి స్థాపన తన అంతరంగములో ప్రవేశించినపుడు సాధకుని ఆలోచనలు, పనులు, ఆచరణ, మనోభావాలు,

అభిరుచులు, కోరికలు, ఆకాంక్షలు అన్నీ ధ్యానపరమార్థకంగా వుంటాయి. దీనివలన మనుష్యత్వంలోని పశుత్వము నశించి, దైవత్వము పెంపొందుతుంది.

ఉపర్యుక్త గాయత్రీ ధ్యానము సర్వోత్తమమైనది. గాయత్రీ తేజఃపుంజము కిరణములు తనపై ప్రసరిస్తున్నాయనే ధ్యానభావన జేసినపుడు ఆ కిరణములు సద్బుద్ధి సాత్త్వికత, సశక్తినిగూడా మనపై ప్రదర్శిస్తున్నాయని, సూర్యుడు తన కిరణములతోపాటు వేడిని, చైతన్యశక్తి నెటుల ప్రసరిస్తాడో యట్లేయని భావించవలెను. ఈ ధ్యానమునుండి లేచిన వెంటనే సాధకునకు తన మస్తిష్కములో సద్బుద్ధి, అంతఃకరణములో సాత్త్వికత, శరీరంలో సూక్ష్మత చేకూరినట్లు అనుభవమౌతుంది. ఈవిధమైన అభివృద్ధి కొంచెము కొంచెముగా ప్రతిదినము జరుగుతున్నందున క్రమక్రమంగా కొలది దినములలోనే యెక్కువ మోతాదులో ఏకత్రితమవుతుంది. తరువాత అది యొక భండారమౌతుంది. బ్రహ్మతేజోదర్శన మైనపుడు శ్రేయస్సుగాని, ప్రేయస్సుగాని, రెండిటిలో నొకటి బ్యాంకులో జమచేయండి. తత్ఫలితంగా దైవీ సంబంధమైనవి గాని లేక సాంసారిక సుఖములుగాని, వస్తువులుగాని సంప్రాప్తించగలవు.

పాపనాశక మఱియు శక్తివర్ధక తపశ్చర్యలు

అగ్నియొక్క వేడిచే ప్రపంచములోని సర్వపదార్థములు మాడిపోవుట, గందరగోళమగుట జరుగుతుంది. అగ్ని సంపర్కముతో పరివర్తనంగాని వస్తువేదీలేదు. తపస్సు అనే అగ్నిగూడ అటువంటిదే. తపస్సు పాపసమూహములను నిశ్చయంగా ఎదిరించి వాటి శక్తిని సన్నగిలచేస్తుంది. వాటిని మార్చి మనోరంజకంగా తయారుచేస్తుంది. లేక వాటిని భస్మము చేస్తుంది.

ప్రారబ్ధకర్మ పరిపక్వమువలన, ప్రారబ్ధ భవితవ్య మున్నపుడు వాటిని అనుభవించడము నశించని రేఖవలె సునిశ్చితమైనపుడు, ఆ కష్టసాధ్య అనుభవము, తపసాగ్ని కారణముచే తీవ్రత తగ్గి బలహీనమవుతుంది. అపుడు కష్టమును భరించుట సుగమమవుతుంది. రెండు మాసములవఱకు భయంకర ఉదరశూలలయై ప్రకటింపబడవలసిన పాపములు సాధారణనొప్పిగా మారి రెండు మాసములవఱకు మామూలు గడబిడ జరిగి సులభంగా తగ్గిపోతుంది. కొన్ని పాపముల కారణంగా చేతులు కాళ్ళు త్రెగిపోవుట సంభవించవలెను మఱియు రక్తస్రావ మెక్కువ జరుగవలెను. కానీ తపస్సుచే చిన్న దెబ్బ తగిలి చాకు మొదలైన వాటివలన త్రెగి పది లేక ఇరవై రక్తపుబొట్లు మాత్రమే ప్రవహించుట జరిగి పాపముల ఫలితము నివృత్తి సంభవిస్తుంది. జన్మజన్మాంతరముల సంచిత పాపములు, అనేకానేక జన్మములవఱకు సహింపరాని కష్టములను కలుగజేస్తుంటాయి. అవి తపస్సువలన చిన్నచిన్న విపత్కర చిహ్నాములుగా వచ్చి, ఈ జన్మలోనే నివృత్తిగావింపబడతాయి. మరణానంతరము స్వర్గము తదుపరి ముక్తిని చేకూర్చు అత్యంత వైభవోపేతమైన జన్మ ప్రాప్తించడానికి మార్గము సుగమమవుతుంది. తపస్వులకు యీ జన్మలో ప్రాయశః కొన్ని అసౌకర్యములు వుంటాయి. కారణమేమనిన జన్మజన్మాంతర సమస్త పాపములు యీ జన్మలోనే యనుభవించిన రానున్న మార్గము సుగమమవుతుంది. అందువలన ఈశ్వర వరదానము వలన తేలికపాటి కష్టములు తసస్సులకు సంభవించడము కద్దు. ఇది పాపపరిహారము.

పాప ఫలితములు మారుట యీవిధంగానే వుంటుంది. పాప ఫలితము లనుభవించవలసినపుడు, ఆ ఫలితము తపస్సువలన అది యిష్టమైనదిగాను, అతి రుచికరమైనదిగాను మారుతుంది. ధర్మంకోసము కర్తవ్యపాలన కొఱకై యశస్సు, కీర్తి, పరోపకారముకొఱకు కష్టమును సమీపించవలసినపుడది ప్రసవవేదన వలె వుంటుంది. గర్భిణీస్త్రీకి ప్రసవకాలము కష్టతరమైనదే. కానీ దానితోపాటు ఉల్లాసముగూడా కలసివుంటుంది. చంద్రబింబము లాంటి కుమారుని గాంచిన వెంటనే ప్రసవవేదన పూర్తిగా మరిచిపోతాడు.

రాజా హరిశ్చంద్రుడు, దధీచిమహాముని, భక్తప్రహ్లాదుడు, మయూరధ్వజుడు మొదలైనవారు కష్టముల ననుభవించవలసి వచ్చినది. కానీ వారికున్న కీర్తికాంక్ష, అమరత్వము, సద్గతి ప్రాప్తించునన్న దృష్టి ఆ పరిస్థితులలోగూడా

ఉత్సాహకరముగా మారినవి. దానమివ్వడంలో ఎచట ఆసక్తి యున్నదో, అక్కడ శుభగతికూడా ప్రాప్తిస్తుంది. తపస్సుద్వారా యీ ప్రకారము ఋణవిముక్తి కావడము, అతిథి తృప్తిగా భోంచేయడము రెండు కార్యములు కలసి జరుగుతాయి.

భస్మీకరణ -ఈప్రకారము జరుగుతుంది. ఇపుడే ప్రారబ్ధముగా మారనటువంటి పాపములు, అజ్ఞానముచేగాని, మతిమరపువలనగాని, బలహీనతచేగాని సంభవించినట్లయిన ఆ చిన్నాపెద్దా అశుభకార్యములు తపసాగ్నిచే మండిపోయి కాలి తమంతట తామే భస్మీపటలమవుతాయి. ఎండుగడ్డివాము చిన్న నిప్పుఅవ్వచే మండునట్లుగా, యీ శ్రేణికి చెందిన పాపకర్మములు తపశ్చర్యచే, పశ్చాత్తాప ప్రాయశ్చిత్తములచే, భవిష్యత్తులో ఆ పాపములు చేయననే దృఢనిశ్చయము వలన తమంతట తామే నశిస్తాయి.

ప్రకాశపు సమ్ముఖంలో అంధకారమేవిధంగా తొలగి విలీనమవుతుందో అట్లే తపస్వియొక్క అంతఃకరణమునుండి ప్రసరించే ప్రచండ కిరణములచే సంస్కారములు నశిస్తాయి. ఆ సంస్కారముల ఛాయగాని, దుర్గంధముగాని, కష్టకారకమైన పరిణామలేశములుగాని అంతరిస్తాయి.

తపశ్చర్యచే పురాకృతపాపములకు గ్లాని సంభవించి, మార్పిడి జరిగి, భస్మీపటలమగుటయేగాక, ఆ తపస్విలో మిక్కిలి నవ్యసాత్త్వికాగ్ని ఉద్భవిస్తుంది. ఈ అగ్ని దైవవిద్యుఛ్ఛక్తి యని, ఆత్మతేజమని, తపోబలమని వివిధ నామములతో పిలువబడుతుంది. ఈ బలమువలన అంతఃకరణములో దాగివున్న గుప్తశక్తులు జాగృతమై దివ్య సాత్త్వికగుణముల వికాసము సంభవిస్తుంది. స్ఫూర్తి, ఉత్సాహము, సాహసము, దూరదర్శనము, సంయమనము, సన్మార్గమునందు ప్రవృత్తి మొదలైన అనేక గుణములు విశేషంగా ప్రత్యక్ష పరిరక్షితమగుట జరుగుతుంది. కుసంస్కారములు, కువిచారములు, దురభ్యాసములు, కుకర్మలనుండి విముక్తికై తపశ్చర్య రామబాణము వంటిది. ప్రాచీనకాలంలో అనేకమంది దేవదానవులు తపస్సొనరించి వారి అభీష్టములను పొందే వరములను పొందినారు.

వస్తువును అరిగిపోవునట్లొనరించే రాపిడివలన వేడి జనిస్తుంది. తననుతాను తపస్సుచే శుష్కింపచేసుకొన్నందున ఆత్మశక్తి ఉద్భవిస్తుంది. సముద్రమును మథించుటవలన పదునాలుగు రత్నములు లభించాయి. పాలను మథించినందున నెయ్యి వస్తుంది. కామ మంథనమువలన ప్రాణమున్న బాలుడుత్పన్నమవుతాడు. భూమిని దున్నుట వలన అన్నముద్భవిస్తుంది. తపస్సుద్వారా జరిగిన ఆత్మమంథనముద్వారా ఉన్నత ఆధ్యాత్మిక తత్త్వముల అభివృద్ధియనే ప్రయోజనము చేకూరుతుంది. ఱాతిపై రుద్దితే కత్తికి పదును లభిస్తుంది. అగ్నిచే తపింపజేయబడినందున బంగారము నిర్మలమవుతుంది. తపస్సుచే తపించబడిన మానవుడు పాపవిముక్తుడవుతాడు. తేజస్వి వివేకవంతుడుగా రూపొందుతాడు.

మన తపస్సులలో గాయత్రీ తపస్సుయొక్క స్థానము మహత్వపూర్ణమైనది. పాపనాశనము, బ్రహ్మతేజోవర్ధనీయ మైన తపశ్చర్యలు కొన్ని క్రింద నీయబడినవి.

1. అస్వాదుతపము

అలవాటైన వస్తువుల కొఱత యేర్పడినపుడు సహనభావము కావలెను. ఆ సహనభావము కష్టతరమైనది. ఆ కష్టమును సహించుటను తపస్సు అంటారు. భోజనమందు 'ఉప్పు', 'తీపి' రుచికి ప్రధానములు. ఈ రెండు వస్తువులలో యేవొక్కటి లోపించినప్పటికి భోజనము యింపుగా వుండదు. బహుశః ప్రజలకు స్వాదిష్టభోజనమందు ప్రీతి యెక్కువ.

అలవాటుగూడా. ఈ రెండింటిలో స్వాధిష్టతత్త్వమును వదలి తయారుచేయబడిన భోజనమును సాత్త్వికప్రకృతి కలిగిన భోజనమని అందురు. రాజసప్రకృతి కలిగిన భోజన మని అందురు. రాజసప్రకృతి గలవారలా భోజనమును సహింపలేరు, భరించలేరు. రుచిలేని భోజనమందు ప్రీతి యేర్పడినకొలది సాత్త్వికత పెరుగుతుంది. ప్రారంభంలో ఒక వారంరోజులు, ఒక మాసము, ఒక ఋతువు దీనిని ప్రయోగించవలెను. ప్రారంభంలో దీర్ఘకాలము ప్రయత్నము చేయగూడదు. దీనికే అస్వాదుతపము అని పేరు.

2. తితీక్షతపస్సు

చలి లేక వేడి వలన సంభవించే శరీరబాధను కొంచెము కొంచెముగా భరించుట అలవాటు చేసుకొనవలెను. శీతాకాలంలో ధోవతి, ఉత్తరీయము లేక చొక్కాతో గడుపుట రాత్రిళ్ళు ఉన్నివస్త్రములు ధరించకుండా కేవలము కంబళి, దుప్పటితోనే పని జరుగునట్లు అభ్యసించవలెను. వేడినీళ్ళ స్నానముకన్న, తాజానీళ్ళతో స్నానము చేయవలెను. అగ్నివద్దనే వేడికొఱకు ప్రయత్నించవద్దు. ఇది చలిని తట్టుకొనుటకు చేసే తపస్సు. పంఖా, గొడుగు, మంచుగడ్డలను త్యజించుట వేడిని తట్టుకొనుటకు తపస్సు.

3. కర్షణతపస్సు

ప్రాతఃకాలము ఒకటి రెండు గంటల రాత్రి మిగిలి వున్నదనగా, నిద్రలేచి నిత్యకర్మలను ప్రారంభించవలెను. తన చేతితో తయారుచేసుకొనిన భోజనము చేయవలెను. తన నీరు తానే తెచ్చుకొనవలెను. తన బట్టలు తానే ఉతుకుకొనవలెను. తన పాత్రలు స్వయంగా తోముకొనవలెను. తనకు కావలసిన పనులకు యితఱులచే సాధ్యమైనంతవఱకు తక్కువ సేవ చేయించుకోవలెను. చెప్పులు ధరించకుండ పాదుకలు లేక కట్టెతో లేక నవారుతో గాని చేసిన చెప్పులతో పనినెరవేర్చవలెను. మంచముపై పరుండరాదు. బల్లపైగాని, నేలపైగాని నిద్రించవలెను. లోహపాత్రను వుపయోగించకుండ, విస్తరిలో భోంచేయవలెను. పశువులపై సవారీ చేయకూడదు. ముతకబట్టలు ధరించి, కాలినడకన యాత్రలు చేయవలెను. ఈవిధమైన ఆచరణను కర్షణతపస్సు అంటారు. దీనిలో ప్రతిదినము శారీరక కష్టములు అనుభవిస్తూ సుఖములను త్యజించవలెను.

4. ఉపవాసము

గీత ఉపవాసమును విషయవికారమును నివృత్తినిజేయునదిగా చెప్పినది. ఒకసారి అన్నాహారము, రెండవసారి ఫలాహారము ఆరంభంలో ఉపవాసము. క్రమక్రమంగా దీనిని కఠోరంగా సాగునట్లు చేయవలెను. రెండుసార్లు పండ్లు, పాలు, పెరుగు మొదలైన ఆహారము కంటె కఠినమైనవి. కేవలము పాలు, మజ్జిగపై నుండుటకు వాటిని పెక్కుసార్లు సేవించవలెను. జలము ఉపవాసంలో అనేకసార్లు అధిక పరిమాణంలో దప్పికగాలేకపోయినా త్రాగవలెను. ఉపవాసముండేవారు నీరు త్రాగకపోయినా పొరపాటే.దీనివలన కుక్షిలో నున్న ప్రేగులలో మలము ఎండునట్లు చేస్తుంది. కావున ఉపవాసంలో పెక్కసార్లు నీరు త్రాగవలెను. దానిలో నిమ్మసోడా, పంచదార కలసినట్లయితే ఆరోగ్యానికి, ఆత్మశుద్ధికి మరీమంచిది.

5. గవ్యకల్పతపస్సు

శరీరానికి, మనుస్సుకూ ఉన్న వివిధ వికారములనుండి విముక్తి పొందటానికి గవ్యకల్పము అద్భుతమైనది. రాజా దిలీపుడు నిస్సంతుడైనపుడు తన కులగురువైన వశిష్ఠుని ఆశ్రమంలో ఆవునుమేపే పనిని పత్నీసమేతంగా చేశాడు. నందినీధేనువును మేతకు తోలుకొనిపోయి గౌరవంతో సేవించేవాడు. ఆవుపాలు, ఆవు పెరుగు, ఆవు మజ్జిగ , ఆవు నెయ్యి సేవించవలెను. ఆవు పేడతో కాచిన ఆవుపాలను త్రాగవలెను. ఆవు మూత్రముతో శరీరమును మర్దించి, శరీరముపై చల్లుకొని స్నానము చేయడం చర్మరోగులకు, రక్తదోషములకు మంచి లాభదాయకము. కావున ఆవులను మేపుటలో సూక్ష్మరూపమైన ప్రయోజనమున్నది. ఆవుపాలు, పెరుగు, నెయ్యి, మజ్జిగలను మనుష్యుడు మూడు మాసములు పుచ్చుకొనిన అతని శరీరములో కాయకల్ప చికిత్స జరుగుతుంది.

6. ప్రదాతవ్యతపస్సు

తనవద్దనున్న శక్తిలో తగుమాత్రము తనవద్దనుంచుకొని ఇతఋలకు అధిక మోతాదులో దానమివ్వవలెను. ధనవంతుడు ధనమును దానమిస్తాడు. ధనము లేని వ్యక్తి తన సమయమును, బుద్ధిని,జ్ఞానమును, చాతుర్యమును, సహకారము మొదలైనవాటిని అరువుగానైనా దానముగానైని యిచ్చి యితఋలకు లాభమును చేకూర్చగలడు. శరీర, మానసికదానము ధన దానము వలె శక్తివంతమైనది. అవినీతితో సంపాదించిన ద్రవ్యమునకు సరియైన ప్రాయశ్చిత్తము సత్కార్యముల కా ద్రవ్యమును దానమిచ్చుటయే. తన సమయములో కొంత భాగమైనా లోకసేవకొఋకై ఉపయోగించడ మొక తపస్సు. దానమిచ్చునపుడు పాత్రము ఆవశ్యకతల నెరిగి చేయవలెను. కుపాత్రునికిచ్చిన దానము, అనుపయుక్త కార్యమునకు యిచ్చినది వ్యర్థము. మనుష్యేతర ప్రాణిగూడ దానమున కధికారియై యున్నది. ఆవు, చీమ, పక్షి, కుక్క మొదలైన యుపయోగకర జీవజంతువులకుగూడ అన్నము, జలము దానమిచ్చుటకు ప్రయత్నము చేయవలెను.

సర్వకష్టములను సహించి, అభావగ్రస్థులైనప్పటికి యితఋలకు ఉచితసహాయం చేయుట, వారిని మహోన్నత శీలవంతులుగా, సాత్త్వికులుగా, సద్గుణవంతులుగా తీర్చిదిద్దడంలో సహాయపడుతుంది. సౌకర్యమిచ్చుట దానముయొక్క వాస్తవిక వుద్దేశ్యము. దానముయొక్క ప్రశంసతో ధర్మశాస్త్రముల ప్రతి పుట నిండియున్నది. ఆ పుణ్యమును గూర్చి యింతకంటే అధికంగా చెప్పడానికేమున్నది? వేద మిలా ప్రవచించినది. నూఋ చేతులతో సంపాదించినది వేయి చేతులతో దాన మొసంగుటకే.

7. నిష్కాసనతపస్సు

తనలోని దోషములను, పాపములను గోప్యంగా నుంచినందున మనస్సు భారముతో కృంగిపోతుంది. కుక్షిలో నిండిన మలమువలన నానాప్రకారముల వ్యాధులు సంభవిస్తాయి. అటులనే తన పాపములను దాచినందున అవి గుప్తముగా నున్న మలము మాదిరి దుర్గంధాన్ని వెదజల్లి క్రుళ్ళి కంపును వ్యాపింపజేసి సమస్త మానసిక క్షేత్రమును దోషభూయిష్ట మొనరిస్తుంది. అందువలన గంభీరుడు, విశ్వాసపాత్రుడైన మిత్రుని యెన్నుకొనవలెను. అతనికి తన పాపపుకథలను వినిపించవలెను. తన కష్టములను, దుఃఖగాథలను, వాంఛలను, అనుభూతులనుకూడా యీవిధంగా ఉదాత్తులకు ఘృణరహితులకు చెబుతూవుండవలెను. అట్టివారు విరోధమొచ్చినప్పటికి యితఋలపై నింద మోపనట్టివారై వుండాలి. ఈవిధమైన ప్రకటీకరణమువలన ఔషధంగా పని జరిగి మనోభూమి నిర్మలమౌతుంది.

ప్రాయశ్చిత్తములలో దోషప్రకటనకు విశేష స్థానమున్నది. గోహత్య చేసినందుకు శాస్త్రములలో ప్రాయశ్చిత్తమిలా చెప్పబడినది. మరణించిన ఆవు తోకను పట్టుకొని నూఱు గ్రామములలో ఆ వ్యక్తి ఉచ్చస్వరంతో కేకలువేస్తూ తనవలన గోహత్య జరిగినదని చాటవలెను. ఈ దోషప్రకటనతో గోహత్యాదోషము పోతుంది. ఎవరికైనా అపకారము చేసినపుడు క్షమాపణ కోరవలెను. అపరాధము తొలగించుకొనవలెను. ఆ వ్యక్తి నన్నివిధముల సంతుష్టునిగా నొనరింపవలెను. ఈ పని జరగనపుడు పాపమును యితఱులకు ప్రకటించుకొనుటద్వారా భారమును తేలికపఱచుకొనవలెను. ఈవిధమైన దోషప్రకటనను ఈ పుస్తక రచయితకు విశ్వసనీయ మిత్రునిగా భావించి లేఖ వ్రాసినచో ప్రాయశ్చిత్త మొనరించుకొన్నట్లవుతుంది. ప్రసన్నతాపూర్వక సలహా అవసరమైతే లభిస్తుంది.

8. సాధనాతపస్సు

గాయత్రీజపము 24 వేలు తొమ్మిదిరోజులలో పూర్తిచేయడము. 1 1/4 లక్ష 40 రోజులలో పూర్తిగావించడము గాయత్రీ యోగసాధనలలో పురశ్చరణ, పూజ, స్తోత్రపాఠముల సాధనలవలన పాపములు తొలగి పుణ్యమధికమౌతుంది. విద్యలో వెనుకబడినవారు గాయత్రీ చాలీసా నిత్యము పఠించిన గాయత్రీదేవి యిందు భక్తి అధికమై ఈ మహాస్త్రమువలన శక్తి యధికమై తద్వారా తపోబలమున కధికారి యగును.

9. బ్రహ్మచర్యతపస్సు

వీర్యమును రక్షించుకొనుట, మైథునమునుండి రక్షించుకొనుట, అల్పవికారములను స్వాధీములో నుంచుకొనుట బ్రహ్మచర్య మనబడుతుంది. మానసిక కామ సంతృప్తి, శారీరక కామతృప్తి వలె హానికరము, మానసిక కామక్రీడ నుండి మనస్సు మరల్చుటకు, నిరంతరాధ్యాత్మిక చింతన, నైతికపరమైన ఆలోచనలతో మనస్సును నింపుట అత్యుత్తమమైన ఉపాయము. ఎపుడు బ్రహ్మచర్య మవలంబించుట సాధ్యము గాదు. మనస్సును బ్రహ్మయందు, సత్యమందు లగ్నమొనరించుటవలన ఆత్మోన్నతిగూడా లభిస్తుంది. ధర్మసాధన, వీర్యరక్షణ సమకూరుతాయి. ఈ ప్రకారంగా ఒకే ఉపాయంతో మూడు ప్రయోజనాలు బ్రహ్మచర్య తపస్సువలన గాయత్రీ సాధకులకు అన్నివిధముల ఉత్తమమైనది.

10. చాంద్రాయణతపస్సు

ఈ వ్రతము పూర్ణిమతో ప్రారంభించవలసివుంటుంది. తాను జప మారంభించు పూర్ణిమరోజున తన ఆహారమెంత స్వీకరించునో దానిలో పదునాఱవభాగముమాత్రము తగ్గించవలెను. అనగా ఒక శేరు భోజనము ప్రతిదినము భుజించుచున్నయెడల అందులో 16 వ భాగము మొదటిరోజు, 1/8వ వంతు రెండవరోజు, 8/10 వ వంతు మూడవరోజు చొప్పున తగ్గించవలెను. కృష్ణపక్షచంద్రుని కళలు రోజుకొకటిచొప్పున ఎలా తగ్గుతాయో అటులనే యొక షోడశాంశ ప్రతిదినము తగ్గించుకుంటూపోవలెను. అమావాస్య, పాడ్యమీలకు చంద్రుడు పూర్తిగా అదృశ్యుడౌతాడు. ఆ రెండురోజులు పూర్తిగా ఆహారమును మానివేయవలెను. మఱల శుక్లపక్షవిదియనుండి చంద్రుడు ఒక కళచే బయల్పడుతాడు. క్రమక్రమంగా వృద్ధిచెందుతాడు. అట్లే ఒక్కొక్క షోడశాంశ ఆహారాన్ని పెంచుకుంటూ పూర్ణిమతిథివఱకు చేరేటప్పటికి పూర్తి ఆహారపు మోతాదుకు చేరుకుంటుంది. ఒక నెలలో ఆహారవిహారములు సంయమనము, స్వాధ్యాయము, సత్సంగములలో ప్రవృత్తి, సాత్త్వికజీవనచర్యలను గాయత్రీ సాధనలో ఉత్సాహపూర్వకముగా సంలగ్నము చేయవలెను.

అర్ధచాంద్రాయణము పదిహేనుదినములు. దీనిలో భోజనములోని ఎనిమిదవ భాగము, ఎనిమిది దినములు తగ్గించి, ఎనిమిది పెంచవలెను. ఆరంభంలో అర్ధచాంద్రాయణముమాత్రమే చేయవలెను. ఒకసారి సఫలమైన పూర్ణచాంద్రాయణతపమునకు ముందుకు సాగవలెను.

ఉపవాసము, స్వాస్థ్యరక్షణకు మిక్కిలి ప్రభావశాలి సాధన మానవుని అన్నపానీయములలో స్వభావసిద్ధంగాగాని, పరిస్థితుల ననుసరించిగాని లోపముంటుంది. అందువలన శరీరములో అనవసరమైన లేక విజాతీయతత్త్వము లభివృద్ధి పొందుతాయి. ఉపవాసకాలంలో పొట్ట ఖాళీగా వున్నప్పుడు జఠరాగ్ని యా దోషములను నివారిస్తుంది. దీనివలన శరీరము శుద్ధమై, రక్తము స్వచ్ఛముగా అవుతుంది. విజాతీయతత్త్వములు లేకుండా నాడులలో స్వచ్ఛమైన రక్తము యే వ్యక్తిలో పరిభ్రమణము చేయుచుండునో ఆ వ్యక్తికి సరాసరి జ్వరముగాని, వ్యాధిగాని సంభవించదు. కావున స్వాస్థ్యకాముడైన పురుషునకు ఉపవాసము గొప్ప సహాయకారియైన బంధువునకు సమానము. ఇతఱ ఉపవాసములకు, చాంద్రాయణ వ్రతమునకు గల తేడా ఇందులో భోజనము తగ్గించుట, పెంచుట క్రమపద్ధతిలో నియమానుసార మొనరించుట విశేషము. కాన ఉపవాసపు విపరీత ప్రభావము కించిత్తుగూడా వుండదు. ఇతఱ దీర్ఘ ఉపవాసములలో భోజన మొకసారే పది పదిహేనురోజులు మానివేసి ఉపవాసము పూర్తయ్యే సమయములో జాగ్రత్తపడవలసివుంటుంది. ఆ సమయములో చాలామంది యెక్కువ మోతాదులో అనుపయుక్తమైన ఆహారము తీసికొన్నందున కఠిన రోగములకు గురియై బాధపడతారు. చాంద్రాయణవ్రతములో అట్టి బాధ వుండదు.

11. మౌనతపస్సు

మౌనమువలన శక్తి క్షయముండదు. ఆత్మబలము, సంయమనము వస్తుంది. దైవీతత్త్వములభివృద్ధి చెందుతాయి. చిత్తమున కేకాగ్రత పెరుగుతుంది. శాంతి ప్రాదుర్భవిస్తుంది. బాహ్యావృత్తులు, అంతర్ముఖమైనందున ఆత్మోన్నతిమార్గము తేటతెల్లమవుతుంది. ప్రతినముగాని, వారానికొకరోజుగాని నియమిత సమయములో మౌనము పాటించుటకు నిశ్చయించుకొనలవెను. అనేకరోజుల తరబడి మౌనవ్రత మాచరించవచ్చు. తన అభిరుచిననుసరించి స్థితిగతులనుబట్టి సౌకర్యము గలుగుట కనుగుణంగా మౌనము పాటించవలసిన గడువును యేర్పరచుకొనవలెను. మౌనకాలంలో అధికాంశము ఏకాంతములో స్వాధ్యాయమున లేదా బ్రహ్మచింతలో గడపవలెను.

12. అర్జనతపస్సు

విద్యాధ్యయనము, శిల్ప, శిక్ష, దేశాటనము, మల్లవిద్య, సంగీతము మొదలైన వివిధోత్పాదక ఉపయోగకరమైన విద్యాప్రాప్తికొఱకు తమ శక్తిని, యోగ్యతను, క్షమతను, క్రియాశీలతల వుపయోగమును పెంపుజేయడాన్ని అర్జనతపస్సు అంటారు. విద్యాఇర్థ కష్టమును సహింపవలసివుంటుంది. మనస్సుకు శ్రమకల్పించవలసి వుంటుంది. సౌకర్యములను వదలి సుఖరహితమైన కార్యక్రమము ననుసరించవలసివుంటుంది. ఇవి అర్జన తపో లక్షణాలు. కేవలము బాల్యంలోనేగాక, వృద్ధావస్థయందుగూడా మృత్యుపర్యంతము యేదోవొక రూపంలో అర్జనతప స్సొనరించుటకు ప్రయత్నిస్తూండవలెను. సంవత్సరములో కొంత సమయాన్ని యీ తపస్సులో అవశ్యము లగ్నము చేయవలెను. దీనివలన తమ తపస్సు శక్తివంతమై తద్వారా అధిక లోకసేవ మొనర్చేటందుకు అవకాశము కలుగుతుంది..

సూర్యునకు పన్నెండు రాశులున్నాయి. గాయత్రీ కవి పన్నెండు తపస్సులు. ఈ తపస్సులలో తన అభిరుచిని, సౌకర్యాన్నిబట్టి అనుసరించి తనదిగా చేసుకొనవలెను. సంవత్సరానికున్న పన్నెండు నెలల్లో నెలకొక తపస్సానరించి సంవత్సరంలో అన్ని తపస్సులు పూర్తిచేయవచ్చు.

సప్తమస్థానంలో నున్న నిష్కామతపములో ఒకటి రెండుసార్లు విశ్వసనీయ మిత్రుల సమ్ముఖంలో తన దోషములను ప్రకటించుకోవలెను. నిత్యమూ దినచర్య పుస్తకములో ఒక మాసమువఱకు దోషములను వ్రాసి తన మార్గదర్శకులకు దానిని చూపవలెను. ఈ క్రమాన్ని ఎక్కువ రోజులవఱకు అనుసరించుట ఉత్తమము. మహాత్మాగాంధీ సబర్మతీ ఆశ్రమంలో తన ఆశ్రమవాసుల దినచర్యపుస్తకములను దీర్ఘాలోచనముతో పరిశీలించేవారు.

ఇతఱ తపస్సులను ప్రత్యేకంగా ప్రయోగించుటకు వివిధ రీతులున్నాయి. అవి కొద్ది కొద్ది పరిమితులమేఱకు నిర్ధారింపబడి, తన అభ్యాసాన్ని సాహసంతో పురోగమించవలెను. ప్రారంభంలో కొద్దిగా సరళమైన తపమును తనదిగా చేసుకొని తరువాత దీర్ఘకాలమువఱకు కఠినము కష్టసాధ్యమైన సాధన చేయడము సులభమౌతుంది.

గాయత్రీ సాధనవలన పాపవిముక్తి

గాయత్రీదేవి అనంత కృపవలన పతితులకు ఉన్నతి చేకూరుతుంది. పాపము నశిస్తుంది. ఈ తత్త్వములను విచారించేటపుడు ఆత్మ సర్వదా స్వచ్ఛము, నిర్మలము, పవిత్రము, శుద్ధము, బుద్ధము, నిర్లిప్తము అని బహు చక్కగా తెలిసికొనవలెను. తెల్లటి గాజుగ్లాసులో గాని లేక పారదర్శనీ పాత్రలోగాని యేదైనా రంగునీళ్ళు పోస్తే అదే రంగుగా కనిపిస్తుంది. సాధారణంగా ఆ పాత్రగూడా అదే రంగులో కనిపిస్తుంది. ఆ పాత్రను అప్పుడు అదే రంగుగా తలపోస్తారు. అయినప్పటికి పాత్ర సహజముగా రంగు లేనిదై వుంటుంది. వేఱొక రంగునీళ్ళు వుంచినట్లయితే మఱోవిధంగా కనిపిస్తుంది. మనుష్యునిస్థితిగూడ యటువంటిదే. స్వభావతః ఆత్మ నిర్వికారమైనది. కానీ దానిలో ఏవిధమైన గుణము, కర్మలు, స్వభావములు నిండివుంటాయో ఆవిధంగానే గుణము వుంటుందని చెబుతూ గీతాచార్యుడిలా నుడివారు.

విద్యా-వినయ సంపన్నుడైన బ్రాహ్మణుడు గోవును, ఏనుగును, శునకమును, ఛండాలుడు మొదలైనవాటిని సాత్త్వికబుద్ధిచే పరికించుతాడు. అతడే పండితుడు.

ఈ సమన్వయ రహస్యమేమనగా ఆత్మ సర్వదా నిర్వికారము. దాని మూల స్థితియందు పరివర్తనము జరుగదు. కేవలము మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములనే అంతఃకరణ చతుష్టయము వివిధ రూపముల వికారగ్రస్తమవుతుంది. ఈ కారణమువలన మనుష్యుడు అస్వాభావికవిపన్నుడై వికృతమైన దశలో మనుగడ సాగిస్తాడు. ఈ స్థితిలో మనుష్యునకు పరివర్తన వచ్చినట్లయితే ఈరోజున దుష్టుడు ఱేపు సాధువుగాను, యోగిగాను మారుట కష్టము గాదు. ఛండాల కులోత్పన్న తస్కరుడు పరివర్తనమువలన మహర్షి వాల్మీకిగా రూపొందినాడని ఇతిహాసము వక్కాణించుతున్నది. జీవితమంతా వేశ్యవృత్తిచే జీవిస్తూవుండే గణిక, అంతరంగిక పరివర్తన కారణంగా పరమ సాధ్వీమతల్లులకు ప్రాప్తించే పరమగతికి అధికారిణియైనది. కసాయిగా వ్యవహరిస్తూ జీవితాన్ని గడిపే అజామీళుడు పరమభాగవతోత్తముల శ్రేణిలో నివసిస్తున్నాడు. ఈవిధంగా నీచకర్మలొనరించే అనేకులకు ఊర్ధ్వగతులు ప్రాప్తించినవి. హీనకులోత్పన్నులకు అగ్రవర్ణముల కీర్తి-ప్రతిష్ట సంభవించినది. రైదాసు చర్మకారుడు, కబీరు సాలె, రామానుజాచార్యులవారు శూద్రుడు, షటకోపాచార్యులవారు పండ్లుకూరగాయలు అమ్మి జీవించే ప్రత్యేక జాతికి చెందినవారు. తిరువాళ్వారు అంత్యకులములో ఉద్భవించారు. కానీ వారి సాధనస్థితి యనేకమంది బ్రాహ్మణులకన్నా అధికము. విశ్వామిత్రుడు క్షత్రియుడుగా జన్మించి బ్రాహ్మణుడైనాడు.

ఇతిహాసములో అనేక ఉదాహరణలు పతితస్థానమునుండి ఉన్నత స్థానముల నధిరోహించిన వ్యక్తుల గురించి వున్నట్లు ఉన్నత స్థానమునుండి పతితులైనవారు కోకొల్లలని ఆ ఇతిహాసములలోనే చెప్పబడినవి. ఉత్తమ బ్రాహ్మణుడైన

పులస్త్యబ్రహ్మవంశములో జన్మించి మహాపండితుడైన రావణుడు మానవునికన్నా పతితుడై రాక్షసు డని వక్కాణింపబడినాడు. దోషభూయిష్టమైన ఆహారమును స్వీకరించినందున భీష్ముడు, ద్రోణుడు లాంటి జ్ఞానపురుషులు న్యాయదూరులై కౌరవులను సమర్థించారు. విశ్వామిత్రుడు క్రోధముతో నిర్దోషులైన వశిష్ఠపుత్రులను బాలురైనప్పటికి వధించాడు. పరాశరుడు మత్స్యరాజకుమారితో వ్యభిచరించి సంతానమును పొందాడు. విశ్వామిత్రుడు వేశ్యపై ఆసక్తితో ఆమెను తనవద్ద దీర్ఘకాల ముంచుకొన్నాడు. చంద్రుని లాంటి దేవత గురుపత్నితో కుమార్గగామిగా ప్రవర్తించాడు. బ్రహ్మ తన పుత్రికనే మోహించాడు. బ్రహ్మచారియైన నారదుడు వివాహమాడుటకై స్వయంవరంలో పాల్గొన్నాడు. శరీరమంతా క్రుళ్ళిన వయోవృద్ధి ఋషిపుంగవునికి కుమారి సుకన్యతో వివాహము జరిగినది. బలిచక్రవర్తి దానమిచ్చేటపుడు ఆటంకపఱచి శుక్రాచార్యుడు తన కంటిని పోగొట్టుకున్నాడు. ధర్మరాజైన యుధిష్ఠిరుడు అశ్వత్థమా హతః అని అసత్యమాడి నరోవా కుంజరోవా అని గొణిగి తన ముఖానికి నల్లటిరంగు పులముకొని తన అబద్ధాన్ని రక్షించుకోవడానికి ప్రయత్నించాడు. ఎంతవఱకు చెప్పినా ఎవరెవరికి చెప్పినా యీ దృష్టిలో చాలా గొప్పవారు చ్యుతులైనారు. దీనివలన ఆంతరంగికస్థితిపై ముసుగువేసి మార్చినంతట మనుష్యుడు చెడ్డవాడు మంచిగా, మంచివాడు చెడుగా చెలామణికాలేడు.

అందఱూ జన్మతః శూద్రులేనని శాస్త్రములు చెబుతున్నాయి. తరువాత తమ తమ సంస్కారముల ప్రభావాన్ననుసరించి ద్విజులనబడతారు. ముఖ్యంగా యీ సంస్కారాలే ద్విజునిగాను రూపొందిస్తాయి. గాయత్రీ తత్త్వజ్ఞానమును హృదయము నందు ధారణ గావించుకొంటే అట్టి సంస్కారములు ఉద్భవిస్తాయి. అపుడు మనుష్యుని ఉన్నతునిగా తీర్చిదిద్దుతాయి. ఆ పాత్రలో నిండివున్న ప్రథమ ఎఱుపురంగు నివృత్తి గాబడుతుంది. ఆ స్థానంలో నీలిరంగు కనిపించడము ప్రారంభమౌతుంది.

పాపముల నాశనము ఆత్మతేజపు ప్రచండతచే గావింపబడుతుంది. ఆ తేజస్సు అధికమైనకొలది సంస్కారపు కార్యము శీఘ్రముగాను, అధిక పరిమాణములో సంభవిస్తుంది. ఖడ్గపుధార కున్నంత తీక్షణత, ఇనుపచువ్వకు పదునులేనపుడుండదు. ఈ తేజమెలా వస్తుంది? దీనికి ఉపాయము కాల్చుటవలన, నానబెట్టుటవలన లోహమును అగ్నిలో తపింపజేసి దానికి పదును పెడతారు. మఱల ఱాతిపై నూరి పదును బాగా వచ్చేటట్లు చేస్తారు. అపుడా ఖడ్గము శత్రుసేనను సంహరింపగలుగుతుంది. మనముగూడా మన ఆత్మశక్తి యొక్క తేజస్సును పెంపొందించుకొనటానికి తపించవలెను. సానబట్టే ప్రణాళికను స్వయంగా ఆచరించవలెను. ఆధ్యాత్మికభాషలో దీనిని తపము లేక ప్రాయశ్చిత్తము అని పిలుస్తారు.

అపరాధికి ప్రతిచోట దండము శిక్షాపద్ధతిగా వుంటుంది. బాలురు గడబిడచేస్తే తల్లి దబదబ బాదుతుంది. శిష్యుడు అపరాధ మొనరించితే గురువు బెత్తముపయోగిస్తాడు. సామాజిక నియమములను భంగపఱచి ప్రవర్తిస్తే పంచాయితీలో శిక్ష వేస్తారు. చట్టము నతిక్రమిస్తే జరిమానా, కారాగారవాసము, జీవితాంతపు ఖైదు లేక ఉరిశిక్ష వేస్తారు. ఈశ్వరుడు దైవిక, దైహిక, భౌతిక దుఃఖములను కల్పించి పాపములకు దండన విధిస్తాడు. దండవిధానము ప్రతీకారముకొఱకు హింసద్వారా వ్యతిరేకచర్య తీసికొనుట కొఱకు మాత్రమేకాదు. రక్తానికి బదులు రక్తము అనునది అరణ్యవిధానము వలన కాదు. శిక్షావిధానముయొక్క నిర్మాణము వున్నత ఆధ్యాత్మికవిజ్ఞానముపై ఆధారపడి యేర్పరచబడినది.

కారణమేమనగా దండస్వరూపంలో సంభవించిన కష్టము అనుభవించుట కీయబడినది. దానివలన మానవుని అంతరంగములో వ్యాకులత, గందరగోళము జరుగుతుంది. ప్రతిక్రియ జరుగుతుంది. వేగము యేర్పడి, దానివలన అతని గుప్తమనస్సు చకితమౌతుంది. మూలతత్త్వము నొదలి ఉచితమార్గములోనికి మరలుతుంది. తపస్సులో ఆవిధమైన శక్తియే యున్నది. తపస్సుయొక్క వేడి అనాత్మతత్త్వములను శిక్షించి సంహరిస్తుంది.

ఇతఋలద్వారా దండరూపములో బలవంతంగా తపస్సు చేయడంవలన మనకు శుద్ధి కలుగుతుంది. ఆ ప్రణాళిక మనము స్వయంగా చేయవచ్చు. గుప్తంగావున్న మన పాపములకు శిక్షను స్వయంగా, స్వేచ్ఛాపూర్వకంగా విధించుకొని తపస్సు చేసినట్లయితే యితఋలచే జపము చేయించినదానికంటే అసంఖ్యాకమైన రెట్లు ఎక్కువ. అందులో అవమానము లేదు, హింస లేదు, ఆత్మగ్లానిచే చిత్తక్షోభ జరగదు.

అయితే స్వేచ్ఛాతపస్సుచే ప్రత్యేకమైన అధ్యాత్మికానందము లభిస్తుంది. శౌర్యము, సాహసము ప్రకటితమవుతుంది. అందువలన దృష్టిలో తన శ్రేష్ఠత్వము ప్రతిష్ఠ పెరుగుతుంది. పాపముల నివృత్తికొఱకు ఆత్మతేజపు అగ్ని కావలెను. ఈ అగ్ని ఉత్పత్తియైనందున రెండువిధముల లాభమున్నది. ప్రథమంగా హానికారక తత్త్వముల కషాయకల్పము నశిస్తుంది. తరువాత రెండవది ఆ అగ్నియొక్క వేడి, ప్రకాశముచే దైవీతత్త్వముల వికాసము, పోషణ, అభివృద్ధి జరుగుతుంది. వీటివలన సాధకుడు తపస్వీ, మనస్వీ, తేజస్వీగా రూపొందుతాడు. మన శాస్త్రములలో ప్రతిపుట యందు ఉపవాసము, దానము, స్నానము, ఆచరణ, విచారణము మొదలైనవి, వాటి విధివిధానము యీ దృష్టితోనే చెప్పబడినది. వీటిని అలవరచుకొన్న మనుష్యునకు పైన చెప్పబడిన ద్వితీయ లాభము చేకూరుతుంది.

తనచే చేయబడిన పొరపాటుకు, పాపమునకు, చెడుపనులకు ప్రతిఫలంగా సంభవించే అనుభవముల నివారణకు ప్రాయశ్చిత్తమేమనగా వాటిని మఱల చేయకుండుటకు దృఢనిశ్చయమేర్పరచుకొనవలెను. ఈ నిశ్చయంతోపాటు కొంచెము తపశ్చర్య ఒనరించితే అది ప్రతిజ్ఞాబలముతో కలసి, ఆచరణలో పెట్టుటకు కావలసిన సంకల్పబలము చేకూరుతుంది. దానితోపాటు సాత్త్వికత తీవ్రగతిలో వృద్ధి పొందుతుంది. చైతన్యము ఉద్భవిస్తుంది. ఈ ఉత్తమోత్తమ గుణములు పవిత్రమయ, సాధనామయ, మంగళమయమైన జీవనము గడుపుట కవసరమైన కర్మస్వభావముల ఉత్పత్తికి సుగమమవుతుంది. గాయత్రీశక్తిపై ఆధారపడి చేసిన తపశ్చర్య గొప్పగొప్ప పాపులనుకూడా నిష్పాపులను జేసినది. వారి పాపములను నివృత్తిగావించుటయేగాక, భవిష్యత్తులో నిష్పాపులుగా నుండుటకు యోగ్యులుగా జేస్తుంది.

పాపకార్యముగా గోచరించే ప్రతీదీ సర్వదా పాపమని తలవగూడదు. ఒకానొక కార్యము పాపము గాదు, పుణ్యము గాదని చెప్పబడినది. కర్తయొక్క భావన ననుసరించి పాపపుణ్యములు వుంటాయి. ఒక మనుష్యునకు పాపమైనది, రెండవవానికి పాపరహితమై యున్నది. కొన్నిసార్లతనికి పుణ్యమౌతుందిగూడ. హత్య యెనరించుటొక కార్యము. అది ముగ్గురువ్యక్తులు విభిన్న పరిస్థితులలో వివిధ కారణములవలన చేస్తారు. కొందరు యితఋల ధనము నపహరించుటకు హత్య చేస్తారు. ఇది ఘోరపాపము. న్యాయాధీశుడు సమాజానికి శత్రువైన అపరాధిని నాయాన్ని రక్షించటానికి ప్రాణదండన విధిస్తాడు. ఉరితీసే వ్యక్తి తన కర్తవ్యపాలనకు ఉరితీస్తాడు. దుర్మార్గులైన దొంగలు దండెత్తినపుడు నిర్దోషులను రక్షించటానికి యే వ్యక్తియైనా తనకు తాను అపాయములో జొరబడి ఆ అత్యాచారులను సంహరిస్తే యది

పుణ్యకార్యమవుతుంది. ఈ మూడు హత్యలు విభిన్న పరిణామములు గలవి. ఈ ముగ్గురు హంతకులు దొంగ, న్యాయాధీశుడు, దుర్మార్గుల నెదుర్కొని వారిని చంపిన వ్యక్తి సమానరూపంలో పాపులుగా పరిగణించకూడదు.

చోరత్వము ఒక దుష్కార్యము. పరిస్థితుల ప్రాబల్యము వలన సదా దొంగతనము చెడ్డ కార్యము గాదు. స్వయంగా సంపన్నుడైనప్పటికి అన్యాయపూర్వకంగా యితరుల ధనమును హరించేవాడు పూర్తిగా, నిజంగా చోరుడు. రెండవ ఉదాహరణ తెలుసుకోండి. ఆకలివలన ప్రాణము పోయే పరిస్థితి వచ్చినపుడు బలహీనమైన మానసికస్థితిలో సంపన్నుడైన వ్యక్తికి సంబంధించినవానిలో కొంతభాగము దొంగిలించి ఆత్మరక్షణ గావించుకొనుటంత పెద్ద పాము గాదు. మూడవస్థితిలో దుర్మార్గుని సాధనసామగ్రిని దొంగిలించి, వానిని శక్తిహీనునిగా జేయడము, ఆ దొంగిలించిన సామాగ్రిని సన్మార్గములో వినియోగపరచడము పుణ్యకార్యము. ఈ ముగ్గురు దొంగలను సమానశ్రేణిలో నుంచగూడదు.

పరిస్థితి, మానసిక బలహీనత, ధర్మరక్ష స్వల్పమాత్ర బుద్ధివికాస కారణములవలన యనేక పనులు జరుగుతాయి. అవి స్థూలదృష్టితో పరిశీలించితే నింద్యములుగా గోచరిస్తాయి. కానీ వాస్తవంగా వస్తుః వాటి వెనుక పాపభావన గుప్తమై వుండదు. అటువంటివాటిని పాపములని చెప్పలేదు. బాలకుని వ్రణమును కోయుటకు తల్లి యాతనిని వైద్యాలయమునకు తీసికెళ్ళవలెను. బాలకునకు కష్టము కలిగించవలసివస్తుంది. రోగియొక్క ప్రాణాన్ని రక్షించటానికి వైద్యుడు కసాయివానిమాదిరిగా చిన్నముక్కలుగా కోయవలసివుంటుంది. రోగి పథ్యము చేయుటకు కోరికలను తప్పించుటకై ఉపచారకులు అబద్ధములు చెప్పి సముదాయిస్తారు. బాలకుల మొండివైఖరులకుగూడా బహుశా సమాధానంగూడా పైన జెప్పినట్లే. క్రూరజంతువులను, ఆయుధధారులైన ఆటవికులను ముఖాముఖిగా ఆక్రమించకుండా వెనుకనుండి లొంగదీసుకొనవలెను.

ప్రాచీన ఇతిహాసములపై దృష్టిసారించితే అనేకమంది మహాపురుషులకుగూడా ధర్మముయొక్క స్థూలమర్యాదలను ఉల్లంఘించవలసినట్లు గోచరిస్తుంది. లోకహితము, ధర్మబుద్ధి, అధర్మాన్ని నశింపజేయడానికి సద్భావనతో వారు చేసినందున అదే పాపములను సాధారణ మానవులు సాధారణంగా చేసినపుడే పాపము అంటదు.

భస్మాసురుని నుండి శంకరుని ప్రాణమును రక్షించుటకు శ్రీమహావిష్ణువునకు 'మోహిని'రూపము ధరించి మాయోపాయమున రాక్షసుని అంతము చేయవలసి వచ్చినది. సముద్రమథనములో పుట్టిన అమృతభాండమును పంచుకొనుటలో దేవతలకు, రాక్షసులకు పోట్లాట జరిగినప్పుడుగూడా శ్రీమహావిష్ణువు మోహినీ రూపము ధరించి రాక్షసులను మోసగించి దేవతలచే అమృతాన్ని త్రాగించాడు. సతి 'బృంద' సతీత్వమును భంగపరచడానికి భగవానుడు జలంధరుని రూపమును ధరించాడు. బలిచక్రవర్తిని అణుచుటకై వామనావతారము ధరించాడు శ్రీమహావిష్ణువు. చెట్టు చాటునుండి అనుచితంగా శ్రీరాముడు వాలిని సంహరించాడు.

మహాభారతంలో ధర్మరాజైన యుధిష్ఠిరుడు అశ్వత్థామ మృత్యువును కపటంతో సమర్థించాడు. శిఖండి చాటున నిల్చుని అర్జునుడు భీష్ముని విగతజీవుని గావించాడు. కర్ణుని రథము భూమిలో కృంగిపోయినప్పటికీ అతనిని వధించాడు అర్జునుడు. ఘోరదుర్భిక్షంతో క్షుదాపీడితుడై విశ్వామిత్రుడు ఛండాలుని గృహంలో కుక్కమాంసాన్ని దొంగిలించి తిన్నాడు. ప్రహ్లాదుడు తండ్రి ఆన ధిక్కరించాడు. విభీషణుని సోదరపరిత్యాగము, భరతుని మాతృదూషణము, వాలి తన గురువు మాటను పాటింపకుండుట, గోపికలు పరపురుషుడైన శ్రీకృష్ణునిపై మరులుగొనుట, పతిని త్యజించుట, పరశురాముడు

తన తల్లి శిరస్సును ఖండించుట మొదలైనవి సాధారణంగా అధర్మములని ప్రతీతి. కానీ వీటి నొనరించినవారు సదుద్దేశ్యముతో ప్రేరేపింపబడిచేశారు. ఏలనన ధర్మమును సూక్ష్మదృష్టితో పరిశీలించినపుడు పైన చెప్పబడిన కార్యములు పాతకములుగా పరిగణింపబడలేదు.

శివాజీ అఫజల్‌ఖాన్‌ను కుటిలనీతి చాతుర్యంతో వధించాడు. భారతీయ స్వాతంత్ర్య సమర ఇతిహాసంలో క్రాంతికారులు బ్రిటీష్ ప్రభుత్వమునుండి తెలుసుకొని తాము అవలంబించిన నీతిలో చోరత్వము, దోపిడీవిధానము, రహస్య పరిశోధన, హత్య, సంహరణ, అసత్యమాడుట, కపటము, విశ్వాసఘాతము మొదలైనవన్నీ కలసి స్థూలదృష్టిలోమాత్రమే అధర్మమౌతాయి. కానీ ఆత్మ పవిత్రము. అసంఖ్యాకమైన దీనదుఃఖితుల కరుణాజనక స్థితిని గాంచి మనస్సు ద్రవించినవారలై అన్యాయశాసనమును ఉల్లంఘించుటకై వారటుల ప్రవర్తించారు. చట్టము వారిని అపరాధులుగా గుర్తించినది. కానీ వారిని పాపులుగా చెప్పలేదు.

అధర్మనాశనము, ధర్మరక్షణకొఱకు భగవంతుడు యుగయుగములలో అవతరించి అసంఖ్యాకమైన హత్యలు చేయవలసివస్తుంది. రక్తధారలు ప్రవహింపజేయవలసివస్తుంది. వీటితో పాపము లేదు. సదుద్దేశ్యముతో చేయబడిన అనుచిత ఉచిత కార్యమువలె ఉత్తమమైనదిగా అంగీకరించబడినది. ఈవిధంగా గత్యంతరములేక హింసింపబడి, ఆకలితో అలమటిస్తూ, భయపడి దుఃఖభాజనుడు, ఉత్తేజితుడు, ఆపదలోనున్నవారు లేక అజ్ఞానియైన బాలుడు, రోగి, పిచ్చివాడు యేదైనా యెనరించినపుడు వారు క్షమింపదగినవారు. కారణమేమనగా వారి మనోక్షేత్రము మనుష్యధర్మాన్ని, కర్తవ్యాన్ని దృష్టిలో నుంచుకొని సవ్యమైన ఆలోచనాపంథా ననుసరించుటకు సమర్థవంతము కాదు.

పాపులనబడేవారిలో అధికాంశము యీ కోవకు చెందినవారే. వారు పైన ఉదహరించబడిన కారణముల వలన అనుచితకార్యములు చేయవలసివచ్చినది. తరువాత అది వారి స్వభావమైనది. పరిస్థితులలో గత్యంతరహితులై, అలవాట్లవలన వారు నిస్సహాయులై వారా చెడుమార్గముపై పయనించారు. వారు అన్య పరిస్థితులు, సౌకర్యము లభ్యమైనపుడు, సంతోషకరమైన సాధన, ఉన్నతిని పొందే అవకాశము లున్నపుడు నిశ్చయముగా సజ్జనులవుతారు.

చట్టము, లోకము యెవరినైనా దోషిగా ముద్రేసినప్పటికీ స్థూలదృష్టిలో వ్యక్తి అత్యంత దుర్మార్గుడైననూ, వాస్తవింకగా యీ ప్రపంచములో పాపుల సంఖ్య బహు తక్కువ. పరిస్థితుల ప్రభావమువలన పాపియైన వ్యక్తిని ఉద్ధరించవచ్చు. ఏలనన ప్రతివ్యక్తి ఆత్మఈశ్వరాంశయైన కారణమున తత్త్వదృష్టిలో పవిత్రమైనది. చెడ్డతన మా వ్యక్తిపై ఛాయారూప మలముగా నున్నది. దానిని పరిశుభ్రపఱచుట అసంభవము కాదు. కష్టసాధ్యము గాదు. మిక్కిలి సులభము.

అనేకమంది భావిస్తారు 'మేమింతవఱకు యెంతో పాపము చేశాము. మా ప్రకటించని పాపముల సంఖ్య అసంఖ్యాకము. మాకు మోక్షము లేదు. మేమెంతకాలము నరకమనుభవించవలెనో! మాకెపుడు ఉద్ధరణ, కళ్యాణము చేకూరుతుంది? సన్మార్గమువైపు పయనించు దృఢప్రతిజ్ఞ చేసుకొనిన తక్షణమే వారి పురాతన పాపపంకిలపు మురికి వస్త్రపు ఆచ్ఛాదన తొలగిపోతుంది. ఆ వస్త్రములోనున్న కీటకములుగూడా దానితోపాటు నశిస్తాయి.

పాపవాసనలను పరిత్యజించుట, స్వచ్ఛమైన హృదయంతో ప్రాయశ్చిత్తమొనరించుకొనుట వలన లోగడ చేసిన పాపములవలన ప్రాప్తించే దుష్ఫలముల విముక్తి లభిస్తుంది. కేవలము యీ జన్మకోసము మనకు సంప్రాప్తించవలసిన పరిపక్వ కర్మఫలమునుమాత్రము యే రూపములోనైనా అనుభవింపవలసినదే. దీనికి భిన్నంగా ప్రాచీనకాలంలోగాని

ప్రస్తుతకాలంలోగాని, ప్రస్తుతము ప్రారబ్ధముగా మారిన కర్మలు, వాటి సంచిత సమూహము నశింపగలవు. ఈ జన్మలో దుఃఖకారకములుగా భోగ్యదాయకమైనవిగూడా తేలికగా మారుట జరుగవచ్చు. అవి కష్టమును కలిగించి సహజంగా శాంతిస్తాయి.

గడచిన జీవితంలో అధికాంశమునకు మార్గగామియై యుండి, అత్యధికకాలము నిరర్ధకముగా జీవించిన మనుష్యుడు కేవలము విచారించుటవలన కించిత్ప్రయోజనము వుండదు. జీవితములో మిగిలివున్న భాగముకూడా తక్కువ శక్తి ప్రయోజనము కలదికాదు. అనగా వున్న కొద్ది సమయముగూడా ఎక్కువ మహత్వపూర్ణమైనది. పరీక్షిన్మహారాజుకు మృత్యువునకు ముందు సప్తాహదినములు ఆత్మకళ్యాణార్థము మిగిలినాయి. ఆ కొద్ది కాలములోనే పరీక్షిత్తు సద్వినియోగించుకుని అభీష్టాన్ని నెరవేర్చుకొన్నాడు. మోక్షమును పొందినాడు. సూరదాసు తన జీవితమంతా వ్యభిచరించు అలవాట్లనుండి విముక్తి చెందలేక చివరకు తన కండ్లను పెరికివేసుకొనవలసివచ్చినది. తులసీదాసు కామాతురతను నిగ్రహించుకొనలేక మామగారి గృహమునకు వెళ్ళి, గోడపై వ్రేలాడుచున్న పామును పట్టుకొని తన భార్యను చేరుట లోకప్రసిద్ధమైయున్నది. ఈవిధంగా అసంఖ్యాకమైన వ్యక్తులు తమ జీవితములో అధికభాగము యితఋ కార్యములకై వినియోగించి, చివరకు సత్పథగాములై కొలది కాలములోనే యోగ్యులై, మహాత్ములై సద్గతి పొందుటకు అధికారులైరి.

ఇంతవఋకూ దుర్మార్గంగా విచిత్రంగా నున్నటువంటి వ్యక్తులు నిజంగా శక్తిసంపన్నులే. కానీ వారి శక్తి కుమార్గంలో నున్నది. వారే కనుక తమ శక్తి సన్మార్గమువైపు మరలించితే, అచటగూడా ఆశ్చర్యజనక విజయమును సాధింపగలుగుతారు. గాడిద సంవత్సరమంతా మోసే బరువును ఏనుగు ఒక్కరోజులో మోయగలదు. ఆత్మోన్నతికూడా యొక పురుషార్థము, స్నాయువులలో బలమున్నవారు, మనస్సులో అణచివేయలేని సాహసమున్నవారు, అమిత ఉత్సాహవంతు లీ గమ్యాన్ని శీఘ్రంగా చేరుకుంటారు. వీరే పురుషార్థులు. వీరి రక్తనాళములలో బలము, అద్భుతమైన మనశ్శక్తి గలిగి మిక్కిలి ఉత్సాహవంతులుగా వుంటారు.

గడచిన జీవితంలో వక్రమార్గంలో పయనించినవారు టపాకాయలమాదిరి గడబిడ గావిస్తారు. వారు పొరపాటున భ్రష్టులైనమాట నిశ్చయము. కానీ యీ చెడు ప్రక్రియ ద్వారాగూడా వారు తమ చైతన్యాన్ని, బుద్ధిబలాన్ని, జాగరూకతను, క్రియాశీలతను వృద్ధిచేసుకుంటారు. ఈ అభివృద్ధి శక్తివంతమైన మూలధనము. భ్రష్టుడైనందున చేసిన పాపము దుఃఖహేతువు. పశ్చాత్తాపపడవలసినట్టిది. సంతోషకరమైన విషయమేమనగా కంటకమయము, కఠినశిలామయము, రక్తమయమైన మార్గమున నడుస్తు ఎగుడుదిగుడు మార్గములో దుఃఖముతో గడుపుతూ గూడా చివరకు లక్ష్యమును చేరుతారు. ప్రస్తుతము జాగ్రత్తతో వ్యవహరిస్తూ, సవ్యమైన రాజమార్గములో సత్త్వగుణప్రధానంగా పయనిస్తూ పురోగమించేటపుడు పురాకృతకర్మలుగూడా సహాయపడతాయి.

పాపమునకు, దోషమునకు ప్రధాన కారణము బహుశః మానసిక భావనలచే సంభవించుతుంది. గర్హనీయ భావనల వలన మనుష్యుని బుద్ధి భ్రష్టమౌతుంది. దానివలన వ్యక్తి అకార్యములకు పాల్పడుతాడు. కావున మానవుడు సద్విచారములద్వారా కువిచారములను తొలగించుకొనుటయే పాపములనుండి విముక్తి పొందుటకు ముఖ్యమైన మార్గము. మనోభూమి నిర్మలంగా నున్నప్పుడు హానికరమైన మనోప్రవృత్తులు ఉత్పన్నముగావు. మానవుడు

చెడుమార్గమునుండి మరలి సన్మార్గమువైపు పయనించగలడు. దీనికి స్వాధ్యాయము, సత్సంగము మొదలైన ప్రతిభావంతమైన సాధనములు చెప్పబడినవి.

గాయత్రీమంత్రము సద్బుద్ధి ప్రేరణదాయకమైనందున స్వాధ్యాయమునకు ప్రముఖ అంగముగా చెప్పవచ్చు. దానివల్ల మనస్సు శ్రేష్ఠ విచారములవైపు మరలుతుంది. అపుడు దుర్బుద్ధి స్వయంగా తనంతట తాను అంతరిస్తుంది.

ఏదైనా భావనను యేకాగ్రతతో భావిస్తే గొప్ప శక్తి కలుగుతుంది. మనము శుభకరమైన ఆలోచనలపై మనస్సును, బుద్ధిని కేంద్రీకరిస్తే పాపయుక్త భావనలు క్షీణించుట సహజము, స్వాభావికము.

పురాకృతపాపములు నశిస్తాయి. చెడుమార్గము ననుసరించినందుకు తగిలిన గాయములు స్వల్ప దుఃఖములను కలిగించి మాయమౌతాయి. వాటినిగురించి నిరాశతో చింతించవలసిన పనిలేదు. కేవలము తమ అభిరుచులను, కార్యకలాపములను కూర్చుకోవలెను. ఈ పరివర్తనమే శీఘ్రంగా సవ్యమార్గంలో ప్రగతి చేకూర్చుతుంది. దూరదర్శన తత్త్వముల ప్రకారము దుర్మార్గము ననుసరించి వానిలో పరివర్తన చెందినపుడు ఆశ్చర్యజనకమైన రీతిలో సన్మార్గంలో ప్రగతినిసాధించి స్వల్పకాలములోనే నిజమైన మహాత్ములవుతారు. వారు బద్మాషులుగా యే కారణముల వలన ప్రవర్తించారో అదే విశేషకారణమువలన సాధువులుగా మారుతారు. గాయత్రీని ఆశ్రయించినందున దుర్మార్గులు, క్రూరులు, చెడ్డవారు, స్త్రీపురుషులలో ఎవరైనప్పటికి సన్మార్గులై పాపరహితులవుతారు.

ఆత్మశక్తియొక్క అపరిమితమైన భాండాగారము

గాయత్రీ నిత్యోపాసనకు యోగ్యమైనది. త్రికాలసంధ్యలలో ప్రాతః మధ్యాహ్న సాయంకాలములలో మూడుసార్లు నిత్యోపాసన గావించుట ఆవశ్యకమని శాస్త్రములలో చెప్పబడినది. అధికంగా జపము, పూజ, చింతన, మననము గావించగలిగితే ఇతోధికంగా ఫలముంటుంది. ఏలనన అధికస్య అధికం ఫలమ్.

కానీ యేదైనా విశేష ప్రయోజనము నాశించినపుడు విశేష శక్తి సంచయమవసరమవుతుంది. దానికొఱకై విశేష క్రియాకలాపము లవసరము. ఈ క్రియను అనుష్ఠానము అనే పేరుతో వ్యవహరిస్తారు. పరదేశయాత్ర చేయవలసినపుడు మార్గంలో అవసరానికి భోజనసామగ్రి, ఖర్చులకోసము కొంచెము ధనము తీసుకెళ్ళడము ఆవశ్యకము. అవసరమైనవి లేనపుడు యాత్ర కష్టతరమవుతుంది. అనుష్ఠానము గూడా ఒక ప్రత్యేకమైన మార్గ యాత్రా ఖర్చు. అనుష్ఠానము వలన మౌలికశక్తి సంచయము జరుగుతుంది. అనగా యాత్రకు కావలసిన మూలధనము సమకూరుతుంది. ఈ ధనాన్ని తమ భౌతిక, ఆధ్యాత్మిక కార్యముల కుపయోగించిన జీవనయాత్ర సరళమౌతుంది.

సింహము- లేడిపై ఆక్రమణ జరిపేముందు, పిల్లి - ఎలుకపై దూకేముందు, కొంగ -చేపను కబళించేముందు ఒక క్షణము స్తబ్ధత వహిస్తుంది. తరువాత శ్వాసను స్తంభించి కొంచెము వెనుకకు జరిగి తనలో దాగివున్న శక్తులను జాగృతపఱచుకొని, తేజోవంతము గావించుకొని తాము వేటాడు జంతువునకు తెలియకుండా దుముకుతాయి. అపుడు మనోవాంఛితము వాటికి లభిస్తుంది. పైకి ఎగిరేటపుడుగాని, దూరం దూకేటపుడుగాని, ఆటగాండ్రు కొంచెము ఆగుతారు. వెనుకకు వస్తారు. తరువాత దుముకుతారు. కుస్తీపట్టేవారుగూడ కొంచెమిలాగే ప్రవర్తిస్తారు. అనుష్ఠానముద్వారా యీ కార్యము ఆధ్యాత్మిక ఆధారంపై జరుగుతుంది. సంభవించిన ఆపదను దాటుటకుగాని, ఏదైనా ప్రత్యేక లబ్ధిని పొందుటకుగాని అనుష్ఠాన మవసరము.

బిడ్డ రోజంతా 'అమ్మా, అమ్మా' అని పిలుస్తాడు. తల్లిగూడా 'నాన్నా, నా తండ్రీ' అంటూ జవాబిస్తుంది. ఈ తల్లిబిడ్డల ప్రేమ రోజంతా జరుగుతూనేవుంటుంది. కానీ యేదైనా విశేషావసరము గలిగినపుడు కష్టము లొచ్చినపుడు దుఃఖము సంభవించినపుడు భయము కలిగినపుడు తక్షణ సహాయమవసరమైనపుడు, బాలుడు విశేషబలంతో విశేషస్వరంతో తన తల్లిని పిలుస్తాడు. ఆ పిలుపులోని ప్రత్యేకతను గుర్తించి తల్లి తన యితఱ పనులను వదలి కుమారునివద్దకు పరుగెత్తుకుని వస్తుంది. తన సహాయాన్నందిస్తుంది. అనుష్ఠానపు పిలుపుగూడా అటువంటిదే. దానికి ప్రత్యేక బలమున్నది. విశేషమైన ఆకర్షణ వున్నది. ఆకర్షణ వలన గాయత్రీ శక్తి గొప్పదైన రూపంలో సాధకుని సమీపంలో ప్రకటితమవుతుంది.

ప్రాపంచిక ప్రయత్నము ఫలించనపుడు, ఆపదనివారణకు మార్గము కానరానపుడు, నలువైపులా అంధకారము ఆవరించినపుడు, పరిస్థితులు రోజురోజుకు విషమిస్తున్నప్పుడు, సవ్యంగా చేసిన పని అపసవ్యంగా మారుతున్నపుడు, స్వభావసిద్ధంగా మనుష్యుని కాళ్ళుచేతులు నిర్వీర్యమౌతాయి. చింతాగ్రస్తుడు ఉద్విగ్న మనస్కుడైన మానవునికి బుద్ధి సరిగా పనిచేయదు. వలలో చిక్కిన పావురము వలె ప్రయత్నించినకొలది బంధము యెక్కువగా బిగిస్తుంది. ఆ అవసరంలో దీనునకు దైవనామము బలమిస్తుంది. గజేంద్రుడు, ద్రౌపది, నరసీ, ప్రహ్లాదుడు మొదలైనవారంతో ఆ బలాన్నే ఆశ్రయింపవలసివచ్చింది. పురుష ప్రయత్నము పనిచేయనపుడు దైవసహాయము లభించిన వెంటనే పరిస్థితంతా మారుట గమనించవచ్చు. విపత్తుల రాత్రి ఘోర అంధకారమును చీల్చుకొని మెఱుపు కనిపిస్తుంది. ఆ మెఱుపు కాంతిలో మార్గము గోచరిస్తుంది. అనుష్ఠానపు ఆ ప్రక్రియయే నిస్పృహతో ఓడిపోయినపుడు దేవతల సింహాసనము గోచరిస్తుంది. అనుష్ఠాన విస్ఫోటము హృదయాకాశంలో ప్రకాశరూపం వలె గోచరించి, తద్వారా విపత్తిగ్రస్తునకు, కష్టములను గడచుటకు మార్గము గోచరిస్తుంది.

ప్రాపంచిక కష్టములు, మానసికాందోళనలు, ఆంతరంగిక ఉద్వేగములలో గాయత్రీ అనుష్ఠానము వలన అసాధారణ సహాయము లభిస్తుంది. బంగారుకలశంలో సువర్ణనాణెములను నింపి గాయత్రీదేవి ప్రసాదించదు అనుట నిజమేగాని గాయత్రీ ప్రభావంతో మనోభూమిలో మౌలిక పరివర్తన కలుగుతుంది. అందువలన కష్టములు తేలికవుతాయి అన్నదిగూడ నిజమే.

ఉపాసకునిలో బుద్ధి, ప్రతిభ సరియైన ఆలోచనావిధానము దూరదర్శన జ్ఞానము, తీవ్రశక్తితో ఉద్భవిస్తాయి. వీటివలన కష్టములను నివారించుటకు తగిన ఉపాయము గోచరించి రామబాణము వలె ఫలప్రదమౌతుంది. భ్రాంతి మనస్కుడు, అసంగతము, అసంభవము, అనావశ్యక ఆలోచన విధానములతోను, కోర్కెలతోను, గౌరవముల ఊబిలో కూరుకుపోతాడు. వీటివలన వ్యక్తి అకారణంగా దుఃఖితుడౌతాడు. గాయత్రీ సాధనవలన మస్తిష్కంలో నిర్మలత్వము సంభవించి అత్యంత ఆవశ్యకమైనవిగా తలపోసినవి, అనావశ్యము, అనుపయుక్తమైనవని భావన కలుగుతుంది. వాటినుండి మనస్సు మరలుతుంది. ఈ మానసిక పరివర్తన అత్యంత ఆనందాన్ని సిద్ధింపజేస్తుంది. పూర్వపు కల్పిత భ్రాంతకోర్కెలు తీరినప్పటికీ సంభవించని సుఖము ప్రాప్తిస్తుంది. అనుష్ఠానము జ్ఞాత అజ్ఞాత పరివర్తన గలిగి దుఃఖ కారణ చింతాగ్రస్థ మానవునకు కొద్దికాలంలోనే సుఖశాంతులు, స్వర్గీయ జీవనవిధానాన్ని గడిపే స్థితి సంభవిస్తుంది.

లక్షా ఇరువది యైదు వేల జపాన్ని అనుష్ఠాన మంటారు. ప్రతి వస్తువూ పరిపక్వ మవడానికి కొన్ని అవసరము. పప్పు, కూర, ఇటుక, గాజు పక్వమవడానికి నియమిత శ్రేణిలో వేడి అవసరము. వృక్షముల పైన పండ్లు నియమితకాలంలో పండుతాయి. గ్రుడ్డు పరిపక్వమైన తరువాత పగులుతుంది. గర్భంలోనున్న బాలుడు తన పూర్తి సమయాన్ని వినియోగించుకొంటాడు. తరువాత జన్మిస్తాడు. అసంపూర్ణ క్రియ వలన నియమిత అవధికన్నా ముందు విక్షేపముత్పన్నమైతే సఫలతకు అవకాశముండదు. అటులనే అనుష్ఠానమునకు అవధి, పద్ధతి లక్షాయిరువది యైదు వేలు జపము. ఇది పూర్తియైన వెంటనే సత్పరిణామము కలుగుతుంది. పరిపక్వమైన సాధన మధురమైన ఫలమును యిస్తుంది.

అనుష్ఠాన మొనరించవలసిన పద్ధతి

అనుష్ఠానము యే నెలలోనైనా చేయవచ్చు. పంచమి, ఏకాదశి, పూర్ణిమ తిథులు శుభప్రదము. పంచమి - దుర్గతత్త్వమునకు, ఏకాదశి -సరస్వతీతత్త్వమునకు, పూర్ణిమ - లక్ష్మీతత్త్వమునకు ప్రధానమైనవి. కృష్ణపక్ష మనిగాని, శుక్లపక్షమనిగాని ప్రత్యేక నిషేధ మేమి లేదు. ఏలనన శుక్లపక్షము కృష్ణపక్షముకన్నా శుభమైనది గావున.

అనుష్ఠానము ఆరంభములో గాయత్రీ ఆవాహనము ః చివరలో విసర్జనము చేయవలెను. ఇందులో ప్రతిష్ఠాభావన, నివేదన ప్రధానము. శ్రద్ధాపూర్వకంగా భగవతీ జగజ్జనని భక్తవాత్సల్య గాయత్రిని ప్రతిష్ఠించుటకు అనుజ్ఞ కోరవలెను. ఇది సంస్కృతములోగాని, మాతృభాషలోగాని కోరవలెను. మన ప్రార్థనను స్వీకరించి గాయత్రీమాత దయతో వచ్చినదని విశ్వసించవలెను. విసర్జన సమయములో ఆదిశక్తి, భయహారిణి, శక్తిదాయినీ, తరుణతారిణి, మాతృదేవీ తమరు దయచేసి వెళ్ళండి అని ప్రార్థించవలెను. ఈ భావనను సంస్కృతములో గాని, తమ మాతృభాషలోగాని ఉచ్చరించవలెను. దీనితోపాటు దేవి వదలివెళ్ళదని పూర్తివిశ్వాసంతో భావించవలెను. ప్రార్థన స్వీకరించి విసర్జన జరిగినట్లు భావించలెను.

అనేక గ్రంథములలో, జపములో పదవవంతు హవనము చేయుటకు, హవనములో పదవవంతు తర్పణమునకు, తర్పణములో పదవవంతు బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెనని వున్నది. ఈ నియమము తంత్రోక్తరీతిలో జరుపబడే దక్షిణమార్గ సాధనలో చెప్పబడుతున్నది. దీని ప్రకారము తర్పణ ఆవశ్యకత లేదు. అనుష్ఠాన అంతంలో 108 ఆహుతుల హవనము కనీసపు అవసరము. అధికంగా జేయుట సామర్థ్యాన్నిబట్టి అవకాశాన్నిబట్టి చేయవలెను. కనీసము త్రిపదగాయత్రీకొఱకు కనీసము ముగ్గురు బ్రాహ్మణులకు భోజనము గావించవలెను. దానము కొరకు ప్రత్యేక పద్ధతి లేదు. సాధకుని శ్రద్ధ, భక్తి ననుసరించి దానపు ఆవశ్యకత వుంటుంది.

ఏదైనా చిన్న నాలుగుకాళ్ళ పీటగాని, వేదికగాని, ఆసనముపైగాని పూలతో సుందరమైన ఆసన మేర్పరచి దానిపై గాయత్రీదేవిని ప్రతిష్ఠించినటుల భావించవలెను. సాకారోపాసనా సమర్థులు భగవతీ గాయత్రీయొక్క సుందర చిత్రమునుగాని లేక ప్రతిమనుగాని పువ్వులపై స్థాపించవచ్చు. నిరాకారోపాసకుడు, నిరాకార భగవతీశక్తి పూజకు ప్రత్యేక తెల్లటి లింగమును ప్రతిష్ఠించినటుల భావించవలెను. వేర్వేరు వ్యక్తులు ధూపపు వత్తినిగాని, దీపపు అగ్నిశిఖనుగాని గాయత్రీ చైతన్యజ్వాలగా దర్శిస్తారు. ఆ దీపాన్ని లేక ధూపవత్తిని పూలపై ప్రతిష్ఠించి తమ ఆరాధ్యశక్తిని ఆవాహనము చేసికొన్న అనుభవాన్ని పొందుతారు. విసర్జన సమయములో ప్రతిమను తీసి పయనించునట్లుజేసి జలాశయంలోగాని, పవిత్రస్థానంలోగాని విసర్జించవలెను. సగము కాలిన వత్తిని, దూదివత్తిని ఆర్పి పూలతోపాటు విసర్జించవలెను. మరుసటిరోజు రెండవవత్తి నుపయోగించవలెను. కాలిన వత్తి నుపయోగించరాదు.

గాయత్రీ పూజకు ఐదు వస్తువులు ప్రథాన రూపంతో మంగళకరమైనవిగా పరిగణింపబడుతున్నాయి. పూజా పదార్థములలో అవి ప్రాణములు. అవి గాయత్రీకి అనుకూలములు. అందువలన పుష్పాసనముపై ప్రతిష్ఠింపబడిన గాయత్రీదేవి సమ్ముఖంలో ధూపము వెలిగించుట, దీపము నుంచుట, నైవేద్యము పెట్టుట, చందనము పూయుట, అక్షతలు జల్లుట చేయవలెను. దీపాన్ని గాని, ధూపవత్తినిగాని గాయత్రీగా స్థాపించినపుడు వాటి స్థానంలో జలమును సమర్పించి ఐదు పూజా పదార్థములను సమర్పించవలెను.

పైన వర్ణించిన విధితో ప్రాతఃకాలము తూర్పుముఖంగా పరిశుభ్రమైన భూమిపై స్నానమొనరించి కుశాసనముపై కూర్చోవలెను. జలపాత్రను సమీపమందుంచుకొనవలెను. ధూప దీపములు జపము చేయునపుడు జ్వలిస్తూవుండవలెను. వత్తి ఆరిపోతే దానిని విసర్జించి వేఱొకదాని నుంచవలెను. అటులనే ధూపవత్తిని గూడా క్రొత్తదానిని వెలిగించవలెను. దీపముపైబడే నేతిని తొలగించవలెను.

పుష్పాసనముపై గాయత్రీదేవిని ప్రతిష్ఠించిన తరువాత పూజానంతరము జపము ప్రారంభించవలెను. నిత్యము ఇదే క్రమమును పాటించవలెను. ప్రతిష్ఠ, పూజ అనుష్ఠాన కాలంలో నిత్యము జరుగవలెను. స్థిరభావనతో నుండవలెను.

మనస్సు నలుదిక్కులకు పరుగిడరాదు. పూర్వము చెప్పిన ప్రకారము గాయత్రీదేవిని ధ్యానించుతూ జపము చేయవలెను. ధ్యానంలో గాయత్రీదేవి ముఖంలోని ప్రత్యేక అంగమును భావించినయెడల మనస్సు స్థిరమై వుంటుంది. నలుదిక్కుల పోరాదు, పారిపోయే మనస్సును నిగ్రహించి ఆపి, మఱల ధ్యానభావన పైకి తీసుకురావలెను. ఈ పని వలన యేకాగ్రత రోజురోజుకు వృద్ధిచెందుతుంది.

లక్షా ఇరువదియైదు వేల జపము 40 రోజులలో పూర్తిచేసే క్రమము పూర్వకాలము నుండి ఆచరణలో నున్నది. ప్రతి నిర్బలుడు తక్కువ సమయము సాధనకొఱకై వినియోగించగల సాధకుడు. దీనిని రెండు మాసముల గడువులో చేయవచ్చును. ప్రతిదినము జపసంఖ్య సమానంగా నుండవలెను. ఒకరోజు అధికము, మఱొకదినము తక్కువగా జపించడము సరియైనది గాదు.

40 రోజులలో అనుష్ఠానము పూర్తి కావలెనంటే 1,25,000÷40=3,125 మంత్రములు నిత్యము జపించవలెను. మాలలో 108 పూసలుంటాయి. ఈ మంత్రములకు 3,125÷108=29. ఈవిధంగా 29 మాలలు నిత్యము జపించవలెను. ఇట్లుగాక రెండు మాసములలో జపించితే 1,25,00÷60=2080. ప్రతిదినమూ ఇంత జపించాలి. దీనికి మాలలు 2080÷108=20 మాలలు. ప్రతిదినము మాలలు లెక్కించడానికి సీమసున్నపు వుండలను 20 గాని 30 గాని గంగాజలముతో శుభ్రపఱచుకొని ఒకచోట నుంచుకొని మాల పూర్తియైన వెంటనే ఒక వుండను రెండవచోటుకి మార్చుతు, అన్నీ పూర్తియైన తరువాత జపము పూర్తియైనట్లు భావించవలెను. అపుడు జపసంఖ్యలో పొరపాటు వుండదు.

గాయత్రీ ఆహ్వానము : **ఆయాతువరదే దేవి అక్షరేబ్రహ్మావాదినీ।**

గాయత్రీ ఛన్దసాం మాతా బ్రహ్మయోనిర్నమోఽస్తుతే ॥

గాయత్రీ విసర్జనమంత్రము : **ఉత్తమే శిఖరేదేవి భూమ్యాం పర్వతమూర్ధనీ।**

బ్రాహ్మణే భ్యోభ్యనుజ్ఞాతా గచ్ఛదేవి యదాసుఖమ్ ॥

అనుష్ఠానము చివఱ హవనము చేయవలయును. తదనంతరము శక్త్యానుసారము దానము, బ్రహ్మభోజనము గావించవలెను. వాస్తవంగా బ్రాహ్మణులైనవారికే బ్రహ్మభోజనము చేయించవలెను. బ్రహ్మపరాయణుడై వుండవలెను. కుపాత్రదానంగాని, భోజనంగాని నిష్ఫలము. కావున దగ్గఱగా నున్నట్టిగాని, దూరంగా నున్నట్టిగాని బ్రాహ్మణులకు భోజనము చేయించి తృప్తిపఱచవలెను.

నిత్యశుభ గాయత్రి యజ్ఞము(హవనము)

గాయత్రి అనుష్ఠానానంతరముగాని లేక యేదైనా శుభకార్యము కొఱకుగాని గాయత్రి యజ్ఞ మొనరించవలెను. వేదమాత సరళత, సౌమ్యత, వాత్సల్యత, సుశీలత యెటుల ప్రసిద్ధమో, గాయత్రీ హవనముగూడ నట్లే ప్రసిద్ధము. సుగమము. దీనికొఱకు నీటిలో వున్న చేపనుగాని, బలసిన పొట్టేలునుగాని తేనవసరము లేదు. కర్మకాండ పండితుల నాశ్రయించ నవసరము లేదు. మామూలు పరిజ్ఞానముతో దీన్ని భారీగా చేయవచ్చు.

యజ్ఞకుండము త్రవ్విగాని, వేదిక నేర్పరచిగాని రెండువిధాల చేయవచ్చు. నిష్కామబుద్ధితో ఆత్మకళ్యాణముకొఱకు కుండమును త్రవ్విచేయుట సరియైనది. మనోకామనను సిద్ధింపజేయుటకొఱకు 24 '' చదరపు వేదికను తయారు చేసుకొనవలెను. కుండము త్రవ్వినపుడు లోతుకూడ 24 అంగుళము లుండవలెను మరియు వంకరగా కుండము అడుగునకు వెళ్ళేటప్పటికి 6 అంగుళముల పొడవు, 6 అంగుళముల వెడల్పు వుండవలెను. వేదిక తయారుచేసేటపుడు సారములేని మట్టితో 4 అంగుళముల ఎత్తులో 24 '' × 24 అంగుళముల వెడల్పులు గలదానిని తయారుచేయవలెను. హవనము చేయడానికి ముందు రెండు గంటలకు పూర్వము కేవలము నీటితో ఆ వేదిక గాని, యజ్ఞకుండముగాని సమతలంగా వుండేటట్లు అలకవలెను. ఎత్తుపల్లములుండకుండ చూడవలెను. కుండము లేక వేదిక నుండి నాలుగంగుళముల దూరములో చిన్ని కాలువను, రెండంగుళముల వెడల్పు, రెండంగుళముల లోతున త్రవ్వి దానిని నీటితో నింపవలెను. కుండము లేక వేదిక దగ్గఱలో గోధుమపిండి, పసుపు కుంకుమలు మొదలైన మంగళకర పదార్థములచే చిత్రమైన ముగ్గులువేసి తమ కళాప్రియత్వమును పరిచయము చేసికొనవలయును. యజ్ఞస్థలానికి తన శక్తి ననుసరించి మండపమును పుష్ప పల్లవములతో సుందరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దవలెను.

యజ్ఞకుండపు లేక వేదిక ఈశాన్యదిక్కున కలశస్థాపన చేయవలెను. మట్టితోగాని, ఉత్తమలోహముతోగాని తయారుచేయబడిన కలశమును పవిత్రజలముతో నింపి, దానిలో మామిడి ఆకులను వుంచవలెను. దానిపై మూకుడుంచి అందులో బియ్యము, గోధుమపిండి, మృష్టాన్నము లేక యితఱ మంగళద్రవ్యము లుంచవలెను. కలశపు నలువైపుల పసుపుతో స్వస్తిక్ వేయవలెను. కలశమునకు సమీపంలో చిన్న వేదికపైన పుష్పములను, గాయత్రీమాత ప్రతిమను పూజాసామాగ్రిని వుంచవలెను.

వేదికగాని, కుండముయొక్క గాని మూడు దిక్కుల యందు ఆసనములను పఱచి యిష్ట మిత్రులతో, బంధువులతో గూడి కూర్చొనవలెను. గాయత్రీదేవిని, కలశమును స్థాపించిన తూర్పుదిశయందు శ్రేష్ఠబ్రాహ్మణునిగాని లేక తమ వయోవృద్ధుని ఆహ్వానించి సత్కరించి ఉపనిష్ఠుని గావించవలెను. ఆత డీ యజ్ఞమునకు బ్రహ్మ. యజమానుడు

బ్రహ్మ కుడిచేతికి సూత్రబంధన చేయవలెను. కుంకుమ లేక గంథముతో వారికి తిలకము దిద్దవలెను. పాదములను స్పృశించవలెను. తరువాత బ్రహ్మ అచటనున్నవారందరిని తన సమీపమునకు రావించుకొని సూత్రము కట్టి, నుదుట కుంకుమబొట్టు పెట్టాలి. వారి శిరస్సులపై అక్షతలుంచి, ఆశీర్వచన మంగళవాక్యములు పలుకవలెను.

యజమానుడు పడమర కూర్చొనవలెను. అతని ముఖము తూర్పుకుతిరిగి వుండవలెను. హవనసామగ్రి, ఘృతము అధికంగా వుంటే అనేక పాత్రలలోనికి విభజించి పెక్కుమంది యజ్ఞము చేయవచ్చు. సామాగ్రిని తనవద్ద వుంచుకొనవలెను. యజమాని భార్య నేతిపాత్రను దగ్గఱుంచుకొని చంచాతో అవసరమొచ్చినపుడు ఉపయోగించవలెను. భార్యలేపుడు, స్నేహితుడుగాని, సోదరుడుగాని నేతిపాత్రను ముందుంచుకొనవచ్చు.

సమిధలు 7 రకములుగా వుంటాయి. అన్నీ దొరకనపుడు దొరికినన్ని రకములు వుపయోగించవచ్చు. హవనసామాగ్రిని త్రిగుణాత్మకసాధనలలో ప్రథమమైనదిగా పేర్కొనబడినది. ఆ త్రిగుణములను స్వీకరించవలెను. కానీ ఆధ్యాత్మికసాధనలో సత్త్వగుణ ప్రధాన సామాగ్రిని సగము, రజస్తమోగుణముల వస్తుసంచయము పావు, పావు చొప్పున సమకూర్చుకొనవలెను. భౌతికకోర్కెను పొందుటకై హవనమొనరించేటపుడు రజోగుణ సామాగ్రి సగము సత్త్వ, తమో గుణ సామాగ్రి పావు, పావు తీసుకొనవలెను.

సామాగ్రిని శుభ్రపఱచుకొని ఎండలో నుంచి చెఱగి వుంచుకొనవలెను. సామాగ్రిలో యేదైనా వస్తువు దొరకనపుడు తక్కువ పరిమాణంలో దొరికినపుడు, అదే గుణము గలిగిన వేఱొక పదార్థమును వుపయోగించవచ్చు.

హవనమొనర్చు వ్యక్తులు స్నానమొనరించవలెను. హాజరైనవ్యక్తులుగూడా దర్శించుటకు వచ్చినయెడల కొంచెము దూరంగా కూర్చుండవలెను.

హవనము ప్రారంభించినవెంటనే యజమాని బ్రహ్మ సంధ్యారంభంలో చేయవలసిన పవిత్రీకరణ, ఆచమనము, శిఖాబంధనము, అఘమర్షణము, న్యాసములను చేయవలెను. తదుపరి వేదికపైగాని, కుండముపైగాని సమిధలను కర్పూరము సహాయంతో వెలిగించి, గాయత్రీ మంత్రోచ్చారణముతో అగ్నిని ప్రజ్వలింపజేయవలెను. అందఱూ కలసి మంత్రము చెప్పవలెను. చివరకు స్వాహా అంటూ నేతిని సామాగ్రితోపాటు హవనము చేసేవారు హవనము గావించవలెను. ఆహుతి చివరలో చంచాలో మిగిలిన నేతిని తనవద్ద నున్న జలపాత్రలో ఒక్కొక్క బిందువు చొప్పున నుంచవలెను. ఆదిశక్తి ' గాయత్రీ ఇదన్న మమ ' అని వుచ్చరించవలెను. హవనంలో మధురస్వరంతో మంత్రోచ్చారణ చేయవలెను. ఉదాత్త, అనుదాత్త స్వరతానుసారంగా సామూహిక సమ్మేళనంలో మంత్రోచ్చారణ లేకపోయినా దోషము కాదని శాస్త్రకారులు చెప్పియున్నారు.

ఆహుతులు కనీసము 108 జరుగవలెను. అధికంగా రెట్టింపుగాని, రెండురెట్లుగాని, మూడురెట్లుగాని, ఎన్నిరెట్లయినా చేయవచ్చు. సామాగ్రి కనీసము ప్రతి ఆహుతికి 32 గురివిందగింజల ప్రమాణము అనగా 6 చటాకులు, నేయి ప్రతి ఆహుతికి 2 చటాకులు కావలెను. సామర్థ్యాన్నిబట్టి అధికంగా పెంచవచ్చు. బ్రహ్మమాలతో కూర్చుని ఆహుతులను లెక్కిస్తూ వుండవలెను. మాల పూర్తియైనవెంటనే పూర్తిగావించవలెను. ఆరోజు వండిన మృష్టాన్నములో ఉప్పు లేని మధుర పదార్థము లుండవలెను. ఉప్పు, కారం కలసిన శాకములు, ఊరగాయలు, పుల్లటివి హోమమునకు నిషేధములు. ఈ భోజనమును కొంచెము తీసికొని హవనములో పాల్గొనిన వారందరూ హవనములోనే అర్పించవలెను.

చివరలో కొబ్బరికురిడీని విడదీసి యజ్ఞ శేషఘృతముతో నింపి, నిలబడి పూర్ణాహుతి రూపంలో అగ్నికి సమర్పించవలెను. మిగిలిన సామాగ్రిని గూడ యజ్ఞకుండాగ్నికి సమర్పించవలెను.

తరువాత అందఱూ నిలబడి యజ్ఞమునకు ప్రదక్షిణము గావించవలెను. ఇదన్నమమ నీటిలో తేలుతున్న నేతిని వ్రేలితో తీసికొని కనుఱెప్పలపై నుంచుకొనవలెను. ఆరిన హవనభస్మమును నుదుట ధరించవలెను. భజనచేసి కీర్తించవలెను. ప్రసాదాన్ని స్వీకరించి నమస్కరించి వెళ్ళవలెను. రెండవరోజు యజ్ఞసామాగ్రిని పవిత్రస్థలములో విసర్జించవలెను. ఇది గాయత్రీ అనుష్ఠానంతరమేగాక, ఇతఱ సమస్త శుభకార్యముల యందుగూడా అనుసరించవలెను.

ప్రయోజనాన్నిబట్టి సాధన పాటించవలసివస్తుంది. యుద్ధానికి కావలసిన సామాగ్రిని చేకూర్చుకొనేటపుడు యుద్ధపద్ధతినిబట్టి వివిధరకముల సామానులను జమచేసుకొనవలెను. వంటవాడు వంటయింటికి కావలసిన వస్తువులను కూర్చుకోవలెను. కళాకారుడు తన కవసరమైన పనిముట్లను సంపాదించుకోవలెను. వ్యాయామము చేయడానికి, కార్యాలయమున కెళ్ళడానికి అవసరమైన వస్తువులలో తేడా వున్నది. సాధనకు అనుగుణ్యంగా సరియైన తత్త్వము సరియైన గుణములు గలిగిన సామాగ్రి అవసరంగా వుపయోగించవలెను. ప్రప్రథమంగా మన సాధనోద్దేశ్యమేమో పరిశీలించవలెను. సత్త్వ,రజ, తమోగుణములలోయే తత్త్వమును వృద్ధిపొందించుటకో, సాధన ననుసరించి, సాధనసామాగ్రిని వుపయోగించవలెను. దీనినిగురించి క్రింద వివరణ పొందుపఱచడమైనది.

సత్త్వగుణము :

మాల : తులసిమాల వస్త్రము : ఖద్దరు ఆసనము - కుశాసనము ముఖము : తూర్పువైపునకుతిరిగి వుండవలెను. పుష్పములు : శ్వేతపుష్పములు దీపము : గోఘృతము పాత్ర : రాగిపాత్ర తిలకము : చందనము

హవనములో నుంచవలసిన సమిధలు : రావి, మఱ్ఱి, మేడి

హవనసామాగ్రి : శ్వేతచందనము, ఉప్పు, చిన్న ఏలకులు, లవంగములు, శంఖపుష్పములు, బ్రహ్మీశతావరీ, వట్టివ్రేళ్ళు, నానిన శనగలు, ఉసిరిగాయలు, ఇన్ద్రజా వంశలోచన, జాపత్రి, తమలపాకులు, రంగునేత్రముగల గురివిందగింజలు, తామరతూళ్ళు, మఱ్ఱివూడలు, కొబ్బరికాయలు, బాదంపప్పు, ద్రాక్ష, బార్లీ, పటికబెల్లము.

రజోగుణము :

మాల : చందనము వస్త్రము : సిల్కువస్త్రము ఆసనము : నూలు ముఖము : ఉత్తరము వైపు తిరిగివుండవలెను

పుష్పములు : తెలుపు దీపమునందు : గేదెనెయ్యి పాత్ర : కంచుపాత్ర తిలకము : కుంకుమ సమిధలు : మామిడికొమ్మలు, సంద్రకొమ్మలు

హవనసామాగ్రి : దేవదారు, పెద్దయాలకులు, కుంకుమపువ్వు, మంచికారము, పునర్నవము, జీవంతి, ఖర్జూరాలు, తాటాకులు, వడ్లు, తుంగ, ఉన్నాబము, మోచరసము, పోపు, చత్రికము, పచ్చిశనగపప్పు, వెన్న, కిస్మిస్‌బియ్యము, పానకము

తమోగుణము :

మాల : రుద్రాక్ష వస్త్రము : ఉన్నివస్త్రము ఆసనము : ఉన్ని ముఖము : పడమరదిక్కువైపు ముఖముండవలెను పుష్పములు : లేత ఎఱుపుగాని లేక ముదురు ఎఱుపు పూలు దీపమునందు : మేక నెయ్యి లేక గొఱ్ఱెనెయ్యి తిలకము : బూడిద పాత్ర : లోహపాత్ర సమిధలు : వేలము, భౌకరము, అడవికాకర

హవనసామాగ్రి : రక్తచందనము, తగరు, జయపరమ, నాగకేరము, రావికొమ్మలు, పకోడి, వడియము, కొమ్ము, నేలవేము, అపమార్గము, దోసతీగె, కులంజనము, ఎలుకరక్తము, మెంతులు, కాకి ఈకలు, భారంగము, చెయ్యిలేని చెయ్య, పిస్తా, ఆక్రోడ్, దీపస్థంభము నువ్వులు, మినుములు, బెల్లము.

గుణానుసారంగా సాధనసామాగ్రి వుపయోగించినందున సాధకుని గుణములు అభివృద్ధి చెందుతాయి. తదనుగుణ్యంగా సఫలతామార్గంలో అధిక సులువు చేకూరుతుంది.

నవదుర్గలో గాయత్రీ సాధన

సంవత్సరములో శరత్, శిశిర, హేమంత, వసంత, గ్రీష్మ, వర్ష ఋతువులనే ఆఱు వున్నాయి. గ్రీష్మ, చలి, వర్షములని మూడుగా అంటారు. కానీ వస్తుతః ఋతువులు రెండుమాత్రమే. అవి గ్రీష్మఋతువు, శీతఋతువు. ఎండాకాలంలో శ్రావణమాసంలో వర్షమొస్తుంది. చలికాలంలో పుష్యమాసంలో వర్షము కుఱుస్తుంది. ఎండాకాలంలోని వర్షము అధిక నీటిని వర్షిస్తుంది. శీతాకాలంలోని వర్షము తక్కువ నీటిని వర్షిస్తుంది. తేడా వున్నప్పటికి రెండు ఋతువులలో వర్షించడానికి ఆస్కారమున్నది. ఈ రెండు ఋతువులు సమ్మేళనమయ్యే సంధికాలమును నవదుర్గ అంటారు.

పగలు రాత్రి కలయిక సమయాన్ని సంధ్యాకాలమంటారు. ఆ కాలము మహత్త్వపూర్ణమైనది. జాగ్రత్తగా వ్యవహరించవలసివుంటుంది. సూర్యోదయ సమయంలో, సూర్యాస్తమయ సమయంలో భుజించుట, నిద్రించుట, మైథున మొనరించుట, యంత్రారంభము గావించుట మొదలైన అనేక కార్యములు వర్జింపబడినవి. ఆ సమయములో ఈశ్వరారాధన, సంధ్యావందనము, ఆత్మసాధన మొదలైనవాటిలో మనస్సు లగ్నము చేయవలెను. ఏలనన ఆసమయములో సూక్ష్మదృష్టితో చేయవలసిన పనులకు అధిక వుపయోగ ముంటుంది. ఆ పనులకు బహుతక్కువ శ్రమతో అధిక ఆశ్చర్యజనక సహాయము లభిస్తుంది. కావున వర్జింపబడిన పనులు ఆ సమయములో హానికారకములు, పుణ్యపర్వములు, ఋతువులలో 9 రోజులు ఋతుమయమై రజస్వలగా నుంటాయి. రజస్వల కన్యకు పుష్టికరమైన ఆహారము, ఆచారవ్యవహారము లవసరము. జాగ్రత్తగా నుండవలెను. అటులనే సంధ్యాకాల సమయములో రజస్వలావధిలో ప్రత్యేక స్థితిలో నుండుట అవసరము.

అశ్వనీ నక్షత్రంలో, చైత్రమాసంలో జరిగే బహు సూక్ష్మ ఋతుపరివర్తన ప్రభావము శరీరముపై అధికాధిక మోతాదులో ప్రభావాన్ని చూపెడుతుందని ఆరోగ్యశాస్త్ర పండితులందరికి విదితమే. ఆ ప్రభావమువలన ఆరోగ్యపు గోడలు బీటలువాలిపోయి, అనేకమంది జ్వరంతోను, చలిజ్వరంతోను, కలరావలనను, నీళ్ళ విరేచనములతోను, మశూచివలనను, అలసటతోను, ఇంకా యితఱ రోగములతో రోగగ్రస్తులవుతారు. ఆరోజులలో వైద్యుల వైద్యశాలలో తిరునాళ్ళలోలా రద్దీగా వుంటాయి. వాంతులకు, విరేచనాలకు, జలుబునకు, చెమటకు, రక్తము లేకుండుట మొదలైన శరీరానికి సంబంధించిన వ్యాధులకు అశ్వనీనక్షత్రము మఱియు చైత్రమాసము తగినవని వైద్యులందఱికి తెలుసు. ఈ సమయములో దసరా, శ్రీరామనవమి పండుగలు 'నవదుర్గ' ల అంతములో వస్తాయి. మహత్తు అధికంగా వున్న యీ రెండు పండుగలకు యీ సమయము అత్యంత వుపయుక్తమైనది. నవదుర్గ చివరలో భగవతీ దుర్గ ఆవిర్భవించినది. చైత్ర నవదుర్గ చివరలో రామావతారము జరిగినది. అమావాస్య పూర్ణిమల సంధ్యా ఉషలు, వీటి చివరలో సూర్యుడుగాని, చంద్రుడుగాని ఉదయిస్తాడు.

ఋతువులు మారినపుడు సామాన్యదృష్టిలో కష్టకారక సమయమనీ, హాని ప్రమాదమనీ సహజంగా భావిస్తారు. ఆ సమయములో పెక్కుమంది యేదోవిధంగా శారీరక క్లేశమును తక్కువ మోతాదులో అయినా అనుభవించడము కద్దు. వాస్తవంగా పరిస్థితి వ్యతిరేకము. ఆ సమయములో శారీరక జీవనశక్తిలో జ్వరావస్థత వుత్పన్నమౌతుంది. ఆ ప్రభావమువలన గడచిన ఆఱుమాసములలో ఆహారవ్యవహారములలో అనియమిత సామాగ్రిని గ్రహించుట జరిగి, దూషిత తత్త్వము లభివృద్ధి చెందినందున జీవనశక్తి వాటిని నిరాకరించుట ప్రారంభిస్తుంది. ఈ దోషనివారణ ప్రతిక్రియ సామాన్య చలిజ్వరంగాను, జలుబుదగ్గురూపంలోను, ఇంకా యితఱవిధములుగా ప్రకటమౌతుంది. కానీ ఉపవాస మొనరించుట, స్వల్పమాత్ర ఆహారాన్ని మాత్రమే స్వీకరించుటవలన తన శరీరమును తనంతటతాను శుభ్రపఱచుటకు అవకాశమిచ్చి, ఉపవాసముద్వారా నిన్ను నీవు నీ మానసికక్షేత్రములోని మలినాన్ని, విక్షేపములను పోగొట్టుకోవడానికి ప్రయత్నిస్తే రాగల కొన్ని నెలలవఱకు రోగములనుండి రక్షణ పొంది ఆరోగ్యవంతమైన జీవనము గడుపుటకు యోగ్యతను పొందగలవు. గాయత్రీయొక్క యీ లఘు అనుష్ఠానము యీ దృష్టిలో పరమ వుపయోగకరమైనది.

చైత్రమాసపు శుక్లపాడ్యమి మొదలు నవమివఱకు 'నవదుర్గ' వుంటుంది. ఈ సమయము గాయత్రీ సాధనకు అధికశ్రేష్ఠమైనది. ఈ రోజులలో ఉపవాసమునుండి 24 వేల మంత్రముల చిన్న అనుష్ఠానము చేయవలెను. ఈ కొద్ది అనుష్ఠానము వుపయోగకరమైనది.

ఒకసారి అన్నాహారము మఱొకసారి ఫలాహారము, రెండుసార్లు పాలు, పండ్లు, ఒకసారి ఆహారము మఱొకసారి పాలు, కేవలము పాలు ఆహారంగాను, వీటిలో యేవైనాసరే తన సమర్థత కనుకూలంగా తీసుకొని ఉపవాసము చేస్తూ సాధనను ఆరంభించవలెను.

ప్రాతఃకాలము బ్రహ్మముహుర్తంలో మేల్కొని శౌచస్నానాదులు గావించి, పైన చెప్పిన నియమములను పాటిస్తూ ధ్యానమునకు కూర్చుండవలెను. తొమ్మిదిరోజులలో 24 వేలు జపించవలెను. ప్రతిదినము 27 మాలలు జపించినయెడల యీ సంఖ్య అనగా 24 వేల మంత్రములు పూర్తవుతాయి. మూడు నాలుగు గంటలు తమ వేగము ననుసరించి అన్ని మాలలు సులభంగా చేయగలరు. ఒకేసారి యింత సమయాన్ని యేకంగా జపించుట కష్టసాధ్యమైనపుడు అధికాంశము జపాన్ని ప్రాతఃకాలమున పూర్తిచేసి, న్యూనాంశమును సాయంకాలము పూర్తిచేయవలెను. చివరిరోజున హవనముకొఱకు ఆరోజు హవనవిధి ప్రకారము కనీసము 108 ఆహుతులను సమర్పించవలెను. బ్రాహ్మణభోజనము యజ్ఞము పూర్తియైనందున దానదక్షిణలు యథావిధి నొనరించవలెను.

ఈ అల్పానుష్ఠానము నవదుర్గ సమయములో ప్రతి సంవత్సరము చేస్తూ వుండటంవలన సర్వశ్రేష్ఠము, ఉత్తమము. తాను స్వయంగా చేయలేనపుడు అధికారియైన యే సుపాత్రునితోనైనా చేయించవచ్చు. ఆతడు తొమ్మిదిరోజుల సాధనకు చాలా వుపయోగకారి. కష్టనివారణకు, సంకల్పసిద్ధికి, ఆత్మబలాభివృద్ధికి ఈరోజులలో ఉపవాస ముండుట బహు లాభదాయకము. సిద్ధిప్రదము. నవదుర్గ సమయము ప్రతివొక్కరు ఆ సమయానికి ఒక స్వల్పానుష్ఠాన మొనరించి ప్రయోజనాన్ని పరికించాలి.

నవదుర్గ సమయములోనేగాక, యీ స్వల్పానుష్ఠానము యితఱ సమయాలలో గూడ చేయవచ్చు. లక్షాపాతికవేల జపము 40 రోజులలో పూర్తిగావించబడేది పూర్ణానుష్ఠానము. రోజుకు ఒక పాద(పంచమాంశ) అనుష్ఠాన మంటారు.

సౌకర్యాన్నిబట్టి ఆవశ్యకతనుబట్టి ఏకపాద అనుష్ఠానము గూడ చేయవచ్చు. ఈ తపోధనాన్ని యెంత యెక్కువగా సేకరించితే అంత ఉత్తమము.

చిన్న గాయత్రీ మంత్రము :

లక్షాపాతికవేల జపముయొక్క పూర్ణ అనుష్ఠానము చేయలేనివారికి, తొమ్మిదిరోజుల 24 వేల జపానుష్ఠానము సరిపోతుంది. అటులనే అల్పశిక్షితులకు, అశిక్షితులైన బాలురకు లేక స్త్రీలకు లఘుగాయత్రీమంత్రము గూడ వున్నది. 24 అక్షరముల పూర్ణ గాయత్రీమంత్రము గుర్తుంచుకొనలేనివారికి ప్రణవము, వ్యాహృతులు 'ఓం భూర్భువః స్వః' మాత్రపు పంచాక్షరి మంత్రము జపిస్తే పని జరుగుతుంది. నాలుగు వేదముల బీజములు 24 అక్షరముల గాయత్రీలో నున్నవి. అట్లే గాయత్రీ మంత్రానికి మూలము పంచాక్షరీ మంత్ర ప్రణవము. మఱియు వ్యాహృతులు. ఓం భూర్భువః స్వ మంత్రము అల్పజ్ఞానుల సౌకర్యముకొఱకు యెక్కువ వుపయోగకారి.

మహిళలకు కొన్ని విశేష సాధనా మార్గములు

పురుషులకు మాదిరి స్త్రీలుగూడ వేదమాత గాయత్రీను జపింతురు. సాధన చేయుటకు అధికారము కలదు. చైతన్యరహితము, చలనహీనమునైన సృష్టి వ్యవస్థను చైతన్యవంతము, చలనము గల శక్తివంతమైన పరిణామము పొందుటకు, రెండు భిన్న జాతుల పారస్పరిక ఆకర్షణ కలిగించే తత్త్వముల ఆవశ్యకత వున్నది. ఋణ మఱియు ధన శక్తుల పారస్పరిక ఆకర్షణ, వికర్షణ ద్వారా విద్యుత్తు వేగపు సంచాలనము కలుగుతుంది. పరమాణువు యొక్క ఎలక్ట్రాన్ ప్రోటాన్‌ల భాగపు పారస్పరిక శక్త్యాకర్షణ కారణమువలన దానికి గతిశీలత యేర్పడినది. శాశ్వత చైతన్యము, క్రియాశీలరూపము నొందుటకు సజీవసృష్టి నర, నారీ యను రెండు రూపములుగా విభజింపబడినది. ఏలనన ఆ విభజన విశ్వము, చేష్టారహితము, చైతన్యరహితముగా నుండేది. శరీర - ప్రాణముల శక్తుల సమ్మేళనమే చైతన్యము. నరతత్త్వము, నారీతత్త్వముల పరస్పర సమ్మేళనము లేనపుడు చైతన్యము లేదు. ఆనందము, స్ఫురణ, చేతనత్వము, గతి, క్రియ, వృద్ధి మొదలైనవి లోపించి జడస్థితి మాత్రమే విరాజిల్లుతుంది.

నరత్వము, నారీతత్త్వము రెండూ ఒకదానికి మరొకటి పూర్ణత్వము కలుగజేస్తుంది. ఈ రెండు తత్త్వముల గొప్పదనము, వుపయోగము, అధికారము, స్థానము సమానము. వేదమాత గాయత్రీ సాధకునకు పురుషులకు వలే స్త్రీలకు సమానాధికారమున్నది. గాయత్రీ వేదమాత యైనందున స్త్రీలకు అధికారము లేదనడము పొరపాటు. ప్రాచీనకాలములో స్త్రీలు మంత్రద్రష్టలు. వేదమంత్రములు వారిద్వారా అవతరించాయి. గాయత్రీ స్వయం స్త్రీలింగము కావున వారికి అధికారము లేకపోవడానికి కారణము లేదు. స్త్రీలు అశిక్షితులు, హీనమతులు, అపవిత్రులు కావచ్చు. వారికి స్వయంగా ప్రవృత్తి లేదు. గొప్పదనాన్ని గుర్తించలేకపోవచ్చు. కావున తమ నిజమైన మానసిక అవస్థవలన అధికార వంచితులయ్యేదరుగాక! స్త్రీలు, పురుషులకు వలె గాయత్రీ సాధన చేయగలరు. ఇక్కడ చెప్పబడిన సాధనలన్నింటికీ వారర్హులు.

కానీ, వివాహిత స్త్రీలు, గృహకార్యములలో నిమగ్నులై వుంటారు. కనీసము కొంతమందికి చిన్నచిన్న పిల్లలుంటారు. వారు ఆ పిల్లల మలమూత్రములను శుభ్రపరచవలసినందున పవిత్రత తక్కువగా నుండి, దీర్ఘకాలములో చేయవలసిన సాధనలు వారికి సులభంగావు. వారి పనులకు సంక్షిప్తసాధనలు పనికొస్తాయి. పూర్తిగా గాయత్రీ మంత్రాన్ని గుర్తుంచుకోలేనివారు సంక్షిప్త గాయత్రీ -ఓం భూర్భువఃస్వః- తో కార్యసిద్ధి చేసుకోవచ్చు. స్త్రీ బహిష్టురోజులలో గాయత్రీమంత్రాన్ని జపించుట మానాలి. అనుష్ఠానము రోజులలో ఆరోజులు మాత్రంమాని, స్నానానంతరము తిరిగి ప్రారంభించవచ్చు.

నిస్సంతాన మహిళలు గాయత్రీ సాధన పురుషుల మాదిరి పూర్తిచేయవచ్చు. అవివాహితులు, విధవస్త్రీలు పురుషులకు వలె సాధన చేయవచ్చు. పిల్లలు పెద్దగానున్న స్త్రీలు, చంటిపిల్లలు లేనివారు, వయోవృద్ధులైన స్త్రీలకు అసౌర్యము వుండదు. సాధారణ దైనిక సాధనకు విశేష నియమములు పాటించనవసరము లేదు. దాంపత్యజీవనపు సాధారణ ధర్మపాలన గావించుటలో బాధ లేదు. ఏదైనా ప్రత్యేక సాధనగాని, అనుష్ఠానముగాని చేయవలసినపుడు ఆరోజులలో బ్రహ్మచర్యపాలన అవసరము.

మనోనిగ్రహము, బ్రహ్మప్రాప్తి కొఱకు

విధవ సోదణీమణులకు ఆత్మసంయమనము, సదాచారము, వివేకము, బ్రహ్మచర్యపాలన, ఇంద్రియనిగ్రహము, మనస్సును వశములో నుంచుకొనుటకు గాయత్రీసాధన బ్రహ్మాస్త్రము వంటిది. సాధన ప్రారంభించిన రోజునుండే మనఃశాంతి, స్థిరత్వము, సద్బుద్ధి, ఆత్మసంయమన భావన జన్మిస్తుంది. మనస్సు ఆధీనములో వుంటుంది. చిత్తచాంచల్యము నశిస్తుంది. ఆలోచనలలో సత్త్వగుణము పెంపొందుతుంది. కోరికలు, అభిరుచులు, కార్యకలాపాలు, భావనలన్నీ సత్త్వగుణ ప్రధానమై, నిర్మలంగాను, పవిత్రంగాను వుంటాయి. ఈశ్వరప్రాప్తి, ధర్మరక్ష, తపశ్చర్య, ఆత్మకళ్యాణం, ఈశ్వరారాధనలలో మనస్సు విశేషంగా లగ్నమౌతుంది. క్రమేణ ఆమె పరమ సాధ్వీమతల్లిగాను, తపస్వినిగా, ఈశ్వరపరాయణగా, బ్రహ్మవాదినిగా రూపొందుతుంది. గాయత్రీరూపంలో ఆమె భగవంతుని దర్శిస్తుంది. వివాహితస్త్రీ పొందే సంసారసుఖము తుచ్ఛమైనదిగా గోచరించి అత్యంత ఆత్మశాంతిని పొందుతుంది.

ప్రాతఃకాలములో శరీరము సహించే నీటితో స్నానము చేయవలెను. అతి శీతలపు నీరుగాని, అత్యుష్ణపు జలముగాని మంచివిగావు. ఇది అందఱికి. కానీ స్త్రీలకు ప్రత్యేకంగా సహించలేని నీటి స్నానము హానికరము. స్నానానంతరము గాయత్రీ సాధనకు కూర్చొనవలెను. దగ్గఱలో నీటితో నింపిన పాత్ర నుంచవలెను. జపమునకు తులసిమాల, కూర్చొనుటకు కుశాసనము సరియైనది, వృషభవాహనముపై నున్న శ్వేతవస్త్రధారిణి, చతుర్భుజములు కలిగిన ఒక చేతిలో మాల, మఱియొక హస్తములో కమండలము, పుస్తకము, కమలము గలిగి ప్రసన్నముఖముతోనున్న ప్రౌఢగాయత్రీదేవిని ధ్యానభావన చేయవలెను. ధ్యానము సద్గుణసంపత్తికొఱకు, మనోనిగ్రహముకొఱకు విశేష లాభదాయకము. ఈవిధమైన ధ్యానము పదేపదే చేయవలెను. జపము చేసేటపుడు కంఠమునుండి కొంచెము మాత్రము

ధ్వని వెలువడవలయును. పెదవులు కదులుచుండవలెను. కానీ మంత్రము దగ్గఱనున్నవారికిగూడ స్పష్టముగా వినిపించగూడదు. ప్రాతః సాయంకాలములు రెండువేళలా జపించవచ్చును. కనీస మొక మాల జపించవలెను. సౌకర్యాన్ననుసరించి అధిక సంఖ్యలో జపించవచ్చు. తపశ్చర్య ప్రకరణములో వ్రాయబడిన ప్రకారము తపము చేయుట ఉత్తమము. ఏవిధమైన మఱి యితఱ పరిస్థితులకు అనుగుణ్యంగాని, ఏ తపశ్చర్య అవసరమో ఆశ్రమమునకు ఉత్తరము వ్రాసి సలహా పొందవచ్చు.

కన్యలకు ఆశాప్రద భవిష్యత్తుకొఱకు సాధన

కన్యలైన కుమారీలు తమ వివాహిత జీవితంలో అన్నివిధముల సుఖశాంతులను పొందుటకు భగవతీ గాయత్రీ ఉపాసన చేయవచ్చు. పార్వతి తన మనోనాయకుని భర్తగా పొందుటకై నారదుని ఆదేశానుసారము తపస్సు చేసినది. చివఱకు సఫలమనోరథయైనది. మాతా సీతాదేవి మనోవాంఛిత పతిని పొందుటకు గౌరీ ఉపాసన మొనరించినది. నవదుర్గ సమయములో ఆస్థికి గౌరవప్రద గృహకన్యలు భగవతీ ఆరాధన గావిస్తారు. గాయత్రి ఉపాసన వానికి సర్వవిధముల మంగళప్రదము.

గాయత్రీదేవి చిత్రపటమును చిన్న ఆసనముపై లేదా నాలుగుకాళ్ళపీటపైగాని స్థాపించవలెను. ఇతఱ దేవత నారాధించునపుడెట్లు మనము చేస్తామో అటులనే చేయవలెను. ప్రతిమ ముందు చిన్న పటము నుంచవలయును. అచట గంథము, ధూపము, దీపము, అక్షతలు, నైవేద్యము, పుష్పములు, జలము, భోగము(పిండివంటలు) మొదలైన పూజాసామాగ్రి నుంచవలెను. ఆరతీయవలయును. మూర్తి మస్తకముపై గంథము నుంచవలెను. పటమైతే గంథము మొదలైనవి వుంచగూడదు. ఏలనన ఆ గంథముపై మలినము పడవచ్చు. నేత్రములను మూసి ధ్యానించవలెను. కనీసము 24 సార్లు గాయత్రీ మంత్రమును జపించవలెను. గాయత్రీ చిత్రముగాని మూర్తిగాని లభించకపోతే గాయత్రీ తపోభూమి, మథురకు వ్రాసి తెప్పించుకొనవలయును. ఈవిధమైన గాయత్రీ సాధన కన్యలకు అనేక అనుకూల వరప్రదము, దివ్యమైన గృహము, సౌభ్యాగము లభించుటకు వుపయోగపడుతుంది.

గృహిణులు, సౌభాగ్యవంతులకు మంగళమయ సాధన

తమ భర్తల సుఖానికి, సమృద్ధికి, సంపన్నతకు, స్వాస్థ్యమునకు, ప్రసన్నతకు, దీర్ఘాయువుకొఱకు వివాహిత స్త్రీలు గాయత్రీదేవిని శరణు కోరవలెను. దీనివలన భర్తలయొక్క చెడు మనస్తత్వము, ఆలోచన, ఆచారము నిర్మలమై వాటి స్థానే సాత్త్వికబుద్ధి జనించి, తమ గృహస్థజీవనపు కర్తవ్యాన్ని, ధర్మాన్ని పాటించుటలో తాదాత్మ్యము చెంది, ప్రసన్నతాపూర్వకంగా గడుపుతారు. ఈ సాధనవలన స్త్రీలు ఆరోగ్యము, స్వభావములలో మార్పు గలిగి, వారు అధిక ఆకర్షణతో విరాజిల్లి సర్వులకు పరమప్రియులౌతారు. వారు సముచిత సత్కారములను పొందుతారు. పాడైపోయిన

తన ఆరోగ్యము, ఇంటిలోని యితఋల అనారోగ్యము ఆర్థిక యిబ్బందులు, దారిద్ర్యముతో పెరిగిన విపరీతపు ఖర్చులు, తగ్గిన ఆదాయము, కుటుంబక్లేశములు, వైమనస్యత, మనోవేదన, కుటుంబ కలహములు, రాగద్వేషములు, చెడురోజుల ఉపద్రవములు శాంతించుటకు మహిళలు గాయత్రీ ఉపాసన చేయవలెను. పుట్టినింటికి, మెట్టినింటికిగూడా యీ సాధన ఉపయోగకారి. పునీతస్త్రీల ఉపాసన ప్రతివంశమునకు లాభదాయకము.

ప్రాతఃకాలము మొదలు మధ్యాహ్నమువఱకు ఉపాసన చేయవలెను. సాధన పూర్తికాకుండ భోజనము చేయరాదు. నీరు త్రాగవచ్చు. శరీరము, మనస్సు, శుద్ధవస్త్రముతో తూర్పుముఖముగా కూర్చొనవలెను. కుంకుమపువ్వుతో కలిపిన చందనమును చేతితో తీసికొని తలకు, హృదయానికి, కంఠమునకు పూసుకొని, తిలకముగా ధరించవలెను. గాయత్రీమూర్తినిగాని, చిత్రాన్నిగాని వుంచుకొని విధిప్రకారము పూజించవలెను. పసుపుపచ్చని పూలతో పూజా సర్వకార్యములకు వుపయోగించవచ్చు. ప్రతిమయొక్క ఆవరణను పసుపురంగులో నుంచవలెను. పసుపురంగు పుష్పాలు, పసుపుతో తయారుగావించిన అక్షతలు, శనగపిండి లడ్లు మొదలగుగాగల పసుపుపదార్థములతో భోగముకేసరి, చందనము కలిపిన తిలకము, ఆరతి కొఱకు పసుపుపచ్చని గోఘృతము గంధపుపొడి, ధూపముతో అధికాంశము పసుపుపచ్చనివాటితో పూజ చేయవలెను.

నేత్రములను మూసి, పీతవర్ణపు ఆకాశంలో పాలిపోయినరంగులోనున్న సింహముపై స్వారిచేస్తూ, పసుపుపచ్చని వస్త్రధారిణియైన గాయత్రీమాతను ధ్యానించవలెను. పూజ సమయములో పసుపురంగు వస్త్రములు లభ్యముకానిచో కనీసమొక వస్త్రమైన పసుపురంగులో ధరించవలెను. ఈవిధమైన పీతవర్ణగాయత్రీదేవి పూజలో కనీసము 24 సార్లు గాయత్రీమంత్రమును జపించవలెను. అవసరమొచ్చినపుడు మనస్సులో ధ్యానిస్తూ వుండవలెను. నెలలో ప్రతిపూర్ణిమరోజు వ్రతమాచరించవలెను. నిత్యఆహారంలో ఒకదాన్ని పసుపురంగులో వుండేటట్లు చూడవలెను. ఈ పీతవర్ణసాధన దాంపత్యజీవనసుఖానికి పరమోత్తమము.

సంతానము వ్యాధిగ్రస్తులై, అల్పాయువుతో మరణిస్తున్నప్పుడు కేవలము పుత్రసంతానము లేక స్త్రీ సంతానం మాత్రమే కలిగినపుడు, గర్భపాతములు జరుగుతున్నప్పుడు, గర్భము రానపుడు వంధ్యాదోషము ఉన్నపుడు, దీర్ఘకాలం వఱకు సంతానము కలగనపుడు, సోమరి, మందబుద్ధియైనపుడు, దుర్మార్గుడు, దుష్టుడు, ఆజ్ఞావుల్లంఘన చేయువాడై నపుడు, కటుభాషి, కుమారియైనపుడు ఆ తల్లిదండ్రులు వేదమాత గాయత్రీ శరణుపొంది కష్టములనుండి విముక్తులు గావచ్చు.

మావద్ద అనేక వేల ఉదాహరణ లున్నాయి. అందులో స్త్రీలు వేదమాత గాయత్రీ చరణమువద్దకు చేరి తమ అచంచలభక్తితో సంతానసుఖమును కోరారు. భగవతీదేవి వారికి ప్రసన్నతాపూర్వకంగా సంతానాన్ని ప్రసాదించినది. మాతయొక్క భండారంలో దేనికీ కొఱత లేదు. ఆమె కృపకు పాత్రులై మనుజులు దుర్లభాతిదుర్లభమైన వస్తువులను పొందగలరు. ఆమె తన దయచే నీయలేని వస్తువే లేదు. అందులో సంతానము పొందుటకు సాధారణమైనదానిని పొందుట ఆశ్చర్యజనకము గాదు.

గర్భవతియైన స్త్రీ ప్రాతఃకాల సూర్యోదయమునకు పూర్వముగాని, రాత్రి సూర్యాస్తమయము తర్వాతగాని, తన గర్భములో నున్న సూర్యసదృశ ప్రచండ తేజమును ధ్యానిస్తూ మనస్సులోనే గాయత్రీమంత్రమును జపించిన ఆమె కుమారుడు తేజస్వీ, బుద్ధికుశలుడు, చతురుడు, దీర్ఘజీవి మఱియు యశస్వియై విలసిల్లుతాడు.

ప్రాతఃకాలమందు కటిప్రదేశమునందు తడిసిన వస్త్రముంచుకొని శాంతచిత్తముతో ధ్యానావస్థితి యందుండవలెను. తన యోని మార్గమునుండి గర్భాశయము వఱకు వెళ్ళు గాయత్రీ ప్రకాశమైన సూర్యకిరణములను ధ్యానించవలెను. ఈ సాధనవల్ల శీఘ్రంగా గర్భం నిలుస్తుంది. కుంతీదేవి యీ సాధనవలన గాయత్రీదేవి దక్షిణభాగం (సూర్యభగవానుని)ను ఆకర్షించి కన్యగా నున్నప్పుడే కర్ణునికి జన్మనిచ్చింది. ఈ సాధనను కన్యలు చేయరాదు.

సాధననుండి లేచినవెంటనే సూర్యునకు జలమును విడువవలెను. అర్ఘ్యమిచ్చినతరువాత నున్న కొంచెము జలమును త్రాగవలెను. దీనివలన వంధ్యాస్త్రీలు గర్భవతులు గాగలరు. గర్భస్రావమవుతున్న స్త్రీలకుగాని, పుట్టిన శిశువులు మరణిస్తున్నా గాయత్రీ సాధన యీ కష్టములను పోగొట్టి సంతోషప్రదమైన సంతానము నిస్తుంది.

రోగి, కుబుద్ధి, సోమరి, కొరకొరలాడెడు బాలకులను తన ఒడిలోనుంచుకొని తల్లులు హంసవాహినియై, గులాబీపుష్పములతో నున్న శంఖ చక్రహస్తధారిణి గాయత్రీదేవిని ప్రార్థించాలి. మనసులోనే జపించవలెను. తల్లి చేసే జప ప్రభావము ఒడిలోనున్న బిడ్డపై పడుతుంది. దానివలన ఆ బిడ్డ శరీరంలోను, మస్తిష్కంలోను ఆశ్చర్యజనక ప్రభావము కలుగుతుంది. చిన్నబిడ్డ అయితే సాధన సమయములో తల్లి పాలిస్తూ వుండవలెను. పెద్దవాడైనట్లయితే అతని తలపైన, శరీరంపైన తల్లి తన హస్తముతో నిమురుతూ వుండవలెను. కుమారుని శుభముకొఱకు గురువారవ్రతము వుపయోగకరమైనది. సాధన పరిసమాప్తి అనంతరము సూర్యునకు జలముతో అర్ఘ్యము నీయవలెను. తరువాత మిగతా జలాన్ని కొంచెము బిడ్డపై చల్లవలెను.

ప్రత్యేక అవసరంకొఱకు

తన కుటుంబమునకు, బంధువులకు, ప్రియజనులకు సంభవించే ఆపదలను నివారించుటకుగాని లేక నిర్వర్తించవలసిన ఆవశ్యకత కార్యములలో సంభవించే ఆటంకములను, కష్టములను తొలగించుకొనుటకై గాయత్రీ సాధనలో నున్న దైవీ సహాయంవలన ఆ కష్టముల నెదుర్కొనవచ్చు. విశేషమైన కోర్కెలు మనస్సులో నుండవచ్చు. వాటిని పొందుటకు అనేక బాధలుండవచ్చు. కానీ నిర్మలమైన హృదయంతో వేదమాత గాయత్రీదేవిని ఆహ్వానించవలెను. తల్లి తన ప్రియపుత్రుని పిలుపు విని స్పందించి ఎలా పరుగెత్తుకొని వస్తుందో, అటులనే గాయత్రీ ఉపాసకులుగూడా ఆ తల్లియొక్క అమితకరుణను ప్రత్యక్షంగా పరిచయప్రాప్తిని గావించుకొనెదరు.

తొమ్మిదిదినముల అనుష్ఠానము, నలభైదినముల అనుష్ఠాన మీ పుస్తకంలో వేఱోచోట వర్ణింపబడినది. తాత్కాలి కావశ్యకతకొఱకు దానిని వుపయోగించుకొనవలెను. స్వయంగా చేయలేనపుడు, ఎవరైనా గాయత్రీవిద్య తెలిసినవారు వాటిని ఆచరించవలయును. తపశ్చర్య ప్రకరణములో వ్రాయబడిన తపశ్చర్యలు భగవతీదేవిని ప్రసన్నము

చేసుకోవటానికి పనికొస్తాయి. ఒక సంవత్సరపు గాయత్రీ ఉద్యాపన అన్ని కోర్కెలను నెరవేరుస్తుంది. ఇది తరువాత వ్రాయబడుతుంది. పురుషులకు గాయత్రీ అనుష్ఠానమెటుల సర్వప్రధాన సాధనయో, అటులనే మహిళలకు గాయత్రీ వుద్యాపన విశేష మహిమ గలది. దానిని ప్రారంభించుట కష్టమేమి కాదు. ప్రతిబంధములుగూడా యెక్కువ వుండవు. సరళదృష్టిలో స్త్రీలకు మాతను ప్రసన్నము చేసుకొనేందుకు ఉద్యాపన పుష్పమాల పరమప్రియమైన కానుక.

నిత్యసాధనకు గాయత్రీ చాలీసా పఠించుట స్త్రీలకు హితకారి. జంధ్యము స్థానే కంఠీ వారికి ద్విజత్వాన్ని సంప్రాప్తింపజేస్తుంది. గాయత్రీకి అధికారిణులవుతారు. సాధన ప్రారంభించడానికి పూర్వము ఉత్కీలనము గావించవలెను.

ఒక సంవత్సరపు ఉద్యాపన

అనేకమంది జీవనక్రమము చాలా అస్తవ్యస్థంగా వుంటుంది. వారి పనులన్నీ సదా అపసవ్యంగా వుంటాయి. వ్యావహారిక జీవనంలోని కష్టములు వారిని ప్రశాంతంగా వుండనీయవు. తమ జీవనమునకు అవసరమైన కోర్కెలను, సామాజిక వ్యవహారములను జరుపుటలోను, కుటుంబసభ్యులయందు తన బాధ్యతను పూర్తిచేయడంలోను, వ్యతిరేక పరిస్థితులను చక్కబరచడంలోను, ఎదుర్కొనే కష్టములను నివారించుటకు వారి సమయము, శక్తి సర్వస్వము వ్యయమైనందున, కొంత సమయమెపుడైన తీరిక దొరికే ఘడియ సమీపించుచున్నప్పటికే వారు అలసి, మందులై, శక్తిహీనులై, పరిశ్రమ ఫలితంగా శిథిలమై, చూర్ణమవుతారు.

ఆ సమయములో తను నిశ్శబ్దంగా వుండవలెననే ప్రగాఢమైన కోరిక ఆఖరి కోర్కె. తన నెవ్వరు వదిలివేయకుండ, తనకు విశ్రాంతినిచ్చి తన అలసటను తొలగించవలెననే వాంఛ బలీయంగా వుంటుంది. చాలామంది వ్యక్తుల మస్తిష్కము అల్పశక్తివంతమై వుంటుంది. మామూలు దైవిక కార్యములను నిర్వర్తించడంలో గూడా వారి శక్తి పూర్తిగా నశిస్తుంది. వారి కాళ్ళు, చేతులుగూడా స్వాధీనతను కోల్పోతాయి.

సాధారణంగా ఆధ్యాత్మిక సాధకులందఱికీ, ప్రత్యేకంగా గాయత్రీ సాధనకు ఉత్సాహవంతమైన మనస్సు, శక్తిసంపన్నమైన శరీరము అవసరము. దానివలన స్థిరంగా, దృఢంగా, ఏకాగ్రతతో, శాంతిపూర్వకంగా మనస్సు సాధనయందు లగ్నమవుతుంది. ఈ స్థితిలో గావించిన సాధన ఫలితాన్నిస్తుంది. కానీ ఆ స్థితి పొందినవారెందఱున్నారు? అస్థిరబుద్ధితో, అవ్యవస్థిత చిత్తంతో యేదోవిధంగా సాధనలో లగ్నము కావించిన, రావలసిన సత్ఫలితాలు సంభవించవు. స్వచ్ఛతలేని మనస్సుతో జేసిన ఉపాసన స్పష్టంగా వుండదు. దానివలన సంభవించే ఫలితంగూడా నిర్దుష్టంగా వుండదు.

అటువంటి స్త్రీపురుషులకు సరళమైనది, మహత్వపూర్ణమైన సాధన గాయత్రీ ఉద్యాపన. దీనిని పెక్కు కార్యములలో మునిగి, కార్యభారమెక్కువగా నున్నవారు కూడ చేయవచ్చు. చిన్నచిన్న బిందువులు కలిపితే ఘటము నిండుతుంది. కొంచెము కొంచెముగా ఆరాధన చేస్తే కొంతకాలానికి గొప్ప పరిణామములో సాధనాశక్తి సమకూరుతుంది.

ప్రతి మాసములో అమావాస్య మఱియు పూర్ణిమ రెండురోజులు ఉద్యాపన సాధన చేయవలసివస్తుంది. ఏదో ప్రత్యేక మాసంలోపూర్ణిమరోజు సాధన ప్రారంభించవలెను. సరిగ్గ సంవత్సరము తరువాత అదే పూర్ణిమలో ఉద్యాపన సమాప్తము గావించవలెను. ప్రతి అమావాస్య పూర్ణిమరోజులలో క్రింద నీయబడిన కార్యక్రమమును కొనసాగించవలెను. నియమములను పాటించవలెను.

1. గాయత్రీ ఉద్యాపనకొఱకు యోగ్యుడు, సదాచారి, గాయత్రీవిద్య తెలిసిన బ్రాహ్మణుని యెన్నుకొని వారిని బ్రహ్మగా నియమించుకొనవలెను.

2. ఉద్యాపన ప్రారంభించేటపుడు బ్రహ్మకు అన్నము, వస్త్రము, పాత్ర మఱియు యథాశక్తి దక్షిణ సమర్పించి యీ యజ్ఞానికి యెన్నుకోవలెను.

3. ప్రతి అమావాస్య, పూర్ణిమలలో సాధకుని వలె, బ్రహ్మగూడా తన నివాసస్థలమందుండి, యజమాని సహాయంతో తనకోసము అదేవిధంగా సాధన గావించవలెను. యజమాని, బ్రహ్మ సమాన నియమములను పాటించవలెను. అందువలన ఉభయపక్షీయ సాధనలు మేళవించి సర్వాంగపూర్ణమైన సాధన యొకటి ఆవిర్భవించుతుంది.

4. ఆరోజు బ్రహ్మచర్యాన్ని పాటించుట అవసరము.

5. ఆరోజు ఉపవాస ముండవలెను. తన స్థితిని, ఆరోగ్యపరిస్థితి ననుసరించి ఒక్కసారి భోజనము లేక పలహారము పాలు లేక నీటిమిశ్రమము ఆధారంగా ఉపవాసము చేయవచ్చు. తపశ్చర్య, ప్రాయశ్చిత్త ప్రకరణములలో దీనిగురించి విస్తృత సమాచారమీయబడినది.

6. తపశ్చర్య ప్రకరణములో చెప్పబడిన తపశ్చర్యలలో యే యితఱ నియమములు, వ్రతపాలన చేయవలెనో వాటిని సాధ్యమైనంతవఱకు యథావిధిగా పాటించవలెను. ఆరోజు క్షౌరము చేయించుకొనుట పురుషులకు నిషిద్ధము. స్త్రీలకు అలంకరణ, కేశాలంకరణ, పిండి మొదలైనవి పిసుకుట వర్జనీయము.

7. ఆరోజు ప్రాతఃకాలపు నిత్యకర్మలను పూర్తిగావించుకొని, స్వచ్ఛతాపూర్వకంగా సాధన కుపక్రమింపవలెను. గాయత్రీసంధ్య గావించిన ప్రతిమనుగాని, పటమునుగాని, మూర్తినిగాని ధూప దీప అక్షతలు పుష్పములు చందనము కుంకుమ నీరు మృష్టాన్నములతో పూజ గావించవలెను. అటుపిమ్మట యజమాని యీ ఉద్యాపన బ్రహ్మను ధ్యానించి మనస్సులోనే నమస్కరించాలి. బ్రహ్మగూడా యజమానిని మనస్సులో నుంచుకొని ఆశీర్వదించవలెను. తరువాత గాయత్రీ మంత్రజపా న్నారంభించవలెను. జప సమయంలో గాయత్రీ చిత్రాన్ని ధ్యానించవలెను. వెయ్యి మంత్రజపము చేయడానికి పదిసార్లు మాలను త్రిప్పవలెను. ఒక మట్టిపాత్రలో నిప్పునుంచి దానిలో నేతితో కలిపిన హవనద్రవ్యము వేస్తూ వుండవలెను. దానివలన యజ్ఞములలో మాదిరి సుగంధముంటుంది. ప్రక్కనే నేతిదీపము ప్రజ్వరిల్లుతూ నుండవలెను.

8. జపము పూర్తియైన వెంటనే నేతితోగాని, కర్పూరంతోగాని ఆరతి నీయవలెను. ఆరతి తరువాత భగవతి గాయత్రీదేవికి మృష్టాన్నభోజనము సమర్పించవలెను. దానిని ప్రసాదంగా సమీప వ్యక్తులకు పంచవలెను.

9. పాత్రలోని జలమును సూర్యున కర్ఘ్యమీయవలెను.

10. ఈ కార్యక్రమంతా రెండు గంటలలో పూర్తవుతుంది. పదిహేనురోజుల తరువాత మఱలా రెండు గంటలు సమయము గడుపుట కష్టమేమీ కాదు. ఎక్కువ పనులున్న వ్యక్తి రెండు గంటలకు లేచి సూర్యోదయము వఱకు తన పనిని పూర్తిచేసుకోవచ్చు. సాయం సంధ్య సమయంలో సమయము దొరికితే ఆ సమయంలోగూడా సాధారణరీతిలో చేసుకోవచ్చు. సంధ్యా పూజావశ్యకత లేదు. ప్రాతఃకాలమో లేక సంధ్యా సమయమో నిశ్చయించుకొనవలెను. యజమాని, బ్రహ్మ యిద్దఱూ కలసి సాధన గావించుట అవసరము.

11. ఎపుడైనా అనారోగ్యము, సూతకము, ఆకస్మిక కార్యము సంభవించిన కారణమున సాధన చేయలేకపోతే, రెండవసారి రెండుసార్లు చేసి మిగిలిన జపము పూర్తిగావించవలెను. లేక యజమాని కార్యము బ్రహ్మ లేక బ్రహ్మకార్యము యజమాని పూర్తిచేయవచ్చు.

12. అమావాస్య పూర్ణిమలే గాకుండా, యితఱ సమయంలోగూడా గాయత్రీ జపిస్తూనే వుండవలెను. అధికంగా చేయలేకపోతే స్నానానంతరంగాని, స్నానము చేసేటపుడుగాని 4 సార్లు మనస్సులో గాయత్రీ మంత్రాన్ని జపించవలయును.

13. ఉద్యాపన పూర్తియైన తరువాత అదే పూర్ణిమరోజున గాయత్రీ పూజ, హవనము, జపము, బ్రాహ్మణభోజనము గావించవలెను. బ్రాహ్మణులకు చిన్నదిగాని లేక పెద్ద గాయత్రీ పుస్తకాన్ని దక్షిణతో సమర్పించవలెను. గాయత్రీ పూజకొఱకు తన శక్త్యానుసారము బంగారంతోగాని, వెండితోగాని, రాగితోగాని గాయత్రీ ప్రతిమను తయారుగావించుకొనవలెను. ప్రతిమ, వస్త్రము, పాత్ర, దక్షిణ సమర్పించుకొని బ్రహ్మకు వీడ్కోలు నీయవలెను.ఈ గాయత్రీ ఉద్యాపన ఆరోగ్యమును, ధనమును సంతానప్రాప్తిని గావించి సుఖశాంతులు గల్గునట్లు రక్షిస్తుంది. ఆపదలను నివారించుతుంది. శత్రుత్వాన్ని, ద్వేషాన్ని పోగొడుతుంది. సద్బుద్ధిని, వివేకాన్ని వుత్పన్నము గావిస్తుంది. మానసికశక్తిని అభివృద్ధి గావిస్తుంది. ప్రత్యేక కార్యాన్ని తలంచుకొని సఫలం గావాలంటే గాయత్రీ కృపకొఱకు గాయత్రీ ఉద్యాపన ఉత్తమమైన తపస్సు. దీనిలన భగవతీదేవి ప్రసన్నత చెంది సాధకుని మనోరథాన్ని పూర్తిగావిస్తుంది.

సఫలత ప్రాప్తించినయెడల అభీష్టసిద్ధి కలిగినపుడు, సుఖము ప్రాప్తించినపుడు, ఆ సంతోషముతో భగవతీదేవికి కృతజ్ఞత ప్రకటించుటకు ఉద్యాపన చేస్తూవుండవలెను. గీతలో పరమాత్మ యిలా బోధించారు.

దేవాన్ భావయతానేన తే దేవా భావయన్తు వః ।

పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్య థ ॥

అర్థము : యజ్ఞప్రక్రియచే దేవతలను పరితుష్టుల నొనర్చుడు. వారు మిమ్ము తృప్తినొందింతురు. ఇట్లు పరస్పరము సంభావించుకొనుచు పరమశ్రేయమును పొందుడు.

గాయత్రీ సాధనవలన అనేక ప్రయోజనములు సిద్ధిస్తాయి

గాయత్రీమంత్రము సర్వోపరి మంత్రము. దీనికన్నా గొప్పది మఱియొకటి లేదు. ఈ ప్రపంచములో యితఱ మంత్రములచే కాని పనులు గాయత్రీతో నిశ్చయంగా సమకూడుతాయి. యోగసాధకులు దక్షిణమార్గము ద్వారా వేదోక్త పద్ధతి ననుసరించి యితఱ మంత్రములద్వారా ఏ సాఫల్యాన్ని పొందుతారో ఆ కార్యములన్నీ గాయత్రీమంత్రము ద్వారా పూర్తికాగలవు. అదేవిధంగా వామమార్గీయులైన తాంత్రికులు తమ తాంత్రిక ప్రణాళికల ద్వారా యే కార్యములను సలుపుతారో అవిగూడా గాయత్రీ మంత్రముద్వారా చేయవచ్చు.

ఇది యొక ప్రచండశక్తి. దీనిని దేనిపై ప్రయోగించినా, అక్కడ చమత్కారమైన ఫలితాలు లభిస్తాయి.

కామ్యకర్మలకొఱకు సకామప్రయోజనాలను ఆశించునపుడు అనుష్ఠానము అవసరము. లక్షా యిరువది యైదు వేల పూర్ణానుష్ఠానము, 24 వేల ఆంశిక అనుష్ఠానము తమ తమ మర్యాద ననుసరించి ఫలితాల నిస్తాయి. బెల్లము యెంత యెక్కువ వేస్తే అంత యెక్కువ తీపి- అనే సామెత యిచట గూడ చరితార్థమౌతుంది.

సాధన తపశ్చర్యల ద్వారా సంతరించుకున్న ఆత్మబలము యే కార్యంపై వినియోగించినప్పటికీ దానికి తప్పకుండా ప్రతిఫల ముంటుంది. తుపాకీయొక్క వుపయోగము దానిలో నున్న అధిక కార్ట్సూన్లపై నుంటుంది. గాయత్రీ ప్రయోగవిధి ఒకవిధంగా ఆధ్యాత్మిక తుపాకి, తపశ్చర్య సాధన ద్వారా సంగ్రహించబడిన ఆత్మికశక్తి కార్ట్సూన్ల పేటిక. రెండూ కలసినపుడే లక్ష్యచ్ఛేదన జరుగుతుంది.

కొందఱికి ప్రయోగవిధి తెలిసివుండవచ్చు. కానీ వారి వద్ద సాధనాబలము లేనట్లయితో ఖాళీ తుపాకీతో గుఱ్ఱమును తొందరగా పరుగెత్తించి గురితప్పకుండా లక్ష్యమును ఛేదిద్దామనుకొన్నట్లవుతుంది. అటులనే తపోబలమున్న వ్యక్తియైనప్పటికి కామ్యప్రయోజనానికి విధివశాత్తు తన తపోబలాన్ని వుపయోగించే విధము తెలియనట్లయితే తుపాకీ తూటాల పెట్టెయొక్క కట్టిన ముడి విప్పకుండా శత్రువుల వైపు వాటిని విసరి శత్రుసేనను సంహరించడానికి ప్రయత్నించినట్లవుతుంది. ఇది హాస్యాస్పదమైన పద్ధతి. ఆత్మబల సంపాదనకొఱకు యెంత యెక్కువ సాధన గావిస్తే అంత మంచిది. గాయత్రీమంత్రాన్ని సిద్ధిపొందినవారు 5 రకములుగా వుంటారు.

1. కనీసము 12 సంవత్సరములు రోజుకొక మాల గాయత్రీ జపము నిత్యము గావించినవారు.

2. గాయత్రీ బ్రహ్మ సంధ్యను తొమ్మిది సంవత్సరములు నిత్యము చేసినవారు.

3. బ్రహ్మచర్యానుష్ఠానము గావించుతూ 5 సంవత్సరములు రోజుకు వేయిచొప్పున గాయత్రీ మంత్ర జప మొనర్చవలెను.

4. 24 లక్షల గాయత్రీ అనుష్ఠానము పూర్తిగా నొనరించినవారు.

5) ఐదు సంవత్సరములు విశేషంగా గాయత్రీ జపాన్ని చేసినవారు.

పైన చెప్పబడిన వాటిలో యేదైన వొకటి కనీసంగాని లేక అధికంగా తపశ్చర్యలను పూర్తిగావించినట్లయితే ఆ పూర్తిగావించిన వ్యక్తి గాయత్రీమంత్రమును కామ్యకర్మలకొఱకు ప్రయోగించి సఫలత్వము నొందగలడు. 24 లక్షల గాయత్రీ అనుష్ఠానపురాశి కలిగివున్న వ్యక్తిగూడా తన శక్త్యానుసారము పరిమిత పరిధివఱకు ఫలితాన్ని సాధిస్తాడు.

విష నివారణ మఱియు రోగనివారణ

స్వయంగా రోగగ్రస్థుడైనప్పటికి యే స్థితిలోనైనా వున్నప్పటికీ మనస్సులో గాయత్రీ జపము చేయవలెను. ఒక మంత్రము పూర్తియైన వెంటనే రెండవసారి మంత్రము నుచ్చరించేముందు బీజమంత్రముతో సంపుటీకరణము చేయవలెను. అనగా ఆ బీజాక్షరమును మధ్యలో జపించవలయును.

చలి, నెమ్ము ప్రాధాన్యము గలిగిన రోగములలో ఐం బీజమంత్రాన్ని వుచ్చరించవలెను. పిత్తరోగములలో గూడా ఐం బీజమును, అజీర్తి, విషము, వాతరోగములలో హ్రీం బీజమును ప్రయోగించవలెను. స్వస్థత, రోగరహితమగుటకు వృషభవాహిని, హరితవస్త్రధారిణీ యైన గాయత్రీదేవిని ధ్యానించవలెను.

ఇతఱులకు ఆరోగ్యాన్ని రోగనివారణను కలిగించడానికి గూడా యీ బీజమంత్రములను కలపి ధ్యానప్రయోగాన్ని చేయవలెను. రోగియొక్క పీడిత అంగములపై పైన చెప్పబడిన ధ్యానమును, జపమును చేస్తూ చేతితో నిమురుతూవుండి జలము అభిమంత్రించి రోగిపై పోయడంగాని, చిలకరించడంగాని చేయవలయును. ఈ పరిస్థితులలో తులసీపత్రములు నల్లమిరియములు గంగాజలముతో మర్దించి ఔషధపు రూపములో నీయవలెను. ఈ ఉపచారము యే రోగికైనా, యే రోగానికైనా యిచ్చిన యెడల ప్రయోజనము లేకుండాపోదు.

సర్పము, తేలు, కందిరీగ మఱియు విషజీవుల కాటు జరిగినపుడు చాలా బాధ కలుగుతుంది. విషము శరీరమంతా ప్రాకినపుడు మరణము సంభవించడముకూడా కద్దు. ఈవిధమైన సంకటములు సంభవించినపుడు గాయత్రీశక్తిద్వారా సేవ, ఉపచారము చేయవచ్చు.

పిప్పిళ్ళ సమిధలతోగాని, రావి సమిధలతోగాని హవనము చేసి ఆ భస్మాన్ని భద్రపఱచుకొనవలయును. తమ నాసికలలో నడిచే స్వరాన్ననుసరించి ఆ చేత కొంచెము భస్మాన్నుంచుకొని రెండవచేతితో అభిమంత్రిస్తూ, మధ్యలో 'హూం' బీజమంత్రాన్ని సంపుటీకరణము గావిస్తూ, రక్తవర్ణ, అశ్వారూఢ గాయత్రిని ధ్యానిస్తూ ఆ భస్మాన్ని విషజంతువుచే వేయబడిన కాటుపై రెండు లేక నాలుగు నిముషములు రుద్దవలెను. బాధ మాయమౌతుంది. ఆశ్చర్యము కలుగుతుంది.

సర్పపుదంష్ట్ర చిహ్నముపై రక్తచందనముతో గావించిన హవనభస్మము నుంచవలెను. అభిమంత్రించిన నేతిని త్రాగవలెను. ఆవాలను అభిమంత్రించి వాటిని పిండిచేసి దశేంద్రియద్వారముల వద్ద కొంచెము పూయవలెను. ఈవిధంగా చేస్తే సర్పవిషమునుండి విముక్తి కలుగుతుంది.

గాయత్రీమంత్రము ముఖ్యంగా బుద్ధిని సమున్నతము గావించునట్టి మంత్రము. మందబుద్ధులు, జ్ఞాపకశక్తి తక్కువగా నున్నవారు యీ మంత్రమువలన అధికప్రయోజనమును పొందగలరు. బాలుడు పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేనపుడు, పాఠములను సరిగా గ్రహించలేనపుడు, కంఠతా చేయలేనపుడు ఆతనికి క్రింద చెప్పబడిన ఉపాసన ఉపయోగకారి.

నీళ్ళలో తడిసిన బాలుని తలపై సూర్యోదయమపుడు ప్రథమ కిరణములు పడేటట్లు చేయవలెను. తూర్పువైపు ముఖముంచి, అర్ధనిమీలిత నేత్రములతో సూర్యదర్శనము చేసుకుంటూ మూడుసార్లు ఓం ను ఉచ్చరించి, గాయత్రీమంత్రము జపించాలి. కనీసము 108 అవశ్యము జపించవలెను. తరువాత అరచేతులను సూర్యునివైపు చూపి అగ్ని కాలుతున్నవిధముగా చేయవలెను. ఈవిధంగా చేస్తూ 12 సార్లు గాయత్రీమంత్రము జపించి, అరచేతులను రుద్దవలెను. అటుల మర్దించగా వేడి పుడుతుంది. ఆ వేడి అరచేతులను ముఖము, నేత్రములు, నాసిక, కంఠము, చెవులు, తల మొదలైన సమస్త శిరోభాగములపై స్పృశించవలెను.

రాజకీయ సాఫల్యతకు

ప్రభుత్వ కార్యముగాని, కోర్టుకేసులుగాని, పదవీ స్వీకరణగాని, పదవి కాంక్షించినవారికి విజయము చేకూరవలెనంటే గాయత్రీ ఉపయోగించవచ్చు. అధికారి సమ్ముఖమునకు వెళ్ళిన సమయంలోగాని లేక వినతిపత్రమును సమర్పించినపుడుగాని, ఏ శ్వాస పనిచేస్తున్నదో గమనించవలెను. దక్షిణస్వరము పనిచేస్తున్నయెడల పీతవర్ణపుజ్యోతిని ధ్యానించవలెను. లేక వామస్వరమైన పచ్చనిరంగు గల్గిన ప్రకాశమును ధ్యానించవలెను.

మంత్రములో సప్తవ్యాహృతులను జోడించి, పన్నెండు మంత్రములను మనస్సులో జపించవలెను. ఏ స్వరమాడుతున్నదో, ఆ చేతియొక్క అంగుష్ఠము గోరుపై దృష్టినుంచవలెను. భగవతీ గాయత్రీమాతను మానసికంగా ధ్యానిస్తూ, ఆరాధిస్తూ, ప్రార్థిస్తూ రాజద్వారములో ప్రవేశించిన విజయము చేకూరుతుంది.

దారిద్ర్య నాశనమునకు

దారిద్ర్యము, కష్టములు, ఋణభారము, పనిలేకుండుట, వస్తువులకొరత, అధికఖర్చు, ఆగిపోయిన పనులు, వర్థచింతననుండి ముక్తి పొందటానికి గాయత్రీ సాధన యెక్కువ సహాయపడి సిద్ధిని కలుగజేస్తుంది. ఈ సాధనవలన వర్తమాన ఆర్థిక విషవలయమునుండి విముక్తి గలిగి, సాధకునకు సంతోషజనక స్థితిని పొందేటట్లు తయారుచేస్తుంది. దారిద్ర్యనాశనముకొఱకు 'శ్రీం'శక్తి గాయత్రీలోనున్నదిగాన, దానిని ఉపాసించవలెను. మంత్రము చివర మూడుసార్లు శ్రీం బీజమును సంపుటీకరించలెను. సాధన సమయములో పీతవర్ణపు వస్త్రములు, పీతవర్ణపు పూలు, పీతవర్ణపు యజ్ఞోపవీతము, పీతవర్ణపు ఆసనములను వుపయోగించవలెను. శుక్రవారమునాడు శరీరమును పసుపు కలపిన

నూనెతో మర్దన గావించవలెను. ఆదివారమునాడు వుపవసించవలెను. పుసుపుపచ్చని వస్త్రధారిణి, గజారోహిణీయైన గాయత్రీమాతను భావించి ధ్యానించవలెను. పసుపువర్ణము లక్ష్మీదేవికి ప్రతిరూపము. భోజనంలో గూడా పసుపురంగు పదార్థములను ప్రధానంగా తీసికొనవలెను. ఈవిధంగా చేసిన యెడల ధనవృద్ధి, దారిద్ర్య నాశనము కలుగుతుంది.

సుసంతతి ప్రాప్తికోసము

సంతాన మెవరికి లేదో, సంతతి కలిగి మరణిస్తారో, రోగగ్రస్థులైనా, గర్భస్రావములు జరుగుతున్నా, కేవలము స్త్రీ సంతతియే కలుగుతున్నా తల్లిదండ్రులకు దుఃఖము గలుగుట స్వాభావికము. దీనినుండి భగవతీగాయత్రీ కృప వలన విముక్తి పొందవచ్చు.

ఈ సాధనలో స్త్రీ - పురుషు లిద్దఱూ కలసి ప్రయత్నించుట చాలా మంచిది. కేవల మొక్కరే భారాన్ని భుజస్కంధములపై మోసినందున ఆంశిక ఫలితమే దక్కుతుంది.

ప్రాతఃకాలమున నిత్యకర్మలను పూర్తిగావించుకొని, పూర్వాభిముఖులై సాధనకు కూర్చొనవలెను. నేత్రములను మూసికొని శ్వేతభూషణాలంకృత పన్నెండు సంవత్సరముల బాలిక రూపిణి, చేతియందు కలములను ధరించినట్టి గాయత్రీని భావించి ధ్యానించవలెను. ఐం-బీజమును జోడించి గాయత్రీ జపమును చందనపుమాలతో చేయవలెను.

నాసికతో శ్వాసను పీల్చి పొత్తికడుపువఱకు తీసికువెళ్ళవలెను. పొత్తికడుపును పట్టినంత గాలితో నింపవలెను. శ్వాసను ఆపి ఐం బీజమును సంపుటీకరించిన గాయత్రీ మంత్రమును కనీస మొక్కసారిగాని, మూడుసార్లు అధికంగాగాని జపించవలెను. తరువాత నెమ్మదిగా శ్వాసను వెలుపలకు పంపవలెను.

ఈవిధంగా వెన్నుముకలోనికి గాయత్రీ శక్తిని ఆకర్షించి, ధారణ గావించి ప్రాణాయామములను పదిసార్లు చేయవలెను. తదనంతరము తనయొక్క వీర్యకోశములో గాని లేక గర్భాశయములోగాని శుభ్రవర్ణజ్యోతిని భావించి ధ్యానించవలెను. ఆరోగ్యకరమైన అందమైన, తేజస్వియైన, గుణవంతులైన, బుద్ధిమంతులైన సంతానము కలుగుటకు యీ సాధన ప్రయోజనకారి. ఈ సాధన గావించు సమయములో ప్రత్యేకంగా ఆదివారంనాడు అన్నము, పాలు, పెరుగు మొదలైన కేవలము శ్వేతవస్తువులతో భుజించవలెను.

శత్రుసంహారము

ద్వేషము, కలహము సంభవించినపుడు, కోర్టులో కేసు పెట్టబడినపుడు, వైమనస్య మేర్పడినపుడు వాటిని తొలగించుటకు, అత్యాచారము, అన్యాయము జరిగినపుడు, దురాక్రమణ చేయువారి మనోవృత్తిని హరించుటకు, ఆత్మకు సమాజానికి శాంతి కలుగచేయవలసినపుడు నాలుగు 'క్లీం' బీజసంపుటి సమేతంగా రక్తచందనమాలతో, పశ్చిమాభిముఖంగా కూర్చుండి గాయత్రీ జపము గావించవలెను. జపకాలంలో యజ్ఞభస్మపు తిలకమును ధరించవలెను.

ఉన్ని ఆసనముపై కూర్చుండవలెను. ఎఱ్ఱని వస్త్రములు ధరించి, సింహారూఢి, ఖడ్గహస్తి, భయంకరముఖము కల్గిన దుర్గావేషధారిణిగా గాయత్రీదేవిని భావించి ధ్యానించవలయును.

ద్వేష దుర్భావములను నివారించవలసిన వ్యక్తి యొక్క పేరును రావిఆకుపై రక్తచందనపు సిరాతో, దానిమ్మకొమ్మను కలముగా చేసుకుని వ్రాయవలెను. ఆ ఆకును తల్లక్రిందులుగా వుంచి, ప్రతిసారి మంత్రమును జపించినతరువాత జలపాత్ర నుండి చిన్నచెంచాతో నీరు తీసికొని ఆ ఆకుపై నుంచవలెను. ఈవిధంగా 108 మంత్రములు జపించవలెను. దీనివలన శత్రువుయొక్క స్వభావములో పరివర్తన కలుగుతుంది. ఆతని ద్వేషించే సామర్థ్యము నశిస్తుంది.

భూతబాధ శాంతించుటకు

కొన్ని మనోవైజ్ఞానిక కారణాలవలన సాంసారిక వైపరిత్యములవలన ప్రేతాత్మల కోపములో అనేక ఉపద్రవములు కలుగుతాయి. కొంతమంది వున్మాదుల వలె ప్రవర్తిస్తారు. వారి మస్తిష్కములపై వేఱొక ఆత్మ ఆధిపత్యాన్ని వహించడము గోచరిస్తుంది. దీనికి భిన్నంగా మనుష్యుడుగాని, పశువుగాని చిత్రంగా రోగముచే బాధనొందుట జరుగుతుంది. మామూలు రోగముకన్నా భిన్నమైన రోగ మిది. భయంకరాకృతులు గోచరించడము, అదృశ్య మనుష్యునిద్వారా చేయబడిన క్రియలు భూతబాధకు నిదర్శనములు.

దీని నివారణకు గాయత్రీ యజ్ఞము సర్వశ్రేష్ఠము. సత్వగుణ హవన సామాగ్రి విధిపూర్వక యజ్ఞములు చేయవలెను. రోగిని సమీపమున దగ్గఱగా కూర్చుండనీయవలెను. హవనాగ్నిచే కాగిన నీటిని రోగిచే త్రాగించవలెను. ఆరిన హవన భస్మమును సురక్షితంగా హృదయముపై, కంఠమున, మస్తకముపై, చెవులపై, ముఖమునకు, నాసిక మీద పూయవలెను.

ఇతఱులను ప్రభావితులను గావించుటకు

తనకు వ్యతిరేకంగా ప్రవర్తించే వ్యక్తిని, అనుకూలంగా చేసికొనుటకు, తనపై ప్రేమ, అభిమానము కలిగేటందుకు గాయత్రీద్వారా ఆకర్షించవచ్చు. వశీకరణము ఘోరతాంత్రిక చర్యద్వారా గావించవచ్చు. కానీ చుంబకీయ ఆకర్షణ దీనివలన యితఱుల మనస్సును మరల్చుకొనుటకు, సద్భావనతో ఆకర్షించుకొనుటకు, గాయత్రీద్వారా దక్షిణమార్గ యోగసాధన గావించవచ్చు.

గాయత్రీ జపాన్ని మూడు ప్రణవములు జోడించి చేయవలెను. తన త్రికుటినుండి యొక నీలవర్ణ విద్యుత్తు తేజము త్రాడువలె సాగి శక్తిని విరజిమ్ముతూ, ఆకర్షించవలసిన వ్యక్తిని చేరునట్లుగా చేసి, ఆతని చుట్టూ వలయముగా తిరుగునట్లు చేసి బిగించినట్లుగా ధ్యానించవలెను. ఈవిధంగా చేయబడిన వ్యక్తి అర్థనిద్రితావస్థలో నెమ్మదినెమ్మదిగా తనకై ఆకర్షించబడతాడు. ఆతని ముఖంలో అనుకూలత, ప్రసన్నత గోచరిస్తుంది. ఆకర్షణకొఱకై ధ్యానము అతి ప్రభావశాలి.

ఇతఋల మనస్సులో, మస్తిష్కములో అనుచితమైన ఆలోచనలను దూరము గావించి, వుచితములైన ఆలోచనలు కలగజేయడానికి, శాంతచిత్తంతో ఆ యితఋ వ్యక్తి అఖిల నీలాకాశములో నిద్రిస్తున్నట్లు భావించుకొని, ఆతని విచారములను తొలగించి, మంచి ఆలోచనలను నింపుతున్నట్లు ధ్యానించవలెను. ఈ ధ్యానసాధన సమయములో తన శరీరముగూడా వదులుగా నుండవలెను. నీలవస్త్రముచే మూయబడి యుండవలెను.

రక్షా కవచము

మంచిరోజున ఉపవాస ముండి నాగకేశము, కస్తూరి, జాజికాయ, జాపత్రి, గోరోచనము యీ ఐదు వస్తువుల మిశ్రమముతో తయారుచేయబడిన సిరాతో, దానిమ్మపుల్లతో చేసిన కలముతో ఐదుసార్లు ఓం, ఓం, ఓం, భం, భం వీటితో కలపి గాయత్రీమంత్రాన్ని నునుపు చేయని కాయితముపైగాని, భోజపత్రముపైగాని వ్రాయవలెను. తరువాత వెండితాయత్తులో నుంచి, ధరించినవారికి అన్నివిధముల రక్షణ లభిస్తుంది. రోగమునుండి విముక్తి, అకాలమృత్యువు లేకుండుటకు, శత్రుభయము తొలగుటకు, చోరబాధలు, కష్టములు కలుగకుండుటకు, చెడ్డ రోజులు గడుచుటకు, కలహ నివారణకు, భయము, రాజదండన నుండి తప్పించుకొనుటకు, హింస కలుగుటకై చేసిన హోమం నుండి కాపాడబడుటకు యీ కవచము రక్షగా నుంటుంది. దీని ప్రతాపమువలన, ప్రభావముచే శారీరక, ఆర్థిక, మానసిక సుఖములు వృద్ధిచెందుతాయి.

పైన చెప్పబడినవిధంగా గాయత్రీమంత్రాన్ని లిఖించి కంచుతాయెత్తులో నుంచి ప్రసూతి సమయములో కష్టప్రసవముచే బాధపడు స్త్రీకి చూపి, నీటిలో కడిగి ఆ నీటిని త్రాగించిన సుఖప్రసవము శీఘ్రంగా జరుగుతుంది.

దుశ్శకున, దుర్ముహూర్త పరిహారము

సాధారణంగా అపుడపుడు యే పని చేయదలచినా, వెళ్ళదలచినా ఆ సమయములో నున్న శకునముగాని, ముహూర్తముగాని సుముఖముగా లేని కారణమున కార్యము కొనసాగించుటకు సంకోచము కలుగుతుంది. ఆ సమయములో 108 సార్లు గాయత్రీ జపము చేసి కార్యమును ఆరంభించవచ్చు. అందువలన అన్ని అరిష్టములు, కుశంకలు మటుమాయమౌతాయి. అరిష్టములు సంభవించవు. వివాహము జరుగకుండ, తన జాతి వధువు గాని, వరుడుగాని లభించనపుడు, వివాహముహుర్తములో సూర్యుడు, బృహస్పతి, చంద్రుడు మొదలైన గ్రహములకు నీచత్వము పీడ సంభవించినపుడు సహస్రగాయత్రీ జపము చేసి లఘు అనుష్ఠానము చేసినయెడల ఆ పీడ తొలగుతుంది. అపుడే వివాహము చేయవలెను. ఆ వివాహము జ్యోతిష సమ్మతమైన వివాహము మాదిరి నిర్మలమైనదిగా భావించవలెను.

దుస్వప్న ఫల నాశనమునకు

రాత్రిగాని, పగలుగాని నిద్రించునపుడు భయంకర కలలు గోచరిస్తాయి. వాటివలన స్వప్నకాలములో గూడా వ్యాకులత, దుఃఖము కలుగుతుంది. నిద్ర మేల్కొనిన తరువాతగూడా ఆ స్వప్నము స్మరణకు వచ్చి మనస్సును ఆందోళనకు గురిచేస్తుంది. అటువంటి స్వప్నములు అరిష్టానికి సంకేతాలు. అటువంటి స్వప్నములు కలిగినపుడు సప్తాహము పది పది మాలలు గాయత్రీ జపము చేయవలెను. గాయత్రీదేవిని పూజించవలెను. గాయత్రీ సహస్ర నామము గాయత్రీ చాలీసా దుస్వప్న ప్రభావములను నాశనము చేస్తాయి.

పైన పంక్తులలో కొన్ని ప్రయోగములు మాత్రమే సూక్ష్మంగా చెప్పబడినాయి. అనేక విషయములలో అనేక పద్ధతులలో గాయత్రీ వుపయోగపడుతుంది. వాటి పని చాలా విస్తృతమైనది. చిన్న చిన్న వాక్యములలో వాటిని వ్రాయడం దుర్లభము. వానిని స్వయంగా అనుభవించవలసినదే లేక ఈ మార్గంలో ఎవరైనా అనుభవజ్ఞుడైన సఫల ప్రయోక్తద్వారా ఒక ప్రదర్శన చేయబడితే దానిద్వారా తెలియవలసినదే. గాయత్రీ మహిమ అపారము, ఆమె కామధేనువు. గాయత్రీ సాధన చేయు వ్యక్తి యేనాటికి నిరాశ చెందడు. అతనికిగాని, ఆమెకుగాని నిరాశ కలుగదు.

గాయత్రీ మంత్రపు అర్థ చింతనః-

ఓం - బ్రహ్మ

భూః - ప్రాణస్వరూపము(భూలోకానికి ప్రతీక)

భువః - దుఃఖనాశకము (భువర్లోకానికి ప్రతీక)

స్వః - సుఖస్వరూపమైన (స్వర్గానికి ప్రతీక)

తత్ - ఆ, అది, ఆ శక్తి

సవితుః - తేజస్వి, ప్రకాశవంతుడు (సూర్యుడనికూడ అర్థమున్నది)

వరేణ్యం - శ్రేష్టమైన

భర్గో - పాపనాశకము (ఈశ్వరుడనికూడ అర్థమున్నది)

దేవస్య - దివ్యమైన, ఇచ్చునటువంటివాడు

ధీమహి - ధారణ గావించి

ధియో - బుద్ధిని

యో - యేది

నః - మనయొక్క

ప్రచోదయాత్ - ప్రేరేపించుగాక!

గాయత్రీమంత్రపు అర్థమును చింతించుటవలన అంతఃకరణంలో మనుష్యుడు దైవత్వం వైపు ప్రయాణించుటకు అవసరమైన తత్త్వములు విజృంభిస్తాయి. ఆ భావము చాలా శక్తివంతమైనది. ఉత్సాహప్రదమైనది సత్త్వగుణ ప్రధానమైనది. సాటిలేనిది, ఆత్మబలమును పెంపొందించునట్టిది. ఈ భావములను నిత్యమూ కొంచెముసేపు మననము చేయవలెను.

మననము చేయుటకు కొన్ని సంకల్పములు క్రింద నీయబడినవి. ఈ శబ్దములను కనులు మూసుకొని మనస్సులోనే పునః ఉచ్చరించవలెను. కల్పనాశక్తితో, భావుకతతో, మానసచిత్రంలోని మనోలోకంలో యెక్కువగా అంకితము గావించుకొనవలెను.

1. భూలోకము, భువర్లోకము, సువర్లోకము యీ మూడు లోకాలలో 'ఓం' పరమాత్మ నిండివున్నాడు. ఈ సమస్త విశ్వబ్రహ్మాండము పరమాత్మయొక్క సాకార స్వరూపము. అణువణువునా భగవంతుడున్నాడు. సర్వవ్యాపకుడైన పరమాత్మను సర్వత్రా దర్శిస్తూ చెడు కర్మలను కువిచారములను ఎల్లప్పుడూ దూరంగా వుంచవలెను. సంసారపు సుఖశాంతులను, శోభను పెంపొందింపజేసేటందుకు పరమాత్మకు నిజమైన పూజ చేయవలెను.

2. తత్ - ఈ పరమాత్మ, సవితుః - తేజస్వి, వరేణ్య - శ్రేష్ఠ, భర్గో - పాపరహితము మఱియు దేవస్య - దివ్యమైనది. దానిని అంతఃకరణమునందు ధారణ గావించుకొనుచున్నాను. ఈ గుణసంపన్నుడైన భగవానుడు నా అంతఃకరణమందు నెలకొని నన్ను తేజస్విగాను, శ్రేష్ఠునిగాను, పాపరహితునిగాను, దివ్యునిగాను నొనరించును. నేను ప్రతిక్షణము యీ గుణములచే యోగ్యుడనగుచున్నాను. ఈ రెండూ నా మస్తిష్కమునందు నా శరీరపు ప్రతికణమునందు వృద్ధిపొందుగాక! ఈ గుణముల కలయిక జరుగుతుంది.

3. ఆ పరమాత్మ, నః- మనయొక్క, ధియో - బుద్ధిని, ప్రచోదయాత్ - సన్మార్గము వైపు ప్రేరేపించుగాక! మనకందఱకూ, మన స్వజనులకూ, పరిజనులకూ బుద్ధి సన్మార్గము వైపు పయనించుగాక! ఈ ప్రపంచమునందు అన్నింటికంటే మిన్నయైన ఐశ్వర్యసుఖాలు, భోగములు మొదలైనవి అది మాతయొక్క ఆశీర్వచనముచే సద్బుద్ధిని పొంది, యీ జీవితమందే స్వర్గీయ ఆనందములను అనుభవించెదముగాక! మానవ జన్మ సఫలమగుగాక!

పైన పేర్కొనబడిన మూడు భావములను నెమ్మదినెమ్మదిగా చింతనా సంకల్పములుగా మననము గావించుకొనవలెను. ప్రతియొక్క శబ్దముపై కొంచెము సమయము ఆగి ఆ శబ్దపు కల్పనాచిత్రమును మనఃఫలకము మీద ముద్రించుకొనవలెను.

ఈ శబ్దమును పలుకునపుడు భూః, భువః స్వః పరమాత్మ మూడు లోకములయందు వ్యాపించియున్నాడని, మనము పాతాళలోకము, పృథ్వీలోకము, స్వర్గలోకమును పూర్తిగా మనస్సుతో దర్శించుతూ, ఆ లోకములలో వేడి, ప్రకాశము, విద్యుశ్శక్తి, ప్రాణులమాదిరిగా పరమాత్మ సర్వత్రా వ్యాపించియున్నాడని కల్పనా సంకల్పమును గావించవలెను. ఈ విరాట్ బ్రహ్మాండము ఈశ్వరునియొక్క ప్రత్యేక జీవిత జాగృతసాకార ప్రతిమ.

గీతలో అర్జునునకు భగవానుడేవిధంగా తన విరాట్ స్వరూపాన్ని చూపాడో ఆవిధంగా మనము మనయొక్క కల్పనాలోకంలో మానసిక చక్షువులతో ఆ మహనీయుని బ్రహ్మాండవిరాట్ స్వరూపమును దర్శించవలెను. హృదయం నిండా విరాట్‌బ్రహ్మను, విశ్వపురుషుని తృప్తిగా కాంచవలెను. నా నలువైపులా పరమాత్మయే, పరమాత్మమాత్రమే

యున్నాడని భావించవలెను. అట్టి మహాశక్తి సర్వత్రా మనచుట్టూ వ్యాపించి యున్నపుడు చెడ్డభావములకు కుకర్మలకు ఆస్కారము అంగీకారమెట్లుంటుంది. ఈ విశ్వపురుషుని ప్రతికణకణము నాకు పూజనీయము. ఆ విశ్వపురుషుని సేవచేసి, సురక్షాశోభ పెంపొందించే ప్రవృత్తిని కలిగియుండుటయే నా జీవితమునకు శ్రేయస్కరము.

సంకల్పానికి రెండవభాగమును ఆలోచించేటపుడు మన హృదయంలో భగవానుని సింహాసనమును భావించి అనుభవించవలెను. ఆ పరమతేజస్వి, సర్వశ్రేష్ఠ, నిర్వికార, దివ్యగుణసంపన్నుడైన పరమాత్మ నా సింహాసనముపై విరాజిల్లుచున్నట్లు దర్శించవలెను. భగవానుని సందర్శనాస్వరూపము మూడువిధములు.

1. విరాట్ పురుషరూపము.

2. రామ, కృష్ణ, గాయత్రీ, సరస్వతి మొదలైన రూపములు

3. దీపజ్యోతి స్వరూపము

ఈ సర్వరూప దర్శనము తమతమ భావనానుగుణ్యంగా, ఇష్టానుసారంగా అభిరుచులనుబట్టి వుంటుంది. పరమాత్మను పురుషరూపంలోగాని లేక గాయత్రీమాత రూపంలోగాని అభిరుచి కనుగుణ్యంగా ధ్యానించవచ్చు. పరమాత్మ స్త్రీ మఱియు పురుషుడు కూడ! గాయత్రీ సాధకులకు మాత గాయత్రీ రూపంలో బ్రహ్మను ధ్యానించుటలో అధిక రుచి సంతృప్తి వుంటుంది. సుందరమైన కాంతి కిరణమును ధ్యానిస్తూ, ఆ జ్యోతిలో సూర్యసమాన తేజస్సునూ, సర్వోపరి శ్రేష్ఠతనూ, పరమపవిత్రతనూ, నిర్మలతనూ, దివ్యసత్త్వగుణమునూ దర్శించవలెను. ఈవిధంగ గుణ రూప స్వరూపమైన బ్రహ్మశక్తి తన హృదయంలో స్థాయీ రూపంలో నిర్మించుకొని రోమరోమములయందు ఆ రూపమును నిండించుకొన్నట్లు భావించుకొనవలయును.

సంకల్పానికి మూడవ భాగము ఆలోచించేటపుడు ఆ గాయత్రీ బ్రహ్మ శక్తి మన హృదయములయందు నివసిస్తున్నట్లు భావన చేసి మన మస్తిష్కములోని బుద్ధిని పట్టుకొని సాత్త్విక, ధర్మ, కర్తవ్య, సేవా సన్మార్గములవైపు ఈడ్చుకుపోతున్నట్లు అనుభవించవలెను. ఈ మూడు సంకల్పములు ప్రేమను కలిగించి, ఆనందంతో, ఉత్సాహంతో, సంతోషాన్ని కలిగించి మాత గాయత్రీ మనతో పయనిస్తున్నట్లు బుద్ధి భావనను సదా యేర్పరచుకొనవలయును.

గాయత్రీలో నీయబడిన యీ మూడు భావనలు క్రమంగా జ్ఞానయోగమునకు, భక్తియోగమునకు, కర్మ యోగమునకు ప్రతీకలు. ఈ మూడు భావనలు వ్యాపించి విస్తరించి యోగముయొక్క జ్ఞాన, భక్తి, కర్మలనే మూడిటికి ఆధారమైనవి. గాయత్రీ చింతనకు అర్థము బీజరూపంలో మన అంతఃకరణను యీ మూడు యోగముల త్రివేణిలో స్నానము గావించుటతో సమానము.

ఈవిధంగా చింతించినట్లయితే గాయత్రీమంత్రానికి అర్థము సంపూర్తిగా హృదయంగమమౌతుంది. ఆ భావనా సముద్రము మనఃఫలకంపై చెదరకుండా వుంటుంది. అందువలన పరిణామస్వరూపంగా కొన్ని దినములలో మనస్సుకు విచారములు లేకుండ, కుకర్మగామి కాకుండా వుండుట జరుగుతుంది. మనుష్యోచిత సద్విచారములలో మనస్సు సత్కర్మానుష్ఠానములో లగ్నమై ఆనందరసాన్ననుభవిస్తుంది. ఈ ప్రవృత్తి ఆరంభంలో చాల నెమ్మదిగా నున్నప్పటికీ, మొదలైనది నశించకుండా ఆత్మ దినదినానికి సమున్నతంగా మారుతూ, జీవన పరమలక్ష్య సమీపానికి చేర్చుట నిశ్చయము.

మాతతో మాట్లాడుటకు సాధన

సాధనయొక్క దివ్యజ్యోతి అధిక ప్రకాశాన్ని సంతరించుకొన్నకొద్దీ అంతఃకరణ గ్రాహ్యశక్తి అభివృద్ధి పొందుతుంది. రేడియో యంత్రంలో బల్బుంటుంది. విద్యుత్సంచారంతో ఆ బల్బు వెలుగుతుంది. వెలుగు వచ్చిన వెంటనే యంత్రంలోని ధ్వనిని గ్రహించే భాగము జాగృతమవుతుంది. ఈథర్ తత్త్వములో భ్రమణము చేస్తూవుండే సూక్ష్మశబ్దతరంగములను పట్టుకొనుట జరుగుతుంది. ఈ ప్రక్రియను రేడియో మ్రోగడము అంటారు. సాధన ఒక విద్యుత్తు. దీనివలన మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములనే బల్బు దివ్యజ్యోతిగా వెలుగుట ప్రారంభించుతుంది. ఈవిధంగా ప్రత్యక్షంగా సరాసరి ప్రభావము అంతరాత్మపై పడుతుంది. దానివలన సూక్ష్మచేతనత్వము జాగృతమౌతుంది. తద్వారా దివ్యసందేశాలను, ఈశ్వరీయ ఆదేశములను ప్రకృతిలో గుప్తరహస్యములు అవగాహనమగుటకు తగిన యోగ్యత వుత్పన్నమౌతుంది. ఈవిధంగా సాధకుని అంతఃకరణము రేడియోలాగ తయారవుతుంది. దీనివలన సూక్ష్మజగత్తులో నున్న గహనమైన ఘనమైన రహస్యములు ప్రకటితమవుతాయి.

దర్పణమెంత స్వచ్ఛంగా, నిర్మలంగా నుంటుందో ప్రతిబింబముకూడా అంత స్ఫుటంగానూ, స్పష్టంగానూ గోచరిస్తుంది. మలిన దర్పణము కపటమైనది, నమ్మదగినదిగాదు. అందులో ముఖము సరిగా కనిపించదు. సాధనవలన అంతఃకరణ నిర్మలమవుతుంది. దైవీతత్త్వములు ఈశ్వరీయ సంకేతాలు స్పష్టంగా అనుభవమౌతాయి. చీకటిలో జరుగుతున్నదేమిటో తెలుసుకోవడము కష్టము. దీప సహాయంతో దీపము వెలిగించిన వెంటనే క్షణంలో అంధకారములో దాగివున్న ప్రతి సంగతీ ప్రకటమవుతుంది. తెలియని రహస్యము స్పష్టంగా ప్రత్యక్షంగా గోచరిస్తుంది.

గాయత్రీ సాధకుల మనోభూమి శుభ్రమౌతుంది. ఆ మనస్సులో అనేక గుప్తవిషయ రహస్యములు తమంతట తామె స్పష్టంగా తెలియడము ప్రారంభమౌతుంది. నిజంగా యీ పరిస్థితి నెలకొన్నట్లయితే గాయత్రీ దర్శనము, సంభాషణ యని యీ స్థితిని చెబుతారు. సాధనయొక్క పరిపక్వస్థితిలో స్వప్నంలోగాని లేక జాగ్రదావస్థలోగాని భగవతి దర్శనమొందటానికి యోగ్యమైన దివ్యచక్షు లాభము కల్గుతుంది. ఆ మాతృదేవి సందేశము వినడానికి యోగ్యమైన కర్ణ సౌభాగ్యము కలుగుతుంది. కొందరికి ప్రకాశవంతమైన జ్యోతిస్వరూపంలోను మఱికొందఱికి అలౌకిక దేవ రూపంలోను, ఇంకొందఱికి బంధురూపంలోను, స్నేహమయ నారీ రూపంలో కొంతమందికి దర్శనమిస్తుంది. ఆమె సందేశము భాషణ ద్వారా కొందఱు సాధకులకు లభిస్తుంది.

కొంతమందికి మాటలు వినిపిస్తాయి. అపుడపుడు తెలియజేయబడుతాయి. ఆకాశవాణి మాదిరి స్పష్టమైన సందేశము కొన్నిసార్లు లభించడము జరుగుతుంది. సాధకుని మనోభూమిపై సందేశమాధారపడి వుంటుంది. అందఱికీ ఈవిధమైన అనుభవము లభించదు.

కానీ సాధకుడైన ప్రతీవ్యక్తి యేదోవొకవిధంగా తల్లి సమీపానికి చేరుతాడు. ఆ వ్యక్తికి తన ఆత్మికస్థితి కనుగుణ్యంగా స్పష్టంగాగాని, అస్పష్టంగా గానీ సమాధానము ప్రాప్తిస్తుంది. మఱియొక పద్ధతి ఏమనగా - ఏకాంతస్థానంలో శాంతచిత్తంతో విశ్రాంతిగా శరీరమును సడలించి, తేలికగా చేయవలెను. చిత్తమును చింతారహితముగావించవలెను. శరీరము, వస్త్రము శుభ్రంగా నుండవలెను. కనులు మూసుకుని కూర్చుండవలెను. ప్రకాశవంతమైన జ్యోతినిగాని, హంసవాహిని

రూపములోనున్న గాయత్రీదేవి శక్తిని హృదయస్థానమున ధ్యానించవలెను. మనస్సులో భగవతీ సమ్ముఖమును మఱల మఱల గుర్తుతెచ్చుకోవలెను. ఈ ధ్యానమును పదినిముషములు చేసిన తదుపరి మూడు దీర్ఘశ్వాసలు తీసుకొనవలెను. ఈ శ్వాస పీల్చునపుడు అఖిలవాయుమండలములో వ్యాపించియున్న మహాశక్తిని శ్వాసద్వారా ప్రవేశింపజేసుకుని అంతః కరణపు ప్రతికణమునందు వ్యాపింపజేసినట్లు భావించవలెను. ఇపుడు ధ్యానమును నిలుపవలెను. మనస్సులో నున్న అన్నిరకముల ఆలోచనలు పూర్తిగా లేకుండ చేయవలెను. మనతరపునుండి ఆలోచనలను రానీయగూడదు. మనస్సు, హృదయము సర్వదా ఆలోచనా శూన్యము గావలెను.

ఈ శూన్యావస్థలో స్తబ్ధతను భంగపరుస్తూ అంతఃకరణములో స్ఫురణ కలుగుతుంది. దీనిలో అనాయాసముగా అచింత్య భావములు వుత్పన్నమౌతాయి. అనగా యేదో అజ్ఞాతశక్తి వలన మనస్సుకు సమాధానము తడుతుంది.

ఈవిధంగా చెప్పబడిన సాధన పవిత్ర హృదయ సాధనద్వారా ఇంకా అధిక దివ్య పవిత్రత వలన పరిపూర్ణమౌతుంది. అపుడు వ్యష్టి అంతరాత్మ సమిష్టి పరమాత్మ రూపంలో సూక్ష్మదైవీశక్తికి సమానమై వ్యాప్తి చెంది ఆ పవిత్ర హృదయ ఫలకముపై పనిచేయడము ప్రారంభిస్తుంది. ఆ సమయములో వివాదాస్పదమైన, సందేహాన్వితమైన రహస్యమయమైన ప్రశ్నలకు అనుమానాలకు, శంకలకు జవాబు లభిస్తుంది. ఈ ప్రక్రియవలన భగవతీ వేదమాత గాయత్రి సాధకునితో సంభాషిస్తుంది. జిజ్ఞాసువులకు సమాధాన మిస్తుంది. ఈక్రమము నియమయుక్తంగా, క్రమపద్ధతిలో పురోగమించితే అభివృద్ధి చెంది, శరీర రాహిత్య దివ్యమాతతో, జన్మనిచ్చిన శరీరధారి యైన తల్లితో సంభాషించినట్లు సంభాషించుట, సల్లాపించుట, సమాధానము పొందుట అవశ్యము జరుగుతుంది. క్రమేణా సుగమమవుతుంది.

అమ్మతో సంభాషణ తక్కువస్థాయి విషయములకొఱకు చేయరాదు. విశేషించి ఆర్థికసమస్యల లోభితనానికి జరుపరాదు. ఈ ప్రశ్నలతో స్వార్థపరమైన, సాంసారికమైన యితఱ మలిన భావనలు వుత్పన్నమవుతాయి. మాతతో సంభాషించుటకు అనువైన పవిత్ర అంతఃకరణమును అపవిత్రము చేస్తాయి. దొంగిలించబడిన వస్తువులు, భూమిలో గుప్తంగా దాచబడిన ధనసంపదలు, సంతలో ధరలు హెచ్చుతగ్గులు, జూదము, లాటరీ, జయాపజయములు, ఆయువు, సంతానము, స్త్రీకోర్టు దావాలు, వుద్యోగము, లాభనష్టాల గురించి మధ్యవర్తిగా జేసి ప్రజ లా దేవి శక్తితో సంభాషించదలచితే మాతదృష్టిలో వారు సంభాషించుటకు అధికారులుగారు. బహుశా అట్టి అనధికారుల ప్రయత్నము సఫలీకృతము గాదు. వారి మనస్సులలో దైవీసందేశము రాదు. మాతతో సంభాషించుటకన్నా, యితఱులు వారి కెక్కువ ఫలస్వరూపంగా జరిగే సహాయము, లోకకళ్యాణము సందిగ్ధంగా నుంటుంది.

ఈ దోషము ప్రస్తుతము ప్రజలలో అధికముగా నున్నది. ధనముకున్న అధిక ప్రాముఖ్యతముందు యీ యుగంలో ఆధ్యాత్మికశక్తి బహు అల్పమైనదిగా భావించబడుతున్నదని అర్థము. వారి దృష్టిలో దేవీ, దేవతల పూజ ఈశ్వరోపాసనకు మూల్యము, వాటిద్వారా సాంసారిక వైభవము సంపద పొందుట. రూపాయి మోహినీమాయ మనుష్య బుద్ధి, దానము కోసము ధర్మాన్ని వేగంగా త్యాగము చేయడానికి, అమ్మడానికి తయారై ధనాన్వేషణచే ఆచ్ఛాదితమైనది. ఈరకం ప్రజలు కొంచెము పూజ గావించిగాని, జపము చేసిగాని, భజనతోగాని స్వల్పంగా కర్మకాండ జరిపి వారు అలౌకికశక్తి నుండి అవసరమొచ్చిన దైవీ సహాయము పొందలేరు. తమ దృష్టిని వున్నతముగా నుంచుకోవలెను. కేవలము స్వార్థముకొఱకేగాక పరమార్థమువైపుగూడా దృష్టి సారించవలెను. ఆచరించవలెను.

ఆధ్యాత్మిక, ధార్మిక, ఆత్మకళ్యాణ కారకమునకు, జనహితమునకు, పారమార్థికతకు, కామితానికి సంబంధించిన ప్రశ్నలకు జవాబులకొఱకుమాత్రమే మాతతో సంభాషించవలెను. కర్తవ్యాకర్తవ్యముల చిక్కునుండి విడదీయుటకు. వివాదాస్పద ఆలోచనలకు సమాధానము కావలసినపుడు, విశ్వాసములు గౌరవించదగిన సాంప్రదాయములగురించి మాతతో సంభాషించుట మొదలిడవలెను.

ఈవిధమైన సంభాషణలలో తనయొక్క, ఇతఋలయొక్క పూర్వజన్మలు, పూర్వసంబంధములు మొదలైన మహావిషయములు వెలువడతాయి. జీవన నిర్మాణాని కవసరమైన మార్గము లభించి, ఆవిధంగా నడచుకొనిన ఆశాజనకమైన ప్రయోజనములు సమకూడుతాయి. సద్గుణములు, సాత్త్వికభావములు, మనోబలము, దూరదర్శనత్వము, బుద్ధి, ఆంతరంగిక శాంతి కలుగుతాయి. ఇది తప్పక జరుగుతుంది. ఈవిధంగా తల్లితో సంభాషణ, సాధకునకు శ్రేయస్కరము, కళ్యాణకారకసిద్ధియై యున్నది.

సాధకుల స్వప్నము నిరర్థకం గాదు

సాధనవలన విశేషమైన దిశలో మనోభూమి నిర్మాణమౌతుంది. శ్రద్ధ, విశ్వాసము, సాధనాపద్ధతి ప్రణాళికాను సారంగా, ఆంతరిక క్రియలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారములనే చతుష్టయము లా మార్గంలో ప్రయాణించుట జరుగుతుంది. అవి ఆ రూపాన్నే ధరిస్తాయి. భావనా సంస్కారములు అంతర్మనస్సులో చొచ్చుకొనిపోతాయి. గాయత్రీ సాధకునకు మానసికస్థితిలో ఆధ్యాత్మిక, సాత్త్వికతలు ప్రముఖస్థానాన్ని పొందుతాయి. అందువలన జాగ్రదావస్థలో మాదిరి స్వప్నవస్థలోగూడా సాధకుని క్రియాశీలత సారగర్భితము వైపున్నందున, ఆతనికి సార్థక స్వప్నములు గోచరిస్తాయి.

సాధారణవ్యక్తుల మాదిరిగా గాయత్రీ సాధకులకు విరుద్ధస్వప్నములు చాలా తక్కువ. అతని మనోభూమి అస్తవస్త స్వప్నములను గాంచుటకు అనువైనరీతిలో నుండదు. క్రమము వ్యవస్థలున్నచోట జరిగే పనులన్నీ క్రమముగాను, సువ్యవస్థితముగా నుంటాయి. గాయత్రీ సాధకుల స్వప్నములను మేము చాలాకాలంనుండి వినుచున్నాము. వాటి మూలకారణములపై విచారణ జరుపుతున్నాము. తదనుసారంగా, సాధకుల స్వప్నములలో అధికముగా నిరర్థకములు గావు. వాటిలో సార్థకతయే యెక్కువ భాగము.

నిరర్థక స్వప్నములు అసంపూర్ణములు. అందులో అసలు సంగతుల ఛాయ బహుకొద్దిగా వుంటుంది. వెంటనే తారుమారవుతాయి. దైనిక వ్యవహారముల సాధారణ క్రియల సామాన్యస్మృతి మస్తిష్కంలో పునఃపునః జాగృతమవు తుంటాయి. భోజనము, స్నానము, గాలి పీల్చడం లాంటి సాధారణ చర్యలు దైనిక స్మృతులను తారుమారుజేసి అస్తవ్యస్త స్వప్నములకు కారణమౌతాయి. ఆ స్వప్నములు అర్థరహితములు. స్వప్నములు విశేషమైన ప్రత్యేకత గలవి. అందులో విచిత్రత, నవీనత, ఘటనాక్రమము, ప్రభావోత్పాదక క్షమత వుంటుంది. ఆ స్వప్నములను గాంచుటలో భయము, శోకము, చింత, క్రోధము, సంతోషము, విషాదము, లోభము, మోహాది భావములు గలుగుతాయి. నిద్రలేచినప్పటికి వాటి ప్రభావము, ఛాయ మనస్సుపై నుంటుంది. పదేపదే యీ స్వప్నాని కర్థమేమిటని మనము తలపోస్తుంటాము.

1. కుసంస్కారముల బహిష్కరణ

సాధకుల సార్థక స్వప్నములను 4 భాగములుగా విభజించవచ్చు.

1. పూర్వ సంచిత కుసంస్కారముల బహిష్కరణ

2. శ్రేష్ఠతత్త్వముల వ్యవస్థాపనా ప్రకటీకరణ

3. భవిష్యత్సంభావనల సూచన

4. దివ్యదర్శనము

గాయత్రీ సాధనద్వారా ఆధ్యాత్మిక నవ్యతత్త్వముల వృద్ధి అంతఃకరణములో జరుగుతుంది. కావున సంచిత కుసంస్కార బహిష్కరణ జరుగుతుంది. అందువలన కుసంస్కారములను పోగొట్టే స్వప్నములొస్తాయి. వస్తువు నొకచోట నుంచినపుడు, రెండవ వస్తువును తొలగించవలసి వుంటుంది. గ్లాసును నీటితో నింపవలసినపుడు దానిలోనున్న గాలిని తొలగించవలెను. రైలుపెట్టెలో క్రొత్త ప్రయాణీకులను కూర్చోపెట్టవలెనంటే పాత ప్రయాణీకులు ఖాళీ చెయ్యాలి. పగటి ప్రకాశము వచ్చిన వెంటనే అంధకారము పోతుంది. అదేవిధంగా గాయత్రీ సాధకుని అంతఃకరణములో వృద్ధిచెందే దివ్యతత్త్వములు సుసంస్కారములకు స్థాన మేర్పరచుటకు, కుసంస్కారములను పారద్రోలడము స్వాభావికము. ఈ బహిష్కరణ జాగ్రదావస్థలోనూ, స్వప్నావస్థలోనూ జరుగుతుంది. విజ్ఞాన సిద్ధాంతానుసారము విస్ఫోటనము ద్వారా ఉష్ణశక్తి పదార్థము, స్థానచ్యుతి నొందినపుడొక వూపు వస్తుంది. తుపాకీ ప్రయోగింపబడినపుడు దాని వెనుకవైపు బలమైన వూపు వుంటుంది. పెద్ద సమూహము మండునపుడు శబ్దము పుడుతుంది. దీపము ఆరిపోయేముందు పెద్దగా వెలుగుతుంది. అదేమాదిరి కుసంస్కారము మానసలోకమును వదలేటపుడు, ప్రయాణ సమయములో మస్తిష్కతంతువులను కదలించి దెబ్బవేస్తాయి. ఆ ఆఘాతంవలన ప్రతిస్వరూపంగా విక్షేపములు వుత్పన్నమౌతాయి. ఆ స్వప్నావస్థలో భయంకర, అస్వాభావిక, అరిష్ట, ఉపద్రవరూపములు కనుపిస్తాయి.

భయానక హింస, పశువులు, సర్పములు, సింహములు, వ్యాఘ్రములు, పిశాచములు, చోరులు, బందిపోట్లు మొదలైన ఆక్రమణలు వినుట, చూచుట, ఏకాంతము, భయము గల్గించే అరణ్యములు కనుపించుట, ప్రియజనుల మృత్యువు, అగ్నికాండదహనము, కరువు, భూకంపములు, యుద్ధము మొదలైన భయానక దృశ్యములు చూడటము, అపహరణ జరగడము, అన్యాయము, అలసట, విశ్వాసఘాతుకముల ద్వారా మనలను బాధించుట, విపత్తులు రావడము, అరిష్టములతో, అనుమానములతో చిత్తము గాభరాచెందుట మొదలైన మనస్సును ఆందోళనపఱచే స్వప్నములు సంభవించి, వాటి కారణంగా మనస్సు చింతా, శోక, దుఃఖ, భయ, క్రోధ, ద్వేష, పిఱికి, గ్లాని, ఘృణ మొదలైన భావములు వుత్పన్నమౌతాయి. అవి పూర్వసంచిత కుసంస్కారముల అంతిమ కదలికకు ప్రమాణము. జన్మజన్మాంతరముల సంచిత కుప్రవృత్తుల అంతిమదర్శనమని, అభివాదన గావించుతూ శలవు తీసుకుంటున్నాయని యీ స్వప్నములు చెబుతున్నాయని అర్థము. మనస్సు యీ స్వప్నములలో పరివర్తనమును ఏకాగ్రతతో గమనిస్తూ, ప్రత్యేక అలంకారిక కథారూపంలో యేదో శృంఖలాబద్ధ ఘటనాచిత్రకల్పిత కందకాన్ని యేర్పరచి, దానిని స్వప్నరూపంలో చూసి జీవుడు తృప్తి చెందుతాడు.

కామవాసనలు, యితఱ ప్రవృత్తులు బలీయమైనవి. కామభోగములు, స్వాధీనములో లేని కోర్కెలు మనస్సులో వుద్భవిస్తాయి. వాటిని తీర్చుకోవడానికి వీలులేదు. అందువలన పరిస్థితుల కనుగుణ్యంగా అవి దుర్మార్గంగా మారుతాయి. మనస్సును స్వాధీనము చేసుకొని అవి సంతుష్టిలేని, తృప్తిలేని ప్రేయసిమాదిరి అంతర్మనస్సనే కోపగృహంలో మంచముపై పడివుంటాయి. అసంతృప్తి మౌనంగా వుండదు. అవకాశమొచ్చినపుడు నిద్రావస్థలో తన గొప్పదనాన్ని అధికారాన్నుపయోగించి చరితార్థత పొందేటందుకు మనస్సనే లడ్డును భుజించటానికి మనస్సుకు నచ్చినరీతిలో స్వప్నాన్ని రచించి అభినయిస్తుంది. పగలు యింటిలోనివారు మేల్కొన్నందున ఎలుకలు భయపడతాయి. తమ బొరియలనుండి బయటకు రావు. రాత్రి యింటివారు నిద్రించిన వెంటనే ఎలుకలు తమ కలుగులనుండి బయటకు వచ్చి నిర్భయంగా

తిరుగుతూ, దూకుతూ అల్లరిచేస్తాయి. తీరని కామవాసనలుకూడ యీ పనినే చేస్తాయి. ఇవి జ్ఞాపకమనే పలావును భుజించి యేదోవిధంగా తమ క్షుత్తును తీర్చుకుంటా

స్వప్నావస్థలో సుందరమైన వస్తువులను చూచుట, వాటితో ఆడుకోవడము, ప్రేమించడము, సంపాదించడము, రూపవతులైన స్త్రీలను గాంచుట, వారికి దగ్గరగా చేరడము, మనోహరమైన నది, చెఱువు, వనము, ఉపవనము, పుష్పములు, ఫలములు, నృత్యము, గీతము, వాయిద్యము, ఉత్సవము, పూజాసమూహము మొదలైన దృశ్యములను చూసి అసంతృప్తి వాసనలు తమను తృప్తిపఱచుకొంటాయి. ధనాశ, పదవీవ్యామోహము, కీర్తికాంక్ష మొదలైన తీరని ఆకాంక్షలు గూడా తమ తృప్తికొఱకు కృత్రిమ అభినయములను సృష్టించుకొంటాయి. కొన్నిసార్లు తన అసంతృప్తివలన కలిగే బాధలు మానసిక గాయములు, కష్టములు స్పష్టంగ అనుభవించుటకొఱకు ముందుగానే స్వప్నరూపంలో కనుపించి మన అసంతృప్తిని యెక్కువ చేస్తాయి. కొంచెము సుఖము గూడా చేజాఱిపోతుంది. మనోవాంఛ తీరినప్పటికీ, ఆకస్మిక కారణముచే విఘ్నము జరుగుతుంది.

అసంతృప్తుల యే అంశమైనా, వేఱొకవిధంగా తృప్తిపడటానికి ప్రయత్నము జరిగినపుడా అసంతృప్తి బలీయమైన ఉగ్రరూపంలో స్వప్నంలోకి ప్రవేశిస్తుంది. అణగద్రొక్కబడిన ప్రవృత్తులు గాయత్రీ సాధనవలన పెల్లగింపబడి నిర్మూలమై తమ స్థానమును ఖాళీ చేస్తాయి. ఈ పరివర్తనా కాలంలో తమ గుప్తరూపమును ప్రకటించుతూ శలవు పుచ్చుకొంటాయి. తదనుసారంగా సాధనా సమయములో యీవిధమైన స్వప్నములు రావడము పరిపాటి. మరణించిన ప్రేయసియొక్క దర్శనము, సుందర దృశ్యావలోకనము, స్త్రీలతో కలసి సరససల్లాపాలు, మనోవాంఛా పరిపూర్తి, యిష్టమైన వస్తువుల కొఱత అధికమగుట మొదలైన స్వప్నములు తరచుగా వస్తుంటాయి. అనేకమైన అణగద్రొక్కబడిన కోర్కెలు, అతృప్తితృష్ణలు నెమ్మదినెమ్మదిగా వీడ్కోలు పుచ్చుకుంటున్నాయని యీ స్వప్నముల కర్థము. ఆత్మిక తత్త్వములు బలాన్ని పుంజుకుంటు న్నపుడు ఈవిధంగా జరగడము సహజము, స్వాభావికము.

2. దివ్యతత్త్వముల వృద్ధి సూచన స్వప్నములు

తమలో వున్న సాత్త్వికతా మోతాదు వొక్కసారి విజృంభించి అభివృద్ధి చెందుతున్నదనే సూచన యిచ్చేవిధంగా కొన్ని స్వప్నములు సంభవిస్తాయి. ఇవి రెండవ శ్రేణికి సంబంధించినవి. సత్త్వగుణ ప్రధానకార్యములు స్వయంగా ఆచరించడము, యితఱులు చేయడంలాంటి స్వప్నములు సాత్త్వికమోతాదు వృద్ధిని సూచిస్తాయి. పీడితజనసేవ, నిస్సహాయులకు సేవజేయడము, దానము, జపము, యజ్ఞములు, ఉపాసన, తీర్థయాత్రలు, దేవాలయ దర్శనము, పూజ చేయడము, ధార్మిక కర్మకాండ లొనరించడము, హరికథా శ్రవణం, భగవంతుని కీర్తించడం, భాగవతోపన్యాసములు వినడము, ఉపదేశము పొందడము, మాతపితల దర్శనము, సాధుమహాత్ముల సందర్శనము, నేతలు, విద్వాంసులకు, సజ్జనులకు సమీపంగా చేరడము, స్వాధ్యాయము, అధ్యయనము, ఆకాశవాణిని వినుట, దేవీదేవతలను గాంచుట, దివ్యప్రకాశదర్శనము మొదలైన ఆధ్యాత్మిక తత్త్వముల సత్త్వగుణప్రధాన శుభస్వప్నములవలన తమంతట తాము అంతరంగము నందు వచ్చే శుభతత్త్వములను పరికించుటయే. ఆ దృశ్యములవలన మనశ్శాంతి లభిస్తుంది.

3. భవిష్యత్తులో సంభవించే సంఘటనలు సంకేతములు

మూడవరకపు స్వప్నములు భవిష్య ఘటిత సంఘటన సూచితములు. ప్రాతఃకాలానికి పూర్వము, ఒకటి రెండు గంటల ముందు చూచే స్వప్నములు నిజమవడానికి అవకాశములు యెక్కువ. బ్రహ్మముహూర్తంలో సాధకుని మస్తిష్కము నిర్మలముగా నుంటుంది. రెండవది ప్రకృతి అంతరాళములోని కోలాహలము, రాత్రియందుండే స్తబ్ధత కారణంగా అనేకవిధముల శాంతంగా నుంటుంది. ఆ సమయమందు సాత్త్వికగుణము ప్రధానంగా అమలులో నున్న కారణంగా, వాతావరణము స్వచ్ఛంగా వుంటుంది. సూక్ష్మజగత్తులో సంచరించే భవిష్యత్తులో జరుగనున్న భావి ఆలోచనల యెక్కువ భాగము సంకేతరూపంలో లభిస్తుంది.

కొన్నిసార్లు అపుడపుడు అస్పష్ట సంక్షిప్తదృశ్యములు కనుపిస్తాయి. వీటివలన భవిష్యత్తులో జరుగబోయే మంచి చెడ్డల సంకేతమని తెలుస్తుంది. కాని వాస్తవంగా మనకు విదితముగానిది వీటి వాస్తవిక తాత్పర్యమే మని? ఇట్టి చిక్కుతో గూడుకొన్న స్వప్నములకు కారణము -

1. భవిష్యవిధానము ప్రారబ్ధకర్మల ననుసరించి వుంటుందని, కానీ వర్తమానకర్మల వలన ఆవిధానములో మార్పు జరుగవచ్చునని. ఇదివఱకు నిర్ణయింపబడిన విధానము, సాధకుని వర్తమానకర్మల కారణంగా కొంత పరివర్తనము జరుగవచ్చునని, దాని నిశ్చిత స్పష్ట రూపాన్ని చూపి అనిశ్చితంగా అస్పష్టంగా మారిపోతాయి. తదనుసారంగా స్వప్నంలో విడివడని సమస్యరూపంలో గోచరిస్తుంది.

2. కొన్ని భవిష్యత్తు విధానాలు యీవిధంగా వుండవచ్చు. నవ్యకర్మలు నవ్య పరిస్థితుల ప్రకారము వుంటాయి. పరివర్తన జరుగుతూవుంటుంది. ధరల హెచ్చుతగ్గులు, స్పెక్యులేషన్, లాటరీ మొదలైనవాటికి సంబంధించినంతవఱకు భవిష్యత్తు సునిశ్చితము గాదు. పూర్ణ స్వరూపము స్పష్టంగా రాదు. అంతవఱకు పూర్వాభాస సాధకుని స్వప్నంలోని కలయిక అపూర్ణము.

3. నేను అనే పరిమితక్షేత్రంలో యెంత వుంటుందో ఆ వ్యక్తియొక్క 'అహం' ఆధ్యాత్మికక్షేత్రంలో అంతగా వుంటుంది. ఆతని విస్తృతక్షేత్ర మెంత భవిష్యత్తు కలిగివుంటుందో తన భవిష్యత్తు గూడా అలాగే వుంటుంది. భవిష్యత్తు సూచన స్వప్నము. ఈ అహంక్షేత్ర పరిధివఱకు ఆతనికి గోచరించగలదు. అందువలన ఆతనికొచ్చిన సందేహ స్వప్నము తనకు సంబంధించినదై, తనకుగాని, తన ఇరుగుపొరుగువారికిగాని, బంధువులకుగాని, మిత్రులకుగాని, తన కుటుంబమునకుగాని సంభవించబోయేవాటిని గురించి తెలియజేస్తుంది.

4. సాధకుని మనోభూమి నిర్మలంగా లేనపుడు ఆకాశంలో సూక్ష్మ అంతరాళంలో చాలా యెక్కువగా జరుగుతున్న సత్యములు, వికటంగానో లేక రూపాంతము చెందో స్వప్నంలో కనుపిస్తాయి. ఉదాహరణకు మనలను కలవడానికి వస్తున్న వ్యక్తి బయలుదేరినప్పటికి ఆతని స్థానంలో వేఱొకవ్యక్తి వస్తున్నట్లు భ్రమ కలుగుతుంది. సాధకుని దివ్యదృష్టి మసకబారి స్పష్టత లోపిస్తుంది. దృష్టిదోషము గలిగినపుడు దూరంగా వెళ్ళే వ్యక్తి స్వరూపము ఛాయామాత్రంగా కనుపించి అసలు రూపము గోచరించనట్లు, సాధకుని దృష్టి వుంటుంది. అస్తవ్యస్థంగాను, అస్పష్టంగాను వున్న భ్రమ స్వప్నమై కల్పిత ఆవరణాన్ని సృష్టించి అసత్య, అనిశ్చిత ఆకృతిని తోడుచేసి త్రాడును పాముగా భావించేటట్లు చేస్తుంది. అటువంటి

స్వప్నము సగము అసత్యము కాని సాధకుని మనోభూమియొక్క నిర్మలత్వము పెరిగినకొద్ది ఆవిధంగానే ఆతని దివ్యదృష్టి స్వచ్ఛమౌతుంది. అతని స్వప్నము అధిక సార్థకతాయుక్తమగుట మొదలవుతుంది.

4. జాగృత స్వప్నము లేక దివ్యదర్శనము

స్వప్నములు కేవలము రాత్రియందు లేక నిద్రావస్థయందు మాత్రమే కలుగవు. అవి జాగ్రదవస్థలోగూడా జరుగుతాయి. ధ్యాన మొకవిధమైన జాగృత స్వప్నమని తెలుసుకొనవలెను. కల్పనా అశ్వము నధిరోహించి మనము సుదూర స్థానములలో నున్న వివిధ విధి సంభవ, అసంభవ దృశ్యములను చూస్తుంటాము. ఇదికూడ ఒకవిధమైన స్వప్నమే. నిద్రావస్థలో వచ్చే స్వప్నములు క్రియాప్రధానములు. జాగ్రదావస్థలో వచ్చే స్వప్నములు బహిర్మనో క్రియల ప్రముఖ రూపమువలన పనిచేస్తాయి. ఈ తేడాతప్ప జాగ్రద, నిద్రావస్థల స్వప్నముల ప్రణాళికలు వొక్కటే. జాగ్రదావస్థలో సాధకుని మనోలోకంలో నానాప్రకారముల ఆలోచనా స్రవంతుల కల్పనలు స్వారీచేస్తుంటాయి. ఇవిగూడా మూడు రకములు. పూర్వకుసంస్కారముల బహిష్కరణ శ్రేష్ఠతత్త్వముల ప్రకటీకరణ. భవిష్య పూర్వాభాస సూచనకు మస్తిష్కంలో వివిధరకాల ఆలోచనలు, భావాలు, చిత్రములు గోచరించుట. నిద్రావస్థలో నొనగూడిన ఫలితమే జాగ్రదావస్థలో గూడా.

అపుడపుడు జాగ్రదావస్థలో గూడా యేదైనా చమత్కార స్వరూపంలో దైవీశక్తితో అలౌకిక దృశ్యము కొంతమందికి గోచరిస్తుంది. కొంతమందికి వారి ఇష్టదైవము చర్మచక్షువులకు కనుపిస్తుంది. కొందఱు భూతప్రేతములను ప్రత్యక్షంగా చూస్తారు. మఱికొందఱికి యితఱుల ముఖములచుట్టు తేజోవలయములు, వారి మనోగత భావములు ప్రస్ఫుటమౌతాయి. వాటి ఆధారములతో వారి ఆంతరంగికస్థితిని గుర్తించగలుగుతారు. వ్యాధిగ్రస్తుడు రోగవిముక్తుడగునా? లేదా? సంకుల సమస్యా సంఘర్షణలలో విజయము పొందునా? లేదా? దొంగిలింపబడిన వస్తువు తిరిగి లభ్యమగునా? లేదా? రానున్న లాభనష్టములు విపత్తులు సంపత్తులు మొదలైనవాటిని గురించి మనుష్యుని అంతఃకరణములో నున్న ప్రత్యేక ఆకాశవాణిద్వారా తెలిసి, అనేకసార్లు నిజమై ఆశ్చర్యకరముగా అనుభవైకవేద్యమౌతుంది.

విజయ లక్ష్యము

గాయత్రీ సాధనవలన సాధకునిలో ప్రత్యేక సూక్ష్మచేతన, శక్తి ఆవిర్భవిస్తుంది. ప్రత్యక్షంగా ఆతని శరీరములోగాని, ఆకృతిలోగాని విశేషమైన మార్పురాదుగాని అంతరంగములోపల భారీయెత్తున సంచలన మార్పు తథ్యము. ఆధ్యాత్మిక వృద్ధివలన ప్రాణమయకోశము, విజ్ఞానమయకోశము, మనోమయకోశములో వచ్చిన మార్పులు, అన్నమయకోశములో కొంచెం గూడా గోచరించవు. శరీరచక్ర మంత తొందరగా మారదు. ఇది నిజము. కానీ శరీరంలో జరిగే సంచలన మార్పులు బయటకు ప్రకటనగాకుండా వుండవు. ఇదిగూడా సత్యమే.

సర్పముయొక్క మాంసకోశములో క్రొత్త చర్మము పొర తయారైనపుడు అది సర్పశరీరముపై గోచరిస్తుంది. దాని దేహము బరువెక్కుతుంది. అది వేగంగా పరిగెత్తజాలదు. స్ఫూర్తి, ఉత్సాహములు దానిలో లోపిస్తాయి. ఒకచోట పడివుంటుంది. తయారైన చర్మము అసలు చర్మముతో కలసిపోయినపుడు సర్పము బయట చర్మము పొరను

విసర్జించుతుంది. దాని క్రొత్త చర్మముపై మెఱుపు మెఱుస్తుంది. కోమలత్వము స్పష్టంగా గోచరిస్తుంది. అట్టి మార్పే అందఱిలో జరుగుతుంది. సాధకుని గర్భంలో సాధన పరిపక్వమైనపుడు ఆతనిలో కొంచెము ఉదాసీనభావము, భారభావము, అనుత్సాహము, శిథిలత్వము మొదలుగా గల లక్షణములు ప్రతీతమవుతాయి. సాధన పరిపూర్ణమైన తరువాత మఱియొక లక్షణములు ప్రస్ఫుటమవుతాయి. మాతృగర్భంలో గర్భము పరిపక్వత చెందునపుడు ఆమె శరీరము భారంగాను, తిరుగుతున్నట్లుగాను వుంటుంది. ఉత్సాహము వుండదు. ఆమె ప్రసూతి నుండి నివృత్తయైనపుడు ఆమెలో తేలిక శరీర భావన, ఉత్సాహము, చైతన్యము కనుపిస్తాయి.

సాధకుడు సాధనకు కూర్చొన్నపుడు తనలో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక గర్భధారణ జరుగుతుంది. తంత్రశాస్త్రములో సాధనను మైథున మని పిలుస్తారు. మైథునము రహస్యంగా జరగాలి. అటులనే సాధనకూడా గుప్తంగా వుండవలెనని ఆదేశింపబడినది. ఆత్మ పరమాత్మ సన్నిధి చేరి ఆలింగనము గావించుకొన్నపుడు ఆత్మ అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవిస్తుంది. దీనినే భక్తియొక్క తన్మయావస్థయని అంటారు. రెంటియొక్క ప్రగాఢ ఐక్యత చేకూరినప్పుడు ఒకదానితో నొకటి ఆత్మసమైక్యత చెందుతాయి. ఆ స్ఖలనమును సమాధి యని చెబుతారు. ఆధ్యాత్మిక మైథునానికి సమాధిసుఖము అంతిమ స్ఖలనము.

గాయత్రీ ఉపనిషత్తులోను, సావిత్రీ ఉపనిషత్తులోను అనేక మైథునము లీయబడినవి. వర్ణింపబడినవి. సవిత, సావిత్రీలు దంపతులని చెప్పబడినది. సావిత్రీ, గాయత్రీల ఆరాధన చేయడంవలన సాధకుడు ఆత్మ నొక యోనిగా చేస్తాడు. అందులో సవితా తేజఃపుంజము పరమాత్మ తేజోవీర్యము పడుతుంది. దీనినే శక్తిపాతము అని చెబుతారు. శక్తిపాత విజ్ఞానానుసారము దీనివలన అమైథున సృష్టి వుత్పన్నముగాగలదు. కుంతి - కర్ణునకు, మరియమ్మ - ఏసుకు జన్మనీయుట అసంభవము గాదు. దైవీశక్తుల ఉత్పత్తి యివిధమైన సూక్ష్మ మైథునమువలన జరుగుతుంది. సముద్ర మథనము, మైథునము, ఋణ, ధన పరమాణువుల ఆలింగనము వలన విద్యుత్ప్రవాహ ముత్పన్నమవుతుంది. తంత్రశాస్త్రములో ప్రతీచోట, ప్రతి తంత్రములో మైథునమును ప్రశంసించుట జరిగినది.అదియే యీ సాధనా మైథునము.

తనలో నున్న ఆంతరంగిక శ్రద్ధను, అభ్యాసశక్తులను సమ్మిళితము గావించి, నవీనశక్తి నొకదానిని ఆవిర్భవింపజేయుటయే యని సాధనకు అర్థము. ఇదియే సిద్ధి యని, దేవీశక్తి యని విచిత్రమైన స్థితియని, చమత్కారమని నుడవబడుతుంది. ఈవిధమైనది లభించటానికి మనవద్ద సాధన ప్రప్రథమంగా కావలెనని దీని వుద్దేశ్యము. మనము వెళ్ళవలసిన స్థానమున కే మార్గముగుండా వెళ్లినప్పటికి, దారిలో ఖర్చునకు రూపాయలు, పైసలు, అన్నపానీయములు, వస్త్రాదులు అవసరమౌతాయి. అటులనే దైవీశక్తి యేదైనాసరే దానినిగురించి సాధన గావించేటపుడు సద్గుణములు సదా సద్విచారములు సత్కర్మల అవసరముంటుంది. ప్రారంభమునుండి కలుషిత, పాపపంకిలాపూర్ణ, దూషిత జీవనము గడిపిన వ్యక్తికి సాధనా సంపన్నత్వము సంభవించుట అసంభవముగూడా. కావున వ్యక్తి స్వచ్ఛమైన మనస్సుతో సాధన చేయవలెనని సంకల్పించితే ఆ సాధనవలన ఉన్నత లక్ష్యమును పొందవలెనని కోరితే, ఆ వ్యక్తి ప్రథమంగా తన మనస్సును, మాటను, శరీరమును శుభ్రపఱచుకొనవలెను. అపుడేవిధమైన సిద్ధికొఱకైనా ఆశించగల సమర్థవంతమైన వ్యక్తి కాగలడు.

ఆత్మ- పరమాత్మల, సవితా - సావిత్రీల మైథునము ప్రగాఢ ఆలింగనాబద్ధమైనపుడు ఫలస్వరూపంగా ఆధ్యాత్మిక గర్భధారణ జరుగుతుంది. దీనినే ఆధ్యాత్మిక భాషయందు 'భర్గ' యని అనియెదరు. భర్గను సాధకు డే అంశలలో ధారణ గావిస్తాడో ఆతడు అదే స్థానమును తనలో యీ నవ్యతత్త్వములకొఱకు అర్పణ గావించుకొనవలెను. నవ్యతత్త్వము స్థాపనకు పూర్వతత్త్వములను పోగొట్టవలెను. నశింపజేయవలెను. ఈ సంక్రాంతి కారణమువలన స్వాభావిక క్రియావిధిలో మార్పు జరుగుతుంది. ఈ తేడా లక్షణము సాధకునిలో గర్భవతి స్త్రీ లక్షణముల మాదిరి, అరుచి, వాంతులు, మలబద్ధకము, అలసటలవలె ప్రకటమౌతాయి. సరిగా యిటువంటి లక్షణములే సాధకునికి గూడా వున్నంతవఱకు సాధకుని అంతర్యోని పరిపక్వము చెందుతూ వుండటము గమనించవచ్చు. కుబుసముచే నిండివున్న సర్పము మాదిరి భారమైన, బంధింపబడిన బిగువైన దగుటయేకాక అవసానదశ యందున్నట్లుంటుంది. సాధనస్థలిలో సాధకుడుగూడా యిదే అవస్థలో వుంటాడని ఆత్మ విద్య నెఱిగిన ఆచార్యుల కెఱుక. అందువలన ఆచార్యులు సాధనాకాలంలో విశిష్టమైన ఆచారవ్యవహారములను, ఆలోచనలను పాటించవలసినదిగా ఆదేశిస్తారు. రజస్వలస్త్రీలకు, గర్భవతులకు సరిపోయెడి ఆహారవిహారములు సాధకులుగూడా పాటించవలెను. అపుడే వారు ఆ సాధనా సంక్రాంతి దాటగలరు.

మహత్తరమైన కార్యములను చేయదలచినవారికి అనేకవిధములైన విఘ్నములు, ఆటంకములు, భయము, ప్రలోభన సంభవిస్తాయి. వీటిని విజయపూర్వకంగా యెదుర్కొనినవారే గొప్ప పనులను సాధించడంలో సఫలులవుతారు. ఆహారదోషము, అలసత్వము, అధైర్యము, అసంయమనము, ఘృణము, ద్వేషము, విలాసజీవనము, కుజనులతోటి స్నేహము, అభిమానము మొదలైనవాటివలన సాధకుడు తన మార్గమునుండి వేఱవుతాడు. దాని సిద్ధి పొందటము అసంభవమౌతుంది. భ్రష్టాచారము, చోరీసంపాదన, ఇతఱుల అధికారము అపహరించుట, ఘోరమైన స్వార్థపరత్వము లాంటి దోషములు ప్రస్తుతము బహుళముగా నున్నవి. ఇవిగూడా మానవుని దైవీఅనుగ్రహము పొందుటకు అయోగ్యునిగా చేస్తాయి. కావున వ్యక్తి తన సాధనలో పరిపూర్ణత పొంది సిద్ధిపొందటానికి వాస్తవంగా అన్నివిధములైన త్యాగములు బలిదానములు చేసి కష్టములను సహించినపుడే, ఆ వ్యక్తి సాధన పరిపక్వమై, అభిలషించిన ఫలమును ప్రసాదిస్తుంది.

గ్రుడ్డునుండి పిల్ల బయటకు వస్తుంది. గర్భమునుండి సంతానము జనిస్తుంది. సాధకునికిగూడా సాధనా ఫలితమొకవిధమైన సంతానము. దానినే శక్తి లేక సిద్ధి అని అంటారు. ముక్తి, సమాధి, బ్రాహ్మీస్థితి, తురీయావస్థ మొదలైన పేర్లన్నీ దీనికే. ఈ సంతానము ప్రథమంలో బలహీనంగాను లఘు ఆకారలో నుంటుంది. గ్రుడ్డులో నుండి బయటకు వచ్చిన పిల్ల ఎముకల గూడులా వుంటుంది. మాతృగర్భమునుండి వచ్చిన శిశువు కోమలంగా వుంటుంది. అటులనే సాధన పూర్తియై క్రొత్తగా జన్మించిన సిద్ధుడుగూడా కోమలంగా వుంటాడు. బుద్ధిమంతుడైన సాధకు డా 'సిద్ధి' ని తల్లి పసివారి నెటులపెంచునో, అటులనే పెంచి పెద్దచేస్తాడు. బాలారిష్టము లన్నింటినుండి కాపాడి పోషిస్తాడు.

సాధన సాధకుని గర్భములో నున్నంతవఱకు పచ్చిగా వుంటుంది. అప్పటివఱకు అలసట, నిస్సత్తువ చిహ్నాము లుంటాయి. ఆరోగ్యము క్షీణించినట్లుగాను ముఖము తగ్గినట్లుగా నుంటుంది. కానీ సాధకుని పరిపక్వమైన సుకోమల 'సిద్ధి' యనే సంతానము ప్రసవమైనపుడు సాధకునిలో తేజస్సు, ఓజస్సు, తేలికతనము, చైతన్యము, ఉత్సాహము వస్తాయి. కుబుసము విడిచిన సర్పము మాదిరి చలాకీదనం వస్తుంది. సిద్ధి యనే ప్రసవము జరిగినదా? లేదా? విజయం ప్రాప్తించినదా? లేదా? అని పరీక్షించి యీ క్రింది లక్షణాల వలన తెలుసుకొనవచ్చును. ఇవి పది లక్షణములు.

1. శరీరము తేలికగాను, మనస్సు ఉత్సాహభరితంగాను వుంటుంది.
2. శరీరములోనుండి యొక ప్రత్యేక సుగంధము వెలువడుతుంది.
3. నాలుకపై మెఱుపు, కోమలత్వము మెండుగా వుంటాయి.
4. తామసిక ఆహారముపై అయిష్టత యేర్పడుతుంది. సాత్త్వికాహారముపై కోర్కె మరలుతుంది.
5. స్వార్థము కొఱకు తక్కువ, పారమార్థికతపై అధిక ధ్యానము.
6. నేత్రముల యందు తేజస్సుంటుంది.
7. ఇతఋల విషయములలో వెల్లడింపబడిన అభిప్రాయములు తమంతట తామె బయల్పడి అత్యధిక భాగము నిజమవుతాయి.
8. ఇతఋల అభిప్రాయములు మనోవిషయము సులభంగా గ్రహించగలుగుతారు.
9. భవిష్యత్తులో జరుగబోయే విషయములు ముందుగా స్ఫుర్తిస్తాయి.
10. శాపమిచ్చినా, ఆశీర్వదించినా సఫలమవుతాయి. తన గుప్తశక్తులతో యితఋలకు మంచిగాని, చెడుగాని చేయగలడు.

సాధకుని గర్భము పక్వమై సిద్ధి ప్రసవమైనదనటాని కీ పది లక్షణములు ప్రమాణములు. ఈ శక్తిసంతతి నే సాధకుడు జాగ్రత్తగా పాలనచేసి, పోషిస్తాడో, బలమైనదిగా తీర్చిదిద్దుతాడో ఆతడు భవిష్యత్తులో ఆజ్ఞానువర్తులైన సంతానము గల పూజ్యులైన తల్లిదండ్రుల మాదిరి ఆనందమయ భోగముల ననుభవిస్తాడు. అసభ్యంగా సిద్ధిని దురుపయోగము చేసేవారు, తన స్వల్పశక్తిని గుర్తించక దానిపై యెక్కువ భారాన్ని మోపి, శక్తిహీనులై, మృతవత్స మాతల పగిలి పశ్చాత్తాపపడవలసివస్తుంది.

సిద్ధులను దురుపయోగం కావించరాదు

గాయత్రీ సాధన గావించేవారికి అనేక ప్రకారముల అలౌకికశక్తులు ప్రాప్తిస్తాయి. ఎందువలననగా యిది యొక శ్రేష్టమైన సాధన. ఇతఱ సాధనలవలన ప్రాప్తించే ప్రయోజనాలు, అన్యయోగములచే ఫలించే సిద్ధులు, గాయత్రీ మంత్రమువలన సాధనచే పొందవచ్చు. కొన్నిరోజుల శ్రద్ధ, విశ్వాసము, వినయపూర్వక ఉపాసన జరిగినట్లయితే ఆత్మశక్తియొక్క మోతాదు దినదినాభివృద్ధిపొందుతుంది. ఆత్మతేజం ప్రకాశించడం ప్రారంభమౌతుంది. అంతఃకరణము నావరించిన మాలిన్యము వదులుతుంది. ఆంతరంగిక నిర్మలత్వము అభివృద్ధి పొందుతుంది. ఫలస్వరూపంగా ఆత్మజ్యోతి తన అసలు స్వరూపాన్ని ప్రకటించడము జరుగుతుంది.

నిప్పుపై నిరువుగప్పుకొన్నంతకాలము దాని దాహకశక్తి వ్యక్తము కాదు. దానిని ముట్టుకొన్నంతమాత్రమున విశేషమైన అనుభవముంటుంది. కానీ నిప్పుపై నున్న బూడిదను తొలగించినవెంటనే మండే అగ్ని ప్రజ్వలితమవుతుంది. ఈ విషయము ఆత్మయందుగూడా నున్నది. సాధారణంగా ప్రజలు యెక్కువగా మాయాగ్రస్థులు. భౌతికజీవనంలో బహిర్ముఖవృత్తుల యందు నిమగ్నులై వుంటారు. ఇది యొక తెర. దీనివలన ఆత్మతేజపు ఉష్ణత, ప్రకాశము బహిర్గతము కాదు. మనుష్య డేనాడు అంతర్ముఖుడౌతాడో, ఆత్మను స్పృశిస్తాడో, సాధనద్వారా తన మనోపంకిలమును నిర్మూలించుకొంటాడో అప్పుడు పవిత్రతను సంతరించుకొని ఆత్మదర్శనస్థితిని పొందుతాడు.

ఆత్మ -పరమాత్మ యొక్క అంశ. అందులో పరమాత్మలో నున్న సప్తతత్త్వములు, గుణములు, అంశ లున్నాయి. అగ్నియొక్క అగ్ని గుణములు నిప్పురవ్వలో లుప్తమై వున్నాయి. కానీ అవసరాన్నిబట్టి యీ నిప్పురవ్వయే దావానలం మాదిరి పనిచేస్తుంది. ఆత్మపైనున్న మలినము తొలగినతరువాత, నివారించబడిన తదుపరి, పరమాత్మయొక్క ప్రత్యక్షబింబము దృగ్గోచరమౌతుంది. అందులో సకల శక్తులు పరిరక్షింపబడుతాయి. అపుడు పరమాత్మ అంశ యైన ఆత్మ, పరమాత్మగా మారుతుంది.

అష్టసిద్ధులు, నవనిధులు ప్రసిద్ధమైనవి. ఇవిగాక అగణిత చిన్నవి, పెద్దవి, వృద్ధి సిద్ధు లున్నాయి. అవి సాధన పరిపక్వమైన తరువాత కనిపించి, పెరిగి పెద్దవవుతాయి. ఏదైనా ప్రత్యేకమైన సిద్ధికొఱకు ఘనమైన ప్రయత్నము చేయనప్పటికి, యువావస్థలో యౌవన చిహ్నములు గోచరించునట్లు, సాధనా పరిపక్వముతోపాటు సిద్ధులు తమంతటతామే సంక్రమిస్తాయి. గాయత్రీ సాధకుడు నెమ్మదినెమ్మదిగా సిద్ధావస్థ వైపు పురోగమిస్తూ, అగ్రగామి అవుతాడు. ఆతనికి అనేక అలౌకికశక్తులు దృగ్గోచరమౌతాయి. శ్రద్ధతో గాయత్రీ సాధనలో దీర్ఘకాలము నిష్ఠాపూర్వకంగా తల్లీనమైనవారిలో అనేక విశిష్టతలు స్పష్టరూపంలో గోచరించడము జరుగుట వున్నది. అవి-

1. వారిలో వ్యక్తిత్వము, ఆకర్షణ, నేత్రములలో మెఱుపు, మాటలో బలము, ముఖంలో ప్రతిభ, గంభీరత, స్థిరత్వము వుంటాయి. వీటి ప్రభావము యితఱులపై బలంగా వుంటుంది. అట్టి వ్యక్తుల సంపర్కములోకి వచ్చినవారిపై వారి వ్యక్తిత్వ ప్రభావ ముంటుంది. వారు చెప్పినట్లే నడుస్తారు. ఆచరిస్తారు.

2. సాధకుడు తనలో దైవీతేజము వుండటము గమనిస్తాడు. దానిని అనుభవిస్తాడు. తనలో యేదో నవ్యశక్తి పనిచేస్తుందని గ్రహిస్తాడు.

3. చెడుపులయం దాతనికి రుచి వుండదు. కార్యములయందు మనస్సు లగ్నమవుతుంది. చెడు మార్గావలంబులను గాంచి యెక్కువ ఖేదము పొందుతాడు. వారికొఱకు పశ్చాత్తాపము చెందుతాడు. సుఖములలో అధిక ఆనందము పొందు. దుఃఖములలో, కష్టములలో, ఆపదలలో, ధైర్యముండి, కింకర్తవ్యతావిమూఢత యుండకుండుట ప్రత్యేక విశేష మాతనిలో.

4. భవిష్యత్తులో జరుగబోయే సంఘటనలు ముందుగనే వారి మనస్సులో తెలియబడతాయి. ఆరంభంలో తేలికైన సంగతులు, క్రమక్రమంగా వారికి భవిష్యజ్ఞానము పూర్తిగా కలుగుతుంది.

5. వారి శాపము ఆశీర్వాదము సఫలమౌతుంది. వారు నిజంగా అంతరాత్మలోదుఃఖము కలిగి యెవరికైనాశాప మిస్తే, ఆ శపించబడిన వ్యక్తి ఘోరవిపత్తులకు లోనవుతాడు. ప్రసన్నులై, అనుగ్రహించి సత్యాంతఃకరణులై ఆశీర్వదించితే మంగళకరమవుతుంది. వారి ఆశీర్వాదము వైఫల్యము కానేరదు.

6. వారు యితఱుల మనోభావము చూచినవెంటనే గ్రహిస్తారు. రహస్యంగా వుంచదలచిన విషయములుగూడా వారివద్ద దాగవు. వారు యితఱుల గుణ, దోషములు, ఆలోచనలను, ఆచరణలను పారదర్శి వలె తమ సూక్ష్మదృష్టితో చూడగలరు.

7. వారు తమ భావములను యితఱుల హృదయములలో ప్రవేశింపజేయగలరు. బహుదూరములో నున్నవారితో, పత్ర సహాయంలేకుండా, టెలిఫోను సహాయం లేకుండా సందేశమివ్వగలరు. పంపగలరు.

8. వారున్న చోట చుట్టూ వాతావరణము శాంతంగా వుంటుంది. వారి సమీపమున కూర్చున్నంతవఱకు వ్యక్తులలో సాత్త్వికభావములు, అద్భుతమైన శాంతి, పవిత్రత అనుభవమవుతుంది.

9. వారు తమ తపస్సులోను, ఆయువులోను భాగమును యితఱుల కియ్యగలరు. వారిద్వారా యితఱుల ప్రయాసలేకుండా లేక స్వల్పప్రయాసతో అధిక ప్రయోజనాన్ని, లాభాన్ని పొందగలరు. అట్టి వ్యక్తులు యితఱులపై 'శక్తిపాతము'ను చేయగలరు.

10. వారికి స్వప్నంలోను, జాగ్రదావస్థలోను, ధ్యానావస్థలోను రంగురంగుల ప్రకాశపుంజములు, దివ్యధ్వనులు, దివ్యప్రకాశములు గోచరించుటయేగాక, దివ్యవాణి వినిపిస్తుంది. ఏదో అలౌకికశక్తి వారితో పదేపదే సల్లాపిస్తున్నట్లు, ఆటలాడుతున్నట్లు కనుపిస్తుంది. సాధారణంగా అలౌకికశక్తి ప్రభావంతో గాని జరగని విషయములు వారికి అనేకవిధముల దివ్యఅనుభవముల రూపంలో కలుగుతాయి.

ఈ చిహ్నములు ప్రత్యక్ష ప్రకటనములు. అప్రత్యక్షరూపంలో అణిమ, లఘిమ, మహిమ మొదలైన యోగశాస్త్రంలో వర్ణింపబడిన యితఱ సిద్ధులుగూడా సంకేతముగా లభిస్తాయి. అద్భుతమైన, అలౌకిక ఆశ్చర్యజనక కార్యములను నెరవేర్చుట కప్పుడతడు సమర్థుడౌతాడు.

సిద్ధులు సంభవించేటపుడు, వికాసము గలిగేటపుడు చాల సుకుమారంగా జాగ్రత్తగా వ్యవహరించవలెను. బాల్యకిశోరావస్థ అంతంలోను, నవయౌవనావస్థ ప్రారంభంలోను, శరీరంలో వీర్యంయొక్క నవీనత్వం పొడసూపుతుంది. ఆ ఉద్భవకాలమందు మనస్సు, ఉత్సాహకంగాను, కామక్రీడలయందు వ్యామోహము కలదిగాను, బహుచంచలంగాను వుంటుంది. ఈ మనోదశ యందు, నియంత్రణ లేకపోతే తాజావీర్యము అపవ్యయము గావడం జరుగుతుంది. నవయువకుడు కొద్ది సమయములోనే శక్తిహీనుడు, వీర్యహీనుడు, యౌవనహీనుడుగా మారి శాశ్వతంగా నిరుపయోగిగా వుంటాడు. సాధనలో సిద్ధి ప్రారంభదశావస్థలో సాధకుడు తనలో ప్రత్యేక నవీన చైతన్యమును అనుభవిస్తాడు. అందువలన తన మహత్తును ప్రదర్శించుట ద్వారా యితఱులపై తన మహత్తు ముద్ర వేయవలయునని వాంఛిస్తాడు. ఈ క్రమ మీవిధంగా జరిగితే ఆ తాజావీర్యము ప్రారంభసిద్ధితత్త్వముల స్వల్పకాలంలోనే అపవ్యయమై సమాప్తమవుతుంది. సాధకుడు శాశ్వతంగా చుంచెలుక వలె నిరుపయోగిగా తయారౌతాడు.

ఈ ప్రపంచములో జరిగే ప్రతికార్యము కర్మఫలాధారంగా జరుగుతువుంటుంది. ఈశ్వరీయ సునిశ్చిత నియమము లాధారంగా బంధీకృతమైన జీవులు తమతమ జీవనమును గడుపుతున్నారు. ప్రాణులకు సేవచేయడానికి సరియైన మార్గము, వారిని సత్కర్మల యందు నిమగ్నులగునట్లు చేయుట. ఆపదలలో సహించుటకు కావలసిన సాహసాన్ని వారికి కలిగించుట. ఇవి ఆత్మిక సహాయములు. తాత్కాలిక కష్టములు తొలగుటకు, తేలికపఱచుటకు కావలసిన భౌతిక సహాయములు చేయవలెను. ఆత్మికశక్తిని ఖర్చుచేసి కర్తవ్యహీన వ్యక్తులను సంపన్నులను జేసినట్లయితే వారి నది అధికంగా నిరుపయోగులను గావించుతుంది. కావున యితఱుల సేవకు సద్గుణములు, వివేకము, దానము చేయుట శ్రేష్ఠము. దాన మివ్వదలచితే ధనము మొదలైనవాటిని దానము చేయవలెను. ఇతఱుల వైభవమును పెంపొందించుటకు ఆత్మశక్తిని సరాసరి సమర్పించడము తమ శక్తులను పోగొట్టుకొనుటయే. ఇతఱులను ఆశ్చర్యంలో ముంచుటకు తను వ్యయము చేయడము, మూర్ఖుడు హోళీ ఆడుటకు యిచ్చగించి తన రక్తాన్ని తీసి చిలకరించడము లాంటిది. ఇదే మూర్ఖత్వానికి హద్దు. దూరదర్శియైన ఆధ్యాత్మికవాది ప్రజలనుండి గౌరవమును పొందేటందుకు కించిత్తుగూడా యిష్టపడడు. మానమర్యాదలను లెక్కచేయడు.

కానీ ప్రస్తుతము సమాజంలో వీటికి విపరీతమైన ఆకర్షణ వున్నదని గోచరిస్తుంది. మానవులు ఈశ్వరోపాసన, పూజాపునస్కారములు, జపతపాలుగూడా లౌకిక ప్రలోభాలకొఱకే గావించుచున్నారు. వారు పేకాట, జూదము, లాటరీ మొదలైనవాటిలో గెలుపొందటానికి భజనలు, జపములు చేస్తున్నారు. దేవతలకు మ్రొక్కుకుంటారు. ప్రసాదములు చెల్లించుకుంటున్నారు. ఏవిధంగానైనా ధనము పొందటమే వారి ఆకాంక్ష. దొంగతనము చేసిగాని, జపతపాలవల్లగాని ధనం రావాలి. కావాలి. వారికి ప్రథమంగా ఉపాసనా జనిత శక్తి లభించదు. బహుశా స్వల్పశక్తితో కొంచెం ధనము సంక్రమించినా, ఆ ధనం వివిధములైన అనుచిత కార్యములలో నష్టమవుతుంది. భవిష్యత్తులో దారి మూసుకుపోతుంది. ఇతఱులకు అరిష్టము కలిగించేవిధంగా దైవీశక్తి అయోగ్యులకు సామాన్యంగా సామర్థ్యాన్ని ప్రసాదించదు.

తాంత్రిక పద్ధతిద్వారా యెవఱినైనా చంపడము, మోహాన్వితులను గావించడము, ఉచ్ఛాటన జేయడము, వశీకరణము ప్రయోగించడము, రహస్యంగా మనోభావములను ఆచరణలను తెలుసుకొని ప్రకటించడము, ఆతని ప్రతిష్టను తగ్గించడంలాంటి పనులు ఆధ్యాత్మిక సాధకులకు సర్వదా నిషిద్ధం. లోకులచే సిద్ధపురుష డనిపించుకోవడానికి అద్భుతాలను చూపించడము గాయత్రీ ఉపాసకులకు కఠినంగా వర్జనీయము. ఒకవేళ యీ భ్రమలో సాధకుడు పడినట్లయితే కొద్దిరోజులలోనే తన కష్టసాధ్య ఆధ్యాత్మికశక్తిని కోల్పోయి చుంచెలుక మాదిరి అల్పుడౌతాడు. ఆతడు ప్రపంచమునకు సత్జ్ఞానము దానము చేయడమే మంచిది. దీనివలన నాతడు సాధారణ జనులకు, అంతరంగిక, బాహ్య, సామాజిక కష్టములను చాలవఱకు దూరము చేయగలడు. స్వల్ప సాధనలతోనే స్వర్గీయ సుఖములను ఆస్వాదించుతూ ప్రజల జీవనము సుఖమయము చేయగలడు. ఈ దిశలో పనిచేయడంవలన ఆతని ఆధ్యాత్మికశక్తి వృద్ధి పొందుతుంది. అటులగాక చమత్కారము చూపించడము, అద్భుతాలను ప్రదర్శించడము లాంటి భ్రమలోపడితే కొద్దికాలము ప్రజల క్షణిక కుతూహలము, తనంటే ఆకర్షణ కొద్ది సమయములో బాగుంటుంది. కానీ తనకు, ప్రజలకు అపకారము చేయడము సంభవము.

పైన చెప్పబడిన విషయాలను గుర్తుంచుకొంటూ అనుయాయులను హెచ్చరించుతూ కఠినంగా ఆదేశించున దేమనగా - 'మీరు మీ సిద్ధులను గుప్తంగా నుంచుకొనండి. ఇతఱులపై ప్రయోగించవద్దు. వారికి ప్రకటించవద్దు' అని. దైవీకటాక్షము, చమత్కారము తమకు దృష్టిగోచరమైనా, విశ్వసనీయ సహృదయమిత్రులకుతప్ప అన్యులకు తెలియనీయవద్దు. అవసరమనితోస్తే యీ పుస్తకలేఖకునకు తెలియపఱచవచ్చు. లేదా శాంతికుంజ్‌కు తెలియపఱచగలరు. ప్రాప్తించిన శక్తులను కించిత్‌గూడా దురుపయోగము చేయకుండుట గాయత్రీ సాధకులు బాధ్యత, కర్తవ్యము. ఈ మర్యాదయే సాధకుడు అతిక్రమించకూడదని హెచ్చరిస్తున్నాము.

గాయత్రీ వామమార్గ తాంత్రిక సాధనలు

ఈ పుస్తక ప్రారంభంలో గాయత్రీ ఉత్పత్తినిగురించి చర్చిస్తూ బ్రహ్మచే శక్తి ప్రాదుర్భవించినదనీ, ఆ శక్తి రెండు విభాగములుగా నున్నదని చెప్పబడినది. మొదటిది సంకల్పమయి గాయత్రి. రెండవది పరమాణుమయి గాయత్రీ. సంకల్పమయి గాయత్రి, ఆత్మికశక్తుల అభివృద్ధికి తద్వారా దైవసాన్నిధ్య ప్రాప్తికొఱకు వుపయోగకారి. ఆత్మికగుణములు, విశేషతలు అభివృద్ధి చెందినందున సాధకునకు సాంసారిక కష్టములు దాటుటకు, స్వల్పసాధనతోకూడ సుఖంగా వుండుట, సుఖస్థితిని పొందుట సహజము. ఈ యోగవిజ్ఞానమును దక్షిణమార్గమని ఉద్ఘోషిస్తారు. ఇది సత్త్వగుణ ప్రధానమైన హానిరహితము, వ్యక్తికీ, సమాజానికీ అన్నివిధముల హితకరము.

శక్తియొక్క రెండవశ్రేణికి పరమాణుమయిగాయత్రి. దీనిని స్థూలప్రకృతియని, పంచభూతములని, భౌతికసృష్టి యనే పేర్లతో సంబోధిస్తారు. ఇందులో ప్రకృతి యందున్న పరమాణువుల ఆకర్షణ వికర్షణ వలన యీ ప్రపంచంలోని నానావిధములైన పదార్థముల వుత్పత్తి, వృద్ధి, సమాప్తి జరుగుతుంది. ఈ పరమాణువుల స్వాభావికమైన సాధారణ ప్రక్రియకు పేరు 'విజ్ఞానము'. ఈ విజ్ఞానము రెండు భాగాలుగా నున్నది. ఒకటి -యంత్రములద్వారా ప్రకృతి పరమాణువులను మనకొఱకు వుపయోగించుకొనుట.

రైలు, తంతి, టెలిఫోను, రేడియో, విమానము, టెలివిజను, విద్యుశ్ఛక్తి మొదలైన అనేక వైజ్ఞానిక యంత్రములు యీ విజ్ఞానముద్వారా ఆవిష్కరింపబడినవి. భవిష్యత్తులో వేళ్వేఱు విధములు రాగలవు. యంత్రవిజ్ఞాన మిదియే.

రెండవది తత్త్వవిజ్ఞానము. దీనివలన యంత్రముల స్థానే మానవ అంతరాళములో నున్న విద్యుశ్ఛక్తిని కొన్ని ప్రత్యేక విశేషతలచే సంపన్నము గావించి, దానిద్వారా ప్రకృతిలోని సూక్ష్మపరమాణువులను, మానవుడు కోరిన రీతిలో పరిణామము చెందునట్లుంచుకొనుట. పదార్థరచనము సంవర్తనము, వినాశనము యే యంత్రముల సహాయము లేకుండానే తంత్రవిద్య ద్వారా సంభవము. విజ్ఞానముయొక్క యీ తంత్రభాగమును 'సావిత్రీవిద్య'-'తంత్రసాధన', 'వామమార్గసాధన' అనే పేర్లతో నుడువుతారు.

తంత్రవిద్య యొక విధమైన స్వతంత్రవిద్య. ఇక్కడ దానినిగురించి, దాని ఆధారమునుగురించి, కార్యమునుగురించి చర్చచేయగూడదు. ఇది చెప్పుటద్వారా తంత్రవిజ్ఞానమును గూర్చి పాఠకులకు(శ్రోతలకు) కొంత పరిచయము చేయవలెను. ప్రాచీనకాలంలో భారతదేశమునుగూర్చి పాఠకులకు(శ్రోతలకు) కొంత పరిచయము చేయవలెను. ప్రాచీనకాలంలో భారతదేశంలో విజ్ఞానాచార్యులు అనేక ప్రయోజనాలకొఱకు యీ మార్గమును అవలంబించేవారు. ప్రాచీన ఇతిహాసంలో దీని కనేక సాక్ష్యాధారాలున్నాయి. ఈరోజులలో యంత్ర సహాయంతో గూడా కానీ పనులు, ప్రాచీనకాలంలో యంత్రాలు

లేకుండా జరిగాయని ఆ సాక్ష్యముల వలన ప్రకటీకృతమౌతున్నది. ఈకాలంలో యుద్ధములలో విలువైన అస్త్రశస్త్రములను ప్రయోగిస్తున్నారు. ప్రాచీనకాలంలో వారుణాస్త్రము-నీటిని వర్షము వలె కురిపించేది. ఆగ్నేయాస్త్రము-భయంకర అగ్నిజ్వాలల దావానలాన్ని ప్రకటించేది. సమ్మోహనాస్త్రము - ప్రజలను నిర్వాపారులుగా సంజ్ఞాశూన్యులుగా నొనరించేది. నాగపాశము బిగించి బంధించేది. ఈరోజులలో అవెక్కడున్నాయి? ఈప్రకారము ఇంజన్, ఆవిరి, పెట్రోలు లాటివి లేకుండా ఆకాశంలోను, భూమిపై, నీటిలో వెళ్ళగలిగే రథములు యీరోజులలో ఎక్కడున్నాయి? మారీచునిలా మనుష్యుడు పశువుగా మారటానికి, సురస మాదిరి మహాశరీరాన్ని ధరించటానికి, హనుమంతునిలాగా ఈగ శరీరమును దాల్చడము, సముద్రాన్ని లంఘించడము, పర్వతము నెత్తడానికి, నలుని మాదిరి నీటిలో తేలేవంతెన ఱాళ్ళతో నిర్మించడము, రావణుడు, అహిరావణుడుల మాదిరి లంక, అమెరికాల మధ్య వార్తాలాపము జరగడము, అదృశ్యమవడములాంటి అనేక అద్భుత కార్యములున్నాయి. ఈ పనులు యంత్రములవలన గూడా జరుగనేరవు. కానీ వొక సమయములో యంత్రాలు లేకుండా, కేవలము ఆత్మికశక్తి యొక్క తాంత్రిక వుపయోగంతో సులభంగా పైన చెప్పబడినవి జరిగాయి. ఈ క్షేత్రంలో భారతదేశము చాలా ఔన్నత్యాన్ని సాధించినది. ప్రపంచాన్ని చక్రవర్తులవలె శాశిస్తూ జగద్గురువు లవడానికి కూడా మరియొక కారణ మిదే.

నాగార్జునుడు, గోరఖ్‌నాథ్, మచ్ఛేంద్రనాథ్ మొదలైన సిద్ధపురుషుల తరువాత భారతదేశంలో యీ విద్య నశించుతూ వచ్చింది. ఈ క్షేత్రంలో ప్రస్తుతము అధికారులుగా చెప్పడానికి తగిన వ్యక్తులు దొరకడము కష్టసాధ్యములతో గూడిన పని. ఈ తంత్రవిజ్ఞానముయొక్క శిథిలమైన అసంపూర్తి అవశేషముల శాఖప్రశాఖలు అచ్చటచ్చట వికలాంగములతో దొరుకుతున్నాయి. ఆ చమత్కారములు చూపేవారు అరుదుగా దొరుకుతున్నారు. అందులోని ప్రత్యేక శాఖ-యితఱుల శరీరము, మనస్సుపై మంచిగాని, చెడుగాని ప్రభావము చూపుట. వీటిని చేయువారు ప్రయోగము చేసి ఆరోగ్యముగా నున్నవారిని రోగులుగా మార్చగలరు. ప్రాణఘాతమైన కీడు, కష్టము, బాధ, జబ్బును కలిగించగలరు. బాధను కలిగించే ప్రాణఘాతుకమైన సూక్ష్మప్రహారమును వేయగలరు. కొంతమంది యొక్క బుద్ధిని పాడుచేయగలరు. వారిని పిచ్చివారిగా, ఉన్మత్తులుగా, విక్షిప్తులుగా, మందబుద్ధులుగా, వ్యతిరేకంగా ఆలోచించేవారుగా చేయగలరు. భ్రమ, భయము, సందేశము, అనుమానము, వ్యాకులతతో గుండెదడదడలతో చిక్కుకొనునట్లు చేసి ఆతని మానసిక వ్యవస్థను అస్తవ్యస్థము చేయగలరు. ఈవిధంగా అప్రత్యక్షచేతనాశక్తిద్వారా యితఱులపై చెడు ప్రభావమును గల్గించి వారిని దూరం చేయగలరు. దృష్టితగులుట, ఉన్మాదము, భూతోన్మాదము, గ్రహారిష్టములు, చెడురోజులు యితఱులచే ప్రయోగము చేయింపబడుట, మానసోద్వేగము మొదలైనవాటిని శాంతింపజేయవచ్చు. శారీరక రోగముల నివారణ, సర్పము, వృశ్చికముల కాటుల విషయములను తగ్గించవచ్చును. మంత్రముద్వారా చిన్నపిల్లలపై యీ విద్య సులభంగా చెడు ప్రభావాన్ని చూపగలదు.

తంత్రసాధన ద్వారా సూక్ష్మజగత్తులో చరించే అనేక చేతనాగ్రంథులను, కొన్ని విశేషగ్రంథులను తనకొఱకు మేల్కొనజేసి, చైతన్యంగాను, క్రియాశీలంగాను, తన ననుసరించునట్లు చేయవచ్చు. అనేకమంది తాంత్రికులు భూతములను, పిశాచములను, భైరవుని, ఛాయాపురుషుని బ్రహ్మరాక్షసిని, బేతాళుని, కర్ణపిశాచిని, త్రిపురసుందరిని, కాళరాత్రిని, దుర్గ మొదలైనవారి సిద్ధి పొందడము గమనించబడినది. సేవకుడు ప్రత్యక్ష శరీరంతో యజమానికి నౌకరీ చేస్తూ ఆజ్ఞానుసారము నడుచుకొంటాడు. అటులనే యీ శక్తులు అప్రత్యక్షరూపంలో నౌకరీచేస్తూ తంత్రసిద్ధపురుషుని

వశమై యెల్లప్పుడూ ఆ సిద్ధపురుషుని సమీపమున వుంటాయి. ఆజ్ఞ నిచ్చిన వెంటనే తమ సమర్థతానుసారము పూర్తి చేస్తాయి. దీనితోవారు అపుడపుడు చేసే అద్భుత కార్యములను గాంచి దిగ్భ్రాంతు లవడము జరుగుతుంది.

జరిగేదేమిటనగా అదృశ్యలోకపు చేతనాగ్రంథులు సదా సంచారము చేస్తుంటాయి. తాంత్రిక సాధనావిధానముల ద్వారా తమకు కావలసిన యోగ్యగ్రంథులను సంగ్రహించి వాటికి ప్రాణమీయడము జరుగుతుంది. అవి ప్రాణగ్రహీతలైన వెంటనే వాటి ఆక్రమణ సాధకునిపై వుంటుంది. తన ఆత్మికబలంతో ఆ ఆక్రమణను సహించగలిగితే వాటికి లోబడకుండా వున్నయెడల ప్రతిగా హితముగోరి ఆ గ్రంథులు సాధకుని వశవర్తులై, యిరువదినాలుగు గంటలూ ఆతని సాన్నిధ్యము నందుంటూ సేవకునివలె పనిచేస్తాయి.

అటువంటి సాధనలు చాలా అపాయములతో కూడుకొన్నవి. నిర్జనప్రదేశము, స్మశానము మొదలైన భయంకర ప్రదేశములలో అటువంటి రోమాంచితవిధానవ్యవస్థ నాచరించవలసివుంటుంది. ఈ పనులు సాధారణ మనుష్య హృదయాన్ని కలవరపరుస్తాయి. ఆ సమయములో ఘోరమైన అనుభములు జరుగుతాయి. కొన్ని సమయాల్లో భయము నొందుట, జబ్బుపడుట, పిచ్చిపట్టుట లేక మృత్యుముఖములో నుండుటకు అవకాశమున్నది. ఆ సాధన లందఱూ చేయలేరు. బహుశా పూర్తిగా చేసినప్పటికీ, ఆ శక్తులు అదృశ్యంగా తమ వద్ద నుండుటకు కష్టసాధ్యమైన షరతులుంటాయి. వాటిని పాటించడము వీలుకాదు. ఈ కారణమువలననే యీ మార్గమున పయనించదలచుటకు కొద్దిమందిమాత్రమే సాహసిస్తారు. అందులో కొద్దిమందిమాత్రమే విజయము పొందుతారు. ఆ విజయము పొందినవారిలో కొద్దిమందిమాత్రమే అంత్యము వఱకు ఆ శక్తుల వలన సముచిత లాభాన్ని పొందుతారు. ఈ తంత్ర సాధనల విధులను చెప్పుటకు మా కిష్టము లేదు. ఏలనన గోప్యంగా వుంచవలసిన రహ్యాములను సాధారణజనులకు ప్రకటించినయెడల దాని అర్థము బాలురక్రీడాస్థలములో తుపాకీమందు వెదజల్లినట్లవుతుంది. క్రీడాకుతూహలంతో సర్వనాశనము సంభవిస్తుంది. ఈ తాంత్రిక సాధనాపరంపరకు అధికారులైనవారు, అధికారాధారముపై ఒకరు యింకొకరికి నేర్పవలసి వుంటుంది. మాకు స్వయంగా యీ మార్గముపై ప్రాణఘాతుక అపాయముల ననుభవించిన చేదు అనుభవమున్నది. కావున అమాయకులు, బోళాభోళీ వ్యక్తులకు అపాయము కల్గించుటకు, ఆ శిక్షణావిధానముల చెప్పి చంపుట కెట్లు కోరుదుము? ఈ విషయమును చెప్పుటద్వారా యిష్టపడునదేమనగా కేవలము వాంఛించిన దేమనగా ప్రకృతియొక్క పరమాణుమయి సావిత్రిశక్తిపై గూడా ఆత్మిక విద్యుత్తుద్వారా పూర్వము అధికారము చేయబడినదనీ, భవిష్యత్తులో ఆ శక్తులను లోబరచుకొనవచ్చునని తెలియపఱచడమే.

ప్రస్తుతము యంత్రములు చేసే పని మాదిరి, అంతరంగిక విద్యుత్తుతో చేసే వ్యక్తులు కనుపించడము లేదు అనేది వాస్తవము. గడచిన రెండువేల సంవత్సరాలలో క్రమక్రమంగా యీ విద్య లుప్తమైపోయింది. ఇపుడీ విద్య తెలిసిన జ్ఞాతలు వెదకినా లభ్యమగుటలేదు. నేటి వివిధరకముల యంత్రముల కారణమువలన యిదివఱకటి అవసరము లేదు. కానీ ఆ మహావిద్యయొక్క ప్రకాశము సాగుతూనేవుండవలెను. ఈ లుప్తమైన మహాతాంత్రికవిద్యను, సావిత్రీని సాటిలేని పరిశ్రమద్వారా పునర్జీవింపజేయవలసిన బాధ్యత నేటి తాంత్రికులపై నున్నది. తద్వారా భారతీయ విజ్ఞాన మహత్తును ప్రపంచమునకు ప్రకటించవలసిన కర్తవ్యము వారిది.

ఈరోజున తాంత్రికులు చేయగల పనులు తక్కువేమీ గాదు. అల్పమైన ఆశ్చర్యజనకములు గూడాను. మహత్వపూర్ణ మైనవే. కానీ పరమాణు ప్రకృతిపై ఆత్మశక్తిద్వారా అధికారము, మన పూర్వీకుల వలె పొందేటంతవఱకు ప్రస్తుత తాంత్రిక మార్గగాములు నిశ్చింతగా, మౌనంగా, స్థబ్దంగా వుండగూడదు.

వర్తమానకాల తాంత్రిక విజ్ఞానపు అంశ ప్రాబల్యము, జ్ఞాత, క్రియాన్వితము గూర్చి పైన చర్చించబడినది. మనుష్యులపై అదృశ్యంగాను, మంచిగాను, చెడుగాను వుండేటట్లు ప్రభావము చేయడము నేటి తాంత్రిక విజ్ఞానపు ధోరణి, మర్యాదగా వున్నది. వస్తువుల రూపాంతరము, పరివర్తనము, ప్రకటీకరణము, అల్ప, అనల్పజాతి పరమాణువుల ఏకీకరణ గావించడము, వాటిని శక్తిగా ప్రయోగించడము ప్రస్తుతము బహుశః లుప్తము. చైతన్య గ్రంథులను మేల్కొలిపి, వాటిని శక్తిగా వశపఱచుకొని ఆజ్ఞానువర్తుల గావించుకొన్న విక్రమాదిత్యుల లాంటివారు నేడు లేరు. కానీ దీనితోపాటు మేము స్పష్టంగా చేయదలచిన విషయ మొకటున్నది. నేడు తంత్రవిద్య పేరుతో సాధారణంగా మోసగించడము పరిపాటియై నున్నది. అటువంటివారే యెక్కువమంది. వీరు ధన వ్యామోహముచే లేక పారస్పరిక రాగద్వేషములచే, యితఱ వ్యక్తులకు హాని కలిగించే చేష్టలు చేస్తారు. వా రీ ప్రయత్నంలో యెంతవఱకు సఫలీకృతులౌతారో, వారు చెప్పేదానిలో, చేసేదానిలో సత్యమెంత వున్నదో, అది వేఱే విషయము. కానీ వారీ విద్య నిటుల వుపయోగించినందువలన జరిగే పరిణామములుమాత్రము వారికి, వారి విద్యకు మంచిది కాదు. ప్రతిష్ఠాకరము కాదు. గొప్పవారు దీనిని వుపయోగము లేని దానినిగా భావిస్తున్నారు.

తంత్రశాస్త్రములో అనేక మంత్రము లున్నాయి. ఆ మంత్రములన్నీ చేసే పని గాయత్రీమంత్రము ద్వారా చేయవచ్చు. గాయత్రీయొక్క సంకల్పశక్తి సాధన యిక్కడ సవిస్తరంగా వివరించబడినది. కారణ మేమనగా గాయత్రీ మంత్రము సర్వులకు హితకారి. సులభము, సర్వమంగళమయము. పరమాణుమయి గాయత్రి ప్రధానము. వామమార్గ సావిత్రీవిద్య విషయములు చాలా గోపనీయము. వాని పరిచయముమాత్రమే యిక్కడ చెప్పబడినది. దీనికి సంబంధించినంతవఱకు రహస్యమైన విషయములపై అధికంగా ప్రకటించుట, తత్త్వసంబంధమైన సాధనలను బయల్పరచుట, ప్రజాహితము నభిలషించిన వుపయోగకరము, హితకరము కాదు. అందువలన పురోగమించకుండా యిచట సమాప్తము చేయడమైనది.

గాయత్రీద్వారా కుండలినిజాగరణ

శరీరములో అనేక సాధారణ, అనేక అసాధారణ అంగములున్నవి. అసాధారణ అంగములను 'మర్మస్థానము' లని సంబోధిస్తారు. కేవలము చాల సుకోమలమైనందున గానీ, వుపయోగకరములైనంత మాత్రమునగాని వాటిని 'మర్మస్థానము' లనలేదు. పోగా, యీ స్థానములయందు ఆధ్యాత్మికశక్తుల మహత్వపూర్ణత కేంద్రములున్నాయి. గనుక వీటిని మర్మస్థానములన్నారు. ఈ కేంద్రములలో కొన్ని బీజములు సురక్షితంగా వుంచబడినాయి. వీటియొక్క ఉత్కర్ష, జాగరణము జరిగినపుడు మనుష్య దేదో శక్తిని పుంజుకొనినవాడై గణనీయుడౌతాడు. అందులో ఆత్మికశక్తి ప్రవాహము పొంగిపొరలుతూ వుంటుంది. వాటి పొటమరింపు అభివృద్ధియొక్క ఫలిత మొక భండారమగుట నిశ్చయము. ఇదియే సాధారణ ప్రజలకు అలౌకిక ఆశ్చర్యకరము.

ఈ మర్మస్థానములలో మేరుదండము లేక వెన్నుముక ప్రముఖస్థానమును వహించుతుంది. మేరుదండము శరీరమునకు ఆధారశిల. ఈ మేరుదండము 33 అస్థిఖండముల కలయికవలన యేర్పడినది. ఈ ప్రత్యేక అస్థిఖండముల యందు, తత్త్వదర్శకులు విశేష శక్తులను పరిరక్షించెదరు. ఇవి దైవీసంబంధ స్థానములు. దేవతల శక్తుల కే స్థానములు కేంద్రమై యున్నవో ఆ శక్తులు భిన్నభిన్న రూపములలో మేరుదండపు యీ అస్థిఖండములలో నుండి పొందవచ్చును. అందువలన మేరుదండపు ముప్పదిమూడు అస్థిఖండములు 33 దేవతలకు ప్రాతినిధ్యము వహిస్తున్నవని నిష్కర్షగా చెప్పబడినది. అష్టవసువులు, ద్వాదశాదిత్యులు, ఏకాదశరుద్రులు, ఇంద్రుడు, ప్రజాపతి మొత్తము అందఱూ కలసి 33 మంది. ఈ 33 శక్తులు మేరుదండపు అస్థిఖండములలో బీజరూపములో నున్నవి.

ఈ పాలిపోయిన రంగులో నున్న మేరుదండములో శరీరవిజ్ఞానానుసారము అనేక నాడులున్నవి. ఈ నాడులు వివిధ కార్యములకు వినియోగింపబడినవి. ఆధ్యాత్మికవిజ్ఞానానుసారము వాటిలో ప్రముఖ నాడు లున్నవి. 1.ఇడ, 2. పింగళ, 3. సుషుమ్న. ఈ మూడు నాడులు వెన్నుముకను చీల్చి ప్రత్యక్షరూపంలో కండ్లతో చూచుటకు వీలులేదు. వీటి సంబంధము సూక్ష్మజగత్తుతో మాత్రమే. ఇది యొకవిధమైన విద్యుత్ప్రవాహము. విద్యుత్తుతో నడిచే యంత్రములలో ఋణాత్మక మరియు ధనాత్మక ధృవముల కలయిక జరిగేచోట శక్తి యేవిధంగా వుద్భవిస్తుందో, ఆవిధంగానే ఇడ - ఋణాత్మకముగా, పింగళ-ధనాత్మకముగా చెబుతారు. ఇడను చంద్రనాడియని, పింగళను సూర్యనాడియని గూడా అంటారు. ఈ రెండు కలసి ఉద్భవించే మూడవశక్తిని సుషుమ్న యని పిలుస్తారు. ప్రయాగలో గంగానది, యమునానది కలుస్తాయి. ఈ రెండూ కలసినందువలన మూడవ సూక్ష్మ ప్రవాహము వేఱే తయారవుతుంది. దానినే సరస్వతీనది యని పిలుస్తారు. అదేవిధంగా మూడు నదులు కలసి త్రివేణి అవుతాయి. మేరుదండపు అంతర్గతంలో గూడా అటువంటి ఆధ్యాత్మిక త్రివేణీ వున్నది. ఇడ, పింగళ రెండు ధారలు సమ్మేళనము చెంది సుషుమ్న యనునది సృష్టింపబడుతుంది. ఒక పరిపూర్ణ త్రివేణి తయారౌతుంది.

ఈ త్రివేణికి పైన మస్తిష్కంలో మధ్య కేంద్రంనుండి బ్రహ్మరంధ్రంగుండా, సహస్రారకమలమునకు సంబంధము కలిగివుండి మఱియు అథోభాగంలో మేరుదండపు కొన చివరివరకు వున్నది. అచట లింగమూలము మఱియు గుదస్థానానికి మధ్య అతుకు యందు నిట్టనిలువుగా చేరి అచట ఆగిపోతుంది. ఇది యీ త్రివేణీ ఆద్యము, అంతములు.

సుషుమ్నానాడియందు లోపల మరియొక త్రివేణి యున్నది. దాని అంతర్గతములో గూడా మూడు అత్యంత సూక్ష్మప్రవాహములు ప్రవహిస్తుంటాయి. వాటిని వజ్రనాడి, చిత్రణీ, బ్రహ్మనాడి యని ఉటంకిస్తారు. అరటిచెట్టుబోదెను ఖండించినపుడు, దానిలో ఒకదానిలో వేఱొక పొర కనుపించునట్లు, సుషుమ్న లోపల వజ్రనాడి వున్నది. వజ్రలో చిత్రణీ, చిత్రణీలో బ్రహ్మనాడీ వున్నవి. ఈ బ్రహ్మనాడి అన్ని నాడులలోకెల్లా మర్మస్థలమైనది. కేంద్రము. శక్తిసారము. ఈ మర్మమును రక్షించుటకే దానిపై యిన్ని పొరలు మడతవేయబడినవి.

ఈ బ్రహ్మనాడి మస్తిష్కకేంద్రంలో-బ్రహ్మరంధ్రములో చేరి అనేకవేల భాగములుగా నలుదిశల వ్యాపించుతున్నది. ఇందువలననే దీనిని సహస్రదళకమలము అని పిలుస్తారు. విష్ణుభగవానుని శయ్య సహస్రఫణిశేషుడని అలంకారికంగా అనడము యీ సహస్రదళమునుగూర్చియే. భగవాన్ బుద్ధుడు లాంటి అవతారమూర్తి మస్తకములపై ప్రత్యేకమైన వెంట్రుకల ముడిని వారి మూర్తిచిత్రములలో చూస్తాము. అవి సాధారణ వెంట్రుకలు గావు. మీదుమిక్కిలి సహస్రదళ కమలపు కళాత్మక చిత్రము. ఈ సహస్రదళము సూక్ష్మలోకములలోని విశ్వవ్యాపక శక్తులతో సంబంధము కలిగివుంటుంది.

రేడియో ట్రాన్స్‌మీటరు ధ్వని విస్తారము తీగెద్వారా వెంటనే వ్యాపింపజేస్తుంది. దీనిని ఏరియల్ అంటారు. తంతువులద్వారా సూక్ష్మాకాశంలో ధ్వని విసరివేయబడుతుంది. విస్తరించుతున్న తరంగములు గ్రహించబడతాయి. మస్తిష్కములోని ఏరియల్ సహస్రదళకమలము. దీని సహాయంతో పరమాత్మయొక్క అనంతశక్తులను సూక్ష్మలోకంలో గ్రహించవచ్చు. ఆకలితో నున్న కొండచిలువ మేల్కొని దీర్ఘశ్వాసను పీల్చినపుడు ఆకాశములో యెగురుతున్న పక్షులను తన తీవ్రశక్తితో బంధిస్తుంది. ఆ పక్షులు మంత్రముగ్ధలవలె కొండచిలువ నోటియందు ప్రవేశిస్తాయి. అదేవిధంగా మేల్కొని జాగ్రదావస్థను గాంచిన సహస్రముఖి శేషనాగు సహస్రారకమలము అనంత ప్రకారసిద్ధులను లోకలోకాంతరాల నుండి ఆకర్షించుతుంది. కొండచిలువ యేవిధంగా కోపమొచ్చిన విషమును గ్రక్కినపుడు ఆ విషము వాయుమండలంలో కొంతపరిధివఱకు విషగ్రస్థమవుతుందో అదేవిధంగా జాగ్రదావస్థలో నున్న సహస్రారకమలము ద్వారా శక్తివంతమైన భావన తరంగములను ప్రవహింపజేసి సాధారణ జీవజంతువులనూ, మనుష్యులనేకాక సూక్ష్మలోకములో నున్న ఆత్మలను గూడా ప్రభావింపజేయడము, ఆకర్షించడము చేయవచ్చు. శక్తివంతమైన ట్రాన్స్‌మీటర్‌ద్వారా చేయబడిన బ్రాడ్‌కాస్ట్ అమెరికానుండి, భారతదేశంలో వినవచ్చు. శక్తివంతమైన సహస్రారము ద్వారా నిక్షేపించబడిన భావనాప్రవాహముగూడా లోకలోకాంతరములతో నున్న సూక్ష్మతత్త్వములను వికసింపజేస్తుంది.

ఇపుడు మేరుదండపు క్రింద భాగములో నున్న మూలమును పరిశీలించుదాము. సుషుమ్న లోపలనుండే మూడునాడులలో అన్నింటికంటే సూక్ష్మమైన బ్రహ్మనాడి మేరుదండపు అంతిమభాగమునకు సమీపమున నల్లటివర్ణము గలిగి షట్కోణములు గల పరమాణువుతో అతుకుకొని బంధించబడి వుంటుంది. బలము కోసము గోడలో త్రాడుతో మూల గట్టిగా బంధిస్తాము

అటులనే షట్కోణకృష్ణవర్ణ పరమాణులో బ్రహ్మనాడి బంధించబడి వున్నది. ఈ శరీరములో బంధించటానికి వ్యవస్థ నిర్మింపబడినది. ఈ కృష్ణవర్ణ షట్కోణ పరమాణువును ఆలంకారికభాషలో కూర్మము అని గూడా వ్యవహరిస్తారు. ఏలననగా దాని ఆకృతి తాబేలు వలె నుంటుంది. పృథ్వి -కూర్మభగవానుని వీపుపై నున్నది.అ అలంకారమునకు తాత్పర్యము జీవనగ్రహము యీ కూర్మపురాణముపై నిలచివున్నదని. ఈ ఉక్తికి ఆధారము బ్రహ్మనాడి ఆ ఆకృతి గలది. దీనిలో కూర్మముతో కలసి బిఠాయించినది. జీవము ధరించియున్నది. బ్రహ్మనాడి తన ఆధారాన్ని త్యాగము చేసినట్లయితే యీ జీవన రూపము చూర్ణమైపోవటానికి క్షణముగూడా ఆలస్యము గాదని తెలుసుకొనవలెను.

కూర్మము నుండి బ్రహ్మనాడియొక్క గుదస్థలమును ఆధ్యాత్మికభాషలో కుండలినీ అని వక్కాణిస్తారు. నల్లటిరంగు గల మనుష్యుని నల్లనివాడు అని సంబోధిస్తారు. అదేవిధంగా కుండలీకారముతో నున్న యీ ఆకృతి కుండలిని అని చెప్పబడినది. ఇది మూడున్నరసార్లు మెలివేయబడి ఆ కూర్మములో వేయబడినది. దాని ముఖము అధోముఖము. వివాహ సంస్కాములలో దీనిని అనుసరిస్తూ ప్రదక్షిణము లేక తిరుగుట వుంటుంది. సులువుకోసము నాలుగు మూడుసార్లు ప్రదక్షిణము చేయించడము, ముఖమును క్రిందకు దించుకొనేటట్లు చేయడము, యీ కుండలినీ ఆధారముపైనే నెలకొల్పబడినది. కారణము భావి జీవన నిర్మాణవ్యవస్థ ఆధారశిల. ఇది కూర్మము మరియు బ్రహ్మనాడుల కలయిక మాదిరిగా నుండి శరీరము ప్రాణముల కలయిక, కుండలినీ శక్తి వలె మహత్త్వపూర్ణమై వుంటుంది.

ఈ కుండలినీ మహిమ, శక్తి, వుపయోగము మహత్తరము. దీనిని సరియైన పద్ధతిలో సంపూర్ణంగా తెలుసుకొన్నపుడు మనుష్యునిబుద్ధిలో చలనము కలుగుతుంది. భౌతికవిజ్ఞానాన్వేషులకు నేడు పరమాణువు చిక్కుసమస్యగా నున్నది. పరమాణవును విచ్ఛిన్నం చేయు ప్రక్రియ కనుగొన్నంతనే, ఆశ్చర్యకరమైన ప్రపంచము ప్రళయంకరమైన పరమాణుబాంబు రూపములో కనుగొన్నది. ప్రస్తుతము దాని విశేష విధ్వంసక రచనాత్మకత విచారణాంశము. సర్‌ఆర్థర్ కథనము ప్రకారము పరమాణుశక్తియొక్క పూర్తి విజ్ఞానము మనుష్యునకు పూర్తిగా గ్రాహ్యమైనపుడు అతని కసంభవమేమియు లేదు. మానవుడు సూర్యుని చిన్నిచిన్న ఖండములుగా జేసి తన ఒడిలో నుంచుకొంటాడు. వాంఛించిన వస్తువులను, యిష్టమొచ్చినరీతులలో ప్రాణులను సృష్టించగలడు. మొత్తము ప్రపంచము ఒకేపేటలో నివసించేవిధంగా చేయగల యంత్రము లాతనివద్ద నుండగలవు. వ్యక్తి కోరిన యెడల క్షణంలో రానూవచ్చు, పోనూవచ్చు. ఎవఠికి యేదడిగినా యివ్వవచ్చు. దేశదేశాంతరములలో నున్న వ్యక్తులు మూకగాచేరి, యిద్దఋ మిత్రులు గప్పాలుకొట్టుకునేవిధంగా మాట్లాడుకొనగలరు.

జడజగత్తులోని వొక పరమాణువు యొక్క శక్తి వూహించనలవిగానిది. దాని మహత్తరశక్తి లక్షించినచో ఆశ్చర్యమునకు అవధులుండవు. కానీ చైతన్యజగత్తుయొక్క విస్ఫులింగము జడపరమాణు శక్తికంటె అనంతమైన శక్తిశాలిని. దీని అద్భుతశక్తి కల్పనకు కూడ అందుట దుర్లభము.

యోగులలో అనేకవిధములైన అద్భుత శక్తు లుండుట వర్ణించబడినది. దానికి అనేక ప్రమాణములున్నవి. యోగసిద్ధులనుగూర్చి అనేక గాథలు మనము విన్నాము. కొన్ని ఆశ్చర్యజనకములు. వీటి నిజమెంతయో, విశ్వసనీయమో తెలియదు. చెప్పజాలము. విజ్ఞానము తెలిసికొన్నవారు పరమాణు చైతన్యస్ఫుల్లింగశక్తులగురించి తెలిసినవారికి ఆశ్చర్యమనిపించవు. నేడు పరమాణుశక్తిని పరిశోధించుటకు దేశదేశములలో ప్రత్యేక వ్యవస్థలున్నమాదిరి, పూర్వకాలంలో

ఆధ్యాత్మిక విజ్ఞానవేత్తలు, తత్త్వదర్శులైన ఋషులు, మానవ శరీరాంతర్గత బీజరూప పరమాణువుయొక్క ఆత్మను పరిశోధించారు. రెండు పరమాణువులను విచ్ఛిన్నము చేయటానికి సమ్మేళనము చేయడానికి, స్థానభ్రంశము చేయటానికి సర్వోత్తమమైన స్థానము కుండలినీ కేంద్రములో నున్నది. ఏలననగా యితఱ చోట్లనున్న అన్ని చైతన్య పరమాణువులు గుండ్రముగాను మృదువుగాను వుంటాయి. కానీ కుండలినీలో యిది మిథునము వలె కలసివుంటుంది. యురేనియం, ప్లూటోనియ ధాతువులలో పరమాణువుల నిర్మాణము వక్రత, వంకరపద్ధతిలో నుంటుంది. వీటిని విచ్ఛిన్నము చేయుట యితఱ పదార్థముల పరమాణువులకన్నా అధిక సరళము. అదేప్రకారము కుండలినీలో నున్న స్ఫులింగ పరమాణువుల గతివిధిని యిచ్ఛానుసారము సంచలింపజేయుట చాలా సులభము. సుగమము. అందువలన ప్రాచీనకాలంలో కుండలినీ జాగరణకొఱకు యెక్కువ పరిశోధన జరుగుతువుండేది. ఈ పరిశోధనలో, ప్రయోగముల ఫలస్వరూపంగా అనేక రహస్యములు పూర్వులకు కరతలాగతమైనవి. వాటిని నేడు 'యోగచమత్కారములు' అని పిలుస్తున్నారు.

మేడమ్‌బ్లావెట్స్కీ కుండలినీశక్తి విషయములో తగినంత శోధన గావించినది. ఆమె ఇలా వ్రాసినది. 'కుండలినీ విశ్వవ్యాపకమైన విద్యుచ్ఛక్తి. ఇది స్థూల విద్యుత్తుకన్నా అనేకరెట్లు అధికశక్తిశాలిని. దీని నడక, పోకడ సర్పము వలె వంకరగా వుంటుంది. అందువలన దీనికి సర్పాకారము కలదని వచిస్తారు. కాంతివేగము ఒకలక్షా యేబదివేల సంవత్సరములు. కానీ కుండలినీ వేగము 3,45,000 మైళ్ళు. పాశ్చాత్త వైజ్ఞానికులు దీనిని 'స్ప్రిడ్-ఫైర్' అనియు, 'సర్పెన్‌టైల్‌పవర్' అని చెప్పారు. ఈ సంబంధంలో సర్‌జాన్‌వుడ్‌రాఫ్ అధికంగా, విస్తృతంగా తర్కించి విశ్లేషణ గావించాడు.

కుండలినీ గుప్తశక్తుల ఇనుపపెట్టుగా అభివర్ణింపబడినది. రహస్యమైన పరిస్థితులలో బహుమూల్యమైన రత్నములను నిక్షేపించుటకు అజ్ఞాత స్థానంలో ఇనుపపెట్టెను వుంచుతారు. దానికి చాలా తాళములు వేస్తారు. లేకపోతే ఇంటిలోనివారుగాని, బయటి అనధికారులుగాని ఆ ఖజానాలో నుంచబడిన సంపత్తిని కాజేయటానికి అవకాశమున్నది. పరమాత్మ మనకు అనంతశక్తుల అక్షయభండారమునిచ్చి దానికి ఆఱు తాళములు వేశాడు. తాళము లెందుకు వేశాడంటే పాత్రత వచ్చిన వెంటనే ఆ ధనముయొక్క ఉత్తరాధికారిత్వము సవ్యంగా తెలుసుకొంటాడని, సంపత్తినంతను స్వాధీనము చేసికొనగలడని. ఆ ఆఱు తాళముల తాళపుచెవులు మనుష్యునకు స్వాధీనపఱచినాడు. సమయ మొచ్చినపుడు ఆ తాళములను తెరచి తదనుగుణమైన లాభము పొందుతాడని.

ఈ ఆఱు తాళములు కుండలిని పై నుంచబడినవి. ఇవి ఆఱు చక్రములని చెప్పబడినవి. ఈ చక్రములను తెలుసుకొని జీవుడు కుండలినీ సమీపమునకు చేరగలడు. వాటిని యథోచితంగా వుపయోగించి జీవనలాభమును పొందగలడు. అందఱికి కుండలినీ సాధారణంగా అస్తవ్యస్తవ్యవస్థలో పడివుంటుంది. కానీదానిని మేల్కొల్పినట్లయితే అది తన స్థానమునుండి వైదొలగుతుంది. అపుడు పరమాత్మ లోకమునకు ప్రవేశమేర్పడి, ఆయన శక్తులన్నీ సంక్రమిస్తాయి. మహా, మహాగుప్త నిక్షేపములు ప్రాచీనకాలములో భూమిలో నిక్షిప్తపఱచబడినపుడు సర్పమును కావలిదారుగా నుంచే సాంప్రదాయమున్నది. ఖజానా ముఖద్వారమున చుట్టచుట్టుకొనిన సర్పము సర్వదా కూర్చుని వుంటుంది. కాపలా కాస్తుంటుంది.

దేవలోకముగూడా అటువంటి ఖజానాయే. దాని ముఖములో షట్కోణ కూర్మపు శిఖ వుంచబడినది. శిలతో మేళవించబడి భయంకర సర్పిణి కుండలిని బిడాయించివున్నది. ఆ సర్పిణి అధికారియైన సత్పాత్రత గలిగినవారికై

ప్రతీక్ష చేస్తూవుంటుంది. అట్టి అధికారి దాని సమీపమునకు వచ్చిన వెంటనే నిరోధించకుండా హాని చేయకుండా, తన స్థానమును వదలి త్రోవయిచ్చి, అధికారి కార్యములో సఫలమవటానికి వీలు కల్గించుతుంది.

కుండలినీ జాగరణ ప్రయోజనాలను అభివర్ణిస్తూ, అనుభవజ్ఞుడైన సాధకుడిలా వ్రాశారు - 'భగవతీ కుండలినీ కృపవలన సాధకుడు సర్వగుణసంపన్నుడౌతాడు. అన్ని కళలూ, అన్ని సిద్ధులూ, అతనికి అనాయాసంగా ప్రాప్తించుతాయి. ఆ సాధకుడు నూఱు సంవత్సరములు సంపూర్ణ ఆరోగ్యముతో దృఢంగా వర్ధిల్లుతాడు. ఆతడు తన జీవితమును పరమాత్మ సేవకు అంకితము చేస్తాడు. పరమేశ్వరాదేశానుసారము లోకోపకారము గావించుతూ, అంతంలో స్వేచ్ఛగా కళేబరమును విసర్జించుతాడు.

షట్చక్రములు : ఆజ్ఞాచక్రము, విశుద్ధచక్రము, అనాహతచక్రము, మణిపూరకచక్రము, మూలాధారచక్రము.

కుండలినీశక్తి సంపన్నవ్యక్తి పరిపూర్ణంగా, నిర్భయంగా, ఆనందమయంగా వుంటాడు. భగవతీదేవియొక్క కృప వానిపై సంపూర్ణంగా వుంటుంది. ఆమెయొక్క రక్షణలో ఛత్రఛాయలో వున్నట్లు అనుభవం ద్యోతకమౌతుంది. ఆ సాధకుని చెవులలో మాత శబ్దము ప్రతిధ్వనిస్తూ వుంటుంది. ఆ శబ్దము - భయపడవద్దు. నేను నీ వెనుకనే వున్నాను' అని. కుండలినీశక్తి ప్రభావము వలన మనుష్యుని దృష్టికోణము దైవిక మవుతుందనుటలో సందేహము లేదు. దానికి కారణము ఆతని వ్యక్తిత్వమన్నివిధముల సంపన్నమై, సుఖంగా నుంటుంది. మస్తిష్కపు బ్రహ్మరంధ్రములో వ్యాపించియున్న సహస్రదళముగూడా సాధారణంగా కుండలినీ అవస్థ వున్న మాదిరిగానే, నిద్రావస్థలో వుంటుంది. బహుమూల్యమైన యిట్టి యంత్రము, కోశమున్నప్పటికీ మనుష్యుడు సాధారణంగా, చాలా దీనునిగా, దుర్బలునిగా, తుచ్ఛునిగా, క్షుద్రునిగా, విషయవికారములకు బానిసయై, పురుగు, పక్షి మాదిరి జీవితాన్ని వెళ్ళదీస్తున్నాడు. దుఃఖముతోను, దారిద్ర్యముతోను బాధపడుతూ కృశించిపోతున్నాడు. కానీ యీ షట్‌యంత్రములను రత్నాగారములతో పరిచయ మేర్పడినపుడు, వాటిని వుపయోగించుకోగలిగినపుడు, వాటిపై అధికారము చలాయించగలిగినపుడు అతడు పరమాత్మకు నిజమైన వుత్తరాధికారియై, సమస్త యోగ్యతలను, శక్తులనూ పొంది సంపన్నుడౌతాడు. కుండలినీజాగరణ వలన పొందగలిగే లాభాలను పొందుపరుస్తూ యోగశాస్త్రములో బహువిస్తృతమైన, ఆకర్షణీయమైన వర్ణన లున్నవి. ఆ మొత్తము వర్ణనల సారాంశము కుండలినీశక్తి జాగరణ గావించి విశ్వంలో నున్న ప్రతిదానిని పొందవచ్చు. ఆతనికి లభ్యము కానిదంటూ యేమీ లేదు.

షట్చక్రముల పరిశీలన, ప్రవేశం, దర్శనం

కుండలినీశక్తి మూలమువఱకు చేరుటకు మార్గములో ఆఱు తలుపు లున్నవి. తలుపులని సంబోధించటానికి కారణము వాటికి తాళములు వేసివున్నాయిగనుక. ఈ తలుపులను తీసి యే ప్రాణియైనా ఆ శక్తికేంద్రములవఱకు చేరవచ్చు. ఈ ఆఱు అవరోధములను ఆధ్యాత్మికభాషలో షట్చక్రములు అంటారు.

సుషుమ్నానాడియొక్క అంతర్గమనంలోనున్న మూడు నాడులలో అన్నింటికంటే లోపలవున్న బ్రహ్మనాడితో యీ ఆఱు చక్రములకు సంబంధమున్నది. మాలలో నున్న కమలపుష్పములను గ్రుచ్చిన దారముతో యీ బ్రహ్మనాడిని పోల్చిన ఉపమానమున్నది. మూలాధారచక్రము యోనికి నిట్టనిలువున, స్వాధిష్ఠానచక్రము పొత్తికడుపుకు నిలువున, మణిపూరకచక్రము నాభికి నిలువుగా, అనాహతచక్రము హృదయానికి నిలువున, విశుద్ధచక్రము కంఠమునకు నిట్టనిలువున, ఆజ్ఞాచక్రము భృకుటి మధ్యలో నున్నవి. వీటిపైన సహస్రారమున్నది.

సుషుమ్నానాడియొక్క అంతర్గతములో నున్న చిత్రిణి మొదలైన నాడు లెంత సూక్ష్మమైన వనగా వాటిని సాధారణ నేత్రములతో చూచుట కష్టము. అదీగాక దీనితో సంబంధమున్న చక్రము లింకా సూక్ష్మములుగూడా. శరీరము కోసి, చీల్చినపుడు యీ చక్రములు, నరములు, నాడులమాదిరి స్పష్టముగా చూడలేము. శబ్దతరంగము, వాయు పరమాణువులు, రోగకారణ సూక్ష్మజీవులు మనము కండ్లతో చూడలేము. కానీ వాటి ఉనికిని, అస్థిత్వమును కాదనలేము. ఈ చక్రములను యెగులు తమ యోగదృష్టితో తిలకించారు. వాటిని విజ్ఞానముతో పరిశీలంచి, పరిలక్ష్యించి మహత్తరమైన ప్రయోజనాన్ని పొందారు. వాటి వ్యవస్థానిర్మాణాన్ని విజ్ఞానాన్ని యోగమార్గపథికులకొఱకు పదిలపఱచారు.

షట్చక్రాలు ప్రత్యేకవిధమైన సూక్ష్మగ్రంథులు. అవి బ్రహ్మనాడి మార్గంలో యేర్పరచబడినాయి. ఈ చక్రగ్రంథులపై సాధకులు ధ్యానమతో కేంద్రీకరించినపుడు, అచట సాధకునకు సూక్ష్మస్థితి విచిత్ర అనుభూతి కలుగుతుంది. ఆ గ్రంథులు గోళాకారములో నుండవు. దానిలోనుండి కోణములు బయల్పడుతాయి. అవి పుష్పములోని పూరేకుల వలె వుంటాయి. వాటిని కోశములు లేక పూరేకులు లేక పద్మదళము లని పిలుస్తారు. ఇవి ప్రత్యేకవిధమైన తంతుగుచ్ఛములు.

ఈ చక్రముల రంగుకూడా విచిత్ర ప్రకారంగా వుంటుంది. ఏమనగా కొన్ని గ్రంథులకు ప్రత్యేకంగా ప్రత్యేక గ్రంథులకు వేఱ్వేఱుగా తత్త్వములు ప్రధానంగా వుంటాయి. ఈ తత్త్వప్రాధాన్యత కారణంగా ఆ స్థానంలో రక్తము ప్రభావానికి లోనవుతుంది. ఆ రంగు మారుతుంది. పృథ్వీతత్త్వము ప్రాధాన్యతవలన మిశ్రమము కలిగిన గులాబీరంగు, అగ్నికి నీలము, వాయువునకు నిర్మలమైన యెఱుపు, ఆకాశము ధూళిరంగులో వుంటుంది. ఇదియే మిశ్రణము చక్రముల రంగులను మార్చుతుంది.

ఘున -పేరు గల పురుగు కట్టెలను తొలచి రంధ్రము చేసుకుంటూవెళ్తుంది. అది తొలచిన ప్రదేశంలో ఆకృతి యేర్పడుతుంది. ఈ చక్రములలో ప్రాణవాయువు రాకపోకడలు సాగిస్తువుంటుంది. దాని మార్గము ఆ గ్రంథుల స్థితికి అనుగుణ్యంగా, కొంచెము సన్నగా, కొంచెము లావుగా వుంటుంది. ఈ గతికి రూపము, చాలావఱకు దేవనాగరి లిపిలోని అక్షరముల వలె వుంటుంది. అందువలన వాయుమార్గమును, చక్రముల అక్షరములని చెబుతారు.

ధృతగతితో ప్రవహించే నదిలో కొన్ని ప్రత్యేక స్థానములలో సుడిగుండము లుంటాయి. ఈ నీటి సుడిగుండములు కొన్నిచోట్ల తక్కువ లోతుగలవిగాను, కొన్నిచోట్ల బాగా లోతుగాను, కొన్నిచోట్ల వంకరగాను, కొన్నిచోట్ల నాలుగుకోణములు గలిగి గుండ్రముగా తిరుగుతూవుంటాయి. ప్రాణవాయువు యొక్క సుషుమ్న ప్రవాహము యీ చక్రములలో ధృతగతితో పయనిస్తూ వుంటుంది. అపుడచట ప్రత్యేకమైన సూక్ష్మసుడిగుండ మేర్పడుతుంది. దాని ఆకృతులు, చతుష్కోణము, అర్ధచంద్రాకారము, త్రికోణము, గోళాకారము, లింగాకారము, అటులనే పూర్ణచంద్రాకారముగా యేర్పడుతుంది. అగ్ని యే సమయమందు ప్రజ్వరిల్లినా దాని నాలుకలు వూర్ధ్వంగానే వుంటాయి. అవి అధోభాగంలో లావుగాను, పైన సన్నగాను వుంటాయి. ఈవిధంగా అవ్యవస్థిత త్రికోణము యేర్పడుతుంది. అదేవిధంగా అనేక ఆకృతులు వాయుప్రవాహమువలన యేర్పడతాయి. ఈ ఆకృతులను చక్రముల యంత్రము లని పిలుస్తారు.

శరీరము పంచతత్త్వములచే యేర్పడినది. ఈ తత్త్వముల న్యూనాధిక, సమ్మిశ్రణముతో వివిధ అంగప్రత్యంగముల నిర్మాణ కార్యము, వాటి సంచలనము జరుగుతుంది. ఏ స్థానములో, ఏ తత్త్వముయొక్క ఆవశ్యకత యెంత వున్నదో, దానికి న్యూనాధికత యేర్పడినపుడు ఆ అంగము రోగగ్రస్తమౌతుంది. తత్త్వముల యథాస్థానవం యథామాత్రంలో నున్నపుడు నిరోగితకు చిహ్నముగా పరిగణిస్తారు. ఏ చక్రములో ఏయే తత్త్వములు ప్రాధాన్యత వహిస్తాయో, అదే తత్త్వమును దాని తత్త్వముగా చెబుతారు.

బ్రహ్మనాడియొక్క బోలుగొట్టములో నుండి వాయువుయొక్క అభిగమనముంటుంది. అందువలన చక్రముల సూక్ష్మఛిద్రములకు దెబ్బతగిలి, వాటినుండి పిల్లనగ్రోవి శబ్దము ప్రవేశించినపుడు రంధ్రములద్వారా ధ్వని బయల్పడునట్లు ధ్వని ఉత్పన్నమౌతుంది. ఈ ధ్వని చిద్రముల ఆధారంతో వుత్పన్నమౌతుంది. పిల్లనగ్రోవిలో నున్న చిన్న రంధ్రములద్వారా సరి, గమ, పద, నిస అనే స్వరములు వెలువడతాయి. ఆవిధంగానే చక్రఛిద్రముల నుండి యొక విశేష ధ్వని ప్రవహించుతుంది. ఆ ధ్వని నుండి యం, లం, రం, హం, ఓం లాంటి స్వరములు వినిపిస్తాయి. వీటిని చక్రబీజము లనియెదరు.

చక్రములలో వాయుచలనములో అంతరము లేక తేడా వుంటుంది. వాత, పిత్త, కఫ నాడులలో పావురము, మండూకము, కుక్కటము మొదలైన నడకలుంటాయి. ఆనడకలను గుర్తించి వైద్యులు తమ పనిని నెరవేర్చుకుంటారు. వైద్యము చేస్తారు. తత్త్వమిశ్రణము, సన్నని విశాలమార్గము, సుడిగుండము, బీజము మొదలైనవాటి సమన్వయమువలన నొక విశేషమైన నడక అచట పరిరక్షింపబడుతుంది. ఇది ప్రత్యేకచక్రంలో ఏనుగుమాదిరి మందగామిగాను, వేఱొక చక్రములో మొసలిమాదిరి మునుగుతున్నప్పుడు వచ్చే శబ్దము వలె, ఇంకొక చక్రములో లేడిమాదిరి దుముకు, ఒక చక్రంలో కప్ప మాదిరి యెగురుట వుంటుంది. దీన్ని చక్రప్రవాహము అంటారు.

ఈ చక్రములలో వివిధ దైవీశక్తులు సన్నిహితంగా వున్నాయి. ఉత్పాదనము, పోషణము, సంహారము, జ్ఞానము, సమృద్ధి, బలము మొదలైన శక్తుల దేవతా విశేషము శక్తి అంగీకరించబడినది. లేకున్న యీ శక్తులనే దేవతలనిగూడా అనవచ్చు. ప్రతిచక్రములో పురుషవర్గ ఉష్ణవీర్య మొకటి, స్త్రీవర్గ శీతవీర్య మొకటి వుంటాయి. ఎందుకనగా ధన, ఋణములు, అగ్ని, సోమము లను రెండు తత్త్వముల సమ్మిళితము గాకుండా జీవముల గతిప్రవాహము ఉత్పన్నము గాదు. ఈ శక్తులే చక్రములోని దేవిదేవతా శక్తులు.

పంచతత్త్వములకు ప్రత్యేక గుణము లున్నవి. పృథ్వికి గంథము, జలమునకు రసము, అగ్నికి రూపము, వాయువునకు స్పర్శ, ఆకాశమునకు శబ్దము గుణములై వున్నాయి. చక్రములలో తత్త్వప్రాధాన్యతకు అనుగుణంగా వాటికి గుణములుకూడా ప్రాధాన్యతను కలిగివున్నాయి. ఇవియే చక్రముల గుణములు.

ఈ చక్రములు తమయొక్క శక్తులను యథోచితంగా శరీరములోనికి ప్రవహింపజేస్తాయి. కానీ జ్ఞానేంద్రియ మొకదానికి, కర్మేంద్రియానికి చక్రముల సంబంధము విశేషరూపంలో నుంటుంది. తత్సంబంధ యింద్రియములపై వాటి ప్రభావ మధికంగా వుంటుంది. చక్రముల జాగరణ చిహ్నములు ఆ యా యింద్రియములపై తక్షణము పరిలక్షింపబడుతాయి. ఈ సంబంధ విశేషకారణముననే యా యింద్రియములను చక్రేంద్రియములని ఉటంకిస్తారు. దేవశక్తులలో డాకినీ, రాకినీ, శాకినీ, హాకినీ మొదలైన చిత్రనామములను విని వాటికి భూత మనీ, పిశాచి, ప్రేతముల లాంటివి వున్నాయని భ్రమ వున్నది. కానీ విషయం మాత్రం అది కాదు. ముఖమునుండి మొదలై నాభివఱకు చక్రాకారంలో 'అ'నుండి 'హ'వఱకు సమస్త అక్షరములకు గ్రంథిమాల యొకటి వున్నది. ఆ మాలయొక్క రూపము, ముద్రలను మాత్రుకలని పిలుస్తారు. ఆ మాత్రుకల యోగదర్శనము ద్వారామాత్రమే ఋషులు దేవనాగరీ అక్షరమాలను రచించారు. చక్రముల అధిష్ఠానదేవత లే మాత్రుకలచే ఝంకృతులౌతారో, సంబద్ధులయ్యెదరో, వాటిని ఆయా దేవతల దైవశక్తులని వక్కాణిస్తారు. డ,ర,ల,క,శ అక్షరముల ముందు మొదటి మాత్రుకలైన 'కా' బోధకములకు కినీ శబ్దము జోడించి, రాకినీ, డాకినీ యను పేర్లీయబడినవి. ఇవియే దేవశక్తులు.

మూలాధారచక్రము : స్థానము - యోని. వర్ణము -ఎఱుపు. లోకము -భూలోకము. దళమునకు అక్షరములు వం, శం, షం, సం. తత్త్వము : పృథ్వీతత్త్వము. బీజమూలము - లం. వాహనము - ఐరావతము ఏనుగు. గుణము - గంథము. దేవశక్తి - డాకిని. యంత్రము - చతుష్కోణము. జ్ఞానేంద్రియము - నాసిక. కామేంద్రియము - గుదము. ధ్యానఫలము - వక్త. మనుష్యులలో శ్రేష్ఠత్వము, సర్వవిద్యావినోదము, ఆరోగ్యము, ఆనందచిత్తము, కావ్యరచనా సామర్థ్యము.

స్వాధిష్ఠానచక్రము : స్థానము : పొత్తికడుపు. దళములు - ఆఱు. వర్ణము : సిందూరము. లోకము : భువర్లోకము. దళమునకు అక్షరములు - బం, భం, యం, రం, లం. తత్త్వము - జలము. తత్త్వబీజము - వం. బీజవాహనము - మకరము. గుణము - రసము. దేవత - విష్ణువు. దేవశక్తి -డాకిని. యంత్రము - చంద్రాకారము. జ్ఞానేంద్రియము - నాలుక. కామేంద్రియము - లింగము. ధ్యానఫలము - అహంకారాధికారముల నాశనము, శ్రేష్ఠయోగము, మోహనివృత్తి, రచనాశక్తి.

మణిపూరకచక్రము : స్థానము - నాభి. దళములు - పది. వర్ణము - నీలము. లోకము - స్వర్గము. దళముల అక్షరములు -డం, ఢం, ణం, తం, ధం, నం, పం, ఫం. తత్త్వబీజము -రం. బీజవాహనము - పొట్టేలు. గుణము - రూపము. దైవము-వృద్ధరుద్రుడు. దైవశక్తి - శాకినీ. యంత్రము - త్రికోణము. జ్ఞానేంద్రియము -చక్షువు. కర్మేంద్రియము - చరణము. ధ్యానఫలము - సంహారము, పాలనా సామర్థ్యము, వచనసిద్ధి.

అనాహతచక్రము : స్థానము - హృదయము. దళములు - పన్నెండు. వర్ణము - అరుణ. లోకము - మహర్లోకము. దళమున కక్షరములు - కం, ఖం, గం, ఘం, ఙం, చం, ఛం, జం, ఝం, ఞం, టం. ఠం. తత్త్వము - వాయువు. దేవశక్తి - కాకినీ. యంత్రము - షట్కోణము. జ్ఞానేంద్రియము - త్వచము. కర్మేంద్రియము - కరము. ఫలము - స్వామిత్వము, యోగసిద్ధి, జ్ఞానము జాగృతి, ఇంద్రియజయము, పరకాయప్రవేశము.

విశుద్ధచక్రము : స్థానము - కంఠము, దళములు - పదహారు. వర్ణము - ధూమ్రవర్ణము. లోకము - జనలోకము. దళముల అక్షరములు - అ నుండి అః వఱకు. గుణము - శబ్దము. దేవ - పంచముఖ సదాశివుడు. దేవశక్తి - శాకినీ. యంత్రము - శూన్యము, గోళాకారము. జ్ఞానేంద్రియము - కర్ణము. కర్మేంద్రియము - పాదము. ధ్యానఫలము - చిత్తశాంతి, త్రికాలదర్శిత్వము, దీర్ఘజీవనము, తేజోవంతము, సర్వహితపరాయణత.

ఆజ్ఞాచక్రము : స్థానము : భ్రూమధ్యము. రంగు - శ్వేతము. దళముల అక్షరము - హం, క్షం. తత్త్వము - అహంతత్త్వము. బీజపుదైవము - జ్యోతిర్లింగము. వాహనము - నాదము. లింగదైవీశక్తి - హాకినీ. యంత్రము - లింగాకారము. లోకము - తపోలోకము. ధ్యానఫలము - సర్వార్థసాధన.

షట్చక్రము లనగా పైన చెప్పబడిన ఆఱు చక్రములు. కానీ సహస్రారము లేక సహస్రదళకమలమును కూడా కొందఱు సప్తమచక్రముగా అంగీకరిస్తారు. దీనినే శూన్యచక్రముగా భావిస్తారు. దాని వర్ణనకూడా క్రింద నీయబడినది.

శూన్యచక్రము : స్థానము - మస్తకము. దళములు - సహస్రము. దళముల అక్షరములు - అం నుండి క్షం వఱకు పునరావృత్తమౌతాయి. లోకము - సత్యలోకము. బీజతత్త్వము - తత్త్వముల కతీతము. బీజము - విసర్గ. బీజవాహనము - బిందుదైవము. పరబ్రహ్మము. దైవశక్తి - మహాశక్తి. యంత్రము - పూర్ణచంద్రుని వలె ప్రకాశము. నిరాకారము. ధ్యానఫలము - భక్తి, అమరత్వము, సమాధి, సమస్త ఋద్ధి-సిద్ధులు కరతలామలకములు.

కుండలినీశక్తి ప్రవాహ మని తెలిసినది. ఆ శక్తి మన శరీరములో అన్నింటికంటే అధిక సమీపమున వున్న చైతన్యస్ఫుల్లింగము. దానిలో బీజరూపములో మనము ఊహించలేని రహస్యశక్తులు నిగూఢంగా వున్నాయి.

కుండలినీశక్తికి యీ ఆఱు చక్రములు కేంద్రములు. ఆఱు చక్రములలోకూడా తగినంత కుండలినీ ప్రకాశమున్నది. సౌరమండలములో తొమ్మిది గ్రహములున్నవి. సూర్య డా మండలమునకు కేంద్రము. చంద్రుడు, కుజుడు మొదలైన గ్రహములు సూర్యునితో సంబంధమున్నందున సూర్యుని చుట్టూ పరిభ్రమించుచున్నవి. అటులనే కుండలినీగూడా. ఈ తొమ్మిది గ్రహములు సూర్యునియొక్క వేడిమి, ఆకర్షణ, కదలిక శక్తులనుండి ప్రభాన్వితములై పడుగుపేకలవలె నున్నాయి. అటులనే కుండలినీ శక్తులుగూడా చక్రములలోకి ప్రసారితములై వుంటాయి. ఇనుపపెట్టెలో అనేక సొరుగులుంటాయి. ఆ సొరుగులు చాలా చిన్నవి. తేనెతుట్టులోగూడా అనేక గదులుంటాయి. ప్రతిగదిలో తేనె కొంత

వుంటుంది. అటులనే కుండలినీశక్తులలో కొన్ని శక్తి ప్రకాశములు చక్రములలో గూడా నుంటాయి.

చక్రములు జాగరణ గావింపబడిన వెంటనే, వాటితోపాటు వాటిలో సన్నిహితంగా రహస్యంగా నున్న పెక్కు శక్తులుగూడా మేల్కొంటాయి. అవి సక్షిప్తంగా, సాంకేతికంగా పైన చక్రాల ధ్యానఫలంలో చెప్పబడినవి. వీటిని విస్తరించి చెప్పినట్లయితే యీ శక్తులుగూడా ఆశ్చర్యకరములే గాకుండా, ఇతఱవాటికంటే తక్కువ ప్రశస్తమైనవేమీ కావు.

షట్చక్రముల పరిశీలన : షట్చక్రములను తెలుసుకొంటూ కుండలినీవఱకు చేరడము, దానిని మేల్కొలిపి ఆత్మోన్నతి మార్గములో ప్రవేశపెట్టడము అనే విషయము మహావిజ్ఞానము. ఇదేవిధంగా పరమాణుబాంబును నిర్మించి దానిని పేల్చుట అత్యంత బాధ్యతాపూర్ణమైన కార్యము. దీనిని తేలికగా తనంతట తాను కేవలము పుస్తకము చదివి ఆరంభించగూడదు. అనుభవజ్ఞుడైన మార్గదర్శియొక్క సంరక్షణలో యిదంతా చేయడము తెలుసుకోవలెను.

చక్రములను దర్శించడము ధ్యానశక్తి ద్వారా చేయబడుతుంది. మన మస్తిష్క మొక విద్యుత్తుగృహమని అందరకు తెలిసిన విషయమే. ఈ విద్యుత్తుగృహములో ప్రముఖధార మనస్సు. మనస్సు నడక, పోకడ, చంచలము, బహుముఖ మైనది. ఈ మనస్సు యెల్లప్పుడూ చంచలతామగ్నమై, సదా పరుగులిడుతూ, గెంతుతూ వుంటుంది. దానికి కారణము విద్యుత్పుంజము యేక స్థానమందు కుదురుగా కేంద్రీకరింపబడకుండుటయే. అటుల కేంద్రీకరింపబడి నట్లయితే మనస్సు మహత్తర కార్యములను సాధించగలదు.

మనస్సు కేంద్రీకరింపబడకుండుటవలన క్షణములు, నిముషములు అస్తవ్యస్థమై వృథాగా దొర్లుతున్నాయి. ఈ శక్తులను కేంద్రీకరించి, ఒకే స్థానంలో ప్రోగుచేసినట్లయితే భూతద్దముద్వారా యేకత్రితము జేయబడిన సూర్యకిరణముల ద్వారా నిప్పురవ్వలు ఉద్భవించునట్లుగా మహత్తరశక్తి దృగ్గోచరమవుతుంది. ధ్యాన మనే సూక్ష్మవిజ్ఞానముద్వారా మనస్సులో చెల్లాచెదరుగా నున్న బహుముఖశక్తులు, కేంద్రీకరింపబి ఒకే పనిపై లగ్నము చేయబడతాయి. ఫలస్వరూపంగా అచట నొక అసాధారణ శక్తిద్వారా ప్రవహించుతుంది. ధ్యానముద్వారా మనోక్షేత్రపు శక్తి యైన యీ విద్యత్తునుగూర్చి షట్చక్రములద్వారా తెలుసుకొనవచ్చు.

షట్చక్రములను దర్శించుటకు సాధన చేయటానికి అనేక గ్రంథములలో అనేక మార్గములు చెప్పబడినవి. ఈవిధంగా గురుపరంపరలో సాగే సాధనలు వివిధములుగా నున్నాయి. ఈ మార్గము లన్నీ సఫలతను చేకూర్చునవియే. కానీ ఒక షరతు. సాధకునకు పూర్ణవిశ్వాసం వుండవలెను. శ్రద్ధ, నిష్ఠలతోపాటు సముచితమైన యోగ్యుడైన మార్గదర్శకుని సంరక్షణలో సాధన చేయవలెను.

ఇతఱ సాధనలగురించి చర్చించుట, తులనాత్మకపరిశీలన గావించుట యిచట మా అభీష్టము గాదు. మే మొక సులభసాధనను తెలియజేయదలచాము. దీనివలన గాయత్రీశక్తితో చక్రముల జాగరణ సులభము కాగలదు. ఇతఱ సాధనలలో వుండే అసాధారణత్వము, కష్టము యిందులో లేదు. కాగా సర్వస్వతంత్రమైనది.

ప్రాతఃకాలమున శుభ్రమైన శరీరముతో, స్వాస్థ్యచిత్తముతో జాగరూకతతో నుండి పద్మాసనాసీనులై కూర్చోండి. పూర్వము చెప్పబడిన బ్రహ్మసంధ్య యొక్క పంచకోశ క్రియలను చేయండి. ఆసనవీ, శిఖాబంధనము, ప్రాణాయామం, అఘమర్షణ,న్యాసము చేసినతరువాత గాయత్రీమంత్రమును నూటయెనిమిదిసార్లు జపించండి.

బ్రహ్మసంధ్యావార్చిన తరువాత మస్తిష్కపు మధ్య భాగమున త్రికుటిలో వేదమాత గాయత్రీదేవియొక్క జ్యోతి స్వరూపమును ధ్యానించవలెను. కమ్మరి లోహమును కరగించుటకు మూసను కొలిమిలో నుంచునట్లు, మనోమధ్యలో నున్న జ్యోతిర్లింగపు మధ్యలో గాయత్రీదేవిని చొప్పించవలెను. కమ్మరిలోహము కరగినతరువాత దానిని మర్దించి తన కభీష్టమైన రూపములో తీర్చిదిద్దుతాడు. త్రికుటిస్థానములో నున్న గాయత్రీ జ్యోతిలో మనస్సును లగ్నము చేసినపుడు, కొంతసేపటికి మనస్సు స్వయంగా తేజోరూపాన్ని పొందుతుంది. అపుడు దానిని ఆజ్ఞాచక్రపు స్థానమునకు తేవలెను. బ్రహ్మనాడి మేరుదండమునుండి పైకివచ్చి త్రికుటిలో నున్న సహస్రారమునకు చేరుతుంది. ఈ బ్రహ్మనాడి బోలుగొట్టాన్ని దీప్తివంతమైన మనస్సులోకి ప్రవేశింపజేసి ఆజ్ఞాచక్రమునకు తీసుకురావలెను. అచట నిలిపినట్లయితే చక్రలక్షణములలో వర్ణింపబడినదంతా అవగతమౌతుంది.

మనస్సునకు, చక్రపు అక్షరములు, తత్త్వములు, దైవశక్తి బీజములు, యంత్రము, లోకము, వాహనము, గుణము, రంగు అనుభవమౌతుంది. ప్రారంభంలో అనుభవము చాలా అస్పష్టముగా నుంటుంది. క్రమక్రమంగా చక్రము కొంత స్పష్టంగాను, కొంత అస్పష్టంగానూ వీక్షింపబడుతుంది. క్రమేణా అధిక స్పష్టత గోచరిస్తుంది. కొన్ని సమయాలలో కొంతమంది వ్యక్తుల చక్రములలో, లక్షణములలో కొంత తేడా వుంటుంది. వారివారి అంతరములలో నున్న చక్రముల ఆకృతి అనుభవమౌతుంది. స్వాస్థ్యచిత్తముతో, జాగరూకతతో, ఒక మాసము ఒక చక్రము చొప్పున సాధన చేసినట్లయితే ఆ చక్రము స్ఫుటంగా గోచరిస్తుంది. ధ్యానంలో దాని లక్షణము అధికంగా స్పష్టమవుతుంది. చక్రస్థానంలో దానితో సమ్మిళితమైన మాత్రుకలలో, జ్ఞానేంద్రియములలో, కర్మేంద్రియములలో అకస్మాత్తుగా కంపనము, రోమాంచనము, ప్రస్ఫురణము, ఉత్తేజము, వేడి, దురదలాంటివి కలుగుతాయి. దీనివలన చక్రముల జాగరణ జరుగుతున్నదని సూచన. ఒక మాసముగాని లేక కొంచెము హెచ్చుతగ్గులుగాని, యీ రకమైన చిహ్నములు పొడసూపిన యెడల, ధ్యానంలో చక్రరూపము స్పష్టంగా గోచరించినట్లయితే, ముందుకుసాగి క్రిందనున్న చక్రమునందు ప్రవేశింపవలెను. చేయవలసిన విధి యిది. అనుసరించవలసిన మార్గ మిది.

గాయత్రీజ్యోతిలో మనస్సును తపింపజేసి బ్రహ్మనాడిలో ప్రవేశింపజేయవలెను. అచటే ప్రథమచక్రమును తెలుసుకోవలెను. దానిని దాటి రెండవచక్రమును చేరవలెను. ఈవిధంగా ప్రతిచక్రమునందు మాసము దినములు సమయమౌతుంది. సాధన పరిపక్వత చెందినపుడు ఒక చక్రమునుండి రెండవ చక్రమునకు వెళ్ళుదారి తెరుచుకుంటుంది. సాధనలో పరిపూర్ణత లేనంతవఱకు ద్వారము మూసికొని వుంటుంది. సాధకుని మనస్సు ముందుకుపోవటానికి యిచ్ఛగించినా ద్వారము దొరకదు. సాధకుడు అదే చక్రపు తంతుజాలములో దారిగానక తిరుగుతూ, పరిభ్రమిస్తూ వుంటాడు.

సాధన చాలాకాలంవఱకు పరిపక్వము కానపుడు, ముందునకు దారిసాగనపుడు అనుభవజ్ఞుడైన గురువు సహాయం అవసరమవుతుంది. గురువు చెప్పిన ఉపాయమును, తు.చ. తప్పక పాటించవలెను. ఈవిధంగా క్రమక్రమంగా ఆఱు చక్రములను దాటగలరు. దాని మూలాధారమునందున్న కుండలినీ వఱకు చేరి అచట యీ జ్వాలాముఖీకరాళ, కాల స్వరూపమైన మహాశక్తి సర్పిణియొక్క భయంకర స్వరూపాన్ని దర్శిస్తారు.

మహాకాళీయొక్క ప్రచండ స్వరూపమిక్కడనే ద్యోతకమౌతుంది. అనేకమంది సాధకు లీ నిద్రించే సింహాన్ని మేల్కొల్పుటకు సాహసిస్తూనే కంపిస్తారు. కుండలినీ జాగరణలో సాధకుడు దానిని పీడించవలెను. దానిని చీల్చవలెను. పరమాణువునేవిధంగా విస్ఫోటనము గావించుటకు విచ్ఛేదనము చేయవలెనో అదేవిధంగా కుండలినీశక్తిని గతిశీలిగా చేయుటకు ఆఘాతమొనరించవలెను. దీనిని ఆధ్యాత్మిక భాషలో కుండలినీపీడనము అనియెదరు. పీడింపబడిన స్తబ్ధకుండలినీ బుసకొడుతూ మేల్కొంటుంది. దాని ప్రథమ ఆక్రమణ మనస్సుపై నున్న జన్మజన్మాంతర సంస్కారములపై నుంటుంది. కుండలినీ సంస్కారములను అంతరింపజేస్తుంది. ఛాతిపైన తన శస్త్రములతో సహా బిఠాయిస్తుంది. అచటనున్న మాయాపరాయణతను నాశనము గావించి, బ్రహ్మభావమును పరిణతగావిస్తుంది.

ఈ కుండలినీ జాగరణ దాని మేల్కొలుపు, ప్రభావశక్తి పురాణములలో మహా ఆలంకారికంగా, హృదయగ్రాహ్యంగా వర్ణింపబడినది. మహిషాసుర, దుర్గాదేవి యుద్ధము యీ ఆధ్యాత్మిక రహస్యమునకు ప్రతీకయే. తన ముక్తిగోరుతూ, దేవి హస్తములచే మరణింప నభిలషించి, ఉత్సాహియై మహిషాసురుడు (మహిః=పృథ్వీ మొదలైన పంచభూతములతో తయారైన మనస్సు) చండి(కుండలిని)తో యుద్ధము చేయబూనుతాడు. నిశ్శబ్దంగా, మౌనంగా నున్నదానిపై దాడిచేస్తాడు. దేవి క్రోధంతో ఆతనితో యుద్ధము చేస్తుంది. ఎదురుదాడి మహిషాసురునిపై సలుపుతుంది. ఆతని వాహనమైన మహిషమును, సంస్కారముల సమూహమును నాశనం గావిస్తుంది. మనస్సుయొక్క భౌతికాచరణమును, మహిషాసుర శరీరమును పదిభుజములతో పది దిక్కులనుండి అన్నివైపులనుండి చీల్చివేస్తుంది. చివఱలో మహిషాసురుడు చండీజ్యోతిలో లీనమైపోతాడు.

భక్తిమయ సాధన కా రౌద్రరూపము బహువిచిత్రముగా నుంటుంది. దీనినే సాధనాసమరముగా వచిస్తారు. అనేకమంది భక్తులు, ప్రేమతోను, భక్తితోను బ్రహ్మను పొందుతారు. అటులనే అనేకమంది భక్తులు సాధనాసమరములో బ్రహ్మతో యుద్ధముజేసి బ్రహ్మను పొందుతారు.

భగవంతుని ఆకలి, నిష్ఠ, ఆయన నిజమైన ప్రేమతోగూడా లభించగలదు. నిజమైన శత్రువుగూడా భక్తులైన యోగులుకూడ భగవంతుని చేరగలరు. సాధనాసమరములో రెండు రెండు చేతులు చూపే హఠయోగీ తంత్రమార్గీయులుగూడా బ్రహ్మను పొందవచ్చు. కుండలినీ జాగరణ యొక హఠతంత్రము. దీనివలన ఆత్మ తుచ్ఛస్థానము నుండి మహోన్నతస్థానమునకు, అణుస్థితినుండి విభునిస్థితిని పొంది ఈశ్వరీయ శక్తులచే సంపన్నమవుతుంది.

షట్చక్రసాధన చేయునపుడు ప్రతిదినము బ్రహ్మనాడిలో ప్రవేశించి చక్రములను ధ్యానిస్తాము. ఈ ధ్యానము ఐదు నిముషములుగా ప్రారంభించి 30 నిముషములవఱకు చేయవచ్చు. ఒకేసారి దీనిని అధికంగా చేయుట హానికరము. ఏలనన అధిక ధ్యానముచే కలిగే అధిక వేడిని భరించుట కష్టము. ధ్యాన సమాప్తము చేయు సమయములో అదే మార్గములో తిరిగి వెనక్కొచ్చి త్రికుటిలో లగ్నము చేయవలెను. అపుడు ధ్యానమును ముగించవలెను.

సాధానకాలములో బ్రహ్మచర్యములో నుండవలెనని వేఱే చెప్పనవసరములేదు. భోజన మొక్కసారిమాత్రమే. సాత్త్విక స్వాదు పదార్థమును భుజించవలెను. ఏకాంతసేవ, స్వస్థవాతావరణములో, దినచర్యను సరిగా నుంచుకొనుట అనివార్యము. ఏలనన యిది సాధనలో ప్రారంభ నియమముగా గుర్తించబడినది. షట్చక్రదర్శనము, కుండలినీ జాగరణము, బ్రహ్మరంధ్రములో నున్న ఈశ్వరీయ దివ్యశక్తి దర్శనము చేయిస్తాయి. అనేక గుప్తసిద్ధులు లభిస్తాయి.

ఈ దివ్య ప్రసాదాన్ని యితరులకుగూడా పంచివ్వండి

పుణ్యకార్యములతోపాటు ప్రసాదమును పంచిపెట్టడము సాధారణంగా అవసరమైన కార్యముగా పరిగణించడము పరిపాటి. సత్యనారాయణస్వామి కథాశ్రవణానంతరము పంచామృతము, గోధుమప్రసాదము పంచుతాము. యజ్ఞానంతరము హల్వాగాని, యితర మృష్టాన్నంగాని పంచబడుతుంది. గీతాపారాయణము మంగళకార్యము, పూజ, కీర్తనము తరువాత ప్రసాద మీయబడుతుంది. దేవతలు, పెద్దల ఆశీర్వాదముకోసము, వారిని ప్రసన్నులను గావించుకొనుటకొఱకు చిన్నచిన్న జీడీలుగాని, యితరములుగాని ప్రసాదంగా వుంటాయి. దేవాలయాలలో యెక్కువ గుంపు వుంటుంది. అచట ప్రసాదమునకు అధికంగా ఖర్చవుతుంది. కాబట్టి నీటిలో తులసీపత్రములు వేసి, చరణామృతాన్ని ప్రసాదరూపంగా తీర్థమిస్తారు. శుభకార్యముల తరువాత యెదైనా ప్రసాదము పంచవలెనని, అవసరమని దీని తాత్పర్యము.

దీనికి కారణము శుభకార్యముతోపాటు శుభకర వాతావరణముంటుంది. దానిని ఖాద్యపదార్థములతోపాటు సమన్వయంచేసి ఉపస్థితవ్యక్తులకు యిచ్చిన యెడల వారుకూడ ఆ శుభతత్త్వములను గ్రహించి ఆత్మశాంతిని పొందుతారు. రెండవ విషయ మేమనగా ఆ ప్రసాదంతోపాటు దివ్యతత్త్వములపై శ్రద్ధ యేర్పడి, దివ్యధారణ కలుగుతుంది. మధుర పదార్థములను స్వీకరించే సమయములో ప్రసన్నతావిర్భావము జరుగుతుంది. ఈ రెండు తత్త్వములను అభివృద్ధి చెందినందున ప్రసాదమును స్వీకరించువారు, ఆధ్యాత్మికతవైపు ఆకర్షితులౌతారు. ఈ ఆకర్షణ చివఱకు వారికి కళ్యాణప్రదమై, సర్వతోముఖీసిద్ధి ప్రసాదిస్తుంది.

ఈ పరంపర ఒకరినుండి మఱొకరికి, వారినుండి మూడవవారికి, అదేవిధంగా క్రమంగా ధర్మవృద్ధి జరుగుతుంది. దీని ప్రయోజనమును లక్షించియే, ఆధ్యాత్మవిద్యాచార్యులు, శుభకార్యపరిసమాప్తి తరువాత ప్రసాదమును పంచవలెనని ఆదేశించారు. చివఱ ప్రసాదము పంచని శుభకార్యములు నిష్ఫలమవుతాయని శాస్త్రకారులు ఘోషిస్తున్నారు. ఇతఱులు దీనిని జాగరూకతతో పాటిస్తారని, ప్రసాదమహత్వ మిది యని తాత్పర్యము.

గాయత్రీ సాధన గూడా యజ్ఞమే. ఇది సాధారణము. అగ్నిలో సామాగ్రిని ఆహుతులుగా వ్రేల్చడము స్థూలకర్మకాండ. కానీ ఆత్మలో పరమాత్మను స్థాపించుకొనడము సూక్ష్మయజ్ఞము. ఈ సూక్ష్మయజ్ఞము స్థూల అగ్నిహోత్రముకన్నా అనేకరెట్లు అధికము. ఈ మహాధర్మకృత్యముతోపాటు ప్రసాదము పంచుటగూడా సరితూగునట్లుండవలెను. చిన్న జీడీలు, పంచదార బిళ్ళలు, లడ్లు, హల్వాపూరీ పంచినంతమాత్రాన యీ కార్యము పూర్తిగాదు. గాయత్రీ ప్రసాద మెలా వుండాలి? దానిని గ్రహించినవారు స్వర్గరుచి ననుభవించవలెను. దానిని భుజించువారు ఆత్మతృప్తి నొందవలెను. గాయత్రీ బ్రాహ్మీశక్తి. ఆ దేవి ప్రసాదము గూడా బ్రాహ్మీ ప్రసాదము గావలెను. అపుడే ఆ కార్యము ఉపర్యుక్తవిధంగా గౌరవము పొందుతుంది.

ఈవిధమైన ప్రసాదము-బ్రహ్మదానము, బ్రాహ్మీస్థితిని పొందుటకవసరమైన ప్రయత్నము చేయడానికి ఆకర్షింపబడటము ప్రోత్సహింపబడటము.

బ్రహ్మప్రసాదము స్వీకరించదలచిన వ్యక్తి ఆత్మకళ్యాణమువైపు ప్రేరేపించబడి ఆకర్షితుడవ్వాలి. ఆవైపు పయనించడానికి తగిన ప్రోత్సాహమిచ్చుటయే ప్రసాదము.

భౌతిక, ఆత్మిక ఆనందమున కన్నింటికీ మూలస్థానము మానవ ప్రాణుల అంతఃకరణములో దాగి వున్నదనేది తెలిసిన విషయం. సంపద ప్రపంచమునకు వెలుపల లేదు. వెలుపల ఱాళ్ళు, లోహముల ఛిద్రములు, నిర్జీవ పదార్థములు నిండుగా వున్నాయి. సంపదల సమస్తకోశాగారములు ఆత్మకు సన్నిహితంగా వున్నాయి. వాటి దర్శనమాత్రం చేతనే మానవునకు తృప్తి లభిస్తుంది. వాటిని వుపయోగించినపుడు ఆనందమునకు అవధులు లేవు. ఆ ఆనంద భాండారములను తెరుచుటకు తాళపుచెవి ఆధ్యాత్మిక సాధనలలో నున్నది. ఆ ఆధ్యాత్మిక సాధనలలో గాయత్రీ సాధన సర్వశ్రేష్ఠము. ఈ శ్రేష్టత అతులనీయము, అసాధారణము. దాని సిద్ధులకు, విచిత్రములకు సరిహద్దు లేదు. అటువంటి శ్రేష్ఠసాధనామార్గము వైపు ఆకర్షింపబడునట్లు చేయుట, ప్రోత్సహించుట, సంబంధము కలిగించుట జరిగినట్లయితే దానిని పొందిన వ్యక్తికి అంతకన్నా వుపకారము లేదు.

ఆ వ్యక్తి అంతరంగంలో సాత్త్వికతత్త్వము లభివృద్ధి జరుగుతున్నకొలది ఆతని ఆలోచనలు, చేయు పనులు పుణ్యమయములవుతాయి. ఆతని ప్రభావము యితఋలపై ప్రసరించినకొలది వారుగూడా సన్మార్గము నవలంబిస్తారు. ఈ శృంఖలములు బలమైనకొలది సంసారములో సుఖశాంతులు, పుణ్యము పెరుగుట, అటుల యెవరినైనా ఆత్మమార్గము వైపు పయనించునట్లు ప్రోత్సహించినవ్యక్తికిగూడా ఆ కర్మఫలపుణ్య భాగము లభిస్తుంది.

గాయత్రీ సాధన చేసే ప్రతివ్యక్తి గూడా యీవిధంగా ప్రతిజ్ఞ చేయవలెను. 'నేను భగవతి గాయత్రీని ప్రసన్నము చేసుకొనుటకును, ఆ దేవి మహాప్రసాదమును, బ్రహ్మప్రసాదమును అవశ్యము యితఋలకు పంచుతాను'. ఈ ప్రసాద మీవిధంగా వుండవలెను.

మొదట కొన్ని శుభసంస్కారముల బీజము లుండునట్లు చూడవలెను. తరువాత వారిలో క్రమక్రమంగా గాయత్రీ దేవి మాహాత్మ్యమును, రహస్యలాభములు తెలియునట్లు చేస్తూవుండవలెను. ఆధ్యాత్మిక వున్నతిని తెలుసుకొనలేనివారికి, గాయత్రీసాధన వల్ల కలిగే భౌతిక ప్రయోజనాలను సవిస్తారంగా వర్ణించవలెను. అఖండజ్యోతివారిచే ప్రచురింపబడుతున్న గాయత్రీ సాహిత్యాన్ని వారిచే చదివించవలెను. ఈవిధంగా వారి రుచి యీ దిశలో ప్రయాణించునట్లు చేయవలెను. దీనివలన వారు ఆరంభంలో సకామభావనతో నైనాసరే వారు గాయత్రీవేదమాతను ఆశ్రయించునట్లు చేయవలెను. తరువాత స్వయంగా యీ మహాలాభముపై ముగ్ధులైనందున గాయత్రీ వేదమాత సాధనను వదలుట యనే భావన వారిలో రాదు. ఒక్కసారి బండిని రహదారిపై వెళ్లునట్లు చేసినయెడల దానంతటదే సరియైన మార్గంలో పయనిస్తుంది. ఈవిధమైన ప్రసాదము అన్య స్థూల ప్రసాదములకంటే అత్యధిక మహత్వపూర్ణమైనది. రండి. దీనిని ధనముతోనే కాదు, ప్రయ్నతంతో గూడా విస్తరింపజేయుటకు వీలున్న బ్రహ్మప్రసాదమును యితఋలకు పంచి, వేదమాత కృపాపాత్రులు కండి. ఈ లక్ష్యము చేరుటలో భాగస్తులుకండి.

గాయత్రితో యజ్ఞమునకు సంబంధము

యజ్ఞము భారతీయ సంస్కృతికి ఆదిప్రతీక. మన ధర్మములో యజ్ఞమున కిచ్చిన గొప్పతన మే యితఱ కర్మకు నీయబడలేదు. మనయొక్క శుభకర్మగానీ, అశుభకర్మగాని, ధర్మకృత్యముగానీ యజ్ఞము లేనిదే పూర్తిగాదు. జన్మమునుండి, అంత్యమరణమువఱకు 16 సంస్కారము లున్నాయి. వీటిలో అగ్నిహోత్రము అవశ్యము వుండితీరవలెను. బాలుడు జన్మించినపుడు ఆతని రక్షణార్థము పురుడు నివారణ వఱకు అఖండాగ్నిని స్థాపించవలెను. నామకరణం, యజ్ఞోపవీతం, వివాహం మొదలైన సంస్కారములలో హవనము ముఖ్యంగా నుంటుంది. చివర మనము శరీరము వదలునపుడు దానిని అగ్నికే సమర్పించుతారు. ఇపుడు ప్రజలు మృత్యుసమయములో చితినంటించి శవాన్ని భస్మము చేస్తారు. కానీ శాస్త్రములను పరిశీలించినట్లయితే అదిగూడా ఒక సంస్కారమే. ఇందులో వేదమంత్రములతో విధిపూర్వక ఆహుతు లీయబడుతాయి. తరువాత శరీరము యజ్ఞభగవానున కర్పింబడుతుంది.

కథాసమయములో, భజన కాలమందు, వ్రత మొనరించునపుడు, ఉపవాసమునందు, పర్వదినములలో, పండుగ లపుడు, ఉత్సవములు జరిగేటపుడు, ఉద్యాపన తీర్చువేళలందు హవనము చేయుట ఆవశ్యమని భావింపబడినది. ప్రస్తుతం వాటి విధానాన్ని గృహిణులు, ప్రజలు మరచిపోయారు. కేవలము నామమాత్రంగా పని జరిపిస్తున్నారు. గృహిణిలు ఇంటిలో యేదోరూపంలో పూజ చేస్తున్నారు. వారు పండుగదినములలో అగ్నిని ప్రజ్వరిల్లింపజేయడము, అగ్నిని ముట్టించడం యేదో ఓ రూపంలో చేస్తూనే వున్నారు. కొంచెము అగ్నికణికలను తీసుకొని దానిపై నేతిని వేయడము, తద్వారా అగ్నిని ప్రజ్వరిల్లజేయడము, దానిపైన పిండిపదార్థమో, మధురాహారమో కొద్దికొద్దిగా వేసి మఱలా అగ్నితో చుట్టూ చల్లుట వంటి విధానమును గృహములలో ప్రత్యేకంగా పండుగదినములలో చేయడము చూడవచ్చు. పితృకార్యము జరుగు దినమున బ్రాహ్మణ భోజనానికి పూర్వము యీవిధంగా అగ్నికి భోజనము సమర్పించుట తప్పక పరిపాటి. ఈ కార్యము స్థిరంగా ఆచరించవలసినది. ఏలనన అగ్నిముఖంగా సమర్పించబడిన ఆహుతి దేవతలకు, పితృదేవతలకు తప్పక చేరుతుంది. ప్రీతిపాత్రముకూడ.

విశేషసమయంలో హవన మొనరించవలెగూడా. నిత్యమూ పొయ్యిరాజేయడం, తిరగలితో విసరడం, కసవూడ్చటం లాంటి జీవహింస యితర పాపముల నివారణార్థము నిత్యమూ పంచయజ్ఞము చేయవలసిన విధాన మున్నది. ఆ పంచకమునకు 'బలివైశ్యము' గూడా నున్నది. బలివైశ్యము అగ్నికి ఆహుతులీయడంతో జరుగుతుంది. ఈవిధంగా శాస్త్రాజ్ఞానుసారము నిత్యమూ హవనము చేయడంగూడా మనకు ముఖ్యము. పండులలో ప్రత్యేకించి కొన్ని పండుగలలో హవనము అవశ్యము చేయవలెను. హోలీయజ్ఞపు పండుగ. ప్రస్తుతము ప్రజలు కట్టెటను కాల్చడము, పిడకల దాలి వేయడంతో హోలి చేసుకుంటున్నారు. శాస్త్రములను పరిశీలించితే యీ కార్యములు యజ్ఞములు.

ఈరోజున యజ్ఞము లావశ్యకత ప్రజలు మరిచారు. కేవలము ఇంధనమును మండించి, ప్రాచీనపరంపరను వేళేవిధంగా పూర్తిగావించుతున్నారు. ఈప్రకారంగా శ్రావణి, దసరా, దీపావళి దినములలో యేదోవొక రూపంలో హవనం తప్పకుండా జరుగుతుంది. నవరాత్రిలలో స్త్రీలు దేవీపూజ చేస్తారు. అగ్నిముఖంలో దేవి నిమిత్తము నెయ్యి, లవంగపు మొగ్గలు, జాజికాయలు మొదలైనవి సమర్పిస్తారు. సత్యనారాయణవ్రత కథ, రామాయణ పారాయణము, గీతాపఠనం, భాగవత సప్తాహము లాంటి పవిత్ర కార్యములలో హవనము జరగడము పరిపాటి.

సాధనలలోగూడా హవనము అవశ్యము చేయవలెను. ఎంత పఠించినా, పునశ్చరణ చేసినా, జపము గావించినా, సాధన యొనరించినా అది వేదోక్తముగానీ, తాంత్రికముగానీ, హవన మేదో వొక రూపంలో అవశ్య మాచరించవలెను. గాయత్రీ ఉపాసనలో హవనము జరుగవలెను. అనుష్ఠానము లేక పునశ్చరణములో, జపంలో పదవభాగము హవనము చేయు విధానమై యున్నది. పరిస్థితులనుబట్టి పదవభాగము ఆహుతు లీయలేనపుడు, నూఱవ భాగమైనా సమర్పించవలెను. గాయత్రీదేవిని- మాతగాను, యజ్ఞభగవానుని- పితగాను అంగీకరించడమైనది. వీరిరువురి కలయిక వలన మనుష్యుని ఆధ్యాత్మిక జన్మ సంభవిస్తుంది. దీనినే ద్విజత్వ మంటారు. ద్విజ శబ్దమున కర్థము రెండవ జన్మ యని. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు -ద్విజులు. మనకు శరీరా న్నిచ్చినందులకు మాత పిత లెటుల పూజనీయులో నిత్యపూజార్హులో; అదేవిధంగా గాయత్రీమాత, యజ్ఞపితల పూజ చేయడము నిత్యము ప్రతివొక్క ద్విజునకు ముఖ్యము, అవశ్యము, ధర్మము, కర్తవ్యము.

ధర్మగ్రంథములలో పుటపుటలో యజ్ఞమహిమను గానము చేశారు. వేదములో యజ్ఞవిషయము ప్రధానము. ఏలననగా యజ్ఞ మెలాంటి విజ్ఞానమయ విధాన మనగా దానివలన మనుష్యునకు భౌతిక, ఆధ్యాత్మిక దృష్టినుండి గమనించిన సకల కళ్యాణకారకం, ఉత్కర్షాపూరకము. భగవానుడు యజ్ఞంవలన ప్రసన్నుడౌతాడు. ఇటుల చెప్పబడినది-

యో యజ్ఞైః యజ్ఞపరమైరిజ్యతే యత్రసంజ్ఞితః।

తం యజ్ఞపురుషం విష్ణుం నమామి ప్రభుమీశ్వరమ్ ॥

అర్థము ః ఏది యజ్ఞము చే పూజింపబడుతున్నదో, యజ్ఞమయుమో, యజ్ఞరూపమో ఆ యజ్ఞరూప విష్ణుభగవానునకు నమస్కరించుచున్నాను.

యజ్ఞం మానవునకు అనేక కోరికలను పరిపూర్ణంగా తీర్చునట్టిది. స్వర్గప్రాప్తిని కలిగించునట్టిది. ముక్తిదాయని. ఆ యజ్ఞములను నిర్వహించనివారిని, వదలినవారిని శాస్త్రములు చాలా నిందించినవి.

కస్త్వా విముఞ్చతి స త్వా విముఞ్చతి కస్మై త్వా విముఞ్చతి।

తస్మై త్వా విముఞ్చతి పోషాయ రక్షసాం భర్గోసి ॥ యజుర్వేదము

అర్థము ః సుఖశాంతులను కోరు యే వ్యక్తి యైనా యజ్ఞమును పరిత్యజించడు. యజ్ఞమును వదలినవారిని, యజ్ఞరూపభగవానుడు కూడా వదులుతాడు. సర్వుల ఉన్నతి కోసము ఆహుతులను యజ్ఞములో సమర్పించుతారు. అటుల వదలనివారు రాక్షసులవుతారు.

యజ్ఞేన పాపైః బహుభిర్విముక్తః ప్రాప్నోతి లోకాన్ పరమస్య విష్ణోః ॥ హారీతము

అర్థము : యజ్ఞమువలన అనేక పాపముల నుండి విముక్తి లభిస్తుంది. ఆవిధంగా పరలోకము ప్రాప్తిస్తుంది.

పుత్రార్థీ లభతే పుత్రాన్ ధనార్థీ లభతే ధనమ్ ।

భార్యార్థీ శోభనాం భార్యా కుమారీ చ శుభమ్ పతిమ్ ।

భ్రష్టరాజ్యస్తథా రాజ్యం శ్రీకామః శ్రియమాప్నుయాత్ ।

యం యం ప్రార్థయతే కామః స వై భవతి పుష్కలః ॥

నిష్కామః కురుతే యస్తు స పరం బ్రహ్మ గచ్ఛతి ॥ మత్స్యపురాణము

అర్థము : యజ్ఞమువలన పుత్రార్థికి పుత్రలాభము, ధనార్థికి ధనలాభము, వివాహార్థికి సౌందర్యవతియైన భార్య, కుమారికి సుందరుడైన పతి, శ్రీకామన గలవానికి ఐశ్వర్యము ప్రాప్తించును. నిష్కామభావనచే యజ్ఞానుష్ఠాన మొనరించినందున పరమాత్మయే లభించును.

న తస్య గ్రహపీడా స్యాన్నచ బన్ధు-ధనక్షయః ।

గ్రహ యజ్ఞ వ్రతం గేహే లిఖితం యత్ర తిష్ఠతి ।

న తత్ర పీడా పాపానాం న రోగో న చ బన్ధనమ్ ।

అశేష-యజ్ఞ-ఫలదమశేషాఘౌఘనాశనమ్ ॥ కోటిహోమ పద్ధతి

అర్థము : యజ్ఞము చేయువారికి గ్రహపీడ లుండవు. బంధునాశనము, ధనక్షయము, పాపములు, రోగములు, బంధనములు మొదలైన కష్టములు వుండవు. యజ్ఞఫల మనంతము.

దేవాః సన్తోషితా యజ్ఞైర్లోకాన్ సమ్వర్ధయన్త్యుత ।

ఉభయోర్లోకయో దేవ భూతిర్యజ్ఞః ప్రదృశ్యతే ।

తస్మాద్యద్ దేవత్వం యాత పూర్వజైః సహ మోదతే ।

నాస్తి యజ్ఞ-సమం దానం నాస్తి యజ్ఞ-సమో విధిః ।

సర్వ ధర్మ సముద్దేశ్యో దేవ యజ్ఞే సమాహితః ॥ మహాభారతము

అర్థము : యజ్ఞముల వలన సంతుష్టి చెందిన దేవతలు ప్రపంచమునకు కల్యాణమును చేకూరుస్తారు. యజ్ఞముద్వారా లోక, పరలోక సుఖము ప్రాప్తిస్తుంది. యజ్ఞమువలన స్వర్గప్రాప్తి కలుగుతుంది. యజ్ఞమునకు సమానమైన దానము లేదు. యజ్ఞమునకు సమానమైన విధివిధాన మేదీ లేదు. యజ్ఞమునందే సర్వధర్మోద్దేశ్యములు నిండియున్నవి.

అసురాశ్చ సురాశ్చైవ పుణ్యహేతోర్మఖ-క్రియామ్ ।

ప్రయతన్తే మహాత్మానస్తస్మాద్యజ్ఞాః పరాయణాః ।

యజ్ఞైరేవ మహాత్మానో బభూవురాధికాః సురాః ॥ మహాభారతము

అర్థము : అసురులూ, సురులూ అందరూ పుణ్యహేతువైన యజ్ఞము చేస్తారు. సత్పురుషు లెప్పుడు యజ్ఞపరాయణులై వుండాలి. యజ్ఞము వలననే యెక్కువమంది సత్పురుషులు దేవతలైనారు.

యదిక్షితాయుర్యది వా పరేతో యది మృత్యోరన్తికం నీతి ఏవ ।

తమాహరామి నృరృతే రూపస్థాథతస్పార్శమేనం శత-శారదయా ॥ అథర్వణవేదము

అర్థము : రోగి నత జీవనశక్తిని పోగొట్టుకొనినయెడల నిరాశాజనక పరిస్థితిలో నున్నపుడు, మరణకాల మాసన్నమైనపుడుగూడా యజ్ఞము మృత్యుపాదములను నుండి తప్పించగలదు. మఱిల నూఱుసంవత్సరములకు కావలసిన బలవంతుని చేయగలదు.

యజ్ఞైరాప్యాయితా దేవా వృష్ట్యుత్సర్గేణ వై ప్రజాః ।

ఆప్యాయన్తే తు ధర్మజ్ఞ యజ్ఞాః కల్యాణ-హేతవః ॥

అర్థము : యజ్ఞంవలన దేవతలకు బలము లభిస్తుంది. యజ్ఞంవలన వర్షము కుఱుస్తుంది. వర్షంనుండి అన్నము మఱియు ప్రజాపాలన జరుగుతుంది. హే ధర్మజ్ఞ! యజ్ఞమే కళ్యాణహేతువై వున్నది.

ప్రయుక్తయా యయా చేష్టయా రాజయక్ష్మా పురా జితః ।

తాం వేదవిహితామిస్టిమారోగ్యార్థీ ప్రయోజయేత్ ॥ చరకుడు

అర్థము : వేడితో నున్న రోగములను ప్రాచీనకాలంలో యజ్ఞప్రయోగముచే తగ్గించేవారు. రోగ-ముక్తి అనే కోరిక వుంచుకున్నవారికి కావలసినది ఆ వేదవిహిత యజ్ఞమును ఆశ్రయించుట.

అహం కృతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।

మన్త్రోఽహమహమేవాజ్యమహమగ్నిరహం హుతమ్ ॥ గీత

అర్థము : నేనే క్రతువును, నేనే యజ్ఞమును, నేనే కర్తను, నేను ఔషధిని, నేనే మంత్రమును, ఘృతమును, అగ్నిని, నేను హవనమును.

నాయం లోకోఽస్త్యయజ్ఞస్య కుతోఽన్యః కురుసత్తమ ॥ గీత

అర్థము : ఓ అర్జునా! యజ్ఞరహిత మనుష్యునకు యీ లోకంలో సుఖము లేదు. ఇక పరలోకమందు సుఖ మెట్లుండును?

నాస్తి అయజ్ఞస్య లోకో వై నాయజ్ఞో విన్దతె శుభమ్ ।

అయజ్ఞో న చ పూతాత్మా నశ్యతిచ్ఛిన్నపర్ణవత్ ॥ శంఖస్మృతి

అర్థము : యజ్ఞము నాచరించని మనుష్యులు లౌకిక మఱియు పారలౌకిక సుఖములనుండి వంచితులౌతారు. యజ్ఞం చేయనివాని ఆత్మ పవిత్రము కాదు మఱియు చెట్టునుండి రాలిన ఆకు వలె నష్టపోతాడు.

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।

అనేన ప్రసవిష్యధ్వం ఏష వో ఽ స్త్విష్టకామధుక్ ॥

దేవాన్ భావయతానేన తే దేవా భావయన్తు వః ।

పరస్పరం భావయన్తః శ్రేయః పరమవాప్స్యథ ॥

అర్థము : బ్రహ్మ ఆదియందు ప్రజలను సృష్టించినపుడే యజ్ఞమును కూడా సృష్టించి వారితో నిట్లనియె. ' ఈ యజ్ఞమే కామధేనువు వలె మీ సమస్త వాంఛితములను పూర్ణమొనర్చుగాక! దీని నాశ్రయించి మీరు పురోభివృద్ధినొందుదురుగాక!

యజ్ఞక్రియచే దేవతలను పరితుష్టుల నొనర్పుడు. వారు మిమ్ములను తృప్తినొందింతురు. ఇట్లు పరస్పరము సంభావించుకొనుచు పరమశ్రేయమును బొందుడు.

అనేక శాస్త్రములనుండి పైన కొన్ని ఉదాహరణ లియ్యబడ్డాయి. దీనివలన యజ్ఞమాహాత్మ్యమును గూర్చిన సందేహాలు సహజమని తోస్తాయి. పూర్వకాలంలో ఆధ్యాత్మిక, భౌతిక వుద్దేశ్యములు నెరవేర్చుటకు గొప్పగొప్ప యజ్ఞములు చేయడం కద్దు. దేవతలు గూడా యజ్ఞము చేసేవారు. అసురులు యజ్ఞము చేసేవారు. ఋషులద్వారా యజ్ఞము నిర్వర్తించబడేది. రాజులు అశ్వమేధము మొదలైన విశాల యజ్ఞములు చేయటానికి ప్రయత్నించేవారు. సాధారణ గృహస్థులు తమతమ శక్త్యానుసారంగా యజ్ఞములను గావించేవారు. తరచుగా కాలానుగుణ్యంగా శత్రువుల ప్రయోజనాలను, లాభాలను విధ్వంసము చేయటానికిగాను, అసురులు యజ్ఞములను విధ్వంసము చేసేవారు. కావున యజ్ఞములను చేయనీయకుండా నాశనము చేసేవారు. రామాయణంలో రాక్షసులు చేసే యజ్ఞము వర్ణింపబడినది. దానిని హనుమంతుడు నాశనము చేయడం గూడా వున్నది. ఏలనన యజ్ఞము పూర్తిగావించబడినయెడల రాక్షసులు అజేయులౌతారు.

దశరథమహారాజు యజ్ఞము చేసి నలుగురు పుత్రులను పొందాడు. రాజా 'నృగ' యజ్ఞములను చేయడంద్వారా ఇంద్రాసనమున కధికారి కాగలిగాడు. అశ్వపతిరాజు యజ్ఞము గావించడం ద్వారా సంతానప్రాప్తికి సుయోగ్యుడైనాడు. ఇంద్రుడు స్వయంగా ఇంద్రపదవిని పొందడం యజ్ఞముల నొనరించినందుననే. భగవాన్ శ్రీరామచంద్రమూర్తి తాను స్వయంగా అశ్వమేధయాగము చేశాడు. శ్రీకృష్ణభగవానుని ప్రేరణచే పాండవులు రాజసూయయాగము నిర్వర్తించారు. ఈ యజ్ఞంలో ఆగంతకులను అనగా వచ్చినవారి స్వాగతసత్కారకార్యక్రమభారమును స్వయంగా శ్రీకృష్ణపరమాత్మ వహించాడు.

పాపములకు ప్రాయశ్చిత్త స్వరూపము, అరిష్టములు తొలగుటకు, ప్రారబ్ధజన్మదౌర్భాగ్యము శాంతించుటకు, లోటును భర్తీగావించే నిమిత్తము, సౌభాగ్యప్రాప్తి కొఱకు, రోగనివారణార్థము దేవతలను ప్రసన్నులను గావించుకొనుటకు, ధనధాన్యము లధికంగా పొందుటకు కావలసిన అమృతమయ వర్షము కుఱియడానికి, వాయుమండలములోని కలుషితతత్త్వములను తొలగించడానికి హవనయజ్ఞము చేయబడేది. దాని పరిణామము గూడా అటులనే జరిగేది.

యజ్ఞమొక మహత్తరమైన విజ్ఞానము. యజ్ఞము లాచరించుటకు వుపయోగింపబడిన సమిధలు కొన్ని వృక్షముల నుండి సమకూర్చుకొంటారు. ఈ సమిధవృక్షములు గొప్ప గుణం కలవి. ఏయే ప్రయోగముల కెలాంటి ద్రవ్యవస్తువులు హోమమున కర్పించవలెనో, దానికి గూడా ప్రత్యేక విజ్ఞానమున్నది. ఆ వస్తువుల కలయికవలన విశేషమైన సమ్మిశ్రణము తయారౌతుంది. దానిని జ్వలింపజేసినపుడు వాయుమండలంలో నొక విశిష్ఠ ప్రవాహ ముద్భవిస్తుంది. వేదమంత్రోచ్చారణ శక్తివలన ఆ ప్రభావములో యింకా అభివృద్ధి జరుగుతుంది. ఫలస్వరూపంగా ఆ మహాకార్యములో పాలుపంచుకొని విలీనమైన వ్యక్తిపైన, సన్నిహితంగా వున్న వాయుమండలముపై అధిక ప్రభావముంటుంది. సూక్ష్మప్రకృతి అంతరాళము నందున్న నానావిధములైన దివ్యశక్తులు పనిచేస్తాయి. వాటిని దేవతాశక్తులు అంటారు. ఈ దేవతలను అనుకూలంగా జేసుకొనుట, వాటిని వుపయోగించుకొనుట వీలైన దిశలో నుంచుకొనుటకు, వాటితో సంబంధ మేర్పరచుకొనుటనే దేవతా ప్రసన్న మంటారు.

ప్రపంచంలో నున్న యే వస్తువూ నశించదు. కేవలం రూపాంతరము చెందుతుంది. హవనములో సమర్పింపబడిన వస్తువు, వేదమంత్రముల శక్తితోపాటు, యజ్ఞం ద్వారా ఉత్పన్నమైన సద్భావనలు, రెండూ కలసి ఆకాశములో వ్యాపిస్తాయి. దాని ఫలితంగా సమస్త ప్రపంచానికి యనేకవిధములైన కళ్యాణకారక పరిణామములు సంభవిస్తాయి. ఈవిధంగా ప్రపంచానికి సేవ చేసినందువలన విశ్వమంతటా సుఖశాంతులు విరజిల్లుతాయి. ఇది యొక ఉత్తమమైన మాధ్యమచర్య, పుణ్యపరమార్థము. యజ్ఞం వలన యాజ్ఞికునకు ఆత్మశుద్ధి కలుగుతుంది. ఆతని పాపతాపములు నశిస్తాయి. అవిధంగానే శాంతి, సద్గతులు ఉపలబ్ధమౌతాయి. నిజమైన నిర్మల హృదయంతో యజ్ఞ మాచరించువారికి ఇహలోక, పరలోక సుఖములు కలుగుతాయి. ఆతని పుణ్యము విస్తారమైనపుడు ఆతనికి స్వర్గముగాని, ముక్తిగాని ప్రాప్తిస్తుంది. రెండవ జన్మ యొకవేళ సంభవిస్తే సుఖియై, శ్రీమంతుడై, సాధనాసంపన్నమైన ఉన్నతకుటుంబంలో జన్మిస్తాడు. దాని సౌకర్యముతో పాటు సత్కర్మానుష్ఠానము గావిస్తూ జీవితలక్ష్యమును విజయవంతంగా పూర్తిచేస్తాడు.

యజ్ఞమున కర్థము దానం, ఏకత్వం, ఉపాసన. యజ్ఞము వేదోక్తమైన, శక్తివంతమైన మంత్రములను విధిప్రకారము ఉచ్చరిస్తుంది. విధిప్రకారము తయారుచేయబడిన కుండములు, శాస్త్రోక్తసమిధలు, నిర్దేశించబడిన సామాగ్రిని సేకరించి, సమీకరించి సరియైనవిధంగా విధిపూర్వకంగా హవన మొనర్చవలెను. యజ్ఞపు దివ్యప్రభావము ఆకాశమండలములో సర్వత్రా వ్యాపిస్తుంది. తత్ఫలితంగా, దాని ప్రభావంవలన ప్రజలు అంతఃకరణములో ప్రేమ, ఐక్యత, సహానుభూతి, సద్భావము, ఉదారత్వము, నీతి, నిజాయితీ, సంయమనము, సదాచారము, ఆక్తికత్వము మొదలైన సద్భావములు, సద్విచారములు స్వయంగా ఆవిర్భవించడము జరుగుతుంది. పత్రాచ్ఛాదిత దివ్య ఆధ్యాత్మిక వాతావరణ స్థానంలో సంతానము కలుగుతుంది. ఆ సంతానము ఆరోగ్యవంతమై సద్గుణాభిరతమై, వున్నతభావములచే పరిపూర్ణమై ఒప్పారుతుంది.

పూర్వకాలంలో పుత్రప్రాప్తికొరకు పుత్రకామేష్టి యజ్ఞము చేయించేవారు. ఇది వట్టిమాట కాదు. సంతాన మున్నప్పటికి, వారుగూడా సద్గుణవంతుడు, ప్రతిభావంతుడైన పుత్రునికొరకు పుత్రేష్టి యజ్ఞాన్ని చేయించేవారు. గర్భాదానము, సీమంతము, పుంసవనము, జాతకర్మ, నామకరణము మొదలైన సంస్కారములు బాలుడు జన్మిస్తూనే నియమవిరుద్ధస్థితిలో గూడా చేస్తారు. ఇందులో ప్రత్యేకంగా హవన ముంటుంది. దీనివలన బాలుని మనస్సుపై దివ్యప్రభావము ప్రసరిస్తుందనీ, ఆతడు పెరిగి పెద్దవాడై పురుషసింహుడై, మహాపురుషుడు కావాలనీ భావన. పూర్వకాలంలో యీ దేశంలో యజ్ఞములు ప్రతిష్ఠాకరంగా భావించిన రోజులలో యజ్ఞములు చేయడము తరచుగా నున్నపుడు, యిచట మహాపురుషులకు కొదువలేదు. ఇది చారిత్రక సత్యము. ఐతిహాసిక సజీవసాక్షి. నేడు యజ్ఞములను తిరస్కరించినందువలన, దుర్గుణములకు, రోగములకు, కుసంస్కారములకు, చెడు అలవాట్లకు లోనైన బాలకులచే మన గృహములు నిండివున్నాయి.

యజ్ఞం వలన అదృశ్య ఆకాశంలో ఆధ్యాత్మిక విద్యుత్తరంగములు వ్యాపించుతాయి. ఆ తరంగాలు ప్రజల మనస్సుల నుండి ద్వేషము, పాపము, అవినీతి, వాసనలు, స్వార్థపరత్వము, కుటిలత్వము మొదలైనవాటిని తొలగిస్తాయి.

తత్ఫలితంగా వాటివలన అనేక సమస్యలు సులభంగా పరిష్కరించబడతాయి. అనేక అవకతవకలు, ఇబ్బందులు,

కలవరములు, చింతలు, భ్రమలు, అనుమానాలు, దుష్టపరిణామాలు సమూలంగా నివృత్తి గావించబడతాయి. రాజు, ధనవంతుడు, సంపన్నుడు, ఋషులు, మునులు పెద్దపెద్ద యజ్ఞములు చేస్తారు. వాటివలన బహుదూరము వరకు వాతావరణము నిర్మలంగా మారుతుంది. దేశవ్యాప్తమైన, విశ్వవ్యాప్తమైన దుష్టత్వము, చెడుచిక్కులు తొలగుతాయి.

పెద్దయెత్తున యజ్ఞము చెయ్యడానికి సామర్థ్య మున్నవారు, తమ తాహతుకు తగ్గవిధంగా ప్రణాళిక నేర్పరచు కొనవలెను. అగ్నిముఖం- యీశ్వరముఖము. ఆ నోటికి తినడానికి సమర్పించితే, అది నిజమైన అర్థంలో బ్రహ్మభోజ్య మౌతుంది. బ్రహ్మకు అర్థము పరమాత్మ. భోజ్యమనగా భోజనము. పరమాత్మకు భోజనము పెట్టడము యజ్ఞముఖంలో ఆహుతులు సమర్పించడమే. భగవంతుడు మనందరకు ఆహార మిచ్చాడు. మనంగూడా మన కుపకారము చేసినవారికి ప్రత్యుపకార పూజ చేయడంలో లోభితనము చూపగూడదు. తన ఆర్థికస్థితి అనువుగా లేనపుడు, అనేకమంది వ్యక్తులు తలాకొంచెము సహకరించి సామూహికంగా యజ్ఞమును నిర్వర్తించడము సబబు. అసాధ్యము గానపుడు యథావిధి చిన్నచిన్న హవనములు చేయవచ్చు లేదా నియమించిన ప్రదేశములలో హవనము జరుగుతున్నపుడు తాను తనంతట కొన్ని ఆహుతులతో హవనము చేయవచ్చు. ఇతరుల హవనము చేసేటపుడు ఆ యజ్ఞానికి సమయాన్నిచ్చి, సహాయము చేయడము, ఆ యజ్ఞము సఫలమయ్యేటట్లు చూడడం చేస్తే గూడా యజ్ఞంలో పాలుపంచుకున్నట్లే అవుతుంది.

మనము నిశ్చయంగా నిజంగా తెలుసుకోవలసిన విషయ మేమనగా యజ్ఞమునకు మనము సమర్పించే కించిత్ ధనముగానీ, శ్రమగానీ, సామాగ్రిగానీ నిరర్థకము గాదు అనే విషయము. ఆ పుణ్యము దేవతల బ్యాంకులో జమ చేయబడుతుంది. అవసరమైనపుడు వడ్డీతోసహా తిరిగొస్తుంది. విధిపూర్వకంగా శాస్త్రీయపద్ధతులతో, విశిష్ట వుపచారాలతో, నియమిత విధానములతో నొనరించబడిన హవనము యింకా యెక్కువ మహత్వపూర్ణమైనది.

అది యొకవిధమైన దివ్యాస్త్రము లాంటిది. దివ్యాస్త్రంగా మారునటువంటిది. పూర్వకాలంలో యజ్ఞ మొనరించుట ద్వారా మనోవాంఛిత వర్షాలు కురిసేవి. యోధులు యుద్ధంలో విజయప్రాప్తిని పొందేవారు. యోగులు ఆత్మసాక్షాత్కారాన్ని పొందేవారు. యజ్ఞమును వేదములలో కామధుక్ అని చెప్పారు. దీని ఆశయ మేమిటంటే యజ్ఞమొనరించిన మనుష్యుడు లోటులేకుండా పుష్కలంగా అన్నీ సమకూరి బాధా విముక్తుడవుతాడని.

నిత్యమూ అగ్నిహోత్రము బహుసరళము. మధ్యతరగతి మనుష్యుడు భరించలేనంత భారము కాదు. ఖర్చు కాదు. నిత్యమూ హవనము చేసేవారు, వారానికొక్కసారియైనా ఆదివారమో, అమావాస్య రోజుననో, పూర్ణిమనాడో లేక మాసమున కొకసారి, పూర్ణిమతిథినాడు చిన్నదిగాని, పెద్దదిగానీ హవనము గావించే ప్రయత్నము చేయవలెను. విధివిధానం గూడా సాధారణ యజ్ఞములకు కఠినం గాదు. గాయత్రీ యజ్ఞవిధాన్ పుస్తకంలో దానికి సరళమైన విధులు చెప్పబడినవి. దాని ఆధారంతో పండితులు, పురోహితులు లేకుండా యే ద్విజుడైనా సులభంగా యజ్ఞము చేయగలుగుతాడు. విధానము అర్థము గానపుడు అచట కేవలము గాయత్రీమంత్రము చివర 'స్వాహా' అనే శబ్దము జోడించి శుద్ధఘృతమును సమర్పించవలెను. ఏవిధంగా నైనా, యే రూపంలో నైనా యజ్ఞపరంపరను కొనసాగిస్తే అది మనము భారతదేశానికి, సంస్కృతికి చేసే గొప్ప సేవ.

సాధారణ హోమంగూడా గొప్ప ఉపయోగకారే. దానివలన ఇంటిలోని వాయువు నిర్మలమై, రోగనివారణకారకమై

అరిష్టములనుండి ఆత్మరక్షణ జరుగుతుంది. విశేష ప్రణాళిక ద్వారా విధివిధానములతో చేయబడిన యజ్ఞము అసాధారణ ఫలము నిస్తుంది. ఇది యొక విద్య. పంచతత్త్వముల వైజ్ఞానిక సమ్మేళనము హోమంలో జరుగుతుంది. దీనివలన నొక ప్రచండమైన అలౌకికశక్తి ఆవిర్భవిస్తుంది. యజ్ఞము యొక్క ఆ ప్రచండశక్తి ద్విమూర్ధములు, ద్వినాసికలు, సప్తజిహ్వాలు, ఉత్తరాభిముఖి, ద్వాదశమూర్ధములు, 52 కళలు, కోటి ముఖములతో వొప్పారునని యనేక విశేషము లీయబడినవి. ఈ రహస్యపూర్వ సంకేతంలో యీవిధమైన అర్థం చెప్పబడినది. యజ్ఞాగ్నియొక్క మూర్ధములు భౌతికము, ఆధ్యాత్మికము రెండూ. అది ఆ క్షేత్రమును సఫలము చేస్తుంది. స్థూల, సూక్ష్మ ప్రకృతులు యజ్ఞంయొక్క నాసికలు. వాటిపై అధికారము పొందవచ్చు. ఏడువిధములైన సాంప్రదాయక యజ్ఞాగ్ని హస్తములు. వామమార్గము, దక్షిణమార్గము రెండు ముఖములు. సప్తలోకములు నాలుకలు. ఈ లోకంలో నున్న విశేషము లన్నీ యజ్ఞాగ్నిముఖంలో నున్నవి. ఉత్తరధృవము చుంబకత్వ కేంద్రమైన అగ్నిముఖము 52 కళలు ముఖ్యమైనవి. వీటిలో కొన్ని ప్రాప్తించినంతటనే రావణు డంత శక్తిశాలి కాగలిగాడు. అన్ని కళలు సంప్రాప్తించితే మానవుడు సాక్షాత్ అగ్నిస్వరూపు డౌతాడు. విశ్వంలోని సకల పదార్థము లాతని కరతలాగతమౌతాయి. యజ్ఞమహిమ అనంతము. దానిని నిర్వహించుట ఫలదాయకము. గాయత్రీ సాధకులకు, వుపాసకులకు యజ్ఞము పిత్రుతుల్య పూజనీయము. యజ్ఞభగవానుని పూజ జరుగుతూ వుండవలెను. ఈ ప్రయత్నము చేయడము అవసరము.

ఓం శాంతిః శాంతిః శాంతిః

సమర్పించినవారు :

శ్రీమతి లక్కరాజు లక్ష్మీగోపాల్

శ్రీమతి కాటూరి తేజశ్రీ

కొప్పాక వేంకటేశ్వరరావు

గాయత్రీ ఆరతి

1. ఓం జయతి జయ గాయత్రీమాత జయతి జయతి గాయత్రీమాత ।
సత్‌మారగ్‌పర్ హమే చలావో జోహైసుఖదాతా ॥ (జయతి॥మాత)
2. ఆదిశక్తి తుమ్ అలఖ్ నిరంజన్ జగపాలనకర్త్రీ, మా జగపాలన కర్త్రీ ।
దుఃఖ శోక భయ క్లేశ కలహ దారిద్ర్య దైన్య హన్త్రీ ॥ (జయతి॥మాత)
3. బ్రహ్మరూపణి ప్రణతపాలిని జగత్‌ధాత్రి అంబే, మా జగత్‌ధాత్రి అంబే ।
భవ భయ హారీ జనహితకారీ సుఖదా జగదంబే ॥ (జయతి॥మాత)
4. భయహారిణి భవతారిణి అనఘే అజఆనందరాశి, మా అజఆనందరాశి ।
అవికారీ అఘహరీ అవిచలిత అమలే అవినాశీ ॥ (జయతి॥మాత)
5. కామధేను సత్‌చిత్‌ఆనంద జయగంగాగీతా, మా జయగంగాగీతా ।
సవితాకీ శాశ్వతీశక్తి తుమ్ సావిత్రీ సీత ॥ (జయతి॥మాత)
5. ఋగ్‌యజుసామఅథర్వ ప్రణయనీ ప్రణవమహామహిమే, మా ప్రణవమహామహిమే ।
కుండలినీ సహస్రార సుషుమ్నా శోభాగుణగరిమే ॥ (జయతి॥మాత)
6. స్వాహా స్వధా శచీ బ్రహ్మాణీ రాధా రుద్రాణి, మా రాధా రుద్రాణి ।
జయసతరూపా వాణీవిద్యా కమలా కళ్యాణీ ॥ (జయతి॥మాత)
7. జననీ హమ్‌హై దీనహీన దుఃఖదారిద్ర్యకే ఘేరే, దుఃఖదారిద్ర్యకే ఘేరే ।
యదపి కుటిల కపటీ కపూత్‌తవు బాలక్‌హై తేరే ॥ (జయతి॥మాత)
8. స్నేహసనీ కరుణామయిమాతా చరణశరణ దీజే, మా చరణ శరణదీజే ।
బిలక్‌రహే హమ్‌శిశుసుత్ తేరే దయాదృష్టికీజై ॥ (జయతి॥మాత)
9. కామ క్రోధ మద లోభ దంబ దుర్భావ ద్వేష హరియే, మా దుర్భావద్వేష హరియే ।
శుద్ధబుద్ధ నిష్పాపహృదయ మనకో పవిత్రకరియే ॥ (జయతి॥మాత)
10. తుమ్‌సమర్థ సబ్‌భ్రాంతితారిణి తుష్టిపుష్టిత్రాతా, మా తుష్టిపుష్టిత్రాతా ।
సత్‌మారగ్‌పర్ హమేచలావో జోహై సుఖదాతా ॥ (జయతి॥మాత)
11. జయతి జయ గాయత్రీమాత జయతి జయతి గాయత్రీమాత ।
సత్‌మారగ్‌పర్ హమే చలావో జోహైసుఖదాతా ॥ (జయతి॥మాత)

ఓం భూర్భువఃస్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్ ॥ (5సార్లు)